# INDIAN GOVERNMENT AND POLITICS
# (DPS04)
# (M.A. POLITICAL SCIENCE)


## ACHARYA NAGARJUNA UNIVERSITY

CENTRE FOR DISTANCE EDUCATION

NAGARJUNA NAGAR,

GUNTUR

ANDHRA PRADESH

## పాఠం - 1

# భారత రాజకీయాలు - సైద్ధాంతిక పునాదులు

**విషయ క్రమం:**


**1.0. లక్ష్యం**

**1.1. ఉపోద్ఘాతం**

**1.2. రజనీ కొఠారి నమూనా**

**1.3. రోడాల్ఫ్, రోడాల్ఫ్ నమూన**

**1.4. అతుల్ కోహ్లి నమూన**

**1.5. సంక్షోభ నమూన**

**1.6. సారాంశం**

**1.7. మాదిరి ప్రశ్నలు**

**1.8. సంప్రదింపు గ్రంథాలు**


## 1.0. లక్ష్యం:

భారతదేశ రాజకీయాలను సమగ్రంగా అధ్యయనం చేసిన రాజనీతి శాస్త్రవేత్తలు ప్రతిపాదించిన సైద్ధాంతిక నమూనాలను వివరించటంఈ పాఠం ప్రధాన లక్ష్యం. ఈ పాఠంలో వివరించిన సైద్ధాంతిక నమూనాలు:

1. రజనీ కొఠారి నమూనా
2. రోడాల్ఫ్, రోడాల్ఫ్ నమూనా
3. అతుల్ కొహ్లి నమూనా
4. సంక్షోభ నమూనా

## 1.1. ఉపోద్ఘాతం:

భారత దేశ రాజకీయాలను అతి సుదీర్ఘ కాలక్రమంలో దేశంలో సంభవించిన అనేక రాజకీయ, రాజకీయేతర సంఘటనలు, అభివృద్ధి చెందిన భావజాలం, వ్యవస్థలు, విధానాలు తీర్చి దిద్దాయి. భారత దేశంలో రాజకీయ, సామాజిక, మత, నైతిక, ఆర్థిక వ్యవస్థలు విడదీయలేని విధంగా ఒకదానిలో ఒకటి గాఢంగా పెనవేసుకున్నాయి. రజనీ కొఠారి పేర్కొన్నట్లు భారత రాజకీయాలను సమగ్రంగా మదింపు చేయటంలో రెండు అంశాలను దృష్టిలో ఉంచుకోవాలి. ఒకటి, ఒక పరిపూర్ణమైన దేశంగా రూపు దిద్దుకునే క్రమంలో భారతదేశానికి ప్రాక్ (orient) పశ్చిమ ప్రపంచాల మధ్య పరస్పర చర్య ఫలితంగా ఉద్భవించిన శక్తివంతమైన మానవతావాద సాంప్రదాయాలు వారసత్వంగా సంక్రమించాయి. ఈ రెండు భిన్న ప్రపంచాల సమ్మేళన ఫలితంగా స్వేచ్ఛ, స్వాతంత్ర్యం, ప్రజాస్వామ్యం, స్వయం నిర్ణయాధికారం, స్వయంపోషకత్వం, సమానత్వం, సామాజిక న్యాయం, పేద ప్రజల సంక్షేమం వంటి మానవతా విలువలు భారతదేశానికి వారసత్వంగా సంక్రమించాయి. ఈ విలువలు గాంధీ ప్రతిపాదించిన స్వరాజ్య భావనలో అంతర్భాగం. రెండు, తనకు వారసత్వంగా సంక్రమించిన విలువల సాధనకు భారతదేశ నాయకత్వం ఒక స్పష్టమైన అభివృద్ధి వ్యూహాన్ని అనుసరించింది. ఈ

అభివృద్ధి నమూనా అనేక నిగూఢమైన పరిణామాలకు దారి తీయడమేగాక, వర్తమాన దేశ రాజకీయ వ్యవస్థలో భిన్నమైన గతితార్కికతను ప్రవేశపెట్టింది. అనేక ఉదాత్త మానవీయ విలువలను, సంస్థలను ఏర్పరచుకోవటం, ఆచరణాత్మక రాజకీయాలను అనుసరించటం ఫలితంగా భారతరాజకీయ వ్యవస్థ తీవ్రమైన భిన్నత్వాలతో, బహుళ స్వభావం కల్గిన అనేక కులాలు, వర్గాలుగా విభజింపబడిన సమాజాన్ని సమర్ధవంతంగా సమైక్య పరచగలిగింది. ఇది భారత ప్రజాస్వామ్యం సాధించిన ఘనవిజయం. దేశంలోని భిన్నత్వాలు, వ్యత్యాసాలు భారత ప్రజాస్వామ్య వ్యవస్థకు బలాన్ని చేకూర్చాయి.

భారత రాజకీయ వ్యవస్థ రెండు భిన్న రాజకీయ, మనస్తత్వ ఒత్తిళ్ళ ఫలితంగా రూపు దిద్దుకొంది. ఒక వైపు ఏకాభిప్రాయం, సహకారం ఆవశ్యకతను నొక్కి చెప్పటం జరిగింది. జాతి నిర్మాణానికి సుధీర్ఘ రాజకీయ అనైక్యత భిన్నత్వాల నేపధ్యంలో సమైక్యత అత్యంత ఆవశ్యకమని బలంగా వాదించబడింది. ఇదే సందర్భంలో మరోపక్క తీవ్ర పోటీ కీలక లక్షణంగా గల రాజకీయ పార్టీ వ్యవస్థ నిరాటంకంగా అభివృద్ధి చెందటం, సామాజిక, పాలనా వ్యవస్థల అట్టడుగు స్థాయి వరకు రాజకీయ పార్టీల కార్యకలాపాలు చొచ్చుకొని వెళ్ళటం, రాజకీయ వ్యవస్థకు వ్యతిరేకంగా సామాజిక, రాజకీయ ఉద్యమాలు తలెత్తటం సంభవించింది. ఈ విధమైన "భిన్నత్వంలో ఏకత్వం" అనబడే సాంప్రదాయ చట్రంలో విశిష్టమైన రీతిలో జాతి నిర్మాణం ప్రక్రియ కొనసాగుతున్నది.

అనేక విశిష్టతలను సంతరించుకొన్న భారతదేశ రాజకీయాలు ఎందరో పాశ్చాత్య, పాశ్చాత్యేతర రాజనీతి శాస్త్రవేత్తల దృష్టిని ఆకర్షించాయి. ఈ రాజనీతి శాస్త్రవేత్తలు స్వాతంత్ర్యానంతరం భారతదేశ రాజకీయాలను విభిన్న కోణాల నుంచి అధ్యయనం చేశారు. ఈ అధ్యయనాల ఆధారంగా భారతదేశ రాజకీయాలపై గణనీయమైన పరిమాణంలో సిద్ధాంతీకరణ జరిగింది. భారత రాజకీయాల అవగాహనకు ప్రతిపాదింపబడిన నమూనాలలో నాలుగు నమూనాలను ప్రధానంగా పేర్కొనవచ్చును. అవి :

1. రజనీ కొఠారి ప్రతిపాదించిన నమూనా
2. రొడాల్ఫ్, రొడాల్ఫ్‌లు ప్రతిపాదించిన డిమాండు, ఆజ్ఞా బద్ధ రాజకీయాల నమూనా
3. అతుల్ కోహ్లి నమూనా
4. సంక్షోభ నమూనా

పై నాలుగు నమూనాలను ఈ క్రింది విధంగా వివరించటం జరిగింది.

## 1.2. రజనీకొఠారి నమూన:

భారతదేశంలో రాజకీయ అభివృద్ధి సందర్భాన్ని రజనీ కొఠారి ఈ విధంగా వివరించాడు. భారత దేశం ఆధునిక సంస్కృతిలోని ఉత్తమ అంశాలను ఇముడ్చుకొన్న సాంప్రదాయక దేశం. పురాతన కాలం నుంచి భారతదేశం తన సాంప్రదాయ తత్వాన్ని, భిన్నత్వాలను పరిరక్షించుకుంటూ వస్తున్నది.

ఈ ప్రయత్నం గత తరాల జాతీయ, స్థానిక వ్యవస్థల కార్యచట్రంతో పరస్పర చర్య కలిగిన ప్రజాస్వామ్య వ్యవస్థ రూపంలో సాగుతున్నది. జాతి సమైక్యతను సాధించటంతో పాటు రాజకీయ, ఆర్థికాభివృద్ధి సాధన భారతదేశ రాజకీయ వ్యవస్థ ఏర్పరుచుకున్న తక్షణ, ఆవశ్యక లక్ష్యం. అయితే భారత దేశాన్ని సంపూర్ణమైన జాతిగా రూపొందించటం కేవలం ఈ రెండు లక్ష్యాలకు మాత్రమే సాధ్యం కాదు. దేశంలో సంభవిస్తున్న ఆర్ధికాభివృద్ధి, సామాజిక మార్పుల ఫలితంగా ఉత్పన్నమైన శక్తివంతమైన విభిన్న శక్తుల మధ్య సమతుల్యతను సాధించటం దేశ ఆర్ధికాభివృద్ధి సాధనకు కీలక ఆవశ్యక పరిస్థితి. ఈ వాస్తవాలను నిర్మాణపరమైన భిన్నత్వం, ఆధునికతతో నిరంతర సంఘర్షణ, విశిష్టమైన సామాజిక నేపధ్యం కల భారతదేశ రాజకీయ చిత్రాన్ని చిత్రించేందుకు అనేక కోణాల నుంచి పరిశీలించాల్సి ఉంటుంది.

రజనీ కొఠారి ప్రతిపాదించిన విధంగా భారతదేశం చేపట్టిన అభివృద్ధి నమూనా విభిన్న రాజకీయ రూపాలు, విలువలు, భావ

జాలాల వల్ల దొంతరులు, దొంతరులుగా విభజింపబడిన భారత సామాజిక నిర్మాణం రాజకీయం చేయబడిందని వివరిస్తున్నది. భారత సమాజంలో రాజకీయ ప్రక్రియలో ఒక రాజకీయ కేంద్రాన్ని ఏర్పరచటం, ప్రయోజనాలు, బాధ్యతల ద్వారా ఈ కేంద్రాన్ని విస్తృతపరచటం, ఈ కార్యచట్రం పరిధిలో సమాజంలోని విభిన్న వర్గాల ప్రజలను సమీకరించటం కీలక అంశాలు.

రజనీ కొఠారినమూనా ప్రకారం భారతదేశ రాజకీయ ప్రక్రియకు ఒక విశిష్ట గుణం ఉంది. భారతదేశం తన సుదీర్ఘ చరిత్రలో ఒక రాజకీయ వ్యవస్థగా రూపొందగల సామర్థ్యాన్ని పెంపొందించుకోవటంలో, ఒక సుస్థిరమైన రాజకీయ అధికార వ్యవస్థను నిర్మించుకోవటంలో విఫలమైంది. ఈ వైఫల్యమే పాశ్చాత్య రాజనీతి శాస్త్రవేత్తలు భారతదేశాన్ని అరాజకీయ సమాజంగా (apolitical) వర్ణించటానికి కారణమైంది. ఈ నేపథ్యంలో వర్తమాన రాజకీయ శ్రేష్టులు నిర్వహిస్తున్న సృజనాత్మక, నవకల్పనా పూరితమైన పాత్ర స్పష్టంగా గోచరిస్తుంది.

మొత్తం మీద భారత దేశానికి సంబంధించిన రాజకీయ విశ్లేషణలో పరస్పరం ముడిపడ్డ రెండు అంశాలు ఇమిడి ఉన్నాయి. ఒకటి, సమాజంలోని వివిధ సామాజిక వర్గాల రాజకీయాకరణ ప్రక్రియలో సంఘ శ్రేష్ఠుల సామాజికీకరణ విడదీయ లేని అంతర్భాగం. రెండు, రాజకీయ వ్యవస్థ చట్టబద్ధత (legitimacy) సామాజిక రూపాల గుర్తింపు పై ఆధారపడి ఉంది. దేశంలోని విభిన్న రాజకీయ రూపాలు గమనశీలక మైనవి. ఈ వాస్తవాల కారణంగా భారతదేశ రాజకీయాల విశ్లేషణకు సాంప్రదాయ అభివృద్ధి నమూనాకు భిన్నమైన నమూనా అవసరం.

భారతదేశం ఒక విశిష్టమైన అభివృద్ధి నమూనాను అనుసరించటం వల్ల ఈ దేశ రాజకీయాభివృద్ధి విశ్లేషణకు అత్యాధునిక భావనా చట్రం అవసరమైంది. భారతదేశం ఆర్థికాభివృద్ధి కేవలం ఒక ఆర్థిక ప్రక్రియ మాత్రమే కాదని, ఈ ప్రక్రియ విజయం ఆర్థికేతర రంగాల్లో సాధించే ప్రగతిపై ఆధారపడి ఉందనే వాస్తవం గుర్తించబడింది. అయితే ఈ గుర్తింపు ఆర్థికవృద్ధికి అవసరమైన పరిస్థితుల గుర్తింపే తప్ప మొత్తం ప్రక్రియను సమగ్రంగా విశ్లేషించటం జరగలేదు. ఆర్థిక శాస్త్రవేత్తలు ఆశించిన విధంగా సమాజం అభివృద్ధి చెందలేదు.

ఒక జాతిని నిర్మించడం, సమాజంలో కొన్ని లేదా మొత్తం వర్గాల ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపర్చే ప్రక్రియ అభివృద్ధి సాధనకు కీలకం. ఉత్పత్తి ప్రక్రియలో సాధారణ ప్రజలను నిమగ్నం చేయటం పెట్టుబడిని సమీకరించటం, ఆదా చేయటం వంటి ఆర్థిక చర్యలతో మాత్రమే సాధ్యంకాదు. ప్రజలకు వివిధ ప్రేరకాలను కల్పించడం, వారిలో సుస్థితి, ప్రేరణలను పెంపొందింపచేయటం, వారి డిమాండ్ల అభివ్యక్తీకరణ మొదలైన చర్యల ద్వారానే ఉత్పత్తి ప్రక్రియలో సాధారణ ప్రజలు పాల్గొనేలా చేయటం సాధ్యం అవుతుంది. దీనికి ప్రస్తుతం సమాజంలో పాదుకొని ఉన్న భిన్నత్వాలను, సామాజిక సంబంధాలను పునర్ వ్యవస్థీకరించటం, సమాజంలోని సూక్ష్మ, స్థూల స్థాయిల అంశాలను అనుసంధానించే పరిస్థితులను సృష్టించడం, మొదలైన చర్యలు అవసరం. ఈ విధమైన కార్యాచరణ చట్రంలో రాజకీయ వ్యవస్థ పాత్రను స్పష్టంగా నిర్వచించాల్సి ఉంటుంది. ప్రస్తుతం బహుళ, విభిన్న వర్గాలుగా విభజింపబడిన సమాజంలో నూతన సార్వత్రిక ప్రమాణాలను ఏర్పరచి, జాతీయ సమైక్యతను, ప్రణాళికాబద్ధమైన అభివృద్ధిని సాధించగల సంస్థలను సృష్టించగల బహుళ వ్యవస్థల నమూనా మాత్రమే ఈ లక్ష్యాన్ని సాధించగలదు. ఈ ప్రక్రియలో ఆధునిక రంగాలతోపాటు సాంప్రదాయ రంగాలను సమీకరించాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియ సామాజిక మార్పులో రాజ్యానికి కీలకమైన పాత్రను కల్పిస్తోంది. అయితే ఈ విధమైన నమూనాను సృష్టించడం తేలికైన విషయం కాదు. భారతదేశం వంటి ఆర్థికంగా, వెనుకబడిన, సాంస్కృతికంగా సంక్లిష్టమైన సమాజాలలో నూతనంగా ఏర్పడిన రాజకీయ వ్యవస్థలు నిర్మాణపరమైన, వ్యవస్థీకరణల నిగూఢ అంశాలను బహిర్గతం చేయగల్గిన సామర్థ్యాన్ని కలిగి ఉండాలి.

భారతదేశంలో స్వాతంత్ర్యానంతరం సాగిన రాజకీయ, ఆర్థిక వివేచనా క్రమంలో రెండు అంశాలు స్పష్టమైన రూపును సంతరించుకున్నాయి. ఒకటి, సార్వత్రిక ఓటింగ్ సూత్రంపై తన విజయానికి విస్తృతమైన సంఖ్యలో ఓటర్ల మద్దతుపై ఆధారపడిన పార్లమెంటరీ వ్యవస్థ, రెండు, కేంద్రీకృత ప్రణాళికా విధానం ద్వారా ఆర్థిక ప్రగతిని శీఘ్రంగా సాధించటం, స్వావలంబన ద్వారా నిరంతర వృద్ధిని సాధించే దశను చేరుకోవటం అనే లక్ష్యాలు.

భారతదేశం రూపొందించుకున్న అభివృద్ధి వ్యూహంలో కేంద్రీకృత ప్రణాళికా బద్ధమైన ఆర్థిక వృద్ధి రాజకీయ అవసరాలను అనేక శక్తులు అధిగమించాయి. అయితే దేశం సమైక్య జాతీయ రాజకీయ సంకీర్ణాన్ని ఏర్పరచుకొనే ప్రయత్నంలో భాగంగా సాధారణ ప్రజలు చురుకుగా పాల్గొనే ప్రజాస్వామ్య వ్యవస్థను ఏర్పరచుకుంది. దీని ఫలితంగా శక్తి పై దృష్టిని కేంద్రీకరించటానికి చేసే ప్రయత్నంలో రాజకీయ నాయకత్వం త్యాగశీలతను, నిరాడంబరత్వం వంటి ఉన్నత విలువలను అలవర్చుకోవాల్సి వచ్చింది.

భారతదేశం భాగస్వామ్య లక్ష్యాల ద్వారా మధ్యస్థాయి, ఉపరితల నిర్మాణాలను సమీకరించుకునే సంక్లిష్ట, కష్టభరితమైన కర్తవ్యానికి అధిక ప్రాధాన్యతను ఇచ్చే వ్యూహాన్ని ఎంచుకుందనేది స్పష్టం. అయితే ఈ వ్యూహాన్ని అనుసరించేందుకు భారత దేశం స్పష్టమైన నమూనాను దేన్నీ రూపొందించుకోలేదు. దీని ఫలితంగా దేశం గణనీయమైన స్థాయిలో గందరగోళానికి గురయ్యే పరిస్థితి ఉత్పన్నమైంది. అంతేగాక ఈ పరిస్థితులు దేశం ఆర్థిక, రాజకీయ అభివృద్ధిని ఏక కాలంలో సాధించవలసిన అవసరంతో పాటు సామాజిక వ్యవస్థను పునర్ వ్యవస్థీకరించవలసిన క్లిష్టమైన ప్రక్రియను చేపట్ట వలసిన ఆవశ్యకతను సృష్టించాయి.

ఇదే సందర్భంలో గుర్తించుకోవలసిన అంశం మరొకటి ఉంది. రాజకీయాకరణ స్వేచ్ఛగా సంభవించేందుకు అనుమతించిన, ఆధునీకరణ సాధనకు రాజకీయాకరణ ప్రధాన సాధనంగా రూపొందిన దేశంలో రాజకీయాకరణ దేశంలోని సామాజిక, ఆర్థిక సంస్థల స్వయం ప్రతిపత్తిని విచ్ఛిన్నం చేసేందుకు ప్రయత్నిస్తుంది. ఈ సంస్థలపై తన ఆధిక్యతను సాధించే రాజకీయాకరణ సామర్థ్యం వ్యక్తుల ఆశయాలను కోర్కెలను సంతృప్తిపరచటం రాజకీయ వ్యవస్థకు కల సామర్థ్యంపై ఆధారపడి ఉంటుంది.

## 1.3. రోడాల్ఫ్, రోడాల్ఫ్ నమూనా:

1980 దశాబ్దంలో రోడాల్ఫ్, రోడాల్ఫ్‌లు భారత దేశ రాజకీయాలు, ఆర్థిక వ్యవస్థ సంబంధాలను వివరించే ఒక నమూనాను ప్రతిపాదించారు. అది: డిమాండ్ రాజకీయ వ్యవస్థ (demand polity), ఆజ్ఞాబద్ధ రాజకీయ వ్యవస్థ (command polity) నమూనా. ఈ నమూనా రాజ్య సార్వభౌమాధికారం, ప్రజా సార్వభౌమాధికారాలు పరస్పరం సంఘర్షించుకునే అవసరాల వల్ల ఏర్పడిన ఉద్రిక్తతల గురించి అనేక ప్రశ్నలు ఉత్పన్నమవటానికి దారి తీశాయి. ఈ సంఘర్షణే రాజ్యం స్వయం ప్రతిపత్తి, పరస్పర పోషణ విస్తృతమైన పాత్రల పట్ల రాజ్యం ప్రతి స్పందనను నిర్ధారించింది. ఈ రెండు సార్వభౌమాధికారాలు, రాజ్యం, ప్రజలకు మధ్య పోటీ డిమాండు రాజకీయాలు, స్వాతంత్ర్యానంతరం ఆజ్ఞ పూరిత రాజకీయాల మధ్య ఘర్షణలు, రాజకీయ సమీకరణ పెరుగుతున్న స్థాయిలు, రాజ్యం మారుతున్న సామర్థ్యం మధ్య పరస్పర చర్య మూలాలను అన్వేషించటం ద్వారా భారత దేశ రాజకీయ ఆర్థిక వ్యవస్థను వివరించవచ్చునని రోడాల్ఫ్, రోడాల్ఫ్ నమూనా ప్రతిపాదించింది.

డిమాండ్ రాజకీయాల నమూనా ప్రకారం సార్వభౌమాధికారం ఓటర్లలో నిక్షిప్తమై ఉంది. ఈ నమూనా ఎన్నికలలో వివిధ పార్టీల మధ్య పోటీ, వివిధ వర్గాలు, కులాలు వివిధ ప్రజాఉద్యమాల్లో ప్రాతినిధ్యం వహించడం ద్వారా వెల్లడించే తమ ప్రాధాన్యతలను, కేటాయింపుకు సంబంధించిన నిర్ణయాలను ప్రతిబింబిస్తుంది. ఓటర్ల సార్వభౌమాధికారం సిద్ధాంతం ప్రకారం, ఓటర్లు పోటీ మార్కెట్‌కల ఆర్థిక వ్యవస్థలోని వినిమయదారుల వంటివారు. ఎందుచేతనంటే ఎన్నికలలో ఓటర్ల ప్రాధాన్యతల ఎంపిక మాదిరే మార్కెట్‌లో వినిమయదారులు చేపట్టే ప్రాధాన్యతల ఎంపిక, సంపద, అధికారం, సమాచారాల అసమాన పంపిణీలను వక్రీకరించ (distort) లేదు.

రోడాల్ఫ్, రోడాల్ఫ్‌లు ప్రతిపాదించిన ఆజ్ఞాబద్ధ రాజకీయాల నమూనా ప్రకారం రాజ్యాలు స్వయంప్రతిపత్తిని, సార్వభౌమాధికారాన్ని కలిగి ఉంటాయి. నిధుల కేటాయింపుకు సంబంధించిన నిర్ణయాలు, ఎన్నికైన, నియమింపబడిన అధికారుల ప్రాధాన్యతలను ప్రతిబింబిస్తాయి. ఈ అధికారులు విధానాలను రూపొందించి, అమలు పరుస్తారు. ఈ అధికారులు వివిధ వర్గాలను అణిచి వేయటంపై, లేదా కో-ఆప్ట్ చేసుకోవటంపై ఆసక్తిని కనపరుస్తారు. ఈ నమూనా ప్రకారం రాజ్యం ఏ వస్తువులను ఎంత ఉత్పత్తి చేయాలో నిర్ధారించే గుత్తాధిపత్యం కల యజమాని పాత్రను పోషిస్తుంది.

డిమాండ్ రాజకీయ వ్యవస్థ స్వల్పకాలిక లక్ష్యాల సాధనకు ప్రాధాన్యత కనపరుస్తుంది. విధానాలను, ప్రజల ప్రయోజనాలను నిర్ధారించడంలో పోటీ ప్రక్రియను అనుసరిస్తుంది. ఈ రాజకీయ వ్యవస్థ ప్రైవేటు వస్తువులను సమకూర్చటంపై ప్రాధాన్యతను కనపరుస్తుంది. కమాండ్ రాజకీయ వ్యవస్థకు ఎన్నికలలో విజయాన్ని సాధించటం అనే ఆశయం మార్గదర్శకత్వం వహిస్తుంది. ఈ రాజ్యం బహుళవాదం వల్ల ప్రభావితం అవుతుంది. ఈ రాజ్యం అంచెలంచెల విధానం ద్వారా హేతుబద్ధసాధనకు ప్రయత్నిస్తుంది.

రాజ్యం ప్రజా సంక్షేమానికి, ఉమ్మడి సేవల కల్పనకు దీర్ఘకాలిక లక్ష్యాలు, విధానాలను రూపొందించే దిశలో ఉన్ముఖం చేయబడుతుంది. ఆజ్ఞాబద్ధ రాజకీయాలు హేతుబద్ధత, సామాజిక లక్ష్యాలు, అందుబాటులో ఉన్న వనరులకు మధ్య సయోధ్యను ఏర్పరిచే సమగ్రమైన, వివరణాత్మకమైన వ్యూహాల నుంచి ఉత్పన్నమవుతాయి. లక్ష్యాలను, వ్యూహాలను, విధానాలను రూపొందించడంలో ఆజ్ఞాబద్ధ రాజకీయ వ్యవస్థ సామర్థ్యం అనునయం (persuation), ఒత్తిడి ద్వారా సామాజిక డిమాండ్ల కల్పించే అవరోధాలను తొలగించే నాయకత్వం శక్తి పై ఆధారపడి వుంది.

ఆజ్ఞాబద్ధ డిమాండ్ రాజకీయ వ్యవస్థలో చట్టబద్ధత, మద్దతు, నిబద్ధత (commitment) ప్రయోజనాలు, త్యాగాలు, కేటాయింపులో సమానత్వం అవసరం. డిమాండ్ రాజకీయాలు, ప్రయోజనాల విషయంలో సమానత్వాన్ని సాధించడం ద్వారా మద్దతు, చట్టబద్ధత, నిబద్ధతలను సాధిస్తాయి. దీనికి భిన్నంగా ఆజ్ఞాబద్ధ రాజకీయాలు త్యాగాల విషయంలో సమానత్వాన్ని సాధించడం ద్వారా వీటిని అత్యున్నత స్థాయిలు సముపార్జిస్తుంది.

డిమాండ్, ఆజ్ఞాబద్ధ రాజకీయ వ్యవస్థలు రాజకీయ, ఆర్థిక లక్షణాల సమ్మేళనం. డిమాండ్ రాజకీయ వ్యవస్థ ఓటర్ల సార్వభౌమాధికారం అనే రాజకీయ లక్షణాన్ని కలిగి ఉంటుంది. రాజ్య సార్వభౌమాధికారం విధానాలు, రాజకీయాలపై రాజ్యం ఆధిక్యత నియంత్రణలను కలిగి వుండటం ఆజ్ఞాబద్ధ రాజకీయ వ్యవస్థ లక్ష్యం. స్వల్పకాలిక మార్కెట్ లేదా రాజ్య వినిమయం, సప్లయి, వ్యయం, డిమాండు రాజకీయ వ్యవస్థ ఆర్థిక లక్షణాలు అయితే, దీర్ఘకాలిక పెట్టుబడి, ప్రజావస్తువులు, భవిష్యత్తు ప్రయోజనాలపై వ్యయం చేయడం ఆజ్ఞాబద్ధ రాజకీయ లక్ష్యము.

రోడాల్ఫ్, రోడాల్ఫ్‌లు ప్రతిపాదించిన నమూనా ప్రకారం నెహ్రూ యుగంగా భావించబడుతున్న 1950-64 మధ్య కాలంలో భారత దేశ రాజకీయాలు ఆజ్ఞాబద్ధ రాజకీయ వ్యవస్థకు ప్రతి రూపం. అయితే 1965 లో అంటే నెహ్రూ అనంతర కాలంలో దేశంలో డిమాండ్ రాజకీయాలు ప్రారంభమైయాయి. కానీ 1969లో భారత రాజకీయ వ్యవస్థ 1950-64 నాటి పరిస్థితిని తిరిగి చేరుకుంది. స్వాతంత్ర్యానంతరం భారత రాజకీయ నాయకులు, విధాన నిర్ణేతలు ఆజ్ఞాబద్ధ రాజకీయ వ్యవస్థ శక్తివంతమైన సాధనంగా ఉపయోగపడ్తుందని భావించారు. అయితే స్వాతంత్ర్యానంతరం దేశం ఆచరించిన రాజకీయ ఆర్థిక వ్యవస్థకు దేశ ఆర్థికాభివృద్ధికి, పాలనా వ్యవస్థ సామర్థ్యానికి డిమాండ్ రాజకీయ వ్యవస్థ అనుగుణంగా ఉండడమే గాక, వాటిని ఇనుమడింప చేస్తామని సూచించాయి. డిమాండ్ రాజకీయాలు ప్రోత్సహించే వినిమయ, సంక్షేమ వ్యయాలు మానవ శక్తిని, ఉత్పాదక శక్తిని పెంచటమే కాక, చట్ట బద్ధతను మెరుగు పరుస్తాయి. డిమాండ్ రాజకీయాలు అభివ్యక్తించే ఓటర్లు సార్వభౌమాధికారం సామర్థ్యాన్ని చట్ట బద్ధతను పెంపొందింప చేయటం ద్వారా ప్రభుత్వం సామర్థ్యాన్ని మెరుగు పరుస్తుంది.

## 1.4. అతుల్ కోహ్లి నమూనా:

అతుల్ కొహ్లి భారతదేశ రాజకీయాలపై ప్రతిపాదించిన నమూనా దేశ రాజకీయ వ్యవస్థ ఎదుర్కొంటున్న సంక్షోభాన్ని వివరించటానికి ప్రాధాన్యతను ఇచ్చింది. ఈ నమూనా ప్రకారం భారతదేశంలో రాజకీయ సంస్థలు బలహీన పడ్డాయి. అధికారం కోసం తలెత్తిన సంఘర్షణ విస్తృతమైంది. దీని ఫలితంగా దీర్ఘకాలం పదవిలో కొనసాగిన సంకీర్ణ ప్రభుత్వాలను ఏర్పరచటం, కీలకమైన విధానాలను రూపొందించటం, హింసారహితంగా రాజకీయ సంఘర్షణలను రూపుమాపటం రాజకీయ నాయకులకు ఒక గొప్ప సవాలుగా పరిణమించింది. దేశంలో తలెత్తిన రాజకీయ సంక్షోభానికి అనేక కారణాలు ఉన్నప్పటికీ రాజకీయ కారణాలు కీలకమైనవి. స్వాతంత్ర్యానంతర కాలంలో భారతదేశ రాజకీయ వ్యవస్థను తీర్చి దిద్దటంలో రాజకీయ నిర్మాణాలు, విధానాలు అత్యంత ప్రధానమైన

పాత్రను వహించాయని కొహ్లి నమూనా వివరించింది. కొహ్లి నమూనా వాదన ప్రకారం భారత దేశ రాజకీయ సంక్షోభాన్ని వివరించేందుకు బలహీన పడ్తున్న రాజకీయ వ్యవస్థలు, పెరుగుతున్న డిమాండ్ల మధ్య అనుగుణ్యత లేకపోవడం పై దృష్టిని కేంద్రీకరించాల్సి ఉంది. ఈ విషయంలో దీనికంటే ముఖ్యంగా దేశంలోని రాజకీయ సంస్థలు ఏ కారణం చేత బలహీన పడ్డాయి? సమాజంలోని వివిధ వర్గాల సమీకరణ ఎంత వేగంగా, ఏ పద్ధతి ద్వారా జరిగింది? అనే అంశం ప్రధానమైంది.

భారతదేశంలో రాజకీయ మార్పు స్వభావాన్ని నాలుగు అంశాలు ప్రభావితం చేశాయి. అవి : (1) జాతీయ, ప్రాంతీయ రాజకీయ నాయకులు నిర్వహించిన సంస్థీకరణ వ్యతిరేక పాత్ర, (2) రాజకీయ పార్టీల పరిమిత ప్రభావం, (3) వివిధ కులాలు, మతాలు, జాతులకు చెందిన వర్గాల క్రమశిక్షణా రహితంగా రాజకీయ సమీకరణ, (4) సమాజంలో ధనికులు, పేద వర్గాల మధ్య పెరుగుతన్న ఘర్షణ, ఈ నాలుగు కారణాలలో మొదటి మూడు కారణాలు రాజకీయ పరమైనవి. ఏ విధంగానంటే అవి అధికారం పంపిణీ, రాజ్యం వనరుల ఆధిపత్యానికి ఏర్పడిన సంఘర్షణలతో ముడి పడి ఉన్నాయి. చివరి కారణం సమాజంలో మారుతున్న విలువలు, ఆర్థిక వనరుల పంపిణీని ప్రతిబింబిస్తుంది.

భారత దేశంలో రాజకీయ మార్పు విధానాన్ని తీర్చిదిద్ది, కీలక పాత్ర వహించిన రాజకీయ కారణాలు ఈ దేశ రాజకీయ ఆర్థిక వ్యవస్థలో రాజ్యం నిర్వహించిన పాత్రలో నిక్షిప్తమై ఉన్నాయి. భారతదేశంలో రాజ్యం కేవలం రాజకీయ ప్రతినిధి మాత్రమే కాదు. సామాజిక, ఆర్థిక ప్రగతిని సాధించే సాధనంగా, ఈ రెండు భిన్న పాత్రల ఫలితంగా భారతదేశం ఒక "జోక్యం కల్పించుకునే రాజ్యం"గా (Interventionist) రూపొందింది. ఈ రాజ్యం ప్రజాస్వామ్య రాజ్యంగా వ్యవస్థీకరించటం వల్ల రాజకీయాలు, రాజకీయ పోటీ సమాజం జీవితం అట్టడుగు స్థాయి వరకు చొచ్చుకు వెళ్ళాయి. ఈ విధంగా భారత రాజకీయ వ్యవస్థ స్వభావం, రాజకీయ నాయకులు నిర్వహిస్తున్న విభిన్న పాత్రలు, దేశంలో సంభవిస్తున్న రాజకీయ, సామాజిక మార్పులను నిర్ధారించే ప్రధాన అంశాలుగా రూపొందాయి.

ప్రజాస్వామ వ్యవస్థగా భారతదేశ రాజకీయ వ్యవస్థ ఎన్నికలు, పౌర హక్కులు, అనే రెండు కీలక లక్షణాలను కలిగి ఉంది. అయినా కొన్ని ఇతర లక్షణాలు భారతదేశానికి కొన్ని రాజకీయ సమస్యలను సృష్టించాయి. భారత ప్రజాస్వామ్యం కేంద్రీకృత ప్రజాస్వామ్యం, ప్రజాస్వామ్య వ్యవస్థ నాయకుల నుంచి ప్రజలు పొందిన వరమేకానీ ఈ ప్రజాస్వామ్య వ్యవస్థను ప్రజలు స్వయంగా ఏర్పరచుకోలేదు. ఈ దేశంలో అధికారం కొందరు రాజకీయ నాయకులకు ఈ విపరీతమైన స్థాయిలో కేంద్రీకృతమైంది. అయితే ఈ రాజకీయ నాయకులు ప్రజాస్వామ్యాన్ని మౌళికంగా మార్చ లేకపోయారు.

రాజకీయ శ్రేష్ఠుల ఆధిపత్యంకల ప్రజాస్వామ్య వ్యవస్థకు అనుగుణంగానే భారతదేశంలో రాజకీయ సమీకరణ విధానం రూపు దిద్దుకొంది. రాజకీయ నాయకులు ప్రజల కోర్కెలను సంతృప్తి పర్చేందుకు కాక రాజకీయ అధికారాన్ని సంపాదించుకునే లక్ష్యంతో మాత్రమే సమాజంలో కల విభిన్న సామాజిక, ఆర్థిక వర్గాలను సమీకరించారు. ఈ విధంగా భారతదేశంలో సంభవించిన రాజకీయ శ్రేష్ఠవర్గం నాయకత్వం వహిస్తున్న సమీకరణ సాంప్రదాయ సామాజిక సమీకరణకు పూర్తిగా భిన్నమైంది. సాంప్రదాయ సమీకరణ సాధారణంగా ఆర్థికాభివృద్ధికీ, ఆధునీకరణకు దారితీస్తే, శ్రేష్ఠుల నాయకత్వం వహించే సమీకరణ రాజకీయ శ్రేష్ఠుల మధ్య సంఘర్షణకు దారితీస్తుంది. ఈ వాస్తవానికి అనుగుణంగా ఇందిరాగాంధీ కాంగ్రెస్ పార్టీలో తనకు తీవ్రమైన వ్యతిరేకత ఏర్పడినపుడు పేద ప్రజల సంక్షేమం తన ఏకైక లక్ష్యంగా ప్రకటించింది. ఇదేవిధంగా కర్పూరి ఠాకుర్, దేవరాజ్ ఆర్స్ తమ రాజకీయ వ్యతిరేకులను ఎదుర్కొని తమ రాజకీయ భవిష్యత్‌ని పదిల పర్చుకునేందుకు వెనుకబడిన తరగతుల సంక్షేమాన్ని ఒక సాధనంగా గుర్తించారు. ఈ విధంగా భారతదేశంలో రాజకీయ నాయకులు చేపడ్తున్న ప్రజా సమీకరణకు రాజ్యాధికారమే ప్రధాన లక్ష్యం.

## 1.5. సంక్షోభ నమూనా:

భారతదేశ రాజకీయాలపై సంక్షోభ నమూనాను 1980 దశాబ్దంలో రజనీ కొఠారి, కవిరాజ్ మొదలైన వర్తమాన భారతీయ రాజనీత శాస్త్రవేత్తలు ప్రతిపాదించారు. ఈ నమూనా భారతదేశ రాజకీయాలు ఎదుర్కొంటున్న సంక్షోభాన్ని వివరించేందుకు

ప్రయత్నించింది. మొదటగా ఈ నమూనా భారత రాజకీయ వ్యవస్థ వ్యవస్థాపరంగా ఎదుర్కొంటున్న సంక్షోభాన్ని ఈ క్రింది విధంగా వివరించింది: స్వాతంత్ర్యానంతరం భారతదేశంలో రాజ్య నియంత్రణాధికారం నెహ్రూ, ఆయన సహచరులకు సంక్రమించింది. ప్రభుత్వం మౌలిక విధానాల రూపకల్పన, అమలుకు కొన్ని సంస్థలను ఏర్పరిచింది. ఆర్థికాభివృద్ధి విధానాలు, వాటిని రూపొందించే రాజ్యం యంత్రాంగాల మధ్య అంతర్గత సంబంధం ఏర్పడింది. స్వాతంత్రానంతరం కాశ్మీరు, స్వదేశీ సంస్థానాల విలీనం వంటి కొన్ని సమస్యల వల్ల రాజ్యం బలప్రయోగం విధానానికి ప్రాధాన్యతను కనపరచ వలసివచ్చింది. భారతదేశం బ్రిటిషు పాలన నుంచి రెండు పరస్పర వైరుధ్యంకల ధోరణులను వారసత్వంగా పొందింది. బ్రిటిషు నియంత్రణా విధానాలను, పాలనా ప్రమాణాలను (ethos), నియమాలు, చట్టాలు, అణచివేత విధానం మొదలైనవి వారసత్వంగా భారతదేశానికి సంక్రమించాయి. వీటితోపాటు దేశం విజయవంతమైన స్వాతంత్రోద్యమం నుంచి అనేక ఉన్నత ఆదర్శాలు, విలువలు వారసత్వంగా పొందింది. ఈ నేపథ్యంలోనే భారతదేశం వలస పాలన నుంచి సంక్రమించిన కొన్ని నిర్మాణాలను శక్తివంతంగా తీర్చి దిద్దింది.

నెహ్రూ ప్రతిపాదించిన సోషలిస్ట్ విధానాలను కొందరు నాయకులు ఆమోదించలేదు. దాని ఫలితంగా నెహ్రూ ప్రభుత్వ నిర్వహణలో ప్రభుత్వ ఉద్యోగి బృందంపై ఆధారపడవలసి వచ్చింది. దీని కారణంగా స్వాతంత్ర్యం సిద్ధించిన అనంతర కాలంలో ప్రభుత్వ రంగం, ఉద్యోగ బృందం విపరీతమైన పరిమాణంలో విస్తృతమైయాయి. అయితే ఉద్యోగి బృందం వలస పాలన లక్షణాలను కొనసాగించింది. అందువలన ఉద్యోగిబృందం, బాధ్యతారహితంగా, అసమర్థవంతంగా, ప్రతిస్పందన (responsiveness) రాహిత్యంగా రూపొందింది. ప్రభుత్వం ఏర్పరచుకున్న లక్ష్యాల, ప్రభుత్వపాలన సామర్థ్యం మధ్య అంతరం ఏర్పడింది.

నెహ్రూ మరణానంతరం ఆయన ఏర్పరచిన పాలనా వ్యవస్థ బలహీన పడటం ప్రారంభమైంది. బాహ్యాశక్తుల కంటే అంతర్గత శక్తులే ఈ వ్యవస్థను బలహీన పడటానికి దోహదం చేశాయి. నెహ్రూ అనంతరం గడిచిన సంవత్సరాలలో భారతరాజ్యం, రాజకీయాలు అనేక పరిణామాలకు లోనయ్యాయి. పారిశ్రామికీకరణ, సామాజిక సమానత్వం నెహ్రూ ప్రభుత్వం ఏర్పరచుకున్న ప్రధాన లక్ష్యాలు అయితే ప్రభుత్వం అనుసరించిన విధానాలు, ఉద్యోగి బృంద వ్యవస్థ స్వభావం ఈ లక్ష్యాలను సాధించడంలో ప్రతిబంధకాలుగా రూపొందాయి. 1950వ, దశాబ్దంలో ప్రవేశపెట్టిన భూ సంస్కరణలు తమ లక్ష్యాన్ని సాధించడంలో విఫలమైనప్పటికీ, వాటి ప్రభావం వల్ల గ్రామీణ ప్రాంతాల రాజకీయాలలో గణనీయమైన పరిణామాలు సంభవించాయి. గ్రామీణ ప్రాంతాలలో భూస్వాములు శక్తివంతమైయారు. వారు ఎన్నికల రాజకీయాల ద్వారా, రాజ్య వ్యవస్థలపై, వాటి ద్వారా పంపిణీ చేయబడుతున్న వనరులపై ఆధిపత్యాన్ని సంపాదించుకోగలిగారు. ఇదే సందర్భంలో రాజ్యం ప్రధాన ఉత్పత్తిదారుడుగా, వనరుల ఉత్పత్తిలో ప్రత్యక్ష భాగస్వామిగా రూపొందటం చేత లేదా ఆర్థిక వ్యవస్థ, విత్తపాలనలపై సంపూర్ణమైన నియంత్రణాధికారాన్ని పొందడం చేత శక్తివంతంగా రూపొందింది. ఫలితంగా కొన్ని వ్యవస్థీకృత ప్రయోజన గణాలు రాజ్యాన్ని బలపర్చడం, సమర్థించడం ప్రారంభమైంది (ఉదాహరణకు, వ్యాపార గణాలు, ధనిక భూస్వాములు, ప్రభుత్వ ఉద్యోగ బృందం). నెహ్రూ అనంతర దశలో, రాజ్యం యంత్రాంగంలో సంభవించిన పరిణామాలు, దేశంలో అనేక పరిణామాలకు దారి తీశాయి. నెహ్రూ అనుసరించిన అభివృద్ధి వ్యూహంలోని వైరుధ్యాల ఫలితంగా రాజ్యం యంత్రాంగంలో సంస్కృతిలో మౌలిక పరిణామాలు సంబవించాయి. ఈ పరిణామాల ఫలితంగా కాంగ్రెస్ పార్టీ నాయకత్వం స్వభావం, శైలిలో అనేక మార్పులు చోటు చేసుకున్నాయి. ఉన్నత స్థాయి నాయకులు నూతన భారతదేశాన్ని సృష్టించాలని ఆశిస్తూ ఉండగా మధ్య స్థాయి, దిగువ స్థాయిల నాయకులు తమకు అందుబాటులోకి వచ్చిన సౌకర్యాలను ఉపయోగించుకొని తమ రాజకీయ, ఆర్థిక పరిస్థితులను మెరుగు పర్చుకునేందుకు ప్రయత్నించారు.

నెహ్రూ ప్రభుత్వం అనుసరించిన వ్యూహాల వల్ల భూ స్వామ్య వర్గం ఎంత లాభం పొందినప్పటికీ, తీవ్ర అసంతృప్తికి గురైంది. ఈ వర్గంలో తలెత్తిన అసంతృప్తి దేశ రాజకీయాలపై ప్రగాఢమైన ప్రభావాన్ని కనపర్చింది. 1960 దశాబ్దంలో సంభవించిన హరిత విప్లవం వల్ల ఆర్థికంగా బలపడిన భూస్వామ్యవర్గం కాంగ్రెస్ విధానాల పట్ల అసంతృప్తిని పెంచుకుంది. కాంగ్రెస్ విధానాలు తమకు అనుకూలంగా ఉన్నప్పటికీ, పారిశ్రామిక వేత్తల ప్రయోజనాలకే ఎక్కువ ప్రాధాన్యతను కనపరుస్తున్నాయని గుర్తించడం వల్ల ఈ భూస్వామ్య వర్గం 60 వ దశాబ్దంలో రైతుల ప్రయోజనాల రక్షణకు కొన్ని ప్రత్యేక పార్టీలను ఏర్పాటు చేయడం జరిగింది. ఈ నూతన పార్టీల వల్ల, కాంగ్రెస్ పార్టీబలం గణనీయంగా క్షీణించింది. ఫలితంగా 1967లో జరిగిన సాధారణ ఎన్నికలలో అనేక రాష్ట్రాలలో

కాంగ్రెస్‌పార్టీ పరాజయం పొందింది. అయితే ఈ వర్గాలు శ్రీమతి ఇందిరా గాంధి ప్రభుత్వ కాలంలో కాంగ్రెస్ పార్టీలోకి తిరిగిచేరాయి.

1970 దశాబ్దంలో పారిశ్రామికవేత్తలు అభివృద్ధి చెందటంతోపాటు స్వార్థపూరిత వ్యూహాలను ఏర్పరచుకోవటంతో ప్రభుత్వ రంగ పరిశ్రమల సామర్థ్యం క్షీణించింది. అయితే ప్రభుత్వ రంగ పరిశ్రమల వైఫల్యాన్ని సోషలిస్ట్ భావజాలానికి అంట కట్టడం జరిగింది. ప్రభుత్వ రంగం వైఫల్యం చెందడమే గాక తన సామాజిక బాధ్యతలను విస్మరించింది. ఈ పరిణామాల వల్ల భారత ఆర్థిక రంగంలో సంక్షోభం తలెత్తి క్రమంగా విస్తరించింది. స్వాతంత్ర్యానంతరం మొదటి దశాబ్దంలో నెహ్రూ ప్రవేశ పెట్టిన ప్రజాస్వామ్య, సంస్కరణాత్మక రాజకీయాలు భారతదేశ రాజకీయ చిత్రాన్ని పూర్తిగా మార్చివేశాయి. అయితే నెహ్రూ రాజకీయ వ్యవస్థ తన విజయాలకు తానే బాధితురాలైంది. నెహ్రూ ప్రభుత్వం ప్రజలకు చేసిన వాగ్దానాలు, వారిలో రేకెత్తించిన ఆశలను నెరవేర్చటంలో విఫలం చెందటంతో ప్రభుత్వం ప్రజల దృష్టిలో వివాదాస్పదమైనది.

సంక్షోభ నమూనాను అనుసరించి భారతదేశ రాజకీయ వ్యవస్థ ఎదుర్కొన్న రెండవ సంక్షోభం భాగస్వామ్యానికి (participation) సంబంధించినది. స్వాతంత్రానంతరం దేశంలో ఆధునిక పెట్టుబడిదారీ వ్యవస్థ అభివృద్ధి చెందినప్పటికీ, పార్లమెంటరీ వ్యవస్థను ప్రవేశపెట్టినప్పటికీ సాధారణ ప్రజలు విస్తృత సంఖ్యలో చురుకుగా రాజకీయాలలో పాల్గొనటం జరగలేదు. అయితే నెహ్రూ రూపొందించిన రాజకీయ నమూనా ప్రజల రాజకీయ నిర్ణయీకరణ ప్రక్రియలో విస్తృతంగా పాల్గొనే అవకాశాన్ని కల్పించింది. అంతేకాక తరచు జరుగుతున్న ఎన్నికలు, కాంగ్రెస్‌పార్టీ క్రమంగా ప్రజాదరణను కోల్పోవటం, వివిధ పార్టీల మధ్య ఏర్పడిన పోటీ రాజకీయాలు భారతదేశంలో రాజకీయ భాగస్వామ్యం పరిధిని గణనీయంగా విస్తృత పరిచాయి. అయితే పెరిగిన రాజకీయ భాగస్వామ్యం వల్ల ఉదార విధానాలు, సూత్రాలు నిర్లక్ష్యానికి గురైయ్యాయి.

ఈ నిర్లక్ష్యం రాజకీయ సంస్థల పట్ల కూడా సంభవించింది. ఫలితంగా ఈ సంస్థలు క్షీణించడం ప్రారంభమైంది. ఈ క్షీణత 1980 దశాబ్దంలో వేగంగా సంభవించింది. నాయకులపై మితిమీరిన ప్రాధాన్యతను కనపరిచి, సంస్థలకు విలువను ఇవ్వకపోవటమే ఈ సంక్షోభానికి ప్రధాన కారణం అని రజనీ కొఠారి పేర్కొన్నారు. ఈ లోపం రాజ్య యంత్రాంగంలో కీలక భాగాలైన పార్లమెంటు, రాజకీయ పార్టీలు, ఉద్యోగ బృందం, న్యాయ వ్యవస్థ, శాంతిభద్రతల యంత్రాంగాల సామర్థ్యం, సుస్థితి గణనీయంగా క్షీణించేందుకు దారితీసిందని కొఠారి సూచించాడు. దీనితోపాటు ఈ సంస్థల కార్యకలాపాలలో రాజకీయ నాయకులు పక్షపాత వైఖరితో, వివాదాస్పదంగా జోక్యం కలిపించుకోవటం పెరిగింది. రాజకీయ సంస్థలు క్షీణత వల్ల మొత్తం రాజకీయ వ్యవస్థ నిర్వీర్యమైంది. అంతిమంగా ఈ పరిస్థితి అధికారం విచ్ఛిన్నతకి దారి తీసింది. రాజకీయ సంస్థలు తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొనవలసి వచ్చింది.

రాజకీయ సంస్థల క్షీణత వల్ల ఏర్పడిన సంక్షోభంతో సమానంగా విలువల సంక్షోభం భారతదేశ రాజకీయ వ్యవస్థను తీవ్రంగా ప్రభావితం చేసింది. స్వాతంత్రోద్యమ కాలంలో గాంధీ అత్యున్నత నైతిక విలువలకు ప్రతిరూపమయ్యాడు. గాంధీ అడుగుజాడల్లో అనేక మంది జాతీయోద్యమ నాయకులు నైతిక విలువలకు కట్టుబడి ఆదర్శపూరితంగా ప్రవర్తించారు. ఈ నాయకులు రాజకీయాలను నైతిక సూత్రాలతో సమ్మిళితం చేయటమేగాక, సేవాతత్వం ఊపిరిగా తమ విధులను నిర్వర్తించారు.

నైతిక సూత్రాలపై ఈ విధమైన ప్రాధాన్యతను కనపరచటం రాజ్య అధికారాన్ని ప్రయోజనాత్మకంగా వినియోగించటంలో కీలక పాత్ర వహిస్తుంది. ఈ వాస్తవాన్ని నిర్లక్ష్యపరిస్తే, రాజకీయాల్లో అధికార దుర్వినియోగం, స్వార్థపూరిత తత్వాలు అభివృద్ధి చెందటం, చివరకు రాజకీయాలు నేరమయం కావటం సంభవిస్తుంది. ఈ పరిస్థితే భారతదేశ రాజకీయాలలో ఉత్పన్నమైందని రజనీ కొఠారి సిద్ధాంతీకరించారు. ఈ నేపథ్యంలో భారతదేశం ఆధునికోత్తర, లౌకికోత్తర (post - secular) సమాజంగా పరిణామం చెందేందుకు చేసే ప్రయత్నంలో ఈ దశ విశిష్ట పాత్ర నిక్షిప్తమై ఉంది. అయితే భారతదేశం నిర్వహిస్తున్న ఈ పాత్రవల్ల రాజకీయ, ప్రాంతీయ స్థాయిల్లో అనేక రకాల ఉద్యమాలు తలెత్తాయి.

## 1.6. సారాంశం:

అనేక చారిత్రక, సామాజిక, రాజకీయ కారణాల వల్ల భారతదేశ రాజకీయాలు అనేక విశిష్ట లక్షణాలను సంతరించుకున్నాయి. ఈ విశిష్టలక్షణాల వల్ల భారత దేశ రాజకీయాలు ఎందరో పాశ్చాత్య, భారతీయ రాజనీతి శాస్త్రవేత్తల దృష్టిని ఆకర్షించాయి. పాల్‌బ్రాస్, రోడాల్ఫ్, రోడాల్ఫ్, మారిస్-జోన్స్, నార్మన్ డి. పామర్, మొదలైన పాశ్చాత్య రాజనీతి శాస్త్రవేత్తలతో పాటు అతుల్ కొహ్లి, రజనీ కొఠారి, కవిరాజ్ వంటి భారతీయ రాజనీతి శాస్త్రవేత్తలు, భారతీయ రాజకీయాలను అనేక కోణాల నుంచి నిగూఢంగా పరిశీలించారు. తమ పరిశీలనల ఆధారంగా ఈ శాస్త్రవేత్తలు భారత రాజకీయాలపై అనేక భావనలను, సిద్ధాంత నమూనాలను ప్రతిపాదించారు. ఈ నమూనాలు భారత దేశ రాజకీయ వ్యవస్థ స్వభావం, కార్యచరణ శైలి, పొందిన విజయాలు, వైఫల్యాలు, ఎదుర్కొంటున్న సమస్యలు, సవాళ్ళు మొదలైన అనేక అంశాలను సమగ్రంగా వివరించాయి. అందుచేత భారతదేశ రాజకీయ వ్యవస్థ సమగ్ర అవగాహనకు ఈ సైద్ధాంతిక నమూనాలను పరిశీలించటం ఎంతో అవసరం. ప్రస్తుత పాఠంలో భారత దేశ రాజకీయాలపై కల కొన్ని ప్రధాన సైద్ధాంతిక నమూనాలను, అవి ప్రతిపాదించిన ఊహనలను వివరించటం జరిగింది.

## 1.8. మాదిరి ప్రశ్నలు:

1. భారతదేశ సైద్ధాంతిక పునాదులను వివరించండి ?
2. భారత రాజకీయాలపై రజనీ కొఠారి ప్రతిపాదించిన సైద్ధాంతిక నమూనాను పరిశీలించండి ?
3. ఆధునిక భారత రాజకీయాలపై రోడాల్ఫ్, రోడాల్ఫ్ ప్రతిపాదించిన నమూనాను వివరించండి ?
4. భారత రాజకీయాలపై ప్రతిపాదించబడిన సంక్షోభ నమూనాలోని ప్రధాన అంశాలను పరిశీలించండి?

## 1.9. సంప్రదింపు గ్రంథాలు:


- Bipin Chandra, India After Independence, 1947 - 2000, New Delhi: Panguin Books, 2000.
- Paul R. Brass, The Politics of India since Independence, Second Edition, Cambridge, Cambridge University Press, 2001.
- Niraj Gopal Jayal (ed.), Democracy in India, New Delhi: Oxford University Press, 2001.
- Atul Kohili (ed,). The Success of Indias' Democracy, Cambridge: Cambridge University Press, 2001.
- Rajani Kothari, Politics in India, New Delhil: Orient Longman, 1980.
- Austin, Granvelli, Working a Democratic Institution: The Indian Experience, New Delhi: Oxford University Press, 1999.
- Zoya Hassn (ed), Politics and the State in India, New Delhi : Sage, 2000.


**రచయిత: ఎమ్. బాపూజీ**

## పాఠం - 2

# భారతదేశ రాజకీయాలు - సామాజిక, రాజకీయ వారసత్వం

### విషయ క్రమం:

2.0. లక్ష్యం
2.1. ఉపోద్ఘాతం
2.2. హిందూమతం, సామాజిక వ్యవస్థ వారసత్వం
2.3. బ్రిటిషు వలస పాలన వారసత్వం
2.4. జాతీయ ఉద్యమ వారసత్వం
2.5. గాంధీ వారసత్వం
2.6. సారాంశం
2.7. మాదిరి ప్రశ్నలు
2.8. సంప్రదింపు గ్రంథాలు

## 2.0. లక్ష్యం:

భారతదేశ రాజకీయాల సామాజిక, రాజకీయ వారసత్వానికి సంబంధించి ఈ క్రింది అంశాలను వివరించటం ఈ పాఠం ప్రధాన లక్ష్యం.

1. భారతదేశ రాజకీయాల చారిత్రక నేపథ్యం.
2. భారతదేశ రాజకీయాలపై రాజకీయ, సామాజిక వారసత్వాల ప్రభావం.
3. భారతదేశ రాజకీయాల వర్తమాన పరిస్థితి

## 2.1. ఉపోద్ఘాతం:

రజనీ కొఠారి మొదలైన రాజనీతి శాస్త్రవేత్తల అభిప్రాయం ప్రకారం భారతదేశ రాజకీయ వ్యవస్థ స్వభావం, నిర్వర్తనల అవగాహనకు భారతదేశ సామాజిక, ఆర్థిక, రాజకీయ చరిత్రను పరిశీలించడం అవసరం. భారతీయ సమాజాన్ని ప్రభావితం చేసిన భావజాలం, సాంకేతిక ప్రభావాలను, ఈ ప్రభావాలకు సమాజం స్పందించిన తీరును గుర్తు చేసుకోవడం అవసరం. ఇదే ధోరణితో మారిస్-జోన్స్ ఆధునిక భారతదేశ రాజకీయ వ్యవస్థ అవగాహనకు దేశ చారిత్రక నేపథ్యం అవగాహన కీలకమని సూచించాడు. స్వాతంత్ర్యానంతరం భారతదేశ పాలకులకు బ్రిటీషు పాలకుల నుంచి రాజకీయ, పాలనా వ్యవస్థలు వారసత్వంగా సంక్రమించినట్లు తమ స్వీయ చరిత్ర నుంచి, జాతీయ ఉద్యమ అనుభవం నుంచి అనేక అంశాలు వారసత్వంగా సంక్రమించాయని మారిస్-జోన్స్ వివరించాడు. మారిస్-జోన్స్ అభిప్రాయం ప్రకారం భారత రాజకీయాలను పై రెండు భిన్న వారసత్వాల నేపథ్యం నుంచి విశ్లేషించవలసి ఉంది.

ఆధునిక భారత రాజకీయాలు సుదీర్ఘకాల ప్రవాహంలో సంభవించిన అనేక దృగ్గోచరాలు, సంఘటనల ప్రభావం ఫలితం. భారత రాజకీయాలపై ప్రగాఢముద్ర వేసిన వారసత్వపు అంశాలలో మూడింటిని ప్రధానంగా పేర్కొనవచ్చును. అవి:

1. హిందూమతం, సామాజిక వ్యవస్థ
2. బ్రిటీషు పాలన
3. జాతీయ ఉద్యమం

## 2.2. హిందూమతం - సామాజిక వ్యవస్థ వారసత్వం:

భారతదేశంలో ప్రధాన మతమైన హిందూ మతానికి అనేక వేల సంవత్సరాల సుదీర్ఘ చరిత్ర ఉంది. ఈ సుదీర్ఘకాల క్రమంలో దేశంలో అనేక రకాల సామాజిక, మతపరమైన వ్యవస్థలు, సాంప్రదాయాలు, ఆచారాలు అవతరించాయి. క్రీస్తు పూర్వం అనేక శతాబ్దాల క్రితం భారతదేశానికి వలస వచ్చిన ఆర్యులు దేశమంతటా అనేక సామ్రాజ్యాలు స్థాపించారు. వీరు స్థాపించిన సామ్రాజ్యాలలో మౌర్య, గుప్త సామ్రాజ్యాలు మధ్యయుగాలలో భారతదేశం పై ముస్లింలు దండయాత్రలు సాగించేంతవరకు కొనసాగాయి.

హిందూ సమాజం తన అవసరాలకు అనుగుణంగా అనేక వ్యవస్థలను నిర్మించింది. ఈ వ్యవస్థలలో వర్ణ వ్యవస్థ ప్రధానమైంది. స్వాతంత్ర్యానంతరం భారత రాజకీయాలను అత్యంత ప్రగాఢంగా ప్రభావితం చేసిన సామాజిక అంశాలలో వర్ణవ్యవస్థ అత్యంత కీలకమైంది. భారతదేశాన్ని వర్ణవ్యవస్థ ప్రభావితం చేసినంతగా మరే ఇతర సామాజిక అంశం ప్రభావితం చేయలేదనే రాజకీయ విశ్లేషకుల వాదనలో ఎంతో వాస్తవం ఉంది. బ్రిటీషు పాలకులు భిన్న మతాలు, కులాలుగా విభజింపబడిన, సమాజం దొంతరలుగా విభజించబడిన సామాజిక భావజాలాన్ని పుణికిపుచ్చుకున్న భారతదేశ సమాజానికి, పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థ అసంగతమని వాదించారు.

స్వాతంత్ర్యోద్యమకాలంలో ముస్లింలీగ్ అవతరణ, స్వాతంత్ర్యానంతరం దేశ విభజన, భారతదేశ సామాజిక వాస్తవాలకు, పాశ్చాత్య పార్లమెంటరీ వ్యవస్థకు మధ్య అనుగుణ్యత లేదనే నిజాన్ని వెల్లడిస్తున్నాయని బ్రిటీషుపాలకులు వాదించారు. అయితే భారత జాతీయవాదులు ఈ బ్రిటీషు సిద్ధాంతాలను తిరస్కరిస్తూ, హిందూ, ముస్లింల మధ్య మతపరమైన విభేదాలు బ్రిటిషు ప్రభుత్వం సృష్టి, అని వాదించారు. యథార్థానికి బ్రిటీషు ప్రభుత్వం జోక్యం కల్పించుకోకపోతే హిందువులు, ముస్లింలు కలిసి మెలసి సఖ్యతతో జీవించేవారనీ, వారు మతపరంగా కాక ఆర్థిక వర్గం ప్రాతిపదికగా వేరు పడేవారని జాతీయ వాదులు ఉద్ఘాటించారు.

ప్రజాస్వామ్య వ్యవస్థలో అగ్ర వర్ణాలు, నిమ్న జాతులకు చెందిన ప్రజలు సమాన స్థాయిలో కలసి మెలసి జీవించడం దుర్లభమని సమాజంలో వేళ్ళూనుకున్న దొంతరల విధానం, కుల విచక్షణ నిమ్న జాతుల ప్రజలు రాజకీయ ప్రక్రియలో చురుకుగా పాల్గొనకుండా నిరోధిస్తాయని వాదించబడింది. దీనిని నివారించేందుకు స్వాతంత్ర్యానంతరం భారత రాజ్యాంగం, ప్రభుత్వం, షెడ్యూల్డ్ కులాలు, జాతులకు చెందిన ప్రజలకు రాజకీయ ప్రక్రియలో సముచిత భాగస్వామ్యాన్ని కల్పించేందుకు అనేక విధానాలు చేపట్టాయి. ఈ విధానాల్లో ఈ కులాలు, తరగతులకు చెందిన వ్యక్తులకు శాసన సభలలో, ప్రభుత్వ ఉద్యోగాలలో, విద్యా సంస్థల ప్రవేశంలో రిజర్వేషన్లు కల్పించడం ప్రధానమైంది.

కొందరు రాజనీతి విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం స్వాతంత్ర్యానంతరం దేశంలో అవతరించిన పార్లమెంటరీ వ్యవస్థకు కేవలం కులం మాత్రమే సమస్యలను, సవాళ్ళను సృష్టించలేదు. దేశంలోని గ్రామీణ ప్రాంతాలలో అధికశాతం భూమిని తమ ఆధీనంలో ఉంచుకున్న ప్రాభల్య వర్గాలు రాజకీయాలలో పెత్తనం చెలాయిస్తున్నాయి. ఈ ప్రాభల్య వర్గాలు బలహీన వర్గాలకు చెందిన ఓటర్లపై నియంత్రణ చెలాయిస్తూ ఎన్నికలలో తమకు అనుకూలంగా వ్యవహరించే ఓటు బ్యాంకులను సృష్టించుకున్నాయి.

ఇటీవల కాలంలో భారతదేశంలో రాజకీయాలలో కులం పాత్రను వివరిస్తూ రజనీ కొఠారి ఈ విధంగా పేర్కొన్నాడు. భారతదేశంలో కులం రాజకీయాలకు ఒక విశిష్టతను సంతరించింది. కులం తన వ్యక్తిగత, స్థానిక స్థాయి లక్షణాలతో అట్టడుగు స్థాయి రాజకీయాలతోపాటు విస్తృత స్థాయిలో దేశ రాజకీయాలను కూడా ప్రభావితం చేసింది. తరచు జరిగే వివిధ ఎన్నికలలో విజయం శక్తివంతమైన ప్రాభల్యం కలిగిన భూస్వామ్య అగ్ర కులాలతోపాటు కొన్ని ఇతర ప్రధానమైన స్థానిక కులాలు లేదా, బలహీన వర్గాలు, మైనారిటీ వర్గాల మద్దతుపై కూడా ఆధారపడింది. ప్రభుత్వ యంత్రాంగంలో, ఉద్యోగులలో పట్టు కలిగి ఉండటం కూడా

వివిధ కులాల సంబంధాలపై ఆధారపడి ఉంది.

## 2.3. బ్రిటీషు వలస పాలన - వారసత్వం:

బ్రిటీషు వలస పాలన భారత సమాజం మొత్తం అంశాలపై ప్రగాఢమైన ప్రభావాన్ని కనపరిచింది. భారతదేశ రాజకీయ, సామాజిక, ఆర్థిక వ్యవస్థలలో దాదాపు రెండు శతాబ్దాల పైబడి కొనసాగిన బ్రిటిషు వలస పాలన వల్ల అనేక పరిణామాలు సంభవించాయి. ఈ పరిణామాలు సకారాత్మకమైనవి, వ్యతిరేకమైనవి. బ్రిటిషు పాలన ఫలితంగా భారతదేశంలో ప్రధానంగా గ్రామీణ వ్యవసాయరంగంతోపాటు పారిశ్రామిక, రవాణా, సమాచార ప్రసారం, విద్య, విత్తం, పాలనపరమైన అనేక రంగాలలో విప్లవాత్మకమైన మార్పులు సంభవించాయి. అయితే ఈ మార్పులన్నీ వలస పాలన కార్యచక్రంలో అంతర్భాగంగా, భారతదేశం వెనుకబడినతనంతో విదేశీయత లేని అంతర్భాగాలుగా రూపొందాయి. ఈ మార్పులు భారతదేశంలో పేదరికాన్ని, వెనుకబడినతనాన్ని వృద్ధిచేయటమే కాక, దేశం బ్రిటిషు వారిపై ఆధారపడే తత్వాన్ని, ఆవశ్యకతను పెంపొందింప చేసాయి.

భారతదేశ రాజకీయాల విశ్లేషకులు బ్రిటిషు వలసపాలన భారతదేశంపై మూడు రకాల ప్రభావాలను కనపరిచిందని వాదించారు. **ఒకటి**, వలస పాలన భారతదేశ ఆర్థిక వ్యవస్థను ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థతో పరిపూర్ణంగా, సంక్లిష్టమైన రీతిలో విలీనం చేసింది. వలసపాలకుల ఆర్థిక ప్రయోజనాలకు పూర్తిగా ఆధీనపరచబడింది. **రెండు**, బ్రిటిషు పారిశ్రామిక రంగం అవసరాలకు అనుగుణంగా విశిష్టమైన ఉత్పత్తి విధానం, కార్మిక శక్తి, అంతర్జాతీయ వాణిజ్య పద్ధతులు భారతదేశంపై రుద్దబడ్డాయి. భారతదేశంలో పండిన వ్యవసాయ ఉత్పత్తులు బ్రిటన్‌కు ఎగుమతి చేయబడగా, బ్రిటన్‌లో తయారైన పారిశ్రామిక ఉత్పత్తులు భారతదేశానికి దిగుమతి చేయబడ్డాయి. ఈ వారసత్వం భారతదేశంలో కార్మికుల సాంద్రతగల పరిశ్రమలు అభివృద్ధి చెందిన తరువాత కూడా కొనసాగింది. **మూడు**, వలస పాలన ఫలితంగా దేశ ఆర్థికరంగంలో సాధించిన మిగులు లేదా ఆదాలు (savings) పెట్టుబడిగా ఉపయోగించటం వలన ఆర్థికరంగం వృద్ధి చెందటం ప్రారంభమైంది. బ్రిటిషు వారసత్వం ఫలితంగా వివిధ రంగాలలోని వివిధ అంశాలను నిరోధించటంలో, లేదా కొనసాగించడంలో రాజ్యం కీలక పాత్రవహించింది.

మొత్తం మీద బ్రిటిషువలస పాలన భారతదేశ వ్యవసాయ, పారిశ్రామిక రంగాల అభివృద్ధి పై తీవ్రమైన వ్యతిరేక ప్రభావాన్ని కనపరిచింది. దేశంలోని అనేక ప్రాంతాలలో వ్యవసాయరంగం అభివృద్ధి స్తంభించటమేగాక ఈ రంగం ఉత్పాదకత క్షీణించింది. దీని ఫలితంగా వ్యవసాయ ఉత్పత్తుల దిగుబడి అత్యల్ప స్థాయికి దిగజారింది. 1910 నుంచి 1941 మధ్యకాలంలో తలసరి వ్యవసాయ ఉత్పత్తులు 14 శాతం క్షీణించగ, తలసరి వ్యవసాయ ఉత్పత్తుల వినియోగం 24 శాతం దిగజారింది. బ్రిటిషు పాలకులు అనుసరించిన విధానాల పర్యవసానంగ వ్యవసాయ రంగం భూస్వాముల, వడ్డీ వ్యాపారస్థుల, దళారుల కబంధ హస్తాలలో చిక్కుకుంది. ఈ వర్గాలు బ్రిటిషు ప్రభుత్వ వత్తాసుతో వ్యవసాయదారులను దారుణ దోపిడీకి గురి చేశారు. వ్యవసాయరంగంలో ప్రభుత్వం పాత్ర కేవలం భూమి శిస్తు వసూలుకు మాత్రమే పరిమితమైంది. ఈ భూమి శిస్తు ద్వారా లభించే ఆదాయంలో అతిస్వల్పమైన భాగాన్ని మాత్రమే వ్యవసాయరంగం అభివృద్ధికి వెచ్చించడం జరిగింది. వీటన్నిటి ఫలితంగా భారతదేశ వ్యవసాయ రంగం తీవ్రమైన సంక్షోభానికి గురైంది.

భారతదేశంలో బ్రిటిషు పాలనలో తీవ్ర సంక్షోభానికి గురైన మరొక ప్రధానరంగం పారిశ్రామికరంగం. దేశంలో బ్రిటిషుపాలన మొదలైన ప్రథమ శతాబ్దంలోనే దేశంలోని కుటీర పరిశ్రమలు, చేతి వృత్తులు మొదలైన స్వదేశీ పరిశ్రమలు పతనావస్థకు చేరుకున్నాయి. ఇంగ్లాండులో ఉత్పత్తి అయిన వస్తువుల నుంచి ఎదురైన తీవ్రమైన పోటీ, బ్రిటిషు ప్రభుత్వం అనుసరించిన స్వేచ్ఛా, వాణిజ్య విధానాల వల్ల భారత దేశంలోని కుటీర పరిశ్రమలు మూత పడ్డాయి. దీని ఫలితంగా అనేక వేల మంది కార్మికులు ఉపాధిని కోల్పోయారు. 19వ శతాబ్దం రెండవ భాగంలో భారతదేశంలో పారిశ్రామికీకరణ ప్రారంభమైంది. దేశంలోని పారిశ్రామిక రంగం ఆధునిక దశలో అడుగు

పెట్టింది. అయితే ఉత్పత్తి, ఉపాధి కల్పనల పరంగా పారిశ్రామికాభివృద్ధి అతి తక్కువ స్థాయిలో ఆధునిక పరిశ్రమల వల్ల ఉపాధిని కోల్పోయిన చేతి వృత్తుల ప్రజల జీవన పరిస్థితులు నికృష్టంగా రూపొందాయి. పారిశ్రామికాభివృద్ధి ప్రత్తి, జౌళి, చక్కెర, టీ, సిమెంటు వంటి కొన్ని పరిశ్రమలకే పరిమితం అయింది. బ్యాంకింగ్, విద్యుచ్ఛక్తి, ఇనుము, ఉక్కు మొదలైన రంగాలలో అభివృద్ధి దాదాపు శూన్యం. 1930 దశాబ్దం వరకు భారతదేశంలో పారిశ్రామికీకరణ వాణిజ్యరంగంలో సాధించిన విదేశీ పెట్టుబడులు ప్రాభల్యం వహించాయి. బొగ్గు, జౌళి, షిప్పింగ్, టీ, కాఫీ, బ్యాంకింగ్ రంగంలో బ్రిటీషు సంస్థల ఆధిపత్యం పెరిగింది. భారతీయుల యాజమాన్యంలో ఉన్న అనేక పరిశ్రమలను సైతం బ్రిటిషు పెట్టుబడిదారులు నియంత్రించారు. అయితే 1930, 40 దశాబ్దాలలో దేశ ఆర్థిక రంగంలో సంభవించిన మార్పులు దేశ ఆర్థిక వ్యవస్థను అభివృద్ధిపరచటంతోపాటు, స్వాతంత్ర్యానంతర కాలంలో దేశం సాధించిన ఆర్థిక ప్రగతికి పునాదిని నిర్మించారు.

అయినప్పటికీ బ్రిటిషుపాలన వల్ల భారతదేశ ఆర్థిక రంగానికి ఎంతో కొంత ప్రయోజనం చేకూరకపోలేదు. ప్రధానంగా బ్రిటిషు పాలన వల్ల దేశంలో రవాణా, సమాచార ప్రసారాల రంగాలు అభివృద్ధి పథంలో ప్రవేశించాయి. దేశంలో మొట్టమొదటిసారిగా రైల్వే వ్యవస్థ ప్రవేశపెట్టబడింది. దేశంలో రహదారులు విస్తరించాయి. ఈ విధంగా రవాణా రంగంలో సాధించిన అభివృద్ధి దేశాన్ని సమైక్యపరచటంతోపాటు ప్రజలు, వస్తువుల రాకపోకలు ప్రారంభమై దేశ ఆర్థిక వ్యవస్థపై సకారాత్మక ప్రభావాన్ని కనపరిచాయి.

అయితే రవాణారంగంతో సమానంగా పారిశ్రామిక రంగం అభివృద్ధి చెందకపోవడంతో దేశంలో వాణిజ్యపరమైన విప్లవం సంభవించి దేశ ఆర్థిక వ్యవస్థ వలస స్వభావం మరింత పెంపొందింది. 1914 తరువాత కాలంలో స్వదేశీ పెట్టుబడిదారులు విదేశీ పెట్టుబడుల మీద కాక తమ స్వంత పెట్టుబడుల మీద ఆధారపడ్డారు.

ఈ విధంగా బ్రిటిషు పాలనా కాలంలో సంభవించిన కొద్దిపాటి ఆర్థిక అభివృద్ధిని విస్తృత చారిత్రక సందర్భంలో విశ్లేషించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో చూస్తే బ్రిటిషు వలస పాలన వలన భారతదేశ ఆర్థిక పరిస్థితి పూర్తిగా విచ్ఛిన్నమయింది. దీని పర్యవసానంగా దేశంలో రైతులు, వ్యవసాయ కూలీలు, చేతి వృత్తుల మీద ఆధారపడిన వర్గాలు దుర్భర దారిద్ర్యంలోకి నెట్టబడ్డారు. దేశంలోని వివిధ ప్రాంతాలలో అంతులేని పేదరికం, కరువుకాటకాలు, అనారోగ్యం తాండవించాయి. సాధారణ ప్రజలు అతి నికృష్టమైన జీవితాన్ని గడపవలసి వచ్చింది. 1943లో బెంగాల్లో ఏర్పడిన తీవ్ర దుర్భిక్ష పరిస్థితుల్లో ప్రజలు ఎదుర్కొన్న కష్టాలు వర్ణనాతీతం.

మొత్తం మీద అంతులేని, దుర్భరమైన పేదరికం, అతి నికృష్టమైన జీవన పరిస్థితులు, వ్యవసాయ, పారిశ్రామిక రంగాల్లో అభివృద్ధి రాహిత్యం, అతి స్వల్ప ఉత్పాదక శక్తి, కనీస అవసరాల కొరత, అతి స్వల్ప తలసరి ఆదాయం, అర్థ-భూస్వామ్యవిధానంతో పెనవేసుకున్న వ్యవసాయరంగం, బ్రిటిషుపాలన భారత దేశానికి అందచేసిన వారసత్వం అని చరిత్రకారులు, విశ్లేషకులు వెల్లడించారు. అయితే ఆర్థికేతర రంగాలపై బ్రిటిషుపాలన కొంత మేరకైనా సకారాత్మక ప్రభావాన్ని కనపరిచిందనే వాస్తవాన్ని అంగీకరించాల్సి ఉంది. ఇంగ్లీషు భాషపై ఆధారపడిన బ్రిటిషు ప్రభుత్వం ప్రవేశపెట్టిన విద్యా విధానం భారతదేశ సమాజంలో అనేక గుణాత్మక మార్పులను ప్రవేశ పెట్టింది. ఈ నూతన విద్యా విధానం వల్ల దేశంలో ఆధునిక మేధావి వర్గం అవతరించింది. ఈ విద్యా విధానం వివిధ వర్గాల ప్రజల్లో ఒక నూతన వికాసాన్ని పురికొల్పింది. వారి ఆలోచనా విధానంలో, దృక్పథాలలో సారూప్యత పెంపొందింది. కానీ బ్రిటీషు ప్రభుత్వం ప్రవేశపెట్టిన విద్యా విధానం ఫలితంగా సామాన్య ప్రజలకు, మేధావి వర్గానికి మధ్య అంతరం పెరిగింది. ఇంగ్లీషు భాషకు జాతీయ స్థాయిలో గణనీయ ప్రాధాన్యత చేకూరింది. దీని ఫలితంగా భారతీయ భాషల అభివృద్ధి కుంటు పడింది. బ్రిటీషు ప్రభుత్వ విద్యా విధానం వల్ల దేశంలోని పేదవర్గం ప్రజలకు విద్యావకాశాలు క్షీణించాయి. ఈ విద్యా విధానం వల్ల దేశంలోని సమైక్యత సాధింపబడినప్పటికీ, అది అనేక వ్యతిరేక ఫలితాలను కలుగచేసింది.

బ్రిటిషు వలస పాలనవల్ల భారత దేశ పాలనా వ్యవస్థ అనేక మార్పులకు గురైంది. బ్రిటిషు ప్రభుత్వం మొగలాయిల పరిపాలనా వ్యవస్థ ఆధారంగా దేశంలో సమైక్య పాలనా వ్యవస్థను నెలకొల్పింది. కేంద్రస్థాయి నుంచి అట్టడుగు స్థాయి వరకు ఏకీకృత పాలనా వ్యవస్థ రూపుదిద్దుకొంది. బ్రిటిషు ప్రభుత్వం ప్రవేశపెట్టిన పాలనా, విద్యా విధానాలు భారతదేశం ఒక దేశంగా రూపు

దిద్దుకునేందుకు ప్రాతిపదికను ఏర్పరిచాయి. బ్రిటిషు ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇండియన్ సివిల్ సర్వీసు (I.C.S) వ్యవస్థ పాలనా సమర్థతకు, నిజాయితీకి, సమగ్రతకు పేరుపొందింది.

మారిస్-జోన్స్ అభిప్రాయం ప్రకారం బ్రిటీషు వలస పాలన నుంచి భారతదేశానికి వారసత్వంగా సంక్రమించిన అనేక సంస్థలలో రెండు ప్రధానమైనవి. అవి: (1) శాసన సభలు, మండలులు, (2) న్యాయ సంస్థలు. 19వ శతాబ్దంలో భారతదేశంలో బ్రిటీషు ప్రభుత్వం ప్రవేశ పెట్టిన శాసన నిర్మాణ సంస్థలు బ్రిటిషు ప్రభుత్వం స్వీయ ప్రయోజనాల కొరకు ఏర్పరచుకున్నవే. అయినప్పటికీ వాటి వల్ల భారతదేశానికి రాజకీయంగా ప్రయోజనం సమకూరింది. భారత ప్రభుత్వం చట్టం, 1874 ఫలితంగా భారతదేశంలో కేంద్ర రాష్ట్రస్థాయిలో శాసన మండలులు ఏర్పడ్డాయి. ఈ శాసన మండలి సభ్యులలో కొందరిని ప్రభుత్వం నియమించడం, మరి కొందరిని ప్రజలు ఎన్నుకునే పద్ధతిని ప్రవేశపెట్టారు. అయితే ఈ రెండు రకాల పద్ధతుల మధ్య సమతౌల్యత లోపించింది. భారత ప్రభుత్వ చట్టం 1919 ఈ పరిస్థితిని కొంత వరకు సరిదిద్దింది. అయినప్పటికీ ఈ సంస్థలలో సభ్యులు కాని వ్యక్తుల లేదా రాజ్యాంగేతర వ్యక్తుల ప్రాబల్యం కొనసాగింది.

బ్రిటీషు ప్రభుత్వం ఏర్పరచిన శాసన సభలు భారత జాతీయ ఉద్యమాన్ని ప్రగాఢంగా ప్రభావితం చేశాయని మారిస్-జోన్స్ వివరించాడు. ఈ ప్రభావం మూడు రకాలు: ఒకటి, ఈ అర్ధ-పార్లమెంటరీ వ్యవస్థలు జాతీయోద్యమ నాయకత్వంలో చీలికకు దారి తీశాయి. జాతీయ ఉద్యమ నాయకులలో అతివాదులు, మితవాదులు అని రెండు వర్గాలు ఏర్పడ్డాయి. రెండు, కేవలం పార్లమెంటరీ విధానం మాత్రమే జాతీయ ఉద్యమానికి విశిష్టతను సమకూర్చలేదు. ఈ విధానం భారతీయులకు శాసన నిర్మాణంలో తగిన భాగస్వామ్యాన్ని కల్పించలేక పోయింది. మూడు, పార్లమెంటరీ వ్యవస్థ సమాజంలోని అట్టడుగు స్థాయిలోకి చొచ్చుకొని వెళ్ళలేదు.

ఏమైనప్పటికీ బ్రిటిషు ప్రభుత్వం ఏర్పరచిన శాసన మండలులు, శాసనసభల వ్యవస్థ పూర్తిగా నిరుపయోగమైంది కాదు. ఈ సంస్థల వల్ల కొందరు భారత జాతీయ నాయకులు పార్లమెంటరీ వ్యవస్థల నిర్వహణలో నైపుణ్యాన్ని సంపాదించుకున్నారు. అయితే ఈ నాయకులు కేవలం ప్రతి పక్షనాయకులుగా వ్యవహరించటంలో మాత్రమే అనుభవాన్ని పొందారు. కానీ 1937-39 మధ్యకాలంలో రాష్ట్రస్థాయిలోని కొందరు నాయకులు శాసనసభలు, ప్రభుత్వ పాలనా రంగాలలో నైపుణ్యాన్ని పెంపొందించుకోగలిగారు. ఈ అనుభవమే భారత రాజ్యాంగ రూపకల్పన సమయంలో ఉపయోగించింది. ఈ శాసన నిర్మాణ సభలు భారతీయులకు తమ సమస్యలను, భావాలను స్వేచ్ఛగా వెల్లడించే అవకాశాన్ని కల్పించటమేకాక బ్రిటిషు ప్రభుత్వం తన వైఫల్యాలకు బాధ్యత వహించేలా చేసాయి.

బ్రిటిషు పాలన భారతదేశానికి వారసత్వంగా అందించిన రెండవ వ్యవస్థ న్యాయ, చట్ట వ్యవస్థ. బ్రిటిషు ప్రభుత్వం భారతదేశంలో సమన్యాయ పాలనను, న్యాయ వ్యవస్థకు సంబంధించిన ప్రవర్తనా నియమావళిని, న్యాయాధిపతులకు, న్యాయవాద వృత్తికి మధ్య సంబంధాలను, న్యాయవాదులకు శిక్షణ, న్యాయ స్థానాల నిర్మాణం, ప్రభుత్వ న్యాయ వ్యవస్థ మధ్య సంబంధాలు మొదలైన అనేక నూతన ప్రక్రియలను ప్రవేశ పెట్టింది.

అయితే బ్రిటిషు పాలనా కాలంలో న్యాయవ్యవస్థ సంపూర్ణ స్వేచ్ఛ స్వాతంత్ర్యాలతో వ్యవహరించలేక పోయింది. దీనికి బ్రిటిషు ప్రభుత్వం అనుసరించిన కొన్ని విధానాలు కారణం. జిల్లా స్థాయిలో కార్య నిర్వహణ విధులు, న్యాయ సంబంధమైన విధులు జిల్లా కలెక్టర్ - మెజిస్ట్రేట్‌లో సమ్మేళనం చేయబడ్డాయి. జిల్లాస్థాయిలో సివిల్, క్రిమినల్ న్యాయాధికారాలు ఒకే న్యాయాధిపతిలో కేంద్రీకృతం అయ్యాయి. న్యాయాధిపతులకు కార్యనిర్వాహక అధికారాలు లేనప్పటికీ వారు ఐ.సి.యస్. క్యాడర్ నుంచి నియమింపబడ్డారు.

బ్రిటిషు వలస పాలనాకాలంలో పార్లమెంటరీ వ్యవస్థకన్నా న్యాయ వ్యవస్థ భారతీయుల జీవితాలపై శక్తివంతమైన ప్రభావాన్ని కనపరిచింది. ఈ న్యాయవ్యవస్థ రాజకీయ నాయకుల విమర్శలకు గురి కాలేదు. జాతీయ ఉద్యమ కాలంలో న్యాయ స్థానాలను ప్రజలు బహిష్కరించడం సంభవించలేదు. బ్రిటీషు వలస పాలకులు భారతదేశంలో నెలకొల్పిన న్యాయ వ్యవస్థ ఈ దేశ సాంప్రదాయాలకు అనుగుణంగాలేనప్పటికీ అది సుస్థిరత సాధించగలిగింది. మొత్తం మీద భారతదేశానికి బ్రిటీషు వలస పాలన నుంచి సంక్రమించిన

అనేక వ్యవస్థలుగా న్యాయ వ్యవస్థ భిన్నమైంది. ఈ వ్యవస్థలకు లేని గౌరవం న్యాయ వ్యవస్థ పొందగలిగింది. ఈ వాస్తవం రాజ్యాంగ నిర్మాణ సభ చర్చలలో ప్రతిబింబించింది.

భారతదేశం పై బ్రిటీష్ వలస పాలన ప్రభావాన్ని రామేశ్‌థాపర్ వివరిస్తూ బ్రిటీషు పాలన వారసత్వం భారతదేశంలోని అనేక రంగాలను అనేక రూపాలలో ప్రభావితం చేసిందని పేర్కొన్నారు. ఈ వారసత్వం ఫలితాలు సకారాత్మకమైనవి, వ్యతిరేకాత్మకమైనవి. ఈ అంశాన్నే రవీంద్రనాథ్ ఠాగూర్ ఆకర్షనీయంగా వివరించాడు. విధిని అనుసరించి బ్రిటీష్ ప్రభుత్వం భారతదేశాన్ని ఏదో ఒక నాడు విడచి వెళ్ళక తప్పదు. అయితే వారు మిగిల్చిన భారతదేశ స్వరూపం ఏమిటి ? వారు సృషించిన పరిస్థితి ఎంత దుర్భరమైంది? అనేక శతాబ్దాలపాటు వారు సాధించింది ఏమిటి? వారు ప్రవేశ పెట్టిన విధానాలు, పాలన ఏదో ఒక నాడు నిష్క్రమించక తప్పదు. చివరికి వారు మిగిల్చి వెళ్ళేది వ్యర్థమైన కల్మషం మాత్రమే.

## 2.4. జాతీయ ఉద్యమ వారసత్వం:

భారతదేశం బ్రిటీషు వలస పాలన నుంచి రాజకీయ, ఆర్థిక, పాలనా వ్యవస్థలను వారసత్వంగా పొందినట్లే, దేశంలో దాదాపు ఒక శతాబ్దకాలం పాటు సాగిన జాతీయ ఉద్యమం నుంచి జాతినిర్మాణాన్ని ప్రభావితం చేసిన అనేక విలువలను, ఆదర్శాలను, విస్పష్టమైన సైద్ధాంతిక భావాజాలాన్ని వారసత్వంగా పొందింది. జాతి మొత్తం పాల్గొన్న జాతీయోద్యమంలో అనేకరకాల ధోరణులు, భావజాలం అంతర్లీనంగా ప్రవహించాయి. ఈ విలువలు స్వాతంత్ర్యనంతరం దేశాన్ని సమైక్య పరచటంలో, ఏకత్రాటిపై నడపటంలో కీలక పాత్రను వహించాయి. ఈ విలువలు స్వాతంత్రోద్యమానికి, దేశాన్ని అభివృద్ధి పథంలోముందుకు నడిపించే కృషికి మధ్య వారధిలా పని చేశాయి. ఈ విలువలు, ఆదర్శాలే వర్తమాన కాలంలో కూడ రాజకీయ నాయకులు, రాజకీయ పార్టీల పనితీరు మూల్యాంకనకు ప్రాతిపదికగా పనిచేస్తున్నాయి.

జాతీయోద్యమం సమానత్వం, లౌకికవాదం, అహింస, ప్రజాస్వామ్యం, సంక్షేమరాజ్యం మొదలైన ఉన్నతాదర్శాలకు కట్టుబడింది. జాతీయోద్యమం నుంచి జాతీయ సమైక్యత, భిన్నత్వం అనే రెండు భిన్న భావనలు రూపుదిద్దుకున్నాయి. ఈ భావనలే స్వాతంత్ర్యానంతరం దేశీయ, విదేశీయ రంగాలలో రూపొందించి, అనుసరించిన అనేక విధానాలను తీర్చిదిద్దాయి.

భారతస్వాతంత్రోద్యమాన్ని, దాని వారసత్వాన్ని బిపిన్ చంద్ర ఈ విధంగా వివరించాడు. భారత సాతంత్ర్యోద్యమం దేశ రాజకీయ స్వాతంత్ర్యానికి, సామాజిక, ఆర్థికాభివృద్ధికి, అసమానతలను రూపుమాపడానికి, ప్రాతినిధ్య ప్రజాస్వామ్యానికి, పౌర హక్కులకు, అంతర్జాతీయవాదానికి, స్వతంత్రమైన విదేశాంగ విధానం రూపకల్పనకు, భిన్నత్వంలో ఏకత్వం సాధనకు, ప్రజల సహకారంతో సామరస్య పూరిత రాజకీయ పద్ధతులను సాధించటానికి కట్టుబడింది. స్వాతంత్ర్యం వచ్చాక ఏర్పడిన జాతీయ ప్రభుత్వం జాతీయ ఉద్యమలక్ష్యాల సాధనకు పూర్తిగా అంకితమైంది. ఈ లక్ష్యాలు, ఆదర్శాలను రాజ్యాంగంలోని వివిధ ప్రకరణల్లో పొందుపరిచారు. అవి రాజకీయ పార్టీల ప్రణాళికల్లో, కార్యక్రమాలలో ప్రతిబింబించాయి. భారతదేశ ప్రజలు ప్రభుత్వం, రాజకీయ పార్టీలు, సంస్థల నిర్వర్తనను మదింపు చేసేందుకు ఈ లక్ష్యాలు, ఆదర్శాలను ప్రధాన పారమితులుగా (parameters) ఉపయోగిస్తున్నారు.

జాతీయ ఉద్యమంలో రూపుదిద్దుకున్న ప్రధాన ఆదర్శాలైన సార్వభౌమాధికారం, లౌకికవాదం, ప్రజాస్వామ్యం, పార్లమెంటరీ వ్యవస్థలకు వాస్తవరూపం కల్పించే దిశలో స్వాతంత్ర్యానంతరం భారత దేశ పాలకులు దేశాన్ని సార్వభౌమాధికారం కలిగిన సర్వస్వతంత్ర్య గణతంత్ర రాజ్యంగా తీర్చిదిద్దడం తమ ప్రధాన లక్ష్యంగా ఎంచుకున్నారు. ఈ లక్ష్యాన్ని సాధించేందుకు భారత రాజ్యాంగం భారతదేశాన్ని సర్వసత్తాక గణతంత్ర రాజ్యంగా ప్రకటించింది. జాతీయ ఉద్యమ నాయకులు పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థ పై ప్రగాఢమైన విశ్వాసాన్ని కనపరిచి బ్రిటీషు పార్లమెంటరీ వ్యవస్థను భారతదేశం అనుసరించాలని వాంఛించారు. రాజ్యాంగ నిర్మాణ మండలిలో బ్రిటన్, అమెరికా రాజకీయ వ్యవస్థలపై సుదీర్ఘచర్చ జరిగింది. ఈ చర్చ పర్యవసానంగా భారత రాజ్యాంగ నిర్మాతలు బ్రిటన్‌లో నెలకొన్న పార్లమెంటరీ వ్యవస్థను, ఇదేవిధంగా అమెరికా న్యాయవ్యవస్థను ప్రవేశ పెట్టారు.

జాతీయోద్యమనాయకులు రాజకీయ, ఆర్థిక స్వాతంత్ర్యాలు సున్నితంగా ముడిపడి ఉన్నాయని గుర్తించారు. భారతదేశం ఆర్థికంగా పాశ్చాత్య దేశాలపై ఆధారపడి ఉన్నంతకాలం తన రాజకీయ సాతంత్ర్యాన్ని సుస్థిరపరుచుకోలేదని భావించారు. ఆర్థిక స్వాతంత్ర్యం, స్వావలంబనలు పారిశ్రామికీకరణ పై ఆధారపడి ఉంటుందనే వాస్తవాన్ని వారు గుర్తించారు. పారిశ్రామీకీకరణకు విదేశీ సహాయం అవసరం. కాని పారిశ్రామికీకరణ దేశాన్ని విదేశి దిగుమతులు, ధనసహాయం పై ఆధారపడటాన్ని నివారిస్తుంది. ఈ చైతన్యము భారతదేశ స్వాతంత్రానంతరం ప్రణాళికాబద్ధమైన ఆర్థిక ప్రగతి వ్యూహాన్ని చేపట్టడానికి దోహదం చేసింది. ఈ వ్యూహం ఫలితంగా భారత దేశంలో సామాజిక, ఆర్థికాభివృద్ధి సాధనకు పంచవర్ష ప్రణాళికలను రూపొందించి అమలు పరచడం ప్రారంభమయ్యింది. ప్రణాళికీకరణ విధానంతోపాటు దేశ ఆర్థిక ప్రగతిని సత్వరం సాధించేందుకు ఆర్థిక రంగాన్ని ఆధునికీకరించడం అవసరం అని భావించడం జరిగింది. దేశంలో వేళ్ళూనుకొన్న భూస్వామ్య వ్యవస్థను, సాంప్రదాయ, సామాజిక పద్ధతులను తొలగించేందుకు అనేక సంస్కరణలను చేపట్టారు.

జాతీయ ఉద్యమ మరో కీలక లక్ష్యమైన లౌకిక రాజ్య స్థాపనకు స్వాతంత్ర్యానంతరం దేశ నాయకులు అధిక ప్రాధాన్యత కనపరిచారు. దేశంలో మతతత్వాన్ని నిరోధించి, లౌకిక వ్యవస్థ బలపడేందుకు పెక్కు విధానాలను అనుసరించారు. మతతత్వాన్ని ప్రోత్సహించే అన్ని శక్తులను నిర్వీర్యపర్చేందుకు తగిన చర్యలను చేపట్టారు. దేశంలో మతం పట్ల కాక రాజ్యం పట్ల విధేయత ఆధారంగా కల జాతీయవాదం పెంపొందటానికి కృషి చేశారు.

జాతీయ ఉద్యమ నాయకులు ఏర్పరచుకున్న ఆదర్శాలు, లక్ష్యాలు స్వాతంత్ర్యానంతరం భారతదేశం కేంద్రీకృతమైన, శక్తివంతమైన రాజ్యంగా రూపొందేందుకు ప్రేరణగా పని చేశాయి. ఈ ఆదర్శాలు భారతదేశాన్ని సర్వ సత్తాక, స్వతంత్ర దేశంగా, విదేశీ దండయాత్రలకు, అంతర్గత వేర్పాటు శక్తులకు లొంగని, దేశ సమైక్యతను, సమాజంలో శాంతి భద్రతలను పరిరక్షించే, ప్రణాళికా విధానం ద్వారా దేశాన్ని ఆర్థికంగా పురోగమింపచేసే, భూస్వామ్య వ్యవస్థ, అంటరానితనం వంటి ఆర్థిక, సామాజిక అవాంఛనీయ వ్యవస్థలను రూపుమాపే సాధనంగా తీర్చిదిద్దే దిశలో ప్రభుత్వాన్ని కార్యోన్ముఖం చేశాయి.

జాతీయ ఉద్యమం భారతదేశంలో జాతి నిర్మాణానికి (Nation - Building) ప్రాతిపదికను ఏర్పరిచింది. వలస పాలనకు వ్యతిరేకంగా ఉమ్మడి పోరాటం ద్వారా జాతి నిర్మాణాన్ని సాధించటం జాతీయ ఉద్యమ మౌలిక లక్ష్యాలలో ఒకటి. దీనికి అనుగుణంగానే జాతీయ ఉద్యమం విస్తృత భారత తత్వాన్ని పెంపొందింపచేసింది. 1885లో జాతీయ కాంగ్రెస్ స్థాపన ద్వారా జాతీయ ఉద్యమ నాయకులు విస్తృత ప్రాతిపదిక మీద జాతీయ స్థాయిలో రాజకీయ సమీకరణను సాధించేందుకు పూనుకున్నారు. సాధారణ కార్యకర్తల నుంచి జాతీయ నాయకుల వరకు దేశంలోని అన్ని ప్రాంతాలకు చెందినవారు కావటం, దేశం మొత్తం ప్రజలను ఉద్దేశించిన కార్యక్రమాలను చేపట్టడం ద్వారా కాంగ్రెస్ మొత్తం దేశానికి చెందిన వ్యవస్థగా రూపు దిద్దుకొంది. మొదటి నుంచి, చిట్టచివరి వరకు జాతీయోద్యమం దేశ సమైక్యత, ఐక్యతల సాధనపై ప్రాధాన్యతను కేంద్రీకరించింది. దేశంలోని వివిధ ప్రాంతీయ ఉద్యమాలన్నీ కాంగ్రెస్‌లో మిళితమవటం కూడా ఈ లక్ష్యంతో జరిగిందే.

జాతీయ ఉద్యమ నాయకులు దేశాన్ని క్రమబద్ధంగా, పటిష్టవంతంగా తీర్చిదిద్దటం దేశ ఐక్యతకు వ్యతిరేకం కాదని ఉద్ఘాటించారు. జాతీయ నాయకులు దేశంలో కల సాంస్కృతిక, భాషా, మత, జాతి, ప్రాంతీయ వైవిధ్యాలను, భిన్నత్వాలను గుర్తించారు. ఒక బలమైన జాతీయ స్థాయి గుర్తింపు (Identity), దానితోపాటు ప్రాంతీయ గుర్తింపు తలెత్తడం, పరస్పర సంబంధం కలిగిన ప్రక్రియలుగా వారు పరిగణించారు. ఈ దేశంలోని భిన్నత్వాలు, అనేక రకాల గుర్తింపులు, దేశ సమగ్రతకు, జాతీయతకు బలాన్ని చేకూర్చే శక్తులుగా పరిగణించారు. ఈ ప్రాంతీయ సాంస్కృతిక గుర్తింపులు విడదీయలేని అంతర్భాగాలుగా అభివృద్ధి చెందాయని జాతీయ ఉద్యమ నాయకులు భావించారు.

క్రమంగా జాతీయ ఉద్యమం నుంచి భిన్నత్వంలో ఏకత్వం, జాతీయ సమైక్యత అనే రెండు భావనలు ఉద్భవించాయి. వీటిలో మొదటి భావనకు దేశంలో సమాఖ్య రాజకీయ వ్యవస్థ అవతరణకు దారి తీసిన సాంస్కృతిక వైవిధ్యం ప్రాతిపదిక. జాతీయ సమైక్యత శక్తివంతమైన రాజకీయ కేంద్రానికి, విభిన్న సాంస్కృతిక స్రవంతులు సంకీర్ణ భారతీయ సంస్కృతిగా పరిణామం చెందటానికి

దోహదం చేసింది.

భారతదేశ విదేశాంగ విధానానికి జాతీయ ఉద్యమ కాలంలో రూపు దిద్దుకున్న సూత్రాలు, విధానాలు ప్రధాన ప్రాతిపదికలు. కాలక్రమంలో భారతదేశ నాయకులు అంతర్జాతీయ వ్యవహారాల పట్ల విశాల దృక్పథాన్ని అలవర్చుకొన్నారు. వలస పాలన పట్ల వ్యతిరేకతను స్వాతంత్ర్యంలో తలపెట్టిన ఉద్యమాల పట్ల సానుభూతిని ప్రదర్శించే మనస్తత్వాన్ని పెంపొందించుకున్నారు. 1930, 40 దశాబ్దాలలో భారత జాతీయ ఉద్యమం ఫాసిస్ట్ వ్యతిరేకతను ప్రధాన విధానంగా ఏర్పరచుకుంది. ఫాసిస్ట్ వ్యతిరేక ధోరణి గాంధీజీ చేసిన అనేక ఉపన్యాసాలలో అభివ్యక్తమైంది. 1936లో లక్నోలో జరిగిన కాంగ్రెస్ జాతీయ మహాసభలో నెహ్రూ ప్రపంచ సమస్యల పట్ల జాతీయ ఉద్యమ దృక్పథాన్ని స్పష్టీకరించాడు. మొత్తం మీద భారత జాతీయ నాయకులు రూపొందించిన జాతీయవాదం సంకుచితమైంది, హింసాత్మకమైందికాదు. జాతి దురహంకారాన్ని వ్యతిరేకించటంలో జాతీయ ఉద్యమం ఏనాడు వెనుకంజ వేయలేదు. జాతీయనాయకులు ప్రజలలో బ్రిటీషు ప్రజల పట్ల ఆగ్రహాన్ని, వైషమ్యాన్ని పెంపొందించుకోవద్దని ప్రతీసారీ ఉద్ఘాటిస్తూ వచ్చారు.

భారత స్వాతంత్ర్యోద్యమం విశాల ప్రాతిపదిక కల ఉద్యమం. ఈ ఉద్యమం అనుసరించిన భావజాలం ప్రభావిత పూరితమైంది. ఈ ఉద్యమం వైవిధ్యం కలిగి రాజకీయ, సైద్ధాంతిక స్రవంతులు అంతర్వాహినులుగా ప్రవహించిన ప్రజా ఉద్యమం. ఈ ఉద్యమం అనేక వైవిధ్యాలను కలిగి ఉన్న అధికారవాద తత్వాన్ని ప్రోత్సహించలేదు. అనేక రకాలైన వైవిధ్యాలను తనలో ఇముడ్చుకున్న జాతీయ ఉద్యమం ఒక ఉన్నతమైన భావజాలానికి క్రమశిక్షణకు కట్టు పడింది. అయినప్పటికీ విభిన్న దృక్పథాలకు, ధోరణులకు అతీతంగా మొత్తం భారతదేశ ప్రజలకు ప్రాతినిధ్యం వహించిన కాంగ్రెస్ సైద్ధాంతికపరంగా ఏకత్వం కల వ్యవస్థ కాదు. దీని కారణంగా కాంగ్రెస్ పార్టీ వివిధ సైద్ధాంతిక భావజాలం, వివిధ స్థాయిల నిబద్ధత, సామర్థ్యం కల ప్రజలను కొన్ని ఉమ్మడి లక్ష్యాల కొరకు, ఆదర్శాల కొరకు పోరాటం సాగించేలా సమైక్య పరచగలిగింది. కాంగ్రెస్ తన లక్ష్యాలను ప్రజాస్వామ్యబద్ధంగా సాధించగలిగింది. అనేక కీలక వ్యూహాలు, నిర్ణయాలు మెజారిటీ ప్రజల అభిప్రాయానికి అనుగుణంగా రూపొందించినప్పటికీ, మైనారిటీ ప్రజల భావాలను, అభిమతాలను ఏనాడు విస్మరించలేదు. కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన జాతీయోద్యమంలో అనేక రకాల కులాలు, మతాలు, విధేయతలు, కలిగిన ప్రజలు పాల్గొన్నప్పటికీ వారి మధ్య సామరస్య పూరిత, స్నేహ పూరిత సంబంధాలే ఉన్నాయి. వివిధ కులాలు, మతాలు, వర్గాలు రాజకీయ పార్టీలు కాంగ్రెస్ పట్ల తమ విశాల దృక్పథాన్ని అలవర్చుకున్నాయి.

ఈ విధంగా స్వాతంత్ర్యోద్యమం స్వతంత్ర భారతదేశానికి విభిన్న అభిప్రాయాలు, ప్రయోజనాలు కల ప్రజల మధ్య రాజీ, సామరస్యం, ఏకాభిప్రాయంతో కూడిన రాజకీయ సాంప్రదాయాన్ని వారసత్వంగా అందచేసింది. స్వాతంత్ర్యానంతరం నెహ్రూ నాయకత్వంలో ఏర్పడిన ప్రభుత్వం ఈ సాంప్రదాయ చట్రం పరిధిలోనే జాతీయ విధానాలను రూపొందించింది. అయితే క్రమంగా ఈ సాంప్రదాయం బీటలువారింది. అయినప్పటికీ పటిష్టవంతమైన, సౌభాగ్యవంతమైన భారతదేశాన్ని, న్యాయవంతమైన సమసమాజాన్ని స్థాపించాలనుకునే వారికి జాతీయ ఉద్యమం అమూల్యమైన అనుభవాన్ని, వారసత్వాన్ని అందచేసింది.

జాతీయ ఉద్యమం అత్యున్నతమైన రాజకీయ ప్రవర్తనా ప్రమాణాలను నెలకొల్పింది. గాంధీ, నెహ్రూ, తిలక్, గోఖలే, పటేల్, రాజేంద్రప్రసాద్, రాజగోపాలాచారి, జయప్రకాష్ నారాయణ్, సుభాస్ చంద్రబోస్ వంటి మహోన్నత జాతీయ ఉద్యమ నాయకులు అత్యున్నత నైతిక ప్రమాణాలను నెలకొల్పారు. అత్యుత్తమ నైతిక ప్రమాణాలు కల నాయకత్వాల ద్వారా వారు కోట్లాది భారతీయులను సమీకరించారు. ఈ ఉద్యమం కాలానుగుణ్యంగా మార్పు పొందటంలో గొప్ప సామర్థ్యాన్ని ప్రదర్శించింది.

జాతీయోద్యమం ప్రజల మారుతున్న కోర్కెలకు అనుగుణంగా విప్లవాత్మకమైన పంథాలో ముందుకు సాగింది. సృజనాత్మకమైన, నవకల్పనపూరితమైన జాతీయోద్యమం అనేక మార్గాల్లో సహజ సిద్ధమైంది. ప్రపంచంలో సంభవిస్తున్న ఆలోచనా ప్రక్రియలకు, ఉద్యమాలకు అనుగుణమైంది. రమేశ్ థాపర్ జాతీయ ఉద్యమం ఉత్కృష్ట లక్షణాలను ఈ విధంగా వివరించాడు. జాతీయ ఉద్యమానికి, రాజకీయ, ఆర్థిక స్వాతంత్ర్యం, ఆధునిక ఆర్థిక అభివృద్ధి, అన్ని రూపాలలో అసమానతలను, అణచివేతను అంతమొందించటం, ప్రాతినిధ్య ప్రజాస్వామ్యం, పౌరహక్కులు, అంతర్జాతీయవాదం, స్వతంత్రమైన విదేశాంగ విధానం, భిన్నత్వాల ప్రాతిపదిక మీద జాతి నిర్మాణం, ఈ లక్ష్యాలను సామరస్యాపూరిత రాజకీయాల ద్వారా, అత్యాధునిక సంఖ్యలో ప్రజల మద్దతు ద్వారా సాధించటం అనే లక్ష్యాలకు

బద్ధమై ఉంది. స్వాతంత్ర్య భారతదేశం, జాతీయ ఉద్యమం ఉదాత్తమైన వారసత్వానికి కట్టుబడి ఉంది. ఈ విలువలు రాజ్యాంగంలో, వివిధ రాజకీయ పార్టీల కార్యక్రమాల్లో, ఎన్నికల ప్రణాళికల్లో పొందుపరచబడ్డాయి.

## 2.5. గాంధీ వారసత్వం:

స్వాతంత్ర్యానంతరం భారత రాజకీయాలను జాతీయోద్యమంతో పాటు గాంధీ అనుసరించిన విధానలు, సూత్రాలు ప్రగాఢంగా ప్రభావితం చేశాయి. 1920-21లో గాంధీ ప్రవేశంతో భారత రాజకీయాలు, స్వాతంత్ర్యోద్యమం కీలక మలుపు తిరిగాయి. గాంధీకి కల సమ్మోహనా శక్తి వల్ల ప్రజలు ఆయన చేపట్టిన ఉద్యమాలలో విరివిగా పాల్గొన్నారు. అయితే గాంధీ ప్రవేశంతో భారత రాజకీయాలలో కొన్ని వైరుధ్యాలు చోటు చేసుకున్నాయి. రాజకీయ లక్ష్యాలకు, వాటి వాస్తవ ఫలితాలకు మధ్య వైరుధ్యం ఏర్పడింది. జాతీయ కాంగ్రెస్‌లో గాంధీ నిర్వహించిన పాత్రకు, నెహ్రూ, పటేల్ వంటి ఇతర నాయకులు నిర్వహించిన పాత్రకు మధ్య వ్యత్యాసం ఉంది. గాంధీ దేశ పాలనలో పాల్గొనకపోయినప్పటికీ ఆచరణాత్మక రాజకీయాలలో కీలక పాత్రను పోషించాడు. కాంగ్రెస్ దైనందిన కార్యకలాపాల నిర్వహణ, స్వాతంత్ర్యానంతరం ప్రభుత్వ నిర్వహణా బాధ్యతలను నెహ్రూ, పటేల్‌లకు అప్పగించాడు. ఈ విధంగా జాతీయ ఉద్యమకాలంలో తలెత్తిన వైరుధ్యాలు స్వాతంత్ర్యానంతరం కూడ భారతదేశ రాజకీయాలలో కొనసాగాయి. రాజకీయాలలో మతాన్ని, సామాజిక సంస్థలను ఉపయోగించటాన్ని వ్యతిరేకించే నాయకులు వర్తమాన కాలంలో రాజకీయ పరమైన మనుగడను కొనసాగించేందుకు మతాన్ని ఉపయోగించడం లేదా ప్రజాకర్షణ పై ఆధారపడడం అవసరమని గుర్తించారు. సినిమాలలో మతపరమైన పాత్రలను పోషించి ప్రసిద్ధి చెందిన కొందరు సినీ నటులు రాజకీయాలలో ప్రవేశించి, ఉన్నత పదవులను అలంకరించటం దీనికి దృష్టాంతంగా పేర్కొనవచ్చును.

అయితే ప్రస్తుత భారత రాజకీయాలలో చోటు చేసుకున్న వైరుధ్యాలు గాంధీజీ ఆశించిన తరహా వైరుధ్యాలు కావు. గాంధీ నైతిక అధికారాన్ని, రాజకీయాల నుంచి వేరుపర్చాలని ఉద్ఘాటించాడు. గాంధీ రాజకీయ అధికారం లేదా పదవులు అవినీతికి దారి తీస్తాయని పేర్కొన్నాడు. గాంధీ అభిప్రాయం ప్రకారం వ్యక్తులు తమ వ్యక్తిగత బలహీనతలను అధిగమించడం దేశానికి స్వాతంత్ర్యాన్ని సముపార్జించటం కన్నా ముఖ్యం. గాంధీ తన ప్రజా ఉద్యమాలలో సహాయ నిరాకరణ, ప్రభుత్వ పదవులను తిరస్కరించుట వంటి సాంకేతిక పద్ధతులను ఉపయోగించాడు. స్వాతంత్ర్యానంతరం కూడా ప్రజా ఉద్యమాలలో గాంధీ ఉపయోగించిన పద్ధతులను అనుసరించటం దేశ రాజకీయాలలో కల వైరుధ్యాలకు అద్దం పడ్తున్నది.

గాంధీ వల్ల భారత రాజకీయాలకు సంక్రమించిన మరో వారసత్వం ప్రజావ్యవహారాలలో రాజకీయ నాయకులు నిర్వర్తించ వలసిన పాత్ర. ఉద్యమాలకు ప్రజలను సమీకరించటంలో గాంధీ అమోఘమైన నైపుణ్యాన్ని బానిసత్వం నుంచి దేశాన్ని విముక్తి చేసేందుకు ఉపయోగించాడు. అయినప్పటికీ గాంధీ ప్రజల నైతికతను విశ్వసించలేదు. ఆయన ప్రజలను అనైతిక ప్రవర్తన కల, హింసకు పాల్పడే తత్వం కల మూక (mob)గా పరిగణించాడు.

గాంధీ వర్తమాన భారతీయ సమాజం అనేక కులాలుగా, మతాలుగా విభజింపబడిందనే వాస్తవాన్ని విస్మరించలేదు. హిందూ సమాజంలో కల భిన్న వర్గాలను సమర్ధవంతంగా సమైక్యపరిచేందుకు, సమీకరించేందుకు హిందూ మత సంకేతాలను (symbols) ను ఉపయోగించాడు. అంతేకాక గాంధీ ముస్లింలు, హిందువుల మధ్య ఐకమత్యం పెంపొందాలని ఉద్ఘాటించాడు. గాంధీ ప్రతిపాదించిన లక్ష్యాల మధ్య తీవ్ర వైరుధ్యం ఉంది. ఈ వైరుధ్యాన్ని తొలగించటంలో ఆయన వైఫల్యం చెందాడు.

స్వాతంత్ర్యానంతరం అనేక సందర్భాలలో గాంధీ అనుసరించిన ప్రజా సమీకరణ పద్ధతులను ఉపయోగించటం జరిగింది. అయితే ఈ పద్ధతులకు, గాంధీ ఉపయోగించిన పద్ధతులకు మధ్య అనేక వ్యత్యాసాలు ఉన్నాయి. ప్రస్తుత ఉద్యమాలకు ప్రజలను సమీకరించడంలో వాక్ శూరత్వం (demogagy) పద్ధతిని వినియోగిస్తున్నారు. ఎన్నికల్లో విజయాన్ని సాధించటానికి, లేదా మరో ప్రయోజనాన్ని సాధించటానికి అవసరమైన ప్రజల మద్దతును పొందేందుకు మతపరమైన చిహ్నాలను దుర్వినియోగపరచడం తరచుగా

జరుగుతున్నది. ఈ విధంగా గాంధీ జాతీయోద్యమంలో ప్రవేశ పెట్టిన విధానాలు, అనుసరించిన మార్గం స్వాతంత్రానంతరం భారతదేశ రాజకీయాలను శక్తివంతంగా ప్రభావితం చేశాయి.

రజనీకొఠారి జాతీయోద్యమంలో గాంధీ పాత్రను ఈ విధంగా వివరించాడు. గాంధీ జాతీయ ఉద్యమానికి శక్తివంతమైన సంకేతాత్మకత (symbolism)ను, నిగూఢత్వాన్ని, భిన్నత్వాన్ని చేకూర్చడంతోపాటు శక్తివంతమైన సంకేతాలను ఉపయోగించి తన సమ్మోహనా శక్తితో ప్రజలను, కాంగ్రెస్ కార్యకర్తలను ఒక తాటిపైకి తెచ్చారు. పరస్పరం సంబంధం కలిగిన, కార్యశీలకమైన సంకేతాలను అందించటం ద్వారా, గాంధీ సమాజంలోని వివిధ వర్గాలు తమ మధ్య కల అంతరాలను విస్మరించి ఏకమయ్యే పరిస్థితిని సృష్టించగలిగాడు. గాంధీ సాంప్రదాయ వ్యవస్థలైన ధర్మకర్తృత్వం, మితవ్యయం, లౌకిక బాధ్యతల నిర్వర్తనలను ఉపయోగించటం ద్వారా తాను చేపట్టిన వివిధ కార్యక్రమాలకు అవసరమైన వనరులను సమకూర్చగలిగాడు. గాంధీ రాజకీయ, సామాజిక జీవితంలో నైతిక సూత్రాల ప్రాధాన్యతను నిరంతరం నొక్కి చెప్పడం ద్వారా దేశంలోని సాంప్రదాయ వర్గాల మద్దతును సంపాదించగలిగాడు. దేశంలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాల మధ్య సాంప్రదాయ, ఆధునిక జీవన విధానాల మధ్య కల అంతులేని అగాధాన్ని తొలగించటం జాతి నిర్మాతగా గాంధీ చేసిన అత్యుత్తమ సేవ. గాంధీ ఉమ్మడి నైతికతను, వ్యవస్థీకృత పౌర సంస్కృతిని ప్రవేశపెట్టడం ద్వారా హిందూమతంలోని గొప్ప లోపాన్ని తొలగించగలిగాడు. ఇది గాంధీ సాధించిన విజయాలలో అత్యంత ఉత్కృష్టమైంది. సంస్థల నిర్మాణం, వ్యవస్థల్లో క్రమశిక్షణలపై గాంధీజీ కనపరిచిన వక్కాణింపు, మతం కేవలం వ్యక్తిగతమయినదన్న అభిప్రాయం ఆయన దేశానికి అందించిన ఉత్కృష్టమైన వారసత్వం.

## 2.6. సారాంశం:

ఈ పాఠంలో ఆధునిక భారత రాజకీయాలను వివిధ వారసత్వాలు ఏ విధంగా ప్రభావితం చేసాయో వివరించబడింది. అనాదిగా భారతదేశ సమాజంలో చెక్కు చెదరకుండా కొనసాగుతూ వస్తున్న హిందూమతం, ఈ మతం ప్రధాన లక్షణాలైన కులవ్యవస్థ, ఆచారాలు, సంప్రదాయాలు, భారత రాజకీయాలను ప్రగాడంగా ప్రభావితం చేశాయి. భారతదేశంలో దాదాపు నాలుగు శతాబ్దాలపాటు కొనసాగిన బ్రిటిష్ వలస పాలన భారత రాజకీయాలను, పాలనా వ్యవస్థను అనేక రూపాలలో ప్రభావితం చేసింది. బ్రిటిషు పాలన స్వాతంత్ర్యానంతర భారతదేశంలో ఏర్పడిన పార్లమెంటరీ వ్యవస్థకు, ఇతర ప్రజాస్వామ్య సంస్థలకు నేపథ్యం ఏర్పరచింది. 19, 20 శతాబ్దాలలో భారతదేశంలో ఉధృతంగా సాగిన స్వాతంత్ర్యోద్యమం ఏర్పరచుకున్న ఉత్కృష్ట విలువలు, ఆదర్శాలు, లక్ష్యాలు, భారతరాజ్యాంగాన్నే కాక, రాజకీయాలను, ప్రభుత్వ విధానాలను అమితంగా ప్రభావితం చేశాయి. వీటన్నిటికంటే స్వాతంత్ర్య సమరంలో గాంధీ ఉపయోగించిన ఉదాత్తమైన సాధనాలు, ప్రబోధించిన మహోన్నత విలువలు, ఆదర్శాలు, ఆధునిక భారత రాజకీయ జీవితాన్ని తీర్చి దిద్దటంలో కీలక పాత్ర వహించాయి. ఈ అంశాలన్నిటిని ఈ పాఠంలో సమగ్రంగా వివరించటం జరిగింది.

## 2.7. మాదిరి ప్రశ్నలు:

1. భారతదేశ రాజకీయాల చారిత్రక నేపథ్యాన్ని వివరించండి ?
2. భారత రాజకీయాలపై బ్రిటిషు వలస పాలన ప్రభావాన్ని పరిశీలించండి ?
3. భారత జాతీయోద్యమం లక్ష్యాలను, ఆదర్శాలను వివరించి, ఆధునికి భారత రాజకీయాలపై వాటి ప్రభావాన్ని పరిశీలించండి?
4. ఆధునిక భారత రాజకీయాలపై గాంధీ వారసత్వాన్ని అంచనా వేయండి ?

## 2.8. సంప్రదింపు గ్రంథాలు:


- Bipin Chandra, India After Independence, 1947 - 2000, New Delhi: Panguin Books, 2000.
- Paul R. Brass, The Politics of India, since Independence, Second Edition, Cambridge, Cambridge University Press, 2001.

- Rajani Kothari: Politics in India, New Delhi Orient Longman, 1980.
- Anstin, Granvelli, Working a Democratic Institution: The Indian Experience, New Delhi: Oxford University Press, 1999.
- W.H. Morris - Jones, The Government and Politics of Indian, Winston: Huntington, 1987.
- Rajani Kothari, Caste in Indian Politics, New Delhi: Orient Longman, 1970.


**రచయిత : ఎమ్. బాపూజీ**

## పాఠం - 3

# భారత రాజ్యాంగ నిర్మాణం, మౌలిక లక్షణాలు

**విషయ క్రమం:**


**3.0. లక్ష్యం**

**3.1. ఉపోద్ఘాతము**

**3.2. రాజ్యాంగ ఆవిర్భావం**

3.2.1. రాజ్యాంగ పరిషత్తు

3.2.2. రాజ్యాంగ నిర్మాణం

**3.3. రాజ్యాంగం - ముఖ్య లక్షణాలు**

3.3.1. స్వతంత్ర, సర్వ సత్తాక, ప్రజాస్వామిక, లౌకిక, సామ్యవాద, గణతంత్ర రాజ్యాంగం

3.3.2. పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థ

3.3.3. ప్రాథమిక హక్కులు

3.3.4. ఆదేశిక నియమాలు

3.3.5. ప్రాథమిక విధులు

3.3.6. సమాఖ్య ప్రభుత్వం

3.3.7. ప్రవేశిక

3.3.9. సుధీర్ఘ, లిఖిత రాజ్యాంగం

3.3.10. ధృఢ - అధృఢ రాజ్యాంగము

3.3.11. లౌకిక రాజ్యము

3.3.12. గణతంత్ర రాజ్యము

3.3.13. సంక్షేమ రాజ్యము

3.3.14. స్వతంత్ర్య న్యాయ వ్యవస్థ

3.3.15. రాజ్యాంగ సవరణ

3.3.16. ఏక పౌరసత్వం

3.3.17. సార్వజనీన వయోజన ఓటు హక్కు

**3.4. సారాంశము**

**3.5. మాదిరి ప్రశ్నలు**

**3.6. సంప్రదింపు గ్రంథాలు**


## 3.0. లక్ష్యం:

భారతదేశ రాజకీయ వ్యవస్థకు మూలాధారమైన రాజ్యాంగం, దాని ఆవిర్భావం, లక్షణాలు, రాజ్యాంగ పరిషత్తు, పాత్ర రాజ్యాంగ లక్షణాలు మొదలైన అంశాలను తెలియపరచటమే ఈ పాఠం లక్ష్యం.

## 3.1. ఉపోద్ఘాతం:

మూడో ప్రపంచ దేశాల్లో చాలా దేశాలు పాశ్చాత్య సామ్రాజ్యవాద ఆధిపత్యం నుంచి రాజకీయ విముక్తిని పొందినవే. భారత దేశంతో సహా కొత్తగా స్వాతంత్ర్యం పొందిన దేశాలు జాతీయ పునర్నిర్మాణం, ఆర్థిక, సాంఘిక పరివర్తన అనే రెండు లక్ష్యాల సాధనే తమ కీలక కర్తవ్యంగా భావించాయి. భారతదేశంలో బ్రిటీషు వారి రాజకీయ పరిపాలనకు వ్యతిరేకంగా భారత జాతీయ నాయకులు భావిభారత రాజ్యాంగ చట్టమును భారతీయులే ఏర్పాటు చేసికొనవలయునని వాదించారు. ఈ ప్రతిపాదనను మొదట బ్రిటీషు ప్రభుత్వం వ్యతిరేకించినప్పటికీ 1942లో సర్‌స్టాఫర్డ్ క్రిప్సు బ్రిటీషు మంత్రివర్గ ప్రతిపాదనలతో భారతదేశాన్ని సందర్శించిన సమయంలో అంగీకరించారు. భారత జాతి చాలా క్లిష్ట పరిస్థితిలో ఉన్న దశలో రాజ్యాంగ పరిషత్తు సమావేశమైంది. రాజ్యాంగాన్ని రూపొందించే ముందు భారతదేశ సాంఘిక-ఆర్థిక స్వరూపాన్ని దృష్టిలో ఉంచుకొని సుదీర్ఘంగా విశ్లేషించాలని భారతదేశం విభిన్న సంస్కృతుల సమ్మేళనం అని కులాలు, మతాలు, విభిన్న తెగలు, విభిన్న సాంఘిక, రాజకీయ, ఆర్థిక అభివృద్ధి స్థాయిల్లో ఉన్న భారతదేశానికి తగిన రీతిలో రాజ్యాంగాన్ని రాజ్యాంగ నిర్మాతలు రచించారు.

## 3.2. రాజ్యాంగం ఆవిర్భావం:

భావి భారత రాజ్యాంగాన్ని రాజ్యాంగ పరిషత్తు ద్వారా ఏర్పాటు చేసేందుకు 1946 మార్చి '15'వ తేదీన అప్పటి బ్రిటిషు ప్రధాని ఒక ప్రకటన చేశారు. భారతదేశములో అమలులో ఉన్న ప్రభుత్వమును ఏ రూపంలో ఉండాలో నిర్ణయించవలసిన బాధ్యత భారతీయులదేనని ఆ ప్రకటన సారాంశము. ఈ ప్రకటన ఆధారంగా 1946 జులైలో రాజ్యాంగ పరిషత్తుకు ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికలను నాటికి అమలులోనున్న 1935 చట్టము మరియు మంత్రిత్రయ ప్రతిపాదనలలోని నిబంధనల ప్రకారము నిర్వహించారు. ముస్లింలీగ్ ముస్లింలకు కేటాయించిన స్థానాలలో 7 మినహాయించి మిగిలినవి గెలుచుకున్నది. అఖిల భారత కాంగ్రెస్, సాధారణ స్థానములలో ఎక్కువ భాగము అంటే, బ్రిటిషు రాష్ట్రములకు కేటాయించిన 296 స్థానములలో 208 స్థానములను కైవసం చేసికొన్నది. (సాధారణ సీట్లలో 203 సీట్లను, ఒక సిక్కు సీటును, 4 ముస్లిం సీట్లను గెలుచుకున్నది.) ముస్లింలకు ప్రత్యేకంగా కేటాయించిన స్థానములలో పోటీ చేసిన జాతీయ కాంగ్రెస్ ముస్లిం అభ్యర్థులు చాలా మంది ఓడిపోయారు. ముస్లింలీగు సాధారణ నియోజక వర్గంలో నిలబెట్టిన లీగ్ అభ్యర్థులు కూడా ఓడిపోయారు. స్వదేశ సంస్థానాలకు కేటాయించిన 93 స్థానములకు ఆయా సంస్థానాలే ప్రతినిధులను నియమించే పద్ధతి ఆచరించబడింది. 1947 ఏప్రిల్‌లో బరోడా, బికనీరు, జైపూర్, జోధ్‌పూర్, రేవా, ఉదయ్ పూర్, పాటియాల సంస్థానాల ప్రతినిధులు రాజ్యాంగ పరిషత్తులో చేరారు. మిగతా స్వదేశ సంస్థానాల ప్రతినిధులు ఆ తరువాత రాజ్యాంగ పరిషత్తులో పాల్గొన్నారు. కాశ్మీరు, హైదరాబాదు సంస్థానాల ప్రతినిధులు, ఆ సంస్థానాలు భారత దేశంలో విలీనమైన తరువాత రాజ్యాంగ పరిషత్తులో చేరారు. దీని ఫలితంగా రాజ్యాంగం పరిషత్తు మొత్తం సభ్యుల సంఖ్య 389కి పెరిగింది.

### 3.2.1. రాజ్యాంగ పరిషత్:

1935 భారత ప్రభుత్వ చట్టంలోని నిబంధనల ప్రకారం పరోక్ష పద్ధతిలో సభ్యులను ఎన్నుకొని, సార్వజన వయోజన ఓటింగు పద్ధతిలో ప్రత్యక్ష ఎన్నికల పద్ధతి ద్వారా కాక, పరిమిత సంఖ్యలోనున్న ఓటర్లు రాష్ట్ర శాసన సభ్యులను ఎన్నుకొనగా, రాష్ట్ర శాసనసభ సభ్యులను రాజ్యాంగ పరిషత్తు సభ్యులను ఎన్నుకొన్నారు. మతపరమైన నియోజకవర్గాలు ఏర్పడినవి. ముస్లింలకు, శిక్కులకు ప్రత్యేక స్థానాలు కేటాయించబడినవి. రాజ్యాంగ పరిషత్తులో అనాడు దేశములో ఘనతకెక్కిన మేధావులు, ప్రముఖులు, రాజకీయవేత్తలు, రాజనీతిజ్ఞులు, అనుభవజ్ఞులైన పాలనావేత్తలు, ప్రసిద్ధ న్యాయశాస్త్రవేత్తలు సభ్యులుగా ఎన్నికయ్యారు. దేశములోకల అన్ని రంగములకు ప్రాతినిధ్యం ఇవ్వడం జరిగింది. జాతీయ కాంగ్రెస్, ముస్లింలీగ్‌లకు చెందిన ప్రముఖ రాజకీయ నాయకులందరు రాజ్యాంగపరిషత్తులో సభ్యత్వాన్ని పొందారు. జాతీయ కాంగ్రెస్ ఎన్నికలలో తన అభ్యర్థులను ఎంపిక చేయడంలో రెండు ప్రధాన సూత్రములను పాటించింది. మొదటిది, కాంగ్రెస్ అభ్యర్థులు తమ, తమ ప్రాంతములకు ప్రాతినిధ్యం వహించటమేగాక, దేశం మొత్తమునకు ప్రతినిధులుగా వ్యవహరించాలి. రెండవది, పార్టీ ఎన్నిక చేసిన అభ్యర్థులు జాతి చైతన్యమునకు ప్రతీకలుగా ఉండగలగాలి. పార్టీ సభ్యత్వంతో

సంబంధం లేకుండా, దేశంలోని ప్రముఖులు ఆయారంగాలలోని నిష్ణాతులు, రాజ్యాంగ పరిషత్తుకు వచ్చునట్లుగా చూచినది. ఆ విధంగా పార్టీ రాజకీయాలతో సంబంధము లేకుండా రాజ్యాంగ పరిషత్తునకు కాంగ్రెసు తరపున ఎన్నికైన ప్రముఖులలో అల్లాడి క్రిష్ణ స్వామి అయ్యర్, ఎన్. గోపాలస్వామి అయ్యంగార్, బి. ఆర్. అంబేద్కర్, హెచ్. ఎన్. కుంజూ, కె. సంతానం, ఎమ్. ఎ. జయకర్, సచ్చిదానంద సిన్హా, కె. ఆర్. మున్షి మొ॥ వారున్నారు. తేజ్ బహదూర్ సప్రూకి అభ్యర్థిత్వము లభించినప్పటికీ, ఆయన అనారోగ్య కారణాల వలన దానిని తిరస్కరించాడు. దేశంలోని మైనారిటీ వర్గాలకు తగినంత ప్రాతినిధ్యం ఉండునట్లు మరియు మంత్రిత్రయ ప్రతిపాదనల ప్రకారం ముస్లిములకు, శిక్కులకు మతపరమైన స్థానములు కల్పించబడినవి. మైనారిటీ వర్గాలకు, రాజ్యాంగ పరిషత్తులో తగిన ప్రాతినిధ్యం ఉండుటకు చర్యలు తీసుకొంది. మైనారిటీ వర్గములకు తమకిష్టమైన ప్రతినిధులను ఎంపిక చేయుటకు అవకాశమివ్వబడింది. రాజ్యాంగపరిషత్తులో భారతీయ క్రైస్తవులకు చెందినవారు ఏడుగురు, ఆంగ్లో ఇండియన్లు ముగ్గురు, పార్శీలు ముగ్గురు సభ్యులుగా ఎన్నుకొనబడిరి. దేశవిభజన తరువాత రాష్ట్రాలకు కేటాయించిన 233 సీట్లలో 88 స్థానాలకు మైనారిటీ వర్గము ప్రతినిధులు ఉన్నారు. రాష్ట్రంలోని మొత్తం జనాభాలో ముస్లింలతో సహా మైనారిటీ వర్గమువారు 37 శాతం ఉన్నారు. జనాభా ప్రాతిపదికన రాష్ట్రములోని మైనారిటీ వర్గములకు రాజ్యాంగ పరిషత్తులో సభ్యత్వం లభించినది.

రాజ్యాంగ పరిషత్తు నిర్మాణం పై అనేక తీవ్ర విమర్శలు చెలరేగాయి. ఎమ్. ఆర్. జయకర్ మొదలైన రాజ్యాంగనిపుణులు రాజ్యాంగ పరిషత్తు సర్వసత్తాక వ్యవస్థ కాదని వాదించారు. న్యాయశాస్త్ర దృష్టితో పరిశీలిస్తే ఈ వ్యవస్థను సార్వభౌమాధికారం కల వ్యవస్థగా పరిగణించలేము. మంత్రిత్రయ ప్రతిపాదనల ప్రకారం బ్రిటిషు ప్రభుత్వంచే సృష్టించబడిన వ్యవస్థ దానిని తొలగించే అధికారం బ్రిటిషు ప్రభుత్వానికి మాత్రమే ఉంది.

## 3.2.2. రాజ్యాంగ నిర్మాణం:

రాజ్యాంగ పరిషత్తు మొదటి సమావేశం 1946 డిశెంబరు 9న జరిగింది. చివరి సమావేశం 1950 జనవరి 24న జరిగింది. ముసాయిదా రాజ్యాంగ చట్టము పరిశీలన, ఆమోదం 1949 నవంబరు 26న జరిగిన సమావేశంతో ముగిసింది. రాజ్యాంగ చట్టమును రూపొందించుటకు జాతీయ నాయకులకు 2 సంవత్సరాల 11 నెలల 18 రోజుల సుదీర్ఘ కాలము పట్టినది. రాజ్యాంగ పరిషత్తు ద్వారా తయారు చేయబడి 26, జనవరి 1950 అమలులోనికి వచ్చిన నూతన భారత రాజ్యాంగ శాసనానికి అనేక మౌలిక లక్షణాలున్నవి.

రాజ్యాంగ రచనా కమిటీ ఇతర దేశాల రాజ్యాంగాలను పరిశీలించి మనదేశానికి అవసరమని భావించిన అనేక అంశాలను స్వీకరించింది. ప్రజాస్వామ్య దేశాలైన అమెరికా, కెనడా, ఐర్లాండు, ఆస్ట్రేలియా మొదలగు దేశాల నుండి ఈ అంశాలను గ్రహించటం జరిగింది. రాజ్యాంగంలోని ఆదేశ సూత్రాలను ఐరిష్ రిపబ్లిక్ నుంచి గ్రహించారు. జర్మనీ రాజ్యాంగం నుంచి భారత అధ్యక్షుడి అత్యవసర అధికారాలను గ్రహించడం జరిగింది. 1935 చట్టం నుంచి కొన్ని ముఖ్యాంశాలను యధాతధంగా స్వీకరించి భారత రాజ్యాంగంలో చేర్చటం జరిగింది. దీని ఫలితంగా భారత రాజ్యాంగం సుదీర్ఘమైనదే కాక అతిపెద్ద వ్రాతప్రతి అయింది. యూనియన్, రాష్ట్ర ప్రభుత్వాల అధికారాలను విడివిడిగా వివరంగా చెప్పడం వల్ల కూడా భారత రాజ్యాంగం పరిమాణం పెరిగింది. భారత రాజ్యాంగం అనేక రాజ్యాంగాల మిశ్రమం అయినప్పటికీ భారతదేశ పరిస్థితులకు, విలువలకు తగినట్లుగా మలచడం వల్ల రాజ్యాంగానికి కొన్ని ప్రత్యేక లక్షణాలు ఏర్పడ్డాయి. కాని కొంత మంది "Indian Constitution is nothing but a bag of borrowings" (“అతుకుల బొంత”)అని విమర్శించారు. దేశ చరిత్రను, సంస్కృతిని అవసరాలను అది ప్రతిబింబించుట లేదనే మరో విమర్శ ఉంది. అయినప్పటికీ భారత రాజ్యాంగం సర్ ఐవర్ జెన్నింగ్స్ అన్నట్లు “ప్రపంచములో కెల్లా అతి సుదీర్ఘం, విపులం అయిన రాజ్యాంగం”.

భారత రాజ్యాంగం విభిన్న ప్రయోజనాలకు, ఆదర్శాలకు నిలయం. రాజ్యాంగంలో ప్రస్తుతం 395 అధికరణలు, 12 షెడ్యూల్స్ ఉన్నాయి. రాజ్యాంగ పరిషత్తు “ఐరావతాన్ని” చిహ్నంగా తీసుకోవడం వల్ల రాజ్యాంగం కూడా అదే రూపం దాల్చిందని

కొందరు చమత్కరించారు.

## 3.3. భారత రాజ్యాంగం ముఖ్య లక్షణాలు:

### భారత రాజ్యాంగం లక్షణాలలో ప్రధానమైనవి ఈ క్రిందివి:

1. సర్వస్వతంత్ర సర్వసత్తాక ప్రజాస్వామ్య గణతంత్ర రాజ్యాంగం
2. పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థ
3. ప్రాథమిక హక్కులు
4. ప్రాథమిక విధులు
5. ఆదేశిక సూత్రాలు
6. సమాఖ్య ప్రభుత్వము
7. సంక్షిప్త, నిర్దుష్టమైన ప్రవేశిక
8. ప్రపంచంలోని రాజ్యాంగాలన్నిటిలో పెద్దదైన లిఖిత రాజ్యాంగము
9. లౌకిక రాజ్యము
10. సంక్షేమ రాజ్యము
11. ఏకీకృత న్యాయ వ్యవస్థ
12. ఏక పౌరసత్వం
13. సార్వజనీన వయోజన ఓటు హక్కు

### 3.3.1. సర్వసత్తాక ప్రజాస్వామ్య, సామ్యవాద, లౌకిక గణతంత్ర్య రాజ్యం (Sovereign Democratic, Socialist Secular Republic):

భారత రాజ్యాంగం ప్రవేశికతో ప్రారంభమవుతుంది. ప్రవేశిక రాజ్యాంగానికి ఉపోద్ఘాతం వంటిది. జవహర్‌లాల్ నెహ్రూ ప్రతిపాదించిన లక్ష్యాల తీర్మానమే రాజ్యాంగ పీఠికగా మారినది. భారత దేశాన్ని సర్వసత్తాక ప్రజాస్వామ్య గణతంత్ర రాజ్యంగా ప్రవేశిక వర్ణించింది. "లౌకిక సామ్యవాద" పదాలను రాజ్యాంగం 42వ రాజ్యాంగ సవరణ ద్వారా చేర్చడం జరిగింది. దాని ప్రకారం భారత రాజ్యాంగ ప్రవేశిక యథాతథంగా ఈ విధంగా ఉంది. "భారత ప్రజలమైన మేము భారత దేశాన్ని సర్వసత్తాక, సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామ్య, గణతంత్ర రాజ్యంగ నిర్మించుకొనేందుకూ; పౌరులందరికీ సాంఘిక, ఆర్థిక, రాజకీయ న్యాయాన్ని, ఆలోచన, భావ ప్రకటన, విశ్వాసం, ధర్మం, ఆరాధనలలో స్వాతంత్ర్యాన్ని, అంతస్తుల్లోను, అవకాశాల్లోనూ, సమానత్వాన్ని చేకూర్చడానికి వారందరిలో వ్యక్తి గౌరవాన్ని, జాతీయ ఐక్యతను, సమైక్యతను సంరక్షిస్తూ, సౌభ్రాతృత్వాన్ని పెంపొందించడానికీ, ఈ 1949 నవంబరు 26వ తేదీన మా రాజ్యాంగ పరిషత్తులో ఎంపిక చేసుకొని, శాసనంగా రూపొందించుకొన్న ఈ రాజ్యాంగాన్ని మాకు మేము అంకితం చేసుకుంటున్నాం".

మన దేశం మీద ఏ ఇతర రాజ్యానికి ఎటువంటి అధికారం లేదు మనదేశం సర్వస్వతంత్రమైనది, అంటే ఇతర దేశాలతో మనకు ఎటువంటి సంబంధము లేదనిగానీ, ఉండరాదనీకానీ భావించరాదు. ఏ ఇతర రాజ్యాల ఆజ్ఞలకు లోబడి మనదేశం నిర్ణయాలు తీసుకొననవసరం లేదు. మనది ప్రజాస్వామ్య గణతంత్ర రాజ్యము. అంటే రాజ్యాధికారం రాజు చేతిలో ఉండదు. రాజ్యాన్ని పాలించే ప్రతినిధులను, పరిమిత కాలం కోసం ప్రజలు ఎన్నుకొంటారు. ఎన్నికైన ప్రతినిధులను ప్రజలు బలవంతంగా కాక శాంతివంతంగా ఎన్నిక ద్వారా తొలగించి వారి స్థానంలో ఇతరులను ఎన్నుకుంటారు. అధికారుల చర్యలను స్వేచ్ఛగా విమర్శించడానికి ప్రజలకు, ప్రజా సంఘాలకు హక్కు ఉంది. గణతంత్ర వ్యవస్థ వలన బ్రిటీషు రాజు లేదా రాణిని రాజ్యాంగ అధినేతగా గుర్తించే అవసరం తొలగిపోయింది. వీరికి భారతీయులు సిద్ధాంత రీత్యానైనా విధేయత ప్రకటించే అలవాటు రద్దయింది. 1947 నుండి 1950 వరకు

కొనసాగిన అధినివేశన ప్రతిపత్తి స్థానంలో సంపూర్ణ స్వేచ్ఛతో కూడిన సర్వసత్తాక రాజ్యము అవతరించింది. 1950 జనవరి 24న జరిగిన రాజ్యాంగ పరిషత్తు ఆఖరి సమావేశంలో డా॥ రాజేంద్రప్రసాద్‌ను మొట్టమొదటి గణతంత్ర రాజ్యపు అధ్యక్షునిగా ఎన్నుకొన్నారు.

## 3.3.2. పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థ :

మన రాజ్యాంగం కేంద్రంలోనూ, రాష్ట్రాల్లోనూ పార్లమెంటరీ ప్రభుత్వ విధానాన్ని ఏర్పరచింది. అమెరికాలోని అధ్యక్ష ప్రభుత్వ పద్ధతిని, స్విడ్జర్లాండ్‌లోని "సమ్మేళన(collegiate) ప్రభుత్వ పద్ధతిని, బ్రిటన్‌లోని పార్లమెంటరీ ప్రభుత్వ పద్ధతిని కూలంకషంగా చర్చించి చివరకు పార్లమెంటరీ ప్రభుత్వ విధానమే ఉత్కృష్టమైందని రాజ్యాంగ నిర్మాతలు నిర్ణయించారు. 1919 నుంచి కొంత వరకు, 1935 తరువాత చాలా వరకు పార్లమెంటరీ విధానాన్ని అనుసరించి దేశపాలన జరగడం వల్ల ఇది అలవాటైన విధానం అయింది. బ్రిటన్‌లో ప్రభుత్వ విధానం కూడా ఇదే కావడం వల్ల కూడా ఇది రాజ్యాంగ కర్తలను ఆకర్షించింది.

స్వాతంత్ర్యానంతరం భారతదేశం పార్లమెంటరీ ప్రభుత్వ విధానాన్ని అవలంభించింది. ప్రవేశికలో స్పష్టంగా ప్రజాస్వామ్య పదమునే ప్రస్తావించినప్పటికిని, రాజ్యాంగ శాసనములోని నిబంధనల ద్వారా ముఖ్యముగా 74,78 అధికరణల వలన పార్లమెంటరీ ప్రభుత్వాన్ని ఏర్పరచారు. 1945 లోని సప్రూ నివేదిక, దేశంలోని అతిమితవాదులు, మధ్యస్తులు, మతవాదులు ప్రకటించిన రాజ్యాంగ విధానాలు, మార్క్సిస్టులు, సోషలిస్టులు, ఎమ్. ఎన్. రాయ్, హిందూ మహాసభ: మొ॥ వారు కూడా పార్లమెంటరీ విధానాన్నే కోరారు. 'ది కామన్‌వెల్త్ ఆఫ్ ఇండియా' బిల్లు నెహ్రూ కమిటి నివేదిక పార్లమెంటరీ విధానాన్నే ప్రతిపాదించింది. కేంద్ర-రాష్ట్రాలలో దీని ఫలితంగా పార్లమెంటరీ విధానాన్ని స్థాపించారు. మంత్రివర్గపాలిత ప్రభుత్వంలో రాజ్యాధిపతి, ప్రభుత్వాధిపతి అనే ఇద్దరు కార్యనిర్వాహకాధిపతులుంటారు. ప్రధానమంత్రి నాయకత్వం వహించే మంత్రిమండలి ఉంటుంది. ఇది సమిష్టి బాధ్యత సూత్రంపై పని చేస్తుంది. అంటే మంత్రి మండలి పార్లమెంటుకు ముఖ్యంగా లోక్ సభకు బాధ్యత వహిస్తుంది. పార్లమెంటుకు ప్రభుత్వంపై నియంత్రణ ఉంటుంది. అవిశ్వాస తీర్మానం ద్వారా పార్లమెంటు ప్రభుత్వాన్ని తొలగిస్తుంది. పార్లమెంటరీ ప్రభుత్వంలో మంత్రులు తమ అధికారాలు, విధుల నిర్వహణలో పార్లమెంటుకు జవాబుదారీగా ఉంటారు. ఈ సూత్రం రాష్ట్రాలకు కూడా వర్తిస్తుంది.

## 3.3.3. ప్రాథమిక హక్కులు:

ప్రజాస్వామిక వ్యవస్థకు పునాది ప్రాథమిక హక్కులు. మనదేశ రాజ్యాంగంలో ప్రాథమిక హక్కులు అతి ప్రధానమైనవి. ఇవి రాజ్యాంగములోని మూడవ భాగంలో 12 నుంచి 35 నిబంధనలలో వివరించబడ్డాయి. అవి ఆరు రకాలు :

1. సమానత్వపు హక్కు (Right to Equality)
2. స్వాతంత్ర్యపు హక్కు (Right to Freedom)
3. పీడనాన్ని నిరోధించే హక్కు (Right against Exploitation)
4. మత స్వాతంత్ర్యపు హక్కు (Right to Freedom of Religion)
5. సాంస్కృతిక విద్యావిషయక హక్కు (Cultural and Educational Rights)
6. రాజ్యాంగ పరిహారపు హక్కు Right to Constitutional Remedies)

ఆస్తి హక్కును ప్రాథమిక హక్కుల నుండి 1977లో 44వ రాజ్యాంగ సవరణ ద్వారాతొలగించారు.

## 3.3.4. నిర్దేశక నియమాలు:

ఇతర రాజ్యాంగాల్లో లేని ఒక విశిష్టత, ప్రత్యేకత భారత రాజ్యాంగానికి ఉంది. అదే ఆదేశిక సూత్రాలను రాజ్యాంగంలో

చేర్చటం. రాజ్యాంగం నాల్గవ భాగంలో చేర్చబడిన ఆదేశ సూత్రాల లక్ష్యము శ్రేయోరాజ్య స్థాపన. సామాజిక లక్ష్యాల సాధన కొరకు, తరతరాలుగా సామాజిక వ్యవస్థలో పాతుకొని పోయిన అవరోధాలను తొలగించడానికి, జాతికి నూతన ధ్యేయాలను ఏర్పరచటానికి ఆధునిక భావనయైన సమసమాజాన్ని సంక్షేమ రాజ్యాన్ని సాధించటానికి అవసరమైన మార్గదర్శకాన్ని ఇవ్వటం ఈ ఆదేశిక సూత్రాల లక్ష్యం. ప్రాధమిక హక్కులు, నిర్దేశిక నియమాలు పరస్పర పోషకాలు. ప్రాధమిక హక్కులు ప్రభుత్వ అధికారాన్ని పరిమితం చేసి ప్రభుత్వం ఏది చేయకూడదో చెబుతాయి. ఆదేశిక సూత్రాలు ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి ఏమి చేయవలెనో నిర్దేశిస్తాయి. ప్రాధమిక హక్కులు రాజకీయ ప్రజాస్వామ్యాన్ని ఏర్పరిస్తే, ఆదేశ సూత్రాలు సాంఘిక, ఆర్థిక ప్రజాస్వామ్యాన్ని ఏర్పరుస్తాయి. ఆదేశిక సూత్రాలు ప్రభుత్వం కర్తవ్యం నిర్వహణలో ప్రాధమికమైనవి.

## నిర్దేశక నియమావళిలోని ముఖ్యమైన సూత్రాలు:

### నిర్దేశిక నియమాలలో ప్రధానమైన నియమాలు ఈ క్రిందివి :

1. సాంఘికంగా, ఆర్థికంగా, రాజకీయంగా, సమాన న్యాయాన్ని పాటించే సామాజిక వ్యవస్థను నిర్మించటం.
2. పౌరులందరికి జీవనోపాధి కల్పించడం.
3. దేశ సంపదలు న్యాయంగా ప్రజలందరికి పంచడం.
4. నైతికంగా, ఆర్థికంగా పీడితులు కాకుండా బాలబాలికలను, యువజనులను రక్షించడం.
5. ప్రజలందరికి ఉద్యోగ అవకాశాలు కల్పించడం.
6. ప్రజలందరికి ఉచితంగా, నిర్బంధంగా ప్రాధమిక విద్య నేర్పడం.
7. నిరుద్యోగులకు, వృద్ధులకు, అంగవికలులకు, దీర్ఘరోగులకు ఉచిత సహాయం చేయడం.
8. స్వయం పాలన స్థానిక సంస్థలుగా పంచాయితీలను ఏర్పరచడం.

## 3.3.5. ప్రాధమిక విధులు (Fundamental Duties):

1976లో చేయబడిన 42వ రాజ్యాంగ సవరణ ప్రకారం 10 ప్రాధమిక విధులు భారత రాజ్యాంగానికి చేర్చబడినవి. వాటిలో ప్రధానమయినవి:

1. రాజ్యాంగమునకు బద్ధులై ఉండాలి.
2. జాతీయ పతాకమును, జాతీయ గీతమును గౌరవించాలి.
3. దేశమును పరిరక్షించాలి.
4. ప్రభుత్వ ఆస్తులను కాపాడాలి.
5. హింసను విడనాడాలి.
6. ప్రజలలో సౌభ్రాతృత్వమును పెంపొందించాలి.
7. సమన్వయమును సాధించాలి.
8. మత, భాష, ప్రాంతీయ, వర్గ బేధముల కతీతముగ ఉండాలి.

## 3.3.6. సమాఖ్య ప్రభుత్వం:

భారతదేశం అనేక రకాల జాతుల, మతాల, సంస్కృతుల, భాషాపరమైన భిన్నత్వాలు కలిగిన అతిపెద్ద దేశం కావడం వలన

ఏదో ఒక రకమైన సమాఖ్య విధానము అవసరమని రాజ్యాంగ నిర్మాతలు దేశానికి సమాఖ్య విధానాన్ని ఏర్పాటు చేశారు. ఇతర సమాఖ్య రాజ్యాలలోవలే మన దేశంలో కూడా రెండు రకాల ప్రభుత్వాలు ఉన్నాయి. అవి: కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు. 7వ షెడ్యూల్ పరిపాలనాధికారాలను మూడు జాబితాలుగా వర్గీకరించి మొదటి జాబితాలోని అంశాలు కేంద్ర ప్రభుత్వం పరిధిలోనివనీ, 2 వ జాబితాలోని అంశాలు రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోనివని, మూడవ జాబితాలోని అంశాలు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఉమ్మడి పరిధిలోనివనీ వర్గీకరించడం జరిగింది. కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల మధ్య అధికార పంపిణీకి పరిమితమైనవే కానీ, రాష్ట్రాల సంపూర్ణ స్వాతంత్ర్యమునకు సంబంధించినవి కావు. రాజ్యాంగ పరిషత్ ఉద్దేశ్య పూర్వకంగా శక్తివంతమైన కేంద్ర ప్రభుత్వం, బలహీనమైన రాష్ట్రాలతో కూడిన సమాఖ్య వ్యవస్థనే స్థాపించింది. ఒకటవ అధికరణ ప్రకారము భారతదేశము A Union of States యే కాని United States of India కాదు. కేంద్ర ప్రభుత్వానికి విశేషమైన అధికారాలివ్వటమేగాక, అత్యవసర పరిస్థితులలో ఏక కేంద్ర ప్రభుత్వంగా పని చేయడానికి అత్యవసరాధికారాలను పొందుపరచారు. ఆనాడున్న రాజకీయ పరిస్థితులు, రోజు రోజుకి మారుతున్న రాజకీయ పరిణామాల వలన, కూడ కేంద్ర ప్రభుత్వమునకు అదనపు అధికారాలు ఇచ్చుట జరిగింది. కేంద్ర ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాల ఫలితం రాష్ట్ర యంత్రాంగాల సహకారము మీద ఆధారపడుతున్నది. కాబట్టి, దీనిని సహకార ప్రాతిపదిక సమాఖ్య విధానముగా కూడా భావించవచ్చునని కొందరు రాజ్యాంగ నిష్ణాతులు వాదించారు.

### 3.3.7. సంక్షిప్త, నిర్దిష్టమైన ప్రవేశిక:

భారత రాజ్యాంగము ప్రవేశికతో ప్రారంభమవుతుంది. దీనిలో రాజ్యాంగము యొక్క లక్ష్యాలను వివరించడం జరిగింది. ప్రవేశికలో భారతదేశాన్ని సర్వసత్తాక, ప్రజాస్వామ్య గణతంత్ర రాజ్యముగ వర్ణించబడింది. 42వ రాజ్యాంగ సవరణ ద్వారా సామ్యవాద, లౌకిక పదాలను కూడా ప్రవేశికలో చేర్చటం జరిగింది.

1. ప్రజలందరికి ఆర్థిక, సాంఘిక న్యాయాన్ని కల్పించుట,
2. అందరికి సమాన అవకాశాలు కల్పించుట,
3. వాక్ స్వాతంత్ర్యమును, భావ స్వాతంత్ర్యమును అందరూ అనుభవించేటట్లు కృషి చేయుట మొ॥నవి రాజ్యాంగ లక్ష్యాలుగా ప్రవేశిక ప్రకటించింది.

### 3.3.8. సుధీర్ఘ, లిఖిత రాజ్యాంగము:

ప్రపంచంలోని రాజ్యాంగాలన్నింటిలో పెద్దదైన లిఖిత రాజ్యాంగము మన భారత రాజ్యాంగం. ఇది ఇతర లిఖిత రాజ్యాంగాలన్నిటికన్న పెద్దది. దీనిలో 396 నిబంధనలు లేక ప్రకరణలు, 12 షెడ్యూళ్ళు కలవు. ప్రపంచంలో ఏ ఇతర రాజ్యాంగం భారత రాజ్యాంగం వలె సుదీర్ఘమైంది, విపులమైంది కాదు. మన రాజ్యాగం స్వల్ప పరిమాణం పొందలేక పోవడానికి కారణం నాటి రాజకీయ, సాంఘిక, పరిస్థితులే. అందువలననే హెచ్. వి. కామత్ భారత రాజ్యాంగ నిర్మాణ సభ చిహ్నమైన 'ఏనుగు'కు తగినట్లుగానే రాజ్యాంగము తయారయిందని వ్యాఖ్యానించారు. మొదటి నుండి కూడా సమాఖ్య వ్యవస్థను ఆశిస్తున్న జాతీయ ఉద్యమ నాయకులలో లిఖిత రాజ్యాంగాన్నే ఏర్పరచవలెనని భావన బలంగా ఉండేది.

### భారత రాజ్యాంగము బృహత్ రూపం దాల్చడానికి కింది అంశాలు దారి తీశాయి :

1. భారత రాజ్యాంగ పత్రంలో కేంద్ర ప్రభుత్వ స్వరూపమే కాక, రాష్ట్ర కేంద్ర పాలిత ప్రాంతాల స్వరూపం గురించి కూడా విపులంగా వివరించబడింది. ఎ. బి. సి. డి. అనే నాలుగు అంచెల రాష్ట్రాల పద్ధతిని వివరించవలసి రావటం కూడా జరిగింది.
2. భారతదేశంలో సాంఘిక, రాజకీయ వ్యవస్థల విభిన్న సంస్కృతులు ప్రతిబింబించవలసి రావటం అనే అంశం రాజ్యాంగం విస్తృతత్వానికి ఒక కారణం కాగా, అదనంగా వివిధ అల్పసంఖ్యాక వర్గాలకు సంబంధించిన జాతి, మత, వర్ణ, ప్రాంతాల ప్రాతిపదిక మీద గిరిజనులు, వెనుకబడిన వర్గాలు, కులాలు, ఆంగ్లో - ఇండియన్‌లకు రాజ్యాంగ రక్షణలను గురించి పేర్కొనడం జరిగింది.

3. రాజ్యాంగంలోని 3వ భాగంలో 12 - 35 వరకు అధికరణలు ప్రాథమిక హక్కుల గురించి విస్తృతంగా వివరించాయి.
4. రాజ్యాంగంలోని 4వ భాగంలో ఆదేశ సూత్రాలు చాలా విపులంగా చర్చించ బడ్డాయి.
5. ప్రాథమిక విధులను రాజ్యాంగంలోని 4వ అధ్యాయంలో చేర్చడం.
6. కేంద్ర రాష్ట్రాలకు సంబంధించిన విస్తృత జాబితాను సమకూర్చటం.
7. అధికారభాష, ప్రాంతీయ భాషల ప్రస్తావన.

## 3.3.9. దృఢ-అదృఢ రాజ్యాంగం:

అమలుపరచిన తరువాత కాలంలో అనేక సవరణలను చేయటం వలన భారత రాజ్యాంగం అత్యంత సరళమైందని కొందరి అభిప్రాయం. దీని ఫలితం దేశ రాజకీయ వ్యవస్థపై ప్రసరించినదని వీరి వాదన. అయితే సిద్ధాంతరీత్యా ఈ వాదన సరికాదని కొందరు ఖండించారు. వీరి వాదన ప్రకారం కొన్ని అధికరణలను సవరించటానికి రాజ్యాంగం సులువైన ప్రకియను ఏర్పరచినప్పటికి మరికొన్ని అధికరణల సవరణలకు ఒక ప్రత్యేకమైన ప్రక్రియను నిర్దేశించింది. ఈ ప్రక్రియ రాజ్యాంగానికి ధృఢత్వాన్ని (rigidity) సంతరించిందని వీరి వాదన. ఏమైనప్పటికీ భారత రాజ్యాంగం ఈ ధృఢ, అధృఢ స్వభావాలను నిర్ధారించటం సులభంకాదు. కొందరు అభిప్రాయపడినట్లు భారత రాజ్యాంగం బ్రిటీషు రాజ్యాంగం మదిరి అతి సరళమైనది కాదు, అమెరికా రాజ్యాంగంలా అతి ధృఢమైంది కాదు. ఈ రెండు రాజ్యాంగాలకు భిన్నంగా భారత రాజ్యాంగం ధృఢ, అధృఢ లక్ష్యాల సమ్మేళనం. అంటే భారత రాజ్యాంగం ఒక కోణంలో పూర్తిగా సరళమైంది, మరో కోణంలో పాక్షికంగా సరళమైంది, పాక్షికంగా ధృఢమైనది. నిశితంగా పరిశీలిస్తే భారత రాజ్యాంగం ప్రధానంగా సరళ రాజ్యాంగం. అయినప్పటికీ సమాఖ్య రాజ్య అవసరాలకు అనుగుణంగా, భారత రాజ్యాంగానికి కొంత ధృఢత్వాన్ని ఆపాదించారని గుర్తించవచ్చును. కె.సి. వేర్ భారత రాజ్యాంగం ధృఢత్వం, అధృఢత్వాల మధ్య సమంజసమైన సమతుల్యతను సాధించిందని పేర్కొన్నారు. ఇదే అభిప్రాయాన్ని ఆస్టిన్ కూడా వెలిబుచ్చారు.

## 3.3.10. లౌకిక రాజ్యం:

1976లో ప్రవేశపెట్టిన 42 రాజ్యాంగ సవరణ చట్టాన్ని అనుసరించి రాజ్యాంగ ప్రవేశికలో లౌకిక (సెక్యులర్) అనే పదాన్ని చేర్చడం జరిగింది. రాజ్యాంగంలో 25 నుండి 28 వరకు గల అధికరణాలు ఈ సిద్ధాంతాన్ని ధృవపరుస్తున్నాయి. భారత రాజ్యాంగంలో మతాభిమానంగానీ, మత ప్రసక్తిగానీ, లేదు. అధిక సంఖ్యాకుల మతానికి కూడ రాజ్యాంగపరంగా గుర్తింపు లేదు. ఐర్లాండ్ రాజ్యాంగం రోమన్‌కాథలిక్ మతాన్ని, నేపాల్ హిందూమతాన్ని, పాకిస్తాన్ ఇస్లామ్ మతాన్ని రాజ్య మతాలుగా గుర్తించారు. కాని హిందువులు ఎక్కువగా ఉన్న భారతదేశం హిందూమతాన్ని అధికార పూర్వకంగా గుర్తించకపోవడం ఒక విశిష్టత. లౌకిక రాజ్యంగా మనదేశం రాజకీయ సుస్థిరతకు, స్వేచ్ఛకు, ఆర్థిక సుసంపన్నతకు, ప్రజా శ్రేయస్సుకు కృషి చేస్తుంది. లౌకిక రాజ్య విధానములో దేశవనరులు, అధికారము, ప్రభావము ఏదో ఒక మత ప్రయోజనాలు పెంపొందించుటకు వినియోగించబడవు. పి.బి. గజేంద్ర గడ్కర్ అభిప్రాయములో లౌకిక విధానము సామాజిక సమస్యల పరిష్కారం కొరకు అచరణయుక్తమైన ప్రభుత్వ విధానము. ప్రతి వ్యక్తి తనకు ఇష్టం వచ్చిన మతమును ఆచరించచ్చు. ఏ ప్రత్యేక మతమును ప్రోత్సహించదు. ప్రభుత్వ పదవుల విషయంలోగాని, ఉద్యోగ నియామకాలలో కాని, విద్యా సంస్థల ప్రవేశంలో కాని మత కారణంతో విచక్షణ చూపదు. గత ఐదు దశాబ్దాల కాలంలో దేశం అనుసరిస్తున్న లౌకిక విధానం అనేక పరిణామాలకు లోనైంది.

## 3.3.11. గణతంత్రరాజ్యం:

భారత రాజ్యాంగ ప్రవేశిక భారతదేశాన్ని గణతంత్ర రాజ్యంగా ప్రకటించింది. గణతంత్రం అంటే రాజ్యాధినేత ప్రజలచేత ఎన్నుకొనబడటం. భారతదేశంలో రాజ్యాధినేత అయిన రాష్ట్రపతిని ప్రజా ప్రతినిధులు పరోక్ష విధానం ద్వారా ప్రతి 5 సంవత్సరాలకు ఒకసారి ఎన్నుకుంటారు.

### 3.3.12. సంక్షేమ రాజ్యం:

భారత రాజ్యాంగ నిర్మాతలు భారత దేశాన్ని ప్రజాస్వామిక దేశంగా మాత్రమేగాక శ్రేయోరాజ్య లేదా సంక్షేమరాజ్య వ్యవస్థగా రూపొందించారు. దేశంలో సామ్యవాద, శ్రేయోరాజ్య స్థాపనే లక్ష్యంగా, దేశ సంపదను ప్రజలందరికి సమానంగా పంపిణీ చేయడం, ఆర్థిక, సాంఘిక రంగాల్లో అందరికీ సమాన అవకాశాలు కల్పించడం, బలహీనవర్గాలకు ప్రత్యేక రక్షణ కల్పించడంతోపాటు వారి అభివృద్ధికి కృషిచేయడం, పౌరులందరికీ ఒకే విధమైన శిక్షాస్మృతిని రూపొందించడం ద్వారా సంక్షేమ రాజ్య స్థాపన జరగాలని రాజ్యాంగం పేర్కొంది. ఆధునిక భావనయైన సమసమాజము (egalitarian society) సంక్షేమ రాజ్య సిద్ధాంతము నుండి ఉద్భవించింది. ప్రజాస్వామ్య వ్యవస్థలో సమానత్వానికి, న్యాయానికి ప్రధాన స్థానముంటుంది. అందరు ఆనందముతో కూడిన జీవితం గడుపుతూ ఉన్నప్పుడే సామాజికన్యాయం నెలకొల్పబడుతుంది. బ్రిటీషువారి పరిపాలనలో భారతీయ సమాజంలో అణచివేతకు గురైన అంశాలను తొలగించి సమానత్వం, న్యాయముతో కూడిన నూతన సమాజ స్థాపనయే రాజ్యాంగచట్ట నిర్మాతలు తమ ప్రధాన ధ్యేయంగా భావించారు. రాజ్యాంగం ఆదేశించిన విధంగా భారత ప్రభుత్వం దేశంలో సంక్షేమ రాజ్యాన్ని స్థాపించేందుకు అనేక చర్యలను చేపడ్తున్నది.

### 3.3.13. స్వతంత్ర్య న్యాయ వ్యవస్థ:

భారత రాజ్యాంగం కార్యనిర్వాహక, శాసన నిర్మాణ శాఖల నుంచి స్వతంత్రం కలిగిన న్యాయవ్యవస్థను ఏర్పరచింది. దేశంలోని న్యాయ వ్యవస్థకు మకుటం సుప్రీంకోర్టు. ఇది భారత రాజ్యాంగానికి ఉన్నత వ్యాఖ్యానకర్త. రాజ్యాంగ విరుద్ధమైన ప్రభుత్వ చర్యలను సుప్రీంకోర్టు, హైకోర్టులు రద్దు చేస్తాయి. పౌరులకు రాజ్యాంగం ప్రతిపాదించిన ప్రాథమిక హక్కులను రక్షిస్తాయి.

భారత న్యాయవ్యవస్థలో సుప్రీంకోర్టు ఉన్నతమైనది. న్యాయమూర్తులు స్వతంత్రముగా, నిష్పాక్షికంగా న్యాయపాలన చేయటానికి అవసరమైన ఏర్పాట్లను రాజ్యాంగం కల్పించింది. రాష్ట్రపతి సుప్రీంకోర్టు - హైకోర్టు న్యాయమూర్తులను నియమించగలడేగాని తొలగించే అధికారములేదు. ఈ అధికారం పార్లమెంటుకే వుంటుంది. పార్లమెంటు వారిని 2/3వంతు మెజారిటీతో మాత్రమే పదవుల నుండి తొలగించగలదు. అమెరికా, స్విట్జర్లాండులో వలె ఇండియాలో ద్వంద్వ న్యాయశాఖలు, కేంద్ర, రాష్ట్రాలకు ప్రత్యేక న్యాయస్థానాలు, ఏర్పాటు చేయబడలేదు. ఇక్కడ ఏకీకృత న్యాయ వ్యవస్థ నెలకొల్పబడింది.

### 3.3.14. రాజ్యాంగ సవరణ:

రాజ్యాంగ శాసన నిర్మాతలు మరీ పరుషము, సరళము కానటువంటి రాజ్యాంగ సవరణ పద్ధతిని ప్రవేశ పెట్టారు. భారత రాజ్యాంగాన్ని మూడు పద్ధతుల ద్వారా సవరించవచ్చును. మొదటి పద్ధతి ప్రకారం పార్లమెంటు రాజ్యాంగంలోని కొన్ని అధికరణలను పూర్తిగా లేక పాక్షికంగా సాధారణ బిల్లులను ఆమోదించిన పద్ధతిలో సవరించవచ్చును. రెండవ పద్ధతి ప్రకారం కొన్ని అధికరణలను సవరించేందుకు పార్లమెంటు ఉభయ సభలలోని 2/3వ వంతు సభ్యుల ఆమోదం అవసరం. మూడవ పద్ధతి ప్రకారం కొన్ని అధికరణల సవరణకు పార్లమెంటులోని ఉభయ సభల మెజారిటీ సభ్యుల ఆమోదంతోపాటు దేశంలోని కనీసం సగం రాష్ట్ర శాసన సభల ఆమోదం, చివరిగా రాష్ట్రపతి ఆమోదం అవసరం.

### 3.3.15. ఏకపౌరసత్వం:

భారత రాజ్యాంగం పౌరులకు ఏక పౌరసత్వాన్ని ప్రసాదించింది. సమాఖ్య ప్రభుత్వంలో ద్వంద్వ ప్రభుత్వ విధానం ఉంటుంది. కనుక సహజంగా ద్వంద్వ పౌరసత్వం కూడా ఉంటుంది. అమెరికాలో ఇదే పద్ధతి ఉన్నది. దీనికి విరుద్ధంగా భారతదేశం ఏక పౌరసత్వానికి ప్రాధాన్యత ఇస్తున్నది. అయితే **2004** వ సంవత్సరంలో ప్రవాస భారతీయులకు, భారతదేశ పౌరసత్వం కూడా ఇవ్వాలన్న నిర్ణయం తీసుకోబడింది.

## 3.3.16. సార్వజనీన వయోజన ఓటు హక్కు:

స్వేచ్ఛాయుతంగా జరిగే ఎన్నికలు ప్రజాస్వామ్యానికి అత్యవసరం. నిష్పాక్షికంగా ఎన్నికలు జరిపించడానికి ఒక స్వతంత్ర ప్రతిపత్తి ఉన్న ఎన్నికల యంత్రాగాన్ని రాజ్యాంగ నిర్మాతలు ఏర్పాటు చేశారు. **18** సం॥లు నిండిన ప్రతి పౌరుడికి ఓటు హక్కును కల్పించడం జరిగింది. షెడ్యూల్డు కులాలకూ, తెగలకూ పార్లమెంటులోనూ, రాష్ట్ర శాసన సభలలోను, స్థానిక సంస్థలలోను కొన్ని స్థానాలను కేటాయించారు. నూతన రాజ్యాంగ చట్టపు మౌలిక లక్షణాలలో ప్రధానమైనది, అత్యంత విప్లవాత్మకమైనది సార్వజనీన వయోజన ఓటు హక్కు. ఇది ప్రజాస్వామ్య రాజకీయ చైతన్యానికి ఒక ఆయుధం వంటిది. ప్రజాస్వామ్యదేశాలలో ప్రజల పోరాటాల ద్వారా, ఆందోళన ద్వారా ఇప్పుడిప్పుడే ఇవ్వబడుతున్న సార్వజనీన ఓటు హక్కును, రాజ్యాంగ పరిషత్తు ప్రజల మీద నమ్మకంతో ఎటువంటి షరతులు లేకుండా ప్రసాదించింది. **1920** నుండి సంపూర్ణ ఓటు హక్కు కొరకు పోరాటం జరుగుచున్నప్పటికీ, బ్రిటిషు వారు ఇవ్వడానికి అంగీకరించలేదు.

## 3.4. సారాంశము:

ఈ పాఠములో వివరించినట్లు భారత రాజ్యాంగం ఎందరో మేధావులు, రాజనీతి పండితులు, న్యాయ శాస్త్రవేత్తలు, రాజకీయవేత్తల సుదీర్ఘ కృషి ఫలితంగా రూపుదిద్దుకొంది. భారత రాజ్యాంగం రచన సామాజిక, నైతిక, రాజకీయ, నేపథ్యం ఈ రాజ్యాంగానికి అనేక విశిష్టతలను సంతరించింది. ప్రపచంలో ఏ దేశ రాజ్యాంగానికి లేని విశిష్టతలు భారత రాజ్యాంగానికి ఎన్నో ఉన్నాయి. సువిశాలమైన, అనేక భిన్నత్వాలు, వైరుధ్యాలతో కూడిన సమాజం అవసరాలకు అనుగుణంగా ఉండటమే భారత రాజ్యాంగం విశిష్టతలలో కీలకమైంది. దేశంలో ప్రజాస్వామ్యం సుస్థాపితం కావటానికి రాజ్యాంగం మార్గదర్శకత్వమే ప్రధాన కారణంగా చెప్పవచ్చును. కాలానుగుణంగా దేశంలో సంభవిస్తున్న పరిణామాలకు అనుగుణ్యతను కనపరచటం ద్వారా భారత రాజ్యాంగం తన విశిష్టతను నిరూపించుకుంది.

## 3.5. మాదిరి ప్రశ్నలు

1. భారత రాజ్యాంగం విశిష్ట లక్షణాలను పేర్కొనము ?
2. భారత రాజ్యాంగం నిర్మాణాన్ని వివరించండి ?
3. భారత రాజ్యాంగం రచనలో రాజ్యాంగ పరిషత్ పాత్రను పరిశీలించండి ?

## 3.6. సంప్రదింపు గ్రంథాలు:


- Bipin Chandra, India After Independence, 1947 - 2000, New Delhi: Panguin Books, 2000.
- Rajani Kothari, Politics in India, New Delhil: Orient Longman, 1980.
- Austin, Granvelli, Working a Democratic Institution: The Indian Experience, New Delhi: Oxford University Press, 1999.
- J.N. Pandey, The Constitutional Law of India, Allahabad: Central Law Agency, 1998.
- M.V. Pylee, Constitutional Government of India, New Delhi: S Chand & Co. 1984.

- D.D. Basu, Introduction to Indian Constitution, New Delhi: Wadhwa and Co. 2001 (19th Edition).
- J.C. Johari, Indian Government and Politics, Delhi: Vishal Publications, 1989.


## పాఠం - 4

# ప్రాథమిక హక్కులు, ఆదేశిక సూత్రాలు

## విషయక్రమం


**4.0. లక్ష్యం**

**4.1. ఉపోద్ఘాతము**

**4.2. ప్రాథమిక హక్కులు**

- 4.2.1 సమానత్వపు హక్కు
- 4.2.2. స్వేచ్ఛ హక్కు
- 4.2.3. పీడనాన్ని నిరోధించే హక్కు
- 4.2.4. మత స్వాతంత్రపు హక్కు
- 4.2.5. సాంస్కృతిక, విద్యావిషయక హక్కు
- 4.2.6. రాజ్యాంగ పరిహార హక్కు
- 4.2.7. ప్రాథమిక హక్కులు - లక్షణాలు
- 4.2.8. ప్రాథమిక హక్కులు - పరిమితులు

**4.3. ఆదేశిక సూత్రాల ప్రాధాన్యత**

- 4.3.1. ఆదేశిక సూత్రాల వివరణ
- 4.3.2. ఆదేశిక సూత్రాల రూపకల్పన
- 4.3.3. ఆదేశిక సూత్రాల అమలు
- 4.3.4. ఆదేశిక సూత్రాల వర్గీకరణ

**4.4. ప్రాథమిక హక్కులు - ఆదేశిక సూత్రాలు**

**4.5. విమర్శ**

**4.6. సారాంశం**

**4.7. మాదిరి ప్రశ్నలు**

**4.8. చదువతగిన గ్రంథాలు**


## 4.0. లక్ష్యం:

భారత రాజ్యాంగంలో పొందుపరచిన ప్రాథమిక హక్కులను, వాటి ప్రాధాన్యతను, ఆదేశిక సూత్రాలను, ఈ రెంటి మధ్య కల సంబంధాలను, ఘర్షణలను వివరించటం ఈ పాఠం లక్ష్యం.

## 4.1. ఉపోద్ఘాతం:

కాబినెట్ మిషన్ ప్రణాళిక రాజ్యాంగ పరిషత్తు నిర్మాణము గురించి ఆమోదించటమేగాక, ప్రాథమిక హక్కులను రాజ్యాంగ చట్టంలో పొందుపరచటానికి అంగీకరించింది. పౌరహక్కులను, మైనారిటీ వర్గాల హక్కులను, గిరిజన, వెనుకబడిన వర్గాల వారి

సమస్యలను పరిశీలించడానికి ఒక సలహా సంఘాన్ని ఏర్పరచాలని సూచించింది. 1947 జనవరి 22న నెహ్రూ ప్రవేశపెట్టిన లక్ష్యాల తీర్మానాన్ని ఆమోదించటంతో రాజ్యాంగ చట్టానికి హక్కుల వ్యవస్థను ఏర్పరచవలసిన బాధ్యత ఏర్పడింది. ప్రాథమిక హక్కులు, మైనారిటీ వర్గాల హక్కులు మొదలైన వాటికి సంబంధించిన నివేదిక తయారు చేయడానికి 1947 ఫిబ్రవరి, 12 న సలహా సంఘం ఎన్నుకోబడింది. ప్రాథమిక హక్కుల ఉపసంఘానికి కృపలాని అధ్యక్షులు కాగా, సభ్యులు శ్రీ.మసాని, కె.టి. షా, రాజకుమారి అమృత్‌కౌర్, అల్లాడి కృష్ణస్వామి అయ్యర్, హర్‌నామ్ సింగ్, ఆజాద్, అంబేద్కర్, జైరామ్‌దాస్, దౌలత్‌రామ్, కె. మ్. మున్షి మొ॥వారు.

ఈ కమిటీ మూడు ప్రధాన ప్రతిపాదనలను చేసింది. అవి:

1. న్యాయబద్ధమైన, న్యాయస్థానములు రక్షించే హక్కులు పొందుపరచబడాలి.
2. కొన్ని హక్కులను ప్రజలందరికి, మరికొన్ని హక్కులను పౌరులకు మాత్రమే వర్తించాలి.
3. ఆ హక్కులను కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల విషయంలో సమానంగా వర్తింప చేయాలి.

ఈ ప్రతిపాదనల ఆధారంగా ప్రాథమిక హక్కుల స్వభావం, పరిధి నిర్ణయించబడింది.

20వ శతాబ్దంలో మారిన రాజకీయ పరిస్థితులు, సిద్ధాంతాల ఫలితంగా పౌర హక్కులకు విశేష ప్రాధాన్యం లభించింది. సమాజంలో ప్రతి పౌరునికి సహజ సిద్ధంగా లభించే హక్కులను ప్రాథమిక హక్కులు అంటారు. భారతీయులకు స్వేచ్ఛా స్వాతంత్ర్యాలతో పాటు, కనీస మౌలిక హక్కులను కల్పించాలని దాదాభాయ్ నౌరోజీ వంటి ప్రముఖ జాతీయ నాయకులు బ్రిటిష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. క్రమంగా ఈ వాదన బలపడుతూ వచ్చింది. బాలగంగాధర్ తిలక్‌వంటివారు "స్వరాజ్యం నా జన్మ హక్కు" అనే, నినాదంతో భారతీయులకు వివిధ హక్కులను కల్పించాలని అనేక ఉద్యమాలు నిర్వహించారు. 1931లో భారత జాతీయ కాంగ్రెస్ ప్రాథమిక హక్కుల తీర్మానం ఆమోదించింది. ప్రతి వ్యక్తికి స్వాభావికంగా లభించే, అతని మనుగడకు, మేథాశక్తి వికాసానికి తోడ్పడే ఈ హక్కులకు భంగం వాటిల్లరాదని, వాటికి భంగం కలిగించే చర్యలను ప్రభుత్వం చేపట్టరాదని భావించడం జరిగింది. ప్రాథమిక హక్కులను రక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే. బ్రిటిష్ పాలననుండి విముక్తి పొందిన నేపథ్యంలో రూపొందించిన భారత రాజ్యాంగంలో ప్రాథమిక హక్కులను పొందుపరచడం జరిగింది. రాజ్యాంగంలోని మూడభాగం 12వ నిబంధన నుండి 35వ నిబంధన వరకు, కల 24 అధికరణలను ప్రాథమిక హక్కులకు కేటాయించారు. ప్రారంభంలో ఏడు రకాల ప్రాథమిక హక్కులు భారత పౌరులకు ప్రసాదించారు. కాని 1978లో 44వ రాజ్యాంగ సవరణ ద్వారా ఆస్తిహక్కు ప్రాథమిక హక్కుల నుంచి తొలగించబడింది.

రాజ్యాంగంలోని నాల్గవ భాగంలో పొందుపరచబడిన ఆదేశిక సూత్రాలు ప్రజాభ్యుదయానికి ప్రభుత్వం ఏమి చేయాలో సూచిస్తాయి. ఆదేశ సూత్రాలు ప్రభుత్వ గమ్యాన్ని సూచిస్తాయి. సమ సమాజ స్థాపనకు దోహదం చేస్తాయి. ఆదేశిక సూత్రాలు రాజ్యాంగంలోని 4వ భాగంలో 36 నుండి 51 వరకు గల అధికరణలలో పొందుపరచబడ్డాయి. వీటిని రాజ్యాంగ నిర్మాతలు ఐర్లాండ్ రాజ్యాంగం నుండి గ్రహించారు. ఇవి 1935 భారత ప్రభుత్వ చట్టంలోని ఆజ్ఞలవంటివని, ఆధునిక రాజ్యాంగాలలోని కొత్త పోకడలకు ఆదేశిక సూత్రాలు నిదర్శనమని డా॥బి.ఆర్. అంబేద్కర్ వర్ణించారు. 1931 నాటి కరాచి కాంగ్రెస్‌తీర్మానం, 1948 నాటి ఐక్యరాజ్య సమితి చేసిన మానవ హక్కుల ప్రకటన, మహాత్మాగాంధి బోధనలు, సామ్యవాద సూత్రాలు వంటి అంశాలు ఆదేశిక సూత్రాల రూపకల్పనకు దోహదపడ్డాయి. ఆదేశ సూత్రాల ముఖ్యలక్ష్యం భారతదేశాన్ని సంక్షేమ రాజ్యంగాను, వర్గరహిత రాజ్యంగాను చేయడమే. రాజ్యాంగ నిర్మాతలు ఆదేశిక సూత్రాలను ప్రజలను పాలించటంలో మౌళికమైనవి ("Fundamental in the governance of the people") అని అభివర్ణించారు. ఆదేశిక సూత్రాలకు న్యాయస్థానాలు రక్షణ కల్పించవు. ప్రజల ఆశయాలను, ఆకాంక్షలను ప్రతిబింబించేవి ఆదేశిక సూత్రాలే. వీటినే నిర్దేశిక నియమాలు అని కూడా అంటారు.

## 4.2. ప్రాథమిక హక్కులు:

1950, జనవరి 26న అమలులోకి వచ్చిన భారత రాజ్యాంగం ఏడురకాల హక్కులను ప్రాథమిక హక్కులుగా సూచించింది. అవి:

1. సమానత్వపు హక్కు (Right to Equality) (అధికరణలు - 14 - 18)

2. స్వేచ్ఛ హక్కు (Right to Freedom) (అధికరణలు - 19 - 22)
3. పీడనాన్ని నిరోధించే హక్కు (Right against Exploitation) (అధికరణలు - 23, 24)
4. మత స్వాతంత్ర్యపు హక్కు (Right to Religious Freedom) (అధికరణలు - 25 - 28)
5. సాంస్కృతిక, విద్యావిషయక హక్కు (Cultural and Educational Rights) (అధికరణాలు - 29, 30)
6. ఆస్తిహక్కు (అధికరణ - 31)
7. రాజ్యాంగ పరిహారపు హక్కు (Right to Constitutional Remedy) (అధికరణ - 32)

1978లో 44వ రాజ్యంగ సవరణ ద్వారా ఆస్తిహక్కును ప్రాథమిక హక్కుల నుండి తొలగించి, ఒక సాధారణ హక్కుగా మార్చివేశారు. అప్పటి నుండి ఆరు రకాల ప్రాథమిక హక్కులు భారత పౌరులకు అందుబాటులో ఉన్నాయి.

### 4.2.1. సమానత్వపు హక్కు:

రాజ్యాంగంలోని 14వ అధికరణం ప్రకారం చట్టం ముందు అందరూ సమానులే, అందరికి సమాన రక్షణ లభిస్తుంది. డైసి సూచించిన న్యాయప్రధాన పరిపాలనకు (Rule of Law) ఈ విధంగా మన రాజ్యాంగంలో ప్రతిపత్తి కల్పించబడింది. మతం, జాతి, కులం, వంశం, జన్మస్థలం అనే వాటిమీద ఆధారపడి రాజ్యం పౌరులను విచక్షణ దృష్టితో చూడటాన్ని నిషేధించారు. 15వ అధికరణ ప్రకారం ప్రతి వ్యక్తికి ఎంతటి ఉన్నతహోదా, ఆస్తి ఉన్నప్పటికీ సాధారణ న్యాయపరిధిలోకి వస్తాడు. 16వ అధికరణ ప్రకారం ఏ ఒక్కరికి ప్రత్యేక ఆదరణ చూపరాదు. వ్యాపార సంస్థలు, హోటళ్ళు వంటి ప్రజా అవసరాలకు ఉపయోగించే బహిరంగ ప్రదేశాలు అయిన దుకాణాలు, షాపులు, బావులు, రహదార్లు, స్నానఘట్టాలు, రోడ్లు, తటాకాలు వంటి వాటిని వినియోగించడంలో ఏ విధమైన నిషేధం విధించడం జరగకూడదు. విద్య, శాసన, న్యాయ, పరిపాలన, రాజకీయ, సాంఘీక వ్యవహారాలలో పౌరులందరికీ సమానమైన ఆదరణ లేదా ప్రోత్సాహం కల్పించడం జరుగుతుంది. ప్రభుత్వ ఉద్యోగాలలో అందరికి సమాన అవకాశాలు కల్పించబడాలి. అయితే కొన్ని వర్గాలవారిని ఉద్యోగాలలో నియమించడానికి, ఆ రాష్ట్రంలో నివసించాలని నిర్దేశిస్తూ పార్లమెంటు శాసనం చేయవచ్చు. 16వ అధికరణలై కేంద్రపాలిత ప్రాంతాన హిమాచల్ ప్రదేశ్, మణిపూర్, త్రిపురలకూ, ఆంధ్రప్రదేశ్‌లోని తెలంగాణా ప్రాంతానికి వర్తించేటట్లు 1957లో పార్లమెంటు ఒక ప్రత్యేక చట్టం చేసింది.

17వ నిబంధన అస్పృస్యతను రద్దుచేయుటమేగాక, దానిని శిక్షింపదగిన నేరంగా పరిగణిస్తున్నది. అనాది నుండి ఆచరించబడుతున్న అంటరానితనం దురాచరమును నిషేధించి నూతన సంబంధాల మీద ఆధారపడిన ఆధునిక సమాజ ఆవిర్భావానికి నాంది పలకడం ఈ నిబంధన ఆశయము. పార్లమెంటు 1955లో అస్పృశ్యత నిషేధ చట్టమును రూపొందించింది. 1976 చట్టము ద్వారా ఈ శిక్షలను కఠినతరం చేసింది.

18వ అధికరణ ప్రకారం సాంఘిక అసమానతలకు అవకాశం కల్పించే బిరుదులను ఎవ్వరూ స్వీకరించరాదు. సైనిక, విద్యా పరమైన బిరుదులు మినహాయించి, ఇతర బిరుదులను ప్రభుత్వము ప్రసాదించరాదు. బ్రిటిషువారిచే ప్రధానం చేయబడిన బిరుదులన్ని రద్దు చేయబడినవి. భారతీయులు లేదా ప్రభుత్వంలో సంబంధించిన లాభదాయక మైన పదవిని నిర్వహించుచున్న ఎవరైనా అధ్యక్షుని ముందు అనుమతి లేకుండ ఇతర దేశాల నుంచి బహుమతులను కాని, జీతభత్యాలను కాని, ఏరకమైన పదవిని కాని స్వీకరించరాదు.

ప్రజాస్వామ్య దేశంలో పౌరులను ప్రోత్సహించుటకు, కార్యకలాపాల పట్ల ఉత్సాహము చూపుటకు ప్రభుత్వం వారి ప్రతిభకు తగ్గట్లు ఏదో ఒక బిరుదును ఇవ్వక తప్పదు. విశిష్టమైన సైనిక, క్రీడారంగాలలో ప్రతిభ గలవారి ఘనంగా సత్కరించడం వలన వారికి స్ఫూర్తినిచ్చినట్లు వుంటుంది. ప్రజా సంక్షేమానికి, లోక కళ్యాణానికి కృషి చేసిన వారికి ఇతర దేశాల బిరుదులు, బహుమతులు, ఇతర ఆర్థికపరమైన బహుమానాలు స్వీకరించుటను భారత ప్రభుత్వం సాధారణంగా అడ్డగించదు. బిరుదులను రద్దు చేయుటలో సమానత్వ భావనయేగాక, దేశ విధేయత సూత్రం కూడా ఇమిడి ఉంది.

## 4.2.2. స్వేచ్ఛ హక్కు:

స్వేచ్ఛ, స్వాతంత్ర్యాల హక్కును 19 నుండి 22 నిబంధనలలో పొందుపరచారు. ఈ భాగం భారతీయులకు వ్యక్తిగతమైన స్వేచ్ఛను ప్రతిపాదిస్తున్నది. పౌరుడు ఉత్తమమైన, సుఖప్రదమైన జీవితం గడుపుటకు రాజ్యాంగంలోని 19వ నిబంధన పౌరులకు ఏడు రకాలైన హక్కులను ప్రసాదించింది. అవి: (1) వాక్‌స్వాతంత్రము, భావప్రకటనా స్వాతంత్ర్యము (2) నిరాయుధంగా, శాంతిపూర్వకంగా సమావేశమయ్యే హక్కు, (3) సంఘాలు స్థాపించుకునే హక్కు, (4) సమాచారం హక్కు, (5) స్థిర నివాసం ఏర్పరచుకునే హక్కు, (6) ఆస్తి సంపాదించుకుని, అమ్ముకొని ఉపయోగించుకునే హక్కు, (7) నచ్చిన వృత్తి, ఉద్యోగం, వ్యాపారం చేసుకునే వృత్తి స్వాతంత్ర్యపు హక్కు. ఆరవ హక్కు అయిన ఆస్తి హక్కును 44వ రాజ్యాంగ సవరణ ద్వారా తొలగించారు.

భావప్రకటన స్వాతంత్ర్యం విస్తృతమైనది. రాజ్యాంగంలో పత్రికా స్వాతంత్ర్యాన్ని గుర్తించక పోయినప్పటికి ఆ స్వేచ్ఛ ఉందని సర్వోన్నత న్యాయ స్థానం వివరించింది. పైన పేర్కొన ఆరు హక్కులు కొన్ని పరిమితులకు లోబడి ఉంటాయి. రాజ్య భద్రత, దేశ సమగ్రత, సార్వభౌమాధికారం, పరరాజ్యాలలతో స్నేహపూర్వక సంబంధాలు, పౌరభద్రత, నైతికత అనే అంశాల మీద ఆధారపడి రాజ్యం కొన్ని సహేతుకైన ఆంక్షలను ఈ హక్కులపై విధించవచ్చు. 19వ అధికారణాన్ని 19(1), 19(2) అనే రెండు భాగాలుగా విభజింపవచ్చు. 19(1) ప్రాథమిక హక్కులను ప్రసాదిస్తుంది. 19(2) నుండి 19 (6) వరకు ఉన్న ఉపనిబంధనలు కల హక్కుల మీద ఆంక్షలను వివరిస్తాయి. పార్లమెంటు శాసనము ద్వారా సహేతుకమైన ఆంక్షలను విధించవచ్చు. ప్రాథమిక హక్కులలో ప్రస్తావించబడిన ఈ పరిమితులు అమెరికా రాజ్యాంగములోని "Police Power" సిద్ధాంతాన్ని పాక్షికముగా క్రోడీకరించుచున్నవి. 1951లో జరిగిన మొదటి రాజ్యాంగ సవరణ వాక్‌స్వాతంత్ర్యము మీద, ఆస్తిహక్కు మీద పరిమితులను విధించింది. ప్రాథమిక హక్కులపై పరిమితుల ఆవశ్యకతను మొదటి సవరణకు చెందిన ఆశయాలు, కారకాల ప్రకటన (Statement of Objectives and Reasons) వివరించింది. 19(2) అధికరణలోని ఆంక్షలకు మూడు అదనపు పరిమితులను చేర్చారు. అవి: (1) ఇతర దేశాలలో స్నేహ సంబంధాలు, సామాజిక భద్రత మరియు నేరమును ప్రోత్సహించుట, 19(2) సెక్షను ప్రకారం - దేశ భద్రతా ప్రయోజనాలు, విదేశాలతో స్నేహ సంబంధాలు, ప్రజా భద్రత, సత్‌ప్రవర్తన, నైతికత, కోర్టుధిక్కారణ, అగౌరవపరచడం, నేరాన్ని ప్రోత్సహించటం ("In the interests of the security of state, friendly relations with foreign states, public order, decency or morality or in relation to contempt of court, defamation or incitement to an offence") కారణాలలో ఏ ఒక్క కారణం వలనైనా 19వ అధికరణ వలన లభించుచున్న స్వేచ్ఛను అదుపు చేయవచ్చును. సమాచార హక్కు నిరపేక్షమైనది కాదు. సాధారణ పరిస్థితులలో శాసన పరిమితులకు లోబడి దేశము మొత్తంలో సంచరించు హక్కు ప్రతి పౌరునికి ఉన్నది. ప్రజాశ్రేయస్సునుద్దేశించి, షెడ్యూలు తెగల ప్రయోజనాలను సంరక్షించుటకు ప్రభుత్వం ఈ హక్కును పరిమితం చేయవచ్చు. పౌరులు తమకు ఇష్టం వచ్చిన పనిని చేపట్టు హక్కును ప్రభుత్వము అర్హతలను విధించటం ద్వారా పరిమితం చేయవచ్చును. 19వ నిబంధన వ్యక్తి సంపూర్ణ జీవనాభివృద్ధికి ప్రాముఖ్యత ఇచ్చినప్పటికి సహేతుకమైన శాసనబద్ధమైన పరిమితులకు లోబడి మాత్రమే పౌరులు వాటిని అనుభవించాలి.

## 4.2.3. పీడనాన్ని లేదా దోపిడీని నిరోధించే హక్కు (Right against Exploitation):

రాజ్యాంగంలోని 23, 24 ప్రకరణలు పీడన నిరోధపు హక్కును పేర్కొంటున్నాయి. బలవంతంగా వెట్టిచాకిరి చేయించుకొనే పద్ధతిని, పడుపువృత్తి మొదలైన అవినీతికర కార్యకలాపాలను 23వ ప్రకరణ నిషేధిస్తుంది. పూర్వం ఫ్యూడల్ వ్యవస్థలో భూస్వాములు పేద ప్రజల చేత బలవంతంగా వెట్టిచాకిరిని చేయించేవారు. దీనిని భారత రాజ్యాంగం నిర్మూలించి, వ్యక్తి స్వేచ్ఛ సమానత్వ భావాలను పెంపొందించింది. కొందరు స్త్రీలు దేవదాసి వృత్తితో బానిస బ్రతుకులు బ్రతికేవారు. ఈ బానిసత్వాన్ని రాజ్యాంగకర్తలు నిషేధించారు.

23(1) నిబంధన మానవ శ్రమను దోచుకోవడము, వ్యక్తులచేత బలవంతముగా పనిచేయించడం మొదలగు అన్ని రకాల శ్రమ దోపిడీని నిషేధించింది. 23(2) సెక్షను సాధారణ ప్రయోజనాల కోసం రాజ్యము పౌరుల శ్రమను బలవంతంగా పొందవచ్చునని వివరిస్తున్నది.

24వ ప్రకరణ 14 సంవత్సరాల వయస్సులోపలి పిల్లలు కర్మాగారాలలో, గనులలో కష్టతరమైన, బాధాకరమైన పనులు చేయడాన్ని నిషేధిస్తుంది. 14 సంవత్సరాల వయస్సు లోపలి పిల్లలను ఉచితంగా ప్రాథమిక విద్యను నేర్పాలనే నిర్దేశిక నియమావళికి ఈ ప్రకరణకు దగ్గర సంబంధం ఉంది.

## 4.2.4. మత స్వాతంత్ర్యపు హక్కు:

భారత రాజ్యాంగ నిర్మాతలు మతపరమైన అల్ప సంఖ్యాక వర్గాల హృదయాలలో భారత రాజ్యాంగ లక్ష్యం అయిన లౌకిక రాజ్య స్థాపన పట్ల ధృఢమైన విశ్వాసాన్ని కలిగించడం కోసం రాజ్యాంగంలోని 25, 26, 27, 28 ప్రకరణల ద్వారా మతస్వాతంత్ర్యాన్ని స్పష్టం చేశారు. దేశ ప్రజలలో 85శాతం హిందువులు. వీరు ప్రాతినిధ్య సంస్థల అధికారాన్ని చేపట్టి ఇతర మత వ్యతిరేక చర్యలను తలపెట్టవచ్చు. ఈ పరిస్థితి ఏర్పడకుండా నివారించటం కోసం, దేశ విభజన సందర్భంగా జరిగిన మతకల్లోలాల దృష్ట్యా, అల్ప సంఖ్యాక మతాల వారికి ప్రత్యేకమైన రక్షణలు ఇవ్వడం జరిగింది. దేశంలో మతాన్ని బట్టి మహమ్మదీయులు, క్రైస్తవులు మొ॥వారు, కులాన్ని బట్టి హరిజనులు, గిరిజనులు, భాషను బట్టి ప్రతి రాష్ట్రంలో ప్రధాన ప్రాంతీయ భాషను మాట్లాడని అల్ప సంఖ్యాక వర్గాలుగా గుర్తించడం జరిగింది.

42వ రాజ్యాంగ సవరణ ద్వారా ప్రవేశికలో రెండు లక్ష్యాలను చేర్చారు. దీని ప్రకారం భారతదేశ గమ్యం "సర్వసత్తాక,, సోషలిస్ట్, లౌకిక, ప్రజాస్వామ్య గణతంత్ర రాజ్యం" ("Sovereign, Socialist, Secular, Democratic Republic) స్థాపన. దీనిలో లౌకిక రాజ్యం (Secular), సామ్యవాదం (Socialist) అనే పదాలను క్రొత్తగా చేర్చారు. ప్రత్యేకంగా ప్రవేశికలో స్వేచ్ఛను గురించి ప్రస్తావించారు. "Liberty of thought, expression, belief, faith and worship" వలన పౌరస్వేచ్ఛ మాత్రమేగాక మతపరమైన స్వేచ్ఛలు కూడా లభిస్తున్నాయి. 25 నుండి 28 నిబంధనలను, మత స్వేచ్ఛా హక్కుగా ప్రాథమిక హక్కులలో పొందుపరిచారు. ఇది భారతదేశంలో నివసించే వ్యక్తులకు, విదేశస్తులకు కూడా వర్తిస్తుంది. మతస్వేచ్ఛకు సంబంధించిన 25వ అధికరణం ప్రకారం ప్రతి వ్యక్తి తన అంతరాత్మ ప్రబోధం ప్రకారం నడచుకోడానికి, మతసంబంధమైన కర్మకాండలను ఆచరించడానికి హక్కు లభిస్తుంది. తనకు నచ్చిన మతాన్ని ప్రయివేటుగానేకాక బహిరంగముగా ప్రచారము చేసుకొనడము, వారిని తన మతములో చేరేటట్లుగా ప్రచారం చేసే హక్కు ఉంటుంది. ఈ నిబంధన ప్రకారం లభించే హక్కులను 3వ అధ్యాయములోని ఇతర హక్కులకు లోబడి మాత్రమే అనుభవించాలి. ఉదాహరణకు పబ్లిక్ ఆర్డరు, నైతికత, ప్రజారోగ్యము, జాతీయ భద్రత మొ॥లైన పరిమితులు. ప్రజాశ్రేయస్సు దృష్ట్యా ప్రజారోగ్యము, ప్రజలలో నైతిక భావాలను దృష్టిలో పెట్టుకొని మత సంబంధమైన కర్మకాండలపై, ప్రభుత్వము ఆంక్షలు విధించవచ్చును.

భారతదేశం లౌకిక రాజ్యం. ఏ మతాన్ని ప్రత్యేకంగా ఆచరించదు. ఏ మతాన్ని అధికార మతంగా గుర్తించదు. ఏ మతస్తులను మతకారణంగా తిరస్కరించదు. లౌకికమనగా మతరాహిత్యం కాదు. అన్ని మతాల విషయంలో సమాన దృష్టిని కలిగి వుండడం.

సాంఘిక శ్రేయస్సును సాధించటానికి ప్రభుత్వం మతపరమైన ఆచరణలలో జోక్యము చేసుకోవచ్చు. వివాహము, విడాకులు, వారసత్వము మొదలైన అంశాల విషయములో సామాజిక ప్రగతి కొరకు అభివృద్ధికరమైన శాసనములను ప్రభుత్వం మత సాంప్రదాయాలను త్రోసిపుచ్చి, చేయవచ్చు.

ఒక ప్రత్యేక మతాన్ని ప్రోత్సహించడం కోసం పన్నులను ఏ వ్యక్తి నుంచి నిర్భంధంగా వసూలు చేయరాదు. ప్రభుత్వ విధానంలో నడిచే ఏ విద్యా సంస్థలోనూ, మత విశ్వాసాలను బోధించకూడదు.

"బలాత్కారం, మోసం, ప్రలోభం" ఆధారంగా మతం మార్చడంగాని, మార్చడానికి ప్రయత్నించడంకాని దండనార్హమైన అపరాధమని మధ్యప్రదేశ్ ప్రభుత్వం ఒక శాసనం చేసింది. ఇది రాజ్యాంగ విరుద్ధమని ఒక క్రైస్తవ మత ప్రచారకుడు - స్టానిస్లాస్ సుప్రీంకోర్టులో దరఖాస్తు పెట్టాడు. దీనిని న్యాయస్థానం త్రోసి పుచ్చుతూ ఈ క్రింది విధంగా తీర్పునిచ్చింది.

ఇతరుల మతం మార్చే హక్కుకు 25(1) అధికరణలో మత ప్రచార స్వాతంత్ర్యం ప్రసాదించరాదు. అది 25(1) అంతరాత్మ ప్రబోధాన్ని మాత్రమే గుర్తిస్తుంది. "బలత్కారం, మోసం, ప్రలోభం" అనేవి మతం మార్పిడికి గురయిన వ్యక్తి స్వేచ్ఛను హరిస్తాయి. మత మార్పిడి వలన ప్రజాభద్రత, నైతికతలకు భంగం వాటిల్లితే రాజ్యం తగిన చర్యలు తీసుకోవచ్చు. శాంతి భద్రతలను కాపాడడం కోసం "బలత్కారం, మోసం, ప్రలోభం" అనే పద్ధతుల ద్వారా మతం మార్పిడి చేస్తే నిషేధించే అధికారం ప్రభుత్వానికుంది".

## 4.2.5. సాంస్కృతిక విద్యా విషయపు హక్కు:

దేశంలోని మతపరమైన, భాషాపరమైన, సాంస్కృతికపరమైన అల్ప సంఖ్యాక వర్గాలను దృష్టిలో పెట్టుకొని రాజ్యాంగంలో సాంస్కృతిక విద్యా సంబంధమైన హక్కులను పొందుపరచారు. భారతపౌరులలో ఏ వర్గానికి అయినా తమ భాషను, లిపిని, సంస్కృతిని పరిరక్షించుకొనే హక్కు వుంది. 29(1) అధికరణ ప్రకారం ప్రభుత్వం నిర్వహించే విద్యాసంస్థలలోనూ, ప్రభుత్వ సహాయం పొందే విద్యా సంస్థలలోనూ ఏ పౌరుడికి మతం, జాతి, కులం, భాష అనే వాటిమీద ఆధారపడి ప్రవేశం నిరాకరించరాదు. రాజ్యాంగం 29(2) అధికరణం ప్రకారం భాషకుగాని, మతాలకుగాని సంబంధించిన మైనారిటీ వర్గాల వారికి తమకు కావలసిన విద్యా సంస్థలు ఏర్పాటు చేసుకోవడానికి హక్కు ఉంది. 30(1) అధికరణ ప్రకారం మైనారిటి వర్గాలకు చెందిన విద్యావ్యవస్థలో, ఆ వర్గాలకు చెందిన పిల్లలకు మాత్రమే, వారి భాషలో విద్యను అభ్యసించుటకు హక్కు ఏర్పడింది. ఈ విద్యా విషయక హక్కులు మైనారిటీలకు చెందినవేగాని పౌరులందరికి ప్రసాదించినవి కావు. దేశంలో ఉన్న వివిధ మైనారిటీ వర్గాలను దృష్టిలో పెట్టుకొని రాజ్యాంగ శాసనకర్తలు ప్రత్యేకంగా ఈ హక్కులను పొందుపరిచారు.

1957లో కేరళ రాష్ట్రంలోని కమ్యూనిష్టు పార్టీకి ప్రభుత్వము రూపొందించిన విద్యా బిల్లు రాష్ట్రములోని విద్యాసంస్థల నిర్వహణలో విప్లవాత్మకమార్పులను తీసుకువచ్చే ప్రయత్నం చేసింది. ఆ బిల్లు అధ్యక్షుని ఆమోదముద్రకు నివేదించబడినది. రాజ్యాంగం 143 నిబంధన క్రింద అధ్యక్షుడు సుప్రీంకోర్టును సలహాను కోరగా, సుప్రీంకోర్టు బిల్లులోను కొన్ని అంశాలను చట్టానికి విరుద్ధమని ప్రకటించి, మిగిలిన భాగాలను రాజ్యాంగ చట్టానికి అనుగుణమని ప్రకటించింది. మైనారిటి వర్గాలు తమ భాషను, లిపిని, సంస్కృతిని కాపాడుకొనటానికి విద్యా సంస్థల ద్వారా మాత్రమే సాధ్యమని ప్రకటించింది. ఆదేశిక సూత్రాలను అమలు చేయుటకు నిర్బంధ విద్యను ప్రవేశ పెట్టుటకు ప్రభుత్వం నిర్వహించే, ప్రభుత్వ ధన సహాయంతో నిర్వహింపబడే విద్యా వ్యవస్థల ద్వారా ప్రయత్నించాలని అభిప్రాయపడింది.

## 4.2.6. రాజ్యాంగ పరిహారపు హక్కు:

ఏడవ ప్రాథమిక హక్కుగా రాజ్యాంగ పరిహారపు హక్కు (32 అధికరణ) సర్వహక్కులకు రక్షణవలయంగా ఉంటుంది. రాజ్యాంగం ప్రసాదించిన ప్రాథమిక హక్కులను వ్యక్తులు స్వేచ్ఛగా అనుభవించడానికి అవాంతరాలు ఏర్పడితే అధిగమించేందుకు ఇచ్చిన హక్కే రాజ్యాంగ పరిహారపు హక్కు. ఈ అవకాశం లేకుంటే ప్రాథమిక హక్కుల నుంచి పొందే ప్రయోజనం వ్యర్థమవుతుంది. చాలా ఆధునిక రాజ్యాలలో ఈ రకమైన చట్టాలను రూపొందించబడలేదు. ఈ హక్కు ప్రకారం ఎవరు ప్రాథమిక హక్కుల విషయంలో జోక్యం చేసుకున్నా, అభ్యంతరం కలుగజేసినా న్యాయస్థానానికి నివేదించవచ్చు. ప్రభుత్వం లేదా ప్రభుత్వ ఉద్యోగుల చర్యల వల్ల, లేదా తోటి పౌరుల వల్ల లేదా పార్లమెంటు రూపొందించిన శాసనాల వల్ల పౌరుని ప్రాథమిక హక్కులకు భంగం వాటిల్లవచ్చు. అందుచేత వాటిని కాపాడుకోవటానికి పౌరునికి శాసన బద్ధంగా అవకాశం ఉండాలి. ఈ అవకాశం 32 అధికరణ ద్వారా పరిష్కరించుకోవచ్చు. ఈ విధమైన అవకాశం లేనప్పుడు ప్రాధమిక హక్కులు నిరర్థకం, అర్థరహితము. రాజ్యాంగ పరిహారపు హక్కును డా॥ అంబేద్కర్ 32వ నిబంధనలో ఇది రాజ్యాంగానికి "గుండెకాయ వంటిది" అని పేర్కొన్నారు.

32వ నిబంధన ప్రకారం సుప్రీంకోర్టు, హైకోర్టులకు ప్రాధమిక హక్కులను సంరక్షించవలసిన బాధ్యత ఏర్పడింది. ప్రాధమిక హక్కులను రక్షించుటానికి సుప్రీంకోర్టుకు కొన్ని అసాధారణ అధికారాలు లభించాయి. అవి :

1. హెబియస్ కార్పస్ (Habeas Corpus)

2. మాండమస్ (Mandamus)
3. ప్రొహిబిషన్ (Prohibition)
4. సర్షియారరీ (Certiorari)
5. కోవారంటో (Quo Warranto)

**1. హెబియస్ కార్పస్:** దీనిని అక్రమ నిర్బంధానికి వ్యతిరేకంగా జారీ చేయడం జరుగుతుంది. ప్రభుత్వం ఎవరినైనా నిర్బంధించినపుడు ఆ నిర్బంధానికి గల కారణాలను ఎంతవరకు చట్ట సమ్మతమో కాదో తెలుసుకోవడానికి నిర్బంధించిన వ్యక్తిని 24 గంటలలోగా న్యాయస్థానం ముందు ప్రవేశ పెట్టవలసిందని జారీ చేసే ఆదేశమే హెబియస్ కార్పస్.

**2. మాండమస్:** మాండమస్ అంటే ఆజ్ఞ అని అర్థము. తన విధులను నిర్వర్తించమని క్రింది స్థాయి న్యాయస్థానానికి ట్రిబ్యునల్ లేదా ప్రభుత్వ అధికారికి ఈ రిట్‌ను జారీ చేయడం జరుగుతుంది. దీని ద్వారా ఒక వ్యక్తికి చెందిన ప్రాథమిక హక్కులను అమలు చేయడం జరుగుతుంది.

**3. ప్రొహిబిషన్:** మాండమస్ ఒక పనిని చేయమని నిర్ధారిస్తే ప్రొహిబిషన్ ఒక పని చేయరాదని ఆదేశిస్తుంది. క్రింది న్యాయస్థానాలు తమ అధికారానికి మించి వ్యవహరిస్తే సుప్రీంకోర్టు ఆ అధికారాలను నిషేధిస్తూ ఇచ్చే ఆదేశమే ప్రొహిబిషన్.

**4. సెర్షియరారీ:** ట్రిబ్యునల్ న్యాయస్థానం, తన అధికారానికి మించి వ్యవహరిస్తున్నప్పుడు దీనిని జారీ చేస్తారు. చర్యను ఋజువు చేసుకున్న మీదటే దీన్ని జారీ చేయడం జరుగుతుంది. కాబట్టి, ఇది ప్రొహిబిషన్ కంటే భిన్నంగా ఉంటుంది.

**5. కో-వారంటో:** ఒక ప్రభుత్వ పదవిలో చట్టరీత్యా అర్హులు కానివారున్నారని ఫిర్యాదు వచ్చినపుడు న్యాయస్థానంలో ఆ విషయాన్ని గురించి వ్యవహరించడానికి కోవారంటో ఉపకరిస్తుంది. అంటే తనకు అధికారం లేని ఒక ప్రభుత్వ కార్యాలయం మీద అధికారం చలాయించవద్దని ఒక వ్యక్తిని నివారిస్తుంది.

32వ నిబంధనను అత్యవసర పరిస్థితులలో తాత్కాలికముగా రద్దు చేయవచ్చును. 359 నిబంధన క్రింద అత్యవసర స్థితిలో రాష్ట్రపతి ప్రాథమిక హక్కుల పరిరక్షణ కొరకు న్యాయస్థానములను ఆశ్రయించే పౌర హక్కును తాత్కాలికముగా వాయిదా వేయవచ్చును. ఒక వ్యక్తి ప్రాణ రక్షణ, వ్యక్తిగత స్వేచ్ఛలకు సంబంధించిన 20, 21 నిబంధనలు అత్యాయిక పరిస్థితిలో సస్పెండు చేయబడవు. యుద్ధ సమయంలో తప్ప, 32 నిబంధన ద్వారా లభించిన హక్కుల పరిరక్షణకు న్యాయస్థానాలను కోరే అధికారమును సస్పెండు చేయబడదు. ఈ అధికారం భారతదేశ ప్రాదేశిక సమగ్రతకు భంగము వాటిల్లే పరిస్థితులలో మాత్రమే చెలాయించబడుతుంది. 1976లో 42వ రాజ్యాంగ సవరణ ప్రకారము క్రొత్తగా చేర్చబడిన 32(ఎ) నిబంధన క్రింద రాష్ట్ర శాసనాల రాజ్యాంగ బద్ధతను నిర్ణయించే సుప్రీంకోర్టు అధికారాన్ని రద్దు చేసింది. 42 సవరణ సుప్రీంకోర్టు, హైకోర్టుల న్యాయ సమీక్షాధికారమును రద్దు చేసింది. 1978లోని 44వ సవరణ 32(ఎ) నిబంధనను రద్దుపరచి, 1976 కు పూర్వమున్న యథాస్థితిని పునరుద్ధరించింది.

### 4.2.3. ప్రాథమిక హక్కులు - వాటి లక్షణాలు:

భారతదేశ ప్రజలు 1947, నవంబరు 26న తమకు ఒక రాజ్యాంగాన్ని తయారుచేసుకొన్నారు. 1950, జనవరి 26న భారతదేశం రిపబ్లిక్‌గా అవతరించింది. రాజ్యాంగంలోని 3వ భాగంలో ప్రాథమిక హక్కులను పొందుపరిచారు. 1976లో చేయబడిన 42వ సవరణ వలన ప్రాథమిక విధులతో కూడిన ఒక నూతన అధ్యాయమును, IV A ను చేర్చారు. ప్రాథమిక విధులన్నింటిని 51 A నిబంధన క్రింద పొందుపరచారు. ప్రాథమిక హక్కులను రాజ్యం ఉల్లంఘించరాదు. ఈ హక్కులను దృష్టిలో పెట్టుకొని **రాజ్యం** అనే పదాన్ని 12 ఆర్టికల్‌లో నిర్వచించారు. ప్రాథమిక హక్కులను రాజ్యాంగం 3వ భాగంలో 12వ అధికరణ నుంచి 35వ అధికరణ వరకుగల 24 అధికరణలలో ప్రస్తావించడం జరిగింది. రాజ్యాంగంలోని 15, 16, 18, 19, 29 అధికరణలు భారత పౌరులకు

మాత్రమే వర్తిస్తాయి కాని 14, 20, 21, 22, 23, 24, 25, 27, 28, 31 అధికరణల్లోని హక్కులు భారత భూభాగంలో నివశించే పౌరులందరికి వర్తిస్తాయి. 15(2), 15(4), 17 మొదలగు అధికరణలు అసమానత్వము, అస్పృస్యత, ఆర్థిక దోపిడి మొ॥లగు అంశాలను ఆలంబనగా చేసికొని నూతన సమాజ రూపకల్పనకు ఉద్దేశింపబడినవి. వాక్ స్వాతంత్ర్యము, సమావేశ స్వాతంత్ర్యము విద్యా సాంస్కృతిక హక్కులు మొదలైన. పౌర ప్రయోజనాలకోసమే గాక రాజకీయ ప్రయోజనాలకు కూడా వినియోగించవచ్చు.

ప్రాథమిక హక్కులను పౌరులను దృష్టిలో పెట్టుకొని రెండు రకాలుగా విభజించవచ్చు. అవి: నకారాత్మక హక్కులు, మరియు సకారాత్మక హక్కులు. నకారాత్మక హక్కులు ప్రభుత్వం మీద ఆంక్షలు విధిస్తాయి. చట్టసమానత్వము, పౌరుల విషయంలో విచక్షణ, సైనికపరమైన, విద్యా విషయకమైన బిరుదులు మొ॥నవి నకారాత్మక హక్కులు. వీనివలన ప్రభుత్వ యంత్రాంగము మీద స్పష్టమైన నిషేధము అమలులో ఉంటుంది. వీనిని ఉల్లంఘిస్తే అది రాజ్యాంగ వ్యతిరేకమైన చర్య అవుతుంది. మిగిలినవి సకారాత్మక హక్కులు. వీటిని పౌరులు చట్టబద్ధంగా చలాయించాలి. రాజ్యాంగంలో ప్రాథమిక హక్కులకు అధిక ప్రాధాన్యత ఇవ్వడానికి కారణం పౌరులను, వారి ప్రయోజనాలను నిరపేక్ష ప్రభుత్వము నుండి కాపాడటం. ప్రజాస్వామ్య దేశాలలో నిరపేక్షకమైన హక్కులుగాని, నిరపేక్ష ప్రభుత్వ అధికారముగాని ఉండటానికి వీలులేదు. ప్రాథమిక హక్కులు శాసనాధికారంగల ప్రభుత్వ వ్యవస్థలు మీద, విచక్షణాధికారము చలాయించే యంత్రాంగము మీద పరిమితులను విధిస్తాయి. అవి సహేతుకముగానున్నంతకాలం న్యాయ స్థానాలు జోక్యం చేసుకోవటానికి వీలు లేదు. భారత రాజ్యాంగం ప్రకారం ప్రాథమిక హక్కుల మీద పరిమితులను విధించే హక్కు పార్లమెంటుకు సంక్రమించింది. పార్లమెంటు విధించే పరిమితులు సహేతుకమా, కాదా అని నిర్ణయించే అధికారం న్యాయ స్థానాలకు సంక్రమించింది.

దేశంలో దురాక్రమణ, అంతరంగిక కల్లోలాలు, శాంతి భద్రతలకు భంగం వాటిల్లినపుడు రాష్ట్రపతి 352 ఆర్టికల్ క్రింద అత్యవసర పరిస్థితిని ప్రకటించవచ్చు. ఆ సమయంలో 19వ ఆర్టికల్ లోని విషయాలకు అస్థిత్వం లేనట్లే. అత్యవసర పరిస్థితి అమలులో ఉన్నప్పుడు ప్రాథమిక హక్కులను అమలు జరపడానికి న్యాయస్థానాలకున్న హక్కును రాష్ట్రపతి తన ఆదేశం ద్వారా సస్పెండ్ చేయవచ్చు. 368 నిబంధన క్రింద పార్లమెంటు రాజ్యాంగాన్ని ప్రాథమిక హక్కులతో సహా నిర్ణీతమైన మెజారిటీతో సవరించవచ్చు. ప్రాథమిక హక్కులను పరిమితం చేసిన సవరణలు సహేతుకం కాకపోతే, సవరణలు రద్దుచేసే అధికారం మాత్రమే న్యాయ స్థానములకు ఉన్నది. 1951లో జమిందారి రద్దు చట్టాలను రక్షించడానికి ప్రాథమిక హక్కులు సవరించబడినవి. ప్రాథమిక హక్కులకు సంబంధించి చంపకం Vs. మద్రాస్, శంకరప్రసాద్ Vs. యూనియన్ ఆఫ్ ఇండియా, సజ్జన్ సింగ్ Vs. రాజస్థాన్, కేశవానంద భారతి Vs. కేరళ కేసులలో సుప్రీంకోర్టు తన తీర్పును ప్రాథమిక హక్కులను సవరించే అధికారం పార్లమెంటుకు ఉన్నదని అభిప్రాయపడింది. కాని 1967లో **గోలక్‌నాద్ జరీ. పంజాబ్** రాష్ట్రం కేసులో మాత్రం పార్లమెంటుకు ప్రాథమిక హక్కులను సవరించే అధికారము లేదని తీర్పునిచ్చింది. పార్లమెంట్ 1972లో 24,25 రాజ్యాంగ సవరణలు చేసి 13(2) నిబంధనను మార్చి రాజ్యాంగ సవరణకు అది వర్తించకుండా చేసింది. ప్రాథమిక హక్కుల సవరణకు సంబంధించి భిన్న అభిప్రాయాలు ఏర్పడినవి. రాజ్యాంగంలోని 368 నిబంధన ప్రకారం ప్రాథమిక హక్కులను, అవసరమైతే ఏ భాగాన్నయినా సవరించే అధికారం పార్లమెంటుకి వుంది అని కొంతమంది అభిప్రాయం. మరికొంతమంది ప్రాథమిక హక్కులకు సహజ హక్కుల స్వభావముండుటవలన, వాటిని సవరించినట్లయితే ప్రజాస్వామ్య భావన దెబ్బతింటుందని, పార్లమెంటు కన్నా రాజ్యాంగం సార్వభౌమాధికార సంస్థ కాబట్టి అటువంటి దానిని పార్లమెంట్ మార్చకూడదు అని కొంతమంది అభిప్రాయపడినారు.

1976లో ప్రవేశపెట్టిన 40వ సవరణవలన 64 నూతన అంశాలను 9వ అనుబంధములో చేర్చారు దీనితో నిర్దేశిక నియమావళికి సంబంధించిన ఆర్థిక సామాజిక విధానాలకు ప్రాథమిక హక్కుల మీద ఆధిక్యత లభించింది. 1976లో నియమించిన స్వర్ణసింగ్ కమిటి తన నివేదికలో ప్రాథమిక హక్కుల మీద ముఖ్యముగా ఆస్తిహక్కు మీద ఆదేశ సూత్రాలకు ఉండవలసిన ఆధిక్యతను స్పష్టం చేయాలని, 368 నిబంధన కింద పార్లమెంటు చేసే సవరణలను న్యాయస్థానం ప్రశ్నించరాదని ప్రాతిపాదించింది. కేశవానంద భారతి వర్సెస్ స్టేట్ ఆఫ్ కేరళ కేసులో తీర్పునిస్తూ సుప్రీంకోర్టు, భారత పార్లమెంట్ రాజ్యాంగం యొక్క మౌలిక స్వభావానికి భంగం కలుగనంతవరకు, రాజ్యాంగంలోని ఏ భాగాన్నయినా సవరించవచ్చును అని చెప్పింది. ఇప్పటికీ ఇదే నిబంధన గౌరవించబడుతూ ఉన్నది.

ప్రాథమిక హక్కుల ప్రత్యేక లక్షణము 32వ నిబంధనము చేర్చడము. ఇది ఇతర ప్రాథమిక హక్కులకు రక్షణ కల్పిస్తుంది. ఇది రాజ్యాంగానికి గుండెకాయ వంటిది. పౌరుని ఇతర ప్రాథమిక హక్కులకు భంగం కలిగితే రాజ్యాంగ పరిహారపు హక్కు, న్యాయస్థానాల ద్వారా రక్షణ పొందవచ్చు. 32, 226 నిబంధనల వలన దేశములోని ఉన్నత న్యాయస్థానం ప్రాథమిక హక్కులను సంరక్షిస్తున్నది.

## 4.2.4. ప్రాథమిక హక్కుల పరిమితులు:

1. భారత రాజ్యాంగంలో 3వ అధ్యాయంలో పొందుపరచబడిన ప్రాథమిక హక్కులు నిరపేక్షమైనవికావు. వాటిని పరిమితము చేస్తూ అనే నిబంధనలున్నవి. 352 వ నిబంధన అమలులో ఉన్నప్పుడు రాష్ట్రపతి ప్రాథమిక హక్కులను సస్పెండు చేయవచ్చు. ప్రాథమిక హక్కుల అమలు కొరకు న్యాయస్థానాలను ఆశ్రయించే హక్కును తాత్కాలికంగా రద్దు చేయవచ్చు. ఇది దేశం మొత్తానికి కాని, కొన్ని ప్రాంతాలకు కాని వర్తింప చేయవచ్చు.

2. 20, 21 నిబంధనల క్రింద లభించే హక్కులలో, ప్రాణ రక్షణ హక్కు, వ్యక్తిగత స్వేచ్ఛ మినహాయించి, మిగతా హక్కులు సస్పెండు చేయబడుతాయి.

3. 33, 34, 35 నిబంధనల ప్రకారము పార్లమెంటు ప్రాథమిక హక్కులను పరిమితము చేయటానికి, కొన్ని వర్గాల విషయములో వర్తింపచేయటానికి వీలున్నది. 33వ నిబంధన ప్రకారము సైనిక వర్గాల విషయములో పార్లమెంటు ప్రాథమిక హక్కులను ఏ మేరకు అన్వయించవచ్చునో శాసనము ద్వారా నిర్ణయించవచ్చు. ఇది సైనిక వర్గాలకు మాత్రమేగాక, సాధారణ పోలీసులకు, సైనిక వర్గాలకు చెందిన పౌర ఉద్యోగులకు కూడా అన్వయిస్తుంది. 21వ సెక్షన్, సైనిక శాసనము (Army Act) ప్రకారం 19(1) C ప్రకారము లభించే స్వేచ్ఛలను శాంతి భద్రతల విషయములో నిమగ్నమైన వర్గాలు, సైనిక విభాగాల విషయంలో పరిమితం చేయవచ్చు.

4. 358(1) నిబంధన కింద అత్యవసర స్థితి అమలులో ఉన్నప్పుడు రాష్ట్రపతి 19వ నిబంధన క్రింద ప్రజలకు లభిస్తున్న వ్యక్తిగత స్వేచ్ఛలను తాత్కాలికంగా నిలుపుదల చేయవచ్చు.

## 4.3. ఆదేశిక సూత్రాల ప్రాధాన్యత:

ఆధునిక రాజ్యం సంక్షేమ రాజ్యం, సంక్షేమరాజ్య భావనను ప్రతిబింబించే ఆర్థిక సాంఘిక లక్ష్యాలను పేర్కొనడం ఆధునిక రాజ్యాల సంప్రదాయం. ఈ సంప్రదాయానికి మూలం వైమార్ రాజ్యాంగం. ఆస్ట్రియా, స్పెయిన్, ఐర్లాండ్, బ్రెజిల్, ఫ్రాన్స్, ఇటలీ, బర్మా, రాజ్యాంగాలు ఇదే సాంప్రదాయాన్ని అనుసరించాయి. సాధారణంగా దేశ లక్ష్యాలను రాజ్యాంగం యొక్క ప్రవేశిక ప్రకటిస్తుంది. రాజ్యాంగంలోని ఆదేశాల విభాగం ఆదేశిక సూత్రాలు లేక నిర్దేశిక నియమాల రూపంలో వుంటుంది. ఇవి ప్రభుత్వం ఏమి చేయాలో ఆదేశిస్తాయి. కాని ఆదేశ సూత్రాలు న్యాయ సాధ్యం కావు. అంటే ప్రభుత్వం వాటిని అమలు చేయలేనప్పుడు న్యాయస్థానాలకు వాటిని అమలు పరచమని చెప్పె అధికారం ఉండదు. ఆదేశ సూత్రాలు రాజ్యాంగ నిర్మాతలు ఆశించిన రాజ్య స్వరూప, స్వభావాలను తెలుసుకోడానికి సహాయ పడతాయి.

ఆదేశిక సూత్రాలు భారత రాజ్యాంగానికి ఒక ప్రత్యేకతను, విశిష్టతను కల్గిస్తున్నాయి. మన ఆదేశ సూత్రాలు ఐర్లాండ్ రాజ్యాంగము నుండి గ్రహించబడ్డాయి.

## 4.3.1. ఆదేశిక సూత్రాల లేదా నిర్దేశియ నియమాల వివరణ:

రాజ్యాంగంలోని 4వ అధ్యాయంలో మొత్తం 19 ప్రకరణలు వున్నాయి. 1977కి ముందు 16 ప్రకరణాలే ఉండేవి. 72వ రాజ్యాంగ సవరణ ద్వారా 3 క్రొత్త ప్రకరణాలు (39 A, 43 A, 48 A) చేరాయి. 44వ రాజ్యాంగ సవరణ ద్వారా 38వ ప్రకరణానికి

ఒక క్రొత్త ఉపవిభాగం చేరింది 38 (ii). 4వ అధ్యాయంలో 36 నుండి 51 అధికరణాలు ఉన్నాయి. మొదటి రెండు అంటే 36, 37వ అధికరణలు ఆదేశ సూత్రాల ప్రాధాన్యతను గురించి వర్ణిస్తాయి. 36వ ప్రకరణ రాజ్యం (STATE) అంటే ఏమిటో నిర్వచిస్తుంది, 37వ ప్రకరణ అదేశ సూత్రాలు న్యాయసాధ్యం కావని, అయినా అవి దేశ పాలనకు ప్రాతిపదికలని, చట్ట నిర్మాణంలో రాజ్యం వీటిని ఆధారం చేసుకోవాలని చెబుతుంది.

నిర్దేశిక నియమాలలో రాజ్యాంగం 38, 39 అధికరణల్లోకల ఆదేశిక సూత్రాలు అత్యంత విలువైనవి. 38 అధికరణ ప్రకారం ప్రజా సంక్షేమ సాధనకు అవసరమయిన సాంఘిక, ఆర్థిక, రాజకీయ న్యాయాన్ని చేకూర్చే సమాజాన్ని స్థాపించాలని చెపితే 39వ అధికరణ నూతన సామాజిక వ్యవస్థకు ఆవశ్యకమైన మార్పులను వివరిస్తుంది. 39వ నిబంధనలోని ప్రధాన అంశాలు.

1. పౌరుల జీవనోపాధికి తగిన సౌకర్యాల కల్పన 39 (a)
2. సమిష్టి సౌభాగ్యం కోసం దేశంలోని భౌతిక సంపదల సక్రమ పంపిణీ 39 (b)
3. దేశ సంపదను కొద్ది మంది చేతులలో కేంద్రీకృతం కాకుండా చూడడం 39 (c)
4. స్త్రీ, పురుషులకు సమాన వేతనాలు ఏర్పాటు 39 (d)
5. కార్మికుల ఆరోగ్య రక్షణ 39 (e)
6. పిల్లలు, యువజనులు నైతిక, భౌతిక దుర్వ్యసనాలకు గురికాకుండా చూడడం 39 (f)
7. స్వేచ్ఛగా, హుందాగా బాలలు వికాసాన్ని పొందటానికి అవకాశాలు కల్పించటం.

40వ నిబంధన ప్రకారం - స్వపరిపాలనా సంస్థగా గ్రామపంచాయితీలను స్థాపించడం. ఇవి స్వపరిపాలనా వ్యవస్థలుగా కొనసాగడానికి కావలసిన అధికారాలను, ఆదాయ మార్గాలను సమకూర్చటం. 42వ నిబంధన ప్రకారం పనిలో న్యాయమైన, మానవత పరిస్థితులు, స్త్రీలకు ప్రసూతి సౌకర్యం కల్పించాలి. కార్మికులు తమ విశ్రాంతి కాలాన్ని విసుకు చెందకుండ, సాంఘిక, సాంస్కృతిక కార్యకలాపాలను అనుభవించడానికి, సరిపోయినంత విశ్రాంతిని పొందే పరిస్థితులను కల్పించాలి.

42వ సవరణ వలన 43 A అనే నిబంధన చేర్చబడింది. ఈ అధికరణ లక్ష్యం కుటీర పరిశ్రమలను స్థాపించడం. కార్మికులు పరిశ్రమ యాజమాన్యంలో భాగము పొందవచ్చు. సవరించబడిన 45వ నిబంధన ప్రకారం 14 సం॥ల లోపు పిల్లలకు ఉచిత నిర్భంధ విద్యను నేర్పాలి. పౌరులందరికి ఒకే పౌరశాసనం ఏర్పరచడం (44 వ నిబంధన ఉద్దేశ్యం).

46వ నిబంధన ప్రకారం ప్రభుత్వం ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు, ప్రత్యేకంగా షెడ్యూలు కులాల తెగలకు విద్య ఆర్థిక వ్యవహారాలలో అవకాశాలను పెంపొందించటం, వారు సాంఘిక అన్యాయాలకు గురి కాకుండా చూడడం ప్రభుత్వం బాధ్యత. 47వ నిబంధన ప్రకారం ప్రజా ఆరోగ్యమునకు భంగం కలిగించే మత్తు పానీయాల వినియోగాన్ని నిషేధించాలి.

48వ నిబంధన ప్రకారం ఆధునిక శాస్త్ర పద్ధతులలో వ్యవసాయం, పశుపోషణలను పెంపొందించటం, సేద్యపు పనులకు పని వచ్చే జంతువులను కాపాడి వృద్ధి చేయాలి. గోవధను నిషేధించాలి. 42వ సవరణ ద్వారా 48 A అను నూతన అంశం చేరింది. దీని ప్రకారం భౌగోళిక వాతావరణంను సంరక్షించటం, వాతావారణ కాలుష్యాన్ని నివారించటం. వన్యప్రాణులను సంరక్షించటం, అటవిక సంపదను రక్షించటం రాజ్య బాధ్యత. 49వ నిబంధన ప్రకారం చారిత్రక జాతీయ ప్రాముఖ్యముగల భారతీయ, సంస్కృతి, వారసత్వమును ప్రతిబింబించే కట్టడాలను, కళాత్మకమైన వస్తువులను కాపాడాలి. చారిత్ర ప్రాధాన్యతగల ప్రదేశాలను, శాసనాలను, శిల్పములను సంరక్షించాలి. 50వ నిబంధన ప్రకారం కార్యనిర్వాహక శాఖ నుంచి న్యాయశాఖను వేరు చేయాలి. 51వ నిబంధన ప్రకారం అంతర్జాతీయ రంగంలో శాంతి భద్రతలను పెంపొందించటం, అంతర్జాతీయ న్యాయ ఒప్పందాల పట్ల గౌరవ భావాన్ని పెంపొందించటం. అంతర్జాతీయ వివాదాల మధ్య మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించడాన్ని ప్రోత్సహించడం చేయాలి.

## 4.4. ప్రాథమిక హక్కులు Vs. ఆదేశిక సూత్రాలు:

భారత రాజ్యాంగం మూడవ అధ్యాయంలో ప్రాథమిక హక్కులను, నాలుగవ అధ్యాయంలో ఆదేశిక సూత్రాలను

పొందుపరచింది. రాజ్యాంగం 12 నుండి 35 వరకు కల అధికరణలలో అనగా 24 అధికరణలలో, ఏడు రకాలైన ప్రాథమిక హక్కులను కల్పించారు. 1978లో జరిగిన 44వ రాజ్యాంగ సవరణ ద్వారా 31వ అధికరణ ద్వారా లభిస్తున్న ఆస్తిహక్కును ప్రాథమిక హక్కుల జాబితా నుండి తొలగించి, చట్టబద్ధమైన హక్కుగా మార్చడంతో (300 ఎ ప్రకరణం), ఆరు రకాలైన హక్కులు ప్రాథమిక మాత్రమే లభించుచున్నవి. 1951 సంవత్సరం నుండి చేయబడిన అనేక సవరణల వలన క్రొత్త భాగాలు, అదనపు సెక్షన్స్ చేర్చబడినవి. నాలుగవ అధ్యాయములో 36నుండి 51 వరకు 16 అధికరణాలను పొందు పరచారు. 39, 42వ సవరణల వలన రాజ్యాంగ నిర్మాతలు విస్మరించిన అనేక నూతన సామాజిక, ఆర్థిక లక్ష్యాలను నిర్దేశిక నియమావళిలో చేర్చారు.

ప్రభుత్వాలు నిరంకుశంగా వ్యవహరించకుండ, ప్రభుత్వ అధికారాలను నియంత్రిస్తూ, వీలైనంతగ పరిమితం చేస్తూ, పౌరుల స్వేచ్ఛను పరిరక్షిస్తున్న హక్కులను రాజ్యాంగ 3వ భాగంలో చేర్చడం జరిగింది. ఇవి ప్రభుత్వ శాసన, కార్యనిర్వాహక అధికారాలను పరిమితం చేస్తాయి.

ఆదేశ సూత్రాల అవగాహనకు ఆదేశ సూత్రాలు, ప్రాథమిక హక్కుల మధ్య ఉన్న సంబంధాన్ని తెలుసుకోవాలి. ప్రాథమిక హక్కులకు న్యాయస్థానాల రక్షణ ఉంది కనక వాటికి భంగం కలిగించే, కుంచించే ఏ ప్రభుత్వ చట్టాన్ని అయినా, కార్యాన్నయినా రాజ్యాంగ విరుద్ధమని న్యాయస్థానాలు తీర్మానించవచ్చు. కాని ఆదేశ సూత్రాలకు భంగం కలిగితే రాజ్యాంగ విరుద్ధమని తీర్మానించే అధికారం న్యాయస్థానాలకు లేదు. ఉదాహరణకి ఒక వ్యక్తికి ప్రభుత్వ చర్యవలన ఆస్తి నష్టం కల్గినపుడు అతడు న్యాయస్థానానికి వెళ్ళి న్యాయం పొందవచ్చు. కాని గోవధ నిషేధం, ప్రాథమిక విద్య, మధ్యపాన నిషేధం లాంటి విషయాల్లో వ్యక్తులుగాని, సంస్థలుగాని, న్యాయస్థానాలకు వెళ్ళే అవకాశం లేదు. కనుక ప్రాథమిక హక్కులు ఆజ్ఞాయుత స్వభావం కలవి, ఆదేశ సూత్రాలు సూచన ప్రాయమైనవి.

ప్రాథమిక హక్కులు వ్యక్తి వికాసానికి కావలసిన రక్షణను దృష్టిలో పెట్టుకొని రూపొందించబడగా, ఆదేశ సూత్రాలు సమాజ వికాసానికి అవసరమైన, వెనుకబడిన, నిర్లక్ష్యం చేయబడిన పీడిత సామాన్య ప్రజల అభివృద్ధిని ఆశించి రూపొందించబడ్డాయి.

ప్రాథమిక హక్కులు - నిర్దేశక నియమాలు పరస్పరం ఘర్షణకు లోనయినప్పటికి, అవి అవినాభావ సంబంధం కలిగిన పరస్పర పోషకాలైన రెండు రకాల హక్కులు. ప్రాథమిక హక్కులు ప్రభుత్వాల నిరంకుశ ధోరణిని, అరికట్టి వ్యక్తికి స్వేచ్ఛా స్వాతంత్ర్యమును కల్పించటానికి న్యాయబద్ధంగా రూపొందిచబడ్డాయి.

నిర్దేశిక నియమాలు మానవుని ఆర్థిక-సామాజిక లక్ష్యాల సముదాయం. వీటిని పొందుపరచుటలో ప్రధాన ఉద్దేశ్యం సమాజంలోని అసమానతలు తొలగించి, హక్కులు అందరు అనుభవించటానికి అనుగుణమైన నూతన సమాజ రూపకల్పనకు కృషి చేయటం. పారిశ్రామికంగా వెనుకబడిన దేశంలో, ఆర్థిక అసమానతలు హెచ్చుగా ఉన్న సమాజంలో నకారాత్మక హక్కులు అర్థరహితము. ఇవి కొద్దిమంది చేతులలోనున్న స్వాధికారాలు మాత్రమే. శ్రేయోరాజ్య స్థాపనకు, సమసమాజ ఏర్పాటుకు దోహదము చేసేవి నిర్దేశిక నియమావళి. సమాజంలో సామాజిక, ఆర్థిక హక్కులు పూర్తి అమలు చేయబడినపుడే 3వ అధ్యాయంలోని హక్కులు నిజమైన హక్కులుగా రాణిస్తాయి. నిరక్షరాస్యత, పేదరికం, దోపిడి, అజ్ఞానం కూరుకు పోయిన అధిక సంఖ్యా ప్రజలకు ప్రాథమిక హక్కుల, ఉనికిని తెలియటం, వానిని అనుభవించటం, సంరక్షించటం వంటి అవకాశాలు లభించవు.

ప్రాథమిక హక్కులకు, నిర్దేశిక నియమాలకు మధ్య సంఘర్షణ తలెత్తినప్పుడు, దేనికి ఆధిక్యత ఇవ్వాలనే సమస్య రాజ్యాంగం అమలులోకి వచ్చినపుడు తలెత్తలేదు. జమిందారీ రద్దు వంటివి మినహాయించి, పెద్ద విప్లవాత్మకమైన సంఘటనలు ఏవి చోటు చేసుకోక పోవటం దీనికి ప్రధాన కారణం. 1954 తరువాత అధికార కాంగ్రెస్ పార్టీ ఆవడి కాంగ్రెస్ సమావేశంలో సోషలిస్టు తరహా సమాజ స్థాపనకు పూనుకున్న తరువాత నిర్దేశక నియమాల అమలుకు, సామాజిక ప్రయోజనాల కోసం వ్యక్తిగత ఆస్తులను నిర్బంధంగా స్వాధీనం చేసుకొనడం మొదలు పెట్టిన తరువాత ప్రాథమిక హక్కులు Vs. నిర్దేశిక నియమాల సమస్యగా మారింది. దీనితోపాటు న్యాయస్థానాల దృక్పథం కూడా మారిపోయింది. మొదట నిర్దేశిక నియమాల అమలుకు ప్రభుత్వం చేపట్టిన చర్యలు ప్రాథమిక హక్కులకు వ్యతిరేకం అయినప్పటికీ న్యాయస్థానాలు 1967 తరువాత 13వ నిబంధనను అనుసరించి ప్రాథమిక హక్కులను,

నిర్దేశిక నియమావళి త్రోసిపుచ్చరాదని తీర్పులివ్వసాగాయి. రాజ్యాంగ సలహాదారుడు శ్రీ. బి. ఎన్. రావు, సుప్రీంకోర్టు న్యాయమూర్తి ఫ్రాంక్‌ఫర్ట్‌ని కలిసినప్పుడు, నిర్దేశిక నియమాలను అమలు చేయడంలో తప్పనిసరిగా వ్యక్తిగత హక్కులైన ప్రాథమిక హక్కులను ఉల్లంఘించవలసి వస్తుందని వెలిబుచ్చిన అభిప్రాయం 1970వ దశకంలో వాస్తవంగా మారిపోయింది. కాలానుగుణంగా మారే ప్రజాభిప్రాయాన్ని ప్రతిబింబించే పార్లమెంటుకు అధికారముండాలని, ప్రజా సంకల్పాన్ని ప్రతిబింబించాలని, సనాతన తత్వం, సాంప్రదాయవాదానికి ప్రాతినిధ్యం వహించే న్యాయస్థానములు దానిని తిరస్కరించరాదనే దృక్పథం బలపడింది.

## ప్రాథమిక హక్కులు - ఆదేశ సూత్రాల మధ్య ఘర్షణకు కారణమైన అంశాలు:

1. ప్రాథమిక హక్కులను న్యాయస్థానాల రక్షణ కలిగి వుండటం, ఆదేశ సూత్రాలకు లేకపోవడం.
2. 13 (2) నిబంధన వలన నిర్దేశిక నియమాలు ప్రాథమిక హక్కులకు లోబడి వుండాలి అనే దృక్పథము.
3. ఆదేశ సూత్రాలు దేశ పాలనలో మౌలికమైనవిగాను, శాసనాలను రూపొందించటంలో వీటిని ఉపయోగించటం రాజ్యం యొక్క విధిగా పేర్కొన్న 37వ ప్రకరణం మొ॥నవి.

## ఘర్షణ తీరు తెన్నులు:

### మొదటి దశ - 1950 - 66:

46వ ఆదేశిక సూత్రం ప్రకారం బలహీన వర్గాలకు, ఇంజనీరింగు కళాశాలల్లో సీట్ల రిజర్వేషన్ విధానం ప్రాథమిక హక్కులకు వ్యతిరేకంగా ఉందని State of Madras Vs. Mr. S. Champakam Dorai Rajan కేసులో 1951 సం॥లో తీర్పు చెప్పబడింది. అంతేకాకుండా 1952వ సం॥లో State of Bihar Vs. Kameswar Singh కేసులో బీహార్ జమిందారీ చట్టం రాజ్యాంగబద్ధంగా లేదని సుప్రీంకోర్టు కొట్టివేసింది. దీని వలన కలిగిన ఇబ్బందులను తొలగించటానికై 1951 సం॥లో తొలి రాజ్యాంగ సవరణ జరిగింది. దీని ద్వారా 15వ ప్రకరణానికి 4వ క్లాజు చేరింది. దీని వలన షెడ్యూలు కులాలు, తెగలు సాంఘికంగా, విద్యా విషయంలో వెనుకబడిన తరగతుల వారికి అభివృద్ధి కారక రాజ్యం ప్రత్యేక తీసుకోవచ్చు. అలాగే భూ సంస్కరణల చట్టాలన్నింటిని 9వ షెడ్యూల్‌లో చేర్చడం ద్వారా భూ సంస్కరణలకు రక్షణ కల్పించబడింది. సుప్రీంకోర్టు ఆలోచన విధానములో, దృక్పథములో కూడ మార్పు వచ్చింది. కొన్ని ఆదేశిక సూత్రాలకు సంబంధించి మధ్యపాన నిషేధం, కనీసవేతనాలువంటి విషయాలకు సంబంధించిన శాసనాలను సుప్రీంకోర్టు గుర్తించింది.

### 2వ దశ (1967-71):

1967వ సంవత్సరంలో గోలక్‌నాథ్ కేసులో సుప్రింకోర్టు చారిత్రాత్మకమైన తీర్పు చెప్పింది. 13వ నిబంధనలోని రెండవ ఉపనిబంధనను ఆధారంగా ప్రాథమిక హక్కులను తొలగించే లేదా వాటి పరిధిని తగ్గించే రాజ్యాంగ సవరణ శాసనాలను పార్లమెంటు చేయకూడదని ఈ తీర్పు సారాంశము. ఈ తీర్పు తరువాత ప్రాథమిక హక్కుల అమలుకై, నిర్దేశిక నియమావళిని సవరించరాదనే అంశం స్పష్టమైంది. దీని వలన నిర్దేశిక నియమాలు ప్రాధాన్యతను కోల్పోయాయి. ఈ విధంగా రెండింటి మధ్య సమన్వయ సాధనకు సమస్యలు తలెత్తాయి.

### 3వ దశ (1972-76):

1967వ సంవత్సరములో ఆదేశిక సూత్రాల అమలుకై రూపొందించే శాసనాలు, ప్రాథమిక హక్కులకు ఎటువంటి భంగం

కల్గించకూడదనే వాదన తలెత్తింది. ఈ అవరోధాన్ని తొలగించడానికి 24వ, 25వ రాజ్యాంగ సవరణ చట్టాలు చేయబడినాయి. 24వ రాజ్యాంగ సవరణ ప్రాథమిక హక్కులను సవరించే అధికారం పార్లమెంటుకు తిరిగి కల్పించగా, 25వ సవరణ ప్రాథమిక హక్కులైన సమానత్వపు హక్కు (14) స్వాతంత్ర్యపు హక్కు (19), ఆస్తి హక్కు (31)లపై ఆదేశిక సూత్రాలైన 39(b), 39(c) అంశాలకు ప్రాధాన్యత ఇచ్చారు. 39(b) జాతీయ వనరులను సమిష్టి శ్రేయస్సును పెంచే విధంగా పంపిణీ చేసేటట్లు 39(c) ఆర్థిక వ్యవస్థ పని తీరు సంపద కేంద్రీకృతం కాకుండా చేసేటట్లు శాసనాలకు ఆధిక్యతను కల్పించింది. అంతేకాకుండా ఆదేశిక సూత్రాల అమలుకై 31 (c) క్లాజును చేర్చడం వలన సుప్రీంకోర్టు లేదా హైకోర్టులు, ఆదేశిక సూత్రాల అమలుకు రూపొందింపబడ్డ శాసనాలు 14, 19, 31, ప్రాథమిక హక్కులకు వ్యతిరేకమని కొట్టివేయరాదనే అంశం చేర్చబడింది. ఫలితంగా న్యాయస్థానాల న్యాయ సమీక్ష అధికారం తగ్గించబడింది. ఈ సవరణలు 1973వ సంవత్సరంలో కేశవానంద భారతి కేసులో సవాలు చేయబడ్డాయి. సుప్రీంకోర్టు ఒక నూతన సిద్ధాంతాన్ని ప్రతిపాదిస్తూ పార్లమెంటుకు రాజ్యాంగ చట్టాన్ని ప్రాథమిక హక్కులతో సహా సవరించే అధికారమును ఆమోదిస్తూ, రాజ్యాంగ చట్ట మౌలిక తత్వమును మార్చే అధికారంలేదని ప్రకటించింది.

## 4వ దశ (1977 - 80):

1973లో కేశవానంద భారతి కేసులో ప్రాథమిక హక్కులను సవరించే అధికారం పార్లమెంటుకు కలదని, అయితే రాజ్యాంగ మౌలిక స్వరూపాన్ని మార్చకూడదని కోర్టు స్పష్టం చేసింది. ఈ అవరోధాన్ని తొలగించటానికి పార్లమెంటు 1976లో 42 రాజ్యాంగ సవరణ చేసింది. ఈ సవరణ వలన 39(b), 39(c)లు ప్రాథమిక హక్కులైన 14, 19, 31 పై ఆధిపత్యాన్ని సంపాదించుకున్నాయి. ఈ సవరణల వలన అనేక మార్పులు వచ్చాయి.

(1) అదేశిక సూత్రాలు అమలు జరిగేటప్పుడు, ప్రాథమిక హక్కులైన 13, 19, 31లు న్యాయ సాధ్యము కానివిగా మారుతాయి.

(2) రాష్ట్రపతి ఆమోదంతో రాష్ట్ర శాసన సభలు సైతం నిర్దేశిక నియమాల అమలుకు 13, 1931లకు వ్యతిరేకంగా శాసనాలు చేయవచ్చు.

42 సవరణద్వారా ఏర్పడిన పరిస్థితిని తొలగించటానికై 44వ రాజ్యాంగ సవరణ 1978లో జరిగింది. కానీ రాజ్యసభలో కాంగ్రెస్ పార్టీకి మెజారిటీ ఉండడంతో 39 (c)కి ఎటువంటి సవరణ జరగలేదు. ఆస్తి హక్కును ప్రాథమిక హక్కులనుండి తొలగించడం ద్వారా, ఆదేశిక సూత్రాల అమలు విషయంలో ప్రాథమిక హక్కులకు భంగం వాటిల్లకుండా వుంటుందని 44వ సవరణను సమర్థించినవారు అభిప్రాయపడ్డారు.

## 5వ దశ (1980 తరువాత):

42వ రాజ్యాంగ సవరణలోని కొన్ని అంశాలు మినర్వామిల్లు కేసులో 1980 వ సం॥లో సవాలు చేయబడ్డాయి. ఈ తీర్పు సుప్రీంకోర్టు ఆదేశిక సూత్రాలైన 39(b), 39(c)లకు మాత్రమే ప్రాథమిక హక్కులైన 14, 19, 31లపై ఆధిక్యతలు కలదనీ అన్నీ ఆదేశిక సూత్రాలకు సమానత్వపు హక్కు, స్వాతంత్ర్యపు హక్కులపై ఆధిక్యత లేదని స్పష్టం చేసింది.

ఈ కేసులో నిర్దేశిక నియమాల మీద ప్రాథమిక హక్కులకు ఆధిక్యత లభించింది. కాని ఆదేశ సూత్రాలను అమలు చేయడానికి ఉద్దేశించిన సవరణలు ప్రాథమిక హక్కులు 14, 19 నిబంధనలకు అనుకూలంగా ఉన్నవా లేదా అని పరిశీలించే అధికారము న్యాయస్థానాలకు ఉన్నది. కె.టి. షా. నిర్దేశిక నియమాలను "బ్యాంకు సౌకర్యం ప్రకారం చెల్లించదగిన చెక్కులుగా"గా వర్ణించాడు.

డా॥ అంబేద్కర్ నిర్దేశిక నియమాలను ఉద్దేశించి అవి భవిష్యత్‌లో శాసన కార్యనిర్వాహక వర్గాలు తమ విధాన రూపకల్పనలో వానిని ఆధారము చేసికోవాలి. రాజకీయ శ్రేయో రాజ్యమును స్థాపించాలి. సమసమాజ రూపకల్పనకు నిర్దేశిక నియమావళిని అమలు

చేయడం తప్పనిసరి అవుతుంది. అని పేర్కొన్నారు.

## 4.5. విమర్శ

ఆదేశిక సూత్రాలు ఎంతో ముఖ్యమైన సృజనాత్మక లక్షణాలుగా పరిగణించినప్పటికి, అవి అనేక విమర్శలకు గురైనాయి. అనేకమంది రచయితలు ఆదేశక సూత్రాలను పలురకాలుగా విమర్శించారు. ఐవర్ జెన్నింగ్స్, ప్రొ॥ శ్రీనివాస్, జి. యస్. జోషి, ప్రొ॥ కె.టి. షా, కె.సి. వేర్ వంటివారు వాటిని ఖాళీ ప్రమాణాలుగా, దుకాణాల్లో అందంగా అమర్చిన వస్తువులుగా, పవిత్ర సంకల్పాలుగా, అలంకార ప్రాయాలుగా విమర్శించారు.

## 4.6. సారాంశం:

దేశ పరిపాలనలో ప్రాథమిక హక్కులు ఎంతముఖ్యమైనవో ఆదే సూత్రాలు కూడా అంతే ముఖ్యమైనవి. ఆదేశిక సూత్రాలు ఎంత తీవ్ర విమర్శకు గురైనా, అవి ప్రజాస్వామ్య దేశాలలో సమసమాజ స్థాపనకు పట్టుగొమ్మలాంటివని గుర్తించాలి. భారత రాజ్యాంగ నిర్మాతలు వాటి అమలును భావిప్రభుత్వాల వివేకానికే వదిలేశారు. సాంఘిక విప్లవానికి ఆదేశిక సూత్రాలు ఆధారభూతమైనవి. ఎంత న్యాయ సాధ్యం కానప్పటికి అధికారంలో కొనసాగుతున్న ఏ రాజకీయ పార్టీ అయినా ప్రజా సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయక తప్పదు. అంటే అంతర్గతంగా ఆదేశ సూత్రాల అమలు జరుగుతున్నట్లే భావించాలి. వీటిని విస్మరించటానికి వీలు లేదు. కాబట్టి ఈ సూత్రాలు ప్రభుత్వాలకు శాసన నిర్మాణ, కార్యనిర్వాహక విషయాలను నిర్ణయించడానికి మార్గదర్శకులుగా, తత్వవేత్తలుగా, మిత్రులుగా పని చేస్తాయి. ప్రాథమిక హక్కుల సామాజిక పరిధిని, ఉపయోగిత్వాన్ని నిర్ధారించాలంటే న్యాయవ్యవస్థకు మార్గదర్శకాలుగా ఆదేశసూత్రాలు సహకరిస్తాయి.

## 4.7. మాదిరి ప్రశ్నలు:

1. భారత రాజ్యాంగంలో పొందుపరచిన ప్రాథమిక హక్కులు, ఆదేశిక సూత్రాలను వివరించండి ?
2. భారత రాజ్యాంగంలో పొందుపరచిన ప్రాథమిక హక్కులను వివరించి, వాటి అమలును పరిశీలించండి ?
3. భారత రాజ్యాంగంలో పొందుపరచిన ఆదేశసూత్రాల ప్రాధాన్యతను చర్చించండి ?
4. భారత రాజ్యాంగంలో పొందుపరచిన ఆదేశిక సూత్రాలు ప్రాథమిక హక్కులకన్నా ఏ విధంగా ప్రధానమైనవో వివరించండి
5. భారత రాజ్యాంగంలో పొందుపరచిన ప్రాథమిక హక్కులు, ఆదేశిక సూత్రాల మధ్య భిన్నత్వాన్ని పరిశీలించండి?

## 4.8. సంప్రదింపు గ్రంథాలు:


- Bipin Chandra, India After Independence, 1947 - 2000, New Delhi: Panguin Books, 2000.
- Rajani Kothari, Politics in India, New Delhil: Orient Longman, 1980.
- Austin, Granvelli, Working a Democratic Institution: The Indian Experience, New Delhi: Oxford University Press, 1999.
- J.N. Pandey, The Constitutional Law of India, Allahabad: Central Law Agency, 1998.
- M.V. Pylee, Constitutional Government of India, New Delhi: S Chand & Co. 1984.
- D.D. Basu, Introduction to Indian Constitution, New Delhi: Wadhwa and Co. 2001 (19th Edition).
- J.C. Johari, Indian Government and Politics, Delhi: Vishal Publications, 1989.


## పాఠం -5

# కేంద్ర-రాష్ట్ర సంబంధాలు


5.0 లక్ష్యం

5.1 ఉపోద్ఘాతం

5.2 కేంద్ర రాష్ట్ర శాసననిర్మాణ సంబంధాలు

5.2.1 కేంద్ర జాబితా

5.2.2 రాష్ట్ర జాబితా

5.2.3 ఉమ్మడి జాబితా

5.3 కేంద్ర రాష్ట్ర పరిపాలన సంబంధాలు

5.4 కేంద్ర రాష్ట్ర విత్త సంబంధాలు

5.4.1 కేంద్రవనరులు

5.4.2 రాష్ట్ర వనరులు

5.4.3 కేంద్రం విధించి వసూలు చేసిన ఆదాయాన్ని రాష్ట్రాలకు అప్పగించే పన్నులు

5.4.4 కేంద్రం విధించి రాష్ట్రాలు వసూలు చేసుకొనే పన్నులు

5.4.5 కేంద్రం విధించి వసూలు చేసిన ఆదాయాన్ని కేంద్రం, రాష్ట్రాలు పంచుకునే పన్నులు

5.4.6 సహాయక నిధులు

5.5 రాజ్యాంగ పరంగా బలమైన కేంద్రం

5.6 కేంద్ర రాష్ట్ర సంబంధాలు - ఆచరణ

5.7 ముగింపు

5.8 కేంద్ర రాష్ట్ర సంబంధాలపై సర్కారియా కమీషన్

5.9 మాదిరి ప్రశ్నలు

5.10 చదువతగిన గ్రంధాలు


## 5.0. లక్ష్యం:

భారతదేశంలో కేంద్ర రాష్ట్ర సంబంధాలను వివరించడం ఈ పాఠం ప్రధానలక్ష్యం. ఈ పాఠాన్ని చదివితే విద్యార్ధులు ఈ క్రింది విషయాలను తెలుసుకోగలరు.

1. భారతరాజ్యాంగంలో పొందుపరిచిన కేంద్ర రాష్ట్ర శాసన నిర్మాణ, పరిపాలన, విత్త సంబంధాలు.
2. భారత దేశంలో కేంద్ర రాష్ట్ర సంబంధాల ఆచరణ
3. భారత దేశంలో కేంద్ర రాష్ట్ర సంబంధాలలో చోటు చేసుకున్న మార్పులు, ధోరణులు
4. కేంద్ర, రాష్ట్ర సంబంధాల విశిష్టత

## 5.1. ఉపోద్ఘాతం

భారతదేశం మౌలికంగా సమాఖ్యరాజ్యం. ఫలితంగా దేశంలో కేంద్రప్రభుత్వం, రాష్ట్రప్రభుత్వం అనే రెండు రకాల ప్రభుత్వాలు ఏర్పడ్డాయి. కేంద్రప్రభుత్వం పరిధి మొత్తం దేశానికి వర్తిస్తే, రాష్ట్రాల పరిధి సంబంధిత ప్రాంతాలకు వర్తిస్తుంది. ఈ రెండు ప్రభుత్వాల అధికార పరిధులు, భాధ్యతలు, వాటి మధ్య సంబంధాలు మొదలైన విషయాలను రాజ్యాంగం తన వివిధ అధికరణల్లో సమగ్రంగా వివరించింది. ఈ రెండు స్థాయిల ప్రభుత్వాల మధ్య సంబంధాలకు స్పష్టమైన ప్రాతిపదికను ఏర్పరచింది. రాజ్యాంగం 7వ షెడ్యూల్లో కల కేంద్ర రాష్ట్రాల మధ్య అధికారాల పంపిణీని వివరించే కేంద్ర, రాష్ట్ర, ఉమ్మడి జాబితాలు కేంద్ర రాష్ట్రాల మధ్య సంబంధాలకు ప్రాతిపదిక, ఈ విధంగా, కేంద్ర, రాష్ట్రాల మధ్య సంబంధాలను రాజ్యాంగం స్పష్టంగా ఏర్పరచినప్పటికి ఆచరణలో ఈ సంబంధాలు రాజ్యాంగం ఆశించినదానికి భిన్నంగా రూపొందాయి. అనేక రాజకీయ, సామాజిక, ఆర్ధిక, కారణాల వల్ల కేంద్రం రాష్ట్రాల మధ్య అనేక విభేధాలు ఏర్పడి వాటి మధ్య సంబంధాలు క్షీణించాయి. క్రమంగా కేంద్ర, రాష్ట్రాల మధ్య సంబంధాలు క్షీణించడం వల్ల ఈ అంశం దేశంలో ఒక వివాదస్పద మైన అంశంగా రూపొందింది. ఈ విషయంలో కేంద్రం తీవ్రమైన విమర్శలకు ప్రధాన బిందువైంది. దేశంలో సంభవించిన అనేక రాజకీయ, సామాజిక, ఆర్ధిక పరిణామాల ప్రభావం వల్ల కేంద్ర, రాష్ట్ర సంబంధాలను తొలిదశలో సామరస్య పూరితంగా కొనసాగిన కేంద్ర రాష్ట్ర సంబంధాలలో తరువాత దశలో విభేదాలు, ఉద్రిక్తతలు చోటు చేసుకున్నాయి. అయితే 1990 దశాబ్దంలో దేశంలో సంకీర్ణ రాజకీయాల యుగం ప్రారంభంతో కేంద్ర రాష్ట్ర సంబంధాలలో నూతన ధోరణులు తలెత్తాయి. కేంద్రంలో సంకీర్ణ ప్రభుత్వం ఏర్పడిన తరువాత కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పరస్పరం సహకరించుకోవలసిన అవసరం కలిగింది. కొందరు రాజనీతి శాస్త్రవేత్తలు కేంద్ర, రాష్ట్ర సంబంధాలలో నాలుగు దశలను గుర్తించారు.

అవి
1) ఐక్యత, జాతీయ సమైక్యతల చట్టం పరిధిలో భాషా సంస్కృతుల భిన్నత్వ దశ (1947-67)
2) రాష్ట్రాల నుంచి ఎదురైన అనేకరకాల సమస్యల నేపథ్యంలో అధికార కేంద్రీకరణ దశ (1967-77)
3) అధికార సమతుల్యతను కేంద్రం వైపుకు మొగ్గు కనపరచేలా చేసేందుకు ప్రయత్నించిన దశ (1977-84)
4) సంకీర్ణ రాజకీయాల యుగం- కేంద్ర-రాష్ట్రాల మధ్య సహజీవనం ప్రారంభమైన దశ (1985 నుంచి నేటి వరకు)

భారతదేశంలో కేంద్ర-రాష్ట్రాల సంబంధాలను మూడు శీర్షికలుగా విభజింపవచ్చును అవి 1) కేంద్ర, రాష్ట్ర శాసన నిర్మాణ సంబంధాలు (2) కేంద్ర, రాష్ట్ర పరిపాలన సంబంధాలు (3) కేంద్ర, రాష్ట్ర ఆర్ధిక సంబంధాలు.

## 5.2 కేంద్ర రాష్ట్ర శాసన నిర్మాణ సంబంధాలు :

భారత రాజ్యాంగంలో పొందుపరచిన కేంద్ర రాష్ట్ర శాసన సంబంధాను పథకం ప్రకారం కేంద్ర, రాష్ట్రాల మధ్య శాసన నిర్మాణ అధికారాలుగా విభజించి వాటిని మూడు జాబితాలలో పొందుపరిచినారు. అవి

1) కేంద్ర జాబితా 2) రాష్ట్ర జాబితా 3) ఉమ్మడి జాబితా

### 5.2.1 కేంద్ర జాబితా (Union List)

కేంద్ర జాబితాలో మొత్తం 97 అంశాలు ఉన్నాయి. ఈ అంశాల్లో రక్షణ, సైనిక దళాలు, సాయుధదళాలు, విదేశీ వ్యవహారాలు, రైల్వేలు, నౌకయానం, నౌకనిర్మాణం, విమానయానం, విదేశీ ఋణాలు, బ్యాంకింగ్, విదేశీ వ్యాపారం, కరెన్సీ పరిశ్రమల నియంత్రణ, తంతి తపాలా జాతీయ మ్యూజియంల నిర్వహణ, జనాభాలెక్కలు సేకరణ, కేంద్ర పబ్లిక్ సర్వీస్ కమీషన్, ఎన్నికలు, సుప్రీంకోర్టు, హైకోర్టులు ప్రధానమైనవి. ఈ అంశాలన్నీ దేశంలోని మొత్తంప్రజల ఉమ్మడి ప్రయోజనం చేకూర్చేవి కావడం వల్ల వాటిపై దేశం మొత్తానికి వర్తించే శాసనాలు అవసరం. అందుచేత కేంద్ర జాబితాలో మొత్తం అంశాలపై శాసనాలు చేసే అధికారం కేవలం పార్లమెంటుకు మాత్రమే ఉంది.

### 5.2.2 రాష్ట్ర జాబితా (State List)

రాష్ట్ర జాబితాలో 66 అంశాలు ఉన్నాయి. ప్రాంతీయ ప్రయోజనాల ఆధారంగా ఈ అంశాలను ఎంపిక చేసి రాష్ట్ర జాబితాలో చేర్చారు. ఈ అంశాలపై విభిన్న ప్రాంతాలలో విభిన్న శాసనాలు అవసరం అని గుర్తించారు. ఈ జాబితాలలో చేర్చిన అంశాలపై రూపొందించిన శాసనాల పరిధి ఆధారంగా భారతదేశంలో సమాఖ్య సూత్రం పరిధిని నిర్ధారించవచ్చును. రాష్ట్ర జాబితాలలోని అంశాలలో శాంతి భద్రతలు పోలిస్, న్యాయపాలన, జైళ్ళు, స్థానిక ప్రభుత్వం, ప్రజా ఆరోగ్యం, మధ్యపాన నిషేదం, వ్యవసాయం మధ్య పసుగణాబివృద్ధి, అడవులు, మత్స్య సంపద, నీటిపారుదల, వ్యాపారం, వాణిజ్యం, మార్కెట్లు వడ్డీ వ్యాపారం, సినమాలు, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల జీతభత్యాలు, ప్రభుత్వ సర్వీసులు, భూమిశిస్తు మొదలైన ప్రధానమైనవి. ఈ అంశాలపై చట్టాలను రూపొందించే అధికారం రాష్ట్ర శాసనసభలకు ఉంది.

### 5.2.3 ఉమ్మడి జాబితా (Concurrent List )

ఉమ్మడి జాబితాలోని అంశాలపై దేశం మొత్తానికి వర్తించే సారుప్యత కలిగిన శాసనాలు చేయటం అభిలషణీయమే తప్ప తప్పనిసరికాదు. అందుచేత ఈ అంశాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల రెంటింటి పరిధిలో చేర్చారు. ఉమ్మడి జాబితాలోని అంశాలలో ప్రధానమైనవి: వివాహాలు, విద్య, వ్యవసాయ భూములు కాక మిగతా ఆస్థుల బదిలీ, సివిల్ ప్రొసీజర్, ట్రస్టులు, ట్రస్టీలు, సాంఘిక బద్రత, స్టాంప్ డ్యూటీలు, కార్మిక సంఘాలు, వార్తాపత్రికలు, కార్మిక సంక్షేమం విద్యుచ్ఛక్తి, పుస్తకాలు, వారపత్రికలు, వైద్య, న్యాయవాద వృత్తులు, ఫ్యాక్టరీలు, మొదలైనవి. ఈ అంశాలపై శాసనాలు రూపొందించే అధికారాన్ని కేంద్ర రాష్ట్రాలు ఉమ్మడిగా కలిగి వున్నాయి. ఉమ్మడి జాబితాలోని అంశాలపై పార్లమెంట్ శాసనాలను రూపొందించవచ్చును. ఆ అంశాలపై పార్లమెంటు శాసనాలను రూపొందిస్తే రాష్ట్ర శాసనసభ రూపొందించిన చట్టాలు రద్దు అవుతాయి. అయితే ఈ నియమానికి ఒక మినహాయింపు వుంది. దీని ప్రకారం ఉమ్మడి జాబితాలోని ఏ అంశమైనా అయిన ముందుగా రాష్ట్ర శాసనసభ చట్టాన్ని చేసి ఆ చట్టానికి రాష్ట్రపతి ఆమోదం పొందితే ఈ చట్టం తర్వాత పార్లమెంటు చట్టం చేసిన ముందుగా శాసన సభ చేసిన చట్టమే చెల్లుబాటు అవుతుంది. ఉమ్మడి జాబితా విన్యాత్సమైన సహజమైన లక్షణం ఈ లక్షణం ఉమ్మడి జాబితాలోని ఏ అంశంపైన అయినా అమలులో ఉన్న పార్లమెంట్ చట్టం పరిధిలో మరింత ప్రయోజనకారమైన చట్టాన్ని రూపొందించే అవకాశాన్ని రాష్ట్ర శాసనసభకు కల్పిస్తుంది. ఉమ్మడి జాబితా భావన 1935 భారత ప్రభుత్వ చట్టం నుండి గ్రహించబడింది.

ఈ విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అధికారాలను మూడు సమగ్రమైన జాబితాలుగా విభజంచి, వాటి అధికార పరిధిని స్పష్టంగా ఏర్పరచటం ద్వారా రాజ్యాంగ నిర్మాతలు మూడు ప్రయోజనాలును ఆశించినట్లు గుర్తించవచ్చును. ఒకటి, రాష్ట్రాలకు తగిన స్వయంప్రతిపత్తిని కల్పించి, వాటి చొరవను ప్రోత్సహించటం. రెండు జాతీయ సమైక్యతను కాపాడేందుకు అవసరమైన పరిస్థితులలో రాష్ట్ర ప్రభుత్వ వ్యవహారాలలో జోక్యం కల్పించుకనే అధికారాన్ని పార్లమెంట్‌కు కల్పించడం, మూడు, ఆవశ్యక రంగాలలో కేంద్రం, రాష్ట్రాల మధ్య ఉమ్మడి చర్యలను, సంప్రదింపులను ప్రోత్సహించడం.

ఈ విధంగా కేంద్ర, రాష్ట్రాలు నిర్వహించే అంశాలతో సమగ్రమైన జాబితాలను రూపొందించటం ద్వారా, రాజ్యాంగం అవశిష్ట అధికారాల సంఖ్యను పరిమితం చేసింది. అయితే ఏ ప్రభుత్వానికి చెందని అవశిష్ట శాసన నిర్మాణ అధికారాలు లేవని చెప్పటం సరికాదు. రాజ్యాంగంలోని 248 వ అధికరణ అవశిష్ట అధికారాన్ని కేంద్ర పార్లమెంటుకు దత్తం చేసింది. దీని ప్రకారం రాష్ట్ర, ఉమ్మడి జాబితాలలో లేని ఏ అంశంపై అయినా శాసనాలు చేసే అధికారం పార్లమెంటుకు ఉంది.

రాష్ట్రాలకు రాష్ట్ర జాబితాలో చేర్చిన అంశాలపై సంపూర్ణమైన శాసన నిర్మాణం అధికారం ఉన్నప్పటికి దీనికి రెండు మినహాయింపులు వున్నాయి. అవి :

1. రాజ్యాంగంలోని 249వ అధికరణ ప్రకారం జాతి ప్రయోజనాల దృష్ట్యా అవసరమని భావించి రాజ్యసభ హాజరైన సభ్యులలో రెండింట మూడు వంతుల మెజారిటతో ఒక తీర్మానాన్ని ఆమోదిస్తే రాష్ట్ర జాబితాలోని ఏ అంశంపై నైనా అయిన పార్లమెంటు శాసనం చెయ్యవచ్చును. ఈ శాసనం మొత్తం దేశానికి, లేదా ఏ ప్రాంతానికైనా వర్తిస్తుంది. ఈ తీర్మానం ఒక సంవత్సరం పాటు అమలులో ఉంటుంది. అందుచేత పార్లమెంటు చేసిన చట్టం కూడా ఒక సంవత్సరం పాటు మాత్రమే అమలులో ఉంటుంది.

2. రాజ్యాంగం 250వ అధికరణ ప్రకారం దేశంలో అత్యవసర పరిస్థితి అమలులో ఉన్నప్పుడు రాష్ట్ర జాబితాలోని ఏ అంశంపై అయినా చట్టం చేసే అధికారం పార్లమెంటుకు ఉంది. ఈ అధికారం అత్యవసర పరిస్థితి అమలులో వున్నంతకాలం అమలులో ఉంటుంది. అత్యవసర పరిస్థితిని రద్దు చేసినప్పటికి ఈ చట్టం ఆరు నెలల పాటు అమలులో ఉంటుంది.

పైన వివరించిన రెండు సందర్భాలతో పాటు మరో సందర్భంలో కూడా పార్లమెంటు రాష్ట్ర జాబితాలోని అంశాలపై చట్టాలను నిర్మించే అధికారాన్ని కలిగి ఉంటుంది. 252 వ రాజ్యాంగ అధికరణ ప్రకారం రెండు లేదా అంతకన్న ఎక్కువ రాష్ట్రాల శాసనసభలు అవసరమని తీర్మానిస్తే రాష్ట్ర జాబితాలోని ఏ అంశంపైన అయిన శాసనం చేసే అధికారాన్ని పార్లమెంటు కలిగి ఉంది. ఈ చట్టాన్ని పార్లమెంటు సంబంధిత శాసనసభ కోరిక ప్రకారం సవరించవచ్చు లేదా పూర్తిగా రద్దు చేయవచ్చును. రాజ్యాంగ నిపుణుల అభిప్రాయం ప్రకారం ఉమ్మడి జాబితాలో ఎక్కువ అంశాలను చేర్చటం వలన రెండు ప్రయోజనాలు ఉన్నాయి. ఒకటి, ఈ ఏర్పాటు ప్రగతి శీలక, ముందు చూపు కలిగిన రాష్ట్రాలు ఉమ్మడి జాబితాలోని అంశాలపై శాసనాన్ని చేసే అవకాశాన్ని కలిపిస్తుంది. రెండు, ఉమ్మడి జాబితాలోని ఏ అంశంపైనా అయినా అప్పటికే పార్లమెంట్ చట్టం ఉన్నా ఏవైనా రాష్ట్రాలలో ప్రత్యేకమైన పరిస్థితులు నెలకొన్నప్పుడు వాటికి అనుగుణంగా ప్రత్యేక ఏర్పాటు కు అవకాశం ఉంది. రాష్ట్ర జాబితా స్థానిక ప్రయోజనాల ప్రాతిపదికగా, కేంద్రజాబితా జాతీయ ప్రయోజనాలకు అనుగుణంగా రూపొందించబడ్డాయి. ఉమ్మడి జాబితాలోని వివిధ అంశాలను కేంద్ర రాష్ట్ర జాబితాలలో పొందుపరిచినట్లయితే వాటిమధ్య సంఘర్షణ తలెత్తే అవకాశం ఉంది. ఉమ్మడి జాబితా ఊహించని అత్యవసర పరిస్థితులలో తమ పరిధులను దాటి వ్యవహరించే అవకాశాన్ని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రెండింటికి కల్పించింది. ఈ వాస్తవం గత ఐదు దశాబ్దాలకాలంలో నిరూపితమైనది.

మొత్తం మీద కేంద్ర, రాష్ట్రాల మధ్య శాసననిర్మాణ అధికారాల పంపిణీని పరిశీలిస్తే కేంద్రీకృత ధోరణి వ్యక్తం అవుతుంది. కొందరు ఈ విధానం ప్రపంచంలోని అన్ని సమాఖ్య రాజ్యాల్లో వ్యక్తమవుతున్న కేంద్రీకృత ధోరణికి అనుగుణంగా ఉందని సమర్ధించారు. వారి వాదనకు భిన్నంగా ఇతరులు ఈ పంపిణీ సమాఖ్య స్ఫూర్తికి పూర్తిగా వ్యతిరేకమైనది. సమాఖ్య రూపంలో ఏకకేంద్రం రాజ్యాన్ని, ప్రవేశపెట్టె ప్రయత్నం అని విమర్శించారు.

## 5.3. కేంద్ర, రాష్ట్ర పరిపాలన సంబంధాలు :

సమాఖ్య రాజ్యాలలో తలెత్తే సమస్యల్లో కేంద్ర, రాష్ట్రాల మధ్య పరిపాలన సంబంధాలను నిర్ధారించటం అత్యంత కీలకమైనది. రాజ్యాగంలో స్పష్టమైన ఏర్పాట్లు లేని పరిస్థితులలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమపాలన విధులను నిర్వర్తించటంలో అనేక సమస్యలను ఎదుర్కొనవలసి వుంటుంది. ఈ వాస్తవాన్ని దృష్టిలో ఉంచుకొని భారత రాజ్యాంగ నిర్మాతలు పరిపాలనా రంగంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సంఘర్షణ తలెత్తకుండా నివారించే ఏర్పాట్లను రాజ్యాంగంలో పొందు పరిచారు. ఈ విషయంలో భారత రాజ్యాంగం 1935 భారత ప్రభుత్వ చట్టం ఏర్పరచిన విధానాన్ని అనుసరించింది.

రాజ్యాంగంలోని 256వ అధికరణ ప్రకారం రాష్ట్ర ప్రభుత్వాలు పార్లమెంటు చట్టాలకు అనుగుణంగా మాత్రమే తమ కార్యనిర్వహణ అధికారలను వినియోగించాల్సి ఉంటుంది. దేశ అంతరంగిక ప్రయోజనాల పరిరక్షణకు రాష్ట్రాలకు అవసరమైన ఆదేశాలను జారీచేసే స్వేచ్ఛ, అధికారాలు కేంద్ర ప్రభుత్వానికి ఉన్నాయి. ఈ అధికారంతో పాటు రాజ్యాంగం 257 వ అధికరణ ప్రకారం తన కార్య నిర్వహక అధికారానికి అవరోధం కల్పించే చర్యలను చేపట్టవద్దని రాష్ట్రాలను ఆదేశించే అధికారం కేంద్రప్రభుత్వానికి

ఉంది. దీని ప్రకారం ఏదైనా రాష్ట్రంలో కేంద్ర సంస్థలు తమ కార్యకలాపాలను నిర్వర్తించటంలో అవరోధాలను ఎదుర్కొంటే వాటిని తొలగించమని కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించవచ్చును. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం ఆదేశాలకు ఈ క్రిందిఅంశాలను వర్తిస్తాయి. 1) జాతీయ లేదా రక్షణ దళాలకు ప్రాధాన్యత కలిగిన రవాణా మార్గాల నిర్మాణం, నిర్వహణ 2) రాష్ట్రంలో గల రెల్వేల ఆస్థుల పరిరక్షణ.

రాజ్యాంగం రాష్ట్ర ప్రభుత్వం ఆమోదంతో తన పరిధిలోగల విధులలో ఏ విధులనైనా ఆ రాష్ట్ర ప్రభుత్వానికి లేదా ఆ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు అప్పగించే అధికారాన్ని కేంద్ర ప్రభుత్వానికి కల్పించింది. ఇదే విధంగా పార్లమెంటు చట్టం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం అధికారులకు విధులను అప్పగించవచ్చును. 261 వ రాజ్యాంగ అధికరణ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల చర్యలకు, కోర్టులకు న్యాయవ్యవస్థల తీర్పులకు దేశం మొత్తం ప్రాంతాలలో ప్రజలు విశ్వాసాన్ని, విధేయతను కనపరచాలని ఆదేశిస్తున్నది. రాజ్యాంగంలోని 262వ అధికరణ నదీ జలాల, నదీలోయల వినియోగం, పంపిణీ, నియంత్రణలలో వివిధ రాష్ట్రాల మధ్య తలెత్తే వివాదాలను, విభేదాలను పరిష్కరించే చట్టాలను రూపొందించే అధికారాన్ని పార్లమెంటుకు కల్పించింది. ఈ అధికరణకు అనుగుణంగా 1956 లో పార్లమెంటు అంతర్‌రాష్ట్ర నదీ జలాల వివాదాల చట్టాన్ని ప్రవేశపెట్టింది. ఈ చట్టం ఫలితంగా నదీ జలాలకు సంబంధించిన వివాదాలను పరిష్కరించేందుకు ఒక కేంద్ర ట్రిబ్యునల్ ఏర్పాటు అయింది. నదీజలాల వినియోగంపై తలెత్తిన వివాదాలపై ఈ ట్రిబ్యునల్ తీర్పు అంతిమమైనది.

చివరగా మొత్తం దేశంలో పరిపాలనాయంత్రాంగం సమర్ధవంతంగా పనిచేసేందుకు రాష్ట్రాలకు, కేంద్రం మధ్య, వివిధ రాష్ట్రాల మధ్య విధానాల అమలులో సమన్వయ సాధనకు రాజ్యాంగం 263వ అధికరణ ఒక అంతరాష్ట్ర మండలిని నియమించే అధికారాన్ని రాష్ట్రపతికి కల్పించింది. ఈ మండలిని ఏర్పాటు చేసే అధికారంతో పాటు ఈ మండలి వ్యవస్థీకరణ, పని పద్ధతులను, విధుల స్వభావాన్ని నిర్ధారించే అధికారం కూడా రాష్ట్రపతికి ఉంది.

మొత్తం మీద రాజ్యాగంనిర్ధారించిన కేంద్ర రాష్ట్రాల మధ్య శాసన నిర్మాణ, పాలన సంబంధాలను విశ్లేషిస్తే భారతదేశ సమాఖ్య కొన్ని విశిష్ట లక్షణాలను గుర్తించవచ్చును. అవి :

1. కేంద్ర రాష్ట్రాల మధ్య అధికారాల విభజన విస్తృతమైనది, సమగ్రమైనది.
2. భారతదేశంలో కేంద్ర, రాష్ట్రాలకు కలిపి ఒకే రాజ్యాంగం ఉంది. భారత యూనియన్ లోని అన్ని రాష్ట్రాలకు ఒకేరకమైన రాజ్యాంగం ఉంది.
3. భారత సమాఖ్యలో రాష్ట్రాల భూగోళిక హద్దులను మార్పుచేయవచ్చును. ఉన్న రాష్ట్రాలను రద్దు చేయవచ్చును. కొత్త రాష్ట్రాలను సృష్టించవచ్చును.
4. భారత రాజ్యాంగం పౌరులందరికి ఒకే పౌరసత్వాన్నికల్పించింది.
5. భారత రాజ్యాంగం దేశంలో ఏకీకృత న్యాయవ్యవస్థను ఏర్పాటు చేసింది. సివిల్, క్రిమినల్ చట్టాలను కేంద్రీకరించటమే కాక అవి దేశమంతటికి సమానంగా వర్తిస్తాయి.
6. రాజ్యాంగం సాధారణ పరిస్థితులలో కూడా కేంద్రానికి కొన్ని అసాధారణ అధికారాలను కల్పించింది.
7. రాష్ట్రాల ప్రధాన కార్యనిర్వాహక అధికారులైన గవర్నర్లను రాష్ట్రపతిని నియమిస్తాడు.
8. దేశ పాలన వ్యవస్థలో ఏకరూపతను సాధించేందుకు కనీస ఉమ్మడి విలువ ప్రమాణాలను కొనసాగినందుకు రాజ్యాంగం కొన్ని ఏర్పాట్లను చేసింది. వాటిలో అఖిల భారత సర్వీసుల ( IAS & IPS ) ఏర్పాటు ప్రధానమైంది.
9. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆడిట్‌లను నిర్వహించేందుకు కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ అనే ఒకే సంస్థ ఉంది.
10. రాష్ట్రపతిని నియమించే ఎన్నికల సంఘం పార్లమెంటు, రాష్ట్ర శాసనసభలకు ఎన్నికలకు నిర్వహిస్తుంది.
11. రాష్ట్ర శాసనసభలు ఆమోదించిన కొన్ని బిల్లులను రాష్ట్రపతి ఆమోదించవలసి ఉంది.
12. రాజ్యాంగం కేంద్ర రాష్ట్రాల మధ్య తలెత్తే వివాదాలను పరిష్కరించే అధికారాన్ని కేంద్ర ప్రభుత్వానికి దాని సంస్థలకు అప్పగించింది. అంతర్ రాష్ట్ర మండలి, విత్త సంఘం ఈ సంస్థలకు ఉదాహరణలు.

ఈ పైన వివరించిన లక్షణాలన్నీ కేంద్ర ప్రభుత్వ ఆధిక్యతను నొక్కి చెప్పాయి.

కేంద్ర రాష్ట్ర పరిపాలన సంబంధాలను నిర్దేశించే వివిధ అధికరణలను పరిశీలిస్తే రాజ్యాంగం కేంద్ర ప్రభుత్వానికి విస్తృతమైన, బలమైన అధికారాను అప్పగించినట్లు గుర్తించవచ్చును. రాజ్యాంగంలోని 256, 257, 356, 365 వ అధికరణలు కేంద్ర ప్రభుత్వానికి విస్తృతమైన అధికారాలను కల్పించటం ద్వారా రాష్ట్రాలపై సమగ్రమైన కేంద్రపాలన పరమైన నియంత్రణ, మార్గదర్శకత్వాలకు అవకాశాన్ని కల్పించాయి. అయితే దీని ఫలితంగా రాష్ట్రాలపై కేంద్రానికి సంపూర్ణమైన ఆధిపత్యాన్ని ఏర్పడిందని అనడం సమంజసం కాదు. వాస్తవానికి రాష్ట్రాలకు రాజ్యాంగం కల్పించిన అధికారాలు హోదా ఉన్నాయి. కాలక్రమంగా రాజ్యాంగం కల్పించిన దానికంటే రాష్ట్రాలకు ఎక్కువ స్వయం ప్రతిపత్తిని సమకూర్చే సంప్రదాయాలు అభివృద్ధికి చెందాయి. ఉదాహరణకు, ఉమ్మడి జాబితాలోని అంశాలపైన చట్టాలను చేసే ముందు రాష్ట్రాలను సంప్రదించే సంప్రదాయం, భాధ్యత రాజ్యాంగపరంగా కేంద్ర ప్రభుత్వానికి లేనప్పటికి ఈ విషయంలో కేంద్రం రాష్ట్రాలను సంప్రదించటం ఒక సాంప్రదాయంగా మారింది కేంద్రానికి రాష్ట్రాలపై ఆధారపడటం తప్పని సరి.

ఏమైనప్పటికీ, కేంద్రానికి విస్తృతమైన, కీలకమైన పాలనా అధికారాలను అప్పగించటంలో రాజ్యాంగ నిర్మాతలు దూరదృష్టిని ప్రదర్శించారని చెప్పటం సమంజసం. ఈ అధికారాలను అప్పగించటం ద్వారా తన అధికారాలను, చట్టాలను సమర్ధవంతంగా అమలు పరిచేందుకు కేంద్రానికి రాజ్యాంగం చట్టబద్దమైన అవకాశాన్ని కల్పించింది. చంద్రపాల్ అనే రచయిత పేర్కొన్నట్లు రాజ్యాంగంలో కల వివిధ అధికరణలు, కేంద్ర, రాష్ట్రాల మధ్య సహకారాన్ని పెంపొందింప చేయటంతో పాటు రాజ్యాంగం వాస్తవ ప్రాతిపదిక అయిన సమాఖ్య పాలనా సూత్రాన్ని ఆచరణ యోగ్యం చేయటానికి దోహదం చేసాయి.

## 5.4. కేంద్ర- రాష్ట్ర విత్త సంబంధాలు:

ఆర్థిక రంగంలో కేంద్ర రాష్ట్రాల సంబంధాలను భారత రాజ్యాంగం విపులీకరించిన స్థాయిలో ఏ ఇతర రాజ్యాంగం విపులీకరించలేదు. ఒక ఆర్థిక సంఘాన్ని ఏర్పాటు చేయటం ద్వారా రాజ్యాంగం కేంద్ర రాష్ట్ర సంబంధాలలో అత్యంత క్లిష్టమైన ఆర్థిక సంబంధాల సమర్ధవంతమైన నిర్వహణకు ప్రయత్నించింది. భారత ప్రభుత్వం చట్టం 1935 ఆర్థిక విషయంలో కేంద్ర రాష్ట్రాల మధ్య సమస్యలు తలెత్తకుండా కేంద్రం లేదా రాష్ట్రాలు విధించే పన్నులను స్పష్టంగా నిర్ధారించింది. ఈ చట్టం కొన్ని పన్నులను విధించి వసూలు చేసే అధికారాన్ని కేంద్రానికి అప్పగించినా వాటి ద్వారా వచ్చే రాబడిని రాష్ట్రాలకు పంచే ఏర్పాటు చేసింది. అయితే 1935 భారత ప్రభుత్వం చట్టం ప్రధాన లోపం ఏమిటంటే ఈ చట్టం రాష్ట్రాలకు అతితక్కువ వనరులకు కేటాయించింది. భారత రాజ్యాంగం 1935 భారత ప్రభుత్వ చట్టం ఏర్పరచిన విధానాన్ని అనుసరించినప్పటికీ పై లోపాన్ని సరిదిద్దింది. రాజ్యాంగం కేంద్ర రాష్ట్రాల మధ్య స్థూల రూపంలో ఆయా వనరులను విభజన చేసింది. అయితే కేంద్ర రాష్ట్రాల మధ్య ఆదాయ వనరులను విభజించే కర్తవ్యాన్ని ఆర్థిక సంఘానికి అప్పగించింది.

భారతదేశంలో కేంద్ర రాష్ట్రాల మధ్య వనరుల కేటాయింపును సమర్థత, సమగ్రత, ఖచ్చితత్వం సూత్రాలు నిర్దేశిస్తున్నాయి. ఆచరణలో ఈ మూడు లక్ష్యాలను ఏకకాలంలో సాధించటం సాధ్యం కాదు. దీనికి కొన్ని రాజకీయ. ఆర్థిక కారణాలు ప్రతిబంధకాలను కల్పించాయి. అందుచేత రాజ్యాంగం ఈ అవరోధాలను తొలగించేందుకు ఒక పథకాన్ని రూపొందించింది. ఈ పథకం కేంద్ర రాష్ట్ర ఆర్థిక సంబంధాలను రెండు భాగాలుగా విభజించింది : 1) కేంద్ర రాష్ట్రాల మధ్య ఆదాయాలు, వనరుల కేటాయింపు, 2) సహాయక విధుల పంపిణీ రాజ్యాంగంలో పొందుపరిచిన కేంద్ర రాష్ట్రాల మధ్య వనరుల పంపిణీని ఈ క్రింది విధంగా వివరించవచ్చును.

### 5.4.1 కేంద్ర వనరులు :

రాజ్యాంగం కేంద్రానికి కేటాయించిన ఆదాయ వనరులలో ప్రధానమైనవి; 1) కార్పోరేట్ పన్ను, 2) కస్టమ్స్ సుంకాలు, 3) పొగాకు, భారత దేశంలో ఉత్పత్తి అయ్యే ఇతర వస్తువులపై ఎక్సైజు సుంకాలు, 4) విదేశీ ఋణాలు, 5) రైల్వేల నుంచి లభించే ఆదాయం, 6) వ్యవసాయం నుంచి కాక ఇతర వనరుల నుంచి లభించే ఆదాయంపై పన్ను, 7) ఆస్థుల క్యాపిటల్ విలువపై పన్ను, 8) వార్తా పత్రికల క్రయ విక్రయాలపై పన్ను, 9) రైల్వేలు, విమానాలు, నౌకల ద్వారా రవాణా అయ్యే సరుకులు, ప్రయాణికులపై పన్ను.

### 5.4.2 రాష్ట్ర వనరులు

రాజ్యాంగం రాష్ట్రాలకు కేటాయించిన ఆదాయ వనరులలో ప్రధానమైనవి. 1) క్యాపిటల్ పన్నులు, 2) వ్యవసాయ భూముల బదిలీలపై సుంకాలు, 3) వ్యవసాయ భూములపై ఎస్టేట్ సుంకాలు, 4) రాష్ట్రంలో ఉత్పత్తి అయ్యే కొన్ని రకాల వస్తువులపై ఎక్సైజు సుంకాలు, 5. భూమిశిస్తు, 6. వ్యవసాయంనుంచి వచ్చే ఆదాయంపై పన్ను, 7) స్టాంప్ డ్యూటీ 8) భూములు, భవంతులపై పన్ను, 9) విద్యుచ్ఛక్తి వినియోగం, అమ్మకంపై పన్నులు 10) వార్తా పత్రికలు మినహా ఇతర వస్తువులు అమ్మకం, కొనుగోలుపై పన్నులు, 11) వాహనాలపై పన్నులు, 12) ప్రకటనలపై పన్నులు, 13) ఆడంబర వస్తువులు, వినోద కార్యక్రమాలనై పన్నులు, 14) జంతువులు, బోట్లపై పన్నులు.

### 5.4.3 కేంద్ర విధించే వసూలు చేసి ఆదాయాన్ని రాష్ట్రాలకు అప్పగించే పన్నులు:

రాజ్యాంగంలోని 269వ అధికరణ ప్రకారం కేంద్రప్రభుత్వం విధించి వసూలు చేసి వాటి ద్వారా లభించే ఆదాయాన్ని రాష్ట్రాలకు అప్పగించే పన్నులు ఈ క్రిందివి 1) వ్యవసాయ భూములు కాక ఇతర ఆస్థుల బదిలీపై విధించే సుంకాలు, 2) వ్యవసాయ భూములు కాక ఇతర ఆస్థుల బదిలీపై విధించే ఎస్టేట్ సుంకాలు, 3) రైల్వే చార్జీల పై పన్నులు 4) స్టాంప్ డ్యూటీలు కాక ఇతర పన్నులు 5) వార్తా పత్రికల పై క్రయ విక్రయాలు వాటిలో ప్రచురించే ప్రకటనపై పన్నులు, 6) రైల్వేలు, నౌకలు, విమానాలు, ద్వారా రవాణా అయ్యే వస్తువులు లేదా ప్రయాణికులు టర్మినల్ పన్నులు 7) వార్తా పత్రికలు కాక మిగతా వస్తువుల కొనుగోలు విక్రయాలపై పన్నులు.

### 5.4.4 కేంద్రం విధించి రాష్ట్రాలు వసూలు చేసుకునే పన్నులు

రాజ్యాంగం 268వ అధికరణ పేర్కొన్న కేంద్రం విధించి రాష్ట్రాలు వసూలు చేసుకొని ఆ ఆదాయాన్ని తామే పంచుకునే పన్నులు ఈ క్రిందివి:

మందులు, అలంకరణ వస్తువులపై విధించే స్టాంపు, ఎక్సైజు సుంకాలు.

### 5.4.5 కేంద్రం విధించి వసూలు చేసి ఆ ఆదాయాన్ని కేంద్రం రాష్ట్రాలు పంచుకునే పన్నులు:

రాజ్యాంగం 270వ, 272వ అధికరణల ప్రకారం కేంద్రం విధించి వసూలు చేసి ఆ ఆదాయాన్ని కేంద్ర రాష్ట్రాలు పంచుకునే పన్నులు ఈ క్రిందివి.

1) వ్యవసాయం నుంచి లభించే ఆదాయం కాక ఇతరత్రా లభించే ఆదాయంపై పన్ను, 2) మందులు, అలంకరణ వస్తువులు కాక ఇతర వస్తువులపై విధించిన ఎక్సైజు సుంకాలు.

### 5.4.6 సహాయక నిధులు :

సమాఖ్య కేవలం ఐక్యత చేకూర్చే శక్తి కాక సమానత్వాన్ని సాధించే శక్తి కూడా. దేశంలో కొన్ని రాష్ట్రాలు అభివృద్ధి చెందగా, ఇతర రాష్ట్రాలు ఆర్థికంగా అభివృద్ధి చెందని లేదా వెనుకబడిన దశలో ఉంటాయి. కేంద్ర ప్రభుత్వం సామాజికంగా, ఆర్థికంగా వెనుబడిన రాష్ట్రాలు అభివృద్ధి చెందేందుకు అవకాశం కల్పించాలి. ఈ లక్ష్యాన్ని సాధించేందుకు భారత రాజ్యాంగం కేంద్ర ప్రభుత్వం అవసరం ఉన్న రాష్ట్రాలకు సహాయక నిధులను అందచేసే పద్ధతిని ప్రవేశపెట్టింది. రాజ్యాంగంలోని 375 అధికరణ భారత సంఘటిత నిధి నుండి అవసరం ఉన్న రాష్ట్రాలకు కొంత మొత్తాన్ని సహాయక నిధిగా అందచేసే అధికారాన్ని పార్లమెంటుకు కల్పించింది. ఈ నిధుల పరిమాణాన్ని ఆర్థిక సంఘం సూచనల ఆధారంగా నిర్ధారిస్తారు. అంతేకాక రాజ్యాంగం కేంద్రప్రభుత్వం అనుమతితో షెడ్యూల్డ్ కులాల, తెగల సంక్షేమానికి రాష్ట్రాలు చేపట్టే కార్యక్రమాలు, పథకాల అమలుకు అవసరమైన నిధులను సమకూర్చటం కేంద్ర ప్రభుత్వం బాధ్యతగా నిర్ధారించింది.

కేంద్ర రాష్ట్రాల మధ్య ఆర్థిక పంబంధాలను నిర్దేశించి రాజ్యాంగంలోని ఇతర అధికరణలు ఈ క్రిందివి.

1 . రాజ్యాంగంలోని 282 వ అధికరణ ప్రకారం కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రజాప్రయోగ కార్యక్రమాల అమలుకు నిధులను కేటాయించవచ్చును.

2. రాజ్యాంగంలోని 284 వ అధికరణ భారత సంఘటిత నిధికి జమచేసే అధికారాన్ని, ఆ నిధి ఖర్చు చేసే అధికారాన్ని పార్లమెంటుకు అప్పగించింది. ఇదే విధంగా రాష్ట్ర సంఘటిత నిధికి జమా ఖర్చుల అధికారాన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు సంక్రమింపజేసింది.

3. రాజ్యాంగంలోని 292వ అధికరణ ఎక్కడ నుంచైనా ఋణాలను సేకరించే అధికారాన్ని కేంద్ర ప్రభుత్వానికి కల్పించింది. అయితే ఈ ఋణాల పరిమితులను వాటిపై గ్యారంటీలను పార్లమెంటు నిర్ధారిస్తుంది. ఇదే విదంగా 293వ రాజ్యాగం అధికరణ ఋణాలను సేకరించే అధికారాన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు కల్పించింది. ఈ ఋణాలపై పరిమితులను సంబంధిత గ్యారంటీలను రాష్ట్రాల శాసన సభలు నిర్ణయిస్తాయి.

## 5.5. రాజ్యాంగం పరంగా బలమైన కేంద్ర ప్రభుత్వం:

రాజ్యాగం నిపుణుల అభిప్రాయం ప్రకారం రాజ్యాంగం బలమైన కేంద్ర ప్రభుత్వాన్ని ఏర్పరచింది. కేంద్ర ప్రభుత్వ బలం విస్తృత స్థాయిలో ఈ ప్రభుత్వానికి కల్పించిన శాసన నిర్మాణ, ఆర్థిక పరమైన అధికారాలు, కొన్ని పరిస్థితులలో రాష్ట్ర శాసనసభలను, పరిపాలనను నియంత్రించటంలో ఇమిడి వుందని వీరి అభిప్రాయం. రాజ్యాంగంలో పొందుపరచిన మూడు జాబితాలను కేంద్ర జాబితా, రాష్ట్ర జాబితా, ఉమ్మడి జాబితాలను పరిశీలిస్తే రాజ్యాంగం కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్రాలకంటే విస్తృతమైన అధికారాలను కల్పించినట్లుగా గుర్తించవచ్చును. రాజ్యాంగంలోని అత్యవసర పరిస్థితికి సంబంధించిన వివిధ అధికరణలు కేంద్ర ప్రభుత్వాన్ని శక్తివంతంగా రూపొందించటంతో పాటు రాష్ట్రాల స్వయంప్రతిపత్తిని పరిమితం చేశాయి. రాష్ట్రాలలో విధించే అత్యవసర పరిస్థితి లేదా రాష్ట్ర పరిపాలనకు సంబంధించిన వివిధ అధికరణలు రాష్ట్రాల స్వయం ప్రతిపత్తిని తీవ్రంగా ప్రభావితం చేసాయి. రాజమన్నార్ సంఘం భారతదేశంలో కేంద్ర ప్రభుత్వం శక్తివంతంగా రూపొందించటానికి రాజ్యాంగంలోని అధికరణలతో పాటు కొన్ని ఇతర కారణాలను లేదా పేర్కొంది అవి.

1) కేంద్రంలో ఏకపార్టీ పాలన, 2) ఆర్థిక వనరులకై కేంద్రం పై రాష్ట్రాలు మితిమీరి ఆధారపడటం, 3) ప్రణాళికీకరణ, ప్రణాళిక సంఘం పాత్ర, ఒక రాజ్యాంగ నిపుణుని అభిప్రాయం ప్రకారం రాష్ట్రాలు ఆర్థికంగా కేంద్రంపై ఆధారపడటం రాజకీయంగా పాలనపరంగా కూడా కేంద్రంపై అధికంగా ఆధారపడటానికి దారి తీసింది. భారతదేశ రాజకీయ చారిత్రక నేపథ్యం, రాజ్యాంగాన్ని రూపొందించే సమయంలో దేశంలో నెలకొన్న పరిస్థితులు రాజ్యాంగ నిర్మాతలు శక్తివంతమైన కేంద్రప్రభుత్వాన్ని ఏర్పరచటానికి ప్రధాన కారణం. అంతేకాక దేశం సత్వరంగా అభివృద్ధి సాధించేందుకు అవసరమైన జాతీయ ఆర్థిక వనరులను సమర్థవంతంగా సమీకరించేందుకు బలమైన కేంద్ర అవసరాన్ని గుర్తించారు. విస్తృతమైన భోగోళిక పరిమాణం, సాంస్కృతిక, సామాజిక భిన్నత్వాలు, ప్రాంతీయ వాదానికి సంబంధించిన సమస్యలు, రాజకీయ డిమాండ్లు, ఇతర స్థానిక సమస్యలు కారణంగా రాజ్యాంగ నిర్మాతలు దేశ క్షేమం సమగ్రత లక్ష్యాలను దృష్టిలో ఉంచుకొని బలమైన కేంద్రాన్ని ఎంచుకొన్నారని గుర్తించవచ్చును.

కేంద్ర రాష్ట్ర సంబంధాల సమస్యను పరిష్కరించేందుకు కొందరు పహకార సమాఖ్య విధానాన్ని ఒక మార్గంగా సూచించారు. ఈ విధానం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మధ్య నిరంతర ప్రాతిపదికమీద సంప్రదింపుల ప్రాధాన్యతను నొక్కి చెప్పింది. కాగా భారత రాజ్యాంగం లోని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల విధులను ఖచ్చితంగా విభజించటం వాంఛనీయంగా కాదని గుర్తించింది. అందుచేత భారత రాజ్యాంగం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య నిరంతర పరస్పర భాధ్యతకు అనేక ఏర్పాట్లను చేసింది. రాజ్యాంగం కేంద్ర రాష్ట్రాల మధ్య సమన్వయాన్ని సాధించేందుకు అంతర్ రాష్ట్ర మండలిని ఏర్పాటు చేసింది. 1956 లో ప్రాంతీయ మండలుల స్థాపన సహకార సమాఖ్య ఏర్పాటుకు భారత ప్రభుత్వం తీసుకున్న మరో చర్య. కేంద్రంలో రాష్ట్రాలలో విభిన్న రాజకీయ పార్టీలు అధికారంలో ఉన్న ప్రస్తుత తరుణంలో ప్రాంతీయ మండలుల వల్ల ఎంతో ప్రయోజనం ఉంది.

ఇదే విధంగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన అనేక ఇతర సంస్థలు దేశాన్ని సహకార సమాఖ్యగా తీర్చిదిద్దటంలో కీలకపాత్ర వహిస్తున్నాయి. ఈ సంస్థలలో ప్రణాళిక సంఘం, జాతీయ అభివృద్ధి మండలి ప్రధానమైనవి. ప్రణాళిక సంఘాన్ని కొందరు సూపర్ క్యాబినెట్ అని విమర్శించినప్పటికి ప్రణాళికి సంఘం దేశంలో అభివృద్ధి ప్రక్రియలో కేంద్ర రాష్ట్రాల మధ్య సహకారాన్ని పోషించడంలో ప్రధాన పాత్రను పోషిస్తున్నది. భారత సమాఖ్య పహకార సమాఖ్య అనే భావనను పెంపొందింపజేసేందుకు సదస్సుల (Conferences ) పద్ధతిని అనుసరిస్తున్నది. కేంద్ర రాష్ట్ర ప్రతినిధుల మధ్య తరచుగా సదస్సులను సమావేశాలను నిర్వహించడం భారతదేశ సమాఖ్య ప్రధాన లక్ష్యంగా రూపొందింది. ఉదాహరణకు, గవర్నర్ల సదస్సులు, ముఖ్యమంత్రుల సదస్సులు, వివిధ శాఖలకు చెందిన కేంద్ర, రాష్ట్ర మంత్రుల సదస్సుల, కేంద్ర, రాష్ట్ర ఉద్యోగుల సదస్సులు తరచుగా నిర్వహించబడుతున్నాయి. ఈ సమావేశాలు, సదస్సులలో కేంద్ర ప్రభుత్వ ప్రతినిధులు, రాష్ట్రాలకు నాయకత్వాన్ని మార్గదర్శకత్వాన్ని అందిస్తున్నారు.

కొందరు రాజ్యాంగ నిపుణులు, సంస్కరణ సంఘాలు, కొన్ని రాజకీయ పార్టీలు కోరుతున్న విధంగా రాష్ట్రాలకు అధిక స్వయం ప్రతిపత్తిని కల్పించడం కేంద్రం బలహీనపడేందుకు దారి తీస్తుందని వాదించారు. బలహీనమైన కేంద్రం శక్తివంతమైన రాష్ట్రాలు వేర్పాటు వాదానికి దారితీస్తాయని వారు పేర్కొన్నారు. దేశంలో నెలకొన్న వివిధ రకాల భిన్నత్వాల నేపధ్యంలో బలమైన కేంద్రం అవసరం అయితే రాజ్యాధికారం కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య విభజింపబడిన రాజకీయ వ్యవస్థలో ఈ రెండు స్థాయిల ప్రభుత్వాల మధ్య వివాదాలు, అభిప్రాయ బేధాలు సమస్యలు తలెత్తడం సహజం. ఈ నేపధ్యంలో రాష్ట్రాల ప్రయోజనాలకు, కోర్కెలకు తగిన ప్రాధాన్యత కల్పించటం, కేంద్ర ప్రభుత్వం కర్తవ్యం. ఒక ప్రముఖ రాజనీతి శాస్త్రవేత్త పేర్కొన్నట్లు భారతదేశంలో ఏకత్వంలో భిన్నత్వం అనే ఉదాత్తసూత్రం చిరకాలం కొనసాగాలంటే రాష్ట్రాలు తమకు సమకూరిన బలానికి దేశంలో నెలకొన్న ఏకత్వం ప్రధాన కారణమని గుర్తించాలి. ఇదే సందర్భంలో కేంద్రం తనవంతుగా దేశంలో వివిధ ప్రాంతాలలో నెలకొన్న ఉప -సంస్కృతులు, ఇతర వైవిధ్యాల నుంచి ఉత్పన్నమయ్యే ఉత్కృష్టతను, సుసంపన్నతను గుర్తించాలి.

ఇంకో వాదన ప్రకారం కేంద్రానికి విస్తృతమైన అధికారాలను కల్పించిన ఫలితంగా రాష్ట్రాలు బలహీనపడ్డ కారణంగా అవి స్వయం ప్రతిపత్తికై పెద్ద వంతున డిమాండు చేయడం ఇటీవల కాలంలో ఉద్భతమైంది. అయినప్పటికి ఈ ధోరణి దేశమంతా సమానస్థాయిలో లేదు. దీనికి కేంద్రంలో రాష్ట్రాలలో విభిన్న రాజకీయ పార్టీలు అధికారంలో ఉండటం ప్రధాన కారణం. మూడవ వాదన ప్రకారం రాష్ట్రాలు బలపడినంత మాత్రాన కేంద్రం బలహీనపడ లేదు. దేశ ఐక్యతకు, భద్రతకు ప్రమాదం కలగటం సంభవించలేదు. క్లిష్ట సమయాలలో పరిపాలనకు సరళతను చేకూర్చే ఏర్పాట్లు రాజ్యాంగంలో ఉన్నాయి. అంతేకాక సమాఖ్య విధానం వల్ల అనివార్యంగా తలెత్తే క్లిష్టతలను, ఉద్రిక్తతలను నివారించేందుకు భారత సమాఖ్య వ్యవస్థ అనేక లాంఛన ప్రాయం కాని సాధనాలను ఏర్పరచుకుంది. ఈ కారణాల వల్ల దేశంలో కేంద్ర రాష్ట్రాలు పరస్పరం ఆధారపడడం, అదే సమయంలో స్వతంత్ర ప్రతిపత్తిని కలిగి ఉంటడం మీద ఆధారపడిన సహకార సమాఖ్య అభివృద్ధి చెందుతున్నది. చివరగా రాజ్యాంగం ఏర్పరచిన కార్యచరణ పరిధిలో తగిన మార్పులు, సవరణలు ప్రవేశపెట్టడం ద్వారా భారత సమాఖ్య విధానాన్ని మెరుగు ఏర్పరచవలసి ఉంది. దీనికి గత ఐదు దశాబ్దాల అనుభవాన్ని ప్రాతిపదికగా ఉపయోగించాలి.

## 5.6 కేంద్ర రాష్ట్ర సంబంధాలు - ఆచరణ:

స్వాతంత్రం వచ్చిన మొదటి రెండు దశాబ్దాల వరకు భారతదేశ రాజకీయాలలో కేంద్ర రాష్ట్ర సంబంధాలు ఒక సాధారణ విషయం మాత్రమే. ఈ కాలంలో కేంద్ర రాష్ట్ర సంబంధాలపై దృష్టిని సారించటానికి అవకాశం లేని విధంగా ఈ రెండు స్థాయిల ప్రభుత్వాల మధ్య సంబంధాలు సామరస్య పూరితంగా తప్ప విభేదాలు, ఘర్షణలకు చోటులేని విధంగా కొనసాగాయి. కేంద్ర రాష్ట్రాలలో ఒకే పార్టీ పదవిలో ఉండడం, ప్రధాన మంత్రి నెహ్రు వ్యక్తిత్వం, ప్రతిపక్షాల బలహీనత మొదలైన కారణాల వల్ల కేంద్ర రాష్ట్ర సంబంధాలలో ఎలాంటి వివాదం తలెత్తలేదు. అయితే 1967 లో నిర్వహించిన నాలుగవ సాధారణ ఎన్నికల తరువాత దేశ రాజకీయాలలో ప్రధానంగా కేంద్ర రాష్ట్ర సంబంధాలలో అనేక కీలక మార్పులు చోటు చేసుకున్నాయి. ఈ సాధారణ ఎన్నికలలో పార్లమెంటులో కాంగ్రెస్ పార్టీబలం గణనీయంగా క్షీణించటంతో పాటు అనేక రాష్ట్రాలలో కాంగ్రేసేతర పార్టీలు ప్రభుత్వాలు ఏర్పడ్డాయి. కేంద్రం

రాష్ట్రాలలో విభిన్న పార్టీలు అధికారంలో ఉండటం వలన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మధ్య అభిప్రాయ బేధాలు తలెత్తడం ప్రారంభమైంది. విపక్షాలు అధికారంలో ఉన్న రాష్ట్ర ప్రభుత్వాలు, కాంగ్రెస్ ఆధీనంలో ఉన్న కేంద్ర ప్రభుత్వం తమపై ఆధిక్యతను ప్రదర్శిస్తూ తమ స్వేచ్ఛను, స్వాతంత్ర్యాలను హరించటంతో పాటు రాష్ట్ర వనరులకై కేంద్ర ప్రభుత్వం పై ఆదరించవలసిన పరిస్థితిని సృష్టించిందని విమర్శలను ప్రారంభించటంతో కేంద్ర రాష్ట్ర సంబంధాలలో ఒక నూతన అధ్యయాన్ని ప్రారంభమైంది.

1960 దశాబ్దం నుంచి కేంద్ర రాష్ట్ర మధ్య సంబంధాలు క్షీణించటానికి ఈ క్రింది కారణాలు పేర్కొనటం జరిగింది.

1. గవర్నర్ల పక్షపాతపూరితమైన పాత్ర;
2. రాష్ట్రపతి పాలన విధింపుకు అవకాశం కల్పించే రాజ్యాంగం అధికరణ దుర్వినియోగం;
3. ప్రణాళిక సంఘం పాత్ర;
4. రాష్ట్ర ప్రభుత్వాల అనుమతి లేకుండా రాష్ట్రాలలో కేంద్రం రిజర్వు పోలీసుల వినియోగం;
5. రాజ్యాంగంలోని 257వ 365వ అధికరణల ప్రకారం రాష్ట్రాలకు ఆదేశాలను జారీ చేసే కేంద్ర ప్రభుత్వం అధికారం;
7. రాష్ట్రాల కంటే కేంద్రానికి ఎక్కువ ఆర్థిక వనరులను కల్పించే రాజ్యాంగంలోని ఏర్పాటు;

ఈ పై అంశాలు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మధ్య అగాధాన్ని సృష్టించాయి. అందుచేత ప్రతిపక్షాలలో ఉన్న తమిళనాడు, పంజాబ్, పశ్చిమబెంగాల్ ప్రభుత్వాలు రాష్ట్రాలకు ఎక్కువ అధికారాలు, ఆర్థిక వనరులు కల్పించి వాటికి స్వయం ప్రతిపత్తిని కల్పించే విధంగా రాజ్యాంగంలో సవరణలను చేయాలని వాదించడం మొదలైంది.

1960 వ దశాబ్దంలో కేంద్ర రాష్ట్రాల మధ్య క్షీణించిన సంబంధాలు దేశ రాజకీయాలపై తీవ్రమైన ప్రభావాన్ని కనపర్చాయి. కేంద్ర రాష్ట్రాల సంబంధాలు దేశంలో ఒక గొప్ప చర్చనీయాంశం అయ్యాయి. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఈ అంశాలపై తమ దృష్టిని సారించక తప్పలేదు. 1968లో కేంద్ర ప్రభుత్వం నియమించిన పరిపాలన సంస్కరణల సంఘం (ARC), 1971లో తమిళనాడు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్ర రాష్ట్ర సంబంధాల విచారణా సంఘం (రాజమన్నార్ సంఘం), కేంద్ర రాష్ట్ర సంబంధాలకు చెందిన అనేక అంశాలను సమగ్రంగా పరిశీలించి వాటిని మెరుగుపరచేందుకు అనేక సంస్కరణలను సూచించాయి. 1980 దశాబ్దంలో కేంద్ర రాష్ట్ర సంబంధాలపై మరింత తీవ్ర స్థాయిలో చర్చ ప్రారంభమైనది. కొందరు ప్రతిపక్ష నాయకులు రాజ్యాంగం ఆధికారాల పంపిణి నిష్పాక్షికతను, హేతుబద్ధతను ప్రశ్నించడం మొదలైంది. ఈ పరిస్థితిని మార్పు చేసేందుకు రాజ్యాంగంలో మార్పులు ప్రవేశ పెట్టాలని వారు వాదించారు. అధిక సంఖ్యలో రాజకీయ నాయకులు, మేధావులు, ఇతర ప్రముఖులు అధికార వికేంద్రీకరణ అవశ్యకతను నొక్కి చెప్పారు. ఈ దశాబ్దంలో దేశంలో కాంగ్రెస్ పార్టీ ఆధిక్యత మరింత క్షీణించడంతోపాటు అనేక రాష్ట్రాలలో ప్రాంతీయ పార్టీలు ఏర్పడ్డాయి. 1983 నాటికి దేశంలోని ఆరు ప్రధాన రాష్ట్రాలలో కేంగ్రెసేతర ప్రతిపక్షాలు లేదా ప్రాంతీయ పార్టీలు అధికారంలోకి వచ్చాయి. ఈ పరిమాణం వల్ల రాజ్యాంగంలో పొందుపరచిన కేంద్ర, రాష్ట్ర సంబంధాలను సమీక్షించడం అధికార పంపిణీలో మార్పు చేయడం అనే వాదనలకు మరింత బలం చేకూరింది. మార్చి 1983లో బెంగుళూర్‌లో నిర్వహించబడిన నాలుగు దక్షిణాది రాష్ట్రాలముఖ్యమంత్రుల - ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, పాండిచెర్రి సమావేశాలు కేంద్రం అధికారాలను తగ్గించి రాష్ట్రాలకు ఎక్కువ అధికారాలను, స్వయంప్రత్తిని కల్పించాలనే నినాదం రూపుదిద్దుకుంది. ముఖ్య మంత్రుల సమావేశం నిర్ణయాలు, వారు చేసిన సిఫారసులకు కేంద్ర ప్రభుత్వం స్పందించింది. 1985 జూన్‌లో కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగంలోని కేంద్ర రాష్ట్ర సంబ ంధాలను సమీక్షించి వాటిని మెరుగుపరిచేందుకు, తగిన సూచనలు చేసేందుకు జస్టిస్ ఆర్. ఎస్. సర్కారియా అధ్యక్షతను ఒక సమీక్ష సంఘాన్ని నియమించింది. ఈ సంఘంలో శివరామన్, ఎస్. ఆర్. సేన్‌లు సభ్యులు.

1985 లో కొందరు ప్రముఖ ప్రతిపక్షాల నాయకులు రాష్ట్రాల స్వయం ప్రతిపత్తి కేంద్ర రాష్ట్ర సంబంధాలలో మార్పుల గురించి చర్చించేందుకు విజయవాడతో ఒక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో కేంద్ర ప్రభుత్వ అధికారాలను తగ్గించటంతో పాటు కేంద్ర, రాష్ట్రాల మధ్య వనరుల న్యాయపరమైన పంపిణీకి ఒక విత్త సంఘాన్ని ఏర్పాటు చేయాలని తీర్మానించారు. రాష్ట్రాల స్వయంపత్తికై ఆందోళన సాగిస్తున్న ప్రతిపక్షాలు అక్టోబరు 1983లో శ్రీనగర్‌లో మరోసారి సమావేశమయ్యారు. ఈ సమావేశంలో

దీనికి ముందు జరిగిన రెండు సమావేశాలలో చేసిన తీర్మానాలను మరోసారి వక్కాణించారు. అయితే ఈ సమావేశంలో ప్రతిపక్ష నాయకుల డిమాండ్లు స్పష్టమైన రూపుసంతరించుకున్నాయి. ఈ డిమాండ్లలో రాజ్యాంగంలో గల రాష్ట్రపతి పరిపాలన విధింపు అధికరణలను పూర్తిగా తొలగించడం, రాష్ట్రాల అధికారాలను రాష్ట్ర జాబితాలోని అంశాలను పెంచడం, అవశిష్ట అధికారాలను కేంద్రానికి కాక రాష్ట్రాలకు కల్పించడం, రాజ్యాంగంలో పొందు పరచిన అధికార పంపిణీకి పంబంధించిన మూడు జాబితాలను సమీక్షించడం మొదలైనవి ప్రధానమైనవి. ఈ సమావేశంలో అంతర్ రాష్ట్ర మండలి (అధికరణ 263) ని ఏర్పాటు చేయాలనే సూచనను నొక్కి చెప్పడం జరిగింది. ఈ విధంగా 1980 దశాబ్దంలో కేంద్ర రాష్ట్ర సంబంధాలు గొప్ప ప్రాధాన్యతను సంతరించుకొని దేశరాజకీయాలలో చర్చకు కేంద్రబిందువు అయ్యాయి.

1990 దశాబ్దంలో దేశంలో సంకీర్ణ రాజకీయాల శకం అవతరించింది. కేంద్ర రాష్ట్రాల సంబంధాలను ఒక నూతన మలుపు తిప్పింది. సంకీర్ణ రాజకీయాల ఫలితంగా సహకార సమాఖ్య ధోరణి మొదలై ఘర్షణ స్థానంలో, పరస్పరం ఇచ్చి పుచ్చుకునే ధోరణి ప్రారంభమైంది

## 5.7 ముగింపు

మొదట్లో భారత సమాఖ్య వ్యవస్థ రాజ్యాంగం ఏర్పరచిన బలమైన కేంద్రం విధానంపై ఆధారపడి పని చేసింది. అయితే ఆచరణలో క్రమంగా అనేక కారణాల వల్ల కేంద్రం రాష్ట్రాలపై మితిమీరిన ఆధిక్యతను, ప్రభావాన్ని పొందగలిగినది. దీనికి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పథకాలు మొదలైన కారణాలతో పాటు స్వాతంత్ర్యం సిద్ధించిన మొదటి రెండు దశాబ్దాలు కేంద్రంలో రాష్ట్రాలలో ఒకే పార్టీ అధికారంలో ఉండడం మన కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్రాలపై అపరిమితమైన నియంత్రణాధికారం సంక్రమించింది. అయితే ఈ అవకాశాన్ని కేంద్ర నాయకత్వం సమర్ధవంతంగా వినియోగించకపోయింది. 1970 దశాబ్దం నుంచి కేంద్రంలో రాష్ట్రాలలో విభిన్న పార్టీలు అధికారంలోకి రావటంతో కేంద్ర రాష్ట్ర సంబంధాలలో మౌలికమైన మార్పులు సంభవించాయి. క్రమంగా కేంద్ర రాష్ట్ర సంబంధాలు క్షీణించాయి. అయితే ఇదే సమయంలో దేశంలో సంభవించిన పరిస్థితుల కారణంగా దేశ రాజకీయ వ్యవస్థ సమాఖ్య స్వభావాన్ని కోల్పోయిందని చెప్పటం సరికాదు. రాష్ట్రాలు రాజ్యాంగం కల్పించిన స్వయంప్రతిపత్తిని విద్య, వైద్య, సాంస్కృతిక, వ్యవసాయ, సాంఘిక, సంక్షేమం స్థానిక ప్రభుత్వాల రంగాలలో పరిపూర్ణంగా అనుభవిస్తున్నాయి. అంతేకాక దేశ సామాజిక ఆర్థిక అభివృద్ధికి, పేదరిక నిర్మూలనకు, బలహీన వర్గాల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వాలు అనేక వినూత్న పథకాలను కేంద్రం అందిస్తున్న నిధులతో చేపట్టడం జరిగింది. ఈ పథకాలను రాష్ట్రాలు విజయవంతంగా అమలు చేస్తున్నాయి. అయినప్పటికీ కొన్ని రాష్ట్రాలు అధికార వికేంద్రీకరణను, స్వయంప్రతిపత్తిని డిమాండు చేయడం ప్రారంభమైంది. 356వ రాజ్యాంగం అధికరణను కేంద్ర ప్రభుత్వ తరచు వినియోగించటం రాష్ట్రాలు స్వయం ప్రతిపత్తిపై వ్యతిరేక ప్రభావాన్ని కనబరిచినదని విశ్లేషకులు పేర్కొనడం జరిగింది. అయితే 356వ అధికరణను తరచుగా వినియోగించటం ద్వారా కేంద్రం రాష్ట్రాల స్వయంప్రతిపత్తి హరించి వాటిని నిర్వీర్యం చేసిందని చెప్పటం పూర్తిగా వాస్తవం కాదు. ఏమైనప్పటికి బలహీనమైన కేంద్రం సమాఖ్య వ్యవస్థ లక్షణం కాదు. బహుళత్వ స్వభావం కలిగిన భారతదేశానికి బలమైన కేంద్రం అత్యంత ఆవశ్యకం సర్కారియా కమీషన్ ఈ వాస్తవాన్నినొక్కి చెప్పింది.

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రెండు, తమ విధులను సమర్ధవంతంగా నిర్వహించేందుకు తమ కార్యక్రమాలను అమలు పరచేందుకు కేంద్రం, రాష్ట్రాలు రెండూ బలంగా ఉండటం అవసరం. అంతేకాక బలమైన కేంద్రం, అధికార వికేంద్రీకరణల మధ్య ఎలాంటి సంఘర్షణ లేదు. అనేక భిన్నత్వాలు కలిగిన భారతదేశ సమాజానికి కేంద్రీకరణ కంటే వికేంద్రీకరణే ఎక్కువ అవసరం. దీంతోపాటు అట్టడుగు స్థాయిలోకల స్థానిక ప్రభుత్వాల సంస్థలకు తగిన అధికారాలను కల్పించడం దేశ సామాజిక ఆర్థిక ప్రగతికి ప్రధాన ఆవశ్యకత. ఈ విధమైన దృక్పధ చట్రంలోనే కేంద్ర రాష్ట్ర సంబంధాలను అధ్యయనం చేసి వాటిలో మార్పులను ప్రవేశపెట్టవలసి వుందనే బిపిన్‌చంద్ర అభిప్రాయం అనుసరణీయమైనది.

ఏమైనప్పటికి దేశంలో తలెత్తుతున్న సంక్షోభాలను నివారించేందుకు రాజ్యాంగం కేంద్ర ప్రభుత్వానికి సహేతుకంగానే అవసరమైన అధికారాలను కల్పించింది. దీంతోపాటు 1994 లో ఒక రాష్ట్రంలో రాష్ట్ర ప్రతిపాలనను విధించే ముందు అందుకు దారితీసిన పరిస్థితులను సమగ్రంగా వివరించాలని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును కేంద్రప్రభుత్వం అనుసరిస్తే రాజ్యాంగం కేంద్ర రాష్ట్ర సంబంధాలపై రాజ్యాంగం ఏర్పరచిన విధానం ఆశించిన ఫలితాలను కలుగచేస్తుందని నిస్సందేహంగా చెప్పవచ్చును. ఇటీవల కాలంలో కొందరు పాశ్చాత్య భారతీయ రాజనీతి శాస్త్రవేత్తలు దేశంలో వేగంగా మారుతున్న రాజకీయ పరిస్థితులలో మారుతున్న కేంద్ర రాష్ట్ర సంబంధాలను విశ్లేషించి కొన్ని నిర్దుష్టమైన అభిప్రాయాలను వెల్లడించారు. జేమ్స్ మనోర్ మొదలైన రచయితల వాదన ప్రకారం 1967లో కాంగ్రెస్ ఆధిక్యత అంతరించిన తరువాత భారత రాజకీయాలలో గురుత్వ ఆకర్షణ (Gravity) కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్రాలకు బదిలీ అయింది. కొందరు ఇతర రచయితలు దేశంలో కాంగ్రెస్ ఆధిక్యత నశించాక దేశ రాజకీయాలు ప్రాంతీయ పరంగా, జాతుల పరంగా ఖండఖండాలుగా విభజితమైందని పేర్కొన్నారు. ఈ పరిస్థితులలో జాతీయ సమస్యలు లేదా స్థానిక సమస్యలు రెండూ ప్రాధాన్యతను వహించటం లేదు. అంతేకాక ప్రాంతీయ పార్టీలు పెరుగుతున్న ప్రభావం వల్ల భారత దేశంలో ధృవీకృత (Polarised), బహుళతా స్వభావం కలిగిన బహుళ పార్టీ వ్యవస్థ అభివృద్ధి చెందిందని వీరి అభిప్రాయం.

కేంద్ర రాష్ట్ర సంబంధాలపై కేంద్ర ప్రభుత్వం నియమించిన సంఘాలలో సర్కారియా సంఘానికి అత్యంత కీలకస్థానం ఉంది. సర్కారియా సంఘం 1950-80 మధ్య గల సుదీర్ఘకాలంలో కేంద్ర రాష్ట్ర సంబంధాలను అతి సమగ్రంగా, నిశితంగా సమీక్షించటంతో పాటు వాటిని మెరుగు పరచేందుకు అనేక కీలకమైన సూచనలు చేసింది. 1983 లో దేశంలో సంబంధించిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో అప్పటి కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర సంబంధాల పరిస్థితిని అధ్యయనం చేసేందుకు 9 జూన్ 1983 న సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ రంజిత్‌సింగ్ సర్కారియా అధ్యక్షతన ఒక విచారణా సంఘాన్ని నియమించింది.

సర్కారియా కమీషన్ వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు, వ్యక్తులు సంస్థల నుంచి సేకరించిన విస్తృతమైన సమాచారం ఆధారంగా కేంద్ర రాష్ట్ర సంబంధాలను అతి సమగ్రంగా అధ్యయనం చేసి వాటిని మెరుగుపరచేందుకు అనేక సూచనలను చేసింది. సర్కారియా కమీషన్ సమర్పించిన 21 అధ్యయాలు కలిగిన నివేదిక భారతదేశంలో మౌర్యుల కాలం నుంచి బ్రిటీష్ పాలన వరకు కొనసాగిన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సంబంధాలను సమీక్షించి స్వాతంత్ర్యానంతరం కేంద్ర రాష్ట్రాల మధ్య మారుతున్న సంబంధాలను, మారుతున్న రాజకీయ ఆర్థిక, సామాజిక పరిస్థితుల నేపథ్యంలో సమగ్రంగా విశ్లేషించి, వాటిపై అనేక సూచనలను చేసింది. దానితోపాటు కేంద్ర రాష్ట్ర సంబంధాలను మెరుగుపరచేందుకు అనేక కీలక సూచనలు చేసింది.

సర్కారియా కమీషన్ దృష్టి కేంద్రీకరించిన ప్రధాన అంశాలు, వాటిపై కమీషన్ చేసిన వ్యాఖ్యలను ఈ క్రింది విధంగా వివరించవచ్చును.

## 5.8. కేంద్ర రాష్ట్ర శాసనసంబంధాలపై సర్కారియా కమీషన్:

కేంద్ర రాష్ట్ర శాసన నిర్మాణ సంబంధాలతో పాటు ఈ అంశానికి సంబంధించి వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు చేసిన డిమాండ్లను పరిశీలించిన సర్కారియా కమీషన్ కేంద్ర పార్లమెంటు శాసన నిర్మాణ అధికారాలకు తగ్గించాలని చేసిన డిమాండ్‌లను తిరస్కరించింది. ఒకే సమయంలో పరస్పర సంగతత్వం లేని రెండు చట్టాలు అమలులో ఉండటం సహేతుకం కాదని సర్కారియా కమీషన్ వాదించింది. శాసన నిర్మాణ రంగంలో కేంద్ర పార్లమెంటుకు ఆధిక్యత ఉండటం వలన ఈ సమస్య తలెత్తక పోవడంతో పాటు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేసిన చట్టాల మధ్య సంఘర్షణలను వారించి వాటి మధ్య సామరస్యాన్ని సాధిస్తుందని సర్కారియా కమీషన్ పేర్కొంది. వాస్తవానికి ఈ సూత్రం భారత సమాఖ్య వ్యవస్థ కీలకాంశం అని సర్కారియా కమీషన్ నొక్కి చెప్పింది. కేంద్రం కంటే రాష్ట్రాలే ఎక్కువ శాసన నిర్మాణ అధికారలను కలిగి ఉండాలని కొన్ని రాష్ట్రాలు చేస్తున్న వాదం సమంజసమైనది కాదని సర్కారియా కమీషన్ ఉద్ఘాటించింది.

దీనికి భిన్నంగా సర్కారియా కమీషన్ ఉమ్మడి జాబితాలోని ఏ అంశంపై అయినా చట్టాన్ని చేసే ముందు పార్లమెంట్ సంబధిత రాష్ట్ర ప్రభుత్వాన్ని సంప్రదించే లాంఛన ప్రాయం కాని సాంప్రదాయాన్ని ప్రవేశపెట్టాలని సూచించింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సామరస్య పూరితమైన సంబంధాల పెంపొందించేందుకు ఈ విధమైన సంప్రదింపులు అవసరమని సర్కారియా కమీషన్ ఉద్ఘాటించింది.

గవర్నరు నిర్వహించే పాత్రను వివరిస్తూ సర్కారియా కమీషన్ రాష్ట్రం రాజ్యాంగ అధిపతిగా, కేంద్ర ప్రభుత్వం ప్రతినిధిగా గవర్నర్ విభిన్న పాత్రలను నిర్వహిస్తాడని పేర్కొంది. గవర్నర్ నిర్వహించే ఈ రెండు పాత్రల వల్ల రాష్ట్రాల ప్రయోజనాలకు హాని కల్గిన సందర్భాలు ఉన్నాయని ఈ కమీషన్ వివరించింది. కొందరు రాష్ట్ర గవర్నర్లు తమ రాష్ట్రాలలోని వివిధ పార్టీలతో వ్యవహరించడంలో తమ రాజకీయ ప్రయోజనాలకు, ఉద్దేశాలకు, వైఖరికి అతీతంగా వ్యవహరించలేదని సర్కారియా కమీషన్ పేర్కొంది. ఈ వాస్తవాలను దృష్టిలో ఉంచుకొని సర్కారియా కమీషన్ గవర్నరు పదవిలో కొన్ని స్వల్ప మార్పులను సూచించింది. ప్రధానంగా గవర్నర్ల నియామక పద్ధతిని, వారి విధుల నిర్వహణను మెరుగు పర్చేందుకు కొన్ని సూచనలు చేసింది. గవర్నర్ల ఎంపికలో అనుసరించవలసిన మూడు సూత్రాలను సర్కారియా కమీషన్ సూచించింది. అవి: 1) గవర్నర్‌గా ఎంపికయ్యే వ్యక్తులు ఏదో రంగంలో నిపుణులై వుండాలి; 2) ఆ వ్యక్తులు సంబంధిత రాష్ట్రానికి లేక ఇతర రాష్ట్రాలకు చెందినవారై ఉండాలి. ఆ వ్యక్తులకు రాష్ట్ర రాజకీయాలతో సంబంధం ఉండరాదు; 3) కేంద్రంలోఅధికారంలో వున్న రాజకీయ పార్టీకి లేదా రాజకీయ పార్టీలకు చెందిన నాయకున్ని ఒక రాష్ట్ర గవర్నరుగా నియమించక పోవటం అభిలషణీయం.

ఈ విధంగా గవర్నర్ ఎంపికలో అనేక మార్పులను సూచించటంతో పాటు సర్కారియా కమీషన్ 356వ అధికరణ పరిధిలో తన అసాధారణ అధికారాలను వినియోగించి రాష్ట్ర శాసనసభను రద్దు చేయటంలో గవర్నరు అధికారాలను పరిమితం చేయాలని సూచించింది. అంతే కాక 356 వ అధికరణను చాలా అరుదుగా, కొన్ని అత్యవసర పరిస్థితులలో, చిట్టచివరి ప్రయత్నంగా మాత్రమే ప్రయోగించాలని సర్కారియా కమీషన్ ఉద్ఘాటించింది.

సర్కారియా కమీషన్ కేంద్ర, రాష్ట్ర ఆర్థిక సంబంధాలలో ప్రధానమైన మార్పులను ప్రతిపాదించలేదు. కానీ కేంద్ర రాష్ట్రాల మధ్య కార్పోరేట్ పన్నులు, ప్రకటనలు, రేడియో ప్రసారాలను సంబంధించిన పన్నుల పంపిణీ విధానాన్ని మార్పు చేసేందుకు రాజ్యాంగాన్ని సవరించాలని సూచించింది. దీనితో పాటు సర్కారియా కమీషన్ ప్రస్తుతం అమలులో ఉన్న పన్నుల విధానాన్ని, కేంద్ర రాష్ట్రాల మధ్య వనరుల పంపిణీని మెరుగు పర్చేందుకు అవసరమైన సంస్కరణలు చేసేందుకు ఒక నిపుణుల సంఘాన్ని నియమించాలని సూచించింది. సర్కారియా కమీషన్ కేంద్ర రాష్ట్ర సంబంధాలను మెరుగు పర్చేందుకు కొన్ని ఇతర సూచనలను చేసింది. ఉదాహరణకు, ఈ కమీషన్ జాతీయ ప్రాధాన్యత కల అంశాలను చర్చించేందుకు ఒక వేదికలా ఉపయోగపడే ఒక అంతరాష్ట్ర మండలిని స్థాపించాలని సూచించింది. అభివృద్ధి, ప్రణాళికలకు సంబంధించిన అంశాలలో నూతనంగా ఏర్పాటు చేసే అంతర్ రాష్ట్ర మండలి ( National Development Council ) నిర్మాణంలో మార్పులను ప్రవేశ పెట్టాలని కూడా సర్కారియా కమీషన్ సూచించింది. కేంద్ర రాష్ట్ర ఆర్థిక సంబంధాలకు చెందిన అంశాలలో సలహాలనిచ్చేందుకు జాతీయ అభివృద్ధి మండలిలో ఒక ఆర్థిక ఉపసంఘాన్ని నియమించాలని సర్కారియా కమీషన్ మరో ప్రధాన సూచనను చేసింది. చివరగా ప్రణాళిక సంఘం, ఆర్థిక సంఘాల మధ్య సమన్వయాన్ని పెంపొందించేందుకు సర్కారియా కమీషన్ ఆర్థిక సంఘం ప్రణాళికా సంఘంలోని ఆర్థిక వనరులకు సంబంధించిన వ్యవహారాలను నిర్వహించే సభ్యుని పర్యవేక్షణలో పని చేయాలని ప్రతిపాదించింది.

## 5.9 మాదిరి ప్రశ్నలు :

1. భారతదేశంలో మారుతున్న కేంద్ర, రాష్ట్ర సంబంధాలను పరిశీలించండి.
2. భారతదేశంలో కేంద్ర, రాష్ట్ర పరిపాలన సంబంధాలను వివరింపుము?
3. భారతదేశంలోని కేంద్ర, రాష్ట్ర ఆర్థిక సంబంధాలలో కల ప్రధాన అంశాలను పేర్కొనుము ?
4. భారతదేశంలోని శక్తి వంతమైన కేంద్ర ప్రభుత్వ వ్యవస్థ రూపదిద్దుకోవటానికి కల కారణాలను పరిశీలింపుము?

5. భారతదేశంలో కేంద్ర, రాష్ట్ర సంబంధాలలో రాష్ట్రాల పరిస్థితి ఏమిటో వివరింపుము?

6. భారతదేశంలో కేంద్ర, రాష్ట్ర సంబంధాలపై సర్కారియా కమీషన్ చేసిన వ్యాఖ్యలను సూచించిన సంస్కరణలను విశ్లేషింపుము?

## 5.10 సంప్రదింపు గ్రంథాలు :


- Bipin Chandra, Indian After Independence 1947-2000, New Delhi, Penguin Books, 1999.
- Ramesh K. Arora and Rajani Goyal, Indian Public Administration, New Delhi: Wishwa Prakasham, 1995.
- M.V. Pylee, Constitutional Government in India, New Delhi: S Chand & Co.,2003 (Fifth Revised Edition)
- Paul R. Brass, Politics of India Since Independence, Cambridge: Cambridge University Presss 1990 (Second Edition).
- Granvelli Austin, Working a Democratic Constitution - The Indian Experience, New Delhi - Oxford University Press, 1999.
- W.H. Morris- Jones, The Government and Politics in India, New Delhi, : B.I. Publications, 1979.
- J.C. Johari, Indian Government and Politics, New Delhi, Vishal Publications, 1989.



**రచయిత**

**డా॥ కె. చంద్ర కుమార్**

పాఠం - 6

# జాతీయ కార్యనిర్వహకా వర్గం (1) రాష్ట్రపతి (2)
# (II) ప్రధాన మంత్రి,క్యాబినెట్


6.0 లక్ష్యం

6.1 ఉపోద్ఘాతం

6.2 భారత రాష్ట్రపతి

6.2.1 రాష్ట్రపతి ఎన్నిక

6.2.2 రాష్ట్రపతి అధికారాలు

6.2.3 కార్యనిర్వాహక అధికారాలు

6.2.4 శాసన నిర్మాణ అధికారాలు

6.2.5 అత్యవసర అధికారాలు

6.2.6 న్యాయాధికారాలు

6.2.7 రాష్ట్రపతి స్థానం

6.3 భారత ప్రధానమంత్రి

6.3.1 ప్రధానమంత్రి అధికారాలు - పాత్ర

6.3.2 మంత్రిమండలి అధిపతి

6.3.3 పార్లమెంటు నాయకత్వం

6.3.4 పార్టీ నాయకత్వం

6.3.5 అంతర్జాతీయ సంబంధాల రంగంలో పాత్ర

6.3.6 ప్రధానమంత్రి స్థానం

6.4 మంత్రిమండలి (క్యాబినెట్)

6.4.1 క్యాబినెట్ మంత్రిమండలి

6.4.2 క్యాబినెట్ లక్షణాలు

6.4.3 క్యాబినెట్ ప్రధాన విధులు

6.5 ముగింపు

6.6 మాదిరి ప్రశ్నలు

6.7 చదువ తగిన గ్రంథాలు

## 6.0 లక్ష్యం

భారతదేశంలో కార్యనిర్వాహక వర్గం స్వరూపం విధులు, అధికారాలు, పాత్రను వివరించటం ఈ పాఠం ప్రధాన లక్ష్యం. ఈ పాఠాన్ని చదివితే విద్యార్థులు ఈ క్రింది విషయాలను వివరించగలరు.

1) భారత రాష్ట్రపతి ఎన్నిక, అధికారాలు విధులు, పాత్ర

2) భారత ప్రధాన మంత్రి ఎన్నిక అధికారాలు విధులు- పాత్ర

3) భారత క్యాబినెట్ నిర్మాణం, లక్షణాలు, ప్రధాన విధులు

4) దేశంలో కార్యనిర్వహక వర్గంలో సంభవిస్తున్న మార్పులు, తలెత్తుతున్న నూతన పోకడలు

## 6.1. ఉపోద్ఘాతం:

భారత రాజ్యాంగం దేశంలో బ్రిటీషు తరహా బాధ్యతాయుత తత్వం కల్గిన క్యాబినెట్ వ్యవస్థను ప్రవేశపెట్టింది. రాజ్యాంగ నిర్మాణం ముందే సమావేశాలలో స్వాతంత్ర్యానంతరం దేశంలో ఏర్పరచవలసిన ప్రభుత్వం స్వరూపం పై భిన్న అభిప్రాయాలు వ్యక్త పరిచారు. కొందరు సభ్యులు భారతదేశంలో అమెరికా తరహా అధ్యక్షపాలన వ్యవస్థను ఏర్పాటు చేయాలని వాదించారు. వారు తమ అభిప్రాయానికి మద్దతుగా రెండు వాదనలు చేసారు. ఒకటి అధ్యక్ష తరహా పాలక ముఖ్య కార్యనిర్వాహక అధికారి (అధ్యక్షుడు) ప్రజలే ప్రత్యక్షంగా ఎన్నుకునేందుకు అవకాశాన్ని కల్పిస్తుంది. రెండు, అధ్యక్ష తరహా పాలనా విధానంలో కార్యనిర్వాహక శాఖాధిపతికి నిర్దిష్టమైన పదవీ కాలం ఉండడం చేత ఈ విధానం రాజకీయ స్థిరత్వానికి దోహదం చేస్తుంది. ఈ సభ్యులకు వ్యతిరేకంగా మెజారిటీ సభ్యులు, క్యాబినెట్ తరహా ప్రభుత్వం పట్ల మొగ్గు చూపారు. మొత్తం మీద సుధీర్ఘమైన చర్చ అనంతరం దేశంలో క్యాబినెట్ తరహా ప్రభుత్వ వ్యవస్థను ప్రవేశపెట్టాలని రాజ్యాంగ పరిషత్ నిర్ధారించింది.

భారత రాజ్యాంగం ప్రవేశపెట్టిన క్యాబినెట్ తరహా ప్రభుత్వం విధానానికి అనుగుణంగా కేంద్రంలో నామమాత్రపు ప్రభుత్వ అధిపతి అయిన రాష్ట్రపతి, వాస్తవ కార్య నిర్వాహక అధికారి అయిన ప్రధానమంత్రి అధ్యక్షుడుగా గల మంత్రి మండలి అనే ఇద్దరు భిన్న అధిపతులను కల్గిన కార్యనిర్వాహక వర్గం ఏర్పడింది. దేశాధిపతిగా రాష్ట్రపతి జాతికి ప్రాతినిధ్యం వహించడమే కాక జాతి ఐక్యతకు సంకేతంగా వ్యవహరిస్తారు. ప్రభుత్వ కార్యకలాపాలన్నీ తన పేరు మీదే నిర్వహింపబడినప్పటికి రాష్ట్రపతికి అంతిమ నిర్ణయాత్మక అధికారం లేదు. వాస్తవ అధికారం పార్లమెంటులో మెజారిటీ పార్టీ నాయకుడైన ప్రధాన మంత్రి ఆయన మంత్రి మండలికి చెందుతుంది. తన విధులను నిర్వర్తించటంలో సలహాలను అందించి సహాయపడేందుకు ప్రధానమంత్రి అధ్యక్షుడుగాగల మంత్రి మండలికి ఉంటుందని 75 వ అధికరణలో పేర్కొనటం ద్వారా రాజ్యాంగం రాష్ట్రపతి కేవలం రాజ్యాంగపరమైన (Constitutional) అధిపతి మాత్రమే అని నొక్కి చెప్పింది.

## 6.2. భారత రాష్ట్రపతి:

భారత రాజ్యాంగం లాంఛనప్రాయంగా ప్రభుత్వ కార్యనిర్వహక అధికారాలను రాష్ట్రపతికి దత్తం చేసింది. కానీ వాస్తవంలో రాష్ట్రపతి కొన్ని అరుదైన సందర్భాలలో తప్ప తన అధికారాలను ప్రధానమంత్రి, మంత్రిమండలి సలహా ప్రకారం చెలాయిస్తాడు. అంబేద్కర్ అభిప్రాయం ప్రకారం భారత రాష్ట్రపతి కేవలం రాజ్యాంగ అధిపతి మాత్రమే. ఇంగ్లాండ్ రాజ్యంగం ప్రకారం రాజు లేక రాణికి ఉన్న కీలక స్థానమే (Position) భారత రాష్ట్రపతికి వుంది. రాష్ట్రపతి దేశానికి ప్రాతినిధ్యం వహిస్తాడే తప్ప దేశాన్ని పాలించడు. ప్రధానమంత్రి అధ్యక్షుడుగా గల మంత్రి మండలి వాస్తవమైన కార్యనిర్వాహక అధికారి. రాజ్యాంగ పరిషత్తులో దీర్ఘ చర్చ అనంతరం దేశంలో బ్రిటీష్ తరహా పార్లమెంటరీ వ్యవస్థను నెలకొల్పాలని నిర్ధారించారు. దీని ఫలితంగా స్వాతంత్ర్యానంతరం భారత దేశంలో బ్రిటీషు వ్యవస్థకు కొద్ది వ్యత్యాసాలతో క్యాబినెట్ వ్యవస్థ ఏర్పడింది. దీనికి అనుగుణంగా నామ మాత్రపు అధికారాలతో రాష్ట్రపతి రాజ్యాంగం అధిపతిగా వ్యవహరించే పార్లమెంటరీ వ్యవస్థ రూపుదిద్దుకుంది.

భారత రాజ్యాంగం అనేక అధికారాలను రాష్ట్రపతికి కల్పించింది. అయితే రాష్ట్రపతి తన అధికారాలను మంత్రిమండలి సలహా మేరకు మాత్రమే వినియోగించాలి. అయినప్పటికి రాష్ట్రపతి పదవి కేవలం అలంకార ప్రాయమైన పదవి కాదు. రాష్ట్రపతి తన అధికారాలను తన విచక్షణ ప్రకారమే వినియోగించే సందర్భాలు చాలా వున్నాయి. రాష్ట్రపతి లాంఛనప్రాయమైన, వాస్తవ అధికారాలమధ్య సంఘర్షణ తరచూ తలెత్తుతున్నది. ప్రధానంగా 1967 తర్వాత కాంగ్రెస్ అధిక్యత క్షీణించిన తర్వాత కాలంలో రాష్ట్రపతి అధికారాల వినియోగం వివాదాస్పదమైనది అని పాల్‌బ్రాస్ మొదలైన రాజనీతి శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. ప్రధానమంత్రి ఎంపికలో రాష్ట్రపతికి అధికారం అనేక వివాదాలకు కేంద్రబిందువైందని బ్రౌన్ పేర్కొన్నారు.

## 6.2.1. రాష్ట్రపతి ఎన్నిక :

రాజ్యాంగంలోని 54వ అధికరణ ప్రకారం రాష్ట్రపతిని ఒక నియోజక గణం (ఎలక్టోరల్ కాలేజ్) ఎన్నుకుంటుంది. ఈ నియోజక గణం ఎన్నికైన పార్లమెంట్ సభ్యులు, ఎన్నికైన వివిధ రాష్ట్రాల శాసస సభ సభ్యులను సభ్యులుగా కల్గి ఉంటుంది. రాష్ట్రపతి ఎన్నికలో పార్లమెంట్ సభ్యులకు, వివిధ రాష్ట్రాల శాసనసభ సభ్యులకు పమానమైన ప్రాతినిధ్యం కల్గించేందుకు ఒక ప్రత్యేక పద్ధతిని ప్రవేశపెట్టారు. ఈ పద్ధతి ప్రకారం ప్రతి రాష్ట్ర శాసన సభ ఎన్నికైన ప్రతి సభ్యునికి సంబంధిత రాష్ట్ర శాసనసభలో కల మొత్తం శాసనసభ్యుల సంఖ్య మరియు ఆ రాష్ట్ర జనాభా ఆధారంగా కొన్ని ఓట్లను కేటాయిస్తారు. ఇదే విధంగా ఎన్నికైన ప్రతి పార్లమెంట్ సభ్యునికి కూడా కొంత సంఖ్యలో ఓట్లను కేటాయిస్తారు. ఈ సంఖ్యను మొత్తం రాష్ట్రాల శాసనసభల సభ్యులకు కేటాయించిన మొత్తం ఓట్లను శాసనసభ ఎన్నికైన సభ్యుల సంఖ్యతో భాగించటం ద్వారా వచ్చిన సంఖ్యను మొత్తం ఎన్నికైన పార్లమెంటు సభ్యుల సంఖ్యతో హెచ్చించటం ద్వారా నిర్ధారిస్తారు. ప్రస్తుతం రాష్ట్రపతి ఎన్నికలో పార్లమెంటు సభ్యుని ఓటు విలువ 702. ఏక బదిలీ ఓటు ఆధారంగా నైష్పత్తిక ప్రాతినిధ్య పద్ధతి ద్వారా రాష్ట్రపతి ఎన్నికను నిర్వహిస్తారు. రాష్ట్రపతి ఎన్నికలో ఓటింగ్ రహస్య బ్యాలెట్ పద్ధతి ద్వారా జరుగుతుంది. మొత్తం మీద రాష్ట్రపతి ఎన్నిక ఒక విశిష్టమైన పద్ధతి ద్వారా జరుగుతుంది. ఈ పద్ధతిని అనుసరించటానికి కొన్ని ప్రత్యేక కారణాలున్నాయి.

రాజ్యాంగం రాష్ట్రపతి పదవికి పోటి చేసే అభ్యర్థులకు ఉండవలసిన ఒకే అర్హతను నిర్దేశించింది. దీని ప్రకారం రాష్ట్రపతి పదవికి పోటీ చేసే అభ్యర్థి 35 సం॥లు పూర్తి చేసుకున్న భారతీయ పౌరుడై ఉండాలి. ఈ అభ్యర్థి పార్లమెంట్‌లోని లోక్‌సభకు ఎన్నికయ్యేందుకు కావల్సిన అర్హతలను కల్గి ఉండాలి. రాష్ట్రపతి పదవికి పోటీచేసే వ్యక్తి కేంద్ర, రాష్ట్ర, స్థానిక ప్రభుత్వాల దేనిలో ఉద్యోగి అయి ఉండరాదు. సిద్ధాంతపరంగా రాష్ట్రపతి ఎన్నిక సంక్లిష్టమైందిగా గోచరించినప్పటికి వాస్తవంగా సులువైన ప్రక్రియ. అంతేకాక ఈ ప్రక్రియ సమాఖ్య సూత్రానికి అనుగుణమైంది. రాష్ట్రపతి ఎన్నికలో కొన్ని వేల సంఖ్యలో మాత్రమే ఓటర్లు పాల్గొనటం వలన ఈ ఎన్నిక ప్రశాంతంగా, సాధారణంగా జరిగిపోతుంది.

రాష్ట్రపతి పదవీకాలం ఐదు సంవత్సరాలు. కానీ ఈ పదవీ కాలం ముగియక ముందే రాష్ట్రపతిని పదవి నుంచి తొలగించవచ్చును. రాష్ట్రపతిని పదవి నుంచి తొలగించేందుకు రాజ్యాంగం ఒక స్పష్టమైన పద్ధతిని సూచించింది. రాజ్యాంగం 56వ అధికరణ పేర్కొన్న అభిశంసన పద్ధతి ప్రకారం రాజ్యాంగాన్ని ఉల్లంఘించటం అనే ఒకే ఒక కారణం ఆధారంగా రాష్ట్రపతిని పదవి నుంచి తొలగించవచ్చును. పదవిలో వున్న రాష్ట్రపతి మరణించడం లేదా రాజీనామా చెయ్యటం లేదా అభిశంసన తీర్మానం ద్వారా పదవినుంచి తొలగించటం కారణాల వల్ల రాష్ట్రపతి పదవి ఖాళీ ఏర్పడినప్పుడు కొత్త రాష్ట్రపతి ఎన్నిక అయ్యేంత వరకు ఉపరాష్ట్రపతి రాష్ట్రపతిగావ్యవహరిస్తాడు. అయితే రాష్ట్రపతి పదవి ఖాళీ అయిన 6 నెలలోపున నూతన రాష్ట్రపతిని ఎన్నుకోవలసి ఉంది.

### 6.2.2 రాష్ట్రపతి అధికారాలు :

రాజ్యాంగంలోని 53వ అధికరణ ప్రకారం కేంద్ర ప్రభుత్వ కార్యనిర్వాహక అధికారం రాష్ట్రపతికి కల్పించబడింది. రాష్ట్రపతి తన అధికారాలను స్వయంగా లేదా తన అధికారుల ద్వారా వినియోగించవచ్చును. రాజ్యాంగం రాష్ట్రపతికి కల్పించిన అధికారాల జాబితా సుదీర్ఘమైంది, ఆకర్షణీయమైంది. రాజ్యాంగం రాష్ట్రపతి కల్పించిన అధికారాలను నాలుగు తరగతులుగా విభజించవచ్చును అవి: (1) కార్యనిర్వాహక అధికారాలు, (2) శాసన నిర్మాణ అధికారాలు, 3) న్యాయసంబంధమైన అధికారాలు, 4) అత్యవసర అధికారాలు.

### 6.2.3. కార్యనిర్వాహక అధికారాలు :

రాజ్యాంగం కేంద్ర ప్రభుత్వ కార్య నిర్వాహక అధికారానికి శాసన నిర్మాణ అధికారం అనుబంధం అనే కీలక సూత్రాన్ని నిర్దేశించింది. రాష్ట్రపతి కేంద్ర కార్యనిర్వాహక విభాగం అధిపతి కావటం వల్ల సహజంగానే ఆయన కార్యనిర్వాహక అధికారం కేంద్ర ప్రభుత్వం నిర్వహించే మొత్తం చర్యలకు వర్తిస్తుంది. ఈ సూత్రానికి అనుగుణంగా రాష్ట్రపతికి గణనీయమైన కార్యనిర్వాహక అధికారాలున్నాయి. రాష్ట్రపతి దేశ రక్షణ దళాలకు ప్రధాన అధికారి. అందువలన దేశ రక్షణ దళాలన్నీ రాష్ట్రపతి అధీనంలో పని చేస్తాయి. రాష్ట్రపతికి విస్తృతమైన నియామక అధికారాలు ఉన్నాయి. రాష్ట్రపతి ప్రధానమంత్రిని, ఆయన సలహా మీద ఇతర మంత్రులను నియమిస్తాడు. రాష్ట్రపతి అటార్నీ జనరల్, సుప్రీంకోర్టు, హైకోర్టుల ప్రధాన న్యాయమూర్తులు, ఇతర న్యాయమూర్తులు, కేంద్ర పబ్లిక్ సర్వీసు కమీషన్, కేంద్ర ఎన్నికల సంఘం సభ్యులు, కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ రాష్ట్ర గవర్నర్లు, విదేశీ రాయబారులు, ఆర్థిక సంఘం సభ్యులు, షెడ్యూల్డ్ కులాల, తెగల కమీషనర్ మొదలైన ఎందరో అధికారులను నియమిస్తాడు. వాస్తవంలో కేంద్ర ప్రభుత్వంలో ప్రతి నియామకం రాష్ట్రపతి పేరు మీద లేదా ఆయన అధికార పరిధిలో జరుగుతుంది, పైన వివరించిన అధికారులు రాష్ట్రపతి విశ్వాసం ఉన్నంత వరకు తమ పదవిలో కొనసాగుతారు. అంటే వారిని తమ పదవుల నుంచి తొలగించే అధికారం రాష్ట్రపతికి ఉంది.

### 6.2.4 శాసన నిర్మాణ అధికారాలు :

శాసన నిర్మాణ రంగంలో రాష్ట్రపతికి కొన్ని ప్రధానమైన అధికారాలున్నాయి. వాస్తవానికి రాష్ట్రపతి శాసన నిర్మాణ ప్రక్రియలో ఒక అంతర్భాగం రాష్ట్రపతి పార్లమెంట్‌ను సమావేశపరుస్తాడు. నిరవధికంగా వాయిదా వేస్తాడు. లోక్‌సభను రద్దు పరచవచ్చును. రాష్ట్రపతి పార్లమెంట్ ప్రతిసభ తొలి సమావేశంలో లేదా రెండు సభల సంయుక్త సమావేశంలో ప్రసంగించవచ్చును లేదా వాటి సమావేశాలకు సందేశాలను పంపవచ్చును. రాష్ట్రపతి రాజ్యసభకు పన్నెండుమంది సభ్యులను, లోక్‌సభకు ఇద్దరు ఆంగ్లో ఇండియన్ వ్యక్తులను నామ నిర్దేశం చేయవచ్చును. పార్లమెంట్ ఆమోదించిన ప్రతిబిల్లును రాష్ట్రపతి ఆమోదించవలసి ఉంటుంది. రాష్ట్రపతి ఆమోదించిన తర్వాత ప్రతి బిల్లు చట్టం అవుతుంది. అందుచేత పార్లమెంట్ ఆమోదించిన ప్రతి బిల్లును రాష్ట్రపతి ఆమోదానికి పంపిస్తారు. రాష్ట్రపతి తన ఆమోదానికి పంపిన బిల్లుకు తన ఆమోదాన్ని తిరస్కరించవచ్చును లేదా పునఃపరిశీలనకు పార్లమెంట్‌ను తిరిగి పంపించవచ్చును. అయితే ఈ అధికారం ద్రవ్యబిల్లులకు (Money Bills) వర్తించదు. కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌ను పార్లమెంట్‌లో ప్రవేశపెట్టేందుకు రాష్ట్రపతి పూర్వ అనుమతి అవసరం, రాష్ట్రపతి అనుమతి లేకుండా కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో నిధులకోసం డిమాండ్లను ప్రవేశపెట్టలేదు.

రాష్ట్రపతి శాసన నిర్మాణ అధికారాలలో ఆర్డినెన్సు (Ordinances) లను జారీ చేసే అధికారం ప్రధానమైంది. రాజ్యాంగం 123వ అధికరణ ప్రకారం పార్లమెంట్ ఉభయ సభలు సమావేశంలో లేనప్పుడు రాష్ట్రపతి తక్షణ చర్య తీసుకొవల్సిన పరిస్థితులు ఏర్పడినట్లు సంతృప్తి చెందితే ఆర్డినెన్సులను జారీ చేయవచ్చును. రాష్ట్రపతి జారీ చేసిన ఆర్డినెన్సులు పార్లమెంట్ సమావేశమైన ఆరు వారాల పాటు అమలులో ఉంటాయి. సమావేశమైన ఆరు వారాలలోపున పార్లమెంట్ ఆమోదించకపోతే రాష్ట్రపతి జారీ చేసిన ఆర్డినెన్సులు రద్దు అవతాయి. అందుచేత రాష్ట్రపతి జారీచేసిన ఆర్డినెన్సులు పార్లమెంటు సమావేశమయ్యేంత వరకు అమలులో వుంటాయి.

## 6.2.5 అత్యవసర అధికారాలు :

రాష్ట్రపతికి రాజ్యాంగం కల్పించిన అధికారాలలో అత్యవసర అధికారాలు (Emergency Powers ) కీలకమైనవి. రాజ్యాంగంలోని 352 నుంచి 360 వరకు కల అధికరణల ప్రకారం రాష్ట్రపతికి మూడు పరిస్థితులలో మొత్తం దేశానికి వర్తించే లేదా ఒక ప్రత్యేక ప్రాంతానికి వర్తించే విధంగా అత్యవసర పరిస్థితిని విధించవచ్చును. ఒకటి, యుద్ధం సంభవించినప్పుడు లేదా దేశం విదేశీ దురాక్రమణకు గురైనప్పుడు లేదా దేశంలో అంతర్గతంగా తీవ్రమైన అల్లకల్లోల పరిస్థితి ఏర్పడినప్పుడు రాష్ట్రపతి మొత్తం దేశానికి వర్తించే అత్యవసర పరిస్థితిని విధించవచ్చును. రెండు, ఏదైనా రాష్ట్రంలో ప్రభుత్వం రాజ్యాంగ బద్ధంగా పని చెయ్యటంలో విఫలమైనప్పుడు రాష్ట్రపతి ఆ రాష్ట్రంలో అత్యవసర పరిస్థితి లేదా రాష్ట్రపతి పాలనను విధించవచ్చును. మూడు, దేశంలో లేదా ఏదైనా ప్రాంతంలో తీవ్రమైన ఆర్థిక సంక్షోభం ఏర్పడినప్పుడు ఆర్థిక అత్యవసర పరిస్థితిని (Financial Emergency) ని విధించవచ్చును. రాజ్యాంగంలో 353, 354 అధికరణలకు అనుగుణంగా రాష్ట్రపతి దేశంలో జాతీయ అత్యవసర పరిస్థితిని విధించినప్పుడు రాజ్యాంగంలోని సమాఖ్య అధికరణలు రద్దు అవుతాయి. దీని ఫలితంగా కేంద్రప్రభుత్వంపై అత్యవసర పరిస్థితులలో రాష్ట్ర ప్రభుత్వాలకు ఏ విధమైన ఆదేశాలనైనా జారీ చేయవచ్చును. అంతేకాక పార్లమెంట్ రాష్ట్ర జాబితాలోని అంశాలపై చట్టాలు చేయవచ్చును. అయితే ఈ ఆదేశాలను పార్లమెంటు ఆమోదానికి పంపవలసి ఉంటుంది. మొత్తం మీద ఈ చర్యల ఫలితంగా జాతీయ అత్యవసర పరిస్థితి అమలులో ఉన్న సమయంలో దేశం సంపూర్ణమైన ఏక కేంద్ర రాజ్యంగా రూపాంతరం చెందుతుంది. స్వాతంత్ర్యానంతరం దేశంలో ఇప్పటి వరకు రాజ్యాంగం 352 అధికరణ ఉపయోగించి నాలుగుసార్లు అత్యవసర పరిస్థితిని విధించారు. 1962 లో చైనా యుద్ధం సంభవించిన తరుణంలో దేశంలో మొట్టమొదటి సారిగా జాతీయ అత్యవసర పరిస్థితిని విధించారు. 1965, 1971 లో పాకిస్థాన్ యుద్ధం ఫలితంగా రెండవ, మూడవ పర్యాయం అత్యవసర పరిస్థితిని విధపబడింది. 1975 జూన్‌లో దేశ భద్రతకు ప్రమాదంకారణంగా దేశంలో నాలుగవ సారి జాతీయ అత్యవసర పరిస్థితిని విధించారు.

రాజ్యాంగం 356వ అధికరణ ప్రకారం ఏదైనా రాష్ట్రంలో రాష్ట్రపతి పాలనను విధించినప్పుడు రాష్ట్ర పాలనలో రాష్ట్రపతికి కొన్ని విశేషమైన అధికారాలు సంక్రమిస్తాయి. అవి: 1) రాష్ట్రపతి పాలన అమలులో ఉన్న కాలంలో రాష్ట్రపతి, ఆ రాష్ట్ర ప్రభుత్వ అధికారాలను తనకు సంక్రమించుకోవచ్చును లేదా వాటిని గవర్నరుకు అప్పగించవచ్చును. 2) రాష్ట్ర శాసనసభ అధికారాలను పార్లమెంటుకు అప్పగించవచ్చును. 3) రాష్ట్రపతి రాష్ట్రపతి పాలన విధించటానికి దారి తీసిన ఆశయాలను నెరవేర్చేందుకు అవసరమైన ఏ చర్యనైనా చేపట్టవచ్చును. అయితే రాష్ట్రపతి పాలన అమలులో వున్న కాలంలో రాష్ట్రపతి హైకోర్టుకు గల అధికారాలను చేపట్టలేడు. జాతీయ అత్యవసర పరిస్థితిని ఆమోదించిన పద్ధతి ప్రకారమే పార్లమెంటు రాష్ట్రాలలో విధించే రాష్ట్రపతి పాలనను ఆమోదించవలసి ఉంటుంది. సాధారణంగా రాష్ట్రపతి పాలన 6 నెలల పాటు అమలులో ఉంటుంది. అయితే అవసరమైన పరిస్థితులలో రాష్ట్రపతి పాలనను మరో 6 నెలల పాటు పొడిగించవచ్చును.

చివరగా 360 వ అధికరణ క్రింద రాష్ట్రపతి దేశంలో లేదా దేశంలోని ఏ ప్రాంతంలోనైనా ఆర్థిక సుస్థిరతను కోల్పోయే పరిస్థితి ఏర్పడిందని భావించినప్పుడు మొత్తం దేశంలో లేదా సంబంధిత ప్రాంతంలో ఆర్థిక అత్యవసర పరిస్థితిని విధించవచ్చును. దేశంలో ఆర్థిక అత్యవసర పరిస్థితి అమలులో ఉన్నప్పుడు కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సూత్రాలను పాటించమని రాష్ట్రాలకు ఆదేశించవచ్చును లేదా నిర్ధారిత రాష్ట్ర ఆర్థికపరిస్థితిని చక్కదిద్దేందుకు అవసరమని భావించిన ఏ ఇతర చర్యనైనా చేపట్టమని ఆదేశించవచ్చును. ఈ చర్యలలో ప్రభుత్వ ఉద్యోగులు, చివరకు సుప్రీంకోర్టు లేదా హైకోర్టు న్యాయమూర్తుల జీతభత్యాలను తగ్గించమని ఆదేశించడం ప్రధానమైంది.

## 6.2.7 భారత రాష్ట్రపతి స్థానం:

రాజ్యాంగం కోణం నుంచి పరిశీలిస్తే భారత రాష్ట్రపతి శక్తివంతమైన అధికారి. ఏ రాజ్యాంగం ప్రధాన కార్యనిర్వహక అధికారికి కల్పించని విస్తృతమైన అధికారాలను భారత రాజ్యాంగం రాష్ట్రపతికి కల్పించింది. అయితే రాజ్యాంగం తనకు కల్పించిన విస్తృతమైన అధికారాలను రాష్ట్రపతి ఏ మేరకు వాస్తవంగా వినియోగించగల్గుతున్నాడనేది కీలక ప్రశ్న. బ్రిటీష్ వ్యవస్థలోని చక్రవర్తి మాదిరే భారత రాష్ట్రపతికి రాజ్యాంగం సంక్రమింపజేసిన అధికారాలేవీ వాస్తవంలో ఆయన చెలాయించడు. సిద్ధాంతపరంగా రాష్ట్రపతికి గల అధికారాలను ఆచరణలో కేంద్ర మంత్రి మండలి చెలాయిస్తుంది. ఈ విధంగా రాష్ట్రపతి రాజ్యాంగపరమైన అధిపతి మాత్రమే. ఈ విషయంపై రాజ్యాంగ నిర్మాణ పరిషత్తులో సుదీర్ఘమైన చర్చ జరిగింది. ఈ చర్చల్లో భారత రాష్ట్రపతి రాజ్యాంగ స్వభావాన్ని నొక్కి చెప్పటం జరిగింది. దీనికి అనుగుణంగానే రాష్ట్రపతి పదవి రాజ్యాంగ స్వభావాన్ని రాజ్యాంగంలోని వివిధ అధికరణల్లో ప్రతిఫలింప చేశారు. ఉదాహరణకు 74వ రాజ్యాంగం అధికరణ ప్రకారం రాష్ట్రపతికి తన విధుల నిర్వహణల్లో సహాయాన్ని, సలహాలను అందచేసేందుకు ప్రధానమంత్రి నాయకత్వంలో ఒక మంత్రి మండలి ఉంది. రాష్ట్రపతి మంత్రిమండలి సలహాకు అనుగుణంగా మాత్రమే తన విధులను నిర్వహించాలని ఈ అధికరణ పేర్కొంది. మంత్రిమండలి ఇచ్చిన సలహాను పున: పరిశీలించమని కోరే హక్కు రాష్ట్రపతికి ఉన్నప్పటికీ పున: పరిశీలన తర్వాత ఇచ్చిన మంత్రిమండలి సలహాను రాష్ట్రపతి విధిగా పాటించవలసి ఉంటుంది. ఈ నియామాన్ని 1978లో చేసిన 44వ రాజ్యాంగ సవరణ చట్టం ద్వారా రాజ్యాంగంలో పొందుపరిచారు.

రాష్ట్రపతి ప్రధానమంత్రిని ఆయన సలహాపై ఇతర మంత్రులను నియమిస్తాడు. రాజ్యాంగంలోని 75(2) అధికరణ ప్రకారం మంత్రులు, రాష్ట్రపతి విశ్వాసం చూరగొన్నంత కాలం తమ పదవిలో కొనసాగుతారు. 75(3) అధికరణ ప్రకారం మంత్రులు సమిష్టిగా పార్లమెంట్‌లోని లోక్‌సభకు బాధ్యులు. రాజ్యాంగంలోని ఈ అధికరణల ద్వారా రాజ్యాంగ నిర్మాతలు భారతదేశంలో బ్రిటీష్ తరహా క్యాబినెట్ ప్రభుత్వాన్ని ఏర్పరచాలని తలపెట్టినట్లు గుర్తించవచ్చును. దీనికి అనుగుణంగానే రాష్ట్రపతి మంత్రిమండలి సలహాకు భిన్నంగా లేదా దాని సలహా లేకుండా ఏ కర్తవ్యాన్ని నిర్వహించలేడు అని రాజ్యాంగ నిర్మాతలు ఉద్ఘాటించారు. పార్లమెంటరీ వ్యవస్థ సాంప్రదాయం ప్రకారం కార్యనిర్వహక శాఖ శాసనసభకు బాధ్యత వహిస్తుంది. అందువలన మంత్రిమండలి పదవి నుంచి వైదొలగటానికి రాష్ట్రపతి ఈ విషయంలో పార్లమెంటు ఇచ్చుకు, రాష్ట్రపతి ఇచ్చుకు మధ్య సంఘర్షణ ఏర్పడితే పార్లమెంటు ఇచ్చే నెగ్గుతుంది. అందుచేత మంత్రిమండలి పదవినుంచి వైదొలగటానికి రాష్ట్రపతి విశ్వాసాన్ని కోల్పోవటం కాక పార్లమెంటు విశ్వాసాన్ని కోల్పోవటం కారణం అవుతుంది. రాజ్యాంగం రాష్ట్రపతిని అభిశంసన ద్వారా పదవి నుంచి తొలగించే అధికారాన్ని పార్లమెంటుకు అప్పగించింది. ఈ కారణాల వల్ల మంత్రిమండలి ఇచ్చే సలహాకు రాష్ట్రపతి కట్టుబడి ఉండక తప్పదు.

ఈ విధంగా భారత రాజ్యాంగం రాష్ట్రపతికి విస్తృతమైన అధికారాలను సంక్రమింపచేసినప్పటికీ ఆయన తన అధికారాలను మంత్రిమండలి సలహా మేరకే చెలాయించాలి. అయితే రాష్ట్రపతి కేవలం అలంకార ప్రాయమైన అధికారి లేదా నామమాత్రపు అధికారి అని దీని అర్థం కాదు. రాష్ట్రపతి కొన్ని సందర్భాలలో తన అధికారాలను చెలాయించటంలో మంత్రి మండలి సలహా ప్రకారం కాక తన విచక్షణ ఉపయోగించవచ్చును. ఈ విచక్షణ అధికారాలే రాష్ట్రపతి పదవిని కేవలం లాంఛన ప్రాయమైన పదవిగా కాక శక్తివంతమైన పదవిగా తీర్చిదిద్దింది. రాజ్యాంగం విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం లోక్‌సభ ఎన్నికల తర్వాత రాష్ట్రాలలో రాష్ట్రపతి పాలన విధించటంలో రాష్ట్రపతి తన విచక్షణ అధికారాలను వినియోగించే అవకాశం ఉంది. 1979 లో జనతా ప్రభుత్వం స్థానంలో ప్రభుత్వాన్ని ఏర్పరచమని చరణ్‌సింగ్ ను ఆహ్వానించటం ద్వారా రాష్ట్రపతి ప్రధాన మంత్రుల నియామకంలో తన విచక్షణాధికారాన్ని మొట్టమొదటిసారిగా వినియోగించటం జరిగిందని విశ్లేషకులు పేర్కొన్నారు. ఇదే విధంగా 1996, 1998, 1999 లో జరిగిన లోక్‌సభ ఎన్నికల అనంతరం ప్రధానమంత్రుల నియామకంలో అప్పటి రాష్ట్రపతులు తమ విచక్షణాధికారాన్ని ఉపయోగించారని కూడా విశ్లేషకుల అభిప్రాయం. ఈ దృష్టాంతాలను పరిశీలిస్తే లోక్‌సభలో ఏ పార్టీకి స్పష్టమైన మెజారిటీ లభించని సందర్భాలలో రాష్ట్రపతి తన విచక్షణాధికారాన్ని వినియోగించే అవకాశం ఉందని గుర్తించవచ్చును. రాష్ట్రపతి తన విచక్షణాధికారాన్ని వినియోగించే అవకాశం ఉన్న మరో సందర్భం రాష్ట్రపతి పాలనా విధింపు. ఇప్పటి వరకు అనేక రాష్ట్రాలలో ప్రభుత్వాలను రద్దు చేసి రాష్ట్రపతి పాలనను విధించటం

జరిగింది. ఈ విషయంలో కొన్ని సందర్భాలలో రాష్ట్రపతి తన విచక్షణాధికారాన్ని వినియోగించారని రాజ్యాంగం నిపుణులు పేర్కొన్నారు. ఈ రెండు అంశాలలో రాజ్యాంగం రాష్ట్రపతి అధికారాలను స్పష్టంగా నిర్వచించకపోవటమే రాష్ట్రపతి తన విచక్షణాధికారాలను వినియోగించేందుకు అవకాశం కల్పించిందని నిపుణులు వివరించారు. రాష్ట్రపతికి గల విచక్షణాధికారాలు పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థను గణనీయంగా ప్రభావితం చేసిందని ఎమ్. వి. పైలి సూచించాడు. మిగతా అంశాలలో రాష్ట్రపతికి కల అధికారాలను రాజ్యాంగం స్పష్టంగా నిర్వచించటం వలన ఈ అంశాలలో రాష్ట్రపతి విచక్షణాధికారాలను వినియోగించే అవకాశం లేదని నిపుణుల అభిప్రాయం.

మొత్తం మీద ఎమ్. వి. పైలి పేర్కొన్న విధంగా నామమాత్రపు అధికారిగా వ్యవహరించటం, పరస్పరం పోటీపడే ప్రయోజనాలు కల్గిన పార్టీల మధ్య మధ్యవర్తిగా వ్యవహరించటం అనే రాష్ట్రపతి పాత్రల మధ్య విభజన చేసే స్పష్టమైన అధికరణలు రాజ్యాంగంలో ఉన్నాయి. అందుచేత భారత రాష్ట్రపతి బ్రిటిష్ చక్రవర్తితో సమానం అని పేర్కొనటం సరికాదు. దీనికి భిన్నంగా రాజ్యాంగ పరిధిలో రాష్ట్రపతి సమర్థవంతమైన, ప్రభావపూరితమైన శక్తిగా వ్యవహరించగలడు. అందుచేత భారత రాష్ట్రపతిని నాలుగవ రిపబ్లిక్‌లో ఫ్రెంచి అధ్యక్షునితో పోల్చడం సమంజసం కాదు. మొత్తం మీద భారత రాష్ట్రపతి పదవి శక్తివంతమైంది, గౌరవ ప్రదమైంది. రాష్ట్రపతి పదవిని విశిష్టమైన పదవిగా తీర్చిదిద్దేందుకు రాజ్యాంగం చాలా కృషి చేసింది.

## 6.3. ప్రధానమంత్రి:

భారత రాజ్యాంగ నిర్మాతలు బ్రిటిష్ ప్రభుత్వ సాంప్రదాయాలను అనుసరించటం చేత ప్రభుత్వ వ్యవస్థలో ప్రధాన మంత్రికి అత్యంత శక్తివంతమైన పాత్ర లభించింది. ఈ పద్ధతిని సమర్ధిస్తూ డా॥ బి. ఆర్. అంబేద్కర్ బ్రిటన్‌లో చాలాకాలం నుంచి కొనసాగుతూ వస్తున్న సాంప్రదాయానికి అనుగుణంగా ప్రధానమంత్రికి చట్టబద్ధమైన గుర్తింపును ఇవ్వటం అందరికి ఆమోదయోగ్యమే అని ప్రకటించారు. భారత రాజ్యాంగం మంత్రిమండలి సమిష్టి బాధ్యత అనే సూత్రాన్ని ఏర్పరచుకోవటమే ప్రధానమంత్రికి అత్యంత ప్రాధాన్యతను కల్పించటానికి ప్రధాన కారణం. రాజ్యాంగరీత్యా భారత రాష్ట్రపతి నిర్వర్తించవలసిన అనేక విధులను వాస్తవంలో ప్రధానమంత్రి నిర్వర్తించటం ప్రధానమంత్రి కీలక ప్రాధాన్యతను వెల్లడిస్తుంది. పార్లమెంటరీ ప్రభుత్వంలో ప్రధానమంత్రిది కీలక స్థానం అనే వాస్తవానికి భారతదేశంలోని అత్యంత శక్తివంతమైన ప్రధానమంత్రి పదవి ప్రతిబింబం.

భారత రాజ్యాంగం ప్రకారం రాష్ట్రపతి నిర్వర్తించే అనేక అధికారాలను వాస్తవంలో ప్రధానమంత్రి చెలాయిస్తాడు పార్లమెంట్‌లో మెజారిటీ పార్టీ నాయకుడుగా ప్రధామంత్రి పార్లమెంట్ నాయకుడిగా వ్యవహరిస్తాడు. మంత్రిమండలి అధ్యక్షుడిగా ప్రధానమంత్రి మంత్రిమండలికి నాయకుడు. ప్రధానమంత్రి పార్లమెంట్, మంత్రిమండలికే కాక దేశానికి కూడా నాయకుడు. రాజ్యాంగం ఏర్పరచిన ప్రభుత్వ వ్యవస్థలో ప్రధానమంత్రి పదవి అత్యంత శక్తివంతమైన పదవి. దేశంలో అత్యవసర పరిస్థితి అమలులో ఉన్న సమయంలో ప్రధానమంత్రి అధికారం మరింత విస్తృతం అవుతుంది. సహజంగానే ప్రధానమంత్రి వ్యక్తిత్వం రాష్ట్రపతి అధికారాలపై విపరీతమైన ప్రభావాన్ని కనపరుస్తుంది. భారతదేశంలో ప్రధానమంత్రి పదవి అత్యున్నతమైన విలువను, ప్రాముఖ్యతను సంతరించుకోవటానికి 17 సం॥ పాటు ప్రధానమంత్రి పదవిని అలంకరించిన పండిట్ నెహ్రూ విశిష్టమైన వ్యక్తిత్వం ఒక ప్రధాన కారణం. 1960, 80 దశాబ్దాల మధ్యకాలంలో ప్రధానమంత్రిగా వ్యవహరించిన శ్రీమతి ఇందిరాగాంధి వ్యక్తిత్వం ప్రధాన మంత్రి పదవికి అంతులేని ప్రాముఖ్యత చేకూరటానికి మరో కీలక కారణం.

### 6.3.1. ప్రధానమంత్రి - అధికారాలు:

భారత రాజ్యాంగం రాష్ట్రపతిని లాంఛనప్రాయమైన అధికారిగా, ప్రధానమంత్రి నాయకత్వంలోని మంత్రిమండలిని వాస్తవమైన కార్యనిర్వాహక అధికారిగా రూపొందించింది. రాజ్యాంగం మంత్రిమండలిని వాస్తవ కార్యనిర్వాహక అధికారిని చేసినప్పటికీ ప్రధానమంత్రి మొత్తం అధికారాలకు కేంద్రం అనేది అందరూ ఆమోదించిన వాస్తవం. భారత ప్రధానమంత్రి బ్రిటిషు ప్రధానికి ప్రతిరూపం. బ్రిటిష్ ప్రధానమంత్రికి సమానంగా భారత ప్రధానమంత్రి త్రిసమానులలో ప్రధముడు. మొత్తం ప్రభుత్వ వ్యవస్థకు కేంద్రం. నక్షత్రాలలో

చంద్రుడు. లాస్కీ మాటల్లో ప్రధానమంత్రి మంత్రిమండలి సృష్టికి మూలం, దాని మనుగడకు, మరణానికి ప్రధాన ఆధారం. మొత్తం ప్రభుత్వ వ్యవస్థ ప్రధానమంత్రి చుట్టూ పరిభ్రమిస్తుంది.

## 6.3.2. మంత్రిమండలి అధిపతి:

భారత రాజ్యాంగం ప్రకారం రాష్ట్రపతికి తన విధుల నిర్వహణలో ప్రధాన మంత్రి నాయకత్వం వహించే మంత్రి మండలి సలహానిస్తుంది. మంత్రిమండలికి ప్రధానమంత్రి అధిపతి. ప్రధానమంత్రి సలహా ప్రకారమే రాష్ట్రపతి మంత్రులను నియమిస్తాడు. ప్రధానమంత్రి మంత్రిమండలి పరిమాణాన్ని నిర్ధారిస్తాడు. మంత్రులకు మంత్రిత్వ శాఖలను కేటాయించడం, వాటిని మార్చడంలో ప్రధానమంత్రికి పూర్తి స్వేచ్ఛ ఉంటుంది. కొందరు నిపుణుల అభిప్రాయం ప్రకారం, ఇప్పటివరకు భారత ప్రధానమంత్రులు అందరు మంత్రులకు శాఖలను కేటాయించటంలో, వారి శాఖలను మార్చటంలో పూర్తి స్వేచ్ఛను అనుభవించారు. ప్రధానమంత్రికి మంత్రులను నియమించటంతోపాటు వారిని పదవి నుంచి తొలగించటంలో కూడా సంపూర్ణమైన అధికారాలు, స్వేచ్ఛ ఉన్నాయి.

మంత్రిమండలి అధిపతిగా, ప్రధానమంత్రి మంత్రి మండలి సమావేశాలను ఏర్పాటు చేసి, వాటికి అధ్యక్షత వహిస్తాడు. మంత్రిమండలి సమావేశాలకు అవసరమైన ఎజెండాను రూపొందిస్తాడు. సాధారణంగా మంత్రి మండలి నిర్ణయాలన్నీ ప్రధానమంత్రి వ్యక్తిగత నిర్ణయాలే. అందుచేత మంత్రిమండలి నిర్ణయాలన్నీ వాస్తవంగా ప్రధానమంత్రి చేసిన నిర్ణయాలే.

ప్రధానమంత్రి వివిధ మంత్రుల, మంత్రిత్వ శాఖల కార్యకలాపాలకు మార్గదర్శకత్వం వహిస్తాడు. వివిధ ప్రభుత్వ శాఖల కార్యకలాపాలను సమన్వయ పరుస్తాడు. మొత్తం ప్రభుత్వం పనితీరును పర్యవేక్షణ చేసే అధికారం ప్రధానమంత్రికి ఉంది. వివిధ మంత్రులు, మంత్రిత్వ శాఖలు మధ్య తలెత్తే వివాదాలను పరిష్కరించవలసిన బాధ్యత కూడా ప్రధాన మంత్రిదే.

ప్రధానమంత్రి మంత్రిమండలికి, రాష్ట్రపతికి మధ్య సమాచార ప్రసార మధ్యమం. ప్రధానమంత్రి మంత్రిమండలి నిర్ణయాలను రాష్ట్రపతికి నివేదిస్తాడు. రాష్ట్రపతి సందేశాలను మంత్రిమండలికి అందజేస్తాడు. ప్రధానమంత్రి అనుమతి లేకుండా రాష్ట్రపతిని కల్సుకొనే లేదా, రాష్ట్రపతికి సమాచారాన్ని అందించే అధికారం మంత్రులకు లేదు. చివరగా, ప్రధానమంత్రి వివిధ క్యాబినెట్ సంఘాల అధ్యక్షులను, సభ్యులను నియమిస్తాడు. మొత్తం మీద మంత్రిమండలి ఐక్యత, ఉమ్మడి బాధ్యతలు ప్రధానమంత్రి ద్వారా సాధింపబడతాయి. మంత్రులలో అనేక వైవిధ్యాలు ఉన్నప్పటికి వారు ప్రధానమంత్రి నాయకత్వంలో ఐకమత్యంతో ఒక బృందంగా పని చేస్తారు.

## 6.3.3. పార్లమెంట్ నాయకత్వం:

ప్రధానమంత్రి లోక్‌సభలో మెజారిటీ పార్టీ నాయకుడు. అందుచేత పార్లమెంటుకు కూడా నాయకుడు. పార్లమెంట్ నిర్వహించే వివిధ కార్యకలాపాలలో కీలక పాత్ర వహిస్తాడు. ప్రధానమంత్రి పార్లమెంటు ఉభయ సభలను సమావేశపరచటంలో, వాయిదా వేయటంలో రాష్ట్రపతికి సలహా ఇస్తాడు. లోక్‌సభను రద్దు చేయమని సలహాను ఇచ్చే అధికారం ప్రధానమంత్రికి వుంది. అయితే ఈ విషయంలో ప్రధానమంత్రి సలహాను పాటించడంలో రాష్ట్రపతి తన విచక్షణాధికారాన్ని వినియోగించే అవకాశం ఉంది.

పార్లమెంటు నాయకుడిగా ప్రధానమంత్రి శాసన నిర్మాణంలో కీలక పాత్రవహిస్తాడు. పార్లమెంట్‌లో ప్రవేశపెట్టే బిల్లులను మంత్రిమండలే రూపొందిస్తుంది. అందుచేత ప్రధానమంత్రి ఆమోదం లేనిదే ఏ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టటం జరుగదు. పార్లమెంటులో ప్రవేశపెట్టే బిల్లుల అన్ని దశలలో ప్రధానమంత్రి మార్గదర్శకత్వం వహిస్తాడు. ప్రధానమంత్రి ప్రభుత్వ విధానాలను పార్లమెంట్‌లో ప్రకటిస్తాడు. వాటిని సభ్యులకు వివరిస్తాడు. స్పీకర్‌తో కలిసి ప్రధానమంత్రి పార్లమెంట్ నిర్వహించే శాసనాల రూపకల్పనకు సంబంధించిన ప్రణాళికను రూపొందిస్తాడు. బిల్లుల ప్రాధాన్యతలను నిర్ధారిస్తాడు. సభాకార్యకలాపాల సలహా సంఘం సమావేశాలలో పాల్గొంటాడు. రాజ్యసభ, లోక్ సభల మధ్య వివాదం తలెత్తినపుడు ఆ వివాదాన్ని పరిష్కరించేందుకు, వాటి మధ్య సంధానకర్తగా వ్యవహరిస్తాడు. పార్లమెంట్ నాయకుడిగా ప్రధానమంత్రి సభలోని ప్రతిపక్ష సభ్యులతో సన్నిహిత సంబంధాలను కల్గి వుంటాడు. వారి అభిప్రాయాలను తెల్సుకుంటాడు. ప్రధాన జాతీయ అంశాలపై వారి మద్దతును, సహకారాన్ని పొందేందుకు కృషి చేస్తాడు.

## 6.3.4. పార్టీ నాయకత్వం:

ప్రధానమంత్రి పార్లమెంటరీ అధికారపక్షం ప్రధాన నాయకుడిగా వ్యవహరిస్తాడు. కొన్ని జాతీయ పార్టీలకు ప్రధానమంత్రి అధ్యక్షుడుగా వ్యవహరిస్తాడు. ఈ వాస్తవం మిగిలిన జాతీయ రాజకీయ పార్టీల కంటే కాంగ్రెస్‌కు బాగా వర్తిస్తుంది. శ్రీమతి ఇందిరాగాంధి, రాజీవ్‌గాంధి, పి.వి. నరసింహారావులు ప్రధానమంత్రులుగానే కాక, పార్టీ అధ్యక్షులుగా కూడా వ్యవహరించారు. తన పార్టీ అన్ని కార్యకలాపాలలో ప్రధానమంత్రికి కీలకపాత్ర ఉంటుంది. పార్టీ విధానాల రూపకల్పన, ఎన్నికల ప్రచారంలో ప్రధానమంత్రి కీలకపాత్ర వహిస్తాడు. సాధారణంగా ఎన్నికలలో పార్టీ విజయం ప్రధానమంత్రి పైన ఎక్కువగా ఆధారపడి వుంటుంది. కూడా ప్రధానమంత్రి తన పదవిని, బలాన్ని తన రాజకీయ పార్టీ నుంచి పొందినవే, ప్రధానమంత్రి అనేక కీలక అంశాలలో తన పార్టీ ప్రతినిధిగా వ్యవహరిస్తాడు.

ప్రధానమంత్రి పార్టీపై ఎంత ఆధిపత్యాన్ని వహించినప్పటికి, ఆయన రాజకీయ భవిష్యత్తు పార్టీపైన ప్రధానంగా ఆధారపడి ఉంటుంది. ప్రధానమంత్రి తన రాజకీయ మనుగడకు, పదవిలో కొనసాగటానికి పార్టీని ఆశ్రయించక తప్పదు. అందుచేత ప్రధానమంత్రి తన పార్టీ విధానాలకు అనుగుణంగా నడుచుకోవాల్సి ఉంటుంది. తన పార్టీని పటిష్టపరచవలసిన బాధ్యత మిగిలిన నాయకులకంటే ప్రధానమంత్రి పైన అధికంగా వుంటుంది. మొత్తం మీద ప్రధానమంత్రి బలం పార్టీలో, పార్టీ బలం ప్రధానమంత్రిలో దాగి ఉంటాయనేది వాస్తవం.

## 6.3.5 అంతర్జాతీయ సంబంధాల రంగంలో పాత్ర:

దేశ అంతర్జాతీయ సంబంధాలలో ప్రధానమంత్రి అత్యంత ప్రధానమైన పాత్రను నిర్వహిస్తాడు. దేశం అనుసరించవలసిన విదేశాంగ విధానాన్ని రూపొందించటానికి ప్రత్యేకంగా ఒక మంత్రిత్వ శాఖ ఉన్నప్పటికీ ఈ రంగంలో ప్రధానమంత్రి నిర్ణయాత్మక పాత్రను నిర్వహిస్తాడు. అంతర్జాతీయ రంగంలో, విదేశాంగ వ్యవహారాలలో దేశం పోషించవలసిన పాత్రను ప్రధానమంత్రి నిర్ధారిస్తాడు. అంతర్జాతీయ సమస్యలకు, పరిణామాలకు భారత దేశ ప్రతిస్పందన ప్రధానంగా ప్రధానమంత్రి నిర్ణయం పైనే ఆధారపడి వుంటుంది. భారతదేశ విదేశాంగ విధానం, ఇతర దేశాలతో భారతదేశం సంబంధాలు మొదలైన విషయాలలో ప్రభుత్వం తీసుకునే అన్ని చర్యలను, నిర్ణయాలను ప్రధానమంత్రి ఆమోదించవలసి ఉంటుంది. భారతదేశ విదేశాంగ విధానంపై పార్లమెంట్ లో అధికార పూరితమైన ప్రకటనలను చేసే అధికారం ప్రధానమంత్రికి మాత్రమే వుంది. మిగిలిన మంత్రిత్వ శాఖల కన్నా న్యాయ, రక్షణ, విదేశీ వ్యవహారాల శాఖల కార్యకలాపాలలో ప్రధానమంత్రి జోక్యం, పర్యవేక్షణ, నియంత్రణలు ఎక్కువ స్థాయిలో ఉంటాయి. భారత విదేశాంగ విధానాన్ని రూపొందించటంలో, అంతర్జాతీయ వ్యవహారాలలో భారతదేశం నిర్వహించిన పాత్ర మొదలైన విషయాలలో భారతదేశ మొట్టమొదటి ప్రధానమంత్రి నెహ్రూ నిర్వహించిన పాత్ర అందరికి తెలిసిందే.

## 6.3.6 ప్రధానమంత్రి స్థానం:

నెహ్రూ ప్రధానమంత్రి పదవిలో కొనసాగినంతకాలం భారత క్యాబినెట్ వ్యవస్థ ప్రధానమంత్రి ప్రభుత్వ (Prime Ministerial Government) ప్రమాణాలకు అనుగుణంగా పనిచేసింది. అయినప్పటికీ నెహ్రూ కాలంలో మంత్రులు కీలక పాత్రను వహించారు. శ్రీమతి గాంధీ ప్రధానమంత్రిగా వ్యవహరించిన కాలంలో భారత ప్రభుత్వం అదే ప్రమాణాలతో పని చేసింది. 1977లో కేంద్రంలో జనతా పార్టీ ప్రభుత్వం ఏర్పడ్డాక కూడా ప్రధానమంత్రి ఆధిక్యత కొనసాగిందే తప్ప క్యాబినెట్ ప్రాధాన్యత పునరుద్ధరణ జరుగలేదు. జనతా పార్టీ ప్రభుత్వం సమయంలో అనేక అంశాలలో క్యాబినెట్ మంత్రుల మధ్య అనేక అంశాలలో అభిప్రాయ బేధాలు తెలెత్తడంతో క్యాబినెట్ వ్యవస్థ బలహీనపడింది.

1980లో శ్రీమతి ఇందిరాగాంధి రెండవసారి కేంద్రంలో అధికారంలోకి వచ్చాక ప్రధానమంత్రి ఆధిక్యత విధానం మరింత బలపడింది. శ్రీమతి గాంధీ తర్వాత, రాజీవ్‌గాంధి శ్రీమతి గాంధి అనుసరించిన విధానాన్ని అనుసరించాడు. కాంగ్రెస్‌పార్టీ అధికారంలో లేని 1989-91 మధ్యకల అతి తక్కువ కాలంలో ముగ్గురు ప్రధానమంత్రులు పనిచేసారు. పార్లమెంట్‌లో తగిన మెజారిటీ లేకపోడం, అధికారపక్షంలో అనేక బేధాభిప్రాయాలు ఉండటం చేత ఈ ప్రధానమంత్రులు సమర్థవంతంగా వ్యవహరించలేకపోగా, ఆధిపత్యాన్ని

చెలాయించలేకపోయారు. 1991లో ప్రధానమంత్రి అధికారాన్ని చేపట్టిన పి.వి. నరసింహారావు 5 సం॥లు పాటు పదవిలో కొనసాగినప్పటికి, పార్లమెంట్‌లో తగిన మెజారిటీ లేకపోవటం చేత ప్రతిభావంతమైన ప్రధానిగా వ్యవహరించలేకపోయారు. 1989 తర్వాత రాజకీయ పరిస్థితిని వివరిస్తూ పాల్‌బ్రాస్ 1990 దశాబ్దంలో దేశంలో సంభవించిన రాజకీయ పరిణామాల ఫలితంగా దేశంలో బలహీనమైన క్యాబినెట్‌లపై ప్రధానమంత్రి ఆధిక్యత విధానం స్థానంలో ఐక్యతలేని క్యాబినెట్‌లపై బలహీనమైన ప్రధానమంత్రి నాయకత్వం విధానం రూపు దిద్దుకుందని వివరించాడు.

## 6.4. మంత్రిమండలి (క్యాబినెట్):

రాజ్యాంగంలోని సవరించిన 74వ అధికరణ ప్రకారం తన విధుల నిర్వహణలో రాష్ట్రపతికి సలహాలనిచ్చేందుకు ప్రధాన మంత్రి అధ్యక్షుడుగా కల ఒక మంత్రి మండలి ఉంది. ఈ అధికరణ ప్రకారం రాష్ట్రపతి తన విధుల నిర్వహణలో మంత్రి మండలి సలహాను పాటించాలి. రాజ్యాంగంలోని 75(1)వ అధికరణను అనుసరించి రాష్ట్రపతి ప్రధానమంత్రిని, ఆయన సలహాపై ఇతర మంత్రులను నియమిస్తాడు. మంత్రిమండలిలో క్యాబినెట్ మంత్రులు, సహాయమంత్రులు, డిప్యూటి మంత్రులు అనే మూడు తరగతులకు చెందిన మంత్రులు ఉంటారు. క్యాబినెట్ హోదా కల మంత్రులు తమ సంబంధిత శాఖలకు అధిపతులుగా వ్యవహరిస్తారు. మంత్రిమండలిలోని మంత్రులు అందరూ క్యాబినెట్ మంత్రులు కారు. క్యాబినెట్ మంత్రులనే క్యాబినెట్ అని పిలుస్తారు. క్యాబినెట్ మొత్తం మంత్రిమండలిలో ఒక చిన్న సంస్థలాంటిది. భారత రాజ్యాంగం క్యాబినెట్ అనే పదాన్ని ఉపయోగించినప్పటికీ, బ్రిటీషు క్యాబినెట్ విధానం ఆవశ్యక లక్షణాలను స్వీకరించింది. ఈ విధంగా క్యాబినెట్ సాంప్రదాయం ఆధారంగా ఏర్పరచిన రాజ్యాంగేతర సంస్థ అయినప్పటికీ క్యాబినెట్ అత్యంత శక్తివంతమైన రాజకీయ సంస్థ.

### 6.4.1. క్యాబినెట్ - మంత్రిమండలి:

భారతదేశంలో క్యాబినెట్, మంత్రిమండలి (Council of Ministers) అనే రెండు పదాలను విచక్షణా రహితంగా ఉపయోగించటం వల్ల వీటి గురించి కొంత అస్పష్టత ఎదురైంది. అనేకమంది ఈ రెండు పదాలను సమాన అర్థంలో ఉపయోగిస్తున్నారు. కానీ వీటి మధ్య భిన్నత్వం ఉంది. మంత్రిమండలిలో క్యాబినెట్ మంత్రులు, సహాయ మంత్రులు (State Ministers), ఉపమంత్రులు (Deputy Ministers), అని 3 రకాల మంత్రులు ఉన్నారు. వీరిలో క్యాబినెట్ మంత్రులు, క్యాబినెట్ అనే ప్రత్యేక సంస్థగా ఏర్పడతారు. క్యాబినెట్ మంత్రిమండలిలో కేంద్ర బిందువు వంటిది. అయితే రాజ్యాంగం మంత్రిమండలి అనే పదాన్ని ఉపయోగించిందేతప్ప క్యాబినెట్ అనే పదాన్ని ఉపయోగించలేదు. అయితే ఆచరణలో రాజ్యాంగంలో ప్రస్తావించిన మంత్రిమండలిని క్యాబినెట్ అనే వ్యవహరిస్తున్నారు.

రాజ్యాంగంలో పేర్కొన్న మంత్రిమండలి అనే మూడు అంచెల వ్యవస్థలో క్యాబినెట్ మంత్రులు అగ్రస్థాయిని, సహాయ మంత్రులు మధ్యస్థాయిని, ఉపమంత్రులు చివరిస్థాయిని ఆక్రమిస్తారు. రాజ్యాంగం క్యాబినెట్ మంత్రులు, ఇతర రెండు స్థాయిల మంత్రుల మధ్య స్పష్టమైన విభజన చేసింది. మంత్రిమండలిలోని అతి సీనియర్ మంత్రులకు క్యాబినెట్ మంత్రుల హోదా కల్పించబడుతుంది. క్యాబినెట్ మంత్రులకు తమకు కేటాయించిన శాఖలపైనే కాక మొత్తం కేంద్ర ప్రభుత్వ పాలనపై కూడా అధికారం వుంటుంది. సహజంగానే క్యాబినెట్ పరిమాణం పరిమితమైంది. రాజ్యాంగం మొత్తం మంత్రిమండలికి అప్పగించిన అనేక విధులను ఆచరణలో క్యాబినెట్ నిర్వహిస్తుంది. ఉదాహరణకు, రాజ్యాంగాన్ని అనుసరించి రాష్ట్రపతికి సలహాలను ఇవ్వటం మంత్రిమండలి ప్రధానవిధి. కానీ ఆచరణలో ఈ విధిని క్యాబినెట్ నిర్వహిస్తున్నది.

రాజకీయ, పాలన రంగాల్లో సమర్థులు, ఖ్యాతి పొందిన రాజకీయ నాయకులను క్యాబినెట్ మంత్రులుగా ఎంపిక చేస్తారు. క్యాబినెట్ మంత్రులు ప్రభుత్వంలో విత్త మంత్రిత్వ శాఖ, విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ, దేశీయాంగ మంత్రిత్వ శాఖ, రక్షణ మంత్రిత్వ శాఖ, రైల్వే మంత్రిత్వ శాఖ, పరిశ్రమల మంత్రిత్వ శాఖ, మొ॥న కీలక మంత్రిత్వ శాఖలను నిర్వహిస్తారు. భారతదేశంలో క్యాబినెట్ మంత్రుల సంఖ్య 13 నుంచి 20 వరకు ఉంటుంది. సమర్థవంతంగా ఆలోచించేందుకు, చర్చించేందుకు వీలు కల్పించేందుకు క్యాబినెట్ పరిమాణాన్ని పరిమితం చేయటం జరుగుతున్నది.

కేంద్ర పాలనా వ్యవస్థలో అతి శక్తివంతమైన క్యాబినెట్ ప్రధానంగా నాలుగు విధులను నిర్వహిస్తుంది. అవి.

1. ప్రభుత్వ విధానాలను రూపొందించే ప్రతిపాదనలను ఆమోదించటం.
2. ప్రభుత్వంలోని కీలక పదవులకు నియామకాలు జరపటం.
3. వివిధ ప్రభుత్వ శాఖల మధ్య వివాదాలను పరిష్కరించి, వాటి మధ్య సమన్వయాన్ని సాధించటం.
4. వివిధ ప్రభుత్వ కార్యకలాపాలను సమీక్షించటం.

ఈ విధంగా క్యాబినెట్ జాతీయ విధానాలను రూపొందించే, అత్యున్నత పదవులను భర్తీ చేసే, వివిధ శాఖల మధ్య ఏర్పడే వివాదాలను పరిష్కరించే, వివిధ శాఖల కార్యకలాపాలను సమన్వయపరిచే అత్యున్నత సంస్థ.

మంత్రిమండలిలో క్యాబినెట్ మంత్రులకు తర్వాత స్థానం సహాయమంత్రులది. సాధారణంగా సహాయ మంత్రులు స్వతంత్రంగా మంత్రిత్వశాఖలను నిర్వహిస్తారు. సహాయ మంత్రులు క్యాబినెట్ మంత్రులు నిర్వహించే విధులను నిర్వర్తించటంతోపాటు, వారు చెలాయించే అధికారాలను చెలాయిస్తారు. క్యాబినెట్ మంత్రులకు, సహాయ మంత్రులకు మధ్య ఉన్న ప్రధాన వ్యత్యాసం ఏమిటంటే సహాయ మంత్రులు క్యాబినెట్‌లో సభ్యులు కాదు. అందుచేత వారు క్యాబినెట్ సమావేశాలలో పాల్గొనరు. కానీ అవసరమైన సమయాలలో ప్రత్యేక ఆహ్వానితులుగా మాత్రమే వారు క్యాబినెట్ సమావేశంలో పాల్గొంటారు. కొందరు సహాయ మంత్రులు స్వతంత్రంగా మంత్రిత్వ శాఖలకు ఆధిపత్యం వహించక క్యాబినెట్ మంత్రులకు సహాయకులుగా వుంటారు.

మంత్రిమండలిలో చివరిస్థాయి మంత్రులైన ఉపమంత్రులకు ప్రత్యేక బాధ్యతలు లేకపోయినా వారు కొన్ని యాంత్రికమైన విధులను నిర్వర్తిస్తారు. ఉపమంత్రులు నిర్వర్తించే విధులలో ప్రధానమైనవి (1) తమ శాఖలకు సంబంధించిన వ్యవహారాలపై పార్లమెంట్ సమావేశాలలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు క్యాబినెట్, సహాయ మంత్రుల తరపున సమాధానాలు ఇస్తారు, (2) తమ శాఖలు చేపట్టే విధానాలను, పథకాలను ప్రజలకు వివరించటంతోపాటు, ప్రభుత్వానికీ, పార్లమెంటుకు, రాజకీయ పార్టీలకు మధ్య అనుసంధాన కర్తలుగా వ్యవహరిస్తారు, (3) క్యాబినెట్ మంత్రులు అప్పగించిన విధులను నిర్వర్తిస్తారు.

స్వాతంత్ర్యానంతరం ప్రభుత్వ కార్యకలాపాలలో విస్తృతంగా పెరిగిన పరిమాణం, సంక్లిష్టతల కారణంగా, క్యాబినెట్ సమర్థవంతంగా పని చేసేందుకు క్యాబినెట్ మంత్రులతో కొన్ని సంఘాలను ఏర్పాటు చేశారు. ఈ విధంగా ఏర్పడిన క్యాబినెట్ సంఘాలు రెండు రకాలు: (1) శాశ్వత స్థాయీ సంఘాలు, (2) తాత్కాలిక సంఘాలు: ప్రస్తుతం 4 క్యాబినెట్ స్థాయి సంఘాలున్నాయి. అవి (1) రక్షణ వ్యవహారాల స్థాయి సంఘం, (2) ఆర్థిక వ్యవహారాల సాయీ సంఘం, (3) పరిపాలనా వ్యవస్థీకరణ స్థాయీ సంఘం, (4) పార్లమెంట్, న్యాయ వ్యవహారాల స్థాయీ సంఘం. ఏదైనా కీలకమైన సమస్య తలెత్తినపుడు వాటిని అధ్యయనం చేసి, తగిన పరిష్కార మార్గాలను సూచించేందుకు, క్యాబినెట్ మంత్రులతో తాత్కాలిక సంఘాలను ఏర్పాటు చేస్తారు. క్యాబినెట్ తన విధులను సమర్థవంతంగా, వేగంగా నిర్వర్తించేందుకు క్యాబినెట్ సంఘాలు ఉపకరిస్తున్నాయి.

## 6.4.2. క్యాబినెట్ లక్షణాలు:

భారతదేశం బ్రిటిష్ పార్లమెంటరీ సంప్రదాయాన్ని అనుసరించింది. ఈ సాంప్రదాయానికి అనుగుణంగా సమిష్టి బాధ్యత (collective responsibility) మంత్రిమండలి ప్రధాన లక్షణం. సమిష్టి బాధ్యతకు అనుగుణంగా మంత్రి మండలిలోని మంత్రులు ప్రభుత్వ కార్యకలాపాలలో ఐక్యమత్యంతో ప్రవర్తిస్తారు. మంత్రిమండలిలోని నిర్ణయాలు ఏకాభిప్రాయంతో చేయబడతాయి. మంత్రిమండలి నిర్ణయాలను ప్రతి మంత్రి సమర్థించాలి. ఈ విధంగా మంత్రిమండలి చేసిన నిర్ణయాలకు మంత్రులందరు సమిష్టిగా బాధ్యత వహించాలి. మంత్రిమండలి తీసుకొన్న నిర్ణయాలను ఏ మంత్రి అయినా బహిరంగంగా వ్యతిరేకించటం, విమర్శించటంద్వారా సమిష్టి బాధ్యత సూత్రాన్ని ఉల్లంఘించినపుడు, ఆ మంత్రిని పదవినుంచి తొలగించే అధికారం ఏ మంత్రి మంత్రి మండలి తీసుకున్న నిర్ణయాలపట్ల వ్యతిరేకత ఉన్నప్పుడు, లేదా ఆ నిర్ణయాలను నిజాయితీతో సమర్థించటం అసాధ్యం అనిపించినపుడు తన మంత్రి పదవికి రాజీనామా చేయాల్సి వుంటుంది. కానీ ఆ విధంగా రాజీనామా చేయని మంత్రిని పదవినుంచి తొలగించమని ప్రధానమంత్రి

రాష్ట్రపతిని కోరవచ్చును. ఆ మంత్రి రాజీనామా చేయనప్పుడు ప్రధానమంత్రి మొత్తం మంత్రిమండలిని రద్దుపరిచి, ఆ మంత్రి లేకుండా నూతన మంత్రివర్గాన్ని ఏర్పాటు చేయవచ్చును. ఈ విధమైన చర్యల ద్వారా ప్రధానమంత్రి మంత్రి మండలి సమిష్టి బాధ్యతను అమలు పరుస్తాడు.

ప్రధానమంత్రి సమిష్టి బాధ్యత సూత్రాన్ని అమలుపరచటం ద్వారా మంత్రులు అవాంఛనీయ చర్యలకు పాల్పడకుండా నివారించవచ్చును. ప్రధానమంత్రి లేని పక్షంలో మంత్రులను నియంత్రించే లేదా ప్రభావితం చేసే అవకాశం రాష్ట్రపతికి లభించేది. దీని ఫలితంగా మంత్రుల కార్యకలాపాలలో విఘాతం ఏర్పడి ఉండేదని పైలీ వివరించాడు. కానీ రాజ్యాంగం ప్రధానమంత్రికి శక్తివంతమైన స్థానాన్ని కల్పించటం ద్వారా మంత్రిమండలి సమిష్టి బాధ్యత అనేనియమానికి వాస్తవ రూపం కల్పించింది. ఈ విధంగా పధానమంత్రి ద్వారా మంత్రిమండలి సమిష్టి బాధ్యత క్యాబినెట్ ప్రభుత్వం ఉల్లంఘించరాని సూత్రంగా రూపొందింది.

మంత్రిమండలి మరో ప్రధాన లక్షణం ఏమిటంటే మంత్రులకు సమిష్టి బాధ్యలతోపాటు వ్యక్తిగత బాధ్యత కూడా వుంది. మంత్రిమండలి తన చర్యలకు పార్లమెంటుకు సమిష్టిగా బాధ్యత వహించటంతోపాటు, మంత్రులు వ్యక్తిగతంగా కూడా లోక్ సభకు ాధ్యత వహిస్తారు. దీనికి లోక్‌సభ ప్రజల చేత ప్రత్యక్షంగా ఎన్నుకోబడిన సభ కావటమే కారణం.

## 6.4.3. క్యాబినెట్ ప్రధాన విధులు:

క్యాబినెట్ నిర్వహించే విధులు సంక్షిప్తంగా ఈ క్రిందివి:

భారత ప్రభుత్వ వ్యవస్థలో క్యాబినెట్ ప్రధాన విధాన నిర్ణయీకరణ సంస్థ, క్యాబినెట్ విధానాలను రూపొందించవలసిన అంశాలను గుర్తించి, వాటిపై విధానాలను రూపొందిస్తుంది. ఈ సాధారణంగా ప్రతి క్యాబినెట్ మంత్రి తన శాఖకు సంబంధించిన అంశాలపై విధానాలను రూపొందిస్తాడు. అయినప్పటికీ ఈ విధాన రూపకల్పన పై ప్రధానమంత్రి, ఇతర క్యాబినెట్ మంత్రుల ప్రభావం ఉంటుంది.

క్యాబినెట్ పార్లమెంట్‌లో అంతర్భాగం. దేశంలో పార్లమెంటు అత్యున్నత చట్ట నిర్మాణ సంస్థ అయినప్పటికీ చట్టాల నిర్మాణంలో క్యాబినెట్ ప్రధాన పాత్ర వహిస్తుంది. ప్రభుత్వ బిల్లులను రూపొందించటంతోపాటు వాటిని పార్లమెంటులో ప్రవేశ పెట్టి, ఆమోదించేలా చేయటం క్యాబినెట్ మంత్రుల ద్వారానే జరుగుతుంది. రాజ్యాంగానికి చేసే సవరణలను క్యాబినెట్ ప్రతిపాదిస్తుంది. క్యాబినెట్ పార్లమెంటు సమావేశాలకు అవసరమైన ఎజెండాను రూపొందించటంతోపాటు పార్లమెంటు ప్రధమ సమావేశంలో రాష్ట్రపతి చేసే ప్రసంగాన్ని రూపొందిస్తుంది.

పార్లమెంటులో ప్రవేశపెట్టే ద్రవ్య బిల్లులను (Money Bills) క్యాబినెట్ తయారు చేస్తుంది. వాటిని పార్లమెంటులో ప్రవేశపెట్టి, ఆమోదింపచేస్తుంది. ప్రభుత్వ వ్యయాన్నీ, ఆదాయానికి వివరించే బడ్జెట్ రూపకల్పనకు క్యాబినెట్ బాధ్యత వహిస్తుంది. అయితే బడ్జెట్ రూపకల్పనలో ఆర్థిక శాఖమంత్రి, ప్రధానమంత్రులే ప్రధానపాత్ర నిర్వహిస్తారు. ఈ విధంగా క్యాబినెట్ ప్రభుత్వం విధానాలను అమలు పరచటంతోపాటు శాసన నిర్మాణంలో పార్లమెంటుకు నాయకత్వం వహిస్తుంది. ఈ పాత్రను నిర్వహించడం ద్వారా క్యాబినెట్ శాసన నిర్మాణ శాఖ, కార్య నిర్వహక శాఖలను అనుసంధానించే అనుసంధానకర్తగా వ్యవహరిస్తుంది.

కార్యనిర్వాహక రంగంలో క్యాబినెట్ విస్తృతమైన విధులను నిర్వర్తిస్తుంది. రాష్ట్రపతికి సలహాలను ఇవ్వడం క్యాబినెట్ కార్య నిర్వాహక విధులలో అత్యంత ప్రముఖమైంది. రాజ్యాంగం ప్రకారం క్యాబినెట్ సలహాలను పాటించటం రాష్ట్రపతికి తప్పనిసరి. క్యాబినెట్ వివిధ ప్రభుత్వ శాఖల కార్యకలాపాలను సమన్వయపరుస్తుంది. ప్రతి క్యాబినెట్ మంత్రి తన శాఖకు రాజకీయ అధిపతిగా వ్యవహరిస్తాడు. ఈ హోదాలో క్యాబినెట్ మంత్రి తనశాఖ పాలనకు సంబంధించిన విధానాలను రూపొందించటంతోపాటు, వాటి అమలును పర్యవేక్షిస్తాడు. ప్రతి క్యాబినెట్ మంత్రికి తన విధుల నిర్వహణలో సెక్రటరి తోడ్పడతాడు.

విదేశ వ్యవహారాల నిర్వహణలో కేంద్ర క్యాబినెట్‌కు కీలక పాత్ర ఉంది. అంతర్జాతీయ సంబంధాల నిర్వాహణకు ప్రభుత్వం చేపట్టే అనేక కార్యకలాపాలను క్యాబినెట్ సమన్వయపరుస్తుంది. విదేశాలతో సంధులు, ఒప్పందాలను కుదుర్చుకోవటం, నూతన దేశాలను గుర్తించటం, విదేశాలపై యుద్ధాన్ని ప్రకటించటం వంటి కీలక అంశాలపై క్యాబినెట్ తుది నిర్ణయాలను చేస్తుంది.

చివరగా, రాజ్యాంగంలోని 352, 356, 360వ అధికరణల పరిధిలో రాష్ట్రపతి దేశంలో వివిధ రకాల అత్యవసర పరిస్థితులను విధించటంలో క్యాబినెట్ ఆమోదం తప్పనిసరి. స్వయంగా అత్యవసర పరిస్థితిని విధించే అధికారం రాష్ట్రపతికి లేదు. రాజ్యాంగ రీత్యా రాష్ట్రపతికి సంక్రమించిన  అసాధారణ అధికారాలను వాస్తవంలో క్యాబినెట్ చెలాయిస్తుంది.

ఇటీవల కాలంలో మారుతున్న రాజకీయ పరిస్థితులలో క్యాబినెట్ అధికారాలు, పాత్రలలో అనేక మార్పులు చోటు చేసుకున్న విషయం వాస్తవం. అయినప్పటికీ క్యాబినెట్‌ను శక్తివంతమైన సంస్థగానే పరిగణించాలి. దేశ రాజకీయాలను, పాలనను నిర్వహించటంలో క్యాబినెట్ పాత్ర తిరుగులేనిది. ఇటీవల కాలంలో క్యాబినెట్  ఆధిక్యత తగ్గి ప్రధానమంత్రి ఆధిక్యత పెరిగిందనే వాదనలో నిజం ఉన్నప్పటికీ క్యాబినెట్‌ను బలహీనమైన సంస్థగా పరిగణించటం సహేతుకం కాదు. అనేక విషయాలలో ప్రధానమంత్రి క్యాబినెట్‌ను అధిగమించగలిగినప్పటికీ, క్యాబినెట్ మద్దతు లేనిదీ ప్రధాన మంత్రి తన విధులను సమర్థవంతంగా నిర్వహించలేడు. అందుచేత క్యాబినెట్‌తో సామరస్యంగా మెలగడం ప్రధానమంత్రికి అత్యంత ఆవశ్యకం అని రాజ్యాంగ నిపుణులు చేస్తున్న వాదనలో నిజం ఉంది.

## 6.5. ముగింపు :

భారతదేశం పార్లమెంటరీ వ్యవస్థను ఏర్పాటు చేసుకొనటం వలన దేశంలో ఒక విశిష్టమైన కార్యనిర్వాహఖ వర్గం రూపు దిద్దుకొంది. రాజ్యాంగం ప్రకారం కార్య నిర్వాహక అధికారాలు రాష్ట్రపతివి అయినప్పటికీ, వాస్తవంలో వాటిని చెలాయించేది ప్రధాన మంత్రి అధ్యక్షతన గల మంత్రిమండలి మాత్రమే. అందుచేత రాష్ట్రపతి రాజ్యాంగ రీత్యా మాత్రమే ప్రధాన కార్యనిర్వాహక అధికారి. ప్రధానమంత్రి, ఆయన మంత్రిమండలి యదార్థ కార్యనిర్వాహక అధికారులు. రాజ్యాంగం  ఏర్పరచిన ఈ కార్య నిర్వాహక అధికారి విధానం పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థ సంప్రదాయాలకు అనుగుణమైంది. అనేక కారణాల వల్ల భారత దేశంలో ఇంగ్లాండు తరహాలో క్యాబినెట్ నియంతృత్వ విధానం రూపుదిద్దుకొందని రాజకీయ, రాజ్యాంగ నిపుణుల అభిప్రాయం. రాజ్యాంగం ఆశయానికి ఇది భిన్నమైన పరిణామం అనే చెప్పాల్సి ఉంది. ఏమైనప్పటికీ పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యస్థలో  కార్య నిర్వాహక వర్గం పార్లమెంటుకు బాధ్యత వహించటం, జవాబుదారిగా ఉండటం తప్పనిసరి. ఈ దృక్పథం నుంచి పరిశీలిస్తే భారతదేశంలో పార్లమెంటు పవిత్రమైన శక్తివంతమైన సంస్థ. అందుచేత పార్లమెంటు, కార్యనిర్వాహక వర్గం రెండూ తమ పరిధిలో తమకార్యకలాపాలను నిర్వర్తించేందుకు తగిన నిరోధకాలు, సమతుల్యత (cheques and blances)ల విధానాన్ని ఏర్పరచటం అవసరమని రాజ్యాంగ నిపుణులు వాదిస్తున్నారు.

## 6.6. మాదిరి ప్రశ్నలు:

1. భారత దేశం కార్యనిర్వాహక వర్గం నిర్మాణాన్ని, అధికారాలను, పాత్రను వివరంచండి ?
2. భారతదేశ రాజకీయాలలో రాష్ట్రపతి పాత్రను విమర్శనాత్మకంగా విశ్లేషించండి ?
3. భారతదేశంలో క్యాబినెట్ వ్యవస్థ లక్షణాలను, అధికారాలను పరిశీలించండి ?
4. భారతదేశంలో ప్రధానమంత్రి పాత్రను చర్చించండి.

## 6.7. చదువతగిన గ్రంథాలు:


- Bipin Chandra, Indian After Independence 1947-2000, New Delhi, Penguin Books, 1999.
- Ramesh K. Arora and Rajani Goyal, Indian Public Administration, New Delhi: Wishwa Prakasham, 1995.
- M.V. Pylee, Constitutional Government in India, New Delhi: S Chand & Co.,2003 (Fifth Revised Edition)
- Paul R. Brass, Politics of India Since Independence, Cambridge: Cambridge University Presss 1990 (Second Edition).
- Granvelli Austin, Working a Democratic Constitution - The Indian Experience, New Delhi - Oxford University Press, 1999.
- W.H. Morris- Jones, The Government and Politics in India, New Delhi, : B.I. Publications, 1979.
- J.C. Johari, Indian Government and Politics, New Delhi, Vishal Publications, 1989.


**రచయిత: డా ॥ కె. చంద్రకుమార్**

## పాఠం-7

# న్యాయవ్యవస్థ - రాజకీయాలు

విషయక్రమం


**7.0 లక్ష్యం**

**7.1 పరిచయం**

**7.2 న్యాయమూర్తుల నియామకం**

**7.3 న్యాయమూర్తుల బదిలీలు**

**7.4 న్యాయసమీక్షాధికారం అంటే ఏమిటి ?**

**7.5 న్యాయసమీక్షాధికారానికి సంబంధించినకేసులు**

- **7.5.1 గోలక్‌నాథ్ కేసు**
- **7.5.2 పార్లమెంట్ ఆధిక్యతకు ప్రయత్నం**
- **7.5.3 24వ రాజ్యాంగ సవరణ**
- **7.5.4 25వ రాజ్యాంగ సవరణ**
- **7.5.5 కేశవానందభారతి కేసు**

**7.6 న్యాయస్థానాల క్రియాశీలకత్వం ప్రజా ప్రయోజనాల వ్యాజ్యం**

**7.7 సారాంశము**

**7.8 నమూనా పరీక్షా ప్రశ్నలు**

**7.9 చదువతగిన పుస్తకాలు**


## 7.0 లక్ష్యం:

ఈ భాగాన్ని చదివాక మీరు న్యాయమూర్తుల నియామకం, బదిలీల ద్వారా ప్రభుత్వం న్యాయస్థానాలను ఎలా నియంత్రిస్తుంది; న్యాయ సమీక్షాధికారాన్ని సుప్రీంకోర్టు ఎలా వినియోగిస్తుంది; న్యాయస్థానాల చొరవ ద్వారా ప్రజా ప్రయోజనాలు ఎలా పరిరక్షించబడతాయో గ్రహించగలరు.

## 7.1. పరిచయం:

బ్రిటీష్ పాలన భారతదేశంలో నూతన న్యాయవ్యవస్థను ఏర్పరచడం ద్వారా, భారతీయులకు పాశ్చాత్యన్యాయ స్మృతులను, వ్యక్తిగత హక్కులను, ప్రజాస్వామ్య భావాలను గ్రహించేందుకు అవకాశం ఏర్పడింది. బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా సాగిన జాతీయోద్యమంలో ను, ఆ తర్వాత నూతన రాజ్యాంగ రచనలోను న్యాయవాదులు ప్రముఖ పాత్ర వహించారని చెప్పవచ్చును.

ఉదాహరణకు జవహర్‌లాల్ నెహ్రూ, సర్దార్ వల్లభాయ్ పటేల్, అంబేద్కర్, అల్లాడి క్రిష్ణస్వామి అయ్యర్, కె.ఎమ్. మున్షీ మొ॥వారు న్యాయశాస్త్రంలో పట్టభద్రులు. బ్రిటీష్ పాలనలో రాష్ట్ర స్థాయిలో హైకోర్టులు, దిగువ స్థాయిలో జిల్లా కోర్టులు, అత్యున్నత స్థాయిలో బ్రిటీష్ పార్లమెంట్ ద్వారా నియమించబడిన ప్రీవి కౌన్సిల్ న్యాయనిర్ణయాధికారాన్ని కలిగి ఉండేవి. 1935 భారత ప్రభుత్వచట్టం సమాఖ్య ప్రభుత్వానికి రాష్ట్రాలకు మధ్య వచ్చే వివాదాలను పరిష్కరించేందుకు వీలుగా అత్యున్నత న్యాయస్థానంగా సుప్రీంకోర్టును ఏర్పరచడం జరిగింది. స్వాతంత్ర్యానంతరం రాజ్యాంగం ఒక సమీకృత, ఏకీకృత న్యాయవ్యవస్థను ఏర్పరిచింది.

## 7.2. న్యాయమూర్తుల నియామకం:

భారత రాష్ట్రపతి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిని నియమిస్తాడు. అతనిని సంప్రదించిన తర్వాత ఇతర న్యాయమూర్తులను నియమిస్తాడు. అలాగే రాష్ట్ర గవర్నర్లను సంప్రదించిన తరువాత రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తులను నియమిస్తాడు. సుప్రీంకోర్ట్ ప్రధాన న్యాయమూర్తి, సంబంధిత హైకోర్ట్ ప్రధాన న్యాయమూర్తి, రాష్ట్ర గవర్నర్లతో సంప్రదించి హైకోర్ట్ న్యాయమూర్తులను, అదనపు న్యాయమూర్తులను నియమిస్తాడు. ఉన్నత న్యాయస్థానాలకు న్యాయమూర్తులను నియమించే క్రమంలో రాష్ట్రపతి అనుభవం ఉన్న న్యాయమూర్తుల అభిప్రాయాలకు విలువ నివ్వడం ఆనవాయితిగా ఉన్నది. కార్యనిర్వహక శాఖ నుండి న్యాయశాఖకు స్వతంత్రం ఇవ్వాలన్నదే, ఈ నియామక పద్ధతి యొక్కప్రధాన ఉద్దేశ్యం. న్యాయశాఖ స్వతంత్రతను కలిగి ఉన్నప్పుడే రాజ్యాంగ పరిరక్షణ బాధ్యతను, పౌరహక్కుల రక్షణను సమర్ధవంతంగా నిర్వహించగలదని రాజ్యాంగ నిర్మాతల ఉద్దేశ్యం. కాని ఆచరణలో రాష్ట్ర ముఖ్యమంత్రులు, ఆయా రాష్ట్రాల గవర్నర్ల ద్వారా ఆయా హైకోర్టు న్యాయమూర్తుల నియామకంలో జోక్యం చేసుకోవడం జరుగుతున్నదని భారత రాజ్యాంగం అమలును నిశితంగా పరిశీలించిన న్యాయనిపుణుడు, గ్రాన్‌వైల్ ఆస్టిన్ తన గ్రంథంలో పేర్కొన్నాడు. అలాగే మొదటి న్యాయసంఘానికి చైర్మన్ ఆయిన ఎమ్.సి. సెతల్‌వాడ్ తన నివేదికలో హైకోర్టు న్యాయమూర్తుల నియామకాలలో ప్రాంతీయ, సమూహాల ప్రభావాల పాత్ర ఉంటున్నదనీ, అది న్యాయస్థానాల ప్రతిష్ఠను దిగజారుస్తున్నదనీ, అందుచేత ప్రతిభ ఆధారంగానే న్యాయమూర్తుల నియామకం జరగాలని సిఫారసు చేశాడు.

## 7.3. న్యాయమూర్తుల బదిలీలు:

రాజ్యాంగంలోని 222 వ నిబంధన ప్రకారం రాష్ట్రపతి, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిని సంప్రదించిన తరువాత ఒక రాష్ట్రంలోని హైకోర్టు న్యాయమూర్తులను మరొక రాష్ట్ర హైకోర్టుకు బదిలీచేయవచ్చును. జాతీయ సమైక్యతను సాధించేందుకు వీలుగా ప్రతిరాష్ట్ర హైకోర్టులో 1/3 వంతు న్యాయమూర్తులను ఇతర రాష్ట్ర హైకోర్టుల న్యాయమూర్తుల నియామకం ద్వారా నింపాలని, రాష్ట్రాల పునర్వ్యవస్తీకరణ సంఘం, 1955 సం॥లో చేసిన సిఫారసుల కనుగుణంగా హైకోర్టు న్యాయమూర్తుల బదిలీలు ప్రారంభించబడినవి. అయితే న్యాయమూర్తి బదిలీ, అతని యొక్క సమ్మతి ఆధారంగానే జరగాలనే సంప్రదాయం తొలుత అనుసరించబడినప్పటికి నేడు ఆ సంప్రదాయం అన్ని సందర్భాలలోను అనుసరించటంలేదు. అలాగే ఏదైనా హైకోర్టు న్యాయమూర్తిపై అవినీతి ఆరోపణలు వచ్చినప్పుడు లేదా ఆ హైకోర్టులోని న్యాయవాదులతో సత్సంబంధాలు క్షీణించినప్పుడు అలాంటి న్యాయమూర్తులను బదిలీ చేయడం ద్వారా హైకోర్టుల ప్రతిష్టను తిరిగి పునరుద్ధరించేందుకు వీలుగా కూడా ఈ బదిలీలు చేయడం జరుగుతున్నది.

## 7.4. న్యాయ సమీక్షాధికారం:

రాజ్యాంగ సంస్థలైన చట్టసభ, కార్యనిర్వహణశాఖలు రాజ్యాంగ శాసనం నిర్దేశించిన అధికారాలను అతిక్రమించకుండా నియంత్రించే అధికారాన్ని న్యాయస్థానాలు కలిగి ఉన్నట్లయితే, ఆ అధికారాన్ని న్యాయసమీక్షాధికారం అని పిలుస్తాం. చట్టసభ మరియు కార్య నిర్వహణ శాఖల శాసనాలు, ఆజ్ఞలు చెల్లనేరవు అని చెప్పే అధికారం, ఉన్నత న్యాయస్థానాలకు న్యాయసమీక్షాధికారం ద్వారా లభిస్తుంది. రాజ్యవ్యవస్థ నిర్మాణానికి, నిర్వహణకు, రాజ్య శాసనం మౌలిక ఆధారం అందుచేత ఆ శాసనాన్ని పరిరక్షించడం ద్వారా రాజకీయ వ్యవస్థలో స్థిరత్వాన్ని ఏర్పరచడం కూడా న్యాయ సమీక్షాధికార ఉద్దేశ్యం. ముఖ్యంగా పౌర హక్కుల రక్షణకు,

సమాఖ్యవ్యవస్థ సవ్యంగా, కొనసాగేందుకు అలాగే చట్టసభలోని అధిక సంఖ్యాక నిర్ణయాలు అల్పసంఖ్యాక వర్గాల హక్కుల, ఉల్లంఘన జరగకుండా నిరోధించేందుకు. ఈ న్యాయ సమీక్షాధికారం తోడ్పడుతుంది. అమెరికా, భారత్ వంటి ప్రజాస్వామ్య దేశాలు, ఈ న్యాయ సమీక్షాధికారాన్ని తమ రాజ్యాంగ శాసనాలలో స్పష్టంగా పేర్కొనడం జరిగింది.

## 7.5. న్యాయ సమీక్షాధికారానికి సంబంధించిన కేసులు - వివాదాలు

### 7.5.1. గోలక్‌నాథ్ కేసు:

పార్లమెంటు చేసిన శాసనాలు, రాజ్యాంగ బద్దంగా ఉన్నాయా, లేదా అనే విషయాన్ని సమీక్షించే అధికారం, ఉన్నత న్యాయ స్థానాలకు ఉంది అని తన చారిత్రాత్మక తీర్పును గోలక్‌నాథ్ కేసులో సుప్రీంకోర్టు ప్రకటించినది. రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కులను పార్లమెంటు రాజ్యాంగ సవరణ ద్వారా మార్పు చేయవచ్చా అనే ప్రశ్నకు, సుప్రీంకోర్టు ఈ కేసు ద్వారా ఆ అధికారం పార్లమెంటుకు లేదని, ప్రాథమిక హక్కులను మార్పు చేసే ఏ శాసనమైనా రాజ్యాంగ విరుద్ధమని ఈ కేసులో సుప్రీంకోర్టు తీర్పు చెప్పినది. ఈ కేసు వివరాలను జాగ్రత్తగా పరిశీలించినట్లయితే, న్యాయసమీక్షాధికారం, పౌరహక్కుల పరిరక్షణకు ఉద్దేశించబడినప్పటికి అది సామాజిక న్యాయ సాధనకు ప్రతి బంధకం అవుతుందన్న విమర్శ భారత దేశ రాజకీయాలలో అప్పటి నుండి ముఖ్య చర్చనీయాంశమైనది. ఈ కేసు వివరాలను పరిశీలిద్దాం. పంజాబ్ రాష్ట్రంలో అన్నదమ్ములైన హెన్రీ, విలియం గోలక్‌నాథ్‌లు 500 ఎకరాల పొలమును కలిగి ఉన్నారు. ఆ భూమిని తమ కుటుంబ వారసుల మధ్య పంపిణీ చేస్తూ వీలునామా వ్రాయటం జరిగింది. అయితే 1953 సం॥లో పంజాబ్ రాష్ట్ర ప్రభుత్వం భూ యాజమాన్యంపై పరిమితులను విధించి, మిగులు భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకునేందుకు వీలుగా భూ సంస్కరణ చట్టాన్ని చేసింది. ఈ చట్టం ప్రకారం గోలక్‌నాథ్ అన్నదమ్ములు ఒక్కొక్కరు 30 ఎకరాలు మాత్రమే కలిగి ఉండేందుకు వీలవుతుందని, ఆ విధంగా వారు 418 ఎకరాల మిగులు భూమిని కలిగి ఉన్నారని ప్రభుత్వం ప్రకటించింది. ఈ ప్రభుత్వ నిర్ణయాన్ని ప్రశ్నిస్తూ అన్నదమ్ములలో ఒకరైన ఇందర్ గోలక్‌నాథ్ 1965 సం॥ లో పంజాబ్ హైకోర్టులో కేసు దాఖలు చేయడం జరిగింది. అయితే హైకోర్టు నిర్ణయం ప్రభుత్వానికి అనుకూలంగా రావడంతో వారు సుప్రీంకోర్టులో కేసును దాఖలు చేయడం జరిగింది. ప్రతివ్యక్తి ఆస్తిని కలిగి ఉండే హక్కు (19 (f) వ నిబంధన), తన కిష్టమైన వృత్తిని అనుసరించే స్వేచ్ఛ (19 (g) నిబంధన) అలాగే చట్ట సమానత్వం అంటే చట్టాన్ని సమానంగా వర్తింపచేయడం (14 వ నిబంధన) అనే ప్రాథమిక హక్కులకు, పంజాబ్ రాష్ట్ర ప్రభుత్వం చేసిన భూ సంస్కరణల చట్టం విఘాతం కలిగిస్తుందని, కాబట్టి రాజ్యాంగ పరిరక్షణ హక్కు (32 వ నిబంధన) ద్వారా, తన ప్రాథమిక హక్కులను పునరుద్ధరించవలసినదిగా కోరుతూ ఇందర్ గోలక్‌నాథ్ సుప్రీంకోర్టులో పిటీషన్ దాఖలు చేయడం జరిగినది. అలాగే పంజాబ్ రాష్ట్ర భూ సంస్కరణ చట్టానికి రక్షణ కల్పించే 17 వ రాజ్యాంగ సవరణను, అలాగే ఒకటి, నాలుగవ రాజ్యాంగ సవరణలు కూడా, రాజ్యాంగ శాసనానికి విరుద్ధంగా ఉన్నాయనీ, అవి చెల్లవని ప్రకటించాలని గోలక్‌నాథ్ సుప్రీంకోర్టును అభ్యర్థించడం జరిగినది.

ప్రాథమిక హక్కులను ఉల్లంఘించే విధంగా రాజ్యాంగాన్ని సవరించే అధికారం పార్లమెంటుకు లేదని, గోలక్‌నాథ్ కేసులో సంచలనాత్మక తీర్పును 1967 సం॥లో సుప్రీం కోర్టు ప్రకటించినది. ఆ విధంగా ప్రాథమిక హక్కులను ఉల్లంఘించే పంజాబ్ రాష్ట్ర ప్రభుత్వ భూ సంస్కరణ చట్టం, దానికి రక్షణ కల్పించే రాజ్యాంగ సవరణ చెల్లవు అని నిర్ధారించబడినది. రాజ్యాంగాన్ని సవరించే అధికారం పార్లమెంటుకు ఉన్నప్పటికి ఆ అధికారాన్ని ప్రాథమిక హక్కులను నియంత్రించేందుకు ఉపయోగించరాదని, అలా చేసినట్లయితే అది రాజ్యాంగ విరుద్ధమని, ఈ కేసులో సుప్రీంకోర్టు ప్రకటించినది. రాజ్యాంగంలోని 13వ నిబంధన ప్రకారం, రాజ్యాంగ సవరణ కూడా శాసనంగా పరిగణించబడుతుందనీ, అందుచేత ప్రాథమిక హక్కులను నియంత్రించే ఏ రాజ్యాంగ సవరణ అయినా రాజ్యాంగ శాసనంగా పరిగణించబడుతుంది. అది ప్రాథమిక హక్కులను భంగం కలిగించే విధంగా ఉన్నట్లయితే అది చెల్లదు అనే చెప్పే న్యాయ సమీక్షాధికారం సుప్రీంకోర్టుకు ఉన్నదనీ, ధర్మాసనం ప్రకటించింది. రాజ్యాంగాన్ని సవరించే తన అధికారాన్ని పార్లమెంటు విజ్ఞతతో వినియోగించాలని, ప్రాథమిక హక్కులకు మరింత రక్షణ కల్పించే విధంగా రాజ్యాంగ సవరణలు ఉండాలే తప్ప వాటిని భంగపరిచే విధంగా ఉండరాదని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి కోక సుబ్బారావు ఈ కేసులో

వ్యాఖ్యానించాడు. ఈ కేసుకు పూర్వం శంకర్ ప్రసాద్ దియో, సజ్జన్‌సింగ్ కేసులలో ప్రాథమిక హక్కులను నియంత్రిస్తూ పార్లమెంట్ చేసిన రాజ్యాంగ సవరణలు రాజ్యాంగ బద్ధంగా ఉన్నాయని సుప్రీంకోర్టు ప్రకటించిన తీర్పులకు భిన్నమైన తీర్పును గోలక్‌నాధ్ కేసులో ధర్మాసనం ప్రకటించినది. పార్లమెంట్ రాజ్యాంగ సవరణ అధికారాలపై పరిమితులను విధిస్తూ, రాజ్యాంగాన్ని చట్టసభ బలాధిక్యత నుండి కాపాడే భాధ్యత, అత్యున్నత న్యాయస్థానానికి కలదని, ఈ కేసు ద్వారా విదితమవుతుంది. ప్రాథమిక హక్కులకు భంగం కలగించే విధంగా పార్లమెంటు రాజ్యాంగాన్ని సవరించరాదని, గోలక్‌నాధ్ కేసులో ప్రకటించిన తీర్పు రాజ్యాంగాన్ని ప్రాథమికి హక్కులను పరిరక్షించే అధికారం సుప్రీంకోర్టు తనకు కలదని ప్రకటిస్తే, సామాజిక న్యాయసాధన, ఆదేశిక సూత్రాలు అమలు, ప్రజాభిప్రాయానికి అనుగుణంగా విధాన రూపంలో కార్యాచరణను రూపొందించే అధికారం పార్లమెంటుకు కలదని, చట్టసభ సభ్యులు, ప్రభుత్వ నేతలు, ప్రధాన రాజకీయ పక్షాలు ప్రకటించడం, 1970, 80 దశకాలలో, ఈ అంశాలపై పెద్ద ఎత్తున చర్చ జరగడానికి ఈ గోలక్‌నాధ్ కేసు దోహదపడింది.

## 7.5.2. పార్లమెంట్ ఆధిక్యతకు ప్రయత్నం:

గోలక్‌నాధ్ కేసు తరువాత ఆనాటి కేంద్ర ప్రభుత్వంలో ప్రధాన మంత్రిగా భాధ్యతలు నిర్వహిస్తున్న ఇంధిరాగాంధి ఆమె సహచరులు మోహన కుమార మంగళం, హెచ్. ఆర్. గోఖలే, సిద్ధార్ధ శంకర రేలు కలిసి రాజ్యాంగ సవరణ ద్వారా పార్లమెంట్ సార్వభౌమత్వాన్ని పునరుద్ధరించేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు. సుప్రీంకోర్టు న్యాయసమీక్షాధికారంపై చట్టబద్ధ పరిమితులను విధించడం ద్వారా, సామాజిక న్యాయాన్ని అలాగే ఆదేశిక సూత్రాల అమలుకు న్యాయస్ధానాల నుండి ఎలాంటి ఆటంకం లేకుండా చూడాలన్నదే తమ ఉద్ధేశ్యమనే ఇందిరాగాంధి ప్రభుత్వం ప్రకటించినది. 1971 సం॥లో ఈ లక్ష్యాలకనుగుణంగా 24 వ, 25వ, 29వ రాజ్యాంగ సవరణలను ప్రభుత్వం పార్లమెంటులో ప్రతిపాదించినది.

## 7.5.3. 24 వ రాజ్యాంగ సవరణ:

రాజ్యాంగంలోని 13వ అధికరణ ప్రాథమిక హక్కులను తొలగించడం గాని, పరిమితులను విధించే శాసనాలు చేయడం కాని రాజ్యాంగ విరుద్ధమని చెబుతుంది. ఈ అధికరణ ద్వారానే హైకోర్టులకు గాని, సుప్రీంకోర్టుకు గాని ప్రాథమిక హక్కులను సంరంక్షించే న్యాయ సమీక్షాధికారాన్ని పొందేందుకు వీలవుతుంది. ఈ అధికారాన్ని ఆధారం చేసుకొని సుప్రీంకోర్టు గోలక్‌నాద్ కేసులో చట్టసభ శాసనాలు చెలనేరవని ప్రకటించినది. అయితే ఈ అధికరణను అధిగమించేందుకు వీలుగా,పార్లమెంటు ప్రాథమిక హక్కులతో సహా రాజ్యాంగంలోని ఏ భాగాన్నైనా తొలగించడం గాని చేర్చడం కాని, మార్పు చేయడం కాని చేయవచ్చునని, 24వ రాజ్యాంగ సవరణను 1971 సం॥ లో పార్లమెంటు ఆమోదించినది. 24వ రాజ్యాంగ సవరణ ద్వారా, పార్లమెంటు ప్రాథమిక హక్కులలో కొన్నింటిని తొలగించినా, లేదా వాటిపై ఆంక్షలు విధిస్తూ రాజ్యాంగ సవరణలు తెచ్చినా, వాటిని సుప్రీంకోర్టు న్యాయ సమీక్షాధికారం పేరుతో చెల్ల నేరవు అని చెప్పే అధికారాన్ని కోల్పోవడం జరిగింది. ఈ 24వ రాజ్యాంగ సవరణ ద్వారా గోలక్‌నాధ్ కేసులో సుప్రీంకోర్టు ఆధిక్యతను కుదిస్తూ పార్లమెంటు యొక్క సార్వభౌత్వం లేదా ఆధిపత్యాన్ని పునరుద్ధరించడం జరిగింది.

## 7.5.4 25 వ రాజ్యాంగ సవరణ :

మొత్తం ప్రాథమిక హక్కులపైన ఆంక్షలు విధించడం, ముఖ్యంగా ఆస్థి హక్కు (31వ అధికరణ) పై పరిమితులను విధించడం ఈ సవరణ ఉద్ధేశ్యం. సమిష్టి శ్రేయస్సును సాధించే ఉద్దేశ్యంతో వ్యక్తి ఆస్థిని ప్రభుత్వం స్వాధీనం చేసుకొన్నప్పుడు, ప్రభుత్వం చెల్లించే నష్ట పరిహారం న్యాయ సమ్మతంగా ఉండాలనే నిబంధనను తొలగిస్తూ, ప్రభుత్వం చెల్లించే ధన విలువ న్యాయ బద్ధంగా ఉందా అని ప్రశ్నించే అధికారం న్యాయస్ధానాలకు లేదని ఈ సవరణ ప్రతిపాదించినది. దీనితో పాటు 31 **C** అనే నూతన అధికరణను రాజ్యాంగంలో చేర్చడం జరిగినది. 31 **C** ఈ అధికరణం ప్రకారం రాజ్యాంగంలోని ఆదేశిక నియమాలైన 39 (B), 39 (C) లను అమలు చేసేందుకు వీలుగా పార్లమెంటు చేసే ఏ శాసనాన్నైనా ప్రశ్నించే అధికారం న్యాయస్ధానాలకు లేదని, ఈ సవరణ పేర్కొంటుంది. 39 (B) ఆదేశిక నియమం ఉత్పత్తి, సాధనాలపై యాజమాన్యం, నియంత్రణ సమిష్టి శ్రేయస్సుకు

అనుగుణంగా ఉండాలని కాంక్షిస్తుంది. అలాగే 39 (C) నియమం ప్రకారం ఆర్థిక వ్యవస్థ నిర్వహణ ఫలితంగా ఉత్పత్తి సాధనాలు మరియు సంపద సమిష్టి శ్రేయస్సుకు భంగం కలిగించే విధంగా, కొద్దిమంది వ్యక్తుల చేతుల్లో కేంద్రీకృతం కారాదని కోరుతుంది.

25వ రాజ్యాంగ సవరణ ప్రకారం ప్రాథమిక హక్కులైన సమానత్వ హక్కు (14 వ అధికరణ), స్వేచ్ఛా హక్కు (15వ అధికరణ, ఆస్థి హక్కు(31వ అధికరణ) లు ఆదేశిక నియమాల సాధనకు లోబడి ఉండాలని, ఆ హక్కులపై విధించే ఆంక్షలను ప్రశ్నించే అధికార న్యాయస్థానాలకు లేదని ఈ సవరణ స్పష్ట పరుస్తుంది. సామ్యవాద వ్యవస్థను ఏర్పరచేందుకు మరియు సమిష్టి శ్రేయస్సును సాధించేందుకు వీలుగా ఈ రాజ్యాంగ పవరణలను తీసుకురావడం జరిగిందని, అందుకు ప్రతిబంధకంగా ఉన్న ప్రాథమిక హక్కులపై అవసరమైన ఆంక్షలను విధించడం న్యాయబద్ధమేనని ఆనాటి కేంద్ర ప్రభుత్వం వాదించినది.

## 7.5.5. కేశవనంద భారతి కేసు:

కేశవనంద భారతి కేసు పార్లమెంట్‌కు సుప్రీంకోర్టుకు, అలాగే ప్రాథమిక హక్కులకు ఆదేశిక సూత్రాలకు మధ్య చెలరేగిన వివాదమును, పరిష్కరించేందుకు దోహద పడినది. 1969 వ సం॥లో కేరళ రాష్ట్రంలో ప్రభుత్వం ఆమోదించిన రెండు భూ సంస్కరణ చట్టాలు, ఈ వివాదానికి కారణం ఆయ్యాయి. ఆ చట్టాలు తమ దేవాలయ భూములపై నిర్వహణ ఆంక్షలు విధిస్తున్నాయని ఆ చట్టాలు రాజ్యాంగం కల్పించే 29 వ అధికరణ (మతపర సంస్థలు తమ ఆస్థిని ప్రభుత్వ నియంత్రణలో ప్రమేయం లేకుండా స్వేచ్ఛగా నిర్వహించుకోనే (ప్రాథమిక హక్కు) కు భంగం కలిగించే విధంగా ఉన్నాయని, వాటిని ప్రశ్నిస్తూ ఆ దేవాలయానికి చెందిన కేశవానందస్వామీజీ సుప్రీంకోర్టులో ఒక పిటీషన్ దాఖలు చేయడం జరిగింది. ఈ కేసు సుప్రీంకోర్టు లో ఉన్న సమయంలోనే పార్లమెంటు 24, 25 మరియు 29 వ రాజ్యాంగ సవరణలను ఆమోదించినది. 29 వ రాజ్యాంగ సవరణ, కేరళ ప్రభుత్వం ఆమోదించిన భూ సంస్కరణల చట్టాలను, రాజ్యాంగంలోని 9 వ షెడ్యూలు పరిధిలోని తీసుకురావడం జరిగింది. ఈ మూడు రాజ్యాంగ సవరణల రాజ్యాంగ బద్ధతను ప్రశ్నిస్తూ మరొక పిటీషన్‌ను, కేశవానంద భారతి సుప్రీంకోర్టులోదాఖలు చేయడం జరిగింది. సుప్రీంకోర్టు ఈ రాజ్యాంగ సవరణల న్యాయబద్ధతను పరిశీలించేందుకు వీలుగా 13 మంది న్యాయమూర్తులతో కూడిన ధర్మాసనమును ఏర్పరచినది. గోలక్‌నాథ్ కేసులో ఇచ్చిన తీర్పునకు భిన్నంగా, కేశవానంద భారతి కేసులో సుప్రీంకోర్టు తన తీర్పును ప్రకటించి ఈ తీర్పులో ప్రాథమిక హక్కులతో సహా భాతర రాజ్యాగంలోని ఏ భాగాన్నైనా సవరించే అధికారం పార్లమెంట్‌కు కలదని ధర్మాసనం ప్రకటించినది. అయితే రాజ్యాంగ సవరణ రాజ్యాంగ మౌలిక స్వభావానికి భంగం కలిగించరాదని, అలా భంగపరిచినచో ఆ సవరణ చెల్లదని చెప్పే అధికారం సుప్రీంకోర్టుకు ఉంటుందని కూడా ఈ తీర్పులో ధర్మాసనం ప్రకటించింది. 368 వ అధికరణననుసరించి భారత రాజ్యాంగంలోని ఏ భాగాన్నైనా సవరించే అధికారం పార్లమెంటుకు కలదని అంగీకరిస్తూనే రాజ్యాంగ మౌలిక స్వరూపాన్ని సవరించే అధికారం పార్లమెంటుకు లేదని ప్రకటించడం ద్వారా పార్లమెంటుకు, సుప్రీంకోర్టుకు మధ్య చెలరేగుతున్న ఆధిపత్యం వివాదం కొంత మేరకు సమసిపోవడానికి ఈ తీర్పు దోహదపడింది. ఈ తీర్పు 24వ రాజ్యాంగ సవరణలోని నష్ట పరిహారం చెల్లింపును ప్రశ్నించే అధికారం న్యాయస్థానాలకు ఉండరాదన్న సవరణను కూడా ధర్మాసనం అంగీకరించింది. అయితే 25వ రాజ్యాంగ సవరణ ద్వారా ఆదేశిక నియమాలకు అమలుకు ప్రాథమిక హక్కులకు లోబడి ఉండాలన్న 31 (C) అధికారాన్ని, ధర్మాసనం చెల్లదని ప్రకటించింది. అలాగే 9వ షెడ్యూలు పరిధిలోనికి తీసుకొని వచ్చిన రాష్ట్ర శాసనాల రాజ్యాంగ బద్ధతను పరిశీలించే అధికారం. సుప్రీంకోర్టుకు గలదని 29వ రాజ్యాంగ సవరణపై ధర్మాసనం తన నిర్ణయాన్ని ప్రకటించినది. అయితే రాజ్యాంగ మౌలిక స్వభావాన్ని స్పష్టంగా సుప్రీంకోర్టులో నిర్వచించకపోయినప్పటికి పార్లమెంటరీ ప్రభుత్వం, సమాఖ్య పాలనావ్యవస్థ ప్రాథమిక హక్కులు, న్యాయ సమీక్షాధికారం, లౌకిక వాదం మొదలగునవి భారత రాజ్యాంగ మౌలిక లక్షణాలుగా ఆ తర్వాత సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పుల ద్వారా మనం గ్రహించవచ్చును. పార్లమెంట్‌కు రాజ్యాంగాన్ని సవరించే అధికారం అపరిమితమైంది కాదని రాజ్యాంగ మౌలిక స్వభావానికి భంగం కలగని విధంగా మాత్రమే పార్లమెంటు తన అధికారాన్ని వినియోగించాలని ఈ కేసు ద్వారా నిర్ధారణ అయినది.

## 7.6. న్యాయస్థానాల క్రియాశీలకత్వం-ప్రజా ప్రయోజనాల వ్యాజ్యం:

నిరక్షరాస్యత, పేదరికం, అజ్ఞానం వలన భారతదేశంలో ఎక్కువ మంది ప్రజానీకానికి తమకు గల చట్ట బద్ధహక్కుల గురించి కాని, వాటిని పరిరక్షించే న్యాయవ్యవస్థలు, చట్టాలు గురించి కానితెలియదు. అలాంటి వారు తమకు జరిగే అన్యాయాలను తమకు తాముగా న్యాయవ్యవస్థకు తెలియజేసే అవగాహన కాని, శక్తి సామర్ధ్యములు కాని లేనందున, వేరే ఎవరైనా బాధ్యాతాయుత పౌరుడు, వారి తరపున న్యాయస్థానాలకు తెలియజేసి వారికి న్యాయం జరిగేందుకు అవకాశం కల్పించేందుకు, ఈ ప్రజా ప్రయోజనాల వ్యాజ్యాన్ని సుప్రీంకోర్టు అనుమతినిచ్చింది.

సునీల బాత్రా అనే ఖైదీ తనతోటి ఖైదీలను జైలు అధికారులు ఎలా చిత్రహింసలు పెడుతున్నారో ఒక పోస్ట్‌కార్డుద్వారా సుప్రీంకోర్టు న్యాయమూర్తి అయిన క్రిష్ణ అయ్యర్‌కు తెలియచేయడం జరిగినది. దానిని పిటీషన్ గా క్రిష్ణ అయ్యర్ స్వీకరించి, ఆ ఘటనను విచారించారు. ఈ విధంగా ప్రజా ప్రయోజనాల వ్యాజ్యం ప్రారంభమైనది. అప్పటి నుంచి అనేక పౌర హక్కుల సంఘాలు, బాధ్యతాయుత పౌరులు, విచారణలో సంవత్సరాలు తరబడి జైళ్ళలో మగ్గుతున్న ఖైదీలు గురించి, వెట్టిచాకిరీలో కొనసాగుతున్న వ్యక్తుల గురించి, అసంఘటిత కార్మికులు అలాగే బాల కార్మికుల హక్కుల ఉల్లంఘనను గురించి ప్రజా వ్యాజ్య పిటీషన్ ద్వారా ఉన్నత న్యాయ స్థానాలకు తెలియ చేసి వారికి న్యాయం జరిగేందుకు తోడ్పడుతున్నారు.

భారత దేశంలో న్యాయ వ్యవస్థ క్రియాశీలకత్వం రాజ్యాంగ లక్షణం. 1990 దశకంలో దేశంలో ఏర్పడిన రాజకీయ అస్థిరత్వం, సంకీర్ణ రాజకీయాల దశలో సుప్రీంకోర్టు క్రియా శీలకత్వం భారత రాజకీయాలను సరిదిద్దేందుకు, మెరుగు పరచేందుకు ఉపయోగించిందని రాజ్యాంగ నిపుణులు అభిప్రాయం. ఈ దశాబ్దంలో దేశంలోని ఉన్నత న్యాయస్థానాలు పౌరుల హక్కులు, పర్యావరణ, ఇతర ప్రజోపయోగ సౌకర్యాలు (Public Utilities) ను పరిరక్షించడంలో కీలక పాత్ర వహించాయి, రాజ్యాంగ నిపుణుల అభిప్రాయం ప్రకారం స్వాతంత్రం తరువాత మొదటి నాలుగు దశాబ్దాల కాలంలో న్యాయవ్యవస్థ న్యాయ సమీక్షాధికారాన్ని అధిగమించేందుకు, పార్లమెంట్ సార్వభౌమత్వాన్ని పెంపొందించేందుకు కార్యనిర్వాహక వర్గం చేసిన ప్రయత్నాలను నిరోధించేందుకు న్యాయవ్యవస్థ క్రియాశీలంగా వ్యవహరించింది. దీనికి భారత రాజ్యాంగం, బ్రిటీష్ నమూనా పార్లమెంటరీ సార్వభౌమత్వాన్ని, అమెరికా నమూనా న్యాయ సమీక్షను సమ్మేళనం చేస్తూ ఏర్పరిచిన వ్యవస్థ కారణం.

1960 దశకంలో సుప్రీంకోర్టు గోలక్‌నాథ్ కేసులో పౌరుల ప్రాధమిక హక్కులను పరిరక్షిస్తూ ఇచ్చిన తీర్పు, భారత దేశంలో న్యాయ వ్యవస్థ క్రియా శీలత్వానికి నాంది. 1970 దశాబ్దంలో కేశవానంద భారతి కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు న్యాయవ్యవస్థ యొక్క క్రియా శీలత్వానికి మరో దృష్టాంతం. 1990వ దశాబ్దంలో న్యాయ వ్యవస్థ క్రియా శీలకత్వం ఒక నూతన దిశలో అడుగుపెట్టింది. ఈ కాలంలో కేంద్రంలో ఏర్పడిన సంకీర్ణ ప్రభుత్వం నిర్ణయాలు రాజ్యాంగ పరిధిని అతిక్రమించకుండా నిరోధించడంలో, కొన్ని ప్రజా సంస్థల స్వయం ప్రతిపత్తిని పరిరక్షించడంలో, ప్రభుత్వాధికారంలో వున్న నాయకుల అవినీతిని అరికట్టడంలో, ఉన్నత న్యాయవ్యవస్థ క్రియాశీలకంగా వ్యవహరించింది. ఈ దశలో న్యాయవ్యవస్థ క్రియాశీలకత్వం రాజ్యాంగ ప్రక్రియలా కాక, రాజ్యం, పౌర సమాజాల మధ్య పరస్పర చర్యలకు ప్రతిస్పందనగా రూపు దిద్దుకుంది. రూడాల్ఫ్, రూడాల్ఫ్ ల అభిప్రాయాల ప్రకారం, 1990 వ దశకంలో దేశంలో ఏర్పడిన త్రిశంకు పార్లమెంటు, సంకీర్ణ ప్రభుత్వ నేపధ్యంలో కార్యనిర్వహక వర్గం, న్యాయ వ్యవస్థకు మధ్య సమతుల్యతను పెంపొందింపచేసేందుకు, న్యాయ స్థానాల క్రియా శీలకత్వం దృఢంగా ప్రయత్నించినది. 1991-93 మధ్య కాలంలో సుప్రీంకోర్టు న్యాయమూర్తుల నియామకాల్లో, బదిలీలలో రాష్ట్రపతి, ప్రధాన మంత్రి, మంత్రి మండలి ఇచ్చిన సలహాను కాక, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సలహాను పాటించారని, సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులు దీనికి దృష్టాంతాలుగా పరిగణించవచ్చునని, రూఢాల్ఫ్, రూడాల్ఫ్ లు వివరించారు.

## 7.7. సారాంశం:

భారత రాజ్యాంగం అమలులోకి వచ్చిన 50 సంవత్సరాల అనుభవం నేపథ్యంలో దేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థ సుస్థిరతను, సుసంపన్నతను సంతరించుకోవడంలో న్యాయవ్యవస్థ పాత్ర స్పష్టం అవుతోంది. కార్యనిర్వాహక శాఖ, పార్లమెంట్ల ఆధిపత్యాన్ని నియంత్రిస్తూ పౌరహక్కులకు, సామాజిక న్యాయసాధనకు మధ్య సమన్వయాన్ని ఏర్పరుస్తూ, న్యాయవ్యవస్థ దేశంలో ప్రజాస్వామ్య స్ఫూర్తి, రాజ్యాంగం ఉత్కృష్టత తాత్వికతల రక్షణకు దోహదం చేసింది. ఇదే సమయంలో ప్రజాభిప్రాయాన్ని, ప్రజల ఆకాంక్షలను ప్రతిబింబించే చట్టసభల, ప్రధానంగా పార్లమెంటు సార్వభౌమత్వాన్ని గౌరవిస్తూనే, అవి రాజ్యాంగాన్ని అతిక్రమించినప్పుడు, తన న్యాయ సమీక్షాధికారం, క్రియాశీలకత్వం ద్వారా వాటిని నియంత్రించింది. మిగతా రాజ్య సంస్థలతో పోలిస్తే, న్యాయవ్యవస్థ ప్రజల విశ్వసనీయతను, అభిమానాన్ని ఎక్కువ చూరగొన్నది అనటం సహేతుకం. సమన్యాయ పాలన, సామాజిక న్యాయం, పౌర స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలవంటి ఉన్నత ఆదర్శాలకు కట్టుబడిన భారతదేశం లాంటి ప్రజాస్వామ్య దేశాలలో న్యాయవ్యవస్థపై గురుతరమైన భాద్యతను ఉంచడంతో పాటు ఆ వ్యవస్థ నుంచి విశిష్టమైన ప్రయోజనాలను ఆశించడం జరుగుతుంది. భారతదేశంలో న్యాయవ్యవస్థ తనపై గల గురుతర భాద్యతను సమర్థవంతంగా నిర్వర్తించడంతో పాటు తననుండి ఆశించిన పాత్రను ప్రతిభావంతంగా పోషించడంలో సఫలమైంది. అనేక అవరోధాలు ఎదురైనప్పటికీ ప్రజాస్వామ్య వ్యవస్థ తన మనుగడను కొనసాగించడంలో, మరింత పటిష్టతను సంతరించుకొనడంలో న్యాయవ్యవస్థ పాత్ర కీలకమైంది.

## 7.8. నమూనా పరీక్షా ప్రశ్నలు:

1. కేంద్ర ప్రభుత్వం న్యాయ వ్యవస్థను ఎలా నియంత్రిస్తుంది?
2. సుప్రీంకోర్టు న్యాయ సమీక్షాధికారాన్ని ఎలా ఉపయోగించిందో విపులీకరింపుము ?
3. న్యాయ సమీక్షాధికారం అనగానేమి ? ప్రజాప్రయోజనాల వ్యాజ్యాలను సుప్రీంకోర్టు ఎలా పరిష్కరిస్తుంది ?

## 7.9. చదువతగిన పుస్తకాలు :


Austin, Granvile, The Indian Constitution: Cornerstone of a Nation, Clarendon Press, Oxford,1966.

Austin, Granvile, Working a Democratic Constitution: The Indian Experience, Oxford University Press, New Delhi.

Baxi Upendra, The Indian Supreme Court and Politics,Eastern Book Company, Lucknow, 1980.

Dhavan, Rajeev, The Supreme Court and Parliamentary Sovereignty, Sterling Publishers, New Delhi, 1976.

Dhavan, Rajeev and Jacob, Alice (eds), Indian Constitution, Trends and Issues, Indian Law Institute / N.M. Tripathi, Bombay, 1978.

Palkhivala, N.A., Our Constitution, Defaced and Defiled, Macmillan, New Delhi, 1975.

Reddy, Jaganmohan, P., Social Justice and the Constitution, Andhra University Press, Visakhapatnam, 1976.

Sathe, S.P., Judicial Activism in India, Oxford University Press, New Delhi, 2002.

Singhvi, L.M. (ed.), Fundamental Rights and Constitutional Amendments, Institute of Constitutional and Parliamentary Studies, New Delhi, 1971.



రచయిత

వజ్రాల అంజిరెడ్డి

పాఠం - 8

# ఉద్యోగి బృంద వ్యవస్థ

విషయసూచిక :


8.0 లక్ష్యం

8.1 ఉపోద్ఘాతము

8.2 ఉద్యోగి బృంద వ్యవస్థ - నేపథ్యం

8.3 ఉద్యోగి బృంద పరిమాణాత్మక మార్పు

8.4 ఆర్థిక అభివృద్ధి, జాతి నిర్మాణంలో ఉద్యోగ బృందం

8.5 ఉద్యోగి బృందం - చరిత్రం

8.6 ప్రభుత్వ ఉద్యోగుల తటస్థత

8.7 ప్రభుత్వ ఉద్యోగుల రాజకీయీకరణ

8.8 ఉద్యోగి బృంద పరిపాలనా సామర్థ్యం

8.9 సారాంశము

8.10 మాదిరి ప్రశ్నలు

8.11 చదువదగిన గ్రంథాలు


## 8.0 లక్ష్యం :

ఉద్యోగి బృందం ఆధునిక ప్రభుత్వ ప్రధాన అంతర్భాగం. ప్రభుత్వానికి మనుగడకు, విశ్వసనీయతను న్యాయబద్ధతను ప్రసాదిస్తుంది. కనుక దీని పాత్ర మరింత విస్తృతమైంది. నాయకులు తాము రూపొందించిన అభివృద్ధి నమూనాను అమలుపరిచే బాధ్యతను ఉద్యోగి బృందంపై ఉంచటంతో వారి సంస్కృతి, దృక్పధాలు, ప్రవర్తనా విధానం, విలువలు, ప్రమాణాలు, పాత్రలపై మార్పులు సంభవించాయి అని చెప్పడం ఈ పాఠం యొక్క లక్ష్యం.

## 8.1 ఉపోద్ఘాతం :

ఆధునిక కాలంలో సమర్ధవంతమైన ఉద్యోగి బృందం ప్రభుత్వం అత్యంత కీలకఅంశం. ఉద్యోగి బృందం ప్రభుత్వానికి మనుగడకు, విశ్వసనీయతను న్యాయబద్ధతను ప్రసాదిస్తుంది. "గ్లెస్ స్థాల్" చెప్పినట్లు ప్రభుత్వ సామర్థ్యం దాని ఉద్యోగుల సామర్థ్యమే తప్ప వేరొకటిలేదు. రాజకీయ నాయకత్వం ఎంత సమర్థవంతమైందీ, ఉన్నత ఆదర్శాలను కలిగి వున్నప్పటికీ ఉద్యోగి బృందానికి మించిన విశ్వాసాన్ని సాధించలేదు. ఉద్యోగి బృందం ఆధునిక ప్రభుత్వ ప్రధాన అంతర్భాగం. ఉద్యోగి బృందం సమాజంలో శాంతిభద్రతలను పరిరక్షించుటతోపాటు, అభివృద్ధి మార్పులను సాధిస్తుంది. ప్రభుత్వ ఉద్యోగి తానే తీర్చిదిద్దబడిన యంత్రాంగం నుంచి ఏర్పడలేదని మాక్స్ వెబర్ పేర్కొన్నాడు.

ప్రణాళికా బద్ధమైన అభివృద్ధికి, ప్రజాస్వామ్యం, సంక్షేమరాజ్యం వంటి ఉన్నతాదర్శాలకు కట్టుబడిన భారతదేశం వంటి అభివృద్ధి చెందుతున్న దేశాలలో ఉద్యోగిబృందం పాత్ర మరింత విస్తృతమైంది, కీలకమైంది. ఈ దేశాలు ఏర్పరచుకొన్న ఆర్థిక

అభివృద్ధి సామాజిక మార్పు, జాతి నిర్మాణం లక్ష్యాలను సాధించే ఏకైకసాధనంగా పరిగణింపబడుతుంది. భారత దేశంలో స్వాతంత్ర్యానంతరం దేశ రాజకీయ నాయకత్వం రాజ్యాంగం నిర్ధారించిన లక్ష్యాలను సాధించటానికి ప్రభుత్వ ఉద్యోగి బృందం తగిన సాధనం అని భావించారు. అందుచేత సహజంగానే వారు తాము రూపొందించిన అభివృద్ధి నమూనాను అమలుపరచు బాధ్యతను ఉద్యోగి బృందం భుజస్కందాలపై ఉంచారు. దాని ఫలితంగా ప్రభుత్వ ఉద్యోగం నిర్వహించే కర్తవ్యాలతోపాటు, వారి పరిమాణం కూడా విపరీత స్థాయిలో అభివృద్ధి చెందుతూ వచ్చింది. దీంతోపాటు మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ఉద్యోగి బృంద సంస్కృతి దృక్పథాలు, ప్రవర్తన విధానం, విలువలు, ప్రమాణాలు, పాత్ర మొదలైన అనేక అంశాలలో గణనీయమైన మార్పులు సంభవించాయి.

## 8.2 ఉద్యోగి బృంద వ్యవస్థ - నేపథ్యం

భారతదేశంలో ఉద్యోగిబృంద ఏకతా స్వభావంకానీ (monolithic) సజాతీయత కాని కలిగిన సంస్థ కాదు. ఇది ఏదేశ ఉద్యోగి బృంద వ్యవస్థకైనా వర్తిస్తుంది. ఎందుచేతనంటే పరదేశానికి చెందిన ఉద్యోగి బృంద వ్యవస్థ అయిన ఆ సమాజం వర్గ, సామాజిక, నిర్మాణాన్ని, మరీ ముఖ్యంగా పాలనావర్గం నిర్మాణాన్ని ప్రతిబింబిస్తుంది. కాని భారతదేశ సందర్భంలో బ్రిటిష్ ప్రభుత్వం తన పాలన ప్రత్యేక పరిస్థితులకనుగుణంగా భారతదేశంలో భిన్నత్వం కలిగిన ఉద్యోగిస్వామ్య వ్యవస్థను రూపకల్పన చేస్తుంది. మొదట్లో ఈస్టిండియా కంపెనీ పాలనను బ్రిటీష్ జాతీయులైన కంపెనీ ఉద్యోగులు నిర్వహించేవారు. భారతదేశంలో తన పాలనను సుస్థాపితం చేసేంతవరకు కంపెనీ వివిధ ప్రభుత్వ ఉద్యోగులలో భారతీయులను నియ్మమించే సమస్య ఉత్పన్నం కాలేదు.

అయితే భారతదేశంలో ఈస్టిండియా కంపెనీ పాలన విస్తరించటం, పాలన వ్యవస్థ సంక్లిష్టత సంతరించుకోవటంతో పాలనా వ్యవస్థలోని క్రిందిస్థాయి ఉద్యోగులలో భారతీయులను నియమించవలసిన అవసరం ఏర్పడింది. అయితే భారతదేశ పాలనను బ్రిటిష్ చక్రవర్తి చేపట్టిన తరువాత ముఖ్యంగా లార్డ్ మెకాలే ప్రవేశపెట్టిన విద్యావిధానం ఫలితంగా మొత్తం భారతదేశపాలన ఒక మౌలిక మార్పుకు గురైంది. భారతీయుల ప్రవేశంతో లంబ సమైక్యీకరణ (Vertical) చెందిన బ్రిటిష్ పాలన మూడు స్థాయిలుగా విభజింపబడింది.

అత్యున్నత స్థాయి ఉద్యోగులను కవనేటెడ్ సర్వీసులు ప్రస్తుతం అఖిల భారత సర్వీసులు అనేవారు. ఈ సర్వీసులలో ఇండియన్ సివిల్ సర్వీసు అత్యంత విశిష్టమైంది కాక, ఎంతో ప్రాచుర్యాన్ని సంతరించుకొంది. ఈ ఇండియన్ సివిల్ సర్వీసు వలస పాలన సర్వీసుగాకాక, పాలన సాధనంగా విశిష్టతను సంతరించుకుంటుంది. ప్రాచీన చైనా ఉద్యోగి బృంద వ్యవస్థ తరువాత పోటీ పరీక్షల ద్వారా నియమించబడి, చైతన్య పూరితంగా, క్రమబద్ధంగా రూపొందించబడిన ఉద్యోగి బృంద వ్యవస్థ ఇండియన్ సివిల్ సర్వీస్. దీనికి అప్పగించిన పాత్ర విశిష్టమైందే. ఎందుచేతనంటే ఈ వ్యవస్థ వలన బ్రిటీష్ పాలన అధికారులు, పాలకులకు నుంచి సంరక్షకులుగా పరిణామం చెందరు. భారతీయుల ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయం విద్యాభ్యాసం, శిక్షణ వారిలో ఒక నూతన సంస్కృతిని పెంపొందింపసాగినాయి. ఇండియన్ సివిల్ సర్వీసు దేశం సమగ్రత వృత్తిపరమైన సామర్థ్యాన్ని కలిగిన పాలన సాంప్రదాయాన్ని ఆవిష్కరించటంలో విఫలమైంది.

భారతదేశం స్వాతంత్ర్యానంతరం బ్రిటిషు పాలనలో రూపొందించుకొన్న ప్రభుత్వ ఉద్యోగి వ్యవస్థకుకల అవలక్షణాలు తొలగిపోయాయి. స్వాతంత్ర్యానంతరం ప్రవేశపెట్టబడిన ఐ.ఎ.ఎస్. పట్ల అనేకమంది యువతీయువకులు ఆకర్షించబడ్డారు. నెహ్రూ అభిప్రాయం ప్రకారం ఐ.ఎ.ఎస్. ఖచ్చితమైన భారతీయ స్వభావాన్ని సంతరించుకొంది. ఈ సర్వీసుకు చెందిన ఉద్యోగులు వీరులుగా మారేందుకు ప్రయత్నించారు. ప్రజాసేవ ఈ సర్వీసు లక్ష్యాలలో ఒకటి. స్వాతంత్ర్యానంతరం దేశంలో పార్లమెంటరీ

ప్రజాస్వామ్య వ్యవస్థ ఏర్పడటంతో ఉద్యోగి బృంద పాత్రలో విప్లవాత్మకమైన మార్పు ఆవశ్యకంగా సంభవించింది. వలస పాలన కాలంలో ప్రభుత్వ ఉద్యోగ బృందం (Paternalistic) అధికారయుత తత్వానికి ప్రతిరూపంగా పనిచేసింది. అయితే స్వాతంత్ర్యానంతరం ఉద్యోగి బృందం ఈ ప్రవృత్తిని విసర్జించటం తప్పనిసరి అయింది.

సంక్షేమ పథకాలను అమలుపరచే ఉద్యోగి బృందం ప్రధాన కర్తవ్యంగా రూపొందించటంలో ప్రభుత్వ ఉద్యోగులు ప్రజలతో ప్రత్యక్షంగా కలసి పనిచేయవలసిన అవసరం ఏర్పడేది. అంతేకాక ప్రభుత్వ పాలనలో ప్రజలకు భాగస్వామ్యాన్ని కల్పించవలసిన అవసరం ఏర్పడింది. స్వాతంత్ర్యానంతరం నెహ్రూ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి నమూనా కేంద్రీకృత ప్రణాళిక విధానాన్ని మిశ్రమ ఆర్థిక వ్యవస్థను ప్రవేశపెట్టడంతో ప్రభుత్వరంగ పాత్ర విస్తృతంగా పెరిగింది. ఈ పరిమాణం ప్రభుత్వ ఉద్యోగులకు విపరీత ఒత్తిడి అనిపించింది. ప్రభుత్వ ఉద్యోగులు, అభివృద్ధి, ఆధునికీకరణ ప్రక్రియల్లో ప్రధాన పాత్రధారులుగా రూపొందినారు. రాజకీయ నాయకులతో కలసి పనిచేయవలసి రావడంతో వారు తమ అభిప్రాయాలను దృక్పధాలను విలువలను పూర్తిగా మార్పు చేసుకోవలసిన అవసరం ఏర్పడింది. మారిన పరిస్థితులలో ప్రభుత్వ ఉద్యోగులు తమను అధికారులు, పాలకులుగకాక ప్రజా సేవకులుగ భావించుకోవలసిన పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వ ఉద్యోగాలు ఈ మార్పుకు అనుకూలంగా ప్రతిస్పందిస్తారు.

## 8.3 ఉద్యోగి బృంద పరిమాణాత్మక మార్పు :

స్వాతంత్ర్యానంతరం భారతరాజ్య వ్యవస్థ పాలనా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు సంభవించాయి. భారత రాజ్యాంగం ఏర్పరచిన ప్రజాస్వామ్య, సామ్యవాద, సంక్షేమ, లక్ష్యాల ఫలితంగా దేశ రాజకీయపాలన వ్యవస్థలో ప్రధానమైన పరిమాణాత్మక మార్పులు సంభవించాయి. ఈ లక్ష్యాల సాధనలో ప్రభుత్వం వినూత్న వ్యూహాలను ఏర్పరచుకోవటంతోపాటు, విస్తృతమైన స్థాయిలో చర్యలను చేపట్టవలసి వచ్చింది. ఈ పరిమాణాల ప్రభావం దేశ ఉద్యోగి బృంద వ్యవస్థపై ప్రధానంగా ప్రసరించింది. రాజ్యాంగం ఏర్పరచిన వివిధ లక్ష్యాల సాధన ప్రభుత్వ ఉద్యోగి బృందం అనేక పరిమాణాత్మక, మార్పులకు సరైనది. తనకు అప్పగించిన విస్తృతమైన సంఖ్యలో కర్తవ్యాలకు అనుగుణంగా ప్రభుత్వ ఉద్యోగ బృందం పరిమాణ క్రమంగా పెరుగుతూ వచ్చింది. స్వాతంత్ర్యం సిద్ధించిన సంవత్సరములో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఖ్య పరిమితం. కానీ తరువాత కాలంలో వీరి సంఖ్య వేగంగా పెరుగుతూ వచ్చింది. ప్రభుత్వ నివేదికల ప్రకారం 1950లో దేశంలో ఐ.ఏ.ఎస్.కు చెందిన ఉద్యోగుల సంఖ్య 1115 మాత్రమే. అయితే వీరి సంఖ్య క్రమంగా పెరుగుతూ 1996 నాటికి 5067కు చేరింది. ఇదే విధంగా మొత్తం ప్రభుత్వ ఉద్యోగుల సంఖ్య గణనీయంగా పెరిగింది. 1953లో 10.50 లక్షల సంఖ్యలో వున్న కేంద్ర ప్రభుత్వం మొత్తం ఉద్యోగుల సంఖ్య 1989 నాటికి 33.9 లక్షలను చేరుకుంది. ఇదే విధంగా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల మొత్తం రాష్ట్ర ప్రభుత్వాల ఉద్యోగాల సంఖ్య 22.0 లక్షలు కాగా, 1989లో వారి సంఖ్య 68.9 లక్షలకు చేరుకుంది. దేశంలోని ప్రభుత్వ రంగంలో ఉద్యోగుల కేంద్ర, రాష్ట్ర స్థానిక ప్రభుత్వ ఉద్యోగుల సంఖ్య 1953లో 40.10 లక్షలు ఉండగ 1991లో వారి సంఖ్య 1.89 కోట్లు చేరుకుంది (18.97 మిలియన్లు) దేశంలోని వ్యవస్థ తరంగంలో మొత్తం ఉద్యోగాలలో ప్రభుత్వ రంగం ఉద్యోగులు 1961లో 58.3 శాతం కాగా, 1991 నాటికి అది 70.7 శాతం కి పెరిగింది. ఇదేకాలంలో ప్రైవేట్ రంగంలోని ఉద్యోగుల శాతం 41.7 శాతం నుంచి 129.3 శాతంకి క్షీణించింది. ప్రపంచంలోని మిగతా దేశాలతో పోలిస్తే భారతదేశంలో మొత్తం ఉద్యోగులలో ప్రభుత్వరంగ ఉద్యోగుల శాతం అత్యధికంగా ఉందని నివేదిక తెలుపుతున్నాయి.

ఆర్.బి.జైన్ స్వాతంత్ర్యానంతరం విస్తృత పరిమాణాన్ని సంతరించుకున్న భారత ఉద్యోగి బృందాన్ని గురించి ఈ విధంగా వివరించారు. స్వాతంత్ర్యానంతరం ప్రభుత్వం కార్యకలాపాలు విస్తృతం అవడంవల్ల ఉద్యోగిబృందం సంఖ్య పెరగవలసిన అవసరం ఏర్పడింది. దీని ఫలితంగా ప్రధానంగా క్రిందిస్థాయి ఉద్యోగుల సంఖ్య విపరీతమైన స్థాయిలో పెరిగింది. ఈ విధంగా ప్రభుత్వ

ఉద్యోగుల సంఖ్య పెరగటానికి ప్రభుత్వరంగం విస్తరించటంతోపాటు దేశంలో చదువుకొన్న నిరుద్యోగ యువతీ యువకుల సంఖ్య వేగంగా వృద్ధిచెందటం కూడా ఒక ప్రధానకారణమైంది. ప్రభుత్వ రంగం పెరగడం వల్ల ఉద్యోగి బృందానికి గుప్తాధిపత్యంతోపాటు వారికి గణనీయమైన విచక్షణాధికారాలు సంక్రమించాయి.

## 8.4 ఆర్థిక అభివృద్ధి, జాతి నిర్మాణంలో ఉద్యోగి బృంద పాత్ర :

గత ఐదు దశాబ్దాల కాలంలో భారతదేశం అభివృద్ధి అనుభవం విజయాల, వైఫల్యాల సమ్మేళనం. అభివృద్ధి రంగంలో దేశం ఇప్పటివరకు సాధించిన విజయాలకు, వైఫల్యాలకు రాజకీయ నాయకులు, ప్రభుత్వ ఉద్యోగి బృందం బాధ్యత వహించాలి. జాతి నిర్మాణంలో ప్రభుత్వ ఉద్యోగి నిర్వహించిన పాత్ర గణనీయమైంది. పాలనాశాస్త్రవేత్తల అభిప్రాయ ప్రకారం దేశం జాతి నిర్మాణప్రక్రియలో ఉద్యోగబృందం, గణనీయమైన పాత్రను పోషించిందని చెప్పటానికి అనేక దృష్టాంతాలను పేర్కొన్నారు. ఉదాహరణకు స్వాతంత్ర్యం సిద్ధించిన వెంటనే సంభవించిన, దేశ విభజన ఫలితంగా ఉత్పన్నమైన కాందిశీకుల సమస్య భారత యూనియన్‌లో స్వదేశీ సంస్థానాల విధానం 1956లో రాష్ట్రాల పునర్ విభజన, లోకసభకు వివిధ రాష్ట్ర శాసనసభలకు జరుగుతున్న ఎన్నికలు, దేశం సరిహద్దుల, ఈశాన్య ప్రాంతాలలో సంభవిస్తున్న ఉగ్రవాద కార్యకలాపాలు మొదలైన సందర్భాలలో తలెత్తిన సమస్యలకు సమర్థవంతంగా పరిష్కరించటం ద్వారా ఉద్యోగి బృంద వ్యవస్థ భారతదేశంలో ప్రజాస్వామ్యం విజయవంతంగా పనిచేయడానికి సుస్థిరతకు సాధించటానికి దోహదం చేసింది. అంతేకాక దేశం సాంకేతిక, విజ్ఞానరంగాలలో అద్భుతమైన విజయాలను సాధించటంలో ప్రధానంగా అణురంగం, అంతరిక్ష సాంకేతిక పరిజ్ఞానం, సమాచార ప్రసారరంగం మొదలైన రంగాలలో పాశ్చాత్య దేశాలతో సమానంగా అభివృద్ధి చెంటంలో ప్రభుత్వ ఉద్యోగిబృంద పాత్ర కీలకమైంది.

ఇదే విధంగా అభివృద్ధి రంగంలో భారతదేశం సాధించిన ప్రగతిలో ఉద్యోగిబృందం పాత్ర ప్రముఖంగా పేర్కొనదగిన స్థాయిలో ఉంది. స్వాతంత్ర్యానంతరం భారతదేశ సామాజిక ప్రగతికి చేపట్టిన ప్రజాస్వామ్యయుత ప్రణాళికాబద్ధమైన అభివృద్ధి వ్యూహం సాధించిన విజయాలలో ఉద్యోగి బృందం పాత్ర పేర్కొనదగింది. ఈ వ్యూహానికి అనుగుణంగా చేపట్టిన పంచవర్ష ప్రణాళికల రచన, అమలు, మూల్యాంకలన ప్రక్రియలో ప్రభుత్వ ఉద్యోగులు చురుకైన పాత్ర వహిస్తున్నారు. వివిధ రంగాలలో పంచవర్ష ప్రణాళికలు సాధించిన ప్రగతిలో ప్రభుత్వ ఉద్యోగుల పాత్ర కీలకం. ప్రధానంగా వివిధ పంచవర్ష ప్రణాళికల్లో గ్రామీణాభివృద్ధి బలహీనవర్గాల సంక్షేమం, మహిళా శిశుసంక్షేమం ప్రయాణ సౌకర్యాలు, విద్యావైద్యం, వ్యవసాయ పారిశ్రామిక రంగాలు సాధించిన గణనీయమైన ఫలితాలు వెనుక వివిధ స్థాయిలలోని ఉద్యోగబృందం పాత్ర స్పష్టం. పారిశ్రామిక రంగంలో ప్రపంచంలోనే భారతదేశం ఒక శక్తివంతమైన దేశంగా పరిగణించటంలో వ్యవసాయరంగంలో ప్రధానంగా కొన్ని ఆహారధాన్యాలు ఉత్పత్తిలో ప్రపంచంలో దేశం అగ్రస్థానాన్ని చేరుకోవటంలో ఉద్యోగ బృందం నిర్వహించిన పాత్ర తార్కాణం. ఇదే విధంగా విదేశీ సంబంధాల రంగంలో భారతదేశం సాధించిన ఘనవిజయాలు ఉద్యోగబృందం సామర్ధ్యానికి గీటురాళ్ళు.

## 8.5 ఉద్యోగి బృందం - కార్యచక్రం :

బ్రిటీష్ ప్రభుత్వం భారతదేశాన్ని ఉద్యోగిబృందం వ్యవస్థ ద్వారా పాలించింది. బ్రిటిష్ పాలన కాలంలో పన్నులను వసూలు చేయటం అట్టి బద్రతల సంరక్షణ ఉద్యోగిబృందం ప్రధాన కర్తవ్యాలు. భారతదేశం స్వాతంత్ర్యం లభించిన వెంటనే సంభవించిన అనేక పరిణామాల కారణంగా రాజకీయ నాయకత్వం అప్పటికి ఉద్యోగి బృంద వ్యవస్థపైన అధికంగా ఆధారపడటం జరిగింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలలోని ఉన్నతస్థాయి పదవులకు ఐ.ఎ.ఎస్‌కు చెందిన ఉద్యోగులు నియమించబడతారు. ఈ శ్రేష్ట వర్గానికి చెందిన అఖిల భారత సర్వీసు ఉద్యోగుల క్రిందిస్థాయిలో అనేక స్థాయిలో కల ఉద్యోగిబృందం పనిచేస్తున్నది. వీరిలో రాష్ట్ర సర్వీసులకు చెందిన ఉన్నత ఉద్యోగులు, అధిక పరిమాణంలో గుమస్తాలు, బంట్రోతులు, ఇతర దిగువస్థాయి

ఉద్యోగులు వున్నారు. స్వాతంత్ర్యం సిద్ధించిన మొదట (1953) ప్రభుత్వ ఉద్యోగుల సంఖ్య 40 లక్షలు ఉండగా వారిసంఖ్య 1983లో 1.60 కోటికి 1988లో 1.85 కోట్లకు చేరిందని అంచనా.

స్వాతంత్ర్య అనంతరం ఐ.ఏ.ఎస్. ఉద్యోగుల వ్యవస్థ కొనసాగించటంపై రాజ్యాంగ నిర్మాణమండలి సుదీర్ఘ చర్చలు జరిపింది. చివరకు సమాఖ్య లక్షణాలు కలిగిన కేంద్రీకృతమైన ప్రభుత్వ వ్యవస్థ ఏర్పరచటానికి నిర్ణయం చేయబడింది. దీనికి అనుగుణంగా ఐ.ఏ.ఎస్. వ్యవస్థను కొనసాగించారు.

పాల్‌బ్రాస్ అభిప్రాయం అనుసరించి స్వాతంత్ర్యానంతరం భారత పాలనావ్యవస్థలోని ఉన్నత దిగువస్థాయిలోని ఉద్యోగిబృంద వ్యవస్థ వెబర్ ప్రతిపాదించిన హేతుబద్ధ, చట్టబద్ధ, ఉద్యోగ స్వామ్యమునకు భిన్నమైనది ఈ ఉద్యోగి బృంద వ్యవస్థకు సంబంధించిన పద్ధతుల సంబంధాలు, అనుబంధాలు, వ్యక్తిగత, సామాజిక, బాధ్యతలు, కులం బంధుత్వం, కుటుంబం వంటి అంశాలపై ఆధారపడి ఆధారపడివున్నాయి. అత్యున్నత స్థాయిలో ప్రభుత్వ ఉద్యోగులు రాజకీయ నాయకులను దిగువస్థాయాలో శక్తివంతమైన స్థానిక రాజకీయ శక్తులు లోబడివున్నప్పుడు ఉన్నతస్థాయీ ఉద్యోగుల యాంత్రికమైన నిర్ణయీకరణ ప్రక్రియను పై కేటాయించగలుగుతున్నారు. ఈ ఉద్యోగులు ఇక ఏమాత్రం శ్రేష్ట వర్గానికి చెందిన పాలకులుకారు. కానీ భారతరాజ్యం సృష్టించిన పంపిణీ ప్రయోజనం వనరుల వల్ల లబ్దిపొందుతున్న వారిలో ప్రభుత్వ ఉద్యోగులదే అగ్రస్థానం.

## 8.6 ప్రభుత్వ ఉద్యోగుల తటస్థత :

ప్రభుత్వ ఉద్యోగుల తటస్థత భావనకు ఉడ్రోవిల్సన్ ప్రతిపాదించిన రాజకీయాలు, పాలన, విభాగిత్వం మూలం. ఈ భావన ప్రకారం రాజకీయాలు విధాన రూపకల్పనకు, ప్రభుత్వ ఉద్యోగులు విధానాల అమలుకు ఖచ్చితంగా పరిమితం కావాలని రాజకీయవేత్తలు ప్రభుత్వఉద్యోగుల పాత్రల మధ్య ఖచ్చితమైన, విభజన రేఖ ఏర్పరిచింది. అయితే కాలక్రమంలో ఈ భావన అనేక పరిణామాలకు గురవుతూ వచ్చింది. భారతదేశంలో ప్రభుత్వ ఉద్యోగుల తటస్థతను ఈ నేపథ్యంలో పరిశీలించాల్సి వుంటుంది. భారతదేశం స్వాతంత్ర్యానంతరం వలస పాలన కాలంలో బ్రిటీషు ప్రభుత్వం ఏర్పరిచిన వెస్ట్ మినిష్టర్ లేదా పార్లమెంటరీ నమూనాను కొనసాగించింది. ఈ నమూనా రాజకీయవేత్తలు, ప్రభుత్వ ఉద్యోగుల విధుల మధ్య స్పష్టమైన విభజన చేసింది. ఈ రెండు వర్గాలు తమ తమ పరిధిలోనే తమ విధులను నిర్వర్తించాలి. ప్రభుత్వ ఉద్యోగులు రాజకీయాలకు అతీతంగా తమ విధులను నిర్వర్తించటంతోపాటు రాజకీయ పక్షపాతధోరణికి ప్రదర్శించరాదు. వారు పాలనా హేతుబద్ధత ప్రమాణాలను పాటిస్తూ వృత్తి నిపుణుల స్వభావంలో రాజకీయవేత్తలు రూపొందించిన విధానాలను ఖచ్చితంగా అమలుపరచాలి. ఈ విధమైన నమూనా వెబర్ ప్రతిపాదించిన ఉద్యోగిస్వామ్య నమూనాతో సారూప్యత కలిగి రాజకీయ తటస్థత సూత్రానికి కట్టుబడింది. అంటే ప్రభుత్వ ఉద్యోగులు తమ వ్యక్తిగత లేదా రాజకీయ అభిప్రాయాలకు, విభేధాలకు లోనుకాకుండా, మంత్రులు రూపొందించిన విధానాలు, నిర్ణయాలను అనుసరించాలి. ఈ విధంగా రాజకీయ తటస్థత అంటే రాజకీయాల ప్రభావానికి లోనుకాకుండా ప్రజల విశ్వాసాన్ని చూరగోనేలా ప్రభుత్వ ఉద్యోగులు తమ అధికార విధులను నిస్పాక్షికంగా నిర్వర్తించటం అని అర్థం.

భారతదేశంలో ప్రభుత్వ తటస్థస్థితి నిర్వర్తించదు అని అర్థం. అనేక పరిమాణాలకు గురవుతూ వచ్చింది. స్వాతంత్ర్య అనంతరం ప్రభుత్వ ఉద్యోగులు పార్లమెంటరీ ప్రజాస్వామ్యం, వికేంద్రీకరణ సందర్భంలో పనిచేయవలసిన అవసరం ఏర్పడింది. ఈ సందర్భం ప్రభావంతో అప్పటివరకు ప్రభుత్వ ఉద్యోగులనుసరించిన ధోరణిని, దృక్పధాన్ని, ప్రేరణను, ప్రవర్తనా విధానాన్ని మార్పు చేసుకోవలసిన అవసరం ఏర్పడింది. ప్రభుత్వ ఉద్యోగులు వివిధ స్థాయిల ప్రజాప్రతినిధులతో కలిసి దేశ సామాజిక, ఆర్థికాభివృద్ధి లక్ష్యాల సాధనకు పనిచేయవలసిన పరిస్థితి ఉన్నతమైంది.

నెహ్రూ ప్రధానమంత్రిగా కొనసాగినంతకాలం ఉద్యోగబృంద వలసపాలన నుండి సంక్రమించిన రాజకీయ తటస్థత చట్రంలో తమ కార్యకలాపాలను నిర్వర్తించారు.

అయితే నెహ్రూ అనంతర కాలంలో అంటే 1970వ దశాబ్దం నుండి సంభవించిన రాజకీయ పరిణామాలు ప్రభుత్వ ఉద్యోగుల తటస్థతపై తదితర ప్రమాణా (Ethos) లపై గణనీయమైన ప్రభావాన్ని కనపరచటం ప్రారంభమైంది. 1970 దశాబ్దంలో కాంగ్రెస్ పార్టీ ఆధిక్యత క్షీణించిన ఫలితంగా ఏకపార్టీ పాలన అంతరించి, ప్రభుత్వ ఉద్యోగుల ప్రమాణాలపై విస్తృతమైన ప్రభావాన్ని కనపరిచింది. ఈ పరిస్థితులలో ప్రభుత్వ ఉద్యోగుల తటస్థత విమర్శలకు గురవ్వటం మొదలైంది. ప్రభుత్వ పాలన ప్రజల అభిప్రాయం ప్రకారం ఈ దశాబ్దంలో తటస్థతభావన, స్థానంలో, ప్రభుత్వ ఉద్యోగుల నిబద్దత (Commitment) భావన ప్రాముఖ్యతను సంతరించుకుంది. తటస్థత ప్రభుత్వ ఉద్యోగుల అసమర్థతగా, తమ విధులను నిర్వర్తించటంలో వైఫల్యంగా చిత్రీకరించబడింది. తటస్థతను పాటిస్తున్న ప్రభుత్వ ఉద్యోగులు ప్రగతికి అభివృద్ధికి అవరోధాలుగా పరిగణించటం ప్రారంభమైంది. దానితోపాటు ప్రభుత్వ ఉద్యోగులు అధికార రాజకీయపార్టీ సైద్ధాంతిక భావజాలానికి ప్రణాళికలను, పథకాలను నిబద్ధులై ఉండాలని వాదించటం ప్రారంభమైంది. ఈ విధమైన వాదనను శ్రీమతి ఇందిరాగాంధీ ప్రారంభిస్తే ఆమె సహచరులైన కొందరు కేంద్రమంత్రులు సమర్థించారు. ఈ నాయకులు మారుతున్న భారతదేశ పరిస్థితులకు ప్రభుత్వ ఉద్యోగుల రాజకీయ తటస్థత అప్రస్తుతం అని నొక్కిచెప్పారు. అయితే కొందరు ప్రముఖులు వారు ప్రతిపాదించిన ప్రభుత్వఉద్యోగుల నిబద్ధతను ప్రభుత్వ ఉద్యోగి బృంద రాజకీయాకరణ (Politilization) తప్ప మరొకటికాదని విమర్శించారు. ఈ ప్రతిపాదన ప్రభుత్వ ఉద్యోగుల రాజకీయాకరణకు ఉద్దేశించబడిందని, ఇది ప్రజాస్వామ్య సూత్రానికి పూర్తిగా వ్యతిరేకమని వారు వాదించేవారు. దీని ఫలితంగా ప్రభుత్వ ఉద్యోగులలో అవకాశవాదం పెరుగుతుందని, రాజకీయ నాయకుల అవసరాలకు ప్రాధాన్యతను కనబరిచే తత్త్వం పెంపొందుతుందని వీరి వాదన.

మారిన్ పింటోఅభిప్రాయం ప్రకారం రాజకీయ తటస్థత, నిబద్ధతలు సన్నిహితంగా ముడి వేసుకున్న భావములు. వీటి మధ్య సంబంధం నిబద్ధతపట్ల కలదృక్పధంపై ఆధారపడి వుంటుంది. అధికారంలో వున్న రాజకీయ పార్టీ భావజాలానికి, పార్టీ ప్రణాళికలు, విధానాలకు, పథకాలకు కట్టుబడివుంటే అది నిబద్ధత అనిపించుకుంటుంది. దానికి భిన్నంగా నిబద్ధత అధికారపక్షం పట్ల కాక రాజ్యాంగ విలువలకు, ఆదర్శాలకు, విస్తృత రాజకీయ వ్యవస్థ లక్ష్యాలపట్ల కలిగివుంటే అది రాజకీయ తటస్థత అవుతుంది. వాస్తవంలో తటస్థత అంటే నిరాసక్తత లేదా వ్యతిరేక దృక్పధం అని అర్థంకాదు. అది మేదోపరమైన ఉద్వేగాలు, ప్రమాణాలు, కొన్ని సామాజిక, ఆర్థిక విలువల పట్ల ఆమోదం. రాజకీయ తటస్థత, రాజకీయ చైతన్యం వంటిదే తప్ప రాజకీయాకరణ కాదు. కాని 1970, 1980 దశాబ్దాలలో ప్రభుత్వ ఉద్యోగుల రాజకీయాకరణ భావం బహుళ ప్రచారంలోకి వచ్చింది.

దీని ఫలితంగా రాజకీయ నాయకులు, ప్రభుత్వ ఉద్యోగులుపరస్పరం సహకరించుకొనే, లేదా ఇచ్చి పుచ్చుకునే ధోరణిని అలవర్చుకున్నారని అనేకమంది అభిప్రాయబడ్డారు. ప్రభుత్వ ఉద్యోగులు తమ వ్యక్తిగత ప్రయోజనాలను సాధించుకునేందుకు అధికారంలో ఉన్న రాజకీయవేత్తలకు సహకరించటం ఒక మార్గంగా గుర్తించారు అనే భావం వ్యాప్తిలోకి వచ్చింది. ఈ దృక్పధం ఫలితంగా ప్రభుత్వ పాలనకు రాజకీయాకరణ తత్త్వం పెంపొందింది అన్న అభిప్రాయం వ్యక్తమైంది.

## 8.7 ప్రభుత్వ ఉద్యోగుల రాజకీయాకరణ (Politicization of Bureau Cracy) :

1985లో ప్రధానమంత్రి రాజీవ్‌గాంధీ రాజకీయాలలో దళారీలను తొలగించాలని ఉద్ఘాటించటంతోపాటు ప్రభుత్వ ఉద్యోగి బృంద రాజకీయాకరణ (Politicization) ను నిరోధించవలసిన అవసరాన్ని కూడా నొక్కి చెప్పాడు. స్థూలంగా రాజకీయాకరణ అంటె ఏదో రాజకీయపార్టీపట్ల మొగ్గుకనపరచటం. అయితే ఉద్యోగి బృంద రాజకీయాకరణకు ఈ నిర్వచనం

వర్తించదు. ఉద్యోగి బృంద రాజకీయీకరణకు ఒకటే రాజకీయపార్టీ పట్ల సానుభూతి కనపరచటం అని అర్థం చేసుకోవాల్సి ఉంటుంది. ఇటీవల కాలంలో ఈ పరిస్థితిలో మౌలికమార్పు సంభవించింది. 1977 ఎన్నికలలో కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ పరాజయం చెంది, జనతాపార్టీ అధికారంలోకి వచ్చాక, దేశరాజకీయాల్లో గణనీయమైన మార్పులు సంభవించాయి. 1989 పార్లమెంటు ఎన్నికల అనంతరం రాజకీయాలు మరో గొప్ప మలుపు తిరిగాయి. ఈ ఎన్నికల అనంతరం దేశంలో ఒకేపార్టీ అధికారాన్ని చేపట్టే అవకాశం పూర్తిగా అంతరించిపోయింది. దీని ఫలితంగా 10వ లోక్‌సభ (1991) ఎన్నికల నుండి రాజకీయ పార్టీలు ఎన్నికల ప్రణాళికల రూపకల్పనపై ఎక్కువ శ్రద్ధ కనపరచటం ప్రారంభమయ్యింది. ఎందుచేతనంటే, ఎన్నికల ప్రణాళికలే వివిధ పార్టీలు సంకీర్ణంగా ఏర్పడటానికి ప్రాతిపదికలుగా రూపొందాయి. అందుచేత పార్టీ సూత్రాలకు నిబద్ధత కనపరచటం అనే భావంలో రాజకీయీకరణకు అవకాశం ఏర్పడింది. అందుచేత ప్రభుత్వ ఉద్యోగి బృందం రాజకీయీకరణకు, ప్రభుత్వ ఉద్యోగులు రాజకీయాలను నడపరు అన్న అర్థం సంతరించుకున్నది. అనేక సందర్భాలలో తమ స్వీయ ప్రయోజనాలను సాధించుకొనే అవకాశం లభిస్తుందనే ఆశ ఉద్యోగుల రాజకీయీకరణకు ప్రేరణగా పనిచేసింది. ఒక తరగతిగా ఎన్.జి.వో. ల రాజకీయీకరణకు యూనియన్లు ప్రధానకారణము. అనేక రాష్ట్రాలలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన యన్.జి.వో.లు ఉద్యోగి సంఘాలుగా వారు ఉమ్మడి పోరాటశక్తిని పెంపొదించుకున్నారు. ఫలితంగా ప్రభుత్వాలు వారి డిమాండ్ల పట్ల సానుకూలంగా ప్రతిస్పందించే దృక్పదం అలవర్చుకున్నారు.

ప్రస్తుతం వివిధ రాజకీయపార్టీలు ప్రభుత్వ ఉద్యోగి సంఘాల మద్దతు సాధించటంపై ఎక్కువ ఆసక్తిని కనపరుస్తూ వున్నారు. కొన్ని పార్టీలు ఎన్.జి.వో.లను తమ ఓటుబ్యాంకులుగా మలచుకొనేందుకు ప్రయత్నిస్తున్నాయి. ఈ ప్రభుత్వఉద్యోగ సంఘాలు విస్తృతంగా వ్యాపించటమేకాక, వివిధ వర్గాల ప్రజలపై అమితమైన ప్రభావాన్ని సంపాదించుకున్నాయి. ఇటీవల కాలంలో ఉన్నతోద్యోగుల ప్రభావం పెరగటానికి, వారు ప్రజాభిప్రాయాన్ని ప్రభావితం చేయటంతోపాటు, ఎన్నికల ప్రక్రియలో కీలకపాత్ర వహించటం కూడా ప్రధాన కారణమైంది. ఎన్నికలలో రాజకీయ పార్టీలకు వివిధ మార్గాలలో తోడ్పడుతున్నాయి. ఈ కారణాల వల్ల ఎన్నికల సమయంలో ప్రభుత్వ ఉద్యోగులను బదిలీచేయటం సర్వసాధారణమైంది. ఈ విధంగా ప్రభుత్వ ఉద్యోగుల రాజకీయీకరణ ప్రాధాన్యత సంతరించుకుంటుంది. ఈ పరిస్థితి దిగువస్థాయి ఉద్యోగులకేకా, ఉన్నతస్థాయి ఉద్యోగులకు కూడా వర్తిస్తుందని పరిశోధనలు వెల్లడించాయి. ఇటీవల కాలంలో కేంద్ర స్థాయిలో సంభవించిన రాజకీయ పరిణామాల ఫలితంగా, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు రాజకీయీకరణలో నూతన దిశలో అడుగుపెట్టారని పరిశోధనలు చెప్తున్నాయి. భారతదేశంలోని ప్రభుత్వ ఉద్యోగులను వివిధ పదవులలో నియమించడంతో ఉద్యోగులు, మంత్రులు సామరస్యంగా కలసి పనిచేయాలనే సూత్రాన్ని ప్రధాన ఆధారంగా పరిగణించాల్సివుంది. అయితే ప్రభుత్వ ఉద్యోగులు, మంత్రులు కలసి పనిచేసే క్రమంలో వారిమధ్య పరస్పర అవగాహన, భాగస్వాములమనే భావన వారిలో పెంపొందుతుంది.

ప్రభుత్వ ఉద్యోగుల కార్యకలాపాలలో రాజకీయ జోక్యం రాజకీయీకరణకు భిన్నమైన దృగ్గోచర విధానం. ప్రజాస్వామ్య వ్యవస్థలో కార్యనిర్వాహక విభాగానికి రాజకీయ అధిపతి ఆధిపత్యం వహిస్తాడు. దాని ఫలితంగా, ఉద్యోగి బృంద యంత్రాంగం ద్వారా కార్యనిర్వాహక విధులను నిర్వర్తించే చట్టబద్ధత రాజకీయ అధిపతికి సంక్రమిస్తుంది. దీనిప్రకారం రాజకీయ అధిపతి ఉద్యోగ బృందానికి రాజకీయ స్వభావంకల విధిని అప్పగించినపుడు, దానివలన రాజకీయ ఫలితాలు సంభవించినప్పటికి, అది చట్టబద్ధమైనదే అవుతుంది. కాని రాజకీయపరమైన ఒత్తిళ్ళు, లేదా చట్టబద్ధంకాని మార్గాల ద్వారా అధికారాన్ని చెలాయించటం వంటి చర్యలు రాజకీయపరమైన జోక్యమే అవుతుంది.

ఇటీవల నిర్వహించిన ఒక అధ్యయనం ప్రకారం భారతదేశంలో ప్రభుత్వ ఉద్యోగి బృందం అనేక రూపాలలో, రాజకీయాలలో చురుకుగా పాల్గొంటూ ఉన్నది. అందుచేత తన రాజకీయ తటస్థతను కోల్పోయింది. మరో అధ్యయనం వెల్లడించినది ఏమిటంటే

జిల్లా స్థాయిలో రాజకీయ నాయకులు, ప్రభుత్వ ఉద్యోగుల విధులను విభజించే, సాంప్రదాయబద్ధమైన విభజన రేఖ చెరిగిపోయింది. ఆధునిక కాలంలో, ప్రధానంగా భారతదేశంలో ప్రభుత్వ ఉద్యోగుల తటస్థత, సిద్ధాంతం, తన ప్రాముఖ్యతను కోల్పోయింది. అయితే ప్రభుత్వ ఉద్యోగులు చట్టాలను, చట్టబద్ధమైన నియమ నిబంధనలను రాజకీయాలకు అతీతంగా అమలుపరచటం ద్వారా, నిష్పాక్షికంగా వ్యవహరించటం ద్వారా ఈ ఉద్యోగి బృంద తటస్థ సిద్ధాంతం పునరుద్ధరించబడే అవకాశం వుంది. అయితే శాసనేతర (Non - Statutory) అంశాలలో ఉద్యోగుల ప్రవర్తనను నిర్దేశించేందుకు ఆధునిక కాలం అవసరాలకు అనుగుణంగా ఒక నూతన సిద్ధాంతాన్ని రూపొందించాల్సి వుంది.

ప్రస్తుతం దేశంలో నెలకొనివున్న సంకీర్ణ రాజకీయాల సందర్భంలో ప్రభుత్వ ఉద్యోగి బృంద తటస్థత గురించి రూడాల్ఫ్ అండ్ రూడాల్ఫ్ ఈ విధంగా పేర్కొన్నారు. దేశంలో సంకీర్ణ రాజకీయశకం అవతరించాక రాజకీయంగా తటస్థమైన, వృత్తిపరంగా నిబద్ధత కలిగిన విభిన్న పార్టీలకు చెందిన రాజకీయ నాయకుల క్రింద పనిచేయగలిగిన సామర్థ్యం ఉన్న ఉద్యోగి బృందం ఆవశ్యకత బలంగా వుంది. ఈ జోక్యం కల్పించుకునేతత్వం, నిర్వహణ దృక్పథం కలిగిన భారతదేశ ప్రభుత్వంలో పనిచేసే ఉద్యోగి బృంద రాజకీయ తటస్థతను కొనసాగించటం మాత్రం సాధ్యంకాదు. కాబినేట్ రూపొందించిన విధానాలను సమన్వయ పరచటానికి, మార్గదర్శకత్వం వహించటానికి మంత్రులకు విధేయులైన, వారి విధానాలకు కట్టుబడిన ఉద్యోగిబృందం అవసరం. ఈ పరిస్థితి 1980 దశాబ్దంలో ఉన్న పరిస్థితికి భిన్నమైంది. ఈ దశాబ్దంలో విధేయత, నిబద్ధతలు వృత్తిపరంగా, విధానరూపంగా చూడబడటం లేదు. దీనికి భిన్నంగా అప్పటి మంత్రులు విధానాల పేరుతో తమ రాజకీయ ప్రయోజనాలకు అనగుణంగా పనిచేసే ఉద్యోగి బృంద వ్యవస్థ పట్ల ఆసక్తి కనపరిచారు.

## 8.8 ఉద్యోగిబృంద పరిపాలనా సామర్థ్యం :

భారతదేశంలో ఉద్యోగిబృంద సామర్థ్యాన్ని పెంచటంపై ఆసక్తి బ్రిటిష్ ప్రభుత్వంతోనే మొదలయిందని తెలుస్తున్నది. ప్రభుత్వపాలన ఉద్యోగి బృంద సామర్థ్యంపై మొదటిసారిగా బ్రిటిష్ వలస పాలనా కాలంలో 19వ శతాబ్దం చివరిదశలో వైస్రాయిగా పనిచేసిన లార్డ్‌కర్జన్ ఆసక్తిని కనపర్చి, ఆ దిశలో అనేక చర్చలకు పాల్పడినట్లు చరిత్ర వెల్లడిస్తున్నది. కర్జన్ భారతదేశ పాలనా వ్యవస్థను మెరుగుపరచటానికి చేపట్టిన చర్యలలో ప్రభుత్వ ఉద్యోగి బృంద సంస్కరణలు ప్రధానమైనవి. కర్జన్ తరువాత దశలో కూడా బ్రిటిష్‌ప్రభుత్వ భారతపాలనావ్యవస్థ, ఉద్యోగి బృంద వ్యవస్థల సామర్థ్యాన్ని పెంపొందించేందుకు అనేక చర్యలు చేపట్టబడ్డాయి. వీటిలో ఇండియన్ సివిల్ సర్వీసును సృష్టించడం ప్రధానమయింది. ఈ సర్వీస్ అత్యంత సమర్థవంతమైన ఉద్యోగ బృందంగా రూపొందించబడింది. ఈ సర్వీస్ అత్యంత సామర్థ్యాన్ని ప్రదర్శించటం ద్వారా భారత పాలనా వ్యవస్థ ఉక్కుచట్టం (Steel Frame) గా ప్రపంచ ప్రఖ్యాతి సంపాదించుకుంది.

స్వాతంత్ర్యానంతరం భారత పాలనా వ్యవస్థ ఉద్యోగి బృంద వ్యవస్థల సామర్థ్యాన్ని అభివృద్ధిపరచటం రాజ్యాంగ నిర్మాణ మండలిలో ప్రధాన చర్చనీయాంశాలలో ఒకటైంది. సర్దార్ పటేల్ చొరవతో బ్రిటిష్ ప్రభుత్వం ఏర్పరిచిన ఐ.సి.ఎస్. వారసత్వంగా అఖిల భారత సర్వీసులు (All India services) ఏర్పాటు అయ్యాయి. స్వతంత్ర్య భారతదేశం ఏర్పరచుకొన్న అభివృద్ధి లక్ష్యాల సాధనకు అఖిల భారత సర్వీసులు (I.A.S. & I.P.S.) ఒక ప్రధాన సాధనంగా ఉపయోగపడతాయని అప్పటి నాయకులు ఆశించారు. స్వాతంత్ర్యానంతరం ఏర్పడిన ప్రభుత్వాలు దేశపాలనావ్యవస్థ, ఉద్యోగి బృంద వ్యవస్థల సామర్థ్యాన్ని పెంపొందించబడుటానికే కీలక ప్రాధాన్యత అంశంగా పరిగణించి, ఈ లక్ష్యసాధనకు అనేక చర్యలు చేపట్టారు. ప్రభుత్వ ఉద్యోగులు సామర్థ్యం, ప్రతిభలను మెరుగుపరచేందుకు తగిన సూచనలు చేసేందుకు అనేక పరిపాలనా సంస్కరణలను ఏర్పాటు చేయటం ఈ చర్యలలో ప్రధానమైంది. పరిపాలనా సంస్కరణ సంఘాలు, ప్రభుత్వ యంత్రాంగం, ప్రధానంగా ఉద్యోగి బృంద

సామర్థ్యం మెరుగుపరిచేందుకు అనేక సూచనలు చేశాయి. ఈ సూచనల ఆధారంగా ఈ వ్యవస్థలలో అనేక మార్పులను ప్రవేశపెట్టటం జరిగింది. వీటి ఫలితంగా ప్రభుత్వ ఉద్యోగిబృంద సామర్థ్యం అభివృద్ధి చెందుతూ వచ్చింది.

స్వాతంత్ర్యానంతరం భారతదేశంలో, ఉద్యోగ బృంద సామర్థ్యంపై గణనీయమైన పరిమాణంలో పరిశోధనలు జరిగాయి. ఈ పరిశోధనల ఫలితాలు ఉద్యోగ బృందానికి సానుకూలంగానూ, వ్యతిరేకంగా ఉన్నాయి. పాల్ యాపిల్‌బి, మారిస్‌జోన్స్ వంటి పాశ్చాత్య శాస్త్రవేత్తలు అభిప్రాయం ప్రకారం స్వాతంత్ర్యానంతరం దేశంలో ఏర్పడిన సామాజిక, రాజకీయ వాతావరణానికి అనుగుణ్యతను పెంపొందించుకొనటంలో మంచి ప్రతిభకనబర్చారు. ఇదే విధంగా స్వాతంత్ర్యానంతరం ప్రభుత్వం దేశ సామాజిక, ఆర్థిక అభివృద్ధికి వివిధ ప్రభుత్వాలు చేపట్టిన వివిధ అభివృద్ధి సంక్షేమ ప్రణాళికలు, పథకాలను అమలుపరచటంలో ఉద్యోగబృందం చురుకైన పాత్రను పోషిస్తున్నదని పరిశోధనలు వెల్లడించాయి. జాతి నిర్మాణం, జాతి సమైక్యత, ఆర్థికాభివృద్ధి, ఆర్భనీకరణ, ప్రజాస్వామ్య వ్యవస్థ పటిష్టత మొదలైన ప్రక్రియల్లో ప్రధానంగా I.A.S. అధికారులు నిర్మిస్తున్న పాత్ర అమోఘమైందని అనేక పరిశోదనలు స్పష్టీకరిస్తున్నాయి.

1990 వ దశాబ్దం నుంచి దేశంలో సంబంధించిన అనేక పరిణామాలు, ప్రధానంగా 73వ, 74వ రాజ్యాంగ సవరణ ద్వారా స్థానిక సంస్థలకు అధికారాన్ని, వికేంద్రీకరణ, ప్రభుత్వం చేపట్టిన సరళీకృత ఆర్థిక సంస్కరణలు, ప్రపంచీకరణ ప్రభావం, పరిపాలనలో సమాచార సాంకేతిక పరిజ్ఞానం పాత్ర విస్తరించడం ఫలితంగా ప్రభుత్వ యంత్రాంగం, ఉద్యోగబృందం సామర్థ్యానికి నూతన అర్థాన్ని కల్పించాయి. ఈ పరిస్థితులలో ప్రభుత్వ ఉద్యోగులు నూతన విలువలను ప్రమాణాలను ఏర్పరచుకోవలసిన ఆవశ్యకతను సృష్టించాయి. క్రమశిక్షణా, ఉత్పాదకతను పెంపొందించుకోవటం, వ్యర్థ వ్యయాన్ని తగ్గించటం, కాలం చెల్లిన అనవసరమైన పద్ధతులు, విధానాలను తొలగించటం, మార్కెట్ వ్యవస్థ, సాధారణ ప్రజల పట్ల సామరస్య పూరిత దృక్పథం, గమనశీలక సరళీకృతమైనదని, పారదర్శనికత, పొదుపరితనం మొదలైన విలువలు ప్రస్తుతం ఉద్యోగి బృందం తన సామర్థ్యాన్ని, ప్రతిభను పెంపొందించేందుకు అలవర్చుకోవలసిన విలువలను పాలనా నిపుణుల అభిప్రాయం.

## 8.9. సారాంశము :

ఉద్యోగి బృందం సమాజంలో శాంతిభద్రతలను పరిరక్షించటంతోపాటు, అభివృద్ధి మార్పులను సాధిస్తుంది. ప్రభుత్వ ఉద్యోగి తాను తీర్చిదిద్దబడిన యంత్రాంగం అని పేర్కొన్నాడు వెబర్ అభివృద్ధి చెందుతున్న దేశాలలో వీరి యొక్క పాత్ర కీలకమైనది. బ్రిటిష్ ప్రభుత్వపాలన కారణంగా భారతదేశంలో భిన్నత్వం కలిగిన ఉద్యోగిస్వామ్య వ్యవస్థను రూపకల్పన చేస్తుంది. లార్డ్ మెకాలే ప్రవేశపెట్టిన విద్యావిధానం వల్ల భారతదేశ పాలనలో ఒక మౌలిక మార్పు వచ్చింది. లంబ సమైక్యీకరణ చెందిన బ్రిటిష్ పాలన మూడు స్థాయిలుగా విభజింపబడింది. అవి అఖిల భారత సర్వీసులు, కేంద్ర ప్రభుత్వ సర్వీసులు, రాష్ట్ర సర్వీసులు. స్వాతంత్ర్యానంతరం కూడా వలస పాలనా కాలంలో రూపుదిద్దుకున్న ఉద్యోగిస్వామ్య వ్యవస్థను కొనసాగించినప్పటికీ ఈ వ్యవస్థ లక్ష్యాలు, కార్యకలాపాలు, దృక్పథంలో, విలువలలో అనేక మార్పులు చోటుచేసుకున్నాయి. స్వాతంత్ర్యానంతరం భారతదేశం అనుసరించిన ప్రాతినిధ్య ప్రజాస్వామ్యం, సంక్షేమ రాజ్యం, లౌకికవిధానం మొదలైన ఆదర్శాలకు అనుగుణంగా ఉద్యోగి బృంద వ్యవస్థను పునర్వ్యవస్థీకరించబడటం తప్పనిసరి అయింది. కాలక్రమంలో దేశంలో సంభవించిన సామాజిక, రాజకీయ, ఆర్థిక పరిస్థితులకు అనుగుణంగా ఉద్యోగి బృంద వ్యవస్థ మారుతూ వస్తున్నది. ఏమైనప్పటికీ, దేశం సాధించిన సామాజిక, ఆర్థిక ప్రగతి, ఆధునికీకరణ, జాతీయ సమైక్యత, జాతి నిర్మాణం, సాంకేతిక వైజ్ఞానిక ప్రగతిలలో ఉద్యోగిస్వామ్య బృందం గణనీయమైనపాత్రను వహించింది అని చెప్పటంలో సందేహం లేదు.

## 8.10 మాదిరి ప్రశ్నలు :

1. భారతదేశంలో ఉద్యోగి బృందస్వామ్య వ్యవస్థను విమర్శనాత్మకంగా పరిశీలించండి.
2. భారతదేశంలో సామాజిక, ఆర్థిక ప్రగతిలో ఉద్యోగిబృంద పాత్రను వివరించండి.
3. భారతదేశంలో ఉద్యోగిస్వామ్య వ్యవస్థలో సంభవించిన పరిణామాలను పేర్కొనండి.
4. భారతదేశంలో రాజకీయ వ్యవస్థ, ఉద్యోగి బృంద వ్యవస్థల మధ్య సంబంధాలను వివరించండి.

## 8.11 చదువదగిన గ్రంథాలు :

1) Avasthi and Maheswari, Public Administration, Agra : Lakshmi Narain Agarwal, 2003
2) Avasthi and Avasthi, Indian Administration, Agra : Lakshmi narain Agarwal, 2003.
3) Paul R. Brass, The Public of India since Independence, Cambridge: Cambridge University Press, 2001.
4) Partha Chaterjee, (ed) State and Politics in India, Delhi : Oxford University Press in India, 1998.
5) Ramesh K. Arora and Rajni Goyal, Indian Public Administration, New Delhi, Wishwaam Prakasam, 1995.

**రచయిత : ప్రొఫెసర్. ఎమ్. బాపూజీ**

పాఠం - 9

# జాతీయ సమైక్యత - ప్రాంతీయతత్వం, భాషాతత్వం

విషయసూచిక


9.0 లక్ష్యం

9.1 ఉపోద్ఘాతం

9.2 జాతీయ సమైక్యత - అర్థవివరణ

9.3 భారతదేశంలో జాతీయ సమైక్యత - ప్రధాన దృక్కోణాలు

9.4 జాతీయ సమైక్యత - భాషా, ప్రాంతీయ తత్వాలు

9.5 జాతీయ సమైక్యత - ప్రాంతీయతత్వం

9.6 ప్రాంతీయతత్వం రూపాలు

9.7 జాతీయ సమైక్యత సాధనకు జరిగిన కృషి - జాతీయ సమైక్యతా మండలి

9.8 సారాంశము

9.9 మాదిరి ప్రశ్నలు

9.10 చదువదగిన గ్రంథాలు


## 9.0 లక్ష్యం :

ఈ పాఠం భారతదేశంలో జాతీయ సమైక్యతను గురించి ఈ క్రింది అంశాలను చర్చిస్తుంది.

1) జాతీయ సమైక్యత భావన, ఆవశ్యకత.
2) భారతదేశంలో జాతీయ సమైక్యత ప్రధాన దృక్కోణాలు
3) భారతదేశంలో జాతీయ సమైక్యతకు సవాళ్ళుగా పరిగణించిన ప్రాంతీయ భాషాతత్వాలు.
4) భారతదేశంలో జాతీయ సమైక్యతా పరిరక్షణకు ప్రభుత్వం చేపట్టిన చర్యలు, వాటి ఫలితాలు.

## 9.1 ఉపోద్ఘాతం :

ఇటీవల కాలంలో అభివృద్ధి చెందుతున్న దేశాలలో జాతి నిర్మాణం (Nation - Building), జాతీయ సమైక్యత (National Integration) అనే పదాలు ఎంతో ప్రాముఖ్యతను సంపాదించుకున్నాయి. ఈ దేశాలలో కేవలం విదేశీ పాలన నుండి స్వాతంత్ర్యాన్ని సముపార్జించుకోవటం మాత్రమే ఏకైక లక్ష్యం కాదు. జాతీయ స్వాతంత్ర్యం ఫలాలను సంఘటితపరచుకోవాల్సి ఉంది. స్వాతంత్ర్యానంతరం దేశం సామాజిక, ఆర్థికాభివృద్ధిని సాధించినపుడే స్వాతంత్ర్యం ఫలాలను ఆదేశ ప్రజలు అనుభవించగలుగుతారు. దీంతో సామాజిక, ఆర్థికాభివృద్ధి సాధన స్వాతంత్ర్యానంతరం దేశంలో ఏర్పడిన జాతీయ ప్రభుత్వం ముందున్న తక్షణ కర్తవ్యమైంది. ఈ కర్తవ్య సాధనకు ప్రభుత్వం అనేక రూపాలలో కృషి చేయవలసి ఉంటుంది. ఈ విధంగా

రాజకీయ స్వాతంత్ర్యానంతరం అభివృద్ధి చెందుతున్న దేశాలలో ప్రారంభమైన ఈ ప్రక్రియ జాతి నిర్మాణం, జాతీయ సమైక్యతలనే భిన్న పేర్లతో ప్రాముఖ్యతను సంతరించుకుంది. రాజనీతి శాస్త్రవేత్తల అభిప్రాయం ప్రకారం 20వ శతాబ్దం జాతి నిర్మాణం, జాతీయ సమైక్యతల యుగం. జాతీయ గుర్తింపును సాధించటం ద్వారా జాతిని నిర్మించటం, జాతీయ సమైక్యతను సాధించటం అభివృద్ధి చెందుతున్న దేశాల ముందున్న తక్షణ కర్తవ్యం. ఈ రెండు లక్ష్యాల సాధన రాజకీయ సుస్థిరతను,సామాజిక, ఆర్థికాభివృద్ధిని సాధించటంతో సన్నిహితంగా ముడిపడి ఉంది. ఈ కారణాల వల్ల రెండవ ప్రపంచ యుద్ధానంతరం రాజకీయ స్వాతంత్ర్యాన్ని సముపార్జించుకొని, అభివృద్ధి చెందుతున్న దేశాలు లేదా నూతన దేశాలుగా అవతరించిన దేశాలు జాతి నిర్మాణాన్ని, జాతీయ సమైక్యతలకు తమ ఎజెండాలో అత్యున్నత స్థానాన్ని కల్పించటంలో ఆశ్చర్యం ఏమీ లేదు. వివిధ కారణాల వల్ల స్వాతంత్ర్యానంతరం భారతదేశంలో జాతీయ సమైక్యత మరింత ప్రాధాన్యతను సంతరించుకుంది. జాతీయ సమైక్యతా సాధనలో ప్రభుత్వం అనేక అవరోధాలను ఎదుర్కొంటున్నప్పటికీ వాటిని సమర్థవంతంగా పరిష్కరిస్తున్నది. దేశంలో జాతీయ సమైక్యత చెక్కుచెదరకుండా కొనసాగటానికి రాజ్యాంగం ఏర్పరిచిన ఆదర్శాలతోపాటు, ఏకత్వంలో భిన్నత్వం అనే భారతదేశ విశిష్ట లక్షణం ప్రధాన కారణంగా పేర్కొనవచ్చును.

## 9.2 జాతీయ సమైక్యత - అర్థవివరణ :

జాతీయ సమైక్యత అనే పదాన్ని భిన్న రచయితలు భిన్న భిన్న రీతులలో నిర్వచించారు. అయినప్పటికీ ఈ భిన్న నిర్వచనాల మధ్య సారూప్యత ఉంది. ఈ పదాన్ని నిర్వచించిన రచయితలందరూ జాతీయవాదాన్ని(Nationalism) జాతి నిర్మాణానికి ఒక ప్రాతిపదికగా పరిగణించారు. అందుచేత ఈ రచయితలందరూ జాతీయ సమైక్యతను స్థూలంగా జాతీయ గుర్తింపు (Identity) ని స్థాపించే విధంగా దేశంలోని విభిన్న సాంస్కృతిక, సామాజిక వర్గాలను ఏక ప్రాదేశిక కేంద్రంగా (Territorial Unit) సమైక్యపరచే ప్రక్రియగా పరిగణించారు. సహజంగానే ఈ భావనలో రాజకీయ సమైక్యత భావం నిగూఢంగా ఉంది. ఈ కోణాన్నుంచే మైరాన్ వీనర్ జాతీయ సమైక్యతను సంకుచితత్వాన్ని, సంకుచిత విధేయతలను రూపుమాపే విధంగా ప్రాదేశిక సమైక్యతా భావాన్ని ప్రేరేపించటంగా నిర్వచించాడు. జె.ఎ. కట్‌లెట్ (J.A. Cutlet) అనే రచయిత జాతీయ సమైక్యతను పరిపూర్ణత్వాన్ని సంతరించుకొనే, చైతన్యాన్ని సాధించే ప్రక్రియగా వర్ణించాడు. ఎల్.పి. మెయిన్ (L.P. Main) అందరికి ఆమోదయోగ్యమైన సుస్థాపితమైన సంస్థలు, హక్కులు, విలువలు కలిగిన సమైక్యత సమాజం అని జాతీయ సమైక్యతను నిర్వచించాడు. బిండి (Bindey) యధాతథంగా జాతీయ సమైక్యత నిరాపేక్షంగా ఉత్తమమైన భావనకాదు. దాని విలువ సమైక్యత సాధించే లక్ష్యం, లేదా ఆశయం మీద ఆధారపడి ఉంటుందని పేర్కొన్నాడు.

భారతదేశ సందర్భంలో అనేకమంది ప్రముఖులు జాతీయ సమైక్యతను నిర్వచించారు. డా॥ సర్వేపల్లి రాధాకృష్ణన్ అభిప్రాయం ప్రకారం జాతీయసమైక్యత కేవలం ఇటుకలు, మట్టితో నిర్మించే గృహం వంటిదికాదు. నిపుణులు విస్తృతంగా చర్చించి, అమలుపరిచే పారిశ్రామిక ప్రణాళికా కాదు. దీనికి భిన్నంగా జాతీయ సమైక్యత ప్రజల మనస్సుల్లోకి చొచ్చుకువెళ్ళి తీరవలసిన ఆలోచనా ప్రవంతి. ప్రజలను చైతన్యవంతులను చేసే స్ఫూర్తిదాయకమైన దృగ్గోచరం.

హెచ్.ఎ. ఘని (H.A. Ghani) ప్రజల హృదయాంతరాలలో ఐక్యతా భావాన్ని, సంఘటితత్వాన్ని, ప్రామాణికతను పౌరులలో ఉమ్మడి పౌరసత్వం, దేశంపట్ల విధేయతను పెంపొందింప చేసేందుకు తోడ్పడే సామాజిక, మనస్తత్వ, విద్యా ప్రక్రియ అని జాతీయ సమైక్యతను నిర్వచించాడు. ఈ విధంగా భారతదేశ సందర్భంలో జాతీయ సమైక్యతకు దేశంలోకల వైవిధ్యాలను కొనసాగిస్తూనే మతం, కులం, జాతి, భాష, లింగలకు అతీతంగా ప్రజలలో మానసికపరమైన ఐక్యతను సాధించటం అని అర్థం చెప్పవచ్చును.

కొందరు రచయితలు జాతీయ సమైక్యతను రెండు విధాలు ద్వారా లేక వ్యూహాల ద్వారా సాధించవచ్చును అని సూచించారు. ఒకటి, దేశంలోని అల్పసంఖ్యాక ప్రజల విశిష్ట సంస్కృతిని అత్యధిక సంఖ్యాకుల సంస్కృతిలో విలీనం చేయటం ద్వారా జాతీయ సమైక్యతను సాధించవచ్చును. రెండు, భిన్నత్వంలో ఏకత్వాన్ని సాధించటం ద్వారా జాతీయ సమైక్యతను సాధించటం. అయితే ప్రపంచంలోని అన్ని దేశాలలో పైన వివరించిన రెండు పద్ధతుల ద్వారా మాత్రమే జాతీయ సమైక్యతను సాధించారని చెప్పడం సరిగాదు. కొన్ని దేశాలలో జాతీయ సమైక్యతను సాధించేందుకు మధ్యేమార్గాన్ని కూడా అనుసరించారు. ఈ దేశాలలో అధిక సంఖ్యాక వర్గాల ప్రజలు తమ సంస్కృతిని అల్ప సంఖ్యాక వర్గాలపై రుద్దడం ద్వారా జాతీయ సమైక్యతను సాధించారు. ఈ పద్ధతి ప్రధానంగా జర్మనీ, ఫ్రాన్స్, స్విట్జర్లాండ్ దేశాలలో అనుసరించారు.

కొందరు రాజనీతి శాస్త్రవేత్తలు భారతదేశంలో జాతీయ సమైక్యతను మూడవ మార్గం అయిన మధ్యేవాద మార్గం ద్వారా సాధించారని వాదించారు. ఈ దేశంలో అల్ప సంఖ్యాక వర్గాలను అధిక సంఖ్యాక వర్గాల ప్రజలతో పూర్తిగా సమైక్యపరచటానికి బదులు ఏకత్వంలో భిన్నత్వం అనే వ్యూహాన్ని అనుసరించారు. ఈ దేశంలో విభిన్న కులాలకు, మతాలకు చెందిన వ్యక్తులలో ఐక్యత అంతర్లీనంగా ఉందని దేశ నాయకులు పేర్కొన్నారు. ఈ నాయకులు ప్రాంతీయ, భాషా విభేదాలు, కుల మత తత్వాలు, జాతీయ సమైక్యతకు అవరోధాలు కావని నొక్కిచెప్పారు. నెహ్రూ ఈ వాస్తవాన్ని గుర్తించి దేశ ఐక్యత కుల, మత, ప్రాంతీయ, వేర్పాటు ధోరణులను పూర్తిగా రూపుమాపాలని తరుచూ ఉద్బోధించారు. నెహ్రూ దేశంలోని ఉత్తర, దక్షిణాలు, తూర్పు, పశ్చిమ ప్రాంతాల మధ్య ఎటువంటి విభజన లేదని, ఉన్నది ఒకేదేశం అని కూడా తఱచుగా ఉద్ఘాటించారు.

ఈ కోణం నుంచి ఆలోచిస్తే లౌకికవాదులు, ప్రజాస్వామ్య వాదులు ప్రతిపాదించిన దేశ సమైక్యతా భావనకు, మతవాదులు, ఏర్పాటువాదులు ప్రతిపాదించిన సమైక్యతా భావనకు మధ్య ఎంతో భిన్నత్వం ఉంది. కొందరు వాదించినట్లు భారతదేశంలో జాతీయ సమైక్యత అంటే హిందుత్వం కాదు. ప్రజలందరిలో భారతీయతత్వాన్ని ప్రేరేపించటం లేదా మొదటగా తాము భారతీయులమనే భావననే ప్రజలలో ప్రేరేపించబడటం జాతీయ సమైక్యతగా పరిగణించాలి.

మొత్తం మీద భారతదేశంలో జాతీయ సమైక్యత భావనకు ఈ క్రింది అర్థాన్ని చెప్పవచ్చును.

1) భారతదేశంలో సమైక్యత అంటే విలీనం కావటం కాదు. ఐక్యత (Unity) ను పెంపొందించకుండా సమైక్యతను సాధించటం జాతీయ సమైక్యత లక్ష్యం కాదు. భిన్నత్వంలో ఏకత్వాన్ని సాధించటమే భారతదేశంలో జాతీయ సమైక్యత లక్ష్యం. ప్రజల మధ్య సామాజిక, సాంస్కృతిక, మత, భాష, కులపరమైన భిన్నత్వాలు ఉన్నప్పటికీ జాతి - రాజ్యాన్ని పటిష్టవంతం చేసుకునేందుకు వారు రాజ్యం పట్ల తమ విభిన్న విధేయతలను సమైక్యపర్చుకోవాలి. ప్రజలు ప్రాంతీయ, వర్గ, మత, కుల విభేదాలకు అతీతంగా రాజ్యం పట్ల విధేయతను కలపరచాలి. ఈ విధంగా దేశసమైక్యతను సాధించేందుకు ప్రజలు సంకుచిత తత్వాన్ని పూర్తిగా విసర్జించాలి.

2) భారతదేశంలో జాతీయ సమైక్యతకు సంకుచిత భావాలను పూర్తిగా విసర్జించటంతోపాటు దేశ ఐక్యతకు, సమగ్రతకు ప్రమాదం కల్పించే అన్నిరకాల జాతి వ్యతిరేకశక్తులతో పోరాడాలి. ఈ విధంగా భారతదేశ సందర్భంలో జాతీయ సమైక్యత ప్రమాణాత్మకమైన దృగ్గోచరమే కాక అనుభవాత్మక దృగ్గోచరం కూడా.

3) భారతదేశ సందర్భంలో జాతీయ సమైక్యతా భావన అతి సమగ్రమైంది. ఈ భావనకు సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక, రాజకీయ కోణాలు ఉన్నాయి. జాతీయ సమైక్యతకు బలమైన, స్థిరమైన జాతి - రాజ్యంతోపాటు, సామాజిక, ఆర్థిక రాజకీయ, సాంస్కృతిక సమైక్యత అవసరం. దీనితోపాటు ప్రజలలో ఉద్వేగపరమైన సమైక్యత కూడా అవసరం. ఒక విధంగా జాతీయ సమైక్యతకు రాజకీయంగా వ్యవస్థీకృతమైన సమాజంతోపాటు, ప్రజాస్వామ్య పద్దతుల ద్వారా తమ సామాజిక, ఆర్థిక

ప్రయోజనాలను సంతృప్తిపరచుకునే అవకాశం ప్రజలకు ఉండటం వాంఛనీయం. అంతేకాక అన్ని తరగుతుల ప్రజలలో ఉమ్మడి విలువలు, ప్రమాణాలు, దృక్పధాలు ఉండాలి. ప్రజలలో విభిన్న విలువల పట్ల కల ఏకాభిప్రాయం జాతీయ సమగ్రతకు ప్రధాన ప్రాతిపదిక.

అయితే జాతీయ సమైక్యత అంటే అర్ధ - సమైక్యత, అనుచిత సమైక్యత లేదా మితిమీరిన సమైక్యత కాదు. జాతీయ సమైక్యతకు ప్రజల అన్ని జీవితాంశాలలో సక్రమమైన సమైక్యత అవసరం. ఈ విధమైన జాతీయ సమైక్యత ప్రజలకు భద్రత కల్పించటంతోపాటు వారి జీవితాలను సుఖమయం చేస్తుంది. ఈ విధంగా జాతీయ సమైక్యత దేశంలో అన్ని తరగతుల ప్రజలు తమ సామాజిక, ఆర్ధిక పరిస్థితితో సంబంధం లేకుండా శాంతియుతమైన, గౌరవప్రదమైన జీవితాలను గడుపుతూ దేశాన్ని శక్తివంతమైన దేశంగా తీర్చిదిద్దేందుకు తమ శక్తివంచన లేకుండా పాటుపడే వాతావరణాన్ని దేశంలో సృష్టిస్తుంది.

## 9.3 భారతదేశంలో జాతీయ సమైక్యత - ప్రధాన దృక్కోణాలు :

జాతీయ సమైక్యత అతి సమగ్రమైన, విస్తృతమైన భావన. ఈ భావనకు సామాజిక, సాంస్కృతిక, ఆర్ధిక, రాజకీయ మనస్తత్వ దృక్కోణాలు ఉన్నాయి. దీనినిబట్టి ప్రజలు అన్ని జీవిత అంశాలలో సమైక్యతను కలిగి ఉండటాన్నే జాతీయ సమైక్యతగా పరిగణించాల్సి ఉంటుంది. అంతేకాక శక్తివంతమైన, సుస్థిరమైన జాతి - రాజ్యాన్ని ఏర్పరచటం జాతీయ సమైక్యతకు అత్యంత ఆవశ్యకమైన చర్య అయినప్పటికి దానివలన మాత్రమే జాతీయ సమైక్యతను సాధించటం సాధ్యంకాదు. దేశంలో పేదరికాన్ని, నిరుద్యోగాన్ని, పూర్తిగా తొలగించటంతోపాటు, ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచటం, దేశంలో అన్ని ప్రాంతాల సమతుల్య అభివృద్ధిని సాధించటం, ప్రజలకు కనీస జీవనప్రమాణాలను కల్పించటం, సమాజంలోని ఆర్ధిక, సామాజిక అంతరాలను తొలగించటం మొదలైన చర్యలు కూడా జాతీయ సమైక్యతకు సమానంగా అవసరం. జాతీయ సమైక్యతకు సామాజిక దృక్కోణం ఉంది. ఈ దృక్కోణం ప్రకారం దేశంలో న్యాయబద్ధమైన సామాజిక, రాజకీయ వ్యవస్థను ఏర్పరచటం ద్వారా తమ భౌతిక, మానసిక ఆకాంక్షలను సంతృప్తిపరచుకొనే అవకాశాలను ప్రజలందరికీ సమానంగా కల్పించటం జాతీయ సమైక్యతకి అవశ్యకం. జాతీయ సమైక్యతకు గల మరో దృక్కోణం మనస్తత్వ దృక్పధం. ఈ దృక్కోణానికి అనుగుణంగా తన వ్యక్తిత్వ వికాసానికి స్వేచ్ఛాపూరితమైన అవకాశాన్ని కల్పించే రాజకీయ వ్యవస్థ దేశంలో ఉందని ప్రతి వ్యక్తి భావించటం జాతీయ సమైక్యతకు అవసరం. ఈ విభిన్న దృక్కోణాల అనుగుణంగా సమాజంలో వ్యక్తులు స్వచ్ఛందంగా, ఇచ్ఛాపూర్వకంగా ఉమ్మడి విలువలను ప్రమాణాలను దేశంలో ఏర్పరచటం జాతీయ సమైక్యత సాధనకు అవసరం. దానితోపాటు దేశ ప్రజల ఉద్వేగాలను సమైక్యపరచి, వారి మధ్య ఆధ్యాత్మికపరమైన బంధాన్ని పెంపొందింపచేయటం జాతీయ సమైక్యతకు చేపట్టవలసిన ఒక కీలకచర్య.

## 9.4 జాతీయ సమైక్యత - భాషా, ప్రాంతీయ తత్వాలు :

దేశాన్ని సామాజికంగా, ఆర్ధికంగా, రాజకీయంగా మానసికంగా (emotional) పటిష్టపరచి, జాతినిర్మాణం, జాతీయ సమైక్యతలనే సంక్లిష్ట లక్ష్యాలను సాధించటం స్వాతంత్ర్యానంతరం భారతదేశం సాధించిన ఘనమైన విజయాలలో ప్రధానమైనవి. దేశంలో నెలకొన్న అనేక భిన్నత్వాలు, వ్యత్యాసాలు, స్వాతంత్ర్యానంతరం దేశ ఐక్యత, సమగ్రతా, సమైక్యతలకు, వీటితోపాటు దేశ సామాజిక, ఆర్ధిక ప్రగతికి అనేక సమస్యలను, సవాళ్ళను సృష్టించాయి. ఈ సమస్యలను, సవాళ్ళను ప్రభుత్వం సమర్ధవంతంగా అధిగమించినప్పటికీ అవి పూర్తిగా సమసిపోక దేశానికి అనేక సమస్యలను సృష్టిస్తూ దేశ సామాజిక, ఆర్ధిక ప్రగతికి తీవ్రమైన అవరోధాలను కల్పిస్తూనే ఉన్నాయి. వాస్తవానికి మతతత్వం, కులతత్వాలతోపాటు ప్రాంతీయ, భాషాతత్వాలు దేశసమైక్యతకు సమగ్రతకు తీవ్రమైన సవాలుగా పరిణమించాయి. 19వ దశాబ్దం నుంచే ఈ విభిన్న సంకుచిత తత్వాలు జాతీయ సమైక్యతకు,

ఐక్యతకు ప్రమాదకరంగా పరిణమించాయని అనేకమంది రాజనీతి శాస్త్రవేత్తలు, రచయితలు పేర్కొన్నారు. ఈ రచయితలు ఈ విభిన్న తత్వాల స్వభావాన్ని, విస్తృతిని, పరిణామాలను విభిన్న కోణాల నుంచి సమగ్రంగా విశ్లేషించారు.

పాల్‌బ్రాస్ అభిప్రాయం ప్రకారం స్వాతంత్ర్యానంతరం మొదటి రెండు దశాబ్దాలపాటు భారతదేశం భాషాపరంగా అనేక తీవ్ర సమస్యలను ఎదుర్కొంది. ఈ సమస్యలలో అధికార భాషా సమస్య, భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటు, మైనారిటీ భాషల హోదా మొదలైన ప్రధానమైనవి. నెహ్రూ ప్రధానమంత్రిగా కొనసాగినకాలంలో దేశంలో తలెత్తిన భాషాపరమైన సమస్యలు తీవ్రతరం అయి హింసాత్మక సంఘటనలకు కూడా దారితీసాయి. అయితే నెహ్రూ ప్రభుత్వం ఈ సమస్యలను బహుళవాద పరిష్కారాల ద్వారా పరిష్కరించింది. అయితే నెహ్రూ అనంతర కాలంలో భాషా సమస్య గతంలో లేనివిధంగా సంక్లిష్టమై హింసాత్మక రూపాన్ని ధరించింది. దీనికి కేంద్రప్రభుత్వం అనుసరించిన జోక్యం కల్పించుకునే వ్యూహాలు, విధానాలు కొంతవరకు కారణమని పాల్‌బ్రాస్ అభిప్రాయపడ్డాడు. పాల్‌బ్రాస్ పంథాలో బిపిన్‌చంద్ర కూడా స్వాతంత్ర్యానంతరం మొదట 20 సం॥ల పాటు భాషా సమస్య వేర్పాటు శక్తిగా పరిణమించిందనీ, ఫలితంగా దేశ రాజకీయ, సాంస్కృతికగా ఐక్యత ప్రమాదంలో చిక్కుకొందనే అభిప్రాయాన్ని ప్రజలలో కల్పించిందని పేర్కొన్నాడు. బహుళ భాషలు కలిగిన భారతదేశంలో భాషా వైవిధ్యం కేంద్ర బిందువుగా అనేక రాజకీయ ఉద్యమాలు తలెత్తాయని కూడా రామేశ్‌థాపర్ సూచించాడు. రాజనీతి శాస్త్రవేత్తల అభిప్రాయం ప్రకారం భారతదేశంలో భాషాపరమైన విభేధాలు, సమస్యలు అధికార భాష (Official Language), భాషాయుక్త రాష్ట్రాల ఏర్పాటు ఫలితంగానే ఉత్పన్నమయ్యాయి.

ప్రభుత్వ అంచనాల ప్రకారం భారతదేశంలో అనేక వేల ప్రధాన, అప్రధాన భాషలు ఉన్నాయి. వీటిలో అనేక భాషలు కేవలం కొన్ని వందల మంది ప్రజలు మాత్రమే మాట్లాడే భాషలు. అంతేకాక అనేక భాషలకు లిపి లేదు. భారత రాజ్యాంగం భారతీయ భాషలలో 18 భాషలను మాత్రమే గుర్తించి, వాటిని 8వ షెడ్యూలులో పొందుపరిచింది. ఈ భాషలలో హిందీ, తెలుగు, బెంగాలీ, తమిళ, ఉర్దూ, గుజరాతీ, మరాఠీ మొదలగునవి ప్రధానమైనవి. వీటిలో హిందీ అత్యధిక సంఖ్యలో ప్రజలు మాట్లాడే భాష. హిందీ తరువాత తెలుగు, బెంగాలీ అత్యధిక సంఖ్యలో ప్రజలు మాట్లాడే భాషలు. భారత రాజ్యాంగం దేశంలో అత్యధిక సంఖ్యలో ప్రజలు మట్లాడే హిందీని రాజ్యభాషగా గుర్తించి, దానిని అధికార భాషగా ప్రకటించాలని ఆదేశించింది. రాజ్యాంగం ఆదేశానికి అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం 1963లో అధికార భాషల చట్టాన్ని ( Official Language Act 1963) 1965లో అమలులోకి వచ్చే విధంగా రూపొందించింది. ఈ చట్టం ప్రకారం దేశంలో హిందీ అధికార భాషగా ప్రకటించబడింది. ఈ చట్టం ఇంగ్లీషును అదనపు అధికార భాషగా కొనసాగించాలని కూడా నిర్దేశించింది. ఈ చట్టం ఫలితంగా కేంద్ర ప్రభుత్వ పాలన అధికార కార్యక్రమాలలో హిందీ భాషను మాధ్యమంగా వాడటం ప్రారంభమయినది. ఈ చట్టం ఆమోదించిన తరువాత ప్రధానమంత్రి నెహ్రూ హిందీయేతర రాష్ట్రాలలో హిందీని బలవంతంగా ప్రవేశపెట్టబడటం జరగదని పార్లమెంట్‌లో హామీ ఇచ్చారు. 1965లో కేంద్ర ప్రభుత్వం వివిధ రాష్ట్రాలలోని కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలలో అధికార కార్యకలాపాలలో మాధ్యమంగా హిందీని వాడటంలో 1965 జనవరి తరువాత సాధించిన ప్రగతిని నివేదించాలని ఆదేశించింది. కేంద్ర ప్రభుత్వ ఆదేశానికి హిందీ భాషేతర దక్షిణాది రాష్ట్రాలలో, ప్రధానంగా తమిళనాడులో తీవ్రమైన ప్రతిఘటన ఎదురైంది. ఈ దేశానికి ప్రతిచర్యగా తమిళనాడులో హిందీ, ఆ భాషా వ్యతిరేక ఉద్యమం చెలరేగింది. ప్రధానంగా విద్యార్థులు నిర్వహించిన ఈ ఉద్యమం అనేక నెలలపాటు తీవ్రస్థాయిలో సాగింది. ఈ ఉద్యమానికి తలఒగ్గిన కేంద్ర ప్రభుత్వం ఒక రాజభాషాసూత్రాన్ని ప్రతిపాదించింది. ఈ రాజభాషా సూత్రాన్ని దక్షిణాది రాష్ట్రాలు ఆమోదించాయి. ఈ సూత్రం ఆధారంగా కేంద్ర ప్రభుత్వం 1967లో అధికార భాషా సవరణ చట్టాన్ని ప్రవేశపెట్టింది. ఈ చట్టం పార్లమెంటులో ఇంగ్లీషు, హిందీలను ఉమ్మడిగా ఉపయోగించటాన్ని అనుమతించింది. హిందీని మాట్లాడే రాష్ట్రాలు, కేంద్రం మధ్య ఉత్తర ప్రత్యుత్తరాలలో హిందీని, కేంద్రం, హిందీ భాషేతర

రాష్ట్రాల మధ్య ఉత్తర ప్రత్యుత్తరాలలో ఇంగ్లీషు ఉపయోగించటానికి అనుమతించింది. ఈ చట్టం ఫలితంగా హిందీ భాషను మాట్లాడని రాష్ట్రాలలో ప్రభుత్వ కార్యకలాపాలలో మాధ్యమంగా ఇంగ్లీషును అధికృత కొనసాగటం ప్రారంభమయింది. అయితే 1960 దశాబ్దంలో దక్షిణాది రాష్ట్రాలు తమ మాతృ భాషలను రాష్ట్రస్థాయిలో అధికార భాషలుగా చేస్తూ చట్టాలు చేసాయి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్రంలో ప్రధానభాష అయిన తెలుగును అధికార భాషగా చేస్తూ 1966లో ఒక చట్టాన్ని ప్రవేశపెట్టింది. ఇదే విధంగా తమిళనాడు, కర్నాటక రాష్ట్రాలు కూడా తమ ప్రధాన భాషలైన తమిళం, కన్నడ భాషలకు అధికార భాషలుగా చేస్తూ చట్టాలను చేసాయి.

అధికార భాష విషయంలో కేంద్రం, రాష్ట్రాల మధ్య తలెత్తిన సంఘర్షణ సమసిపోగానే భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు సంబంధించిన కేంద్రం, రాష్ట్రాల మధ్య సంఘర్షణ ప్రారంభమైంది. ఈ సంఘర్షణ 1950 దశాబ్దం చివర వరకూ కొనసాగింది. భాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు ఉద్యమం మొట్టమొదటిసారిగా అప్పటి ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో భాగంగా ఉన్న ఆంధ్ర ప్రాంతంలో తలెత్తింది. ఈ ఉద్యమం ఫలితంగా 1955లో ప్రభుత్వం రాష్ట్రాల పునర్విభజన సంఘాన్ని నియమించింది. ఈ సంఘం నివేదిక ఆధారంగా 1956 వ సం॥లో కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాల పునర్విభజన చట్టాన్ని (States Recognization Act of 1956) ప్రవేశపెట్టింది. ఈ చట్టానికి అనుగుణంగా 1956లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రఅవతరణ జరిగింది. దేశంలో భాషా సూత్రం ఆధారంగా ఏర్పడిన మొట్టమొదటి రాష్ట్రం ఆంధ్రప్రదేశ్. 1960లో భాషా సూత్రం ప్రాతిపదికగా బొంబాయి రాష్ట్రం గుజరాత్, మహరాష్ట్ర అనే రెండు రాష్ట్రాలుగా విభజితమైంది. 1966లో పంజాబ్ రాష్ట్రం పంజాబ్, హర్యానా, హిమాచల్ ప్రదేశ్ అనే మూడు రాష్ట్రాలుగా విభజింపబడింది. ఇదే సూత్రం ప్రాతిపదికగా 1987 మే నెలలో గోవాకు రాష్ట్రప్రతిపత్తిని కల్పించారు.

స్వాతంత్ర భారతదేశంలో భాషకు సంబంధించి తలెత్తిన మరోప్రధాన సమస్య అల్పసంఖ్యాక భాషలకు సంబంధించింది. భారత రాజ్యాంగం అల్పసంఖ్యాక భాషలను మాట్లాడే మైనారిటీ ప్రజలకు కొన్ని హక్కులను, రక్షణలను కల్పించింది. రాజ్యాంగంలోని 350 ఎ, 20, 30, 350 అధికరణలు భాషాపరమైన అల్పసంఖ్యాక వర్గాల ప్రజలకు తమ భాషలను, లేదా సంస్కృతి గుర్తింపును రక్షించుకొనేందుకు, తమకు నచ్చిన విద్యాసంస్థలను ఏర్పరచుకొనేందుకు అవకాశాలను కల్పిస్తున్నాయి. ఈ వర్గాల ప్రజలు ఈ రాజ్యాంగ అధికరణలను అమలుపరిచేందుకు, తమ భాషలను గుర్తించాలనే తమ డిమాండ్లను సంతృప్తి పరచాలని ఆందోళనలను సాగించారు. కొన్ని రాష్ట్రాల ప్రభుత్వాలు అల్పసంఖ్యాక భాషల పట్ల వివక్షత ప్రదర్శించాయి. దీని ఫలితంగా కూడా ఆ రాష్ట్రాలలో ఆందోళనలు ప్రారంభమయ్యాయి. 1980 దశాబ్దంలో బీహార్, ఉత్తర ప్రదేశ్ రాష్ట్రాలలో ఉర్దూ భాషను మాట్లాడే మైనారిటీవర్గం తమ భాషకు తగిన ప్రతిపత్తిని కల్పించాలని ఆందోళనకు పూనుకున్నాయి. ఈ ఆందోళన ఫలితంగా ఆయా రాష్ట్రాలు ఉర్దూ భాషను రెండవ అధికారభాష హోదా కల్పించాయి. భాషా సంబంధమైన ఆందోళన పంజాబ్‌లో ప్రారంభమై చాలా కాలంపాటు కొనసాగింది. క్రమంగా ఈ తరహా భాషా ఉద్యమాలు అస్సాం, పశ్చిమ బెంగాల్‌లకు కూడా వ్యాపించాయి. పశ్చిమ బెంగాల్‌లో గుర్ఖాల్యాండ్ ఉద్యమం, అస్సాంలో బోడో ఉద్యమాలకు భాషా సమస్య ప్రాతిపదిక. 1980 దశాబ్దంలో ప్రారంభమైన ఈ ఉద్యమాలు నేటికీ కొనసాగుతుండటం గమనించవచ్చును.

## 9.5 జాతీయ సమైక్యత - ప్రాంతీయతత్వం :

భారతదేశంలో భాషా సమస్య తరువాత జాతీయ సమైక్యతకు, దేశ ఐక్యతకు ప్రమాదకరంగా పరిణమించిన మరో ప్రధాన అంశం ప్రాంతీయతత్వం. వాస్తవానికి భారత రాజకీయాలలో ప్రాంతీయతత్వం ఎప్పుడు ఒక ప్రధాన సమస్యగా పరిణమించలేదు. బిపిన్‌చంద్ర అభిప్రాయం ప్రకారం ఒక ప్రాంతంపట్ల, ఆ ప్రాంతం భాషా, సంస్కృతుల పట్ల ప్రత్యేకమైన అభిమానాన్ని కలిగివుండటం ప్రాంతీయతత్వం కాదు. ఒక ప్రాంతం లేదా రాష్ట్రం పట్ల గర్వం కలిగి ఉండటం కూడా

ప్రాంతీయతత్వం కాదు. రాజ్యాంగం సమాఖ్య లక్షణాలను సమర్థించటం కూడా ప్రాంతీయ తత్వం కాదు. దీనికి భిన్నంగా ఒకే ప్రాంతం లేదా రాష్ట్రం ప్రయోజనాలు మొత్తం దేశం లేదా ఇతర ప్రాంతాల ప్రయోజనాలకు వ్యతిరేకంగా ఉన్నప్పుడు, తన స్వప్రయోజనాల సాధనకు ఆ రాష్ట్రం ఘర్షణకు పాల్పడినపుడు దానిని ప్రాంతీయతత్వంగా పరిగణించవచ్చునని బిపిన్‌చంద్ర పేర్కొన్నాడు. ఈ కోణం నుంచి చూస్తే 1947 తరువాత భారతదేశంలో 1960 దశాబ్దంలో తమిళనాడులో తలెత్తిన డి.యం.కె. రాజకీయాలు మినహా భారతదేశంలో అంతర్ రాష్ట్ర సంఘర్షణలేవీ తలెత్తలేదనే చెప్పాల్సి ఉందని బిపిన్‌చంద్ర వాదించాడు. 1960 దశాబ్దం తరువాత కాలంలో డి.యమ్.కె. తన ప్రాంతీయ వాదాన్ని గణనీయంగా పరిమితం చేసుకుంది. 1980లో పంజాబ్‌లో ప్రాంతీయతత్వం తలెత్తినప్పటికీ, వాస్తవంలో పంజాబ్ సమస్యను మతతత్వ సమస్య పరిగణించాలే తప్ప ప్రాంతీయతత్వానికి సంబంధించిన సమస్యగా పరిగణించటం సమంజసంకాదని బిపిన్ చంద్ర అభిప్రాయపడ్డారు.

అయినప్పటికీ భారతదేశంలో అనేక సందర్భాలలో అనేక కారణాల ఫలితంగా ప్రాంతీయ ఘర్షణలు తలెత్తాయి. దేశంలోని వివిధ రాష్ట్రాల మధ్య అనేక కారణాలు, అంశాల కారణంగా వివాదాలు తలెత్తాయి. ఉదాహరణకు, నదీ జలాల పంపిణీ విషయంలో ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, పంజాబ్, హర్యానా, రాజస్థాన్‌ల మధ్య వివాదాలు తలెత్తాయి. సరిహద్దుల విషయంలో చెండీఘడ్, బెల్గాంల మధ్య సంఘర్షణ చోటుచేసుకుంది. ఇదే విధంగా భారీ నీటిపారుదల ప్రాజెక్టుల నిర్మాణం విషయంలో కొన్ని రాష్ట్రాల మధ్య వివాదాలు ఏర్పడ్డాయి.

ఏమైనప్పటికీ భారతదేశంలో ప్రాంతీయతత్వం లేదా ఒకే రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల మధ్య ఘర్షణలు పెరగటానికి అసమానతలను బలమైన కారణంగా పేర్కొనాల్సి ఉంది. ప్రాంతీయ అసమానతలకు అనేక కారణాలను పేర్కొనటం జరిగింది. ప్రధానంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృక్పథం ప్రాంతీయ అసమానతలకు శక్తివంతమైన కారణంగా పరిగణించారు. దీనితోపాటు ప్రభుత్వ విధానాలు, ప్రణాళీకరణ విధానంలో కల లోపాలు, రాజకీయ పార్టీల దృక్పథం మొదలైనవి ప్రాంతీయ అసమానతలకు ప్రధాన కారణాలు. ఈ కారణాల వల్ల దేశంలోని కొన్ని రాష్ట్రాలు అభివృద్ధి చెందటం, కొన్ని ఇతర రాష్ట్రాలు వెనుకబడి ఉండటం, అంతేకాక ఒకే రాష్ట్రంలో కొన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందటం, ఇతర ప్రాంతాలు ఎటువంటి అభివృద్ధికి నోచుకోక వెనుకబడి ఉండటం సంభవించింది. దీని ఫలితంగా దేశంలో ప్రాంతీయతత్వం అభివృద్ధి చెందిందని రాజనీతి శాస్త్రవేత్తల, రాజకీయ నిపుణుల అభిప్రాయం. బిపిన్‌చంద్ర ఆర్థికాభివృద్ధి తక్కువరేటు, భౌగోళిక, సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితులు కూడా ప్రాంతీయ అసమానతలకు ప్రధాన కారణాలని పేర్కొన్నాడు. ఆయన అభిప్రాయం ప్రకారం ప్రాంతీయ, ఆర్థిక అసమానతలు జాతీయ సమైక్యతకు, రాజకీయ స్థిరత్వానికి గట్టి ప్రమాదకరంగా పరిణమించాయి. అయితే ఈ అసమానతలు వెనుకబడిన రాష్ట్రాలపై అభివృద్ధి చెందిన రాష్ట్రాల దోపిడీకి, లేదా ఈ రాష్ట్రాలు కేంద్ర ప్రభుత్వం విచక్షణకు గురికావటం సంభవించలేదు. దీనికి బీహార్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్ వంటి రాష్ట్రాలకు లోక్‌సభలో 37 శాతం స్థానాలు ఉన్నప్పటికీ, అవి ఆర్థికంగా వెనుకబడి ఉండటం దానికి భిన్నంగా పంజాబ్, హర్యానా, మహారాష్ట్రలు ఆర్థికంగా అభివృద్ధి చెందినప్పటికీ వాటికి లోక్‌సభలో కేవలం 17 శాతం స్థానాలు ఉండటం ఒక కారణం. వెనుకబడిన రాష్ట్రాలలో ప్రాంతీయతత్వం లేకపోవటం లేదా వాటికి తాము విచక్షణకు గురిచేయబడ్డామనే భావం లేకపోవడానికే రాష్ట్రాల వెనుకబడిన తనానికి ఆయా ప్రభుత్వాల అసమర్థత, వైఫల్యాలే ప్రధాన కారణమనే విశ్వాసం. మేధావి వర్గంలో బలంగా ఉండటానికి ప్రధాన కారణం.

దిపాంకర్ గుప్తా అభిప్రాయం ప్రకారం భారతదేశంలో స్వాతంత్ర్యానంతరం తలెత్తిన వివిధ ఉద్యమాలలో ప్రాంతీయ ఉద్యమాలు కీలకమైనవి. అయితే ఈ ప్రాంతీయ ఉద్యమాలు పంజాబ్, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాలకు పరిమితం. ఈ రాష్ట్రాలలో అవతరించిన ప్రాంతీయ పార్టీల వల్ల ప్రాంతీయ ఉద్యమాలు బలోపేతం అయ్యాయి. ప్రాంతీయ ఉద్యమాలు ప్రధానంగా ఆర్థిక డిమాండ్ల ప్రాతిపదిక మీద తలెత్తినట్లు దిపాంకర్ గుప్త వాదించాడు.

## 9.6 ప్రాంతీయతత్వం రూపాలు :

భారతదేశంలో ప్రాంతీయ తత్వం ఈ క్రింది రూపాలలో తలెత్తిందని రాజకీయ నిపుణుల అభిప్రాయం.

### 1) వేర్పాటు వాదం (Secession from India) :

ఉదాహరణలు 1) ప్రత్యేక తమిళనాడు దేశం కోసం డిమాండు, 2) ప్రత్యేక నాగాలాండ్ దేశం కోసం డిమాండ్, 3) ప్రత్యేక మిజోరాం దేశం కొరకు డిమాండ్, 4) ఖలిస్థాన్ కొరకు డిమాండ్

### 2) ప్రత్యేక రాష్ట్రం కొరకు డిమాండ్ (Demand for Separate statehood) :

ఉదాహరణలు : ప్రత్యేక తెలంగాణా, విదర్భ, జార్ఖండ్, చత్తిస్ఘడ్, గుర్ఖాల్యాండ్, ఉత్తరాంచల్ రాష్ట్రాల కొరకు డిమాండ్.

### 3) అంతర్ రాష్ట్ర వివాదాలు :

ఉదాహరణలు : 1) మహారాష్ట్ర, మైసూర్ మధ్య సరిహద్దు వివాదం, 2) ఛండీఘడ్ కోసం పంజాబ్, హర్యానా రాష్ట్రాల మధ్య వివాదం, 3) అంతర్ రాష్ట్ర నదీజలాల వివాదం.

ఈ విధంగా భారతదేశంలో ప్రాంతీయతత్వం విభిన్న రూపాలలో తలెత్తింది. స్వాతంత్ర్యం సిద్ధించిన నాటినుండి దేశంలో ఏదో ఒక ప్రాంతంలో ప్రాంతీయతత్వం అవతరించి, ఏదో ఒక రూపంలో వ్యక్తమవుతున్నది. గత అయిదు దశాబ్దాల కాలంలో తలెత్తిన ప్రాంతీయతత్వం, సంఘర్షణలకు అనేక కారణాలు ప్రతిపాదించబడ్డాయి. అయితే వివిధ ప్రాంతాలలో తలెత్తిన ప్రాంతీయతత్వం కారణాలు, రూపాలు మొదలైన అంశాలలో ఎంతో భిన్నత్వముంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరించిన విధానాలు, దేశంలో ప్రాంతీయతత్వం అభివృద్ధిచెందటానికి ప్రధాన కారణమైందని పాల్‌బ్రాస్ మొదలైన రాజనీతి తత్వశాస్త్రవేత్తలు దృఢంగా వాదిస్తున్నారు.

ఎస్.కె. ఖన్నా అనే రచయిత అభిప్రాయం ప్రకారం భారతదేశంలో ప్రాంతీయతత్వం అభివృద్ధి చెందటానికి అనేక కారణాలు దోహదం చేసాయి. మొదటగా, దేశ ప్రజలపై ప్రత్యేకమైన భావజాలాన్ని, భాషను, సాంస్కృతిక విధానాలను బలవంతంగా విధించటానికి కేంద్రప్రభుత్వం కొన్ని సందర్భాలలో చేసిన ప్రయత్నాలకు ప్రతిస్పందనగా కొన్ని ప్రాంతాలలో ప్రాంతీయతత్వం అభివృద్ధి చెందింది. రెండు, అధికారంలో ఉన్న ప్రభుత్వం రాష్ట్రంలో కొన్ని ప్రాంతాలపై ఎక్కువ ప్రాధాన్యతను కనపరచటం, ఇతర ప్రాంతాలను నిర్లక్ష్యపరచటం వల్ల తమ నిర్లక్ష్యానికి గురైన ప్రాంతాలు అధికార వికేంద్రీకరణకు లేదా రాష్ట్ర విభజనకు డిమాండ్ చేయటం ప్రారంభమైంది. మూడు, దేశంలోని కొన్ని ప్రాంతాలు ప్రత్యేక సంస్కృతిని పరిరక్షించుకొనేందుకు, స్వపరిపాలన కొరకు చేస్తున్న ఆందోళన కూడా ప్రాంతీయతత్వానికి దారితీసాయి. నాలుగు, కొన్ని ప్రాంతీయ పార్టీలు రాజకీయ అధికారం కోసం ప్రాంతీయతత్వాన్ని పెంపొందింపచేస్తున్నాయి. చివరగా, వెనుకబడిన ప్రాంతాలలో ప్రజలలో పెరుగుతున్న చైతన్యం ప్రాంతీయ భావం అభివృద్ధి చెందేందుకు కారణమైంది.

ప్రస్తుతం దేశంలో కొన్ని ప్రాంతాలలో గోచరిస్తున్న ప్రాంతీయతత్వం భారత సమాజం బహుళవాద స్వభావాన్ని, ప్రజలలో పెంపొందిన చైతన్యాన్ని ప్రతిబింబిస్తున్నది. కొందరు రాజ్యాంగ నిపుణులు పేర్కొన్నట్లు భారతదేశంలో ప్రాంతీయతత్వం గత పరిణామం మాత్రమే కాదు, దేశంలో సంభవిస్తున్న ప్రగతి ఫలితంగా కూడా ప్రాంతీయతత్వం తలెత్తుతున్నది. ఈ కోణం నుంచి ప్రాంతీయతత్వాన్ని రాజకీయ అభివృద్ధి మార్గంలో ఒక మైలురాయిగా పరిగణించవచ్చును. అయితే, దేశం పారిశ్రామిక రంగం, పట్టణీకరణ, ఆధునికీకరణ, రవాణా, ప్రసారాలు, సమతుల్య అభివృద్ధి దిశలలో ప్రగతిని సాధిస్తే ప్రాంతీయతత్వం

క్షీణించే అవకాశంఉంది.

## 9.7 జాతీయ సమైక్యత సాధనకు జరిగిన కృషి - జాతీయ సమైక్యతా మండలి :

స్వాతంత్ర్యానంతరం భారతదేశంలో జాతీయ సమైక్యత సాధనలో అనేక సవాళ్లు ఎదురైనప్పటికీ వాటిని విజయవంతంగా అధిగమించారు. స్వాతంత్ర్యానంతరం దేశం ఎదుర్కొన్న తక్షణ సమస్య భారత యూనియన్‌లోనికి సంస్థానాల విలీనం. ఈ సమస్య సమర్ధవంతంగా పరిష్కరించబడి, దీని తర్వాత రాష్ట్రాల పునర్విభజనకు ప్రారంభమైన ఆందోళనలను కూడా సమర్ధవంతంగా పరిష్కరించారు. అయినప్పటికీ జాతీయ సమైక్యతకు ప్రమాదం కలిగించే ఏర్పాటువాదం తలెత్తి, కొన్ని ప్రాంతాలలో నేటికి కొనసాగుతున్నది. స్వాతంత్ర్యానంతరం దేశసమైక్యతకు ప్రమాదం కలిగిస్తున్న పేదరికం, నిరుద్యోగం, కనీస అవసరాల కొరత మొదలైన అనేక ఆర్థిక సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం అనేక చర్యలను చేపట్టింది. దేశంలో పేదరికాన్ని నిర్మూలించిన, దేశం సామాజిక, ఆర్థికంగా అభివృద్ధి పరిచేందుకు ప్రణాళికాబద్ధమైన కృషి ప్రారంభమైంది. వివిధ పంచవర్ష ప్రణాళికలలో ఆర్థికాభివృద్ధికి అనేక రకాల వ్యూహాలు, పథకాలను రూపొందించి, భారీ నిధులతో వాటిని అమలుపరిచారు. ప్రభుత్వం చేపట్టిన బహుముఖ సృష్టి ఫలితంగా దేశంలో వివిధ రంగాలు, గణనీయమైన ప్రగతిని సాధించాయి. ప్రధానంగా వ్యవసాయ, పారిశ్రామిక రంగాలలో అధికోత్పత్తి సాధింపబడింది. దానితోపాటు సాంకేతిక, విజ్ఞాన, విద్యా, ఆరోగ్య రంగాలలో గూడా దేశం అద్భుతమైన పురోభివృద్ధిని సాధించింది. వీటన్నిటి ఫలితంగా దేశంలో పేదరికం వేగంగా క్షీణించటంతోపాటు ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయి.

జాతీయ సమైక్యత సాధనకు సాంస్కృతిక, సామాజికపరమైన సమైక్యత అవసరం. సామాజిక సమైక్యతకు సామాజిక న్యాయం సాధన ఒకప్రధాన ఆవశ్యక పరిస్థితి. స్వాతంత్ర్యానంతరం ఏర్పడిన జాతీయ ప్రభుత్వం లక్ష్యాలలో సామాజిక న్యాయాన్ని సాధించటం అతి కీలకమైన లక్ష్యంగా రూపొందింది. స్వాతంత్ర్యానంతరం అమలులోకి వచ్చిన రాజ్యాంగం ఆదేశిక సూత్రాల ద్వారా సామాజిక న్యాయాన్ని సాధించేందుకు ప్రభుత్వం చేపట్టవలసిన కార్యక్రమాలను నిర్దిష్టంగా సూచించింది. ఈ ఆదేశిక నియమాల ఆచరణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దేశంలోని సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన తరగతుల ప్రజల అభ్యున్నతికి బహుముఖ కృషిని చేపట్టాయి. ఈ వర్గాల ప్రజల అభివృద్ధికి అనేకరకాల రిజర్వేషన్లను ప్రవేశపెట్టడంతోపాటు, వివిధ పంచవర్ష ప్రణాళికలలో అనేక వ్యూహాలను, పథకాలను రూపొందించి అమలుపరిచారు. అనేక సంస్థలను నెలకొల్పారు. ప్రభుత్వంచేపట్టిన కృషి దేశంలోని బలహీన వర్గాలుగా గుర్తించబడిన షెడ్యూల్డు కులాలు, తెగలు, ఇతర వెనుకబడిన తరగతులకు చెందిన వర్గాల ప్రజల జీవితాలలో నూతన వెలుగులను నింపింది. ఈ వర్గాల ప్రజలు బహుముఖాభివృద్ధిని సాధించి, జాతీయజీవన ప్రవంతిలో మమేకం చెందారు. అయినప్పటికీ దేశంలోని వివిధ వర్గాల ప్రజల మధ్య మత, కుల, భాషా, ప్రాంతీయపరమైన విభేదాలు పూర్తిగా సమసిపోలేదు. అవి జాతీయ సమైక్యతను సాధించేమార్గంలో శక్తివంతమైన నిరోధకాలుగా కొనసాగుతున్నాయి. ఈ విధంగా దేశంలో జాతీయ సమైక్యత సాధనకు అవసరమైన సామాజిక, సాంస్కృతిక, ఆర్థిక, రాజకీయ సమైక్యతను సాధించేందుకు ఇతోధికమైన కృషి జరగవలసి ఉంది.

దేశంలో నెలకొన్న సామాజిక, సాంస్కృతిక పరిస్థితులు, స్వాతంత్ర్యం వచ్చిన వెంటనే సంభవించిన విపరీతమైన పరిణామాల నేపథ్యంలో ప్రభుత్వం జాతీయ సమైక్యతా సాధనను ఒక కీలక లక్ష్యంగా చేపట్టవలసిన ఆవశ్యకత ఏర్పడింది. దీనికి అనుగుణంగానే ప్రభుత్వం దేశ సామాజిక, ఆర్థికాభివృద్ధితోపాటు, జాతీయ సమైక్యతను ఒక ప్రధాన లక్ష్యంగా చేసుకొని ఈ దేశంలో బహుముఖ కృషిని చేపట్టింది. ఈ కృషిలో 1961లో జాతీయ సమైక్యతా మండలి (National Integration Council) స్థాపన ప్రధానమైంది. జాతీయ సమైక్యతా మండలి స్థాపన వెనుకాల ఆశయాలు ఈ క్రిందివి -

1) భిన్నత్వంలో ఏకత్వం, మతపరమైన స్వేచ్ఛ, లౌకికవాదం, సమానత్వం, సామాజిక, ఆర్థిక న్యాయం మొదలైన విలువలను పెంపొందింపచేయటం.

2) దేశంలో మత ఘర్షణలను నివారించి, వివిధ వర్గాల, మతాల ప్రజల మధ్య సామరస్యం, ఐకమత్యం పెంపొందేలా కృషిచేయటం.

3) దేశ సమైక్యతకు, సమగ్రతకు హానికలిగించే సంఘ విద్రోహకశక్తుల కార్యకలాపాలను అరికట్టేందుకు రాజకీయ పార్టీలు, స్వచ్ఛంద సేవాసంస్థలు, వివిధ ప్రజాసంఘాల సహాయంతో తగిన చర్యలను చేపట్టటం.

4) జాతీయ సమైక్యతా, సమగ్రతల సాధనకు మత, కుల, వర్గ, భాష, ప్రాంతీయ విభేదాలను మరచి, సమైక్యంగా కృషిచేసేలా ప్రజలలో ప్రేరణను కల్పించం అందుకు తగిన చర్యలను చేపట్టటం.

1961లో జాతీయ సమైక్యతా మండలి అప్పటి ప్రధాన మంత్రి నెహ్రూ అధ్యక్షతన తన మొట్టమొదటి సమావేశాన్ని నిర్వహించింది. ఈ సమావేశంలో దేశసమైక్యతకు, సమగ్రతకు ప్రమాదం కలిగిస్తున్న వివిధ వ్యక్తులను నిర్మూలించి, దేశ ఐక్యత, సమైక్యతను పరిరక్షించేందుకు అనేక సూచనలను చేసారు. ఈ సమావేశం వల్ల ఆశించిన ప్రయోజనం చేకూరింది. ప్రధానంగా ఈ సమావేశ అనంతరం స్వల్పకాలంలోనే సంభవించిన చైనా యుద్ధం సమయంలో దేశంలోని ప్రజలు కుల, మత, ప్రాంతీయ, వర్గ విభేధాలకు అతీతంగా సమైక్యమయ్యారు.

1968 జూన్‌లో ప్రధానమంత్రి శ్రీమతి ఇందిరాగాంధీ అధ్యక్షతన జాతీయ సమైక్యతా మండలి రెండవసారి సమావేశమైంది. ఈ సమావేశంలో జాతీయ సమైక్యతా సాధనకు చేపట్టవలసిన కృషిలో భాగంగా జాతీయ విధాన ప్రకటనను రూపొందించారు. ఈ సమావేశంలో ఆమోదించిన తీర్మానాల అమలుకు కేంద్ర ప్రభుత్వం దేశంలోని ప్రముఖ రచయితలతో ఒక సంఘాన్ని నియమించింది. జాతీయ సమైక్యతను సాధించేందుకు తగిన వ్యూహాన్ని రూపొందించటం, దేశ ప్రజలలో ఐక్యత, సామరస్యం, సహనం, మొదలైన విలువలను ప్రచారం చేసేందుకు తగిన సాంస్కృతిక, సాహిత్యపరమైన సాధనలను సూచించటం, ఈ సంఘానికి అప్పగించిన ప్రధాన కర్తవ్యాలు ఈ సమావేశం తరువాత దేశంలో జాతీయ సమైక్యలను పెంపొందింపచేసే చర్యలు ముమ్మరంగా చేపట్టబడ్డాయి. 1969లో జాతీయ సమైక్యతా మండలికి చెందిన శాశ్వత సంఘం సమావేశమై, జాతీయ సమైక్యతకు చేపట్టవలసిన అనేక చర్యలను సూచించింది. 1976 నవంబరులో ప్రధానమంత్రి శ్రీమతి ఇందిరాగాంధీ అధ్యక్షతన జాతీయ సమైక్యతా మండలి మరోసారి సమావేశమై ప్రజలలో సమైక్యతా, ఐక్యత భావనలను పెంపొందింప చేసేందుకు ఏడు అంశాల కార్యాచరణ పథకాన్ని ప్రతిపాదించింది. దేశంలో వేర్పాటు, ఉగ్రవాద శక్తులను నిర్మూలించటం, ప్రజలలో ఆధునిక భావనలను పెంపొందింపచేయటం, వివిధ వర్గాలకు చెందిన బాలబాలికలలో ఐకమత్యాన్ని సాధించటం, ప్రచార సాధనాల ద్వారా ప్రజలలో ఛాందస భావాలను, మూఢ నమ్మకాలను నిర్మూలించటం ఈ కార్యాచరణ పథకంలో ప్రతిపాదించిన ప్రధాన చర్యలు.

1977లో కేంద్రంలో ఏర్పడిన జనతా ప్రభుత్వం జాతీయ సమైక్యతపై ప్రాధాన్యతను కనపరచి, ఆ దిశలో కొన్ని కీలక చర్యలను చేపట్టింది. 1978లో కేంద్ర ప్రభుత్వం దేశంలోని మైనారిటీ ప్రజల ప్రయోజనాల, హక్కుల పరిరక్షణకు మినుమసాని అధ్యక్షతన మైనారిటీ కమీషన్‌ను నియమించింది. ఈ కమీషన్ తన లక్ష్యాల సాధనకు అనేక చర్యలను చేపట్టుతుంది.

## 9.8 సారాంశము :

ఈ పాఠంలో వివరించినట్లు భారతదేశం అనేక వైవిధ్యాలను కలిగిఉండటం చేత జాతీయ సమైక్యత అత్యంత కీలకమైన ఆవశ్య పరిస్థితిగా రూపొందింది. జాతీయ సమైక్యతా సాధన అత్యంత క్లిష్టమైన ప్రక్రియ అయింది. అయితే భారతదేశంలో

నెలకొనివున్న వైవిధ్యాలు జాతీయ సమైక్యతను, సమగ్రతను సాధించటాన్ని నిరోధించలేకపోయాయి. మొదటి నుంచి భారతీయ సమాజం వైవిధ్యాలను కొనసాగిస్తూనే మరోప్రక్క దేశసమైక్యతను, సమగ్రతలను పరిరక్షించుకొంటూ వస్తున్నది. దీనికి భారతదేశానికి సంక్రమించిన రాజకీయ, సామాజిక వారసత్వం, ఈ వారసత్వాన్ని ప్రతిబింబించిన రాజ్యాంగం దోహదం చేశాయి. కాని ఈ వైవిధ్యాల ఫలితంగా భారతదేశం మతతత్వం, భాషాతత్వం, ప్రాంతీయతత్వం మొదలైన రూపాలలో దేశసమైక్యతకు హాని కలిగించే అనేక సవాళ్ళను ఎదుర్కొనక తప్పలేదు. అయితే ఈ సవాళ్ళు విజయవంతంగా అధిగమించబడటంతో, దేశ సమైక్యత చెక్కుచెదరలేదు. ఈ సవాళ్ళకు పరిష్కార మార్గం భారతదేశం వారసత్వంగా పొందిన రాజకీయ, సామాజిక, సాంస్కృతిక విలువలు అంతర్లీనంగా ఉంది. భారతదేశ సమాజంలో వేళ్ళూనుకున్న ప్రజాస్వామ్య వ్యవస్థే భవిష్యత్తులో దేశం ఎదుర్కొనే అన్ని సమస్యలను పరిష్కరించగలదనే ప్రజలలో కల దృఢవిశ్వాసమే ఎన్ని అవాంతరాలు ఎదురైనప్పటికీ, జాతీయ సమైక్యత, సమగ్రతలు పదిలంగా ఉంటాయనే ఆశాపూరిత వాదానికి ఊపిరి.

## 9.9 మాదిరి ప్రశ్నలు :

1. భారతదేశంలో జాతీయ సమైక్యత ఆవశ్యకతను వివరించండి.
2. భారతదేశంలో జాతీయ సమైక్యత సాధనకు ఎదురవుతున్న వివిధ రకాల సవాళ్ళను, సమస్యలను పరిశీలించండి.
3. భారతదేశంలో జాతీయ సమైక్యత సాధనకు ప్రభుత్వం చేసిన కృషి, దాని ఫలితాలను వివరించండి.
4. భారతదేశంలో జాతీయ సమైక్యతకు సవాల్‌గా పరిణమించిన భాషా, ప్రాంతీయ తత్వాలను విశ్లేషణాత్మకంగా పరిశీలించండి.

## 9.10 చదువదగిన గ్రంథాలు :


1. Paul R. Brass, The Politics of India, since Independence, Cambridge : Cambridge University Press, 1990 (2nd Edition).
2. Bipin Chandra and others, India After Independence - 1947 - 2000, New Delhi, Penguin Books, 2000.
3. Atul Kohli (ed.), The Success of India's Democracy, Cambridge : Cambridge University Press, 2001.
4. Rajani Kothari, Politics in India, Bostan : Little Brown and Company, 1970.
5. Rajani Kothari, Caste in Indian Politics, New Delhi : Orient Logman, 1970.
6. Sudipta Kavi Raj (ed.) New Delhi : Oxford University Press, 1997.
7. A.P. Avasthi, Indian Political System, Agra : Lakshminarain Agarwal, 2002.


**రచయిత : ప్రొఫెసర్. ఎమ్. బాపూజీ**

పాఠం - 10

# రాజకీయ ప్రక్రియ గతిశీలత - కులం, మతం, తెగల పాత్ర

**విషయసూచిక**


**10.0** లక్ష్యం

**10.1** ఉపోద్ఘాతం

**10.2** భారతదేశంలో మత రాజకీయాలు - నేపధ్యం

**10.3** భారతదేశ మతతత్వం భావన

**10.4** భారతదేశంలో రాజకీయాలపై మతం ప్రభావం

**10.5** భారతదేశంలో మతతత్వానికి కారణాలు

**10.6** లౌకికవాదం

**10.7** భారతదేశంలో రాజకీయాలలో కులం పాత్ర

**10.8** కులం - భారత రాజ్యాంగం

**10.9** రాజకీయాలు - కులం సంబంధాలు

**10.10** షెడ్యూల్డ్ తెగలు లేక గిరిజనులు - రాజకీయ ప్రక్రియ

**10.11** సారాంశం

**10.12** మాదిరి ప్రశ్నలు

**10.13** చదువదగిన గ్రంధాలు


## 10.0 లక్ష్యం :

భారతదేశంలో రాజకీయ ప్రక్రియ గతిశీలతను వివరించడటం ఈ పాఠం ప్రధాన లక్ష్యం. ఈ లక్ష్యానికి అనుగుణంగా ఈ పాఠం క్రింది అంశాలపై తన దృష్టిని కేంద్రీకరించింది.

1. భారతదేశంలో రాజకీయాలలో మతం, కులం పాత్ర
2. భారతదేశ రాజకీయాలలో తెగ పాత్ర
3. భారత రాజకీయాలలో మతం, కులం తెగ పాత్రలపై వివిధ పరిశోధనలు వెల్లడించిన వాస్తవాలు.

## 10.1 ఉపోద్ఘాతం :

భారతదేశంలో చరిత్ర ప్రారంభం నుండి రాజకీయాలు, మతం, కులం, తెగ (Tribe) సమానాంతర వ్యవస్థలుగా కొనసాగుతూ వస్తున్నాయి. ఈ నాలుగు వ్యవస్థల మధ్య సంఘర్షణ ఉన్నప్పటికీ అవి పరస్పరం ప్రభావితం అవుతున్నవి. స్వాతంత్ర్యానంతరం

దేశ రాజకీయాలలో కులం, మతాలకు పాత్ర గణనీయంగా పెరగటంతో అవి రాజకీయ పరిసరాలతో విడదీయలేని విధంగా మమేకం చెందాయి. పాశ్చాత్య, భారతీయ సమాజ శాస్త్రవేత్తల భారతదేశ రాజకీయ విశ్లేషణల్లో కులం, మతం కీలకమైన స్థానం కల్పించబడింది. దేశంలో ఎన్నికల నిర్వహణ ప్రారంభమయ్యాక ఎన్నికలలో ప్రజల సమీకరణకు మతం, కులం అత్యంత ప్రధానమైన సాధనాలుగా రూపొందాయి. ఇంతేకాక అవి ఓటర్ల ప్రవర్తనను ప్రభావితం చేసే కీలక అంశాలుగా కూడా రూపొందాయి. భారతరాజకీయాలలో మతం, కులం తర్వాత కీలకపాత్ర వహిస్తున్న మరో సామాజిక అంశం తెగ (Tribe). తెగ భారతదేశ రాజకీయాలలో కులం, మతం పాత్రలకు భిన్నమయిన పాత్రను పోషిస్తున్నది. ప్రధానంగా ఈశాన్య రాష్ట్రాలైన నాగాలాండ్, మిజోరాం, అరుణాచల్‌ప్రదేశ్, త్రిపురా, అస్సాం మొదలైన షెడ్యూల్డ్ తెగలు అత్యధిక సంఖ్యలో ఉన్న రాష్ట్రాలలో రాజకీయాలపై షెడ్యూల్డ్ తెగల ప్రభావం గణనీయంగా ఉంది. ఇదే విధంగా వీరి జనాభా గణనీయసంఖ్యలో ఉన్న బీహార్, ఒరిస్సా, మధ్యప్రదేశ్, ఆంధ్రప్రదేశ్ వంటి రాష్ట్రాల రాజకీయాలను వీరు ప్రభావితం చేస్తున్నారు. భిన్న భౌగోళిక, సామాజిక, సాంస్కృతిక, ఆర్థిక నేపధ్యంకల షెడ్యూల్డ్ తెగల ప్రజలు దేశ జాతీయ జీవన స్రవంతిలో లీనంకావటంలో అనేక సమస్యలను ఎదురుకొంటున్నారు. అందుచేత వీరు తన ప్రత్యేక గుర్తింపును కొనసాగించేందుకు ఉద్యమాలు చేపట్టారు.

## 10.2 భారతదేశంలో మత రాజకీయాలు - నేపథ్యం :

భారతదేశంలో రాజకీయ వ్యవస్థను ప్రభావితం చేసే అంశాలలో మతం అత్యంత ప్రధానమైంది. ఈ దేశంలో మత వ్యవస్థను అర్థం చేసుకోకుండా రాజకీయ ప్రక్రియ అవగాహన అసాధ్యమని రాజనీతి శాస్త్రవేత్తల ఏకాభిప్రాయం. మిగతా సాంప్రదాయ సమాజాల్లాగే భారతదేశంలో కూడా రాజకీయ అధికారం పాత్రను మత సిద్ధాంతం నిర్ధారిస్తున్నది. సుదీప్తాకవిరాజ్ అభిప్రాయం ప్రకారం భారతదేశంలో హిందూ మత వ్యవస్థను, ప్రధానంగా కుల వ్యవస్థను రాజ్యాధికారం మార్పుచేయలేదు. కానీ అధికారంలో ఉన్న నాయకులు కుల వ్యవస్థ విధించే నియమాలను పాటించవలసి ఉన్నది. ఈ దేశంలో ఆధునికీకరణ సమాజాన్ని లౌకీకరణ (Secularization) ప్రక్రియకు గురిచేసింది. దీని ఫలితంగా సమాజంలోని సామాజిక అంశాలపై మతం నియంత్రణ తొలగించటం జరిగింది. అంతేకాక దేశంలోని వివిధ మతాచారాలను ప్రజలు అనుసరించే మతాచారాలు రాజ్యం ప్రవేశపెట్టిన లౌకిక చట్టాల పరిధిలోకి తెచ్చారు.

వలస పాలనా కాలంలో పాలకులు భారత సమాజాన్ని ఒక విశిష్టమైన సమాజంగా పరిగణించారు. ఈ పాలకులు మతాన్ని భారత సామాజిక జీవితంలో, రాజకీయ ప్రవర్తనలో అతి కీలకమైన అంశంగా పరిగణించారు. వలస పాలకులు దేశంలోగల రెండు ప్రధాన మతాల మధ్య విభేదాలను ప్రోత్సహించారు. దీని ఫలితంగా ఈ రెండు మత వర్గాల మధ్య తలెత్తే సంఘర్షణను ఉపయోగించుకొని భారతదేశంలో తమ అధికారాన్ని పదిలపరుచుకోవచ్చునని వలసపాలకులు ఆశించారు.

భారత జాతీయోద్యమ కాలంలో జాతీయ ఉద్యమ నాయకత్వం రాజ్యం, మతం సంబంధాల పట్ల నాలుగు భిన్న ధోరణులను ప్రదర్శించింది. మొదటి రెండు ధోరణుల ప్రకారం హిందూ, ముస్లిం వర్గాల ప్రజలలో కల మతతత్వం గుర్తించబడింది. ఈ మతతత్వం ఫలితంగా ఈ రెండు మతాల ప్రజలు ఒకేదేశంలో నివసించటం సాధ్యం కాదని గుర్తించారు. ముస్లిం మతతత్వం కారణంగా పాకిస్థాన్ అవతరించింది. మూడవ ధోరణి ప్రకారం భారతదేశంలో సామాజిక, రాజకీయ జీవితంలో మతం కేంద్ర బిందువు వంటిది. అయితే మతం పరస్పర గౌరవాన్ని, సహనాన్ని ప్రభోదిస్తుంది. అందుచేత భారతదేశంలో రాజ్యానికి మత సహనం ప్రధాన ఆధారం కావాలని ఈ ధోరణి ఉద్ఘాటించింది. ఈ ధోరణిని ప్రధానంగా గాంధీజీ ప్రతిపాదించాడు. నాల్గవ ధోరణిని ప్రదర్శించిన నెహ్రూ, ఇతర ఉదారవాద మార్క్సిస్టు నాయకులు భారతదేశంలో రాజ్యం నాస్తిక, లౌకిక వాదాన్ని అనుసరించాలని వాదించారు.

స్వాతంత్ర్యానంతరం మత ప్రాతిపదిక మీద సంభవించిన దేశవిభజన భారతరాజ్యాంగాన్ని గాఢంగా ప్రభావితం చేసింది. దేశ విభజన సమయంలో సంభవించిన మత కల్లోలం, ఒక మతోన్మాది చేతిలో గాంధీ హత్య, భవిష్యత్తులో సంభవించేందుకు అవకాశం ఉన్న మతసమీకరణలు మొదలైన అంశాల నేపధ్యంలో దేశంలోని మైనారిటీ వర్గాల ప్రజల హక్కులను, ప్రయోజనాలను రక్షించటానికి అధిక ప్రాధాన్యతను కనపరిచే లౌకిక రాజ్యాంగాన్ని రూపొందించారు. ఈ రాజ్యాంగ వ్యవస్థ ఫలితంగా దేశంలో చాలాకాలంపాటు మత ప్రమేయం లేకుండా రాజకీయ వ్యవస్థ కొనసాగటమేకాక మతశక్తులు చురుకుగా ప్రవర్తిస్తున్నప్పటికీ రాజకీయ వ్యవస్థకు ఎలాంటి ప్రమాదాన్ని కలిగించలేదు.

కానీ 1980 దశాబ్దం ద్వితీయార్థం నుండి దేశంలో ఊహించని విధంగా, మతతత్వం ప్రబలి మతతత్వ రాజకీయాలకు దారితీసింది. అప్పటి నుంచి దేశంలో రాజకీయాధికారానికి, మతానికి మధ్య అతి సన్నిహితమైన సంబంధం ఏర్పడింది. కొందరు లౌకిక ప్రజాస్వామ్య రాజకీయవిధానాన్ని తిరస్కరించారు. అయినప్పటికీ దేశంలో మతతత్వ రాజకీయాల మనుగడపై సందేహం వ్యక్తమైంది. కొందరు రాజనీతి శాస్త్రవేత్తలు 1990 దశాబ్దంలో దేశంలో భిన్నరకాల మతపరమైన సంఘటనలు తలెత్తినట్లు గుర్తించారు. అవి 1) దేశ వివిధ రాష్ట్రాలలో భారతీయ జనతాపార్టీ బలం పుంజుకోవటం ఫలితంగా అభివృద్ధిచెందిన హిందూ జాతీయతత్వం. అయితే ఈ ప్రక్రియలో ఇతర రాజకీయ పార్టీల పాత్ర కూడా గణనీయమైందే. 2) కాశ్మీర్, పంజాబ్‌లలో తలెత్తిన వేర్పాటు వాదానికి కొంతమేరకు మతపరమైన స్వభావం ఉండటం; 3) మైనారిటీ, మెజారిటీ మతవర్గాలు పరస్పరం సమర్థించుకోవటం; ఏమైనప్పటికీ దాదాపు ఐదు దశాబ్దాల కాలంలో దేశంలో పెట్టుబడిదారీ వ్యవస్థ ప్రజాస్వామ్య వ్యవస్థలు విజయవంతమైనప్పటికీ మతతత్వం తలెత్తటానికి కారణాలను విశ్లేషించటం సులభం కాదని పరిశోధకుల అభిప్రాయం.

## 10.3 భారతదేశ మతతత్వం భావన :

భారతదేశంలో మతతత్వానికి వలసపాలన కాలంలోనే బీజాలుపడ్డాయి. కొందరు చరిత్రకారుల అభిప్రాయం ప్రకారం రాజకీయాలలో వేర్పాటువాదం, మతం రాజకీయకీరణ భారతదేశానికి బ్రిటీష్ వలసపాలన చేసిన గొప్ప హాని. బ్రిటీష్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ విధమైన రాజకీయశైలి ప్రక్రియ అంతిమంగా దేశ విభజనకు దారితీసింది. బ్రిటీష్ ప్రభుత్వం అనుసరించిన ఆధునికి రాజ్యనిర్మాణానికి మతం ప్రాతిపదిక అనే సూత్రం భారత ఉపఖండానికి, మొత్తం దక్షిణాసియాకు ఒక తీవ్రమైన సమస్యగా పరిణమించింది. ఈ సమస్య అటు భారతదేశంలో, ఇటు పాకిస్తాన్‌లో నిరంతరమైన సంక్షోభానికి దారితీసింది. ఈ సమస్య ఫలితంగా భారతదేశంలో మతపరమైన రాజకీయాలు, చట్టబద్ధతను సంతరించుకున్నాయి. భారతదేశం అనుసరిస్తున్న లౌకికవాదానికి విఘాతాన్ని కల్గించింది.

మతతత్వం మతానికి లేదా మత ఛాందసత్వానికి లేదా సాంప్రదాయతత్వానికి సమాన అర్థంగల పదంగా ఉపయోగించబడుతున్నది. కొన్ని సందర్భాలలో మతతత్వం అంటే ఒక నిర్ధిష్టమైన మతానికి చెందటం అని కూడా అర్థం చెప్పబడుతున్నది. కానీ ఈ పదాలేవీ మతతత్వం స్వభావాన్ని ఖచ్చితంగా ప్రతిబింబించవు. ఒక నిర్ధిష్ట ప్రయోజనానికి మతాన్ని వినియోగించటమే మతతత్వానికి ఖచ్చితమైన అర్థం అని చెప్పవలసి ఉంది. ఒక మతాన్ని ఇతర మతాలకు, లేదా ఒక దేశానికి వ్యతిరేకంగా ఉపయోగించటమే మతతత్వంగా పరిగణించాలి. అంతేకాక ఒక లౌకిక గణతంత్ర రాజ్యానికి చెందిన పౌరులు తమ సానుభూతిని, సహాయాన్ని, సామాజిక సేవలను మొత్తం దేశానికికాక, తాము జన్మించిన మతానికి మాత్రమే పరిమితం చేయటమే మతతత్వానికి వాస్తవమైన అర్థం.

రాజకీయాలలో మతతత్వం మౌళికంగా ఒక రాజకీయ వ్యవస్థలో ఒక రాజకీయ ప్రయోజనాన్ని ఆశించి ప్రాధమిక కీలక గణంగా ఒక మతం పట్ల ప్రత్యేకమైన అభిమానం కలిగి ఉండటం అనే సైద్ధాంతిక భావజాలం. ఈ దృక్పథంలో మతతత్వాన్ని

సాంప్రదాయ ప్రతిస్పందనగాకాక, ఆధునిక ప్రతిస్పందనగా పరిగణించాల్సి ఉంటుంది. మతతత్వం ఒక రాజకీయ మతాన్ని తన రాజకీయ ఆకాంక్షలకు, చర్యలకు ప్రాతిపదికగా పరిగణిస్తుంది.

ఒక మతతత్వవాదికి రాజకీయాలలో, ప్రభుత్వ వ్యవహారాలలో కేవలం మతం మాత్రమే ఉపయుక్తమైన, మాన్యత కలిగిన అంశంగా గోచరిస్తుంది. అంతేకాక మతతత్వవాది రాజకీయ వ్యవస్థ, దాని సంస్థలకు రాజకీయపార్టీ వ్యవస్థ, పాలనా యంత్రాంగం మాదిరే మతం గుర్తింపు ఆధారంగా ఆచరణాత్మక పునాది ఏర్పరచవచ్చునని భావిస్తాడు. మతతత్వం ఒక దేశాన్ని లేదా జాతి రాజ్యాన్నికాక మతాన్ని రాజకీయ విశ్వాసానికి అంతిమ కీలక ఆధారంగా పరిగణించే రాజకీయ దృక్పథం. ఆధునికీకరణకు, జాతి నిర్మాణానికి మతతత్వం గొప్ప అవరోధం. ఈ విధంగా మతతత్వం జాతీయవాదాన్ని వ్యతిరేకించే బహుళజాతి, బహుళమత, బహుభాషల సమ్మేళనం. ఇతర మతాల్ని వ్యతిరేకించే విధంగా మతాన్ని రాజకీయకీరణ చేయడం మతతత్వం కీలకాంశం. వర్తమాన భారతదేశంలో మతతత్వం తీవ్రమైన విధ్వంసపూరితమైన సైద్ధాంతిక భావజాలం. జవహర్‌లాల్‌నెహ్రూ మతతత్వాన్ని ఫాసిజం భారతదేశ రూపంగా అభివర్ణించాడు. మతతత్వం ఏ రూపంలోనైనా అవాంఛనీయమైందని నెహ్రూ పేర్కొన్నాడు. భారతదేశంలో మైనారిటీ మతతత్వ వాదం భయం కారణంగా, మెజారిటీ మతతత్వం రాజకీయ ప్రతిచర్యగా అవతరించాయని ఆయన నొక్కిచెప్పారు. అందుచేత మతతత్వం మీద రాజీపడే ప్రశ్నేలేదని, ఎందుచేతనంటే హిందూమతతత్వం లేదా ముస్లిం మతతత్వం భారతజాతీయతకు, జాతీయవాదానికి ఒక గొప్ప సవాలు అని నెహ్రూ ఉద్ఘాటించాడు.

## 10.4 భారతదేశంలో రాజకీయాలపై మతం ప్రభావం :

ప్రస్తుత భారతదేశంలో నెలకొన్న మతత్వాన్ని రాజకీయంచేసే సాంప్రదాయాల నేపథ్యంలో దేశరాజకీయ వ్యవస్థను మతతత్వాన్నుంచి వేరుపరచటం సులభమైన ప్రక్రియకాదు. భారతదేశం కట్టుబడిన వయోజన ఓటింగ్ విధానం, ఎన్నికలు, పోటీతత్వం గల రాజకీయ పార్టీ వ్యవస్థ దేశంలోని జాతీయ మతతత్వ రాజకీయ పార్టీలకు, సామాజిక, సాంస్కృతిక వ్యవస్థలకు చట్టబద్దతను, చట్టపరమైన రక్షణను కల్పించాయి. ఈ విధంగా రాజకీయ వ్యవస్థ సకారాత్మక కార్యచక్రం, ప్రక్రియ అన్నిరకాల మతతత్వ సంస్థలకు విస్తృతమైన రక్షణ కల్పించింది. దేశంలోని ప్రజాస్వామ్యేతర సంస్థలకు సైతం ప్రజాస్వామ్యయుతమైన రక్షణ కల్పించబడింది. ఈ విధమైన సార్వజనీనత కలిగిన ప్రజాస్వామ్య రాజకీయ వ్యవస్థ ఏర్పరచటం ఒక గొప్ప ప్రయోగ విప్లవాత్మకమైన మార్పు అయినప్పటికీ దీనికి మరో పార్శ్యం ఉంది. ఈ ఉదార ప్రజాస్వామ్య రాజకీయ వ్యవస్థకు మార్గదర్శకత్వం వహించగల లేదా దేశం కట్టుబడిన సామాజిక, ఆర్థిక పునర్నిర్మాణం ప్రక్రియలను, ప్రమాణాలను, ప్రాధాన్యతలను నిర్ధారించగలిగిన జాతి పునర్ నిర్మాణ సైద్ధాంతిక భావజాలం ఏదీ లేదు. ఈ రాజకీయ పరిస్థితులలో భారతదేశ ప్రజలు విభిన్న దిశల నుంచి కలిగే ఒత్తిడులకు, ఉద్రిక్తతలకు గురిచేయబడుతున్నారు. దీని ఫలితంగా భారతదేశం మతపరమైన సంఘర్షణలకు, రాజకీయ అస్థిరతకు లోనయింది. అయితే చాలాకాలంపాటు దేశం ఈ పరిస్థితిలోని నిర్మాణ దశలో ఉన్న ప్రతి బహిరంగ ప్రజాస్వామ్య వ్యవస్థకు అనివార్యమైన దశ అని భావించి సహించడం జరిగింది. అంతేకాక ఈ పరిస్థితి పరిణామక్రమంలో ఒక భాగంగా కూడా పరిగణించబడింది. అయితే ఈ పరిస్థితిని భారతరాజకీయ వ్యవస్థ అసమర్థతగా కూడా పరిగణించాల్సి ఉంటుంది. అంతేకాక ఈ పరిస్థితి దేశ సమగ్రతకు, ఐక్యతకు హాని కలిగించే శక్తులను నిర్మూలించటంలో ప్రభుత్వం, న్యాయస్థానాల బలహీనతలను ప్రతిబింబిస్తుంది. దీనివల్ల దేశపాలనా వ్యవస్థ నైతిక స్థైర్యాన్ని కోల్పోయింది. ఈ పరిణామాల ఫలితంగా దేశంలో వివిధ మతాల మధ్య సామరస్యం, జాతి సమైక్యత, రాజకీయ వ్యవస్థలో పొందిక క్షీణించటం ప్రారంభమయింది.

ఇటీవల కాలంలో దేశంలో విభిన్న ప్రాంతాలలో ఏదో ఒక రూపంలో మతతత్వం తలెత్తుతున్నది. దీనివల్ల దేశం ప్రధానలక్షణమైన బహుళమత సౌభ్రాతృత్వానికి విఘాతం ఏర్పడింది. దేశం ఎదుర్కొంటున్న అనేక సవాళ్ళలో మతతత్వం

తీవ్రమైందిగా రూపొందింది. అయినప్పటికీ సుదీర్ఘమైన ఘనమైన చరిత్ర నుంచి, జాతీయోద్యమం నుంచి వారసత్వంగా సంక్రమించిన మానవత్వం, మతసామరస్యం, సౌభ్రాతృత్వం, దేశభక్తి, లౌకికతత్వం వంటి ఉదాత్త విలువలు, ఆదర్శాల ఫలితంగా భారతదేశం అనేక దిశల నుంచి పలు సవాళ్ళను ఎదుర్కొంటున్నప్పటికీ సుస్థిరమైన ప్రజాస్వామ్య దేశంగా కొనసాగుతున్నది. లౌకికవాద ప్రజాస్వామ్య దేశంగా భారతదేశానికి ప్రపంచదేశాల దృష్టిలో అత్యంత గౌరవప్రదమైన సమున్నతమైన స్థానం ఉన్నది. బిపిన్ చంద్ర అభిప్రాయపడినట్లు మతతత్వం, మతతత్వ పార్టీలు, వర్గాలు అభివృద్ధి చెందినప్పటికీ భారతదేశం ఆరోగ్యవంతమైన లౌకికవాద సమాజంగా కొనసాగుతున్నది. మతతత్వం సమాజానికీ, రాజకీయ వ్యవస్థకు ఒక సవాలుగా పరిణమించినప్పటికీ, భారతీయుల ఆలోచనల్లో మతతత్వానికి ప్రాధాన్యత లేదు. ఎన్నికలలో కొందరు ప్రజలు మతతత్వ పార్టీలకు, నాయకులకు ఓటు వేస్తున్నప్పటికీ వారిలో మతతత్వ భావజాలం పెంపొందలేదు. భారతీయులు మౌలికంగా లౌకికవాదులు. భారతదేశంలో ఏ ప్రాంతంలో మెజారిటీ వర్గ ప్రజలలో మైనారిటీవర్గ ప్రజల పట్ల ఎటువంటి వ్యతిరేక, ద్వేషాలు లేవు. వాస్తవానికి ప్రజలలో కల చైతన్యం దేశంలో మతతత్వం ప్రబలకుండా నిరోధించింది. ఈ వాస్తవాలే 19వ శతాబ్దంలో చివరి దశలో తెలెత్తిన మతతత్వం సమాజంలోకి చొచ్చుకొని వెళ్ళకుండా విజయవంతంగా నిరోధించగలిగింది.

## 10.5 భారతదేశంలో మతతత్వానికి కారణాలు :

భారతదేశంలో మతతత్వం వృద్ధిచెందటానికి రాజనీతి శాస్త్రవేత్తలు, పరిశోధకులు రెండు రకాల కారణాలను గుర్తించారు. అవి దీర్ఘకాలిక కారణాలు, స్వల్పకాలిక కారణాలు. వీరి అభిప్రాయం ప్రకారం దేశంలో కొన్ని ప్రాంతాలలో మతపరమైన కలహాలు, ఘర్షణలు తలెత్తటానికి స్థానికమైన, నిర్దిష్టమైన, యాంత్రికమైన సంఘటనలు కారణం. అనేక సందర్భాలలో స్వల్పమైన మతపరమైన తగాదాలు, అంశాలు, రెండు మతాలకు చెందిన వ్యక్తుల మధ్య వ్యక్తిగత తగాదాలు మత సంఘర్షణకు దారితీస్తున్నాయి. అయితే మతపరమైన ఉద్రిక్తతలో ఉన్న ప్రాంతాలలోనే ఇది సంభవిస్తున్నది. ఈ ప్రాంతాలలో సంభవించే స్వల్పమైన, సాధారణమైన తగాదాలే చివరకు మతఘర్షణలుగా రూపాంతరం చెంది, మతపరమైన ఉద్రిక్తతలకు దారితీస్తున్నాయి. పట్టణ ప్రాంతాలలో మతఘర్షణలకు అసాంఘిక శక్తులే కారణం. పట్టణాలలో తాండవిస్తున్న పేదరికం, తిండి, నీరు, ఉపాధి, గృహవసతి, ఆరోగ్య సౌకర్యాలు మొదలైన కనీస అవసరాల కొరత మొదలైన పరిస్థితులు కొందరు వ్యక్తులను సాంఘిక వ్యతిరేక శక్తులుగా రూపొందిస్తున్నాయి నికృష్టమైన జీవన పరిస్థితుల వల్ల ఏర్పడే అసంతృప్తి, నిరాశ, నిస్పృహలే వారిని అసాంఘిక శక్తులుగా మారుస్తున్నాయి. ఈ వ్యక్తులే మతఘర్షణలో పాల్గొంటున్నారు.

ఇటీవలి దశాబ్దంలో మతసామరస్యాన్ని పరిరక్షించవలసిన తమ విధి పట్ల నిర్లక్ష్య ధోరణి పెరగటం దేశరాజకీయ, పాలన వ్యవస్థల ప్రధాన లక్షణంగా రూపొందింది. మత ఘర్షణలను నివారించవలసిన బాధ్యత అందుకు తగిన సాధన, సంపత్తి రాజ్యానికే ఉంది. అంతేకాక తక్షణ సమర్థవంతమైన రాజ్యం చర్యలు మాత్రమే మతఘర్షణల నివారణకు ఏకైక మార్గం. అయితే ఇటీవల కాలంలో పాలనా వ్యవస్థ తన అధీనంలో ఉన్న శాంతి భద్రతల యంత్రాంగాన్ని వినియోగించి, మత ఘర్షణలను సమర్ధవంతంగా నివారించటంలో విఫలం అవుతున్నది. దీనితోపాటు ఇటీవల కాలంలో మతతత్వ సైద్ధాంతిక భావజాలం, మతతత్వ శక్తులు రాజ్యయంత్రాంగంలోకి ప్రవేశించడం జరిగిందని పరిశోధనలు వెల్లడిస్తున్నాయి.

1960 దశాబ్దం తరువాతి కాలంలో భారతదేశంలో మతతత్వం క్రమంగా వృద్ధి చెందటానికి దేశంలోని రాజకీయ పార్టీలు మతతత్వం పట్ల అనుసరిస్తున్న దృక్పధం ఒక ప్రధాన కారణంగా పరిగణిస్తున్నారు. రాజకీయపార్టీలు తమ ఎన్నికల ప్రయోజనాల కొరకు రాజకీయాలలో మతం ప్రవేశించడానికి అవకాశం కల్పిస్తున్నాయి. ఈ పార్టీలు మతతత్వ శక్తులకు తమ కార్యకలాపాలలో ప్రాధాన్యతను కల్పిస్తున్నాయి. ఎన్నికల సమయంలో లౌకికపార్టీలు మతతత్వ పార్టీలతో అవగాహనను ఏర్పరచుకొంటున్నాయి.

ఉదాహరణకు కేరళలో ముస్లింలీగ్ పార్టీతో కాంగ్రెస్ పార్టీ, కమ్యూనిస్ట్ పార్టీలు అవగాహనను ఏర్పరచుకొన్నాయి. ఈ విధంగా మతతత్వ పార్టీలతో సంబంధాలను ఏర్పరచుకోవటాన్ని లౌకికపార్టీలు మైనారిటీలకు చెందిన పార్టీలతో స్నేహం ప్రజాస్వామ్యబద్దం అని సమర్థించుకుంటున్నాయి. మతతత్వ పార్టీలతో లౌకిక పార్టీలు ఉదారంగా, సానుకూల దోరణితో వ్యవహరించటం వల్ల మతతత్వానికి చట్టబద్దత ఏర్పడిందని బిపిన్ చంద్ర మొదలైన రాజనీతి శాస్త్రవేత్తలు పేర్కొన్నారు.

ఈ విధంగా లౌకికపార్టీలు మతతత్వ పార్టీల పట్ల సానుకూల వైఖరిని కలిగివున్నప్పటికీ అవి మతతత్వాన్ని ప్రోత్సహించటంలేదనే చెప్పాల్సి ఉంది. ఈ రాజకీయ పార్టీలకు గల లౌకికవాదతత్వమే దేశంలో మతతత్వం వృద్ధి చెందకుండా నిరోధించటంతోపాటు, భారతదేశం మౌలికంగా లౌకికదేశంగా కొనసాగటానికి దోహదం చేసింది. భారతదేశం అనుసరిస్తున్న లౌకివిధానంలో బలహీనతలు ఉన్నప్పటికీ రాజ్యం మతతత్వ భావజాలానికి, శక్తులకు సుదూరంగానే ఉంటున్నది.

భారతదేశంలో రాజకీయాలలో మతం పాత్రను వివరించేందుకు ప్రధానంగా రెండు భావనలను పరిశీలించాల్సి ఉంటుంది. అవి : 1) లౌకికవాదం (Secularism), 2) మతతత్వవాదం (Communalism). భారతదేశ సందర్భంలో మౌలికమైన అర్థంలో లౌకికవాదమంటే మతాన్ని రాజకీయాల రాజ్యం నుంచి వేరుపరచటంతోపాటు, మతాన్ని పౌరుని వ్యక్తిగత వ్యవహారంగా పరిగణించటం. రాజ్యం, మతం లేదా కులం ప్రాతిపదిక మీద పౌరుల మధ్య విచక్షణను కనబరచకపోవడం లౌకికవాదం కీలకాంశం. దీనిని భిన్నంగా భారతదేశ సందర్భంలో మతతత్వ వాదం అంటే భారతీయ సమాజం విభిన్న ఆర్థిక, రాజకీయ, సామాజిక, సాంస్కృతిక ప్రయోజనాలు కలిగిన భిన్న మతాలుగా విభజింపబడిందనే విశ్వాసం ప్రాతిపదికగా సైద్ధాంతిక భావజాలం. మతతత్వవాదం సమాజాన్ని, ఆర్థిక వ్యవస్థ రాజకీయవ్యవస్థను పరిశీలించే, వివరించే విశ్వాసం. మతం చుట్టూ కల రాజకీయ వ్యవస్థను వ్యవస్థీకరించటం మతతత్వంలో కీలక అంశం. ఒక సైద్ధాంతిక భావజాలంగా మతతత్వం జాతి దురంకార వాదానికి, ఫాసిజానికి ప్రతిబింబం. ఒక సైద్ధాంతిక భావజాలంగా మతతత్వం మతపరమైన భావాలను, ఆలోచన విధానాల్ని వ్యాప్తిచేయడం పై ప్రాధాన్యతను కనపరుస్తుంది. మత ఘర్షణలు మతపరమైన పరిస్థితిపై దృష్టిని కేంద్రీకరించేలా చేసిన, అది కీలక సమస్య కాదు. మతపరమైన సైద్ధాంతిక భావజాలాన్ని, విశ్వాసాన్ని వ్యాప్తిచేయడం మతఘర్షణల వెనుకగల సుదీర్ఘకాలిక లక్ష్యం.

## 10.6 లౌకికవాదం :

ఈ మధ్యకాలంలో భారతదేశంలో లౌకికవ్యవస్థపై కొందరు పాశ్చాత్య శాస్త్రవేత్తలు చేసిన వ్యాఖ్యలను పరిశోధిస్తే ఈ క్రింది విషయాలు వ్యక్తమవుతాయి.

భారతదేశ లౌకికవ్యవస్థ వైవిధ్య పూరితమైందని ఈ సామాజిక శాస్త్రవేత్తలు ప్రతిపాదించారు. స్వాతంత్ర్యానంతర భారతదేశంలో రాజ్యాంగం ఏర్పరచిన లౌకికవ్యవస్థకు, పాశ్చాత్య దేశాలలో అవతరించిన లౌకికవాద నమూనా ఆధారం అయినప్పటికీ ఈ రెండు లౌకికవాదన నమూనాలలో భిన్నత్వముంది. భారతదేశంలో లౌకికవాదం పూర్తిగా రాజకీయమైన భావనకాదు. ఈ భావనకు ఆధ్యాత్మిక, నైతిక కోణాలున్నాయి. భారతదేశ లౌకికవాదం నాస్తికత్వాన్ని ప్రభోదించదు. భారతీయ సమాజ జీవితంలో లౌకికమైంది కాదు. ప్రాచీన యుగాలలో భారతీయుల జీవితంలో లౌకికతత్వం ఒక భాగం కాదు. అంటే భారత సమాజం లౌకికమైంది కానప్పటికీ, ఈ దేశంలోని ఆధునిక రాజ్యవ్యవస్థ లౌకికమైంది. భారతరాజ్యాంగంలో వివిధ అధికరణల్లో పొందుపరచిన లౌకికవ్యవస్థ ప్రజల రాజకీయ ఔన్నత్యాన్ని పెంచుతుంది తప్ప, సామాజిక వ్యవస్థకు వర్తించదు. ఈ విధంగా భారతదేశంలో లౌకికవిధానం భిన్నరూపాలను సంతరించుకోవటం వల్ల దేశంలో లౌకికతత్వం క్లిష్టంగా రూపొందిందని, అందుచేత ఈ భావన అవగాహన సులభసాధ్యంకాదనీ, పలువురు పాశ్చాత్య సమాజశాస్త్ర వేత్తల వాదన. ఆచరణలో భారతదేశ లౌకికతత్వంపై

గల సైద్ధాంతిక గందరగోళ పరిస్థితే లైకిక విధానానికి ప్రధానముగా నిలచిందని, ఈ శాస్త్రవేత్తల అభిప్రాయం. ఇటీవల కాలంలో భారతదేశ లౌకిక సంస్కృతి విశిష్టతను వివరిస్తూ అమర్త్యసేన్ దేశంలో ప్రాచీన కాలంనుండి భారతీయ జీవన ప్రవంతిలో అంతర్లీనంగా ప్రవహిస్తున్న భిన్నత్వంలో ఏకత్వం భావనే భారతదేశ లౌకికతత్వాన్ని సుసంపన్నం చేసిందని పేర్కొన్నాడు. అనేక యుగాల నుంచి భారతదేశం అనేక రంగాలలో రాణించటానికి భారతీయులు అనుసరిస్తున్న హేతువాద, లౌకిక విధానమే ప్రధాన కారణం అని అమర్త్యసేన్ వాదించాడు. ఇటువంటి మహోన్నతమైన లౌకిక సంస్కృతిని పరిరక్షించుకొన్నప్పుడే భారతదేశ భవిష్యత్తు ఉజ్వలంగా ఉండగలదని ఆయన ఉద్ఘోదించారు.

భారతదేశంలో లౌకికవాదం అనే పదాన్ని రాజ్యం, మతం మధ్య ఉన్న సంబంధాన్ని లేదా ఉండవలసిన సంబంధాన్ని వివరించేందుకు ఉపయోగిస్తున్నారు. భారతదేశంలో లౌకికరాజ్యం స్పష్టమైన, ధృఢమైన చారిత్రక పునాదుల మీద నిర్మింపబడిఉంది. వాస్తవానికి పురాతన, మధ్య, ఆధునిక యుగాలలో ఏ యుగంలోనూ భారతదేశం సంకుచితమైన మతతత్వం రాజ్యం కాదు. అన్ని యుగాలలో భారతదేశ ప్రజలు అన్ని మతాలను సమానంగా ఆదరిస్తూ, గొప్ప మతసహనాన్ని ప్రదర్శిస్తూ వచ్చారు. వలసపాలన కాలంలో బ్రిటీష్ ప్రభుత్వం అనుసరించిన మతపరమైన తటస్థ విధానానికి దేశంలో పురాతన కాలం నుంచి భారతరాజ్యాంగం లౌకికరాజ్యం ఏర్పరిచింది. భారతరాజ్యాంగం లౌకికరాజ్యం అనే పదాన్ని ప్రస్తావించకపోయినప్పటికీ, దేశంలో లౌకికరాజ్యాన్ని ఏర్పరిచింది. 1976లో ప్రవేశపెట్టిన 42వ రాజ్యాంగ సవరణ ద్వారా రాజ్యాంగంలోని ప్రవేశికలో లౌకిక అనే పదాన్ని చేర్చటంతో భారతదేశంలో లౌకికవ్యవస్థకు రాజ్యాంగపరమైన ఆధారం చేకూరింది. ఈ రాజ్యాంగ సవరణతో లౌకికతత్వం రాజ్యాంగ మౌలిక స్వరూపంలో అంతర్భాగమైంది. భారతరాజ్యాంగంలో దేశంలో ప్రవేశపెట్టదలచిన లౌకికరాజ్యం ప్రకారం భారతదేశంలో ఏ వ్యక్తి పట్ల మతం ఆధారంగా విచక్షణను కనపరచరాదు. ఏ మతం రాజ్యం మతంగా గుర్తించబడకపోవటమేకాక, రాజ్యం ఏ మతం పట్ల ప్రత్యేక ఆదరణను కనపర్చక ప్రత్యేక సౌకర్యాలను కల్పించరాదు. రాజ్యం ఏ మతాన్ని స్థాపించకపోగా మతం ప్రాతిపదికగా ఏ వ్యక్తికి అనుకూలంగా ప్రాధాన్యతను కనపర్చటంలేదా, వ్యతిరేకంగా విచక్షణకు గురిచేయటం జరుగరాదు. భారత రాజ్యాంగం దేశంలో ఏర్పరచదలచిన లౌకికరాజ్యం స్వభావాన్ని 25 నుంచి 28 వరకు కల అధికరణలు ప్రతిబింబిస్తున్నాయి. 25వ అధికరణ తమకు నచ్చిన మతాన్ని స్వేచ్ఛగా ప్రభోదించే హక్కు, అనుసరించే హక్కు, వ్యాప్తిచేసే హక్కు పౌరులకు కల్పిస్తున్నది. 26వ అధికరణ మత వ్యవహారాల నిర్వహణకు అవసరమైన కార్యక్రమాలను చేపట్టే హక్కు పౌరులుకు కలుగజేస్తున్నది. 27వ అధికరణ రాజ్యం ఒక ప్రత్యేక మతం లేదా మతసంస్థల నిర్వహణకు లేదా అభివృద్ధికి పన్ను చెల్లించమని ఏ పౌరుని నిర్భంధించరాదనే ఆదేశిస్తున్నది. 28వ అధికరణ ప్రభుత్వ నిధులతో నిర్వహిస్తున్న ఏ విద్యాసంస్థలో మతపరమైన విద్యను బోధించకుండా నిషేధిస్తుంది. అయితే ఈ నిషేధం ఏదైనా మతసంస్థ నిర్వహిస్తున్న విద్యాసంస్థలకు వర్తించదు. ఈ అధికరణలు ఆధారంగా రాజ్యాంగం ఆశించిన లౌకిక వ్యవస్థ విశిష్ట లక్షణాలను ఈ క్రింది విధంగా వివరించవచ్చును. 1) రాజ్యం ఏ మతానికి కట్టుబడకపోవటమేకాక, ఏ మతం చేత నియంత్రించబడరాదు. 2) రాజ్యం తనకు నచ్చిన ప్రభోదించే హక్కును ప్రతి పౌరునికి కల్పించినప్పటికీ, ఏ మతం పట్ల ప్రత్యేక ఆకర్షణను నేర్పరచరాదు. 3) రాజ్యం మతం, లేదా విశ్వాసం కారణంగా పౌరుని పట్ల విచక్షణ కనపరచరాదు. 4) దేశంలోని ఉన్నత రాజకీయ పదవులకు పోటీచేసే హక్కు ప్రతి పౌరునికి సమానంగా కల్పించబడింది. ఈ విధమైన రాజకీయ సమానత్వాన్ని రాజ్యాంగ ప్రతిపాదించిన లౌకికవ్యవస్థ కీలకాంశంగా పరిగణించాల్సి ఉంది.

ఈ లక్షణాలను పరిశీలిస్తే రాజ్యాంగంలో నిక్షిప్తమైన లౌకికతత్వం పాశ్చాత్య దేశాలలో కల లౌకికతత్వానికి పూర్తిగా భిన్నమైందని తెలుస్తున్నది. భారతదేశంలో లౌకిక వ్యవస్థ విశిష్ఠతను సంతరించుకొనటంతో నెహ్రూ పాత్ర కీలకమైందనేది వాస్తవం. రాజ్యాంగంలో పొందుపర్చిన లౌకకతత్వాన్ని ప్రతిబింబించే అధికరణలు మతరంగంలో స్వేచ్ఛ, సమానత్వం, సహనం

అనే మూడు ఉన్నత విలువలపై ఆధారపడిన భారతీయ లౌకికతాత్వికతను పెంపొందింపచేయగల లౌకిక వ్యవస్థను స్థాపించటం అనే రాజ్యాంగం ఉదాత్త ఆశయాన్ని ప్రతిబింబిస్తున్నాయి. ఇదే సందర్భంలో రాజ్యం, మతం మధ్య అడ్డుగోడలు నిర్మించటం రాజ్యాంగం ఉద్దేశ్యంకాదనే వాస్తవాన్ని గుర్తించాల్సి ఉంది. మత వ్యవహారాలలో రాజ్యం ఖచ్చితమైన నిష్పాక్షికతను పాటించేలా చూడటం కూడా రాజ్యాంగం ఆశయం అనే నిజాన్ని కూడా గుర్తించాల్సి ఉంది. భారతరాజ్యాంగం ప్రకారం రాజ్యం ఏ మతానికి ప్రత్యేక ప్రాధాన్యతను కనపరచకపోయినప్పటికీ మైనారిటీ మతాలకు చెందిన ప్రజల మత హక్కులను కాపాడేందుకు అనేక రక్షణలను కల్పించాల్సి ఉంది.

ఈ విధంగా భారత రాజ్యాంగం దేశంలో ఒక వినూత్నమైన, విశిష్టమైన, లౌకిక వ్యవస్థను ఏర్పరచటానికి కృషిచేసింది. రాజ్యాంగం వివిధ అధికరణల ద్వారా రూపకల్పన చేసిన లౌకికవ్యవస్థ పాశ్చాత్యదేశాల లౌకికవ్యవస్థ పూర్తిగా భిన్నమైంది, భారత సాంప్రదాయ విలువలకు పూర్తిగా అనుగుణమైంది. రాజ్యాంగం అమలులో ఉన్న గత అయిదు శతాబ్దాల కాలంలో లౌకికవ్యవస్థ అనేక మార్పులకు లోనయింది. రాజ్యాంగం తీర్చిదిద్దిన లౌకికవ్యవస్థకు, ఆచరణలో ఈ వ్యవస్థ తీరుకు మధ్య గణనీయమైన వ్యత్యాసం ఉందని దేశంలో సంభవిస్తున్న సంఘటనలను నిరూపిస్తున్నాయని పాశ్చాత్య, భారతదేశ సామాజిక శాస్త్రవేత్తలు, పరిశోధకులు వెల్లడిస్తున్నారు. దేశంలో లౌకికవ్యవస్థను ప్రభావితం చేసే అనేక సంఘటనలు తరచూ చోటుచేసుకుంటున్నాయని వీరి అభిప్రాయం. వివిధ రాజకీయ పార్టీలు లౌకికవాదాన్ని తమ ఎన్నికల ప్రయోజనానికి ఉపయోగించటం సర్వసాధారణమైందనే విమర్శ తరచుగా తలెత్తుతున్నది. ప్రస్తుతం దేశంలో మనుగడను సాగిస్తున్న లౌకికవ్యవస్థకు భారతరాజ్యాంగం, గాంధీ, నెహ్రూలు ఆశించిన లౌకికవ్యవస్థ ఎంతో భిన్నత్వం ఉందని విమర్శకులు పేర్కొన్నారు.

1990 దశాబ్దంలో భారతదేశం లౌకికవ్యవస్థ అనేక సవాళ్ళను పేర్కొంటున్నది. ఈ సవాళ్ల ఫలితంగా లౌకికవ్యవస్థ సంక్షోభంలో చిక్కుకోవలసి వచ్చిందని రాజనీతి శాస్త్రవేత్తల అభిప్రాయం. ఈ సంక్షోభం తన లౌకిక స్వభావాన్ని పరిరక్షించుకోవలసిన బాధ్యత కలిగిన భారత రాజ్యానికి పెద్ద సవాలుగా పరిగణించిందని వీరు వాదిస్తున్నారు. కాగా, 1990 దశాబ్దంలో తలెత్తిన బాబ్రీ మసీదు, అయోధ్య, రామజన్మభూమి వివాదాన్ని దేశ లౌకిక వ్యవస్థ చరిత్రలో ఒక గొప్ప మలుపుగా పరిగణించవచ్చును. ఈ వివాదం ఫలితంగా భారతదేశం తన లౌకిక వాదాన్ని పునర్ నిర్వచించవలసిన అవసరం ఏర్పడిందని ఎందరో రచయితలు, సమాజ శాస్త్రవేత్తల వాదన. అమర్త్యసేన్ ప్రస్తుతం భారతదేశంలో లౌకిక వ్యవస్థ గతంలో ఎన్నడూ లేని విధంగా అనేక విమర్శలకు గురవుతున్నదనీ, అనేక రూపాలలో ఈ వ్యవస్థ సంశయాత్మకమైందని పేర్కొన్నారు. ఇదే విధంగా రజనీ కొఠారీ,రాజీవ్ భార్గవ, టి.యన్. మదన్, అషీష్ నంది మొదలైన ప్రముఖ సమాజ శాస్త్రవేత్తలు భారతదేశంలో లౌకికవ్యవస్థలోని లోపాలు, ప్రస్తుత ఈ వ్యవస్థ ఎదుర్కొంటున్న సవాళ్ళను గురించి విస్తృతంగా చర్చించారు. ఈ విధంగా భారతదేశంలోని అనుసరిస్తున్న లౌకికవిధానం దేశంలో సాగుతున్న రాజకీయ ప్రవచనంలో అతికీలకస్థానం ఆక్రమించింది. మతాన్ని రాజకీయాల నుంచి పూర్తిగా ఏర్పరచటమే ప్రస్తుతం దేశం లౌకికవ్యవస్థ ఎదుర్కొంటున్న సంక్షోభానికి ఏకైక పరిష్కారం అని అందరి అభిప్రాయం. వీరి అభిప్రాయంలో భారతదేశంలో ప్రస్తుతం అనుసరించబడుతున్న లౌకిక విధానం నమూనాను సవరించి దాని స్థానంలో భారత సాంస్కృతిక విలువలకు వర్తమాన పరిస్థితులకు అనుగుణమైన ఆధునికమైన, హేతుబద్దమైన నమూనాను ప్రవేశపెట్టాలని వీరు ఉద్ఘాటించారు.

## 10.7 భారతదేశంలో రాజకీయాలలో కులం పాత్ర :

భారతదేశ సమాజం అతి విశిష్టమైన లక్షణం అయిన కులవ్యవస్థకు దాదాపు 2500 సంవత్సరాల సుదీర్ఘచరిత్ర ఉంది. కులం విశిష్టతను వివరిస్తూ విన్సెంట్ స్మిత్ కులం ఆధునిక రచయితలకు తెలిసిన అతి గొప్ప భారతీయ విచిత్ర అంశం అని

పేర్కొనగా, ఈ ప్రపంచంలో కల మొత్తం మానవ సంస్థలలో కులం అతి గొప్ప వ్యవస్థ అని హెరాల్డ్ గోల్డ్ అనే మరో సమాజశాస్త్రవేత్త వివరించాడు. యం.యన్. శ్రీనివాసన్ గత రెండు వేల సంవత్సరాల నుంచి కులం భారతీయుల జీవితాలను శాసిస్తున్న వ్యవస్థ అని అభివర్ణించాడు. కులం మౌలికంగా సామాజిక వ్యవస్థ అయినప్పటికీ వ్యక్తులు మొత్తం జీవన విధానాన్ని ప్రగాఢంగా ప్రభావితం చేయడం ఈ వ్యవస్థ విశిష్టత అని సమాజశాస్త్రవేత్తలు పేర్కొన్నారు. అంటే కుల వ్యవస్థ వ్యక్తుల సామాజిక సంబంధాలతోపాటు, రాజకీయ, ఆర్థిక సంబంధాలను ఇది ప్రభావితం చేస్తున్నదనీ వీరి అభిప్రాయం.

భారతదేశ సమాజంలో కులం లోతుగా వేళ్ళూనుకున్న వ్యవస్థ. ఈవ్యవస్థను గురించిన అవగాహనకు అనేక సమస్యలు ఉన్నాయి. కుల వ్యవస్థకు కల సంక్లిష్టతల కారణంగానే ఈ వ్యవస్థను అధ్యయనం చేసేందుకు వివిధ సామాజిక శాస్త్రవేత్తల విభిన్న దృక్పధాలను అనుసరిస్తున్నారు. ఈ దృక్పధాలలో ఐదు దృక్పధాలను ప్రధానమైనవిగా గుర్తించవచ్చును. అవి

1) బ్రాహ్మణవాద దృక్పధం
2) అట్టడుగుస్థాయి దృక్పధం (The View from Below)
3) మార్కిస్ట్ దృక్పధం (Marxist View)
4) పాశ్చాత్య దృక్పధం (Western View)
5) చట్టబద్దమైన దృక్పధం (Legalistic View)

భారతదేశానికి స్వాతంత్ర్యానికి రాకముందు, స్వాతంత్ర్యానంతర కాలంలో దేశ రాజకీయ, ఆధునికీకరణ, ఆర్థికాభివృద్ధి, ప్రజాస్వామ్య ప్రక్రియలలో కులం పాత్రపై గణనీయమైన స్థాయిలో పరిశోధనలు జరిగాయి. 1921 మ్యాక్స్‌వెబర్ భారతదేశంలో ఆర్థికాభివృద్ధికి కులవ్యవస్థకు, పెట్టుబడిదారీ వ్యవస్థకు, ప్రధానమైన అవరోధమైందని నొక్కిచెప్పారు. స్వాతంత్ర్యానంతర కాలంలో గున్నార్ మిరాల్డ్ (1968), హైమన్‌డార్ఫ్ (1963), వెబర్ అభిప్రాయాన్ని సమర్థిస్తూ కులం నకారాత్మక పాత్రను నొక్కిచెప్పారు. దీనికి భిన్నంగా సింగర్, గౌల్డ్ అనే పాశ్చాత్య సామాజిక శాస్త్రవేత్తలు కులం సరళత, అనుగుణ్యత స్వభావం కల వ్యవస్థ అని పేర్కొన్నారు. 1960 దశాబ్దం తరువాత వివిధ పాశ్చాత్య, భారతీయ సమాజశాస్త్రవేత్తలు కులవ్యవస్థ దేశంలో పెరుగుతున్న ఆర్థిక, రాజకీయపరమైన పోటీతత్వానికి ప్రధానమైన ప్రాతిపదికగా రూపొందిందని పేర్కొన్నారు.

ఈ సామాజిక శాస్త్రవేత్తలు కులం వ్యవస్థ రాజకీయాలలో దాని పాత్ర అనేక పరిణామాలకు గురవుతున్నవని పేర్కొన్నారు. ఈ 1970 దశాబ్దం నుంచి భారతసమాజంలో కులాలు సజీవంగా ఉన్నప్పటికీ, కుల వ్యవస్థ (Caste System) నశించిందని, కులం రాజకీయకీకరణ చెందిందనే, (Politiciation of Caste) వాదనలు తరుచుగా వినిపిస్తున్నాయి. మొత్తం మీద ప్రస్తుతం కుల వ్యవస్థపట్ల మూడు భిన్న దృక్పధాలు ఉన్నట్లు జి.కె. కరంత్ అనే సమాజశాస్త్రవేత్త అభిప్రాయాలు. అవి :

1) కులతత్వ దృక్పధం (Casteist View)
2) కులతత్వ వ్యతిరేక దృక్పధం (Anti - Casteist View)
3) సందిగ్ధత దృక్పధం (Ambivalent View)

ఈ శాస్త్రవేత్తల అభిప్రాయం ప్రకారం ప్రస్తుతం భారతదేశంలో గతంలోమాదిరి కుల వ్యవస్థలేదు. అయితే వ్యక్తుల ఆలోచనలు, చర్యలపై కులం ప్రభావం కొనసాగుతున్నది. కుల వ్యవస్థ కీలక లక్షణాలు అంతరించడం లేదా మార్పు చెండటం జరిగింది. అయినప్పటికీ కులం దేశ సామాజిక, ఆర్థిక, రాజకీయ జీవితాన్ని గణనీయంగా ప్రభావితం చేస్తున్నది. దేశంలో సంభవిస్తున్న ఆర్థికాభివృద్ధి, ఆధునికీకరణలతోపాటు ప్రజాస్వామ్య వ్యవస్థను, ఎన్నికల ప్రక్రియను ప్రగాఢంగా ప్రభావితం చేస్తున్నది. పాల్‌బ్రాస్ వాదిస్తున్నట్లు గత కొద్ది సంవత్సరాల నుంచి దేశంలో సంభవిస్తున్న అంతర్‌కులాల సంఘర్షణలు, (కులవ్యవస్థ

ఆధారంగా రూపుదిద్దుకొన్న రిజర్వేషన్ల విధానం) దేశం రాజకీయ, విధాన ప్రక్రియలను గాఢంగా ప్రభావితం చేయటంతోపాటు దేశానికి అనేక సవాళ్ళను, సమస్యలను సృష్టించాయి.

## 10.8 కులం - భారత రాజ్యాంగం :

భారతరాజ్యాంగాన్ని రూపొందించిన రాజ్యాంగ పరిషత్ దేశంలో కులరహిత సమాజాన్ని ఏర్పరచటం తన ప్రధాన లక్ష్యాలలో ఒకటిగా ఎంచుకుంది. దీనికి అనుగుణంగానే రాజ్యాంగ ప్రవేశిక భారతదేశాన్ని సర్వసత్తాక, సోషలిస్ట్, లౌకిక, ప్రజాస్వామ్య గణతంత్ర రాజ్యంగ రూపొందించాలని, పౌరులందరికి సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయాన్ని స్వేచ్ఛను, సమానత్వాన్ని ప్రసాదించాలని తీర్మానించింది. ఈ ఆదర్శాలే పౌరులందరికీ సమానమైన హోదా, అవకాశాలను కల్పించేందుకు రాజ్యాంగంలో పొందుపరచిన అధికారణలకు మార్గదర్శకత్వం వహించాయి. రాజ్యాంగంలో పొందుపరచిన 14వ అధికరణ పౌరులందరికీ చట్టంముందు సమానత్వాన్ని లేదా సమానమైన చట్టబద్ధమైన రక్షణను కల్పిస్తున్నది. 15వ అధికరణ రాజ్యం పరిధిలో కల అన్ని ఉద్యోగాల నియామకాలలో పౌరులందరికీ సమానమైన అవకాశాలను కల్పించింది. 16వ అధికరణ ప్రభుత్వ ఉద్యోగాల నియామకంతో సహా అనేక అంశాలలో పౌరుల పట్ల ఏ కారణం చేతనైనా విచక్షణను కనపరచటాన్ని నిషేదిస్తున్నది. 17వ అధికరణ కులం ఆధారంగా, ఏ రూపంలోనైనా అస్పృశ్యతను పాటించటాన్ని నిషేదించింది. కాగా, 330వ, 332వ అధికరణలు షెడ్యూల్డ్ కులాలకు, తెగలకు చెందిన ప్రజలకు వారి జనాభా ప్రాతిపదికగా లోక్‌సభలో వివిధ రాష్ట్ర శాసనసభలలో కొన్ని స్థానాలను ప్రత్యేకించాలనీ నిర్దేశిస్తుంది. 335వ అధికరణ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సర్వీసులకు చెందిన వివిధ ఉద్యోగాలలో కొంత సంఖ్యను షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలకు చెందిన వ్యక్తులకు కేటాయించాలని సూచిస్తున్నది. ఈ విధంగా భారత రాజ్యాంగం కుల వ్యవస్థ ఫలితంగా అనేక నష్టాలకు గురిఅయిన సమాజంలోని కొన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి, వికాసానికి అనేక ప్రత్యేక సౌకర్యాలను, సదుపాయాలను, రక్షణలను కల్పించింది.

## 10.9 రాజకీయాలు - కులం సంబంధాలు :

ఆంద్రూ బెటిల్ రాజకీయాలలో కులపాత్రను విశ్లేషిస్తూ, రాజకీయాలను కులం అనేక మార్గాలలో ప్రభావితం చేస్తున్నదని పేర్కొన్నాడు. అవి : ఒకటి, రాజకీయ నాయకులు కులం నినాదంతో ప్రజలను ఆకర్షించటం సర్వసాధారణ విషయమైంది. ఎన్నికలలో, పోటీకీ వివిధ రాజకీయపార్టీలు ఒకే కులానికి చెందిన అభ్యర్థులను ఎంపిక చేయటం జరుగుతున్నది. రెండు, ఎన్నికలలో, ఇతర సందర్భాలలో కులం ప్రాతిపదికమీద ప్రజలను సమీకరించేందుకు వ్యక్తుల మధ్య కల అంతర్ వ్యక్తి సంబంధాలను గుర్తుచేయటం జరుగుతుంది. మూడు, కుల సంఘాలు తమ సభ్యుల ప్రయోజనాలను వ్యవస్థీకృత పద్ధతిలో వ్యక్తీకరిస్తాయి. ఆంద్రూ బెటిల్ అభిప్రాయం ప్రకారం భారతదేశంలో కులం పైగల అభిమానం, రాజకీయ మద్దతుకు సమీకరణ ప్రధాన ఆధారమైంది. మిగిలిన అంశాలన్నీ సమానంగా ఉన్నప్పుడు తమ కులానికి చెందిన వ్యక్తులకు మద్దతు ఇవ్వటం జరుగుతున్నది. సమాజంలో సాంప్రదాయ విలువలు కొనసాగుతున్నంతకాలం కులం పట్ల విధేయత, బాధ్యత కనపరచటం తప్పుగా పరిగణించబడదు. సహజంగానే కులం పట్ల కల అనుబంధం సంస్థాగత రాజకీయాలలోకి కూడా విస్తరిస్తుంది.

రజనీకొఠారి భారతదేశంలో కులం, రాజకీయాల సంబంధాలను సునిసితంగా విశ్లేషించి, ప్రతిపాదించిన ఊహనలు / నమూనాలు ఎంతో ప్రాచుర్యాన్ని సంతరించుకున్నాయి. కొఠారి నమూనా ప్రకారం స్వాతంత్ర్యానంతరం భారతదేశంలో కులం మూడు దృక్కోణాలను సంతరించుకున్నది. ఒకటి, లౌకికదృక్కోణం రెండు సమైక్యత దృక్కోణం (Integrative Dimension), 3) చైతన్య దృక్కోణం (Dimension of Consciousness). సాంప్రదాయకంగా కులవ్యవస్థలో సమాజాన్ని అనేక వర్గాలుగా స్థిరీకరించే లక్షణం ఉన్నప్పటికీ, దానితోపాటు విభిన్న కులవర్గాల మధ్య ఐక్యత, సామాజిక చలనం కోసం నిరంతరం

ప్రయత్నించటం కులవ్యవస్థ లక్షణాలు. సాంప్రదాయకంగా కులవ్యవస్థ లౌకికస్వభావంలో రెండు అంశాలున్నాయి. అవి :

1) ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే అంశం. (ఉదాహరణకు కుల లేదా గ్రామపంచాయితీ)

2) రాజకీయ అంశం. (అంతర్గతంగా కులంలో ఉండే సమైక్యత, చీలికలు)

వీటిని స్థానిక రాజకీయ నాయకత్వం, సమాజంలోని ప్రధాన కేంద్రాలమధ్య ఉండే అధికార సంబంధాలు అభివృద్ధిపరచవచ్చును లేదా విచ్ఛిన్నం చేయవచ్చును. దేశంలో ప్రజాస్వామ్యం, జాతీయ రాజ్యం వంటి ఆధునిక వ్యవస్థలు అవతరించాక అనేక కులాలు తమ ఉపకులాలకు గణనీయమైన మార్పులు సంతరించాయి.

కులవ్యవస్థ వ్యక్తి జన్మించిన కులం ఆధారంగా అతని హోదాను నిర్ధారించటంతోపాటు వ్యక్తులకు విభిన్న వృత్తిపరమైన ఆర్థిక పాత్రలను అప్పగిస్తుంది. ఈ విధంగా కులం ప్రతివ్యక్తి అత్యున్నతమైన స్థానాన్ని లేదా అతి దిగువస్థాయిని కల్పించి వారు సమాజంలో సమైక్యం చెందేందుకు అవకాశం కల్పిస్తున్నది. అంతేకాక కులవ్యవస్థ ఒక ప్రత్యేక తరహాకు చెందిన సమైక్య నిర్మాణం. ఆచరణలో కుల సంఘాలు సారూప్యత కలిగిన వర్గాలుగా కాక, సమానాంతరమైన సారూపత్యతలేని భిన్నవర్గాలుగా పనిచేస్తాయి. 1966లో రాజకీయాలలో కులం మారుతున్న పాత్రపై రజనీ కొఠారి చేసిన విశ్లేషణలో ఒక నూతన ధోరణి ప్రస్ఫుటంగా గోచరిస్తున్నది.

రజనీకొఠారి అభిప్రాయం ప్రకారం దేశంలో ప్రజాస్వామ్యం స్థాపనతో కులవ్యవస్థ ఒక నూతన దిశలో అడుగుపెట్టిందని దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తొలిదశలో ఎం.ఎన్. శ్రీనివాసన్ మొదలైనవారు వాదించారు. ఇప్పుడు ఈ వాదన మరింత బలంగా వినిపిస్తున్నది. అయితే ఈ ప్రజాస్వామ్య ప్రక్రియ ఫలితంగా కులం పరిణామ ప్రక్రియకు లోనవుతున్నది. వాస్తవానికి కులవ్యవస్థ పరిణామ ప్రక్రియలో రాజకీయాలలో కులతత్వం (Casteism in Politics) ఒక ప్రధాన అంశం. రాజకీయాలలో కులతత్వం అంటే కులం రాజకీయాకరణ చెందటమే(Politicization of Caste). ఇది అంతిమంగా కుల వ్యవస్థ పరిమాణం చెందేందుకు దారితీస్తుంది. ఇది నిర్మాణపరంగా, సైద్ధాంతిక భావనలపరంగా సంభవించింది.

అతుల్ కోహ్లి మొదలైన సామాజిక శాస్త్రవేత్తల అభిప్రాయం ప్రకారం భారతదేశంలో కులవ్యవస్థ ఒక సైద్ధాంతిక భావజాలంగా, నిర్వీర్యమైనప్పటికీ, సామాజిక వాస్తవంగా క్రియాశీలకంగా ఉంది. వెనుకబడిన కులాలను అగ్రకులాలు హీనంగా చూడటం నేటికీ కొనసాగుతున్నది. అయితే కులపరమైన విశ్వాసాలకు, ఆదరణకు మధ్య ఉన్న అంతరమే మార్పు, ఉద్రిక్తతకు ప్రధాన కారణం. ప్రస్తుతం దిగువస్థాయి కులాలు సామాజిక చక్రంలో తక్కువ స్థానాన్ని కానీ ఆర్థికంగా తక్కువ హోదాను కానీ అంగీకరించడంలేదు. ప్రస్తుతం సమాజంలో సంభవిస్తున్న మార్పు ఉద్దేశ్యం కులవ్యవస్థను నిర్మూలించడం కాక, కులాన్ని సామాజిక మార్పుకు సాధనంగా వినియోగించటం. భారతదేశంలో కులం కాని కులతత్వం క్షీణిస్తుంది. ఇదే సందర్భంలో భారతదేశం కులవ్యవస్థను సంస్థీకరించే సామాజిక, రాజకీయ వ్యవస్థ రూపుదిద్దుకుంటుందని, కోహ్లి ప్రతిపాదించాడు.

1947లో దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించాక రాజకీయాధికారాన్ని చేపట్టిన నాయకులలో ఎక్కువశాతం అగ్రవర్ణాలకు చెందిన వారే ఉన్నారు. వీరికి విద్యా మొదలైన సౌకర్యాలు అందుబాటులో ఉండటం, సమాజంలో గౌరవం, హోదాలు ఉండటం, భూమి, వ్యాపారం, పెట్టుబడి మొదలైన ఆర్థిక వనరులు తమ అధీనంలో ఉండటం మొదలైన కారణాలవల్ల వారు రాజకీయ వ్యవస్థలోని ఉన్నత పదవులను కైవసం చేసుకోగలిగారు. ప్రభుత్వంలో ఉన్న పదవులనేకాక, వివిధ రాజకీయ పార్టీలలోని ఉన్నత పదవులను కూడా అగ్రవర్ణాల నాయకులే ఆక్రమించారు. క్రమంగా రాజకీయ రంగంలో అగ్రవర్ణాల ఆధిపత్యం కొనసాగటాన్ని వ్యతిరేకించటం ప్రారంభమయింది. దీనికి కాంగ్రెస్ పార్టీ నాయకత్వంలో వెనుకబడిన కులాల ప్రజలు సమీకరణ ప్రధానకారణమని సమాజిక శాస్త్రవేత్తల అభిప్రాయం. కాంగ్రెస్ పార్టీ వ్యవస్థలో షెడ్యూల్డ్ కులాలు, మధ్యస్థాయీ కులాలు చోటుచేసుకోవటానికి

ఆ పార్టీలోని అగ్రకుల నాయకుల మధ్య వర్గతత్వం, సంఘర్షణలు దోహదం చేశాయి. కాంగ్రెస్ పార్టీలోని వివిధ పదవులకు, పార్లమెంట్, శాసనసభలలోని సీట్లకు పార్టీల్లో అగ్రవర్ణాల నాయకుల మధ్య తీవ్రమయిన పోటీ ఏర్పడటంతో ఆ పార్టీ నూతన సభ్యులను చేర్చుకొటనం ద్వారా తమ పరిధిని పరిధిని విస్తృపరచుకునేందుకు పూనుకుంది. పార్టీలోనో అంతర్గతంగా ఏర్పడిన వర్గతత్వం, ఇతర పార్టీల నుంచి ఎదురైన పోటీ కాంగ్రెస్ పార్టీ స్థానికస్థాయిలో విభిన్న కులాలకు చెందిన నాయకులను సమీకరించి, ఓటు బ్యాంకులను సృష్టించుకునేలా పార్టీ నాయకులను ప్రేరేపించాయనీ పాల్‌బ్రాస్, రూడాల్ఫ్ మొదలైన పాశ్చాత్య రాజనీతి శాస్త్రవేత్తలు అభిప్రాయపడ్డారు. ఈ అవసరమే కాంగ్రెస్‌పార్టీ నాయకత్వ నిర్మాణంలోకి గతంలో దూరంగా ఉంచిన అనేక సామాజిక వర్గాలను చేర్చుకోవటానికి దారితీసిందని వారి వాదన. ఈ ప్రక్రియ మందకొడిగా సాగినా దేశమంతా ఒకే విధంగా సంభవించింది. అంతేకాక ఈ దృగ్గోచరం అన్ని పార్టీలకు వర్తిస్తుంది. ఉదాహరణకు ఉత్తరభారతదేశంలో కాంగ్రెస్‌పార్టీ షెడ్యూల్డ్ కులాలు, ముస్లింలను ఆకర్షించుకోగా చరణ్‌సింగ్ నాయకత్వంలో ఏర్పడిన లోక్‌దళ్ పార్టీలో జాట్ మొదలైన మధ్యస్థ స్థాయి దిగువస్థాయికి చెందిన కులాలకు చెందిన ప్రజలు ఎక్కువ స్థాయిలో చేరారు. ఇదేవిధంగా దక్షిణభారతదేశంలో కర్ణాటకలో లింగాయత్, వక్కలిగా వంటి బ్రాహ్మణేతర కులాలు కాంగ్రెస్ పార్టీలోకి, తమిళనాడులో డి.యం.కె., అన్నా డి.యం.కె. పార్టీలలోనికి ప్రవేశించారు.

భారతదేశంలో రాజకీయాలలో కులం పాత్రను ప్రగాఢంగా ప్రభావితం చేసిన అంశాలలో రిజర్వేషన్ల విధానం అతి ప్రధానమైంది. స్వాతంత్ర్యానంతరం దేశ రాజకీయ ప్రక్రియలో వెనుకబడిన వర్గాలైన షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు పాల్గొనటానికి, ఈ వర్గాల ప్రజలకు రాజకీయాధికారం సంక్రమించటానికి రిజర్వేషన్ విధానం తోడ్పడింది. భారతరాజ్యాంగం జనాభా ప్రాతిపదిక మీద లోక్‌సభ, రాష్ట్ర శాసనసభలలో కల మొత్తం సీట్లలో 15 శాతం సీట్లను షెడూల్డ్ కులాలకు, షెడ్యూల్డ్ తెగలకు 7 శాతం సీట్లను కేటాయించింది. 1991లో మండల్ కమీషన్ నివేదిక ఆధారంగా లోక్‌సభ, రాష్ట్ర శాసనసభలలోని సీట్లలో 27 శాతం సీట్లు వివిధ ఇతర వెనుకబడిన తరగతుల (OBC's) కు కేటాయించారు. రిజర్వేషన్ విధానం ఫలితంగా స్వాతంత్ర్యానంతర కాలంలో దేశ రాజకీయ ప్రక్రియలో వివిధ వెనకబడిన తరగతులకు చెందిన ప్రజలు చురుకుగా పాల్గొంటున్నారు. దేశ రాజకీయ అధికారంలో ఈ వర్గాల ప్రజలకు భాగస్వామ్యం లభించింది. రాజకీయ సాధికారికత సమకూరిన ఫలితంగా ఈ వర్గాల ప్రజలలో చైతన్యం, వికాసాలు పెంపొందాయి. వారి సామాజిక, ఆర్థిక పరిస్థితులు గణనీయంగా మెరుగుపడ్డాయి. అభివృద్ధి పథంలో ముందంజ వేస్తున్నారు. జాతి నిర్మాణం, దేశసామాజిక ఆర్థిక పునర్నిర్మాణం ప్రక్రియలో మిగతా వర్గాలతోపాటు సమానంగా పాల్గొంటున్నారు. ఈ విధంగా వెనుకబడిన వర్గాలలో జీవితాలలో విప్లవాత్మక మార్పులు సంభవించడంలో మిగతా అంశాలకన్నా రిజర్వేషన్ల పాత్రే కీలకమైందని చెప్పటం సమంజసమే.

ఈ విధంగా కుల ప్రాతిపదికమీద ప్రవేశపెట్టబడిన రిజర్వేషన్ల విధానం దేశరాజకీయ వ్యవస్థలో వెనుకబడిన వర్గాల ప్రజల జీవితాలలో గణనీయమైన మార్పును ప్రవేశపెట్టబడినప్పటికీ, ఈ అంశం దేశరాజకీయాలలో వివాదాస్పద అంశమైంది. రిజర్వేషన్ల విధానాలను సమర్థించే వారితోపాటు ఈ విధానాన్ని తీవ్రంగా వ్యతిరేకించే వారు కూడా అధిక సంఖ్యలో ఉన్నారు. రిజర్వేషన్లను వ్యతిరేకిస్తున్న అగ్రవర్ణాల ప్రజలు రిజర్వేషన్లను సామాజిక అంశాల ప్రాతిపదికమీదకాక, ఆర్థిక పరిస్థితి ఆధారంగా నిర్ధారించాలని వీరి వాదన. 1991లో కేంద్రప్రభుత్వం మండల్ నివేదిక ఆధారంగా ఇతర వెనుకబడిన వర్గాలకు కూడా రిజర్వేషన్ల విధానాన్ని ప్రవేశపెట్టిన తర్వాత రిజర్వేషన్‌ల విధానం మరింత వివాదస్పదమైంది. వివాదం ఈ దేశ రాజకీయాలపై కూడా ప్రగాఢంగా ప్రసరించింది. ఈ వివాదం 1990 దశాబ్దంలో జరిగిన లోక్‌సభ, కొన్నిరాష్ట్రాల శాసనసభ ఎన్నికలలో కీలక అంశంగా రూపొందిందని సామాజిక శాస్త్రవేత్తల అభిప్రాయం. మొత్తం మీద భారతదేశ రాజకీయాలను ప్రగాఢంగా ప్రభావితం చేస్తున్న కులవ్యవస్థ, రిజర్వేషన్ల ఫలితంగా పాశ్చాత్య, దేశీయ సామాజిక శాస్త్రవేత్తల దృష్టిని అమితంగా ఆకర్షిస్తున్నాయి.

## 10.10 షెడ్యూల్డ్ తెగలు లేక గిరిజనులు - రాజకీయ ప్రక్రియ :

1991 జనాభా లెక్కల ప్రకారం 45 మిలియన్ల, సంఖ్యతో దేశం మొత్తం జనాభాలో దాదాపు 7 శాతం కల ఆదివాసీయులు దేశంలో రాజకీయంగా క్రియాశీలకరహితమైన పెద్ద మైనారిటీ వర్గం. రాజ్యాంగం వారి పట్ల అనుసరించిన విధానం ఫలితంగా స్వాతంత్ర్యానంతరం దేశంలోని ఆదివాసులు షెడ్యూల్డ్ తెగలుగా వ్యవహరించబడుతున్నారు. షెడ్యూల్డ్ తెగల ప్రజలలో అధిక శాతం ప్రజలు ప్రభుత్వం గుర్తించిన షెడ్యూల్డ్ ప్రాంతాలలో నివసిస్తున్నారు. షెడ్యూల్డ్ ప్రాంతాలు అధికంగా అటవీ ప్రాంతాలలో ఉన్నాయి. ఈ దేశం మొత్తం జనాభాలో మైనారిటీ వర్గం అయిన షెడ్యూల్డ్ తెగల ప్రజలు ఈశాన్య రాష్ట్రాలైన నాగాలాండ్ (89 శాతం), మేఘాలయ (80 శాతం), అరుణాచల్ ప్రదేశ్ (79 శాతం) రాష్ట్రాలలో మెజార్టీ వర్గంగా వున్నారు. ఈశాన్య రాష్ట్రాల తర్వాత షెడ్యూల్డ్ తెగల ప్రజలు అస్సాం, మధ్యప్రదేశ్, బీహార్, ఒరిస్సా, ఆంధ్రప్రదేశ్, పశ్చిమ బెంగాల్, రాజస్తాన్, త్రిపుర, మణిపూర్ రాష్ట్రాలలో అధిక సంఖ్యలో ఉన్నారు. షెడ్యూల్డ్ తెగల ప్రజలు వారు నివసిస్తున్న ప్రాంతాల భౌగోళిక, నైసర్గిక పరిస్థితులు, వారి విశిష్టమైన, విభిన్నమైన సాంప్రదాయాలు, ఆచారాలు, సామాజిక, ఆర్థిక వ్యవస్థలు, భాషా, మతం మొదలైన అనేక కారణాల వల్ల వారు జాతీయభావన ప్రవంతిలో భాగంగాకాక ఒక ప్రత్యేక సమూహంగా జీవిస్తున్నారు. ఈ ప్రజలలో అక్షరాస్యత అతితక్కువ స్థాయిలో ఉండటం, వీరు నివసిస్తున్న ప్రాంతాలలో రవాణా సౌకర్యాలు లోపించటం వల్ల ఇతర ప్రాంతాలలో వీరికి సంబంధ బాంధవ్యాలు అతిస్వల్ప స్థాయిలో ఉండటం మొదలయిన కారణాలవల్ల వీరు ఆధునికత, అభివృద్ధి, సామాజిక మార్పు ప్రక్రియలకు లోనుకాక సాంప్రదాయ బద్ధమైన జీవితాన్నే కొనసాగిస్తున్నారు. అక్షరాస్యత, అభివృద్ధిరేటు, తలసరి ఆదాయం మొదలైన అనేక అభివృద్ధి సూచికలలో షెడ్యూల్డ్ తెగలకు మిగతా సమాజానికి మధ్య విస్తృతమైన అంతరం ఉంది. షెడ్యూల్డ్ తరగతులు ప్రధానంగా వ్యవసాయం పై ఆధారపడినప్పటికీ పురాతనమైన వ్యవసాయపద్ధతులను అనుసరించటం, సాగునీరు కొరత ఖండ ఖండాలుగా విభజింపబడిన భూమి, ఆధునిక ఉత్పాదకాలు లభించకపోవడం, వ్యవసాయయోగ్యమైన భూమిలో అధికశాతం పరాయికరణకు లోనుకావటం మొదలైన అనేక కారణాల వల్ల షెడ్యూల్డ్ ప్రాంతాలలో వ్యవసాయ రంగం ఉత్పాదకత అతి తక్కువస్థాయిలో ఉంది. ఈ కారణాల వల్ల షెడ్యూల్డ్ కులాలలో పేదరికం, అజ్ఞానం, అనారోగ్యం, నిరుద్యోగం వంటి సమస్యలు మిగిలిన ప్రాంతాలతో పోలిస్తే తీవ్రస్థాయిలో ఉన్నాయి. ఈ విధమైన సామాజిక, ఆర్థిక వెనుకబాటుతనంతో పాటు ఆధునికీకరణ అతి త క్కువస్థాయిలో సంభవించటం పలితంగా షెడ్యూల్డ్ తెగలలో రాజకీయ చైతన్యం, స్వల్పముగా, ఉండటంచేత దేశరాజకీయ ప్రక్రియలో వారి పాత్ర అతి పరిమితం.

స్వాతంత్ర్యానంతరం రాజ్యాంగం కల్పించిన ప్రత్యేక సౌకర్యాలు, రక్షణలు, కేంద్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న వ్యవహారాలు, చేపడుతున్న అభివృద్ధి ప్రణాళికలు, పథకాలు మొదలైన కారణాలవల్ల షెడ్యూల్డ్ తెగలు సామాజిక, ఆర్థిక పరిస్థితులు క్రమంగా మెరుగుపడుతున్నాయి. వారిని అంటిపెట్టుకొని వస్తున్న నిరక్షరాస్యత, పేదరికం, నిరుద్యోగం, అనారోగ్యం వంటి సమస్యలు క్రమంగా తొలగి వారు అభివృద్ధి పథంలో ముందుకు సాగుతున్నారు. జాతీయ జీవన ప్రవంతిలో లీనమవుతున్నారు.

రాజ్యాంగం షెడ్యూల్డ్ కులాలతోపాటు కల్పించిన రిజర్వేషన్ల సౌకర్యం ఫలితంగా షెడ్యూల్డ్ తెగలు రాజకీయ ప్రక్రియలో పాల్గొనే అవకాశం ఏర్పడింది. రాజ్యాంగం ప్రకారం జనాభా ప్రాతిపదికమీద లోక్‌సభ, వివిద రాష్ట్ర శాసనసభలలో దాదాపు ఏడు శాతం సీట్లను షెడ్యూల్డ్ తెగలకు కేటాయించారు. రిజర్వేషన్‌లు రాజకీయ ప్రక్రియలో కల్పించిన భాగస్వామ్యం ఫలితంగా షెడ్యూల్డ్ తెగలలో క్రమంగా రాజకీయ చైతన్యం పెరుగుతున్నది. వారిలో ఉద్భవిస్తున్న రాజకీయ నాయకత్వం తమ ప్రత్యేక ప్రయోజనాలను, డిమాండ్‌లను ఏర్పరచుకోవటమేకాక, వాటిని సమర్థవంతంగా వ్యక్తపరుస్తున్నది. ఈ ప్రయోజనాలు డిమాండ్‌ల సాధనకు షెడ్యూల్డ్ తెగల నాయకులు తమ వర్గ ప్రజలను సమర్థవంతంగా సమీకరించే ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ క్రమంలోనే షెడ్యూల్ తెగల ప్రజలు జనాభా ప్రాతిపదిక మీద జార్ఖండ్, చత్తీస్‌ఘడ్ రాష్ట్రాలను సాధించుకోగలిగారు.

## 10.11 సారాంశం :

ఈ పాఠం రాజకీయ ప్రక్రియ సామాజిక గతిశీలత గురించి అనేక అంశాలను సమగ్రంగా వివరించింది. ఈ దేశంలో రాజకీయ ప్రక్రియలో అతి కీలకమైన పాత్రను వహిస్తున్న మతం, కులం, తెగ వంటి సామాజిక అంశాలను నిశితంగా పరిశీలించాము. స్వాతంత్ర్యం సిద్ధించిన నాటి నుంచి దేశ రాజకీయ ప్రక్రియలు ప్రధానంగా ఎన్నికలలో ఈ అంశాల మారుతున్న పాత్రను క్రమబద్ధంగా, వివిధ పరిశోధనల ఫలితాల ఆధారంగా పరిశీలించాము. మొత్తంమీద ఈ పాఠం సారాంశమేమిటంటే భారతదేశ రాజకీయాలలో కులం, మతం, తెగ కీలకపాత్ర వహిస్తున్నప్పటికీ, అవి దేశ రాజకీయాలను పూర్తిగా శాసించే స్థాయిలో లేవు. అంతేకాక వీటి ప్రభావం దేశంలోని వివిధ ప్రాంతాలలో విభిన్నంగా ఉంది. అందుచేత రాజకీయాలలో ఈ అంశాల పాత్ర, ప్రభావం గురించి సమగ్రమైన దృక్పథాన్ని ఏర్పరచుకోవటం అంత సులభమైన విషయం కాదు.

## 10.12 మాదిరి ప్రశ్నలు :

1) భారతదేశంలో రాజకీయ ప్రక్రియ సామాజిక గతిశీలతను విమర్శనాత్మంగా పరిశీలించండి.
2) భారతదేశంలో రాజకీయాల్లో మతం పాత్రను వివరించండి.
3) భారతదేశంలో రాజకీయాల్లో కులం మారుతున్న పాత్రను వివరించండి.
4) భారతదేశం రాజకీయాలలో తెగ నిర్వహిస్తున్న పాత్రను చర్చించండి.

## 10.13 చదువదగిన గ్రంధాలు :


1. Paul R. Brass, The Politics of India, since Independence, Cambridge : Cambridge University Press, 1990 (2nd Edition).
2. Bipin Chandra and others, India After Independence - 1947 - 2000, New Delhi, Penguin Books, 2000.
3. Atul Kohli (ed.), The Success of India's Democracy, Cambridge : Cambridge University Press, 2001.
4. Rajani Kothari, Politics in India, Bostan : Little Brown and Company, 1970.
5. Rajani Kothari, Caste in Indian Politics, New Delhi : Orient Logman, 1970.
6. Sudipta Kavi Raj (ed.) New Delhi : Oxford University Press, 1997.
7. A.P. Avasthi, Indian Political System, Agra : Lakshminarain Agarwal, 2002.


**రచయిత : ప్రొఫెసర్. ఎమ్. బాపూజీ**

# పాఠం -11

# భారత పార్టీ వ్యవస్థ

11.0 లక్ష్యం

11.1 ఉపాధ్ఘాతం

11.2 భారత పార్టీ వ్యవస్థ

11.3 భారత పార్టీ వ్యవస్థ -చరిత్ర - స్వాతంత్ర్యానికి పూర్వ సరిస్థితి.

11.4 స్వాతంత్ర్యానంతరరం భారత దేశంలో పార్టీ వ్యవస్థ

- 11.4.1 భారత జాతీయ కాంగ్రేప్
- 11.4.2 జనతాపార్టీ
- 11.4.3 భారతీయ జనతా పార్టీ
- 11.4.4 ప్రాంతీయ పార్టీలు
- 11.4.5 కమ్యూనిష్ట్ పార్టీలు

11..5 సారాంశం

11.6 మాదిరి ప్రశ్నలు

11.7 చదువతగిన గ్రంధాలు

## 11.0 లక్ష్యం:

భారత దేశంలో పార్టీ వ్యవస్థను సమగ్రంగా వివరించడం ఈ పాఠం ప్రధాన లక్ష్యం. ఈ పాఠాన్ని చదివిన తరువాత విద్యార్థులు ఈ క్రింది అంశాలు వివరించగలుగుతారు.

1. భారత దేశంలో పార్టీ వ్యవస్థ లక్షణాలు, పరిణామ క్రమం, పనితీరు.
2. భారతదేశంలోని కొన్న ప్రధాన రాజకీయ పార్టీల తీరు తెన్నులు
3 భారత దేశ రాజకీయాలు పై రాజకీయ పార్టీల ప్రభావం.
4. భారత దేశ పార్టీవ్యవస్థ -విశిష్టత

## 11.1. ఉపోద్ఘాతం:

ప్రజాస్వామ్యం మనుగడకు రాజకీయ పార్టీలు నిస్సందేహంగా అవసరం అవి అనేక రాజకీయ, రాజకీయేతర విధులను నిర్వర్తిస్తాయి. రాజకీయ పార్టీల నాయకత్వం, విధానాలు, అంతర్గత పద్దతులు, ఇతర పార్టీలతో సంస్థలతో వాటి పరస్పర చర్య, ప్రభుత్వంపై ప్రగాఢమైన ప్రభావాన్ని కనపరుస్తాయి. ప్రాతినిధ్య ప్రజాస్వామ్య వ్యవస్థలో కీలక రాజకీయ సంస్థగా ఆధునిక రాజకీయ పార్టీలు / ప్రధానంగా మూడు విధులను నిర్వర్తిస్తాయి. అవి ఎన్నికలలో వివిధ పదవులకు అభ్యర్థులను ఎంపిక చేయడం, ప్రజల సంక్షేమ సాధనకు తగిన విధానాలు ఎజెండాను రూపొందించడం, ఎన్నికలలో తమ అభ్యర్థులకు, విధానాలకు ప్రజల మద్దతును సమీకరించటం, రాజకీయ పార్టీలు ప్రజలకు విధాన రూపకల్పన కర్తలకు మధ్య సంధాన కర్తలుగా పని చేస్తాయి. పాలితులు పాలకుల మధ్య బలమైన సంబంధాన్ని ఏర్పరచటం రాజకీయ పార్టీల హేతుబద్ధమైన కర్తవ్యం.

భారతదేశం రాజకీయ వ్యవస్థలో రాజకీయ పార్టీలు కేంద్ర బిందువు వంటివి. రాజకీయ సమీకరణలో ప్రభుత్వ నిర్వహణలో సామాజిక, ఆర్థిక విధానాల రూపకల్పన అమలులో, జాతీయ సంఘర్షణలో, వేర్పాటు ఉద్యమాలలో రాజకీయ పార్టీలు కీలకపాత్ర పోషిస్తున్నాయి. వ్యక్తికి రాజకీయానికి, సమాజానికి, రాజ్యానికి మధ్యవారధిలా వ్యవహరించడంలో రాజకీయ పార్టీల కీలక ప్రాధాన్యత ఇమిడి ఉంది. భారత దేశంలో రాజకీయ పార్టీల సామాజిక ప్రక్రియకు, విధాన రూపకల్పన కర్తల మధ్య అనుసంధానం ఏర్పరచటంతో పాటు సమాజంలోని వివిధ వర్గాల ప్రయోజనాలను ప్రభావితం చేసే చర్యలను విధానాలను ప్రభావితం చేస్తున్నాయి.

పౌరులు స్వేచ్ఛగా రాజకీయ ప్రక్రియలో పాల్గొనే అవకాశంఉన్న ఏ రాజకీయ వ్యవస్థలోనైనా రాజకీయ పార్టీలు సహజం. సమాజానికి రాజకీయాలకు మధ్య అనుసంధాన్ని ఏర్పరిచే రాజకీయ పార్టీలు ప్రజాస్వామ్య వ్యవస్థ స్వభావాన్ని తీర్చిదిద్దడంలో కీలక పాత్ర వహిస్తాయి. అయితే సమాజంలోని వ్యక్తుల సమూహాల అభిప్రాయాలు, ప్రయోజనాలు, పార్టీ వ్యవస్థ స్వరూపాన్ని స్వభావాన్ని తీర్చిదిద్దుతాయి. రాజకీయ వ్యవస్థ పార్టీ వ్యవస్థను ప్రభావితం చేసే మార్గాలు సామాజిక వ్యవస్థ విధానాలను తీర్చిదిద్దడంలో రాజకీయ పార్టీల సామర్థ్యం అవగాహన ఆవశ్యకతను నొక్కి చెప్పవలసిన అవసరం ఉంది.

రాజనీతి శాస్త్రవేత్తల అభిప్రాయం ప్రకారం రాజకీయ పార్టీలు ప్రజల భావాలను, కోరికలను, ఆశయాలను తెలుసుకోవటమే కాక వాటిని వ్యక్తీకరించే సాధనాలుగా పని చేస్తాయి. అయితే నూతన దేశాలలో రాజకీయ పార్టీల పాత్రలో మరో కీలక అంశం ఉంది. ఈ దేశాలలో పార్టీల నాయకత్వం అట్టడుగు స్థాయి ప్రజల సమస్యలను తెలుసుకోవడమే కాక వాటిని పరిష్కరించేందుకు తగిన మార్గాలను అన్వేషిస్తుంది.

## 11.2. భారత పార్టీ వ్యవస్థ - లక్షణాలు:

పాల్‌బ్రాస్ భారత రాజకీయ పార్టీ వ్యవస్థను వర్ణిస్తూ భారత రాజకీయ పార్టీ వ్యవస్థ పరస్పరం వైరుధ్యం కలిగిన అనేక లక్షణాలను కలిగి ఉంది అని అన్నాడు. భారత దేశం పార్టీ వ్యవస్థ పాశ్చాత్య, ఆర్థిక ఉద్యోగి స్వామ్య వ్యవస్థ దేశీయ పద్ధతులు సంస్థలు కలిగిన భాగస్వామ్య రాజకీయాల సమ్మేళన అని పేర్కొన్నాడు. భారత దేశంలో అతి ప్రధాన పార్టీ అయిన భారత జాతీయ కాంగ్రెస్, ప్రపంచంలోని అతి పురాతన రాజకీయ పార్టీ అయినప్పటికి పాశ్చాత్య దేశాలలో పని చేస్తున్న విభిన్న తరగతులకు చెందిన సాంప్రదాయ పార్టీ వ్యవస్థలతో సారుప్యత కలిగిన సంస్థీకృత పార్టీవ్యవస్థగా రూపొందించడంలో విఫలమైంది. ఆధునిక భారత దేశంలో మార్క్సిస్ట్ కమ్యూనిస్ట్ సాంప్రదాయం బలంగా వేళ్ళూనుతుంది. అయితే ఇతర దేశాలలోలాగ భారత దేశంలోని కమ్యూనిస్ట్ పార్టీలు కాని కమ్యూనిస్ట్ ఉద్యమాలు కాని రాజకీయ సుస్థిరతను భగ్నం చేయలేకపోవడమే కాక ఇండోనేషియాలోలాగా పూర్తిగా అంతరించిపోలేదు. కాని ఈ పార్టీలు సంస్కరణ రాజకీయ పార్టీల రూపంలో దేశ సాధారణ రాజకీయాలలో మమేకం చెందాయి. అనేక వైవిధ్యాలు, భిన్నత్వాలు కలిగిన భారత సామాజిక వ్యవస్థ దేశంలోని వివిధ రాష్ట్రాలలోఅనేక ప్రాంతీయ రాజకీయ పార్టీలు, ఇతర రకాల పార్టీలు అవతరించేందుకు దారి తీయడం ద్వారా భారతదేశ పార్టీవ్యవస్థకు విశిష్టతను సంతరించాయి. అయితే భారతదేశంలోని మొత్తం పార్టీలకు కల ఉమ్మడి లక్షణాలలో వర్గతత్వం, వారసత్వం, లేనప్పటికి వివిధ పార్టీలలో కల సైద్ధాంతిక విభేధాలు ప్రధానమైనవి.

మొత్తం మీద వర్తమాన అభివృద్ధి చెందుతున్న దేశాలలో భారతదేశ రాజకీయ పార్టీ వ్యవస్థకు ప్రత్యేకత ఉంది. భారతదేశంలో గత ఐదు దశాబ్దాల నుంచి కేంద్రంలో, రాష్ట్రాలలో ప్రతి అధికార పార్టీకి ప్రత్యామ్నాయం ఉన్న పోటీ కల ఎన్నికల రాజకీయాలు కొనసాగుతూనే వస్తున్నాయి. అయినప్పటికి రాజకీయ పార్టీలు దేశంలోని వివిధ సామాజిక వర్గాలపై ఓటర్లపై బలమైన నియంత్రణను ఆధిక్యతను సంపాదించలేక పోయాయి.

భారత దేశ రాజకీయాలలో రాజకీయ పార్టీలతో ప్రమేయం లేని అనేక ఉద్యమాలు తలెత్తాయి. ఈ ఉద్యమాల ఫలితంగా దేశంలోని వివిధ వర్గాల మధ్య సంఘర్షణలు ఏర్పడ్డాయి. మొత్తం మీద భారత దేశ రాజకీయ పార్టీలతో ఇతర సంస్థలలో అధికార దోరణులకు, ప్రజాస్వామ్య ధోరణులకు, వికేంద్రీకరణ ధోరణులకు మధ్య ఉద్రిక్తతలు చోటు చేసుకున్నాయని పాల్ బ్రాస్ భావించాడు. ఈ ఉద్రిక్తతలు వ్యవస్తీకృతం చెందిన రాజకీయ పార్టీల మధ్య విభేదాలకు దారి తీసాయి. ఈ ఉద్రిక్తతల ఫలితంగా జాతీయ

సమస్యలను దేశంలోని నలుమూలలో ఉన్న ఓటర్లకు వివరించాలని కేంద్రంలో అధికారం కోసం పోటీ పడుతున్న ప్రధాన రాజకీయ పార్టీలు, వాటి నాయకులు ప్రయత్నిస్తున్నారు. మరో వైపు ఇతర రాజకీయ పార్టీలు గ్రామస్థాయి లేదా కులాలకు వర్తించే స్థానిక వ్యవహారలపై తమ దృష్టిని కేంద్రీకరిస్తున్నాయని పాల్ బ్రాస్ ప్రతిపాదించాడు.

## కొందరు రాజనీతి శాస్త్రవేత్తల అభిప్రాయం ప్రకారం:

భారతదేశంలోని పార్టీ వ్యవస్థ మరో ప్రధాన లక్షణం ప్రాంతీయ పార్టీలు, ప్రాంతీయత ఆధారంగా కలిగిన జాతీయ పార్టీల అవతరణ. స్వాతంత్ర్యానంతరం దేశంలో వివిధ ప్రాంతాల గుర్తింపు, ఆకాంక్షలను వ్యక్తీకరించే వాటికి ప్రాతినిధ్యం వహించే అనేక ప్రాంతీయ పార్టీలు ఏర్పాటు చేయబడ్డాయి. ఈ ప్రాంతీయ పార్టీలకు ఉమ్మడి భాష, సంస్కృతి ఆధారం. ఈ పార్టీలలో కొన్ని దేశ స్వాతంత్ర్యానికి పూర్వమే ఏర్పడ్డాయి. ఈ సాంప్రదాయ పార్టీలతో పాటు 1980 దశాబ్దంలో కొన్ని నూతన ప్రాంతీయ పార్టీలు (ఉదా: తెలుగుదేశం పార్టీ, అస్సాం పరిషత్) అవతరించాయి. ఈ ప్రాంతీయ పార్టీలు ప్రధానంగా ఆయా ప్రాంతాలకే పరిమితం.

భారతదేశానికి స్వాతంత్రం వచ్చిన మొదటి రెండు దశాబ్దాలు భారత జాతీయ కాంగ్రేస్ (Indian National Congress) రాజకీయ ఆధిక్యత కలిగిన పార్టీగా కొనసాగింది. ఈ దశలో కాంగ్రేస్ కేంద్రంలో, దేశంలోని దాదాపు మొత్తం రాష్ట్రాలలో అధికారంలో ఉంది. అయితే ఇదే సమయంలో దేశంలోని వివిధ రాజకీయ పార్టీల మధ్య స్వేచ్ఛాపూరిత మైన పోటి ప్రాతిపదికగల బహుళపార్టీ వ్యవస్థ, శక్తివంతమైన పార్లమెంటరీ సంస్థలు అభివృద్ధి చెందాయి. స్వాతంత్రం సిద్ధించిన తొలి సంవత్సరంలో దేశంలో కాంగ్రేస్, సోషలిస్ట్ పార్టీ, కమ్యూనిస్ట్ పార్టీ, కిసాన్‌మజ్‌దూర్ పార్టీ, ప్రజాపార్టీ, భారతీయ జనసంఘ్ పార్టీలు చురుకుగా పనిచేస్తూ దేశంలో పార్లమెంటరీ వ్యవస్థ బలపడటంలో కీలక పాత్ర వహించాయి. ఈ పార్టీలన్నీ తమ నిర్మాణం వ్యవస్థీకరణ విధానాలు, కార్యక్రమాలలో, పరిధిలో జాతీయ స్వభావాన్ని కలిగి ఉన్నాయి. ఈ పార్టీలన్నీ జాతీయ లక్ష్యాలు జాతీయ ప్రాముఖ్యత కలిగిన అంశాలను చేపట్టటమే కాక అఖిల భారత నాయకత్వం మార్గదర్శకత్వంలో మొత్తం దేశం సామాజిక ఆర్థిక రాజకీయాభివృద్ధికి అనేక కార్యక్రమాలను చేపట్టాయి.

ఈ దశలో కాంగ్రేస్‌తో పోల్చిచూస్తే ప్రతిపక్ష పార్టీలన్ని ప్రజల మద్దతు, పార్లమెంటు, రాష్ట్ర శాసనసభలో సీట్ల విషయంలో వెనుకబడి ఉన్నాయి. అయినప్పటికి అవి చురుకుగా పని చేస్తూ రాజకీయంగా క్రియాశీలక పాత్రను పోషించాయి. ఈ పార్టీలు 1951 నుంచి 1962 వరకు జరిగిన పార్లమెంటు, వివిధ రాష్ట్ర శాసనసభ ఎన్నికలలో 25 నుంచి 40 శాతం వరకు ఓట్లు పొందగలిగాయి. దీనితోపాటు ఈ పార్టీలు ప్రభుత్వంపై, పాలక పార్టీలపై ఒత్తిడిని తేవడం తోపాటు ప్రభుత్వ విధానాలను, కార్యక్రమాలను తీవ్రంగా విమర్శించాయి. వాస్తవానికి ఈ పార్టీలు ప్రభుత్వ విధానాలను గణనీయంగా ప్రభావితం చేసాయి. అయితే ఈ దేశంలో ప్రతిపక్ష పార్టీలు బలహీనంగా ఉండటానికి వాటి మధ్య ఐకమత్యం లేకపోవటం ప్రధాన కారణం. 1967లో నిర్వహించబడిన నాలుగవ సాధారణ ఎన్నికలు భారత రాజకీయాలు ప్రధానంగా పార్టీ వ్యవస్థను ఒక గొప్ప మలుపు తిప్పాయి. ఈ ఎన్నికలు ఫలితంగా పార్టీ వ్యవస్థ అనేక నాటకీయ పరిణామాలకు గురైంది.

మారిస్ జోన్స్, రజనీ కొఠారి లు 1967 వరకు భారతదేశంలో కొనసాగిన పార్టీ వ్యవస్థను ఏకపార్టీ అధిక్యత కలిగిన (Single Party Dominance) వ్యవస్థగా అభివర్ణించారు. దేశంలో విభిన్న పార్టీల మధ్య స్వేచ్ఛా పూరితమైన పోటీ ప్రాతిపదికగా కలిగిన బహుళ పార్టీ వ్యవస్థ ఉన్నప్పటికి భారత జాతీయ కాంగ్రేస్ పార్లమెంటు, రాష్ట్ర శాసనసభలలో సీట్లు, వ్యవస్థీకరణ, బలం, ప్రజల మద్దతుల పరంగ మిగిలిన పార్టీలకన్నా అతిబలమైన పార్టీ కావటం వల్ల ఈ రాజనీతి శాస్త్రవేత్తలు భారతదేశ పార్టీ వ్యవస్థను ఆధిక్యత కలిగిన పార్టీ వ్యవస్థగా అభివర్ణించారు. ఈ విధంగా ఈ దశలో భారతదేశంలో ఏకపార్టీ ఆధిక్యత కల బహుళపార్టీ వ్యవస్థ రూపుదిద్దుకుంది.

1967 తరువాత భారతదేశంలో మారిన పార్టీ వ్యవస్థను వివరిస్తూ రజనీకొఠారి ఆధిక్యత కల పార్టీ నమూనా స్థానంలో విభిన్నత్వం కలిగిన నిర్మాణం, పోటీతత్వం కలిగిన పార్టీ వ్యవస్థ రూపొందినదని పేర్కొన్నాడు. మారిస్ జోన్స్ 1967 తరువాత పార్టీ

వ్యవస్థను మార్కెట్ రాజకీయ వ్యవస్థగా వర్ణించాడు. 1967 ముందు కాలంలో భారత రాజకీయాలలో పోటి బేరసారాలు ఉన్నప్పటికి అవి కాంగ్రేస్ పార్టీకి మాత్రమే పరిమితం అని మారిస్ జోన్స్ సూచించాడు. 1967 సాదారణ ఎన్నికలలో కాంగ్రేస్ పార్టీ బలం క్షీణించడం వలన అనేక ప్రతిపక్ష పార్టీలురంగంలోనికి ప్రవేశించాయి. అంతవరకు కాంగ్రేస్ పార్టీలో అంతర్గతంగా ఉన్న పోటీ వివిధ పార్టీల మధ్య పోటీగా పరిణామం చెందిందని మారిస్ జోన్స్ పేర్కొన్నాడు. 1967 సాధారణ ఎన్నికల తరువాత భారత పార్టీ వ్యవస్థలో పార్టీ మార్పిడి (Defections) అనే నూతన దృగ్గోచరం అవతరించిందని రజనీ కొఠారి సూచించారు. రజనీ కొఠారీ 1967 ఎన్నికల అనంతరం భారత రాజకీయ పార్టీ వ్యవస్థలో కీలక అంశంగా రూపొందిన పార్టీ మార్పిడిలో రెండు కీలక లక్షణాలను గుర్తించాడు. ఒకటి పార్టీ మార్పిడి లో కాంగ్రేస్ నుంచి ఇతర పార్టీలకు, ఇతర పార్టీల నుంచి కాంగ్రేస్‌కు సంభవించాయి. అయితే కాంగ్రెస్ నుంచి ఇతర పార్టీలకు పార్టీ మార్పిడి విస్తృత స్థాయిలో జరిగింది. రెండు, కమ్యూనిస్ట్ పార్టీల్లో, జనసంఘ్‌లో పార్టీ మార్పిడి చోటు చేసుకోలేదు. 1971 ఎన్నికలలో శ్రీమతి గాంధీ నాయకత్వంలోని కాంగ్రెస్ పార్టీ విజయం సాధించటంతో 1967 తరువాత అంతరించిన ఏకపార్టీ ఆధిక్యత నమూనా తిరిగి అవతరించబడినది. మారిస్ జోన్స్ ఈ ఎన్నికల అనంతరం శ్రీమతి గాంధీ అనుసరించిన విధానాల వల్ల భారత రాజకీయాలు, పార్టీ వ్యవస్థ అనేక మౌళికమైన మార్పులకు గురైనట్లు పాశ్చాత్య భారత రాజనీతి శాస్త్రవేత్తలు ఏకాభిప్రాయాన్ని వ్యక్తపరిచారు. ఈ విధానం వల్ల కాంగ్రెస్ పార్టీలో అంతర్గత ప్రజాస్వామ్యం అంతరించిందని వారు సిద్దాంతీకరించారు. కాంగ్రెస్ పార్టీలో విపరీత స్థాయిలో అభివృద్ధి చెందిన కేంద్రీకరణ ధోరణి పార్టీలోని క్రిందిస్థాయి నాయకులు తమ సామర్ధ్యాన్ని కోల్పోవడం వంటి ప్రజలకు, పార్టీకి మధ్య అగాధం ఏర్పడకుండా దుష్పరిణామాలకు దారితీసిందని కొందరు శాస్త్రవేత్తలు వాదించారు.

ఈ సందర్భంలో కాంగ్రెసేతర ప్రతిపక్షాలలో గతంలోని విధంగా ఐతక్యం ఏర్పడింది. శ్రీ జయ ప్రకాష్ నారాయన్ నాయకత్వంలో దేశంలో ప్రతిపక్షాల ఉద్యమం అభివృద్ధి చెందింది. 1975 లో కేంద్ర ప్రభుత్వం విధించిన అత్యవసర పరిస్థితి ప్రతిపక్షాలలో ఐకమత్యం పెంపొందించటంతో పాటు కాంగ్రెస్ పార్టీలో కేంద్రీకృత ధోరణి మరింత బలపర్చింది.

1977 లో జరిగిన పార్లమెంటు ఎన్నికల సందర్భంలో జనతా పార్టీ అవతరించడంతో భారత దేశ పార్టీ వ్యవస్థ చరిత్రలో నూతనధ్యాయం ప్రారంభమైనది. జనతా పార్టీ అవిర్భావం దేశ పార్టీ వ్యవస్థలో కొన్ని నూతన ధోరణులకు నాంది. ఈ పార్టీ అవతరణ అనంతర కాలంలో జేమ్స్ మనోర్ (James Manor) వివిధ రాజకీయ పార్టీల మధ్య ఘర్షణ జరగటం. తరువాత రాజకీయ పార్టీలతో పాటు ఇతర రాజకీయ సంస్థలు పతనం చెందటం ప్రారంభమైందని పేర్కొన్నారు.

ఈ దశలో రాజకీయ పార్టీలతో సహా వివిధ రాజకీయ సంస్థలు సమాజం నుంచి ఉత్పన్నమయ్యే సమస్యలకు లేదా ఒత్తిళ్ళకు హేతుబద్ధంగా సమర్ధవంతంగా సృజనాత్మకంగా ప్రతిస్పందించే సామర్ధ్యాన్ని కోల్పోయాయి. ఈ క్షీణత ప్రతిపక్షాలతో పాటు కాంగ్రెస్ పార్టీలలో కూడా సంభవించినట్లు మనోర్ పేర్కొన్నాడు. ఈ విధంగా రాజకీయ సంస్థలు క్షీణించినప్పటికీ 1970-80 దశాబ్దంలో ప్రజలలో ఒక నూతన చైతన్యం (New Consciousness) పెంపొందిందని మనోర్ పేర్కొన్నాడు. ఈ చైతన్యం ఫలితంగా ఓటర్లలో ఎన్నికల రాజకీయాల పట్ల, రాజకీయ నాయకుల పట్ల, రాజకీయ పార్టీలు నిర్వహించవలసిన పాత్ర పట్ల అవగాహన ఏర్పడింది. దీని ప్రభావం వల్ల ఓటర్లు శక్తివంతులు కావటంతో పాటు, వివిధ ప్రయోజన గణాలు స్పష్టమైన రూపును సంతరించుకోవటంతో పాటు, వాటి మధ్య సంఘర్షణ వృద్ధి చెందింది. ఈ విధంగా ప్రజలలో పెరిగిన చైతన్యం, రాజకీయ సంస్థల క్షీణత ఐదు ప్రధాన మార్పులకు దారి తీసి నట్లు జేమ్స్ మనోర్ సూచించారు. మొదటగా, ఎన్నికలలో పార్టీ జయాపజయాల విధానంలో మార్పు సంభవించింది. 1972 తరువాత అధికారంలో ఉన్న రాజకీయ పార్టీ ఎన్నికల్లో తిరిగి ఎన్నిక కావడం కష్టసాధ్యం అయింది. రెండు, సాంఘిక సంక్షేమాన్ని సాధించే సాధనంగా ప్రభుత్వం ప్రజల విశ్వాసాన్ని కోల్పోయింది. మూడు, సమాజం, రాజకీయాల మధ్య అంతరం ఏర్పడింది. సమాజం డిమాండ్లను తృప్తి పరచటంలో రాజకీయ సంస్థలు ప్రధానంగా రాజకీయ పార్టీలు సామర్ధ్యాన్ని కోల్పోవటంతో వివిధ సామాజిక వర్గాలు రాజకీయాలకు, రాజకీయ న్యాయకులకు దూరమై ప్రాంతీయ అభిమానంపై, స్థానిక వనరులపై ఆధారపడటం మొదలైంది. దాని ఫలితంగా దేశంలోని వివిధ సామాజిక వర్గాల మధ్య సంఘర్షణ పెరిగింది. అయితే రాజకీయ పార్టీలతో సహా రాజకీయ సంస్థలకు ఈ సంఘర్షణను నివారించే సామర్ధ్యం లోపించింది. నాలుగు, వివిధ స్థాయిలలో రాజకీయ పార్టీలు, వాటి మద్దతుదార్ల మధ్య సంబంధాలు క్షీణించాయి. ఈ దుగ్గోచరం ఫలితంగా రాజకీయ పార్టీలు తమకు

మద్దతు నిచ్చే సామాజిక వర్గాలతో స్పష్టమైన సంబంధాలను పెంపొందించుకున్నాయి. ఐదు, జాతీయ స్థాయి, స్థానిక స్థాయిల రాజకీయాల మధ్య స్పష్టమైన విభజన జరిగింది, 1980 దశాబ్దంలో అనేక రాష్ట్రాలలో ప్రాంతీయ స్థాయీ పార్టీల అవతరణ ఈ పరిణామానికి గొప్ప దృష్టాంతం.

ఈ మార్పుల నేపథ్యంలో పరిశీలిస్తే 1977-84 ల మధ్య కాలంలో దేశంలోని పార్టీ వ్యవస్థ అస్థిరతకు గురికావడమే కాక వాటి మధ్య స్వేచ్ఛాయుత పోటీ పెరిగిందని గుర్తించవచ్చును. ఈ దశలో తలెత్తిన ధోరణులలో వివిధ పార్టీలలో అనైక్యత పెరగటం, కేంద్ర, రాష్ట్రాలలో అధికారంలో ఉన్న పార్టీల మధ్య విభేదాలు తలెత్తటం, పార్టీలు వాటి చీలికలపై నాయకుల వ్యక్తిగత నియంత్రణ పెరగటం, వివిధ పార్టీలలో వర్గాలు ఏర్పడడం, పార్టీ మార్పిడులు ప్రధానమైనవిగా పేర్కోనవచ్చును.

1977లో కేంద్రంలో అధికారంలో వచ్చిన జనతాపార్టీ 1979 లో అధికారాన్ని కోల్పోవటమే కాక నాలుగు భిన్న పార్టీలుగా చీలిపోయింది. 1980లో నిర్వహించబడిన లోక్‌సభ మధ్యంతర ఎన్నికలలో ఇందిరా గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ తిరిగి అధికారంలోకి రావడం జరిగింది. ఈ పరిణామం ఫలితంగా రాజకీయ పార్టీల జాతీయ రాష్ట్రస్థాయి నాయకుల మధ్య సంబంధాలు క్షీణించాయనే వాస్తవాన్ని బహిర్గతం చేసింది. 1980 లో సంభవించిన రాజకీయ పరిణామాల వల్ల కాంగ్రేసేతర ప్రతిపక్ష పార్టీలు బాగా బలహీనపడ్డాయని రాజనీతి శాస్త్రవేత్తలు వెల్లడించారు.

## 11.3 భారత పార్టీ వ్యవస్థ చరిత్ర - స్వాతంత్ర్యానికి పూర్వ పరిస్థితి

భారత దేశంలో రాజకీయ పార్టీలు సుదీర్ఘమైన చారిత్రక ప్రక్రియ ఫలితం. ఇవి విదేశాలనుంచి దిగుమతి అయిన సంస్థలు కావు. బ్రిటిష్ ప్రభుత్వం దేశంలో ఎన్నికలు ప్రక్రియ ప్రవేశపెట్టకముందే భారత దేశంలో ప్రభావిత పూరితమైన రెండు రాజకీయ వ్యవస్థలు ఉన్నాయి. వాటిలో ఒక వ్యవస్థ నూతనంగా అవతరించిన మధ్య తరగతి వర్గాలకు ప్రాతినిధ్యం వహించింది. మధ్య తరగతి వర్గాలకు చెందిన సంస్థలో 1885 లో స్థాపించబడిన భారత జాతీయ కాంగ్రెస్ ప్రముఖమైంది. భారత జాతీయ కాంగ్రెస్‌లో భిన్న ప్రయోజనాలు భావజాలాలు కలిగిన విభిన్న వర్గాలు ఉన్నాయి. కాంగ్రెస్‌లో ఉదారభావాలు కలిగిన రాజ్యాంగవాదానికి కట్టుబడిన మితవాదులు,త విప్లవభావాలు ఆదర్శాలు కలిగిన అతివాదులు అనే రెండు ప్రధాన వర్గాలు ఏర్పడ్డాయి. వీరిలో మితవాదులు, ఉన్నత స్థాయి మధ్య తరగతికి, అతివాదులు దిగువ స్థాయి మధ్యతరగతికి ప్రాతినిధ్యం వహించారు.

భారత జాతీయ కాంగ్రెస్ తొలి చరిత్ర బ్రిటిష్ ప్రభుత్వం నుండి అధికారాన్ని హస్తగతం చేసుకునేందుకు అనుసరించవలసిన పద్ధతులపై భిన్న అభిప్రాయాలు కలిగిన వివిధ వర్గాల మధ్య వివిధ రాజకీయ పోరాటాల చుట్టూ కేంద్రీకృతమైంది. 1920 దశాబ్దం వరకు ఈ పోరాటాలు సమాజంలోని ఉన్నత మధ్య తరగతి వర్గాలకు మాత్రమే పరిమితం అయ్యాయి. 1920 దశాబ్దంలో రాజకీయ ప్రవేశం చేసిన గాంధీ కాంగ్రెస్ పార్టీని ఒక ప్రజా బహుళ ఉద్యమంగా మార్పు చేసారు. గాంధీ మొట్టమొదటి సారిగా సత్యాగ్రహ లేదా సహాయ నిరాకరణ ఉద్యమాన్ని ప్రారంభించారు. 1910వ దశాబ్దంలో బ్రిటీష్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎన్నికల ప్రక్రియ ఫలితంగా కాంగ్రెస్ రాజకీయ పార్టీ స్వభావాన్ని సంతరించుకుంది. బ్రిటీష్ ప్రభుత్వం సృష్టించిన జాతీయ శాసన సభలకు నిర్వహించిన ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు పోటీ చేసారు.

1920 దశాబ్దంలో భారత దేశంలో కొన్ని ఇతర రాజకీయ పార్టీలు అవతరించాయి. 1924లో భారత కమ్యూనిస్ట్ పార్టీ ఏర్పడింది. ఇదే సమయంలో మద్రాస్ జస్టిస్ పార్టీ అనే బ్రాహ్మణేతర పార్టీ స్థాపించబడినది. వీటితో పాటు వివిధ రాష్ట్రాలలో వివిధ ప్రాంతీయ పార్టీలు అవతరించి నూతనంగా ఏర్పడిన రాష్ట్ర శాసనసభల ఎన్నికల్లో పోటీ చేయడం ప్రారంభమైంది. ఎన్నికల ప్రక్రియలో పాల్గొనేందుకు రాజకీయ పార్టీలు అవసరమైన యంత్రాంగాన్ని ఏర్పరచుకున్నాయి. ఈ విధంగా 1920 దశాబ్దంలో అనేక రాజకీయ పార్టీలు అవతరించడమే కాక ఎన్నికల ప్రక్రియలో పాల్గొనడం ప్రారంభించాయి. అయితే ఈ దశలో ఓటర్ల సంఖ్య పరిమితం. ఎన్నికైన ప్రజా ప్రతినిధుల అధికారాలు కూడా అతి పరిమితం. అందుచేత ఎన్నికల్లో పాల్గొనడం రాజకీయ పార్టీల భవిష్యత్తుకు ప్రాముఖ్యత వహించలేదు.

బ్రిటీష్ ప్రభుత్వం 1923 లో ప్రవేశపెట్టిన భారత ప్రభుత్వ చట్టం జాతీయ స్థాయిలోనే కాక ప్రాంతీయ స్థాయిలో కూడా రాజకీయ ప్రక్రియను విస్తృత పరిచింది. 1936-37 లో జాతీయ, రాష్ట్ర స్థాయి శాసనసభలకు నిర్వహించిన ఎన్నికలు భారత పార్టీ వ్యవస్థ చరిత్రలో ఒక కీలకమైన అధ్యాయం. దేశంలోని 11 రాష్ట్రాల శాసన సభలకు నిర్వహించిన ఎన్నికలలో 6 రాష్ట్రాల శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీ అఖండ విజయాన్ని సాదించింది. మొత్తం 1585 రాష్ట్ర శాసనసభ సీట్లలో కాంగ్రెస్ 706 సీట్లను గెలుచుకుంది. ఈ ఎన్నికలలో అనేక ప్రాంతీయ పార్టీలు తుడిచిపెట్టుకు పోయాయి. పది రాష్ట్రాలలో కాంగ్రెస్ మంత్రి వర్గాలను ఏర్పరచింది.

మొదటి నుంచి భారతదేశంలో ముస్లీం నాయకులు భారత జాతీయ కాంగ్రెస్ పట్ల ఆకర్షితులు కాలేదు. వారు కాంగ్రెస్ విధానాలను వ్యతిరేకిస్తూ వచ్చారు. అందుచేత వారు తమ స్వంత వ్యవస్థలను ఏర్పరచుకున్నారు. 1906లో దేశంలో మొట్టమొదటి ముస్లిం జాతీయ సంస్థ ముస్లిం లీగ్ ఏర్పడింది. ధనిక, భూస్వామ్య వర్గం ముస్లింలీగ్ అవతరణలో కీలకపాత్ర వహించింది. ముస్లిం లీగ్ నాయకులు ఎన్నికలను మెజారిటీ అయిన హిందువులు, మైనారిటీ వర్గం అయిన ముస్లిం లపై ఆధిపత్యాన్ని వహించేందుకు సాధనంగానే కాక, హిందు మధ్య తరగతి వర్గం, ముస్లింల ధనిక వర్గాన్ని ఎదిరించేందుకు సహాయపడే సాధనంగా పరిగణించారు.

1937 లో జరిగిన శాసనసభల ఎన్నికలలో ముస్లిం లీగ్ ఘోరంగా విఫలమైంది. ఏ రాష్ట్రంలోనూ ఈ పార్టీ ముస్లింలకు కేటాయించిన స్థానాలలో ఎక్కువ స్థానాలను గెలుచుకోలేకపోయింది.. అయినా ముస్లీంలీగ్ ముస్లీం ప్రజలకు ప్రత్యేక రక్షణలు కొరకు పోరాటం ప్రారంభించింది. చిట్టచివరిగా ముస్లింలీగ్ ముస్లింల కొరకు ప్రత్యేక దేశాన్ని ఏర్పాటు చేయాలని వాదించటం ప్రారంభించింది. 1940లో లాహోర్‌లో నిర్వహించిన సమావేశంలో ముస్లిం లీగ్ దేశ విభజనను ముస్లింల స్వతంత్ర దేశంగా పాకిస్థాన్‌ను ఏర్పాటు చేయాలనే చారిత్రాత్మక తీర్మానాన్ని ఆమోదించింది. అయితే కాంగ్రెస్ దేశ విభజనను తీవ్రంగా వ్యతిరేకించింది. 1946లో జరిగిన రాష్ట్ర శాసనసభల ఎన్నికలలో మొత్తం 492 స్థానాలలో ముస్లీంలీగ్ 428 స్థానాలను గెలుచుకుంది. దీనితో పాటు కేంద్ర శాసనసభకు జరిగిన ఎన్నికలలో ముస్లీంలను కేటాయించిన మొత్తం 30 స్థానాలలో అధిక స్థానాలను గెలుచుకుంది.

1947లో బ్రిటీష్ ప్రభుత్వం సైనిక న్యాయ వ్యవస్థలతో పాటు రాజకీయాధికారాన్ని స్వాతంత్ర్యోద్యమానికి నాయకత్వం వహించిన ఒక రాజకీయ పార్టీకి (జాతీయ కాంగ్రెస్) విడిచిపెట్టి భారత దేశాన్నుంచి నిష్క్రమించింది. కాంగ్రెస్ నాయకత్వం దేశానికి స్వాతంత్ర్యాన్ని సముపార్జించడంతో పాటు ఎన్నికల ప్రక్రియలో ప్రభుత్వాన్ని నిర్వహించటంలో అనుభవాన్ని గడించింది. మిగతా దేశాలకు భిన్నంగా, కాంగ్రెస్ పార్టీ జాతీయ ఉద్యమానికి నాయకత్వం వహించడంతో పాటు, ఎన్నికల ప్రక్రియ అనుభవాన్ని పొందింది. వలస పాలనలో పనిచేసిన పార్టీ వ్యవస్థ స్వాతంత్ర్యానంతరం దేశంలో ఎన్నికల వ్యవస్థ అభివృద్ధి చెందేందుకు అవసరమైన ప్రాతిపదికను ఏర్పరచింది.

## 11.4. స్వాతంత్ర్యానంతరం భారతదేశంలో పార్టీ వ్యవస్థ:

స్వాతంత్ర్యానంతరం, భారతరాజ్యాంగం దేశంలో ప్రజాస్వామ్య పార్లమెంటరీ వ్యవస్థను ఏర్పరిచింది. దీనికి అనుగుణంగా సార్వత్రిక వయోజన ఓటింగ్ విధానాన్ని ప్రవేశపెట్టింది. రాజ్యాంగం ఐదు సంవత్సరాలకొకసారి ప్రజలు ఎన్నుకునే ప్రతినిధులు కల్గిన జాతీయ పార్లమెంటును, రాష్ట్ర శాసనసభలను స్థాపించింది. పార్లమెంటుకు రాష్ట్రాల శాసనసభలకు ఎన్నికలను నిర్వహించేందుకు ఒక స్వతంత్రమైన ఎన్నికల కమీషన్‌ను ఏర్పాటు చేసింది. ఎన్నికల కమీషన్ వివిధ ఎన్నికలను నిర్వహించటంతో పాటు ఓటర్ల నమోదు, జాతీయ ప్రాంతీయ రాజకీయ పార్టీలను గుర్తించడం ఎన్నికలను నిర్వహించడం మొదలైన బాధ్యతలను నిర్వహిస్తుంది. స్వాతంత్ర్యానంతరం ఎన్నికల కమీషన్ అనేక జాతీయ పార్టీలను గుర్తించింది. వీటిలో జాతీయ కాంగ్రెస్, ఉభయ కమ్యూనిస్ట్ పార్టీలు, భారత జనసంఘ్, స్వతంత్రపార్టీ, సోషలిస్టు పార్టీ ప్రధానమైనవి. ఈ పార్టీలలో కాంగ్రెస్ పార్టీ, ఉభయ కమ్యూనిస్ట్ పార్టీలు నేటికి కొనసాగుతున్నాయి. అయితే కాంగ్రెస్ పార్టీ అనేకసార్లు చీలికకు గురైంది. చివరకు ఇందిరాగాంధి నాయకత్వం వహించిన కాంగ్రెస్ మాత్రమే ఉనికిలో ఉంది. స్వతంత్ర పార్టీ కొద్దికాలం మాత్రమే కొనసాగి, తర్వాత ఇతర పార్టీలతో విలీనమైంది. సోషలిస్ట్ పార్టీ అనేకసార్లు చీలి ఇతర పార్టీలలో విలీనమైంది. మొదట్లో జనసంఘ్ పార్టీ కొన్ని హిందీ రాష్ట్రాలకు పరిమితయింది. జనసంఘ్ 1977లో ఏర్పడిన జనతా పార్టీలో విలీనమైంది. 1979లో జనతాపార్టీ నుంచి వీడిపోయిన భారత జనతా పార్టీ ఏర్పడి దేశంలో అన్ని

రాష్ట్రాలలో విస్తరించింది. ఉభయ కమ్యూనిస్ట్ పార్టీలు పశ్చిమ బెంగాల్, కేరళ రాష్ట్రాలతో పాటు త్రిపుర, మణిపూరు మొదలైన చిన్న చిన్న రాష్ట్రాలలో బలంగా ఉన్నా. 1980 దశాబ్దంలో అనేక రాష్ట్రాలలో ఎన్నో ప్రాంతీయ పార్టీలు అవతరించాయి.

## 11.4.1 భారత జాతీయ కాంగ్రెస్

వలసపాలన కాలంలో స్వాతంత్ర్యోద్యమానికి నాయకత్వం వహించిన, స్వాతంత్ర్యానంతరం కేంద్రంలో, దాదాపు మొత్తం రాష్ట్రాలలో అధికారాన్ని చేపట్టిన జాతీయ కాంగ్రెస్ 1885లో ప్రారంభించబడింది. స్వాతంత్రోద్యమ కాలంలో కాంగ్రెస్ పార్టీ అనేక పరిణామాలకు గురైంది. జన ఒత్తిడి గణంగా అవతరించిన కాంగ్రేస్ 1920 దశాబ్దంలో గాంధీ నాయకత్వంలోఒక ప్రజా బహుళ రాజకీయపార్టీగా రూపుదిద్దుకుంది. 1935 లో ప్రాంతీయ స్వపరిపాలన విధానం ప్రవేశ పెట్టబడిన తర్వాత కాంగ్రెస్ అనేక రాష్ట్రాలలో అధికార పార్టీగా అవతరించింది.. 1947లో దేశానికి స్వాతంత్రం సిద్ధించాక కాంగ్రెస్ పార్టీ దేశంలో అతి ప్రధాన పార్టీగా, అధికార పార్టీగా రూపొందింది. 1950 నుంచి కాంగ్రెస్ పార్టీ వర్గ తత్వానికి, అంతర్గత పోటీకి నిలయమైంది. ఈ సైద్ధాంతిక భావాలకన్న, వ్యక్తి ప్రాధాన్యత కీలక స్థానం ఆక్రమించింది. 1950 నుంచి కాంగ్రెస్ పార్టీపై ప్రధాన మంత్రి నెహ్రూ ఆధిపత్యం అత్యంత శక్తివంతంగా కొనసాగింది. నెహ్రూ నాయకత్వం కాంగ్రెస్ 1950 నుంచి 1962 వరకు జరిగిన సాధారణ ఎన్నికలలో కాంగ్రెస్ ఘనవిజయాన్ని సాధించింది.

1962 లో నెహ్రూ మరణానంతరం కాంగ్రెస్ పార్టీ గణనీయంగా బలహీనపడింది. నెహ్రూ అనంతరం 1967లో నిర్వహించిన నాలుగవ సాధారణ ఎన్నికలు ఈ వాస్తవాన్ని వెల్లడించాయి. ఈ ఎన్నికలలో పార్లమెంటులో కాంగ్రెస్ పార్టీ గెల్చుకున్న స్థానాల సంఖ్య క్షీణించటమే కాక ఎనిమిది రాష్ట్రాలలో శాసనసభలలో ఈ పార్టీకి అవసరమైన మెజారిటీ స్థానాలు రాకపోవటంలో అధికారాన్ని కోల్పోయి ప్రతిపక్షంగా మారింది. నెహ్రూ అనంతరం శ్రీమతి గాంధీ, కాంగ్రెస్ పార్టీ నాయకత్వాన్ని చేపట్టింది. శ్రీమతి గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ విప్లవాత్మకమైన మలుపు తిరిగింది. అనేక కారణాల వలన 1969 లో కాంగ్రెస్ (ఆర్) కాంగ్రెస్ (O) అనే రెండు పార్టీలుగా చీలింది. శ్రీమతి ఇందిరాగాంధీ నాయకత్వం వహించిన కాంగ్రెస్ (ఆర్) బలోపేతం అయింది. ఇందిరాగాంధి నాయకత్వంలో కాంగ్రెస్ (ఆర్) 1971 లో నిర్వహించిన లోక్‌సభ మధ్యంతర ఎన్నికలలో ఘన విజయాన్ని సాధించింది. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ 518 లోక్‌సభ స్థానాలలో 352 స్థానాన్ని గెల్చుకుంది. ఈ ఘన విజయాల ఫలితంగా కాంగ్రెస్ పార్టీ కోల్పోయిన తన పూర్వ వైభవాన్ని తిరిగి పొందగల్గింది.

1973 నుంచి కాంగ్రెస్ పార్టీలో అనేక మార్పులు చోటుచేసుకోవటం ప్రారంభమైనది. ఈ మార్పుల ఫలితంగా 1977లో కాంగ్రెస్‌ను ఓడించి కొత్తగా ఏర్పడిన జనతా పార్టీ కేంద్రంలో అధికారం లోకి వచ్చింది. ఈ ఎన్నికల అనంతరం 1978 లో కాంగ్రెస్ పార్టీ కాంగ్రెస్ (ఇందిరా) లేదా కాంగ్రెస్ (ఐ), కాంగ్రెస్ (దేవరాజ్ (అర్స్) లేదా కాంగ్రెస్ (యు) అనే రెండు పార్టీలుగా ఏర్పడింది. జనతా ప్రభుత్వం పతనం ఫలితంగా 1980 లో జరిగిన లోక్‌సభ మధ్యంతర ఎన్నికలలో శ్రీమతి గాంధీ నాయకత్వంలోని కాంగ్రెస్ (ఐ) అఖండ విజయాన్ని సాధించి కేంద్రంలో తిరిగి అధికారాన్ని చేపట్టింది. 1984 లో శ్రీమతిగాంధీ హత్య అనంతరం రాజీవ్‌గాంధీ కాంగ్రెస్ (ఐ) నాయకత్వాన్ని చేపట్టారు. 1985లో నిర్వహించిన లోక్‌సభ ఎన్నికలలో రాజీవ్‌గాంధీ నాయకత్వంలోని కాంగ్రెస్ (ఐ) పార్టీకి అనూహ్యమైన విజయం లభించింది.

1989 మేలో రాజీవ్‌గాంధీ హత్య అనంతరం కాంగ్రెస్ పార్టీ ఎన్నికల పరంగా, వ్యవస్థీకరణ పరంగా గతంలో ఏనాడు లేనివిధంగా బలహీనపడింది. రాజీవ్‌గాంధీ తర్వాత శ్రీ పి.వి. నరసింహారావు కాంగ్రెస్ పార్టీ నాయకత్వాన్ని చేపట్టారు. దీనితో మొట్టమొదటి సారిగా కాంగ్రెస్ నాయకత్వం నెహ్రూ వంశానికి చెందని వ్యక్తి పరం అయినది. శ్రీ. పి.వి. నరసింహారావు నాయకత్వంలో 1991లో జరిగిన లోక్‌సభ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ 227 స్దానాలు గెల్చుకొని, లోక్‌సభలో అతిపెద్ద పార్టీగా అవతరించింది. 1992 ఏప్రిల్‌లో నిర్వహించిన పార్టీ సంస్థాగత ఎన్నికలలో శ్రీ. పి.వి. నరసింహరావు పార్టీ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. 1996, 1998, 1999 లో నిర్వహించిన లోక్‌సభ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ లోక్‌సభలో రెండవపార్టీగా అవతరించింది. ఈ ఎన్నికలలో అతిపెద్ద పార్టీగా అవతరించిన భారతీయ జనతాపార్టీ అనేక ఇతర పార్టీలతో కలిసి సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పరచటం తో 1996 నుంచి కాంగ్రెస్ పార్టీ లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్షంగా కొనసాగుతుంది.

## 11.4.2. జనతా పార్టీ :

1975 లో విధించబడిన అత్యవసర పరిస్థితి చివరిదశలో కమ్యూనిస్టేతర పార్టీలైన కాంగ్రెస్ (O) జన సంఘ, భారతీయ కాంతిదళ్, సోషలిస్టు పార్టీలు, కాంగ్రెస్ నుండి విడిపోయిన జగజ్జీవన్‌రాం, బహుగుణ, నందినీ సత్పతి స్థాపించిన కాంగ్రెస్ ఫర్ డెమోక్రసి విలీనమై 1977 ఫిబ్రవరిలో జనతాపార్టీగా ఏర్పడ్డాయి. జనతాపార్టీ విధానాలు, కార్యక్రమాలకు చరణ్‌సింగ్ భావాలు ప్రాతిపదిక, ఈ భావాలకు అనుగుణంగా జనతాపార్టీ వ్యవసాయాభివృద్ధి, స్వయం పోషకత్వం కల్గిన రైతాంగం, అధిక సంఖ్యలో కార్మికులకు ఉపాధి కల్పన, చిన్నతరహా పరిశ్రమలు అభివృద్ధికి ప్రాధాన్యతను కనపర్చటంతో పాటు వికేంద్రీకృత ప్రణాళీకరణ విధానానికి కట్టుబడింది. 1977లో జరిగిన లోక్‌సభ ఎన్నికలలో జనతా పార్టీ 330 స్థానాలు గెల్చుకుంది. కేంద్రంలో మొట్టమొదట కాంగ్రెసేతర ప్రభుత్వాన్ని ఏర్పరచింది. ఆరవ పంచవర్ష ప్రణాళికలో వ్యవసాయ రంగాన్ని గతం కన్న అధిక పరిమాణంలో నిధులు కేటాయించటం ద్వారా భారత ఆర్థిక వ్యవస్థలో మార్పుకు నాంది పలికింది.

జనతా ప్రభుత్వం ఏర్పడిన కొంత కాలంలోనే పార్టీ లోని అగ్రగణ్యులైన మొరార్జిదేశాయ్, చరణ్‌సింగ్, జగ్‌జీవన్‌రామ్‌ల మధ్య విబేధాలు తలెత్తాయి. ఈ విభేదాలు తీవ్రతరమై చివరకు ఆ పార్టీ పతనానికి దారితీసాయి. జనాతా పార్టీ పతనానంతరము 1980 లో జరిగిన లోక్‌సభ మధ్యంతర ఎన్నికలలో శ్రీమతి గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ 353 స్థానాలను సాధించి తిరిగి కేంద్రంలో అధికారాన్ని చేపట్టింది. ఈ ఎన్నికల అనంతరం జనతా పార్టీలో విలీనమైన పార్టీల పేర్లతో నూతన పార్టీలుగా అవతరించటం లేదా పూర్తిగా రద్దు కావటం జరిగింది. జనతా పార్టీలోని జనసంఘ్ భారతీయ జనతాపార్టీగా అవతరించంది. 1988లో లోక్‌దళ్, లోక్‌దళ్ (ఐ) లోక్‌దళ్ (బి) గా అనే 2 విభిన్న పార్టీలుగా అయింది. చంద్ర శేఖర్ నాయకత్వంలో జనతా పార్టీ ఒక స్వతంత్ర పార్టీగా కొనసాగింది.

1988 కాంగ్రెస్ నుండి వీడిపోయిన వి.వి.సింగ్ నాయకత్వంలో జనతా పార్టీ, జనతాపార్టీ నుండి వీడిపోయిన కొన్ని పార్టీలు కల్సి జనతాదళ్ అనే పార్టీని ఏర్పాటు చేసాయి. వి.పి.సింగ్ ఆయన సహచరులు, చంద్రశేఖర్ నాయకత్వంలోని జనతాపార్టీ లోక్‌దళ్ పార్టీలోని చీలిక వర్గాలు, కాంగ్రెస్ (ఎస్)లోని ఒక వర్గం కల్సి జనతాదళ్ పార్టీ ఏర్పాటు చేసాయి. 1989లో జరిగిన లోక్‌సభ ఎన్నికల సమయంలో జనతాదళ్ కొన్ని ప్రాంతీయ పార్టీలు జాతీయ ఫ్రంట్ అనే కూటమిగా ఏర్పడి ఈ ఎన్నికలలో పోటీ చేసాయి. ఈ ఎన్నికలలో జాతీయ ఫ్రంట్ కూటమికి తగిన మెజారిటీ రాకపోయినప్పటికి బిజెపి, మార్కిస్ట్ కమ్యూనిస్ట్ పార్టీల సహకారంతో కేంద్రంలో అధికారాన్ని ఏర్పాటు చేయకల్గింది. 1991 అక్టోబర్‌లో అయోధ్య అంశంపై బిజెపి తనమద్దతును ఉపసంహారించుకోవటంతో నేషనల్ ఫ్రంట్ ప్రభుత్వం పతనమైంది. దాని స్థానంలో చంద్రశేఖర్ నాయకత్వంలో కల జనతాదళ్, చీలిక వర్గం కాంగ్రెస్ మద్దతులో ప్రభుత్వాన్ని ఏర్పరచింది. 1991 లో మేలో జరిగిన లోక్‌సభ మధ్యంతర ఎన్నికలలో పి.వి. నరసింహారావు నాయకత్వంలో కాంగ్రెస్ మైనార్టి ప్రభుత్వం అధికారాన్ని చేపట్టింది.

## 11.4.3. భారతీయ జనతాపార్టీ:

1978లో జనతాపార్టీ పతనమైన తర్వాత జనతాపార్టీలోని ఒకప్పటి భారతీయ జనసంఘ్, భారతీయ జనతాపార్టీ అనే పేరుతో ఒక నూతన పార్టీగా అవతరించింది. 1989లో జరిగిన లోక్‌సభ ఎన్నికలలో బిజెపి 85 సీట్లు, 11.4 శాతం ఓట్లను గెల్చుకొని లోక్‌సభలో కాంగ్రెస్, జనతాదళ్ తర్వాత నూతన అతిపెద్ద పార్టీగా అవతరించింది. 1990 లో జరిగిన మధ్యప్రదేశ్, హిమాచల ప్రదేశ్. శాసనసభ ఎన్నికలలో మెజారిటీ స్థానాలను గెల్చుకొని ఆయా రాష్ట్రాలలో అధిక శాతం సీట్లను గెల్చుకుని ఆ రాష్ట్రాలలో సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పరచింది.

1991 మే, జూన్‌లలో జరిగిన లోక్‌సభ ఎన్నికలలో అయోధ్యలో రామమందిరం నిర్మాణం అంశంగా పోటీ చేసిన బిజెపి 119 సీట్లతో కాంగ్రెస్ తర్వాత అతిపెద్ద పార్టీగా అవతరించి ఈ పార్లమెంటు అనంతరకాలాలలో నిర్వహించిన ఉత్తరప్రదేశ్, గుజరాత్ శాసనసభ ఎన్నికలలో అధిక స్థానాలను గెల్చుకుని ఈ రాష్ట్రాలలో ప్రభుత్వాన్ని ఏర్పరిచంది. ఇదే విధంగా కొన్ని ఇతర రాష్ట్రాల

శాసనసభ ఎన్నికలలో కూడా బిజెపిగణనీయమైన సంఖ్యల్లో స్థానాలను గెల్చుకుంది. ఈ విధంగా 1990 దశాబ్దం ప్రారంభంలో నిర్వహింపబడిన పార్లమెంట్, వివిధ శాసనసభ ఎన్నికలలో బిజెపి విజయాలకు ఆ పార్టీ చేపట్టిన హిందూ జాతీయవాదం నినాదం ప్రధానంగా తోడ్పడిందని విశ్లేషకులు వాదిస్తున్నారు.

ఈ వివాదాన్ని ఉపయోగించుకొని బిజెపి ఎన్నికల్లో మెజార్టీ హిందువుల మద్దతును పొందగలిగిందని ఈ విశ్లేషకులు పేర్కొన్నారు. అయితే ఈ పార్టీ అనుసరించిన ఈ విధానం ఫలితంగా ముస్లింలు మరికొన్ని ఇతర వర్గాల నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదుర్కొనవలసివచ్చినదని వీరు అభిప్రాయపడ్డారు. ఏమైనప్పటికి 1990 దశాబ్దంలో బిజెపి దేశంలో ఒక బలీయమైన రాజకీయ శక్తిగా అభివృద్ధి చెంది కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయంగా రూపొందింది.

1996 లో నిర్వహింపబడిన లోక్‌సభ ఎన్నికల్లో బిజెపి లోక్‌సభలో అతిపెద్ద పార్టీగా అవతరించి కొన్ని ప్రాంతీయ పార్టీలు, ఇతర పార్టీలుతో కలిసి వాజ్‌పేయ్ నాయకత్వంలో సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పరచింది. 1998లో, 1999 లో నిర్వహింపబడిన లోక్‌సభ మధ్యంతర ఎన్నికలలో కూడా బిజెపి అతిపెద్ద పార్టీగా తనస్థానాన్ని నిలబెట్టుకొని తన మిత్ర పక్షాలతో కలిసి సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పరచింది.

బీజెపి తన హిందూ జాతీయ వాదాన్ని కొనసాగిస్తూనే 1991 లో కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్థిక రంగంలో ప్రవేశ పెట్టిన సరళీకృత ఆర్థిక విధానాలను అనుసరిస్తున్నది.

## 11.4.4 ప్రాంతీయ పార్టీలు :

1967 సాధారణ ఎన్నిల అనంతరం భారతదేశంలోని కొన్ని రాష్ట్రాలలో కాంగ్రెస్ బలం క్షీణించటంతో, ఆ రాష్ట్రాలలో ప్రాంతీయ పార్టీలు అవతరించి శక్తివంతముగా రూపొందాయి. ఈ పార్టీల అవతరణ వెనుక అనేక సామాజిక, ఆర్థిక రాజకీయ కారణాలు ఉన్నాయి. ఒక విధంగా దేశంలోని వివిధ ప్రాంతాలలో కల సాంస్కృతిక, సామాజిక, ఆర్థిక, భిన్నత్వాలు వైవిధ్యాలే ప్రాంతీయ పార్టీలు ఏర్పాటుకు దోహదం చేసాయనేది నిర్వివాదాంశం, భారతదేశంలో 1967 తర్వాత కాలంలో ఏర్పడిన ప్రాంతీయ పార్టీలలో తమిళనాడు లోని డి.ఎమ్.కె (DMK) అన్నా డి ఎమ్‌కె (AIDMK), ఆంధ్రప్రదేశ్‌లోని తెలుగుదేశం పార్టీ (టి.డి.పి), పంజబ్‌లోని అకాలీదళ్, జమ్ము కాశ్మీర్‌లోని నేషనల్ కాన్ఫరెన్స్, మహారాష్ట్రలోని శివసేన, అస్సాంలోని అస్సాంగణ పరిషత్తు ప్రధానమైనవి. వాస్తవానికి 1967 నుంచి ఈ రాష్ట్రాలలో జరుగుతున్న రాష్ట్ర శాసనసభ ఎన్నికలలో ఈ ప్రాంతీయ పార్టీల అధికారంలోకి రావటం లేదా కాంగ్రెస్ పార్టీకి ప్రతిపక్షంగా ఏర్పడటం జరుగుతుంది.

పాల్‌బ్రాస్ పేర్కొన్నట్లు సంబంధిత రాష్ట్రాలకే పరిమితమైన ప్రాంతీయ పార్టీలు, ప్రాంతీయ దృక్పధంతో పాటు జాతీయ దృక్పధాన్ని పెంపొందించుకొని రాష్టాలకు స్వయం ప్రతిపత్తి ఎక్కువ అధికారాలతో పాటు ఎక్కువ ఆర్థిక వనరుల కొరకు కృషి చేస్తున్నాయి. 1980 దశాబ్దంలో దేశంలో సంకీర్ణ రాజకీయాలయుగం ప్రారంభమయ్యాక వాటి ధోరణిలో సమూలమైన మార్పులు సంభవించినవని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు. 1990 దశాబ్దంలో కేంద్రంలో బిజెపి నాయకత్వంలో ఏర్పడిన సంకీర్ణ ప్రభుత్వానికి దేశంలోని ప్రాంతీయ పార్టీలు భాగస్వాములుగా ఉండటం లేదా బయట నుంచి ఆ ప్రభుత్వాలకు మద్దతు కనబరచటం జరిగింది. ఆ విధంగా 1990 దశాబ్దం నుంచి ప్రాంతీయ పార్టీలు కేంద్రంలో ఏర్పడిన ప్రభుత్వంతో సత్సంబంధాలను ఏర్పరచుకొని తమ రాష్ట్రాల ప్రయోజనాలపై తమ దృష్టిని కేంద్రీకరిస్తున్నాయి.

## 11.4.5 కమ్యూనిస్ట్ పార్టీలు :

భారతదేశంలో వామ పక్ష పార్టీలను స్థూలంగా కమ్యూనిస్ట్ పార్టీలు, సోషలిస్ట్ పార్టీలు అని 2 తరగతులుగా విభజిస్తారు. సోషలిస్ట్ పార్టీ 1936లో కాంగ్రెస్ ఒక భాగంగా అవతరించింది. 1945 లో కాంగ్రెస్ నుంచి వీడిపోయి ఒక స్వతంత్ర పార్టీ అయింది. 1942 నుంచి 1945 కమ్యూనిస్ట్ పార్టీ గణనీయంగా అభివృద్ధి చెందినప్పటికి భారత స్వాతంత్ర్యోధ్యమ ప్రవంతికి దూరంగా వుంటూ వచ్చింది. స్వాతంత్ర్యానంతరం కమ్యూనిస్ట్ పార్టీ సమర్ధవంతమైన నాయకుల కారణంగా ఆంధ్రప్రదేశ్, కేరళ, పశ్చిమబెంగాల్ మొ॥ రాష్ట్రాలలో బలమైన పార్టీగా రూపొంది కార్మికులు, రైతులు, మేధావులు, విద్యార్ధులు మొదలైన వర్గాలను ఆకర్షించింది. 1950-62 మధ్య కాలంలో జరిగిన సాధారణ ఎన్నికలలో లోక్‌సభలో, కొన్ని రాష్ట్రాల శాసనసభలలో ఎక్కువ సంఖ్యలో స్థానాలను గెల్చుకుంది. అయితే మొదటినుంచి ఈ పార్టీలో తీవ్రమైన అభిప్రాయ బేధాలు, వర్గతత్వం తీవ్ర స్థాయిలో చోటు చేసుకున్నాయి. ఈ విభేదాల ఫలితంగా 1964లో కమ్యూనిస్ట్ పార్టీ భారత కమ్యూనిస్ట్ పార్టీ (సిపిఐ), కమ్యూనిస్ట్ పార్టి (మార్కిస్ట్) (సిపిఎమ్) అనే 2 భిన్న పార్టీలుగా వీడిపోయింది. పార్టీలోని మితవాదులు, మధ్యేమార్గవాదులు, భారత కమ్యూనిస్ట్ పార్టీలో చేరగా, అతివాదులు లేదా వామపక్షాలు కమ్యూనిస్ట్ పార్టీ (మార్కిస్ట్)లో చేరారు. భారత కమ్యూనిస్ట్ పార్టీ చీలికలు వ్యక్తిగత వర్గబేధాలు ఒక కారణమైనప్పటికి, సైద్ధాంతిక విభేదాలు ప్రధానంగా దోహదం చేసాయని రాజకీయ శాస్త్రవేత్తల అభిప్రాయం. కొన్ని మౌలిక అంశాలలో రెండు కమ్యూనిస్ట్ పార్టీల మధ్య విభేదాలు ఉన్నప్పటికి అవి పార్లమెంటరీ ప్రజాస్వామ్యంపై శాంతియుతమైన పార్లమెంటరీ పద్ధతులపై అవగాహన విశ్వాసాన్ని కల్గి వున్నాయి. భారత కమ్యూనిస్ట్ పార్టీ చాలాకాలం పాటు కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు, విధానాలు, కార్యక్రమాలను సమర్ధించి ఆ పార్టీతో పొత్తు పెట్టుకుంది. కాని మార్కిస్ట్ పార్టీ మొదటి నుంచి కాంగ్రెస్ విధానాలను, కార్యక్రమాలను వ్యతిరేకిస్తూ వచ్చింది.

భారత కమ్యూనిస్ట్ పార్టీ, మార్కిస్ట్ పార్టీ మొదటి నుంచి వివిధ ఎన్నికలలో పాల్గొంటున్నాయి. మార్కిస్ట్ పార్టీ పశ్చిమబెంగాల్, కేరళ, త్రిపుర రాష్ట్రాలలో బలంగా వుండగా భారతకమ్యూనిస్ట్ పార్టీ బీహార్‌లో పరిమితంగా, ఆంధ్రప్రదేశ్‌లో బలంగా ఉంది. ఈ రాష్ట్రాలలో రెండు పార్టీలు పొత్తును కుదుర్చుకొని సంయుక్తంగా వివిధ ఎన్నికలలో పోటీ చేస్తున్నాయి. గత రెండు దశాబ్దాల నుంచి పశ్చిమ బెంగాల్ రెండు కమ్యూనిస్ట్ పార్టీలు అవిచ్ఛిన్నంగా సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పరచటంతో పాటు, అధిక సంఖ్యలో పార్లమెంటు స్థానాలలో గెలుపొందుతున్నాయి. కేరళలో ఉభయ కమ్యూనిస్ట్ పార్టీలు, కాంగ్రెస్ మిత్ర పక్షాలు ప్రత్యామ్నాయ సరళిలో ప్రభుత్వాలను ఏర్పరుస్తున్నాయి.

## 11.5. ముగింపు :

భారతదేశంలో ఒకేపార్టీ ఆధిక్యత క్షీణించిందనేది నిస్సందేహం. అందుచేత ఆ వర్ధమాన పార్టీ వ్యవస్థ స్వభావాన్ని ఏవిధంగా వర్ణించటం అనేది ప్రధాన సమస్య అవుతుంది. కొందరు విశ్లేషకుల జాతీయ స్థాయిలో దేశంలో ఏకపార్టీ ఆధిక్యత వ్యవస్థ అంతరించాక, దేశంలో పార్టీ వ్యవస్థ బహుళ పార్టీ వ్యవస్థగా రూపుదిద్దుకుంటున్నదని పేర్కొన్నారు. అనేక ప్రాంతీయ పార్టీలు, భిన్న పార్టీలలో మద్ధతు ఇస్తున్న రెండు భిన్నపార్టీలు సమ్మేళనంగా కూడా వర్తమాన పార్టీ వ్యవస్థను పరిగణించవచ్చునని వీరు అభిప్రాయ పడ్డారు. భిన్న వర్గాలకు, కులాలకు ప్రాతినిధ్యం వహించిన కాంగ్రెస్ పార్టీ వ్యవస్థ మొదటి దశలో ఆధిక్యత వహించింది. దీనికి భిన్నంగా మతపరమైన రాజకీయాలు 2వ దశలో ఆధిక్యత వహించాయి. సాంఘిక సంక్షేమ పథకాలపై ఆధారపడిన సంకీర్ణ జాతీయ సమైక్యత వ్యవస్థను రూపొందించటం కాంగ్రెస్ లక్ష్యమైతే, కొన్ని ప్రత్యేక వర్గాలు, తీర ప్రాంతాలకు ఆర్థిక రాజకీయ ప్రయోజనాలను సాధించి పెట్టడం వర్తమాన పార్టీ వ్యవస్థ ప్రధాన లక్ష్యం.

గత దశాబ్దం నుంచి దేశంలో రాజకీయ సమీకరణ వేగంగా అభివృద్ధి చెందుతున్నది. ప్రధానంగా ఉత్తర భారత దేశంలోని రాజకీయాలు ఈ ధోరణిని ప్రతిబింబిస్తున్నాయి. గతంలో కాంగ్రెస్ మధ్యేవాద రాజకీయాలు, ఆధిక్యత వహించగా ప్రస్తుతం రాజకీయ సమీకరణలో వివిధ రాష్ట్రాలలోని వివిధ వర్గాలతో ఏర్పడిన నూతన సామాజిక సముదాయాలు కీలక పాత్ర వహిస్తున్నాయి. తీవ్రతరం అవుతున్న రాజకీయపోటీతో నూతన వర్గాల మద్దతు కొరకు అన్వేషించటం, భారత సమాజంలో కేంద్రీకృత శక్తుల అభివృద్ధి

నిరోధించబడింది. చివరకు బిజెపి కూడా ముస్లింలు మొదలైన మైనారిటీ వర్గాల మద్దతు కోసం ప్రయత్నించవలసిన అవసరం ఏర్పడింది. అందుచేత దేశంలోని రాజకీయ పార్టీలు తమ సామాజిక పరిధిని విస్తరింపచేసుకునేందుకు తగిన వ్యూహాలను రూపొందించుకుంటున్నాయి. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీకి ఆధిక్యత లేనప్పటికి దేశ రాజకీయాలలో మధ్యేవాదాన్ని కొనసాగించే శక్తిని కలిగి ఉంది.

ప్రస్తుతం భారతదేశంలో బహుళ పార్టీ వ్యవస్థ వేళ్ళూనుకుంటున్నదనేది వాస్తవం, అనేక రాష్ట్రాలలో రాజకీయ ప్రక్రియలో ప్రజల భాగస్వామ్యం విస్తృతంగా పెరిగింది. గత ఐదు శతాబ్దాల కాలం నుంచి దేశంలో కొనసాగుతూ వస్తున్న ప్రజాస్వామ్య రాజకీయ వ్యవస్థ, పోటీ  పార్టీ వ్యవస్థ ప్రజాస్వామ్య వ్యవస్థ మనుగడకు వ్యక్తిగత హేతుబద్ధత, వ్యక్తిగత ప్రయోజనాల ఉద్భృతి అవసరం అనే అభిప్రాయాన్ని వ్యతిరేకిస్తున్నది. పేదరికం, నిరక్షరాస్యత, అసమానతలు ఉన్నప్పటికి భారతదేశంలో ప్రజాస్వామ్యం విజయం సాధించటం వల్ల, ప్రజాస్వామ్య వ్యవస్థ మనుగడకు ఆర్థికాభివృద్ధి ఒక అవసర పరిస్థితి కాదనేది వాస్తవం.అంతేకాక దేశంలో వివిధ ప్రాంతాల మధ్య ఆర్థిక, సామాజికాభివృద్ధి  స్థాయిల్లో భిన్నత్వం ఉన్నప్పటికి ప్రాతినిధ్య సంస్థలు నిరాటంకంగా కొనసాగుతాయని భారతదేశం అనుభవం తెలుపుతున్నది.

మొత్తం మీద కొన్ని లోపాలు ఉన్నప్పటికి భారతదేశంలో అధిక సంఖ్యలో ఉన్న రాజకీయ పార్టీలు దేశంలో పోటీగల బహుళ పార్టీ వ్యవస్థపై  ఆధారపడిన ప్రజాస్వామ్య వ్యవస్థ అభివృద్ధి చెందటంలో, పార్టీలపై ఆధారపడిన ప్రాతినిధ్య ప్రభుత్వాలు ఏర్పడడంలో, దేశంలో పార్టీ రహిత ప్రజాస్వామ్యం, నిరంకుశమైన కార్యనిర్వాహక వర్గ నాయకత్వం అభివృద్ధి చెందకుండా నిరోధించటంలో  కీలక పాత్ర వహించాయి. అంతేకాక ప్రభుత్వాలు ప్రజాభిప్రాయానికి అనుగుణంగా వ్యవహరించేలా చేసి సామాజిక సమస్యలు రాజీ, పరస్పర అంగీకార పద్ధతుల ద్వారా పరిష్కరింపబడేలా చూసే సాధనాలుగా కూడా రాజకీయ పార్టీలు పని చేస్తున్నాయి.

## 11.6 మాదిరి ప్రశ్నలు :

1) భారత దేశంలో పార్టీ వ్యవస్థ పరిణామ క్రమాన్ని వివరింపుము
2) భారతదేశంలో పార్టీ వ్యవస్థ  ప్రధాన లక్షణాలను పరిశీలింపుము
3) భారతదేశంలోని ప్రధాన పార్టీలను గురించి వివరింపుము
4) భారతదేశంలో కమ్యూనిస్ట్ పార్టీల గురించి వివరింపుము
5) బారతదేశంలో ప్రాంతీయ పార్టీల ప్రభావాన్ని వివరింపుము
6) భారతదేశంలో రాజకీయాలపై పార్టీ వ్యవస్థ ప్రభావాన్ని విశ్లేషింపుము

## 11.7. చదువతగిన గ్రంథాలు:


- M.V. Pylee, Constitutional Government in India, New Delhi, S. Chanda & Co., 2003.
- Paul R. Brass, The Politics of India Sinee Independence, Cambridge, Cambridge University Press, 1990 (Second Edition).
- Bipan Chandra, India After Independence 1947-2000, New Delhi, Penguin Books, 2000.
- Pardha Chatarjee (ed.), State and Politics in India, Delhi: Oxford University Press, 1998.
- Atul Kohili (ed.), Success of Indain Democracy, Cambridge: Cambridge University Press, 2001.
- J.C. Johari, Indian Government and Politics, New Delhi: Vishal Publications, 1989.



**రచయిత**

**డా. కె. చంద్రకుమార్**

పాఠము - 12

# ఒత్తిడి గణాలు

## విషయసూచిక

12.0 లక్ష్యం

12.1 ఉపోద్ఘాతం

12.2 ఒత్తిడి గణాలు - అర్థ వివరణ

12.3 ఒత్తిడి గణాల సిద్ధాంతం

12.4 భారతదేశంలో ఒత్తిడి గణాలు - లక్షణాలు

12.5 భారతదేశంలో ఒత్తిడి గణాల చరిత్ర

12.6 భారత దేశంలో ఒత్తిడి గణాల రకాలు

12.7 భారతదేశంలో ప్రయోజన గణాలు

12.7.1 వ్యాపార గణాలు

12.7.2. కార్మిక సంఘాలు

12.7.3. రైతు సంఘాలు

12.7.4. ఇతర ఒత్తిడి గణాలు

12.8 ఒత్తిడి గణాల ప్రభావం

12.9 సారాంశం

12.10 మాదిరి ప్రశ్నలు

12.11 చదువదగిన గ్రంధాలు

## 12.0 లక్ష్యం :

ఈ పాఠాన్ని చదివిన తర్వాత మీరు ఈ క్రింది విషయాలను వివరించగలరు.

1) ఒత్తిడి గణాలు అర్థం, లక్షణాలు, ప్రాధాన్యత
2) ఒత్తిడి గణాలను వివరించే సిద్ధాంతాలు
3) భారతదేశంలో ఒత్తిడి గణాల రకాలు, లక్ష్యాలు, కార్యకలాపాలు, విధానాలు
4) భారతదేశంలో రాజకీయ ప్రక్రియపై ఒత్తిడి గణాల ప్రభావం, దాని ఫలితాలు

## 12.1 ఉపోద్ఘాతం :

ఒత్తిడి గణాల అధ్యయనం రాజనీతి శాస్త్రలో ఒక ప్రధాన అంశం. ఒత్తిడి గణాల అధ్యయనానికి రాజనీతి శాస్త్రంలో ఒక క్రమబద్ధమైన భావనా చట్రం ప్రతిపాదించబడింది. ఒత్తిడి గణాల అధ్యయనం ప్రధానంగా ప్రజాస్వామ్య దేశాలలో

వ్యవస్థీకృతమైన సమాజంలో రాజకీయ శక్తి ఏవిధంగా తీర్చిదిద్దబడుతుందీ, ఏ విధంగా వర్తింపచేయబడుతుందీ మొదలైన ప్రక్రియలపై తన దృష్టిని కేంద్రీకరిస్తుంది. ప్రజాస్వామ్య దేశాలు కాని దేశాలలో అంటే నిరంకుశ రాజకీయ వ్యవస్థకల దేశాలలో కూడా ఒత్తిడి గణాలు ఉన్నప్పటికీ వాటి ప్రభావం, పాత్ర అతి పరిమితం. సాధారణంగా ప్రజాస్వామ్య వ్యవస్థను కలిగిన బహుళ సమాజాలలో ఒత్తిడి గణాలు కీలకపాత్రను నిర్వర్తిస్తాయి. నిరంకుశ రాజ్యం తన ప్రయోజనాలకు కట్టుబడి పనిచేసే ఒత్తిడి గణాలను మాత్రమే అనుమతించి కొనసాగనిస్తుంది. ఏ వ్యవస్థలోనైనా ఒత్తిడి గణాలు ఏ పదవీబాధ్యతలను చేపట్టక, దేశ పాలనకు ప్రత్యక్షమైన బాధ్యతను స్వీకరించక ప్రభుత్వ విధానాలను ప్రభావితం చేసేందుకు ప్రయత్నిస్తాయి.

భారతదేశంలో ప్రజలలో నిరక్షరాస్యత కారణంగా రాజకీయ చైతన్యం పరిమితంగా ఉండటంచేత, ఒత్తిడి గణాలు అంత చురుకుగా పనిచేయటం లేదు. అయితే పాశ్చాత్య దేశాలతో పోల్చి చూస్తే, భారతదేశంలో ఒత్తిడి గణాల సంఖ్య పరిమితం అని చెప్పాలి. ఈ దేశంలో ఒత్తిడి గణాలు ప్రధానంగా వృత్తి, ఆర్థిక ప్రయోజనాల ప్రాతిపదిక మీద అవతరించాయి. భారతదేశంలో గల ఒత్తిడిగణాలలో కార్మిక సంఘాలు, రైతు సంఘాలు, వృత్తి నిపుణుల సంఘాలు, విద్యార్థి సంఘాలు, ఉద్యోగుల సంఘాలు ప్రధానమైనవి. మిగతా సాంప్రదాయ దేశాల మాదిరి భారతదేశంలో కులం, మతం మొదలైన సామాజిక అంశాల ప్రాతిపదిక మీద ఒత్తిడి గణాలు అవతరించాయి. రజనీ కొఠారి అభిప్రాయం ప్రకారం భారతదేశంలో రాజకీయ, సామాజిక, రాజకీయ రంగాలలో ప్రభుత్వం ప్రధాన పాత్ర వహిస్తున్నప్పటికీ, తమ వర్గ ప్రయోజనాల ప్రాతిపదిక మీద వివిధ వర్గాల ప్రజలు వ్యవస్థీకృతమయ్యారు. భారతదేశంలో ఒత్తిడి గణాల వ్యూహాలు, పద్ధతులు, వర్తమాన రాజకీయ ప్రక్రియలో ఒక అంతర్భాగంగా రూపొందాయి.

రాజనీతి శాస్త్రంలో ఒత్తిడి గణాలు అధ్యయనం ఇటీవల కాలంలోనే ప్రాముఖ్యతను సంతరించుకుంది. దీనికి రాజనీతిశాస్త్రం మనోవిజ్ఞాన శాస్త్రం, సమాజ శాస్త్రాలతో సాన్నిహిత్యాన్ని పెంపొందించుకోవటమే ప్రధాన కారణం. దీని ప్రభావం వలన రాజకీయాలు ఒక నూతన అర్థాన్ని సంతరించుకున్నాయి. ఈ నూతన అర్ధం ప్రకారం రాజకీయాలు అంటే సామాజిక విలువలను అధికారయుతంగా కేటాయించే ప్రక్రియ. ఈ నూతన అర్థం ఫలితంగా రాజకీయ శాస్త్రం కేవలం రాజ్యం, ప్రభుత్వాన్ని అధ్యయనం చేసే శాస్త్రంగాకాక, సమాజంలో నిర్ణయీకరణ ప్రక్రియను అధ్యయనం చేసే శాస్త్రంగా పరిగణింపబడింది. సాధారణంగా నిర్ణయాలు సమాజంలోని వివిద వర్గాలు లేదా గణాల మధ్య సంఘర్షణ ఫలితంగా రూపొందటం వలన, రాజనీతిశాస్త్రం అధ్యయనంలో నిర్ణయీకరణ ప్రక్రియలో పాల్గొనే గణాలు లేదా వర్గాలు ఒక ప్రధాన అంశంగా రూపొందాయి. ఈ విధంగా ఆధునిక కాలంలో రాజనీతిశాస్త్రంలో గణాల అధ్యయనం ప్రాముఖ్యతను సంతరించుకోవటంతో ఈ అంశంపై అనేక సిద్ధాంతాలు ప్రతిపాదించబడ్డాయి. క్రమంగా గణాల అధ్యయనానికి అనుబంధంగా ఒత్తిడి గణాల అధ్యయనం రాజనీతిశాస్త్రంలో ప్రధాన అధ్యయనంగా రూపొందింది. రాజనీతిశాస్త్రవేత్తలు ప్రధానంగా ప్రజాస్వామ్య వ్యవస్థ కలిగిన బహుళ సమాజాలలో ఒత్తిడి గణాల ప్రక్రియపై దృష్టిని కేంద్రీకరించారు.

భారతదేశంలో బహుళ సమాజం నెలకొన్నకారణంగా అనేక రకాల ఒత్తిడి గణాలు అవతరించాయి. ఈ ఒత్తిడి గణాలు తమ తమ వర్గాల ప్రయోజనాలను, హక్కులను పరిరక్షించేందుకు ఏర్పడ్డాయి. దేశంలో నిరక్షరాస్యత కారణంగా ప్రజలలో రాజకీయ చైతన్యం పరిమితంగా ఉన్నప్పటికీ, ఈ ఒత్తిడి గణాలు చురుకుగా పనిచేస్తున్నాయి. అయితే పాశ్చాత్య దేశాలతో పోల్చిచూస్తే, భారతదేశంలో ఒత్తిడి గణ సంఖ్య పరిమితం అనే చెప్పాలి. అంతేకాక పాశ్చాత్య దేశాలలో ఒత్తిడి గణాలకు, భారతదేశంలోని ఒత్తిడి గణాలకు అనేక అంశాలలో ఎంతో వైవిధ్యం ఉంది. ఈ దేశంలో ఒత్తిడి గణాలు ప్రధానంగా వృత్తి, ఆర్థిక ప్రయోజనాల ప్రాతిపదికమీద అవతరించాయి. ఈ ఒత్తిడి గణాలలో కార్మిక సంఘాలు, రైతు సంఘాలు, వృత్తి నిపుణ సంఘాలు, విద్యార్థి సంఘాలు, ఉద్యోగుల సంఘాలు ప్రధానమైనవి. ఆసియాలోని ఇతర సాంప్రదాయ దేశాలలోలాగే భారతదేశంలో కూడా కులం, మతం, జాతి మొదలైన సామాజిక అంశాల ప్రాతిపదిక మీద ఒత్తిడి గణాలు అవతరించాయి. రజనీ కొఠారి అభిప్రాయం

ప్రకారం భారతదేశంలో రాజకీయ, సామాజిక, ఆర్థిక రంగాలలో ప్రభుత్వం శక్తివంతమైన పాత్రను నిర్వహిస్తున్నప్పటికీ, వివిధ వర్గాల ప్రజలు తమ వర్గ ప్రయోజనాల సాధనకు ఒత్తిడి గణాల రూపంలో వ్యవస్థీకృతం అయ్యారు. ఒత్తిడి గణాల వ్యూహాలు, పద్ధతులు, కార్యకలాపాలు వర్తమాన రాజకీయ ప్రక్రియలో అంతర్భాగంగా రూపొందాయి.

## 12.2 ఒత్తిడి గణాలు - అర్థ వివరణ :

గణ సిద్ధాంతానికి రూపకల్పనకర్త అయిన ఆర్థర్ బెంట్లీ (Aurther Bentley) నిర్వచనం ప్రకారం గణం అంటే ఒక సమాజంలో కొందరు వ్యక్తుల సమూహం. అయితే సమూహం సమాజంలోని ఇతర జనబాహుళ్యంతో సంబంధంలేని జనసమూహం కాదు. ఈ సమూహం క్రియాశీలకమైంది. ఈ సమూహంలోని వ్యక్తులు ఇతర గణాల చర్యలలో పాల్గొంటారు. ట్రూమన్ నిర్వచించినట్లు ఒత్తిడి గణాలు అంటే ఒకటి లేదా అంతకంటే ఎక్కువ ఒకేవిధమైన దృక్పధాలు కలిగిన విభిన్న ప్రవర్తనా రూపాలు ఏర్పాటుకు, కొనసాగింపుకు లేదా అభివృద్ధిపరిచేందుకు సమాజంలోని ఇతర గణాలపై డిమాండ్‌లను మోపే వ్యక్తుల సమూహమే ఒత్తిడి గణం. ఈ ఇద్దరు శాస్త్రవేత్తల నిర్వచనం ప్రకారం స్పష్టమైన ప్రయోజనాలు, అధికసంఖ్యలో గణాలు కలిగిన సామాజిక వ్యవస్థల చేత నిర్దేశింపబడే వ్యక్తుల సమూహం. ఈ విధంగా ప్రతి గణానికి ఒక స్పష్టమైన, స్వతంత్రమైన ప్రయోజనం ఉంటుంది. గణం ఒక స్పష్టమైన ప్రక్రియ తప్ప నిశ్చల (Static) రూపం కాదు. ఈ విధంగా గణం తన సభ్యుల మధ్య తఱుచుగా మార్గదర్శకత్వాన్ని వహించే అవకాశాన్ని కల్పించే పరస్పర చర్య ఆధారంగా రూపుదిద్దుకుంటుంది. అంతేకాక వివిధ గణాల మధ్య భిన్నత్వం ఉంటుంది. ఒకవ్యక్తి విభిన్న గణాలలో సభ్యునిగా ఉండవచ్చును. బెంట్లీ గణం ప్రక్రియలో ప్రయోజనం (Interest) కీలకాంశం అని నొక్కిచెప్పాడు.

ప్రయోజన లేదా ఒత్తిడి గణాల రాజకీయాలు ప్రధానంగా వ్యక్తిగత స్వార్థం అనే మనస్తత్వ ప్రాతిపదిక మీద ఆధారపడి ఉంటాయి. ఈ వ్యక్తిగత స్వార్థం వ్యక్తిని తన ప్రయోజనాలను సాధించేందుకు సమాన అభిప్రాయాలు కలిగిన ఇతర వ్యక్తులతో కలయికను ప్రేరేపిస్తుంది. అయితే వ్యక్తులకు భిన్నమైన ప్రయోజనాలు ఉంటాయి. వ్యక్తి అసంఖ్యాకమైన వ్యక్తుల మధ్య జీవిస్తాడు. ఈ వాస్తవాన్ని దృష్టిలో ఉంచుకొని ఒత్తిడి గణాల అధ్యయనం వ్యక్తి విభిన్న ప్రయోజనాలు, వాటి మధ్య పరస్పర చర్య వల్ల ఉత్పన్నమయ్యే అంశాలు, పరస్పర సంబంధాలను దృష్టిలో ఉంచుకోవలసి ఉంటుంది. ఈ కోణం నుంచి ఒత్తిడి గణాలను కొన్ని ఉమ్మడి ప్రయోజనాలను కలిగి, వాటిని సాధించేందుకు ప్రభుత్వ విధానాలను ప్రభావితం చేసే రాజకీయచర్యలను చేపట్టే వ్యక్తుల సమూహాలుగా నిర్వచించవచ్చును. మాకైవర్ అభిప్రాయం ప్రకారం కొందరు వ్యక్తులు రక్షణ కొరకు, చిరకాలం కొనసాగే పదవిని లేదా ప్రయోజనాన్ని పొందేందుకు కలసికట్టుగా పనిచేసే సమూహం ప్రయోజనగణం. జంగ్లర్ (Zengler) ఒత్తిడి గణాలను లాంఛనప్రాయమైన ప్రభుత్వ పదవులలోలేని సభ్యులు కల, ప్రభుత్వ విధానాలను ప్రభావితం చేసేందుకు ప్రయత్నించే వ్యవస్థీకృత సమూహం అని నిర్వచించాడు. ఈ నిర్వచనాల ఆధారంగా ఒత్తిడి గణాలు రాజకీయ ప్రక్రియలో ఒకభాగంగా ఉంటూ, ప్రభుత్వ విధానాలలో మార్పును తెచ్చేందుకు ప్రయత్నించే వ్యక్తుల సమూహం. అయితే ఒత్తిడి గణాలలోని సభ్యులు ప్రభుత్వంలో పదవులను ఆశించరు. ఈ ఒత్తిడి గణాలలో, జాతీయస్థాయిలో శక్తివంతమైన యజమానులు (Employers), కార్మిక సంఘాల నుంచి, అట్టడగు స్థాయిలోకల తమ స్థానిక పరిస్థితుల నుంచి మెరుగుపరచుకొనేందుకు ప్రయత్నించే స్వల్ప, బలహీన వర్గాల సంఘాల వరకు అనేక రకాల గణాలు ఉంటాయి. హెన్రి టర్నర్ నిర్వచనం ప్రకారం ఒత్తిడి గణాలు ప్రభుత్వ విధానాలలో ఏదో ఒక దశను ప్రభావితం చేసేందుకు ప్రయత్నించే రాజకీయేతర సంస్థలు. ఈ సంస్థలు రాజకీయపార్టీ మాదిరి పథకాలను రూపొందించవు లేదా ప్రభుత్వంలో పదవులకు తన సభ్యులను పోటీలో నిలపవు. అయినప్పటికీ ఒత్తిడి గణాలు రాజకీయ పార్టీల సమావేశాలకు హాజరయి వాటిలో తమ కోర్కెలకు ఆమోదించమని వాదిస్తాయి. ఈ గణాలు తఱుచుగా తమకోర్కెలను రాజకీయ పార్టీల ఆమోదాన్ని పొందాలని ప్రయత్నిస్తూనే అవి పార్టీల వివాదాలకు

అతీతంగా ఉండేలా చూస్తాయి. ఒత్తిడి గణాలు రాజకీయ వ్యవస్థలో చురుకైన పాత్రను నిర్వహిస్తాయి. ఈ గణాల లక్షణాలను పరిశీలించి, రాజనీతి శాస్త్రవేత్తలు ప్రయోజనగణాల లక్షణాలను ఈ క్రింది విధంగా వివరించారు.

1) ఒక నిర్దిష్టమైన ప్రయోజనం, ఒత్తిడి గణాల అవతరణకు మూలం. అంటే ఒక రాజకీయ మార్గాన్ని లేదా సాధనాన్ని చేపట్టేలా వ్యక్తులను ప్రేరేపించే ఒక నిర్దిష్ట ప్రయోజనం ఒత్తిడి గణాలు ఏర్పడటానికి మూలం. ఒకే జాతి పక్షులన్నీ ఒకే చోట చేరినట్లు ఉమ్మడి ప్రయోజనాలు కలిగిన వ్యక్తులందరూ తమ ప్రయోజనాల సాధనకు కలసికట్టుగా ప్రయత్నిస్తారు. తమ ప్రయోజనాల సాధనకు పోరాడేందుకు వ్యక్తులు పోరాటంలో చురుకుగా పాల్గొనటం, తమ కోర్కెలను సమర్థవంతంగా వ్యక్తీకరించటం అవసరం కాబట్టే ఒత్తిడి గణాలు స్థిరమైన ప్రాతిపదికను కలిగి ఉండాలి.

2) ఒత్తిడి గణాలు రాజకీయాలలో బహిరంగమైన, ప్రత్యక్షమైన పాత్రను గాక, నిగూఢమైన, పరోక్షమైన పాత్రను నిర్వర్తిస్తాయి. ఒత్తిడి గణాలు ప్రత్యక్షంగా రాజకీయాలలో పాల్గొనటానికి సంకోచిస్తాయి. అందుచేత రాజకీయాలలో పరోక్షంగా పాల్గొనటం ద్వారా తాము రాజకీయేతర సంస్థలని నిరూపించుకునేందుకు ప్రయత్నిస్తాయి. అయితే ఈ విధానం కొన్ని సమయాలలో వివాదాలకు తావిస్తుంది. ఒక ఒత్తిడి గణం రాజకీయ సంస్థా ? కాదా ? అని నిర్ధారించటం సాధ్యంకాదు. అయితే కొందరు రచయితల అభిప్రాయం ప్రకారం కొన్ని ఒత్తిడి గణాలు అటు రాజకీయపార్టీల మాదిరి పరిపూర్ణమైన రాజకీయ సంస్థలు, మరోప్రక్క పూర్తిగా రాజకీయేతర సంస్థలైన ఆర్థిక లేదా సాంస్కృతిక సంస్థలకు మధ్యస్థ స్థితిలో ఉంటాయి. ఒక రచయిత అభిప్రాయం ప్రకారం ఒత్తిడి గణాలు పూర్తిగా రాజకీయ సంస్థలు కావు, పూర్తిగా రాజకీయేతర సంస్థలు కావు. అవి రాజకీయ, రాజకీయేతర సంస్థలకు మధ్యస్థంగా ఉండే సంస్థలు.

3) ఒత్తిడి గణాలు, రాజకీయ పార్టీల మధ్య భిన్నత్వం ఉంది. రాజకీయ పార్టీలు ఒక దేశం రాజకీయాలలో ప్రత్యక్ష పాత్ర వహించే కొన్ని సూత్రాలకు, పథకాలకు కట్టుబడి ఉండే పెద్ద పెద్ద సంస్థలు. వీటికి భిన్నంగా ఒత్తిడి గణాలు పరిమిత సంఖ్యలో సభ్యులు కల, ఒక రాజకీయపార్టీలో ఒక వర్గంలా, లేదా తన విధేయతను ఒక పార్టీ నుంచి, మరో పార్టీకి మారుస్తూ, తన పాత్రను నిర్వర్తించే సంస్థలు. అంతేకాక ఒత్తిడి గణాలు రాజకీయాలకు దూరంగా ఉన్నట్లు నటించే సంస్థలు. అయితే రాజకీయ పార్టీల మాదిరే ఒత్తిడి గణాలకు రాజకీయ స్వభావం ఉంది. ఒక రాజకీయపార్టీ తన వృత్తిగా రాజకీయ పాత్రను పోషించగా, ఒక ఒత్తిడి గణం తన స్వప్రయోజనాలను సాధించేందుకు రాజకీయ పాత్రను పోషిస్తుంది. ఈ విధంగా రాజకీయ పార్టీలు, ఒత్గిడి గణాలు రెండూ సమానంగా, లాంఛనప్రాయమైన రాజ్యాంగ వ్యవస్థకు గణనీయమైన గతిశీలతను సంతరింపచేసే లాంఛనప్రాయంకాని రాజ్యాంగేతర సంస్థలు.

4) తమ రాజకీయ భాగస్వామ్యం పరిమాణం ఆధారంగా ఒత్తిడి గణాలను వర్గ ప్రయోజనాలు కలిగిన, ఒక చర్యను ప్రేరేపించే సంస్థలుగా పరిగణించవచ్చును. అంతేకాక వాటిని రాజకీయ లేదా అర్ధ - రాజకీయ సంస్థలుగా పరిగణించవచ్చును. సుదీర్ఘకాల లక్ష్యాలను కలిగిఉండి, తమ సభ్యుల ఉమ్మడి ప్రయోజనాల సాధనకు రాజకీయాలలో పాల్గొనేందుకు ప్రయత్నించే ఒత్తిడి గణాలను రాజకీయ లేదా సంకుచిత రాజకీయ దృక్పథం కలిగిన రాజకీయ సంస్థలుగా పరిగణించవచ్చును.

ఈ విధంగా విస్తృతమైన దృక్పథంలో పరిశీలిస్తే ఒత్తిడి గణాలను నాలుగు తరగతులుగా విభజింపవచ్చును. అవి 1) సంస్థీకృతం చెందిన ఒత్తిడి గణాలు. (ఉదా ॥ ప్రభుత్వ శాఖలు) . ఈ గణాలు ప్రభుత్వ కార్యకలాపాలను నిర్వర్తిస్తూ పాలనా ప్రక్రియ నిరంతరం కొనసాగేలా చూస్తాయి. 2) వర్గం, తెగ, బంధుత్వం, మతం లేదా ఇతర సాంప్రదాయ లక్షణాలపై ఆధారపడిన సంస్థీకృతం కాని లాంఛనప్రాయం కాని వర్గాలు. 3) సద్యోజనితంగా లేదా హఠాత్తుగా చేపట్టే ప్రదర్శనలు, దాడులూ, ర్యాలీలు, యాత్రల రూపంలో ఉండే వర్గాలు ప్రత్యేక వర్గాల ప్రజల ప్రయోజనాలను వ్యక్తీకరించే లాంఛనప్రాయంగా వ్యవస్థీకృతమైన

సంఘాలు. ఈ నాలుగు విభిన్న రకాలుగా ఒత్తిడి గణాల వర్గీకరణ గేబ్రియల్ ఆల్‌మండ్ ప్రతిపాదించిన ఒత్తిడి గణాల రాజకీయ వ్యక్తీకరణ భావనను సంపూర్ణంగా ప్రతిబింబిస్తుంది.

## 12.3 ఒత్తిడి గణాల సిద్ధాంతం :

ఆధునిక రాజకీయ వ్యవస్థలో ఒత్తిడి గణాల అవతరణ గురించి వివిధ సిద్ధాంతాలు ఉన్నాయి. ఈ సిద్ధాంతాలలో ఆర్థర్ ఎఫ్. బెంట్లీ ప్రతిపాదించిన సిద్ధాంతం ప్రధానమైంది. సమాజంలో గణాల అవతరణకు ఆర్థిక అంశం కీలకపాత్ర వహిస్తున్నదని బెంట్లీ వాదించాడు. తన చర్యల ద్వారా తన ప్రయోజనాలను వ్యక్తపరచినపుడే గణం అవతరిస్తుందని బెంట్లీ ప్రతిపాదించాడు. సామాజిక జీవితంపై ఏ విశ్లేషణ అయినా ఆ సమాజంలోని వివిధ గణాల విశ్లేషణతో సన్నిహితంగా ముడిపడి ఉంది. సమాజంలో గణాల ఉమ్మడి ప్రయోజనాలకు తప్ప వ్యక్తి లాభనష్టాలకు ఎటువంటి ప్రాధాన్యత ఉండదు. బెంట్లీ దృష్టిలో గణాల ప్రయోజనాలకు తప్ప జాతీయ ప్రయోజనాలకు కల విలువ కూడా తక్కువే. అయితే ఇతర గణాలతో సంబంధాలను ఏర్పరచుకొన్నప్పుడే, ఏ గణమైనా అర్థవంతమౌతుందని బెంట్లీ వాదించాడు. బెంట్లీ అభిప్రాయం ప్రకారం ఒత్తిడి గణం దృగ్గోచరం ఒత్తిడిగణాల మధ్య కల వ్యతిరేకతను (Resistance) స్పృశిస్తుంది. వివిధ గణాల ఒత్తిడి సమతుల్యత సమాజ వర్తమాన పరిస్థితిని ప్రతిబింబిస్తుంది. ఈ ఒత్తిడి గణాల ప్రయోజనాల మధ్య సమతుల్యతే, ప్రభుత్వం అని బెంట్లీ ప్రతిపాదించాడు.

బెంట్లీ గణాలపై కనపరచిన ప్రాధాన్యత, ఛాందసమైంది, కాలం చెల్లిందనీ కొందరు విమర్శించారు. వారి అభిప్రాయం ప్రకారం బెంట్లీ వ్యక్తిగత ప్రయోజనాలు, జాతి ప్రయోజనాలను పూర్తిగా నిర్లక్ష్యం చేయటం ఆధునిక సమాజం భావన పునాదులను కదిలించి వేస్తుందని ఈ విమర్శకులు పేర్కొన్నారు.

బెంట్లీ గణసిద్ధాంతములో కొన్ని వైరుధ్యాలు ఉన్నప్పటికీ, ఈ సిద్ధాంతం మానవ జాతి ప్రగతిలో ఒక మైలు రాయి వంటిది. ఎందుచేతనంటే వివిధ గణాల మధ్య సంఘర్షణకు ప్రగతికి, సాధనం అని ప్రతిపాదించిన మొట్టమొదటి సామాజిక శాస్త్రవేత్త బెంట్లీ. మెజారిటీ పార్టీ ప్రజల సంక్షేమం ప్రభుత్వం అంతిమలక్ష్యం అని బెంట్లీ సిద్ధాంతం ప్రతిపాదించింది.

ఈ మెజారిటీ సమాజంలోని వివిధ గణాలకు సంబంధించిందని పేర్కొనటం ద్వారా బెంట్లీ గణసిద్ధాంతం ఆధునిక ప్రజాస్వామ్య వ్యవస్థలో గణాల ప్రాముఖ్యతను నొక్కి చెప్పింది.

బెంట్లీ గణ సిద్ధాంతం తర్వాత డేవిడ్ ట్రూమన్ ప్రతిపాదించిన గణ సిద్ధాంతం ఎంతో ప్రాముఖ్యతను సంతరించుకుంది. ట్రూమన్ బెంట్లీ గణప్రక్రియకు సంబంధించి విస్మరించిన అనేక అంశాలను తన గణ సిద్ధాంతంలో వివరించాడు. ప్రస్తుత సమాజంలో పెరుగుతున్న వేగంగా సంభవిస్తున్న మార్పుల ఫలితంగా సమాజంలో ఏర్పడుతున్న అలజడుల కారణంగా రాజకీయ ఒత్తిడి గణాలు ఏర్పడటం సర్వసాధారణ లక్షణంగా మారిందని ట్రూమన్ గణసిద్ధాంతం నొక్కిచెప్పింది. సమాజంలో స్థిరపడ్డ ప్రవర్తనా విధానంలో సంభవించే అలజడుల కారణంగానే ఒత్తిడి గణాలు ఏర్పడతాయని ట్రూమన్ సిద్ధాంతం ప్రతిపాదించింది. ఈ విధంగా ట్రూమన్ తన గణ సిద్ధాంతంలో గణ ప్రక్రియకు అలజడులను కీలక అంశంగా పరిగణించటం వలన ఆయన గణసిద్ధాంతం అలజడుల సిద్ధాంతంగా (Theory of Disturbances) పరిగణించబడింది. ట్రూమన్ ప్రతిపాదించిన అలజడుల సిద్ధాంతం ఇతర సమూహాలతో లేదా సంస్థలతో తమ సంబంధాలు తరచుగా మార్పులకు లేదా అలజడికి లోనుకావడం సంభవించడం వలన ప్రజలు గణాలుగా వ్యవస్థీకృతం చెందటం జరుగుతుందని ట్రూమన్ అలజడుల సిద్ధాంతం పేర్కొంది. వ్యవస్థీకృతమైన, సమర్థవంతమైన గణాలు అన్నీ అవసరమైన పరిస్థితులలో ఉద్భవిస్తాయని ప్రతిపాదించటం ద్వారా ట్రూమన్ స్వచ్ఛంద సేవాసంస్థలకు సంబంధించిన సామాజిక సిద్ధాంతాన్ని ప్రతిపాదించాడు. ఈ విధంగా సమాజంలో ఒత్తిడి గణాలు అధిక సంఖ్యలో ఉద్భవించి ప్రభుత్వాన్ని ప్రభావితం చేస్తాయని ట్రూమన్ సిద్ధాంతం వాదించింది. సమాజంలో అలజడి తీవ్రత పెరిగినకొద్దీ గణాల సంఖ్య

పెరగటంతోపాటు అవి అధిక సంక్లిష్టతను సంతరించుకుంటాయని కూడా ట్రూమన్ గణసిద్ధాంతం వాదించింది.

ట్రూమన్ ప్రతిపాదించిన గణ సిద్ధాంతంలో అనేక వైరుధ్యాలు ఉన్నప్పటికీ, ఈ సిద్ధాంతం ఆచరణాత్మకమైనదిగా పేరుపొందింది. ప్రస్తుత సమాజంలో అలజడులు తరచుగా సంభవించడం వలన ట్రూమన్ సిద్ధాంతం వాస్తవపూరితమైనది. ప్రస్తుత కాలంలో విప్లవాలు, యుద్ధాలు, వలసవాదం మొదలైనవి పెరుగుతుండటం వలన ట్రూమన్ అలజడుల సిద్ధాంతానికి ప్రస్తుత కాలానికి వర్తింపు ఉందని చెప్పటం సమంజసం.

గణప్రక్రియపై జాన్.సి. కాల్‌హన్ (John C. Calhon), రాబర్ట్ సాలిస్‌బరీ (Rebert Salisbury) మరో రెండు ప్రధాన సిద్ధాంతాలను రూపొందించారు. కాల్హన్ ప్రజాస్వామ్య వ్యవస్థను ప్రభావితంచేసే గణాల గతిశీలను వివరించే సిద్ధాంతాన్ని ప్రతిపాదించాడు. క్యాల్‌హన్ మెజారిటీ, మైనారిటీ ప్రయోజనాల మధ్య సమతుల్యతను సాధించే మార్గాలను వివరిస్తూ తన గణసిద్ధాంతాన్ని ప్రతిపాదించాడు. క్యాల్‌హన్ తన గణసిద్ధాంతంలో అధికసంఖ్యాకులలో సభ్యులు కలిగిన మెజారిటీ గణాలు స్వార్థంతో నియంతృత్వం, అణచివేత ధోరణితో ప్రవర్తిస్తూ, మైనారిటీగణాల హక్కులు, ప్రయోజనాలను హరించివేసే అవకాశం ఉందనే అంశాన్ని నొక్కిచెప్పాడు. ఈ విధంగం క్యాల్‌హన్ సిద్ధాంతం గణాల ప్రయోజనాల పట్ల అధికమైన ఆసక్తిని, ప్రాధాన్యతను కనపరిచింది. అయితే ఈ సిద్ధాంతంలో కూడా కొన్ని లోపాలు లేకపోలేదు.

రాబర్ట్ సాలిస్‌బరి ప్రతిపాదించిన మారకసిద్ధాంతం (Exchange Theory) మారకంవల్ల అనేక ప్రయోజనాలు ఉండటంవల్ల వ్యక్తులు పరస్పర సంబంధాలను ఏర్పరచుకొంటారని ప్రతిపాదించింది. అయితే ఒక గణంగా ఏర్పడటం వలన వ్యక్తులు కేవలం భౌతికపరమైన ప్రయోజనాలను మాత్రమే పొందుతారని చెప్పటం సరికాదని సాలిస్‌బరి ప్రతిపాదించిన గణసిద్ధాంతం నొక్కిచెపుతుంది. గణంలో సభ్యులు తాము విలువైనవి అనుకునే అనుభవాలను కూడా పరస్పరం మార్చుకుంటారని సాలిస్‌బరి పేర్కొన్నాడు. అందుచేత గణం ఏర్పరచుకొనే లక్ష్యాలు హేతుబద్ధమైనవిగా సాలస్‌బరి పరిగణించాడు. సాలిస్‌బరి ప్రతిపాదించిన గణ సిద్ధాంతంలో కొన్ని లోపాలు ఉన్నాయి. సాలిస్‌బరి గణసిద్ధాతం గణం నాయకునికి అత్యంత ప్రాధాన్యతను కనబరచటం ఈ సిద్ధాంతం ప్రధాన లోపమని విమర్శింపబడింది. ఎందుచేతనంటే గణం నాయకుడు తన అధికారాలను దుర్వినియోగపరిచే అవకాశం ఉంది. దీని ఫలితంగా వ్యవస్థలో అవినీతి, అనైతికతలు పెరిగే అవకాశం ఉంది అని ఈ విమర్శకుల వాదన.

ఒల్‌సన్ (Olson) అనే సామాజిక శాస్త్రవేత్త గణాలపై గల వివిధ సిద్ధాంతాలలో అనేక వైరుధ్యాలు, అసంబద్ధతలు ఉన్నాయని విమర్శిస్తూ, వాటికి ప్రత్యామ్నాయంగా ప్రత్యేక ప్రయోజనాల (Special Interests) సిద్ధాంతాన్ని ప్రతిపాదించాడు. ఈ సిద్ధాంతం ప్రకారం ఉమ్మడిచర్య, వ్యక్తుల స్వార్థ ప్రయోజనాలు, స్వలాభం చుట్టూ పరిభ్రమిస్తుంది. ఒల్‌సన్ సిద్ధాంతం స్వార్థం వ్యక్తులకు గల బలహీనత ఈ బలహీనతవల్ల వారు గణం ఉమ్మడిలక్ష్యాల కంటే తమ వ్యక్తిగత లక్ష్యసాధనకే అధిక ప్రాముఖ్యతను కనబరుస్తారు. ఒల్‌సన్ అభిప్రాయం ప్రకారం గణాలు తమ లక్ష్యాల సాధనకు అనుసరించే లాబీయింగ్ విధానం వ్యవస్థల ఉమ్మడి ఉత్పాదక వస్తువు (byproduct) అని పేర్కొన్నాడు. ఒల్‌సన్ గణసిద్ధాంతం రెండు లోపాల ప్రాతిపదికగా విమర్శించబడింది. 1) ఒల్‌సన్ సిద్ధాంతం గణాలు ఏర్పడే ప్రక్రియను వివరించదు. 2) ఈ సిద్ధాంతం లాబీయింగ్ ప్రక్రియను స్పష్టంగా వివరించటంలో విఫలమైంది. ఏమైనప్పటికీ ఒల్‌సన్ గణసిద్ధాంతం వర్తమాన పరిస్థితులకు చక్కగా అన్వయిస్తుంది. ప్రస్తుత కాలంలో వ్యక్తులు తమ గణం ప్రయోజనాల కంటే తమ వ్యక్తిగత ప్రయోజనాల పట్లే ఎక్కువ శ్రద్ధ వహిస్తారనే వాస్తవాన్ని నొక్కిచెప్పటం ఈ సిద్ధాంతం ప్రత్యేకత.

మొత్తంమీద ఒత్తిడి గణాలను డియోడర్ వెలీ ఈ క్రింది విధంగా విమర్శించాడు.

1) ఒత్తిడి గణాలు ప్రజాస్వామ్య సంస్థల పట్ల కల విశ్వాసాన్ని ఒమ్ముచేస్తాయి. ఈ గణాలకు ప్రజాస్వామ్యం పట్ల విశ్వాసం ఉండదు.

2) ఈ ఒత్తిడి గణాలు ప్రభుత్వాన్ని బలహీనపరుస్తాయి. దాని సామర్థ్యాన్ని క్షీణింపచేస్తాయి.

3) ఒత్తిడి గణాలు లాంఛనప్రాయమైన సంప్రదింపుల పద్ధతులను వ్యతిరేకించడం ద్వారా ప్రజాస్వామ్యాన్ని బలహీనపరుస్తాయి.

## 12.4 భారతదేశంలో ఒత్తిడి గణాలు - లక్షణాలు :

పాశ్చాత్య రాజనీతి శాస్త్రవేత్తలు ప్రతిపాదించిన గణ సిద్ధాంతాన్ని భారతదేశరాజకీయాల అధ్యయనానికి వర్తింపచేసే ముందు భారతదేశంలో బహుళ సమాజ ప్రజాస్వామ్య వ్యవస్థ నెలకొని వున్నదనే వాస్తవాన్ని దృష్టిలో ఉంచుకోవాల్సి ఉంది. పాశ్చాత్య దేశాలలో కల ఒత్తిడి గణాల అధ్యయనానికి వర్తించిన విధంగా గణసిద్ధాంతాన్ని భారతదేశంలోని ఒత్తిడి గణాల అధ్యయనానికి వర్తింపచేయటం సాధ్యంకాదు. భారతదేశం ప్రధానంగా అభివృద్ధి చెందుతున్న దేశం. ఈ దేశంలో ప్రజల ఒత్తిడి, దానికి రాజకీయ వ్యవస్థ ప్రతిస్పందనను దేశంలోని వివిధ రాజకీయ సంస్కృతుల నేపథ్యంలో అధ్యయనం చేయవలసి ఉన్నది. అందువలన భారతదేశంలోని ఒత్తిడి గణాల స్వభావాన్ని రాజకీయాలలో వాటి పాత్ర ఆధారంగా అధ్యయనం చేయాలి. మొత్తం మీద భారతదేశంలోని ఒత్తిడి గణాల లక్షణాలను ఈ క్రింది విధంగా వివరించవచ్చును.

1) భారతదేశంలో వ్యవస్థీకృతం కానీ, క్రమబద్ధంకానీ, ఖండ ఖండాలుగా విభజింపబడిన బహుళ పార్టీ వ్యవస్థ ఉంది. భారతదేశంలో అనేక చిన్న పెద్ద పరస్పర ఘర్షణ కలిగిన స్థిరత్వంలేని రాజకీయపార్టీలు ఉన్నాయి. రాజకీయ పార్టీల మధ్య సంబంధాలు కూడా తరుచూ మారుతున్నాయి. ఈ విధంగా భారతదేశంలోని పార్టీ వ్యవస్థ సంక్లిష్టమైంది, వైవిధ్యభరితమైంది. అంతేకాక రాజకీయపార్టీలతో సంబంధం కలిగిన గణాలను అర్థం చేసుకోవటం కూడా కష్టసాధ్యం.

రెండు, కొన్ని ఒత్తిడి గణాలు ప్రదర్శిస్తున్న ప్రవర్తన వాటి రాజకీయ ఉపసంస్కృతిని వెల్లడిస్తున్నది. దీని అర్థం ఏమిటంటే ఒత్తిడి గణాలు సాంప్రదాయ, ఆధునిక లక్షణాల సమ్మేళనం. అనేక ఒత్తిడి గణాలు తమ ప్రయోజనాల సాధనకు, ఆధునిక సాంకేతిక పద్ధతులను అనుసరిస్తున్నప్పటికీ, అనేక సంకుచిత భావనాలకు, విధేయతలకూ కట్టుబడిఉన్నాయి. ఈ విధమైన సాంప్రదాయతత్వం ఒత్తిడి గణాలకు అనేకమైన సమస్యలను సృష్టిస్తున్నది. తమ కార్యకలాపాలలో ఒత్తిడి గణాలు కులం, మతం, ప్రాంతీయతత్వం మొదలైన సాంప్రదాయ శక్తుల ప్రభావానికి గురవుతున్నాయి.

మూడు, భారతదేశంలో ఒత్తిడి గణాలు రాజకీయాలలో పాల్గొంటున్నప్పటికీ, వాటికి స్పష్టమైన రాజకీయ నిబద్ధత లేదు. అని తరచూ తమ రాజకీయ విధేయతలను మార్పు చేయటం జరుగుతుండటంతో, వాటి రాజకీయ సంస్కృతిలో అస్థిరత చోటుచేసుకుంది. రాజకీయ పార్టీలు, వాటి భావజాలం పట్ల ఒత్తిడి గణాలకు స్పష్టమైన నిబద్ధత లేదు. ఉదాహరణకు దేశంలోని వ్యాపార ఒత్తిడి గణాలు రాజకీయంగా చీలిపోవటమే కాక, వాటి పట్ల భిన్న దృక్పథాలను కలిగివున్నాయి. ఈ వ్యాపార ఒత్తిడి గణాలు సాధారణంగా అధికార పార్టీకే మద్దతు ఇవ్వటం జరుగుతుంది. ఉదాహరణకు, గతంలో కాంగ్రెస్ పార్టీ కేంద్రంలో అధికారంలో కొనసాగినంత కాలం దేశంలోని వివిధ వాణిజ్య వ్యాపార ప్రయోజన గణాలు కాంగ్రెస్ పార్టీకి మద్దతునిచ్చాయి. కానీ కాంగ్రెస్ పార్టీ అధికారం కోల్పోయాక ఈ గణాలు కాంగ్రెస్‌కు తమ మద్దతును ఉపసంహరించుకోవటం జరిగింది.

నాలుగు, స్పష్టమైన సైద్ధాంతిక భావజాలం లేకపోవటం భారతదేశంలోని ఒత్తిడి గణాలు అసాంఘిక (Anomic) వ్యవస్థలుగా రూపొందాయనీ వీనర్ అభిప్రాయపడ్డాడు. అంటే ఈ ఒత్తిడి గణాలు సమాజంలో అరాచక పరిస్థితులను, చట్టరాహిత్య పరిస్థితులను సృష్టిస్తున్నాయని వీనర్ అభిప్రాయపడ్డాడు. ఈ ఒత్తిడి గణాలకు అభివృద్ధి చెందిన దేశాలలోని ఒత్గిడి గణాలు

అనుసరిస్తున్న లాబీయింగ్ పద్ధతిని అనుసరించటంలో ఆసక్తిని కనబరచలేదు. ఈ ఒత్తిడి గణాల సమ్మెలు, బంద్‌లు, ఘెరావ్‌లు వంటి పద్ధతులను ఉపయోగించడానికే ప్రాధాన్యతను కనపరుస్తున్నాయి.

చివరగా, కొందరు రాజనీతి శాస్త్రవేత్తల అభిప్రాయం ప్రకారం అభివృద్ధిచెందిన పాశ్చాత్య దేశాలలోని ఒత్తిడి గణాలకు భిన్నంగా, భారతదేశంలోని ఒత్తిడి గణాలకు స్వతంత్రమైన ఉనికి లేకపోగా, అవి రాజకీయాలలో స్వతంత్రమైన పాత్రను నిర్వహించటం లేదు. ఈ గణాలు అనేక రాజకీయ పరిమితులకు లోబడి పనిచేస్తున్నాయి. అనేక ఒత్తిడి గణాలు బహిరంగ రాజకీయ పార్టీలకు మద్దతు నిచ్చేందుకు సంకోచిస్తున్నాయి. కొన్ని ఒత్తిడి గణాలు రాజకీయ పార్టీలకు నిగూఢంగా మద్దతు నిస్తున్నాయి. ఈ విధమైన ధృక్పధం ఫలితంగా ఒత్తిడి గణాలు రాజకీయ ప్రక్రియలో చురుకుగా, బహిరంగంగా పాల్గొనటం లేదని రాజనీతి శాస్త్రవేత్తల అభిప్రాయం. ఈ పరిస్థితి అధికార రాజకీయ పార్టీకి అనుకూలిస్తున్నదని వారు పేర్కొన్నారు.

ఈ విధంగా భారతదేశంలోని వివిధ ఒత్తిడి గణాల స్వభావాన్ని, రాజకీయాలలో వాటి పాత్రను అర్థం చేసుకోవటం చాలా క్లిష్టం. కోచానిక్ (Kochanek) అనే రచయిత అభిప్రాయపడినట్లు భారతదేశంలో రాజకీయ పార్టీల, ప్రయోజన గణాల మధ్య పరస్పర సంబంధాలు ప్రయోజనగణాల మధ్య పరస్పర సంబంధాలు, గణ సిద్ధాంతవేత్తలు ఊహించిన వాటికంటే సంక్లిష్టమైనవి. భారతదేశ సందర్భంలో రాజకీయ వ్యవస్థ గణచర్యకు తగిన ప్రమాణాలను నిర్ధారించింది. అందుచేత ఈ దేశంలో ఒత్తిడి గణాల ప్రక్రియను రాజకీయ వ్యవస్థతో వాటికి కల విస్తృతమైన, సంక్లిష్టమైన సంబంధాల నేపథ్యంలో విశ్లేషించాల్సి ఉందని కోచానిక్ అభిప్రాయం.

భారతదేశంలో ఒత్తిడి గణాలు రాజకీయ వ్యవస్థలో స్పష్టమైన పాత్రను నిర్వహిస్తున్నాయి. కానీ ఈ దేశంలో రాజకీయ ప్రక్రియలో ఒత్తిడి గణాల పాత్రకు, అభివృద్ధిచెందిన పాశ్చాత్య దేశాలలో రాజకీయాలలో ఒత్తిడి గణాల పాత్రకు మధ్య భిన్నత్వం ఉంది. ఒత్తిడి గణాలు నిర్వహిస్తున్న పాత్ర భారతరాజకీయాలకు కొన్ని సమస్యలను సృష్టిస్తున్నది.

## 12.5 భారతదేశంలో ఒత్తిడి గణాల చరిత్ర :

భారతదేశంలో ఒత్తిడి గణాలు స్వాతంత్ర్యానంతర కాలంలో సంభవించిన పరిమాణం. వలస పాలన కాలంలోనే ఒత్తిడి గణాలు అవతరించినప్పటికీ అప్పట్లో వాటి సంఖ్య అతిస్వల్పం. కేవలం సాంప్రదాయ వర్గాలకు ప్రాతినిధ్యం వహించిన కొన్ని ఒత్తిడి వర్గాలు మాత్రమే ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి తమ ప్రయోజనాలను నెరవేర్చుకోగలిగాయి. ఈ ఒత్తిడి వర్గాలు క్రమబద్ధంగా వ్యవస్థీకృతం చెందకపోవటమేకాక ఆధునిక రాజకీయ వ్యవస్థల పంథాలో పనిచేయలేదు. అయితే స్వాతంత్ర్యానంతర కాలంలో పరస్పరం సంఘర్షణ కలిగిన అనేక ప్రయోజనగణాలు అవతరించి దేశ రాజకీయాలలో పాత్రను నిర్వచించటం ప్రారంభమైంది. క్రమంగా ఈ ఒత్తిడి గణాలు అభివృద్ధిచెంది, రాజకీయాలలో కీలకమైన, స్పష్టమైన పాత్రను నిర్వహిస్తున్నాయి. అయితే ఈ ఒత్తిడి గణాలు అభివృద్ధిచెందిన పాశ్చాత్య దేశాలలోని ఒత్తిడి గణాలతో అనేక అంశాలతో విభేదిస్తాయి.

భారతదేశంలో ఒత్తిడి గణాలు వ్యవస్థీకృతం చెందని, క్రమబద్ధతలేని బహుళ పార్టీ వ్యవస్థ చట్రంలో పనిచేయటం వలన అని కొన్ని ప్రత్యేక లక్షణాలను అలవరచుకొన్నాయి. భారతదేశంలో రాజకీయంగా నిబద్ధత కలిగిన ఒత్తిడి గణాల సంఖ్య పరిమితం. ఈ ఒత్తిడి గణాలు రాజకీయపార్టీలతో తమ అనుబంధాన్ని తరచూ మార్చుకొంటున్నాయి. భారతదేశంలో ఒత్తిడి గణాలు పూర్తిగా ఆధునికపంథాలో నిర్వహింపబడటం లేదు. ఈ గణాల నిర్వహణను కులం, మతం, బంధుప్రీతి, ప్రాంతం మొదలైన సంకుచిత భావాలు ప్రగాఢంగా ప్రభావితం చేస్తున్నాయి. ఈ విధంగా భారతదేశంలో ఒత్తిడి గణాలు సాంప్రదాయ, ఆధునిక అంశాల సమ్మేళనం. ఈ ఒత్తిడి గణాలు ఒకప్రక్క లాబీయింగ్, వివిధ మార్గాల ద్వారా రాజకీయపార్టీలు, శాసనసభల సభ్యులు, ప్రభుత్వ ఉద్యోగులను ప్రభావితం చేయటం వంటి ఆధునిక పద్ధతులను ఉపయోగిస్తూనే, మరో ప్రక్క అవి కులం,

మతం, బంధుత్వం వంటి సాంప్రదాయ శక్తులపై బహిరంగంగానే ఆధారపడుతున్నాయి. కొందరు రచయితల అభిప్రాయం ప్రకారం భారతదేశంలో ఒత్తిడి గణాలు తమ ప్రయోజనాల సాధనకు లాబీయింగ్, సంప్రదింపులు, చర్చలు వంటి శాంతియుతమైన పద్ధతులను ఉపయోగిస్తూనే మరోప్రక్క హింసాత్మక మార్గాలను అనుసరిస్తున్నాయి. ఈ విధంగా కొన్ని ఒత్తిడిగణాలు రాజకీయ వ్యవస్థను అస్థిరతకు గురిచేసే శక్తులుగా రూపొందాయి. చివరగా భారతదేశంలో ఒత్తిడి గణాలు రాజకీయంగా తటస్థంగా వ్యవహరిస్తూనే ఎన్నికలలో కొన్ని రాజకీయ పార్టీలకు తోడ్పడుతున్నాయి. కొన్ని రాజకీయ పార్టీలు కూడా తమ రాజకీయ ప్రయోజనాల సాధనకు కొన్ని ఒత్తిడి గణాలకు మద్దతును కనపరుస్తున్నాయని పరిశోధకులు వెల్లడిస్తున్నారు. భారతదేశంలో

## 12.6 భారత దేశంలో ఒత్తిడి గణాల రకాలు :

ఆల్మండ్, పావెల్‌లు ఒత్తిడి గణాలను ఈ క్రింది తరగతులుగా విభజించారు.

1) సంస్థీకృత ఒత్తిడి గణాలు (Institutional Pressure Groups)
2) సంఘాల రూపంలో ఉన్న ఒత్తిడి గణాలు (Associational Pressure Groups)
3) సంఘాల రూపంలో లేని ఒత్తిడి గణాలు (Non - Associational Pressure Groups)
4) అసాంఘిక ఒత్తిడి గణాలు (Anomic Pressure Groups)

సంస్థీకృత ఒత్తిడి గణాలు రాజకీయపార్టీలు, శాసనసభలు, సైనికదళాలు, ఉద్యోగ బృందాలు వంటి వ్యవస్థీకృత సంస్థలలో అవతరిస్తాయి. ఈ ఒత్తిడి గణాలు లాంఛనప్రాయమైనవి. ఈ ఒత్తిడి గణాలు తమ స్వంత ప్రయోజనాలను వ్యతిరేకరిస్తాయి. సంఘాల రూపంలో ఉన్న ఒత్తిడి గణాలు ప్రత్యేక వర్గాల ప్రయోజనాలను వ్యక్తీకరించేందుకు ఏర్పడిన ప్రత్యేకీకరణ కలిగిన నిర్మాణాలు. ఈ ఒత్తిడి గణాలకు కార్మిక సంఘాలు, ప్రభుత్వ ఉద్యోగుల సంఘాలు ప్రధానమైన ఉదాహరణలు. ఈ ఒత్తిడి గణాలనే వృత్తి సంఘాలు అని కూడా పిలుస్తారు.

పాల్‌బ్రాస్ భారతదేశంలో ఒత్తిడి గణాలను ఈ క్రింది మూడు తరగతులుగా విభజించాడు.

1) పాశ్చాత్య పారిశ్రామిక దేశాలతో సమానంగా వ్యవస్థీకృతమైన ప్రయోజనగణాలు.
2) వివిధరకాల ఉద్యమాల ద్వారా సమీకరించబడే డిమాండ్ గణాలు (Demand Groups)
3) పార్లమెంటు, శాసనసభ మొదలైన ప్రాతినిధ్య సంస్థలను ప్రభావితం చేసే ప్రభావ వర్గాలు.

మొట్టమొదటి తరగతికి చెందిన వ్యవస్థీకృత ప్రయోజన గణాలలో కార్మిక సంఘాలు, వ్యాపారస్థుల సంఘాలు, వృత్తి సంఘాలు, ప్రభుత్వ ఉద్యోగుల సంఘాలు. ఈ సంఘాలు జాతీయ, రాష్ట్ర, స్థానిక స్థాయిలలో ఉంటాయి. వీటితోపాటు కొన్ని తాత్కాలిక వ్యాపారస్తుల సంఘాలు ఉన్నాయి. ఈ వ్యాపార గణాలు తమ ప్రయోజనాలకు హాని కలిగించిన ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఉద్భవించేందుకు తగిన సమయంలో ఏర్పడతాయి. ఆహారధాన్యాల వర్తకుల సంఘాలు, వస్త్రవ్యాపారుల సంఘాలు, బంగారు పనివారి సంఘాలు వీటికి ఉదాహరణ. ఈ ప్రయోజన గణాలు జనాభాలోని అతిస్వల్పమైన వర్గాలలో ఏర్పడతాయి. ఈ గణాలలోని సభ్యుల సంఖ్య మొత్తం జనాభాలో 10 శాతానికి మించదు.

రెండవ తరగతి ప్రయోజన గణాలకు చెందిన డిమాండ్ గణాలు కాలానుగుణంగా వ్యవస్థీకృతంకాని రంగాలకు చెందిన వ్యక్తుల డిమాండ్ల సాధనకు ఉద్యమిస్తాయి. ఈ ప్రయోజనలో విద్యార్థి సంఘాలు, రైతు సంఘాలు, మతపరమైన లేదా భాషా పరమైన లేదా ప్రాంతీయపరమైన ప్రయోజన గణాలు ప్రధానమైనవి.

మూడవ తరగతికి చెందిన ప్రయోజనగణాలు ప్రత్యేక ప్రయోజనానికై ఏర్పాటు చేయబడతాయి. ఈ ప్రత్యేక ప్రయోజనాలను సాధించేందుకు ప్రజలను సమీకరించగలిగిన సామర్థ్యం కలిగిన లాంఛనప్రాయంకాని నాయకులు లేదా సంఘ శ్రేష్ఠులు గణాలలో వీటికి నాయకత్వం వహిస్తారు. వీరు పార్లమెంట్‌లోని షెడ్యూల్డు కులములకు లేదా ముస్లిం మైనారిటీకి నాయకులు మొదలైనవారు. వీరు తమ వర్గాలకు గల ప్రత్యేక ప్రయోజనాలను సాధించేందుకు ప్రభుత్వ విధానాలను ప్రభావితం చేస్తారు.

ఈ మూడు తరగతులకు చెందిన ఒత్తిడి గణాలతోపాటు కేవలం భారతదేశానికి మాత్రమే పరిమితమైన కొన్ని ప్రయోజన గణాలు మాత్రమే ఉన్నాయి. అవి, పునరుద్ధరణ ఉద్యమాలు (Reviavalist Movements), కులసంఘాలు (Caste Associations). వలసపాలన కాలంలో ప్రభుత్వ విధానాల ఫలితంగా అనేక దురన్యాయాలకు గురవటం లేదా తమ సాంప్రదాయ పద్ధతులకు భిన్నమైన పద్ధతులను తమపై బలవంతంగా రుద్దటం జరిగినప్పుడు ఆ విధానాలను ప్రతిఘటించేందుకు పునరుద్ధరణ ఉద్యమాలు తలెత్తుతాయి. ఈ ఉద్యమాలకు ఆర్యసమాజం గొప్ప ఉదాహరణ. కాగా, గో సంరక్షణకు ఏర్పడిన సమాజాలు, సంఘాలు మరొక ప్రధాన ఉదాహరణ. ఈ తరహాకు చెందిన మరో ప్రయోజనగణాలే కులసంఘాలు. కులసంఘాలలో కొన్ని లాంఛనప్రాయమైనవి. గ్రామీణ ప్రాంతాలలో, చిన్న పట్టణాలలో కులసంఘాలు చురుకుగా పనిచేస్తున్నాయి. భారతదేశంలో ప్రధానంగా షెడ్యూలు కులాల ప్రజలు వివిధ స్థాయిలో వ్యవస్థీకృతమైన సంఘాలను ఏర్పరచుకొన్నారు.

సంఘాల రూపంలోని ఒత్తిడి గణాలు బంధుత్వం, జాతి, ప్రాంతం, కులం, మతం, వంటి సామాజిక అంశాల ప్రాతిపదిక మీద ఏర్పడే గణాలు. ఈ ఒత్తిడి సంఘాలు తమ ప్రయోజనాలను లాంఛనప్రాయంకాని పద్ధతులలో వ్యక్తులు, మత లేదా కుల పెద్దలు మొదలైనవారి ద్వారా వ్యక్తపరుస్తాయి. ఈ ఒత్తిడి సంఘాలకు కులసంఘాలు, మత సంఘాలు, భాషా సంఘాలు మొదలైనవి ప్రధాన ఉదాహరణలు. భారతదేశంలో ఈ ఒత్తిడి గణాలు అతి చురుకుగా పనిచేస్తున్నాయి.

ఆల్మండ్, పావెల్‌ల అభిప్రాయం ప్రకారం సాధారణంగా అసాంఘిక ఒత్తిడి గణాలు అభివృద్ధిచెందుతున్న దేశాలలో గోచరిస్తాయి. ఈ ఒత్తిడి గణాలు భారతదేశంలో కూడా చురుకుగా పనిచేస్తున్నాయి. ఈ ఒత్తిడి గణాలు పర్యోజనితంగా ఏర్పడి తమ ప్రయోజనాల సాధనకు ప్రదర్శనలు, ర్యాలీలు, ఆత్మాహుతులు, హర్తాళ్ళు, పికెటింగ్‌లు, ధర్నాలు, సమ్మెలు, నిరాహారదీక్షలు, ప్రభుత్వ ఆస్థుల విధ్వంసం వంటి రాజ్యాంగేతర పద్ధతులను ఉపయోగిస్తాయి.

## 12.7 భారతదేశంలో ప్రయోజన గణాలు :

భారతదేశంలోని వివిధ ప్రయోజన గణాల నిర్మాణం, లక్ష్యాలు, తమ కార్యకలాపాలు తమ పనితీరును, ప్రభావాన్ని ఈ క్రింది విధంగా వివరించవచ్చును.

### 12.7.1 వ్యాపార గణాలు :

భారతదేశంలో వలసపాలనా కాలంలో వ్యాపార గణాలు వలస పాలకులకు సహకరించాలా ? లేక జాతీయోద్యమంలో పాల్గొనాలా ? అనే సందిగ్ధత పరిస్థితిలో కొనసాగినట్లు కొందరి రచయితల అభిప్రాయం. అయితే స్వాతంత్ర్యానంతర కాలంలో వ్యవస్థీకృత వ్యాపార రంగం సైద్ధాంతిక భావజాలం, తమ స్వప్రయోజనాల మధ్య ఊగిసలాడటం సంభవించిందని, మరోవైపు అప్పట్లో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీకి లేదా ప్రైవేటు రంగాన్ని సమర్థించిన కొన్ని ఇతర రాజకీయ పార్టీలకు మధ్య తన విధేయతను తరచూ మార్పు చేయటం జరిగిందని కోచానర్ పేర్కొన్నాడు. భారతదేశంలో వ్యాపార గణాల రాజకీయపాత్ర

కొన్ని వ్యవస్థీకృత వ్యాపార ప్రయోజన గణాలతో సన్నిహితంగా ముడిపడి ఉంది. భారతదేశంలో మొట్టమొదటి వ్యాపార ప్రయోజన గణం అయిన కలకత్తా ఛాంబర్ ఆఫ్ కామర్స్ 1834లో స్థాపించబడింది. దీని తరువాత మద్రాసు, బొంబాయిలలో కూడా వ్యాపార సంఘాలు ఏర్పాటయ్యాయి. వీటి తరువాత భారత్ ఛాంబర్ ఆఫ్ కామర్స్, బెంగాల్ జాతీయ ఛాంబర్ అనే మరో రెండు వ్యాపార ప్రయోజనగణాలు ఏర్పాటు చేశారు. 1926లో సుప్రసిద్ధ పారిశ్రామికవేత్త జి.డి.బిర్లా కలకత్తాలో ఛాంబర్ ఆఫ్ కామర్స్‌ను స్థాపించాడు. దేశ స్వాతంత్ర్యానంతరం మూడు ప్రధాన వ్యాపార సంఘాలు ఏర్పాటు చేయబడ్డాయి. అవి : 1) ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్, 2) అసోసియేటెడ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్, 3) ఆల్ ఇండియా మాన్యుఫ్యాక్చురర్స్ ఆర్గనైజేషన్. మొదటి నుంచి ఈ మూడు వ్యాపార సంఘాలు ప్రభుత్వ విధానాలను నిర్ణయాలను ప్రభావితం చేస్తున్నాయి.

దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన ప్రారంభంలో అప్పట్లో అధికారంలో కొనసాగుతున్న అత్యంత శక్తివంతమైన పార్టీ అయిన కాంగ్రెస్‌కు మద్దతు ఇవ్వాలా ? వద్దా ? అనేది ఆనాటి వ్యాపార సంఘాల ముందు ప్రధాన ప్రశ్నగా మిగిలింది. అంతేకాక నెహ్రూ నాయకత్వంలోని కాంగ్రెస్ పార్టీ సోషలిస్ట్ విధానం పట్ల మొగ్గుచూపటంలో వారి పరిస్థితి మరింత సున్నితంగా రూపొందింది. అప్పటి ప్రముఖ పారిశ్రామికవేత్తలందరూ నెహ్రూ ప్రతిపాదించిన సోషలిస్ట్ తరహా సమాజం అనే సిద్ధాంతానికి తీవ్రంగా విమర్శించారు. అయితే వారు నెహ్రూ సోషలిస్ట్ విధానాలపట్ల రెండు భిన్నమార్గాలలో ప్రతిస్పందించారు. జి.డి. బిర్లా మొదలైన కొందరు ప్రముఖ పారిశ్రామిక వేత్తలు నెహ్రూ ప్రభుత్వ విధానాలపట్ల వాస్తవపూరితమైన, హేతుబద్ధమైన దృక్పధాన్ని అనుసరించారు. దీనికి భిన్నంగా జె.ఆర్.టి. టాటా మొదలైన ఇతర పారిశ్రామిక వేత్తలు కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్థిక విధానాలను తీవ్రంగా విమర్శించారు.

ఈ రెండు భిన్నదృక్పధాలు కాంగ్రెస్ ప్రభుత్వ విధానాల పట్ల దేశంలోని ఇద్దరు ప్రముఖ పారిశ్రామిక వేత్తల ప్రతిస్పందనలపై ఆధారపడ్డాయి. బిర్లా నెహ్రూ నాయకత్వంలోని ప్రభుత్వం సోషలిస్ట్ విధానాలు వ్యాపార ప్రయోజనాలకు అతి తక్కువ స్థాయిలో హానికరమైనవని భావించారు. ఈ దృక్పధానికి భిన్నంగా జె.ఆర్.టి. టాటా వర్గం నెహ్రూ ప్రభుత్వం అనుసరిస్తున్న ఆర్థిక విధానాలు, ప్రధానంగా సోషలిస్ట్ ప్రణాళికలపై తన వ్యతిరేకతను వ్యక్తపరిచింది.

ఈ విధంగా భారతదేశంలో వ్యాపార వ్యవస్థీకృత వ్యాపార గణాలు కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరించిన సోషలిస్ట్ విధానాలను వ్యతిరేకించినప్పటికీ జన సంఘ్ స్వతంత్రపార్టీ, భారతీయ లోక్‌దళ్ వంటి మితవాదపార్టీల ఆర్థిక విధానాలను సమర్థించలేదు. దీనికి అప్పట్లో ఈ పార్టీలు కాంగ్రెస్‌కు పత్యామ్నాయంకాదనే వాటి అభిప్రాయమే కారణం.

భారతదేశంలోని వ్యవస్థీకృత వ్యాపారగణాలు తమ ప్రయోజనాలను పరిరక్షించేందుకు లేదా సాధించేందుకు అనేకరకాల పద్ధతులను అనుసరిస్తున్నాయి. వాటిలో ప్రధానమైనవి : 1) ప్రభుత్వంతో సంప్రదింపులు, ఉత్తర ప్రత్యుత్తరాలు, పార్లమెంట్, శాసనసభ్యులతో సభ్యులతో ప్రభుత్వ ఉద్యోగులతో సంబంధాలు, వివిధ ప్రభుత్వ శాఖల సంప్రదింపుల సంఘాలలో, కార్యకలాపాలలో, భాగస్వామ్యం, ప్రభుత్వానికి సలహాలు, సాంకేతిక నైపుణ్యాన్ని అందజేయటం, సదస్సుల నిర్వహణ, లాబీయింగ్ మొదలగునవి. వీటితోపాటు వ్యవస్థీకృత వ్యాపార ప్రయోజనగణాలు వివిధ రాజకీయ పార్టీలకు, ప్రధానంగా అధికార పార్టీకి వివిధ సమయాలలో ధనసహాయం లేదా నిధులను సమకూర్చటం ద్వారా ప్రభుత్వ విధానాలను నిర్ణయాలను ప్రభావితం చేయటానికి ప్రయత్నిస్తున్నాయని అనేక మంది రాజనీతిశాస్త్రవేత్తలు తరచుగా పేర్కొనటం జరుగుతున్నది. వ్యాపార ప్రయోజన గణాల రాజకీయ ప్రవర్తనను విశ్లేషిస్తే, రాజకీయపార్టీలతో తమ సంబంధాలలో ఈ ప్రయోజనగణాలు వివిధ రాజకీయపార్టీలకు ఎన్నికల నిధులను భారీ పరిమాణంలో అందచేస్తున్నట్లు గుర్తించవచ్చునని జె.సి.జొహరి పేర్కొన్నాడు. ఈ ప్రయోజనాల

గణాలు వివిధ పార్టీలకు ఎన్నికల నిధులను సమకూర్చటం ద్వారా వాటిని నిర్ణయీకరణ ప్రక్రియనేకాక, ఎన్నికలలో వాటి తరపున పోటీచేసే అభ్యర్థుల ఎంపికనుకూడా ప్రభావితం చేసేందుకు ప్రయత్నిస్తున్నాయని జోహరి అభిప్రాయం.

### 12.7.2. కార్మిక సంఘాలు :

రాజకీయ ప్రక్రియను ప్రభావితం చేసే ఒత్తిడి గణాలలో కార్మిక సంఘాలకు (Labour Unions) ప్రత్యేకస్థానం ఉంది. మిగతా ఒత్తిడి గణాల కంటే కార్మికసంఘాలు రాజకీయాలను అధికంగా ప్రభావితం చేస్తాయి. సాధారణంగా మిగిలిన ఒత్తిడి గణాలు కేవలం ప్రజాస్వామ్య వ్యవస్థలకే పరిమితం. కార్మికసంఘాలు దాదాపు అన్నిరకాల రాజకీయవ్యవస్థల్లో ఒత్తిడి గణాలుగా కీలకపాత్ర వహిస్తాయి. వ్యాపార ప్రయోజన గణాల మాదిరి కార్మిక సంఘాలు కూడా రాజకీయపార్టీలతో అనుబంధం ఏర్పరచుకొంటాయి. ఈ అనుబంధం రాజకీయపార్టీలకు, కార్మిక సంఘాలకు కూడా ప్రయోజనం చేకూరుస్తుంది. అధిక వేతనాలు, మెరుగైన పని పరిస్థితులు, వివిధ సదుపాయాలు, సౌకర్యాల కల్పన, ఉద్యోగి భద్రత, హక్కుల పరిరక్షణ, నిర్వహణ ప్రక్రియలో భాగస్వామ్యం, యాజమాన్యం నిరుంకుశ ధోరణి నుంచి రక్షణ మొదలైన లక్ష్యాల సాధనకు వివిధ రూపాలలో ఉద్యమించటం, కార్మిక సంస్థల ప్రధాన కర్తవ్యం. కార్మిక సంఘాలు చేపట్టే ప్రతి కార్యకలాపం వెనుక రాజకీయపార్టీల ప్రమేయం ఉంటుందని, ఇది కార్మిక సంఘాలపై రాజకీయ పార్టీలు లేదా రాజకీయ నాయకుల నియంత్రణ ఉంటుందనే, వాస్తవానికి నిదర్శనం అనీ కొందరు రచయితలు పేర్కొన్నారు.

భారతదేశంలో కార్మిక సంఘాలకు సుదీర్ఘమైన చరిత్ర ఉంది. ఈ దేశంలో కార్మిక సంఘాలు వలసపాలన కాలంలోనే ప్రారంభమయ్యాయి. 1920లో లాలాలజపతిరాయ్ ప్రారంభించిన అఖిల భారత కార్మిక సంఘా (All India Trade Union Congress) న్ని దేశంలో మొట్టమొదటి కార్మికసంఘంగా పరిగణించవచ్చును. ఈ కార్మిక సంఘం స్వాతంత్ర్యసాధనకు కట్టుబడి ఉండటం వలన జాతీయ కాంగ్రెస్‌కు కార్మిక విభాగంగా పరిగణింపబడింది. దేశంలో కమ్యూనిస్ట్ ఉద్యమం బలపడటంతో ఈ కార్మిక సంఘంలో సహజంగానే చీలిక ఏర్పడింది. 1928లో కమ్యూనిస్టులు ఈ కార్మిక సంఘం నాయకత్వాన్ని చేపట్టేందుకు ప్రయత్నించటంతో అఖిల భారత కార్మిక సంఘంలో చీలిక ఏర్పడింది. దానితోపాటు దేశంలోని కాంగ్రెస్ నాయకత్వంలోని ఇతర కార్మిక సంఘాలలో కూడా చీలిక సంభవించింది. కాంగ్రెస్ పార్టీ తన సొంత కార్మిక సంఘమైన ఇండియన్ ట్రేడ్ యూనియన్ ఫెడరేషన్ను (Indian Trade Union Federation) ఏర్పాటు చేసుకుంది. దాని ఫలితంగా కమ్యూనిస్టులు కూడా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (Trade Union Congress) పేరుతో తమ స్వంత కార్మిక సంఘాన్ని ఏర్పరచుకొన్నారు. ఈ విధంగా కాంగ్రెస్, కమ్యూనిస్టులు తమ సంబంధాలను త్రెంచుకున్న తర్వాత ఈ రెండు పార్టీలు తమ కార్మిక సంఘ ఉద్యమాన్ని సమర్థవంతంగా కొనసాగించలేకపోయాయి. ఈ వాస్తవాన్ని గుర్తించిన కమ్యూనిస్టులు 1935లో తమ కార్మిక సంఘాన్ని రద్దుచేసి, దానిని కాంగ్రెస్ అధీనంలో ఉన్న అఖిల భారత కార్మిక సంఘంలో విలీనంచేసారు.

1940 దశాబ్దంలో సంభవించిన రెండవ ప్రపంచ యుద్ధం భారతదేశంలోని కార్మిక ఉద్యమాన్ని ఒక నూతన మలుపు త్రిప్పింది. ఈ యుద్ధంలో భారతదేశం పాల్గొనటంపై దేశంలోని వివిధ కార్మిక సంఘాలలో విభేదాలను పొడసూపాయి. 1940లో దేశంలోని కార్మికులలో ఒక వర్గం యం.యన్. రాయ్ నాయకత్వంలో భారత కార్మిక సమాఖ్య (Indian Federation of Labour) ను ఏర్పాటు చేసుకొని ఫాసిజానికి వ్యతిరేకంగా రెండవ ప్రపంచ యుద్ధంలో ఇంగ్లాండ్‌కు సహకరించాలని నిశ్చయించింది. ఇదే సందర్భంలో కాంగ్రెస్‌పార్టీ అధీనంలో ఉన్న అనేక కార్మిక సంఘాలు అఖిల భారత కార్మిక సంఘం నుంచి విడిపోయి 1944లో భారత జాతీయ కార్మిక సంఘాల సమాఖ్య (Indian National Trade Union Congress) ను స్థాపించాయి.

కాంగ్రెస్ అధీనంలో ఉన్న కార్మికసంఘాల పంథాన్ని అనుసరిస్తూ దేశంలోని సోషలిస్ట్ కార్మిక నాయకులు కూడా అఖిల భారత ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ నుండి విడిపోయి, హిందూ మజ్దూర్ సభ (Hindu Mazdur Sabha) అనే పేరుతో ఒక కార్మిక సంఘాన్ని స్థాపించారు. ఇదే విధంగా కొందరు కమ్యూనిస్ట్ నాయకులు కూడా సంయుక్త ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (United Trade Union Congress) ను స్థాపించారు. ఈ విధంగా దేశానికి స్వాతంత్ర్యం వచ్చేనాటికి దేశంలో నాలుగు జాతీయ స్థాయి కార్మిక సంఘాలు ఉన్నాయి. ఈ నాలుగు సంఘాలకు నాలుగు విభిన్న రాజకీయపార్టీలు ఆధిపత్యం వహించాయి.

స్వాతంత్ర్యానంతర కాలంలో దేశంలోని కార్మిక సంఘాల ఉద్యమం అనేక మార్పులకు లోనయింది. ఈ కార్మిక సంఘాలు సిద్ధాంతాలు, తదితర కారణాల వల్ల అనేక చీలికలకు గురిఅయ్యాయి. దేశంలో ప్రతి ప్రధాన రాజకీయపార్టీ తనకు అనుబంధంగా కార్మిక విభాగాలను ఏర్పరచుకొంది. కాంగ్రెస్ పార్టీ భారత రాజకీయ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (INTUC)ను కమ్యూనిస్ట్‌లు అఖిల భారత ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (AITUC) ను, సోషలిస్ట్ పార్టీలు హింద్ మజ్దూర్ సభ (HMS)ను, మరికొందరు యునైటెడ్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (UTUC) ని భారతీయ జనతా పార్టీ (వెనుకటి జనసంఘ్) హింద్ మజ్దూర్ పరిషత్ (HMP) ఈ విధంగా అనేక కార్మిక సంఘాలను ఏర్పరచుకొన్నాయి. దేశంలో ఈ నాలుగు ప్రధాన కార్మిక సంఘాలతో పాటు అనేక ఇతర కార్మిక సంఘాలు ఏర్పాటయ్యాయి.

భారతదేశంలో కార్మిక సంఘాల సంఖ్య క్రమంగా పెరుగుతూ వచ్చిందని ప్రభుత్వ గణాంకాలు వివరిస్తున్నాయి. దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిన సమయంలో (1947) లో రిజిష్టర్ కాబడిన కార్మిక సంఘాల సంఖ్య 2766. వాటిలోని సభ్యుల సంఖ్య దాదాపు 16,62,000. 1964 - 65 నాటికి ఈ కార్మిక సంఘాల సంఖ్య 12,801కి, వాటి సభ్యుల సంఖ్య 36,54,000 కు కాగా, 1977లో రిజిష్టర్ చేయబడన కార్మిక సంఘాల సంఖ్య 30,810 కి పెరగగా, 1992 నాటికి వాటి సంఖ్య 55,675కు చేరుకుంది.

భారతదేశంలో కార్మిక సంఘాలు తమ సభ్యుల ప్రయోజనాల పరిరక్షణకు, వారి సంక్షేమానికి అనేక చర్యలను చేపడుతున్నాయి. భారతదేశంలో పారిశ్రామికీకరణ, ఆర్థికాభివృద్ధి వేగంగా సంభవిస్తుండటం వలన, కార్మిక సంఘాల స్వభావం, కార్యకలాపాలు, పాత్రలలో గణనీయమైన మార్పులు చోటుచేసుకుంటున్నాయి. గతంలో కార్మిక సంఘాలు ఏదో ఒక రాజకీయ భావజాలానికి లేదా రాజకీయ పార్టీకి కట్టుబడి ఉండటంతోపాటు, ఇతర రాజకీయ భావజాలం, సిద్ధాంతాలకు కట్టుబడిన కార్మిక సంఘాల పట్ల శత్రుత్వ వైఖరిని ప్రదర్శించాయి. కానీ ఇటీవల కాలంలో దేశంలోని వివిధ పరిశ్రమలలో విద్యావంతులు, నిపుణులైన ఉద్యోగుల సంఖ్య పెరగటం వలన ఈ కార్మిక సంఘాల ధోరణిలో స్పష్టమైన మార్పు వ్యక్తమవుతున్నది. అంతేకాక, ఇటీవల కాలంలో విద్యుచ్ఛక్తిని ఉత్పత్తిచేసే పరిశ్రమలు మొదలైన అనేక నూతన పరిశ్రమలు స్థాపించబడుతున్నాయి. ఈ నూతన పరిశ్రమలలో కార్మికులు తమ సొంత కార్మిక సంఘాలను ఏర్పరచుకోవటం జరుగుతున్నది. ఈ కార్మిక సంఘాలు దేశంలో కేంద్రీకృత కార్మిక సంఘాలతో అనుబంధం కాకుండా, స్వంత వ్యవస్థలుగా వ్యవహరిస్తున్నాయి. అంతేకాక ఈ కార్మిక సంఘాలకు బయటి వ్యక్తులకు కాక సంబంధిత పరిశ్రమలలోని ఉద్యోగులే నాయకత్వం వహిస్తున్నారు.

మైరన్ వీనర్ అభిప్రాయం ప్రకారం భారతదేశంలో కార్మిక సంఘాల ఉద్యమం చాలా బలహీనమైంది. కార్మిక సంఘాల సంఖ్య విస్తృతంగా ఉన్నప్పటికీ, వాటి ఆదాయం పరిమితం. కార్మిక సంఘాల కార్యకలాపాలు కేవలం ఎన్నికలకు, సమ్మెలకు వివిధ రకాల ప్రదర్శనలకూ మాత్రమే పరిమితం. కార్మిక సంఘాలు అరుదుగా మాత్రమే తమ సభ్యులకు అవసరమయ్యే కార్యకలాపాలను చేపడుతున్నాయి. కాగా, కొన్ని కార్మిక సంఘాలు బయటవారి నాయకత్వంలో ఉన్నాయి. రాజకీయ నాయకులు కార్మికుల సంఘాలను నియంత్రిస్తూ వాటిని తమ రాజకీయ ప్రయోజనాలకు వినియోగించటం

జరుగుతున్నది. దీని ఫలితంగా కార్మిక సంఘాల రాజకీయకీకరణపై విమర్శలు చెలరేగుతున్నాయి.

భారతదేశంలో కార్మిక సంఘాలు వివిధ సైద్ధాంతిక దృక్పధాలను కలిగివుండి, తమ కోర్కెల సాధనకు వివిధ పద్ధతులను వినియోగిస్తున్నాయి. కాంగ్రెస్ పార్టీ అధీనంలోవున్న ఐ.యన్.టి.యు.సి (INTUC) కేంద్రంలో తమ ప్రభుత్వం ఉన్న కాలంలో దానికి కార్మిక సంఘాల మద్దతును సమీకరించడంపై దృష్టి కేంద్రీకరించింది. మార్క్సిస్టు కమ్యూనిస్ట్ పార్టీ ఆధిపత్యంలో ఉన్న సి.ఐ.టి.యు. అప్పట్లో కేంద్రంలో అధికారంలో ఉన్నకాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా కార్మికులను ఉద్యమింపచేసింది. ఈ కార్మిక సంఘం ప్రధానంగా సమ్మెలను, బంద్‌లను తన ఆయుధంగా ఎంచుకుంది. ఇదే విధంగా సోషలిస్ట్‌ల అధీనంలో ఉన్న హింద్ మజ్‌దూర్ సభ, మార్క్సిస్టుల పంథానే అనుసరించింది. **1980**కు ముందు కార్మిక సంఘాల దృక్పధాన్ని వివరిస్తూ మైరన్ వీనర్ కాంగ్రెస్‌కు చెందిన కార్మిక సంఘాలు మితవాదధోరణిని కలిగిఉంటే మిగతా సంఘాలన్నీ అతివాద ధోరణిని అవలంభించాయి అని పేర్కొన్నారు.

భారతదేశంలో కార్మిక సంఘాల రాజకీయాలను నిశితంగా పరిశీలిస్తే ఈ క్రింది ప్రధాన అంశాలను గుర్తించవచ్చును.

**1)** భారతదేశం లాంటి అభివృద్ధి చెందుతున్న దేశాలలో ఆర్థిక, పారిశ్రామిక అభివృద్ధి సాధనలో కార్మిక సంఘాలకు కీలకపాత్ర ఉంది. అయితే ఈ దేశాలలో కార్మిక సంఘాలు తమ ప్రధాన లక్ష్యమైన కార్మికుల ప్రయోజనాలను పరిరక్షించటంలో విఫలమయ్యాయి. కొందరు రచయితల అభిప్రాయం ప్రకారం భారతదేశంలోని కార్మిక సంఘాలు దేశ ప్రయోజనాల కంటే తమ సంకుచిత ప్రయోజనాలకే అధిక ప్రాధాన్యతను కనబరుస్తున్నాయి. దీని ఫలితంగా దేశ ఆర్థిక ప్రగతి వేగం మందగించింది.

**2)** దేశంలోని అనేక కార్మిక సంఘాల నాయకులకు, రాజకీయ పార్టీలతో సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. దీని ఫలితంగా వారు పూర్తిగా ప్రభుత్వ అనుకూల ధోరణిని, లేదా పూర్తిగా ప్రభుత్వ వ్యతిరేక ధోరణిని అవలంబిస్తున్నారు. వీరికి కార్మికుల ప్రయోజనాలు అప్రధానమైనవి. రాజకీయ పార్టీల ప్రభావం వలన ఈ కార్మికుల సంఘాలు తాము అనుసరించాల్సిన మార్గాలనుంచి వైదొలగుతున్నాయి. ప్రస్తుత పరిస్థితులలో దేశంలోని కార్మిక సంఘాలు రాజకీయపార్టీల సహకారంలేనిదే తమ మనుగడను కొనసాగించలేవు అనేది వాస్తవం. అయితే కార్మిక సంఘాల నాయకులు రాజకీయనాయకుల ఇష్టాఇష్టాలకు అనుగుణంగా వ్యవహరించటం వలన కార్మిక ఉద్యమానికి తీవ్ర నష్టం జరుగుతున్నదని అశోక్‌మెహతా వాదించాడు.

**3)** దేశంలోని కార్మిక సంఘాలు అనుసరిస్తున్న పద్ధతులు, విధానాలు పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థకు అనుగుణంగా లేవు. దేశంలోని వివిధ కార్మిక సంఘాల నాయకుల మధ్య కల అనైక్యత, సంఘర్షణ పూరిత ధోరణి కార్మిక సంఘాల ఉద్యమానికి విఘాతం కలిగిస్తున్నది. కార్మిక సంఘాల నాయకుల నిరంకుశ ధోరణిలో వ్యవహరించడం ఫలితంగా వాటిలో ప్రజాస్వామ్య స్ఫూర్తి లోపించిందని పునేకర్ అనే రచయిత అభిప్రాయం.

ఇటీవల కాలంలో దేశంలో ప్రైవేటీకరణ, ప్రపంచీకరణల నేపధ్యంలో కార్మిక సంఘాలు అనేక సవాళ్ళను, మార్పులను ఎదుర్కొనవలసి వస్తున్నదని, నిపుణులు పేర్కొంటున్నారు. దానితోపాటు పరిశ్రమలలో ప్రవేశపెడుతున్న నూతన సాంకేతిక పరిజ్ఞానం కూడా కార్మిక సంఘాలకు నూతన సవాళ్ళను సృష్టిస్తున్నది. ఈ నూతన పరిణామాల ఫలితంగా పరిశ్రమలలో కార్మికుల సంఖ్య తగ్గించటం, శాశ్వత కార్మికుల స్థానంలో కాంట్రాక్టు పద్ధతిని ప్రవేశపెట్టడం వంటి మౌళిక మార్పులు సంభవిస్తున్నాయి. ఈ మార్పులు కార్మికులపైనేకాక, కార్మిక సంఘాలపై కూడా విపరీతమైన ప్రభావాన్ని కనబరుస్తున్నాయి. ఈ నూతన పరిస్థితులతో అనుగుణ్యతను పెంపొందించుకొనటం కార్మిక సంఘాలకు ఒక తీవ్రమైన సవాలుగా పరిగణించిందని సామాజిక శాస్త్రవేత్తల అభిప్రాయం.

### 12.7.3. రైతు సంఘాలు :

భారతదేశంలో వ్యవసాయదారులు, వ్యవసాయ కూలీలకు చెందిన ఒత్తిడి గణాల కార్యకలాపాలను, రాజకీయాలను పరిశీలిస్తే, వాటిలో గల బలహీనత వ్యక్తమవుతుంది. కొందరు రచయితల అభిప్రాయం ప్రకారం భారతదేశంలో వ్యవసాయదారుల సంఘాల పరిస్థితి, కార్మిక సంఘాల పరిస్థితి కంటే బలహీనంగా ఉంది. ఈ దేశంలో వ్యవసాయదారులకు వ్యవస్థీకృతం అయ్యే సామర్థ్యం లేదు. దేశంలో పరిమిత సంఖ్యలో ఉన్న వ్యవసాయదారుల సంఘాలు కూడా వ్యవసాయదారుల ప్రయోజనాలను సమర్థవంతంగా వ్యక్తీకరించే స్థాయిలో లేవు. దేశంలోని కార్మికులు ఉద్యోగుల సంఘాలు తమ ఉనికిని చాటుకునే స్థితిలోనైనా ఉండగా, వ్యవసాయదారుల సంఘాలు తమ ప్రయోజనాలను నెరవేర్చుకొనే స్థితిలో లేవు.

భారతదేశంలో కార్మిక సంఘాలలాగే వ్యవసాయదారుల సంఘాలకు కూడా సుదీర్ఘచరిత్రే ఉంది. ఈ దేశంలో వ్యవసాయ దారుల ఉద్యమం 1936లో కాంగ్రెస్ పార్టీ ద్వారా ప్రారంభించబడింది. 1936లో లక్నో సదస్సులో కాంగ్రెస్‌పార్టీ రైతుల ప్రయోజనాలను పరిరక్షించేందుకు చేపట్టవలసిన ఒక బృహత్ కార్యక్రమాన్ని ప్రతిపాదించింది. ఈ తీర్మానం ఫలితంగా అఖిల భారత కిసాన్ కాంగ్రెస్ (All India Kisan Congress) అనే రైతు సంఘం అవతరించి, కొద్దికాలంలో రైతు సంఘం పేరు అఖిల భారత కిసాన్ సభగా మారింది. ఈ రైతు సంఘం ఏర్పాటు వెనుక వల్లభాయ్‌పటేల్ కీలకపాత్ర వహించాడు. రైతుల సమస్యల పట్ల, ప్రయోజనాల పట్ల మిగతా స్వాతంత్ర్యోద్యమ నాయకుల కంటే అధిక ఆసక్తిని కనబరచాడు. పటేల్ నాయకత్వములోని అఖిల భారత కిసాన్ సభ దేశంలో చెదురుమొదురుగా ఉన్న రైతుల సంఘాలను సమైక్యపరచి, కాంగ్రెస్ పార్టీ గొడుగు క్రిందకు తేగలిగింది. అయితే కిసాన్ సభకు కల కొన్ని పరిమితుల ఫలితంగా దేశంలో ఒక పటిష్టమైన రైతు ఉద్యమాన్ని నిర్మించటంలో ఈ సభ విఫలమైంది. కిసాన్ సభలో అన్ని స్థాయిల రైతులకు సభ్యత్వం ఉండటం వలన వారి ప్రయోజనాల మధ్య ఘర్షణ అనివార్యంగా తలెత్తింది. దీని ఫలితంగా కిసాన్ సభలో అనేక చీలికలు ఏర్పడ్డాయి.

కాంగ్రెస్ పార్టీలోని సోషలిస్ట్ నాయకులైన నరేంద్రదేవ్, హిందూలాల్ యాగ్నిక్, స్వామీ సహజానంద తమ నాయకత్వంలో ప్రత్యేక రైతు సంఘాలను ఏర్పాటు చేశారు. 1942లో క్విట్ ఇండియా ఉద్యమం అనంతరం కమ్యూనిస్టులు అఖిల భారత కిసాన్ సభను తమ ఆధీనంలోకి తెచ్చుకొని రైతు ఉద్యమాన్ని తమ పార్టీ పంథాలో నిర్వహించటం ప్రారంభించారు. ఈ విధంగా స్వాతంత్ర్యోదమ కాలంలో దేశంలోని రైతులు సమర్థవంతంగా వ్యవస్థీకృతం కాలేకపోయారు. కాంగ్రెస్ పార్టీ కొన్ని ఇతర రాజకీయపార్టీలు స్థాపించిన రైతు సంఘాలు అభివృద్ధిచెందలేక పోయాయి.

స్వాతంత్ర్యానంతర కాలంలో కూడా దేశంలో రైతు ఉద్యమం శక్తివంతంగా రూపొందలేకపోయింది. అయితే ఈ కాలంలో దేశంలో వివిధ ప్రాంతాలలో అనేక నూతన రైతు సంఘాలు స్థాపించబడ్డాయి. ఈ రైతు సంఘాలలో సోషలిస్ట్ పార్టీ స్థాపించిన హిందూ కిసాన్ పంచాయత్, మార్క్సిస్ట్ పార్టీ ఏర్పరచిన సమైక్య కిసాన్ సభ మొదలైనవి ప్రధానమైనవి. 1960 వ దశాబ్దంలో కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన వ్యవసాయరంగ సంస్కరణలు, స్వతంత్ర పార్టీ అవతరణ వంటి పరిణామాల ఫలితంగా దేశంలోని రైతు ఉద్యమం చరిత్రలో ఒక నూతన అధ్యాయం ప్రారంభమైంది. ఈ దశాబ్దంలో దేశంలోని వివిధ ప్రాంతాలలో అనేక రైతు సంఘాలు వెలిసాయి. 1970 వ దశాబ్దంలో రైతుల ఉద్యమం మరింత బలపడటంతో రైతు సంఘాలు పటిష్టవంతమైనాయి. కొన్ని ప్రాంతాలలో వ్యవసాయదారుల సంఘాలు రాజకీయ పార్టీలను ఏర్పరచటం సంభవించింది. బీహార్‌లో ప్రారంభించబడిన జార్ఖాండ్ పార్టీ, మహారాష్ట్రలో ఏర్పడిన వర్కర్స్ అండ్ పెజెంట్స్ పార్టీ (Workers & Peesant Party) దీనికి ఉదాహరణలు.

1978లో ప్రముఖ జనతాపార్టీ నాయకుడు రాజ్‌నారాయణ్ అఖిల భారత కిసాన్ సమ్మేళన్ అనే వ్యవసాయదారుల

సంఘాన్ని ప్రారంభించాడు. భారతదేశంలో రైతుల ఉద్యమంలో ఒక ప్రధాన ఘట్టంలో పేర్కొనదగింది. దేశంలోని వివిధ ప్రాంతాలలో ఉన్న రైతుల మధ్య పరస్పర సహకారాన్ని, ఐక్యతను పెంపొందింపచేయడం, తమపై సాగుతున్న అన్నిరకాల దోపిడికి వ్యతిరేకంగా పోరాడేలా రైతులను సమీకరించడం వారి సర్వతోముఖ అభివృద్ధి సాధించడం మొదలైనవి కిసాన్ సమ్మేళన్ ప్రధాన ఆశయాలు. కిసాన్ సమ్మేళన్ 1970 డిసెంబర్‌లో నిర్వహించిన కిసాన్ డే (Kisan Day) ర్యాలీలో రైతుల ప్రయోజనాలను సాధించేందుకు అనేక డిమాండ్‌లతో కూడిన ఒక పత్రాన్ని ప్రకటించింది. అంతేకాక ఈ ర్యాలీలో కిసాన్ సమ్మేళన్ నూతనంగా ఏర్పడిన జనతాపార్టీ ప్రభుత్వం రైతుల అభివృద్ధికి చేపట్టవలసిన అనేక సంస్కరణలను సూచించింది.

### 12.7.4. ఇతర ఒత్తిడి గణాలు :

పైన వివరించిన వ్యాపారస్థులు, కార్మికుల, రైతుల ఒత్తిడి గణాలతో పాటు భారతదేశంలో ఇతర రకాల ఒత్తిడి గణాలు దేశ రాజకీయాలపై గణనీయమైన ప్రభావాన్ని కనబరుస్తున్నాయి. వీటిలో మత, కుల, భాష, జాతి (Ethenic) పరమైన, విద్యార్థి సంఘాలను ప్రదానంగా పేర్కొనవచ్చును. ఈ వివిధ రకాల సంఘాలు సంబంధిత, వర్గాల ప్రజల సమస్యల పరిష్కారానికి లేదా వారి ప్రయోజనాల పరిరక్షణ కొరకు ఏర్పడ్డాయి. ఈ సంఘాలను ఒత్తిడి గణాలుగా పరిగణించటానికి తగిన కారణాలు ఉన్నాయి. మైరన్ వీనర్ ఈ సంఘాలను వ్యవస్థీకృతమైన సంఘాలు, వ్యవస్థీకృతం కాని సంఘాలు అని పలురకాలుగా విభజింపవచ్చునని పేర్కొన్నాడు.

మతపరమైన ఒత్తిడి గణాలకు ఆర్యసమాజ్, ముస్లింలీగ్ (కేరళ), శిరోమణి అకాళీదళ్ (పంజాబ్), ముస్లిం మజిలీస్, అఖిల భారత ఆంగ్లోఇండియన్ సంఘం, రోమన్ క్యాథలిక్ సంఘాలు, జమాయితే ఇస్లామ్ మొదలగునవి ప్రధానమైనవి.

దేశంలోని వివిధ ప్రాంతాలలో ఏర్పడిన కులపరమైన ఒత్తిడి గణాలు సంక్లిష్టమైనవి. కొన్ని కుల సంఘాలు, రాజకీయపార్టీలుగా పరిమాణం చెందాయి. తమిళనాడు రాష్ట్రములో బ్రాహ్మణుల ఆధిక్యతకు వ్యతిరేకంగా పోరాడేందుకు ద్రావిడక గజం (D.K.), జస్టిస్ పార్టీలు ప్రారంభించబడ్డాయి. తరువాత కాలంలో డి.కె. పార్టీ డి.యం.కె., అన్నాడి.యం.కె. అనే పార్టీలుగా చీలిపోయింది. ఈ పార్టీలు బ్రాహ్మణుల ఆధిక్యతకు వ్యతిరేకంగా పోరాడటంతో పాటు, ద్రావిడ కూలాల అభివృద్ధికి పాటుపడటం అనే లక్ష్యంతో ఏర్పడిన పార్టీలు. ఈ పార్టీలు 1967 సాధారణ ఎన్నికల నుంచి వివిధ ఎన్నికలలో తమిళనాడులో అధికారాన్ని కైవసం చేసుకొని ప్రభుత్వాన్ని ఏర్పరుస్తున్నారు.

భారతదేశ రాజకీయాల్లో మిగతా రకాల ఒత్తిడి గణాలతోపాటు విద్యార్థులకు చెందిన ఒత్తిడి గణాలు కీలకపాత్రను వహిస్తున్నాయని చెప్పటం సమంజసమే. స్వాతంత్ర్యానంతరం దేశంలో విద్యార్థులలో ప్రయోజనాల పరిరక్షణకు కొన్ని విద్యార్థి సంఘాలు ఏర్పాటు చేయబడ్డాయి. కొన్ని జాతీయ పార్టీలు తమ అనుబంధంగా విద్యార్థి సంఘాలను ఏర్పాటు చేసుకున్నాయి. ఉదాహరణకు భారత కమ్యూనిస్ట్ పార్టీ అనుబంధంగా అఖిలభారత విద్యార్థి సమాఖ్య (All India Students' Fedaration), మార్క్సిస్టు పార్టీకి అనుబంధంగా భారతీయ విద్యార్థి సమాఖ్య (Student Fedaration of India), ఇదే విధంగా కాంగ్రెస్ పార్టీకి అనుబంధ సంస్థగా భారత జాతీయ విద్యార్థి సంఘ్ (National Student Union of India), భారతీయ జనతాపార్టీకి అనుబంధంగా అఖిల భారత విద్యార్థి పరిషత్ (ABVP) మొదలైనవి జాతీయ పార్టీలకు అనుబంధంగా ఏర్పడిన విద్యార్థి సంఘాలు.

1967 తరువాత కాలంలో దేశంలో విద్యార్థి సంఘాలు చురుకుగా పనిచేస్తూ, దేశ రాజకీయాలను గణనీయంగా ప్రభావితం

చేస్తున్నాయి. 1970 దశాబ్దం నుంచి వివిధ విద్యార్థి సంఘాలు తమ కోర్కెల సాధనకు పెద్ద ఎత్తున ఉద్యమించటం గుర్తించవచ్చును. ఈ దశాబ్దంలోనే గుజరాత్, బీహార్‌లలోని విద్యార్థులు జయప్రకాష్ నారాయణ్ నాయకత్వంలో నవ నిర్మాణ సమితిగా ఏర్పడి, రాజకీయాలలో అవినీతికి వ్యతిరేకంగా ఉద్యమించారు. 1980 దశాబ్దంలో మండల్ కమీషన్ సిఫార్సుల అమలును ప్రతిఘటిస్తూ, దేశంలోని అనేక ప్రాంతాలలో విద్యార్థులు, వారి సంఘాలు తీవ్రమైన స్థాయిలో ఉద్యమించారు. అస్సాంలో ఆల్‌అస్సాం విద్యార్థి సంఘం నిర్వహిస్తున్న ఉద్యమం కూడా తీవ్రమైనదే. అయితే విద్యార్థి ఉద్యమాలు కేవలం విద్యార్థుల ప్రయోజనాలకే నిర్వహింపబడ్డాయని చెప్పటం సరికాదు. కొన్ని విద్యార్థి ఉద్యమాలు రాజకీయప్రయోజనాలను ఆశించి తలెత్తాయి. మొత్తం మీద విద్యార్థి సంఘాల కార్యకలాపాలు అని నిర్వహించే ఉద్యమాలలో రాజకీయాలు చోటుచేసుకోవటం భారతదేశంలో విద్యార్థి ఉద్యమాలలో ఇటీవల చోటుచేసుకున్న పరిణామం అని రాజనీతి శాస్త్రవేత్తల అభిప్రాయం. ఈ విధంగా విద్యార్థి సంఘాల రాజకీయకీరణ వల్ల విద్యా సంస్థల వాతావరణం కొంతమేరకు కలుషితం కావటం జరుగుతుందని వీరు వాదిస్తున్నారు.

## 12.8 ఒత్తిడి గణాల ప్రభావం :

ప్రస్తుత కాలంలో ఇతర అభివృద్ధిచెందిన దేశాల మాదిరే భారతదేశంలో కూడా రాజకీయాలు, విధానప్రక్రియపై ఒత్తిడి గణాల ప్రభావం విస్తృతంగా ఉంది. ప్రభుత్వ విధానాల రూపకల్పనలో ఈ గణాలు చురుకైన పాత్రను పోషిస్తున్నాయి. వివిధ రాజకీయ ప్రక్రియలలో ఒత్తిడి గణాలు నిర్వహిస్తున్న చురుకైన పాత్ర భారత రాజకీయాలు బహుళతావాదస్వభావాన్ని ప్రతిబింబిస్తున్నాయి. ప్రస్తుతం వివిధ రాజకీయ ప్రక్రియలలో వివిధ రకాల ఒత్తిడి గణాలలు కీలకపాత్రను నిర్వహిస్తుండటంతో దేశ రాజకీయాలు సంఘ శ్రేష్ఠుల (Elitist) స్వభావాన్ని కలిగివున్నాయని చెప్పటానికి అవకాశం లేదు. అంతేకాక ఒత్తిడిగణాలు ప్రజాస్వామ్య సిద్ధాంతానికి ఒక నూతన అర్థాన్ని కల్పిస్తున్నాయి. పెరుగుతున్న ఈ ఒత్తిడి గణాల పాత్ర వల్ల విధాన ప్రక్రియ వంటి కొన్ని కీలక రాజకీయ ప్రక్రియలపై వ్యక్తుల ప్రభావం క్షీణిస్తున్నది. ఈ ఒత్తిడి గణాల ప్రాధాన్యత పెరుగుతున్న నేపథ్యంలో తగిన నిధులు లేదా వ్యవస్థీకృతమయ్యే సామర్థ్యంలేని వ్యక్తులు రాజకీయాలలో శక్తివంతమైన పాత్రను పోషించలేని పరిస్థితి ఏర్పడిందని రాజనీతి శాస్త్రవేత్తల అభిప్రాయం.

## 12.9 సారాంశం :

ఈ పాఠంలో వివరించినట్లే భారతదేశంలో రాజకీయ ప్రక్రియను, ప్రభుత్వ విధానాలను అనేకరకాల ఒత్తిడి గణాలు గణనీయంగా ప్రభావితం చేస్తున్నాయి. ఈ ఒత్తిడి గణాలలో కార్మిక సంఘాలు, వ్యాపార సంఘాలు మిగిలిన ఒత్తిడి గణాల కంటే చురుకుగా పనిచేస్తూ, ప్రభుత్వ విధానాలను శక్తివంతంగా ప్రభావితం చేయగలుగుతున్నాయి. భారతదేశంలో ఒత్తిడి గణాల విశిష్ట అంశం కులాల లాబీలు. ఈ లాబీలు తమ సంబంధిత కులాల ప్రయోజనాలను ప్రభావితం చేయటంతోపాటు, శాసనసభల్లో తమ వర్గం వ్యక్తుల మద్దతు కొరకు ప్రయత్నిస్తున్నాయి. భారతదేశంలోని ఒత్తిడి గణాల కార్యకలాపాలను, పనితీరును పరిశీలిస్తే, అవి అభివృద్ధి చెందిన పాశ్చాత్య దేశాలలోని ఒత్తిడి గణాలకు భిన్నంగా ఉన్నట్లు గుర్తించవచ్చు. పరిశోధకుల అభిప్రాయం ప్రకారం భారతదేశంలో ఒత్తిడి గణాల ప్రభావం క్రమంగా పెరుగుతున్నది. పార్లమెంట్, శాసనసభలు, రాజకీయ పార్టీలు మొదలైన రాజకీయ సంస్థలు క్రమంగా బలహీనపడటం వలన ఒత్తిడిగణాలు శక్తివంతంగా రూపొందాయని వీరి అభిప్రాయం. ప్రభుత్వాలకు స్పష్టమైన మెజారిటీ లేకపోవటం, సంకీర్ణ ప్రభుత్వాల ఏర్పాటు మొదలైన కారణాల వల్ల కూడా ఒత్తిడి గణాలు శక్తివంతంగా రూపొందాయని వీరి అభిప్రాయం. ఏమైనప్పటికీ భవిష్యత్తులో దేశరాజకీయాలలో ఒత్తిడి గణాలు మరింత కీలకమైన పాత్రను నిర్వహిస్తాయి అనేది వాస్తవం. అయితే వీటి ప్రభావం దేశ రాజకీయ వ్యవస్థపై ఏవిధంగా ఉంటుందనేది స్పష్టంగా వివరించటం

ప్రస్తుతం సాధ్యం కాని విషయం.

## 12.10 మాదిరి ప్రశ్నలు :

1. ఒత్తిడి గణాలు అంటే ఏమిటి ? ఒత్తిడి గణాల లక్షణాలను, ప్రాధాన్యతను వివరించండి.
2. భారతదేశంలో ఒత్తిడి గణాలు రాజకీయ ప్రక్రియపై కనపరుస్తున్న ప్రభావాన్ని వివరించండి.
3. భారతదేశంలో ఒత్తిడి గణాల కార్యకలాపాలను, అవి అనుసరిస్తున్న పద్దతులను పరిశీలించండి.
4. భారతదేశంలో రాజకీయ ప్రక్రియను కార్మిక సంఘాలు, వ్యాపారస్తుల సంఘాలు ఏవిధంగా ప్రభావితం చేస్తున్నాయో వివరించండి.
5. భారతదేశంలో విధాన ప్రక్రియపై వివిధ ఒత్తిడి గణాల ప్రభావాన్ని పరిశీలనాత్మకంగా వివరించండి.

## 12.11 చదువదగిన గ్రంథాలు :


1. Paul R. Brass, The Politics of India, since Independence, Cambridge : Cambridge University Press, 1990 (2nd Edition).
2. Bipin Chandra and others, India After Independence - 1947 - 2000, New Delhi, Penguin Books, 2000.
3. Atul Kohli (ed.), The Success of India's Democracy, Cambridge : Cambridge University Press, 2001.
4. Rajani Kothari, Politics in India, Bostan : Little Brown and Company, 1970.
5. Rajani Kothari, Caste in Indian Polices, New Delhi : Orient Logman, 1970.
6. Sudipta Kavi Raj (ed.) New Delhi : Oxford University Press, 1997.
7. A.P. Avasthi, Indian Political System, Agra : Lakshminarain Agarwal, 2002.


**రచయిత : ప్రొఫెసర్. ఎమ్. బాపూజీ**

పాఠం - 13

# ప్రణాళికీకరణ ప్రక్రియ

విషయసూచిక

13.0 లక్ష్యం
13.1 ఉపోద్ఘాతం
13.2 ప్రణాళికీకరణ - భావన
13.3 భారతదేశంలో ప్రణాళికీకరణ
13.4 భారతదేశంలో ప్రణాళికీకరణ లక్షణాలు
13.5 ప్రణాళికీరణ యంత్రాంగం - ప్రణాళికా సంఘం
13.6 ప్రణాళికాసంఘ వ్యవస్థీకరణ
13.7 ప్రణాళికా సంఘం - విభాగాలు
13.8 జాతీయాభివృద్ధి మండలి
13.9 రాష్ట్రస్థాయిలో ప్రణాళికీకరణ
13.10 జిల్లాస్థాయి ప్రణాళికీకరణ
13.11 ప్రణాళికీకరణ - రాజకీయాలు
13.12 సారాంశం
13.13 మాదిరి ప్రశ్నలు
13.14 చదువదగిన గ్రంధాలు

## 13.0 లక్ష్యం :

భారతదేశంలో ప్రణాళికీకరణ ప్రక్రియను సమగ్రంగా పరిశీలించటం ఈ పాఠం ప్రధాన లక్ష్యం. ఈ పాఠం చదివిన తరువాత ప్రణాళికీకరణకు సంబంధించి ఈ క్రింది అంశాలపై మీకు సమగ్ర అవగాహన ఏర్పడుతుంది.

1. ప్రణాళికీకరణ అర్థం, ప్రాధాన్యత
2. భారతదేశంలో ప్రణాళికీకరణ ప్రక్రియ తీరుతెన్నులు
3. భారతదేశంలో ప్రణాళికీకరణ యంత్రాంగం
4. భారతదేశంలో ఇప్పటివరకు అమలుపరచిన పంచవర్ష ప్రణాళికలు సాధించిన విజాయాలు, పొందిన వైఫల్యాలు
5. భారతదేశంలో ప్రణాళికీకరణ రాజకీయ అంశాలు

## 13.1 ఉపోద్ఘాతం :

భారతదేశంలో ప్రణాళికీకరణ భావన వలస పాలన కాలంలోనే ఉద్భవించింది. స్వాతంత్రోద్యమ కాలంలో ప్రజాస్వామ్య ప్రణాళికీకరణ ఆధారంగా జాతీయ అభివృద్ధి అనే భావన బహుళ ప్రచారంలోకి వచ్చింది. దేశంలోని వర్గ, సాంస్కృతిక,

సామాజిక ప్రాంతీయ విభేధాలకు అతీతంగా దేశం ఎదుర్కొంటున్న సమస్యల శాస్త్రీయ పరిష్కారానికి ప్రణాళికీకరణను అభివృద్ధిపరచే ప్రయత్నాలు జరిగాయి. ఈ కృషిలో భాగంగానే నెహ్రూ నాయకత్వంలో జాతీయ ప్రణాళికా సంఘం ఏర్పడింది. స్వాతంత్ర్యానంతరం దేశ సామాజిక, ఆర్థిక ప్రగతికి అనుసరించదలచిన ప్రణాళికీకరణ నమూనా రూపకల్పనలో నెహ్రూ కీలకపాత్ర వహించాడు. నెహ్రూ తన ప్రజాస్వామ్య సోషలిస్ట్ భావాలను ప్రతిబింబించే ప్రణాళికీకరణ నమూనాను సృష్టించాడు.

ఈ నమూనా ప్రభుత్వ రంగం అధిక్యత వహించే ప్రణాళికా విధానాన్ని ప్రవేశపెట్టింది. దీనికి అనుగుణంగానే భారతదేశంలో కేంద్రీకృత ప్రణాళికీకరణ విధానం రూపుదిద్దుకుంది. గత 5 శతాబ్దాల కాలంలో అమలు జరుగుతున్న పంచవర్ష ప్రణాళికల ఫలితంగా దేశం అనేక రంగాలలో ముందంజ వేయగలిగింది. ఇదే సందర్భంలో భారతదేశంలోని ప్రణాళికీకరణ ప్రక్రియ మారుతున్న సామాజిక, ఆర్థిక పరిస్థితులకు అనుగుణంగా అనేక మార్పులకు గురవుతున్నది.

## 13.2 ప్రణాళికీకరణ - భావన :

ప్రణాళికీకరణ అంటే ఆశించిన లక్ష్యాల సాధనకు చేపట్టే చైతన్యపూరితమైన ప్రయత్నం. నిర్దిష్ట లక్ష్యాల సాధనకు హేతుబద్ధమైన పద్ధతి ద్వారా వనరులను వినియోగించటం ప్రణాళికీరణలోని కీలక అంశం. లక్ష్యాలను సాధించే క్రమబద్ధమైన దృక్పథంగా ప్రణాళికీకరణను సంక్లిష్టమైన వ్యవస్థలు, సాధారణ వ్యవస్థలు, ప్రభుత్వరంగం; ప్రైవేటు రంగం, స్థూలస్థాయిలో, సూక్ష్మస్థాయిలో, జాతీయ సంస్థలు, ప్రాంతీయ సంస్థలు, వ్యూహాత్మకమై, కీలకమైన లక్ష్యాల సాధనకు చేపట్తాయి. ప్రణాళికలు సమగ్రమైనవి లేదా పాక్షికమైనవి కావచ్చును. సమగ్రమైన ప్రణాళీకరణ ప్రక్రియలో లక్ష్యాల నిర్ధారణ, ప్రత్యామ్నాయ వ్యూహాల అన్వేషణ, సక్రమమైన వ్యూహాల ఎంపిక, పథకాల రూపకల్పన, అమలు, ఫలితాల సమీక్ష, మదింపు మొదలైన దశలు ఇమిడివున్నాయి. దీనికి భిన్నంగా పాక్షిక ప్రణాళిక పరిధి, ప్రమాణం పరిమితమైనవి.

ప్రణాళికీకరణ జాతీయ లక్ష్యాల నిర్ధారణకు, వాటి సాధనకు పథకాలు, ప్రణాళికలు, విధానాలను రూపొందించటానికి తోడ్పడే హేతుబద్ధమైన ఆలోచన స్రవంతి. ఆశించిన విధంగా దేశ సామాజిక, ఆర్థిక ప్రగతిని సాధించేందుకు పెట్టుబడుల నిర్ధారణకు, అంతర్ రంగ ప్రాధాన్యతలపై నిర్ణయాలను చేయడం ప్రణాళికీకరణలో కీలక అంశం. ఈ నిర్ణయీకరణకు సమాజ విలువలు, సమాజం ఎదుర్కొంటున్న సమస్యలు, అవసరాలు ప్రాతిపదిక. ప్రణాళికీకరణ ద్వారా జాతీయ లక్ష్యాలను నిర్ధారించిన కాల వ్యవధిలో, వనరుల గరిష్ట వినియోగం ద్వారా సాధించవచ్చును. మెషర్ పేర్కొన్నట్లు లక్ష్యాలను గుర్తించటం, ఈ లక్ష్యాలను సాధించేందుకు ప్రత్యామ్నాయ భవిష్యత్ మార్గాలను చేపట్టడం ప్రణాళికీకరణ ప్రక్రియలో ప్రథమదశ. అధిక సంఖ్యలో ఉన్న ప్రత్యామ్నాయాలను పరిమిత సంఖ్యలోకి కుదించి వాటిలో ఒక మార్గాన్ని ఎంపిక చేయటం ప్రణాళికీకరణలోని చివరిదశ.

భారతదేశం వంటి అభివృద్ధి చెందుతున్న దేశాలలో ప్రణాళికీకరణకు ప్రత్యేక స్థానం ఉన్నది. ఈ దేశాలలో ప్రణాళికీకరణ అందుబాటులో ఉన్న మానవ, ఆర్థిక వనరులను సమర్థవంతంగా వినియోగించి దేశ ఆర్థిక అభివృద్ధిని సాధించడం అనే ప్రభుత్వ కీలక బాధ్యతను సాధించే ప్రధాన సాధనం. సమర్థవంతంగా నిర్ధారించిన ప్రాధాన్యతలపై ఆధారపడిన దీర్ఘకాలిక ప్రణాళికలు అభివృద్ధి చెందుతున్న దేశాలకు అత్యంత విలువైనవి. ఆర్థిక వ్యవస్థలోని వివిధ రంగాల అవసరాలకు అనుగుణంగా దీర్ఘకాలిక లక్ష్యాలను, అందరూ ఆమోదించే ప్రాధ్యమాలను నిర్ధారించేందుకు, పెట్టుబడి రూపకల్పనకు ఐదు సంవత్సరాల కాలవ్యవధి కల పథకాల రూపంలో ప్రణాళికలను రూపొందించడం దాదాపు అన్ని అభివృద్ధి చెందుతున్న దేశాలు అనుసరిస్తున్న ప్రధాన మార్గం అని ఐక్యరాజ్య సమితి నివేదిక (1963) పేర్కొంది. ప్రణాళికీకరణ ప్రాముఖ్యతను ఐక్యరాజ్యసమితి నివేదిక (1966) ఈ విధంగా వివరించింది :

సామాజిక, ఆర్థిక ప్రగతిని సాధించడం నేడు అభివృద్ధి చెందుతున్న దేశాల ఎదుటనున్న కీలక కర్తవ్యం. క్రమబద్ధమైన అభివృద్ధి ప్రక్రియను ప్రవేశపెట్టేందుకు ప్రాధ్యమాలను నిర్ధారించటం, ఆచరణాత్మక ప్రత్యామ్నాయ విధానాలలో సరైన విధానాలను హేతుబద్ధంగా ఎంపిక చేయటం, స్వల్పకాలిక, దీర్ఘకాలిక లక్ష్యాలను సాధించేందుకు ఈ ప్రత్యామ్నాయాలను సమర్ధవంతంగా, సమన్వయంతో అమలుపరచడం అవసరం. ఈ చర్యలను చేపట్టేందుకు ప్రణాళికీకరణ భావన తార్కికంగా సమైక్యపరచబడిన కార్య చట్రాన్ని సమకూరుస్తుంది. దీంతోపాటు ప్రణాళిక విధానాల లక్ష్యాలు నిర్దిష్టమైన, ఆచరణాత్మక కార్యకలాపాలుగా, పథకాలుగా రూపుదిద్దుకొనేందుకు అవసరమైన మార్గాలను ఏర్పరుస్తుంది.

## 13.3 భారతదేశంలో ప్రణాళికీకరణ :

భారతదేశంలో ప్రణాళికీకరణ ప్రక్రియకు సుదీర్ఘమైన చరిత్రే ఉంది. దేశాభివృద్ధికి ప్రణాళికీకరణ ఆవశ్యకతను దేశ స్వాతంత్ర్యానికి పూర్వమే గుర్తించారు. బ్రిటిషు వలస పాలనా కాలంలోనే ఆర్థికాభివృద్ధి నమూనాగా ప్రణాళికీకరణ ప్రాముఖ్యతను సంతరించుకున్నది. కొందరు వ్యక్తులు, సంస్థలు నమూనా (Model) ప్రణాళికలను రూపొందించటం కూడా జరిగింది. రెండవ ప్రపంచ యుద్ధానికి ముందు జాతీయ కాంగ్రెస్ తన స్వంత ప్రణాళికను రూపొందించింది. ఇదే విధంగా బొంబాయి ప్రణాళిక, గాంధీ ప్రణాళిక, ప్రజల ప్రణాళిక అనే పేర్లతో ప్రణాళికలు రచించబడ్డాయి దీనితోపాటు బ్రిటిషు ప్రభుత్వం కూడా వివిధ రంగాలకు సంబంధించిన అనేక ప్రణాళికలను రూపొందించింది. నెహ్రూ దేశాభివృద్ధికి ప్రణాళికీకరణ ఆవశ్యకతను అతి తరచుగా నొక్కి చెప్పేవారు. ఇతర జాతీయ నాయకుల కంటే నెహ్రూ ప్రణాళికీకరణ విధానం పట్ల అత్యధిక ఆసక్తిని కనపర్చారు. నెహ్రూ ప్రతిపాదించిన ప్రణాళికీకరణ విధానం స్వాతంత్ర్యానంతర కాలంలో దేశాభివృద్ధి ప్రక్రియకు మార్గదర్శకత్వం వహించింది.

దేశ స్వాతంత్ర్యానంతరం సంభవించిన దేశ విభజన సృష్టించిన పరిణామాలు, భారత రాజ్యాంగం ఆదేశిక సూత్రాల ద్వారా దేశానికి అప్పగించిన సామాజిక, ఆర్థిక లక్ష్యాలు, నూతనంగా ఏర్పడిన జాతీయ ప్రభుత్వం ఎదుట నిల్చిన సవాళ్ళు, సమస్యలు మొదలైన కారణాలు ఆర్థిక ప్రణాళికీకరణ విధానాన్ని అనుసరించక తప్పని పరిస్థితిని సృష్టించాయి. దీనికి అనుగుణంగానే భారత ప్రభుత్వం ప్రణాళికాబద్ధమైన ఆర్థిక ప్రగతి నమూనాను మార్గదర్శక సూత్రంగా పంచుకొంది. 1950లో భారత ప్రభుత్వం ఒక తీర్మానం ద్వారా ప్రణాళిక సంఘాన్ని (Planning Commission) ఏర్పరచటంతో దేశంలో ప్రణాళికా యుగం ప్రారంభమైంది.

దేశంలో లభిస్తున్న మానవ, భౌతిక వనరులను మదింపుచేసి, వాటి సక్రమ వినియోగానికి పంచవర్ష ప్రణాళికలను రూపొందించి అమలుపరచటం అనే లక్ష్యంతో ప్రణాళికా సంఘం ఏర్పాటైంది. 1951లో ప్రణాళికా సంఘం మొట్టమొదటి పంచవర్ష ప్రణాళికను ప్రవేశపెట్టింది. దీంతో దేశంలో ప్రణాళికాబద్ధమైన ఆర్థిక అభివృద్ధి ప్రక్రియకు అంకురార్పణ జరిగింది. మొదట పంచవర్ష ప్రణాళిక వ్యవధి 1951 - 56 మధ్యకాలం. ప్రజల జీవన పరిస్థితులను మెరుగుపరచటంతోపాటు, వారి ఆర్థిక, సామాజిక అభివృద్ధికి తగిన అవకాశాలను కల్పించడం మొదటి పంచవర్ష ప్రణాళిక ప్రధాన లక్ష్యం. ఈ లక్ష్యాన్ని వృద్ధి, ఆధునికీకరణ, స్వయం పోషకత్వం, సామాజిక న్యాయాలను సాధించటం ద్వారా చేరుకోవాలని నిర్ధారించారు. ఈ లక్ష్యాలే భవిష్యత్తులో ప్రణాళికీకరణకు మార్గదర్శక సూత్రాలను ఏర్పరచాయి. ఈ కార్యచట్రం పరిధిలోనే దేశంలో ఇప్పటివరకు తొమ్మిది పంచవర్ష ప్రణాళికలు రూపొందించబడి, అమలు పరచబడ్డాయి.

దాదాపు సమానమైన లక్ష్యాలతో రెండవ పంచవర్ష ప్రణాళిక (1956 - 61), మూడవ పంచవర్ష ప్రణాళిక (1961 - 66)లను ప్రవేశపెట్టారు. మూడవ పంచవర్ష ప్రణాళిక తరువాత పంచవర్ష ప్రణాళికను వివిధ కారణాల వల్ల మూడు

సంవత్సరాలపాటు వాయిదా వేశారు. ఫలితంగా నాలుగవ పంచవర్ష ప్రణాళిక 1969లో ప్రారంభమై1974లో అంతమైంది. దీని తరువాత ఐదవ పంచవర్ష ప్రణాళిక 1974లో ప్రారంభమై 1978 నాటికే పూర్తి అయింది. 1977లో కేంద్రంలో అధికార పార్టీ మార్పువల్ల ఐదవ పంచవర్ష ప్రణాళిక తన నిర్ధారిత కాలవ్యవధికి ముందే పూర్తి అయింది. 1977లో అధికారంలోకి వచ్చిన జనతాపార్టీ ప్రభుత్వం 1978లో ఆరవ పంచవర్ష ప్రణాళికను ప్రవేశపెట్టింది. అయితే 1980లో కేంద్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం 1980లో మరోసారి నూతనంగా ఆరవ పంచవర్ష ప్రణాళికలను ప్రవేశపెట్టింది. ఆరవ పంచవర్ష ప్రణాళిక 1985లో అంతం కాగా అదే సంవత్సరములో ఏడవ పంచవర్ష ప్రణాళిక మొదలై 1990లో పూర్తి అయింది. 1990లో ప్రారంభం కావలసిన ఎనిమిదవ పంచవర్ష ప్రణాళిక రచన పూర్తికాకపోవడంతో ఈ పంచవర్ష ప్రణాళిక రెండు సంవత్సరాలు ఆలస్యంగా అంటే 1992లో ప్రవేశపెట్టబడింది. ఈ రెండు సంవత్సరాలలో రెండు వార్షిక ప్రణాళికలు అమలుపర్చబడ్డాయి. ఎనిమిదవ పంచవర్ష ప్రణాళిక 1997లో అంతం కావటంతో అదే సంవత్సరంలో తొమ్మిదవ పంచవర్ష ప్రణాళిక మొదలై 2002 మార్చి నాటికి పూర్తి అయినది. 2002 ఏప్రిల్ నెలలో పదవ పంచవర్ష ప్రణాళికను ప్రవేశపెట్టారు. ఈ విధంగా స్వాతంత్ర్యానంతర కాలంలో ఇప్పటికి తొమ్మిది పంచవర్ష ప్రణాళికలు అమలుపరచబడ్డాయి. 10వ పంచవర్ష ప్రణాళిక అమలులో ఉన్నది.

స్వాతంత్ర్యానంతరం భారతదేశం చేపట్టిన ప్రణాళికాబద్ధమైన అభివృద్ధి వ్యూహానికి పి.సి.మహలనోబిస్ (P.C. Mahalanobis) ప్రధాన రూపకల్పన కర్త. మహలనోబిస్ ప్రతిపాదించిన నమూనాలో పెట్టుబడి సాంద్రత, (Capital Intensive) ప్రభుత్వ రంగంలో వేగంగా అభివృద్ధి చెందే భారీ పారిశ్రామికీకరణ, మిశ్రమ ఆర్థిక వ్యవస్థలో పూరక పాత్రను నిర్వహించే ప్రైవేటు రంగం కీలకమైన అంశాలు. ఈ వ్యూహం దిగుమతులు, విదేశీమారకం, విదేశీ పెట్టుబడులపై ఆధారపడింది. దీర్ఘకాలంలో ఈ వ్యూహం భారీయంత్రాల ఉత్పత్తి రంగాన్ని అభివృద్ధిపరచటం ద్వారా దేశం స్వయం పోషకత్వాన్ని సాధించేందుకు తోడ్పడుతుందని భావింపబడింది. మహలనోబిస్ ప్రతిపాదించిన నమూనాను నెహ్రూ పూర్తిగా సమర్థించారు. పాల్‌బ్రాస్ అభిప్రాయం ప్రకారం మహలనోబిస్, నెహ్రూల నమూనా భారతదేశ రాజకీయ, ఆర్థిక వ్యవస్థలు, దేశవనరులు, సామాజిక నిర్మాణం, ప్రజల తక్షణ అవసరాల హేతుబద్ధమైన విశ్లేషణ, మదింపులపై ఆధారపడి రూపొందలేదు. దీనికి భిన్నంగా 20 వ శతాబ్దంలో ఆర్థిక, పారిశ్రామిక సమాజంగా శక్తివంతమైన మిలటరీ శక్తిగా భారతదేశాన్ని తీర్చిదిద్దటానికి గతంలో పారిశ్రామికంగా, సైనికపరంగా బాగా అభివృద్ధి చెందిన దేశాలు గతంలో ఉపయోగించిన పద్ధతులను అనుసరించే అవకాశాన్ని ఏర్పరచగలిగిన నమూనా. మహలనోబిస్, నెహ్రూల నమూనా. సోవియట్ రష్యా అనుభవంపై ఆధారపడినప్పటికీ, సామాజిక ప్రజాస్వామ్య విలువలకు కట్టుబడి ఉన్నప్పటికీ తన విజయానికి పెట్టుబడిదారి దేశాల ఆర్థిక సహాయంపై అధికంగా ఆధారపడింది. ఈ నమూనా అమలుకు ప్రణాళికా కర్తలు ఏర్పరచుకొన్న ఇతర లక్ష్యాలను పూర్తిగా విస్మరించ లేదు. కాని తాత్కాలికంగా వాయిదా వేసుకోవాలసి వచ్చింది.

మహలనోబిస్, నెహ్రూల ప్రణాళికీకరణ నమూనా 1955-56, - 1965-66 మధ్యకాలంలో అద్భుతమైన విజయాలను సాధించగలిగింది. ఈ దశాబ్దంలో భారతదేశం పెట్టుబడిదారీ దేశాలు, సోషలిస్ట్ దేశాలనుంచి గణనీయంగా ఆర్థిక సహాయాన్ని పొందగలగటం దీనికి ప్రధాన కారణం. ఈ నమూనాను అనుసరించటం ఫలితంగా దేశంలో రసాయనాలు, యంత్ర పరికరాలు, సిమెంట్ పరిశ్రమలు బాగా అభివృద్ధి చెందాయి. అయితే నాలుగవ పంచవర్ష ప్రణాళికా కాలంలో ప్రభుత్వ రంగం, భారీపరిశ్రమల రంగాల్లో తీవ్రమైన సంక్షోభం తలెత్తింది. దీనికి భారతదేశానికి అందుతున్న విదేశీ సహాయం గణనీయంగా క్షీణించటం, అంతర్గత వనరుల సమీకరణ కుంటుపడటం, భారతదేశం ఆహార ధాన్యాల కొరకు అమెరికాపై అధికంగా ఆధారపడటం వంటి కారణాలు దోహదం చేశాయి. మూడవ, నాలుగవ పంచవర్ష ప్రణాళికల మధ్య కాలంలో ప్రభుత్వ రంగంలో భారీ పరిశ్రమల అభివృద్ధిపై ప్రాధాన్యతను కేంద్రీకరించటం ద్వారా సాధించిన సంగతత్వం (relevence) ప్రణాళికా విధానం కోల్పోయింది.

అంతేకాక ఈకాలంలో ప్రణాళికా విధానం పరస్పరం పోటీపడిన వ్యూహాలు, వనరుల కోసం ఏర్పడిన పోటీల ఫలితంగా ఏర్పడిన ఘర్షణ పూరితమైన ఒత్తిళ్లకు గురైంది. 1960 దశాబ్దంలో ఏర్పడిన ఈ సంక్షోభం వల్ల పారిశ్రామిక ఉత్పత్తుల రేటు క్షీణించటం, దాని ఫలితంగా దేశ ఆర్థిక వృద్ధిరేటు కూడా తగ్గుముఖం పట్టడం సంభవించింది. ఇదే రకమైన సంక్షోభం రాజీవ్‌గాంధీ ప్రభుత్వ కాలంలో అంటే ఏడవ పంచవర్ష ప్రణాళిక రూపకల్పన సమయంలో మరోసారి తలెత్తింది. దీని ఫలితంగా నాలుగవ పంచవర్ష ప్రణాళికకు ముందున్న ప్రభుత్వ రంగ పెట్టుబడుల వ్యూహాన్ని తిరిగి చేపట్టాలనే డిమాండ్ బలపడింది. అయితే రాజీవ్ ప్రభుత్వం ఈ డిమాండ్‌ను సమర్థవంతంగా తిరస్కరించగల్గింది. అంతేగాక రాజీవ్ ప్రభుత్వం ప్రణాళికల్లో ప్రైవేట్ రంగంపట్ల అనుకూలధోరణిని అవలంబించింది. దీనికి అనుగుణంగా ప్రభుత్వం లైసెన్సింగ్, దిగుమతుల నియంత్రణ, విదేశీ వాణిజ్యం మొదలైన రంగాలలో సరళీకృత విధానాలను ప్రవేశపెట్టింది.

మొదటి నుంచి భారతదేశంలో ప్రణాళికీకరణ విధానం ఆర్థిక అంశాలపరంగానేకాక, సామాజిక, పర్యావరణ అంశాలపరంగా కూడా సుస్థిరమైన, నిరంతర అభివృద్ధిని సాధించడంపై ప్రాధాన్యతను కనపరిచింది. కాని ఇటీవల కాలంలో అభివృద్ధి చెందుతున్న జనాభా, పట్టణీకరణ, మారుతున్న వ్యవసాయ, పారిశ్రామిక రంగాల పరిస్థితి, వాతావరణంలో పెరుగుతున్న కాలుష్యం, ఫలితంగా క్షీణిస్తున్న పర్యావరణ గుణాత్మకత మొదలైన పరిస్థితులను విస్తృత అభివృద్ధి ప్రక్రియతో సమైక్యపరచవలసిన అవసరం ఏర్పడింది. దీని ఫలితంగా ప్రణాళికా వ్యూహాలలో మౌలిక మార్పులు చోటుచేసుకున్నాయి. 9వ పంచవర్ష ప్రణాళిక నివేదికలో పేర్కొన్న విధంగా గతంలో అమలుపరచిన ప్రణాళికల ద్వారా రూపొందిన భారతదేశ అభివృద్ధి వ్యూహం ఇటీవల కాలంలో దేశ అంతర్గత ఆర్థిక వ్యవస్థలో చోటుచేసుకున్న నిర్మాణపరమైన పరిణామాలు, అంతర్జాతీయస్థాయిలో ఆర్థిక పరిస్థితిలో సంభవించిన మార్పులు ఫలితంగా అనేక మార్పులకు లోనయింది. ప్రణాళికీకరణ మొదటిదశలో ప్రభుత్వం అభివృద్ధి ప్రక్రియలో ప్రధాన పాత్రధారిగా, ప్రైవేటు పెట్టుబడులను నియంత్రించే వ్యవస్థగా ప్రభుత్వ రంగానికి కీలక ప్రాధాన్యతను కల్పించిన సాధనంగా వ్యవహరించింది. అయితే 1970, 80 దశాబ్దాల్లో ఈ వ్యూహం బలహీనతలు వెల్లడి అయ్యాయి. ఈ వ్యూహం ఆర్థిక వ్యవస్థ సామర్థ్యాన్ని క్షీణింపచేయటంతోపాటు, ఆశించిన వృద్ధిని సాధించటంలో విఫలమైందని స్పష్టమైంది. పారిశ్రామిక రంగంలో క్రియాశీలక పాత్రను నిర్వహిస్తున్న ప్రభుత్వం అనేక ఇతర రంగాలలో ప్రధానంగా సామాజిక అభివృద్ధి రంగంలో మందకొడిగా వ్యవహరిస్తున్నట్లు విదితమైంది. దీని ఫలితంగా దేశంలోని సామాజిక పరిస్థితులలో గణనీయమైన అభివృద్ధి సంభవించలేదు. ఈ పరిస్థితిని సంస్కరించేందుకు ప్రభుత్వం 1980 దశాబ్దంలో అనేక చర్యలను చేపట్టింది. ఈ చర్యలు ఆశించిన ఫలితాలను సమకూర్చాయి. ఈ చర్యల ఫలితంగా 7వ పంచవర్ష ప్రణాళికా కాలం (1985 - 90)లో 5.8 శాతంగా ఉన్న వృద్ధిరేటు 8వ, 9వ ప్రణాళికల కాలాల్లో 6.5 శాతానికి పెరిగింది.

## 13.4 భారతదేశంలో ప్రణాళికీకరణ లక్షణాలు :

భారతదేశంలో ప్రణాళికీకరణ లక్షణాలను ఈ క్రింది విధంగా వివరించవచ్చును.

1) భారతదేశంలో ప్రణాళికీకరణ పరిధి సమగ్రమైంది, విస్తృతమైంది. ప్రణాళికీకరణ దేశం మొత్తం ఆర్థిక వ్యవస్థకు విస్తరించింది.

2) ఈ దేశంలో ప్రణాళికీకరణ ప్రజాస్వామ్య దృక్పథాన్ని కలిగిఉంది. ప్రణాళికీకరణ ప్రక్రియలో ప్రజలకు, ప్రజాప్రతినిధులకు, విస్తృతంగా పాల్గొను అవకాశం కల్పించబడింది.

3) భారతదేశంలో ప్రణాళికీకరణకు ప్రజాస్వామ్య దృక్పథం ఉన్నప్పటికీ ఈ ప్రక్రియలో ప్రభుత్వ ఉద్యోగాలకు కీలకమైన విస్తృతమైన పాత్ర కల్పించబడింది. ప్రణాళికల రూపకల్పన, అమలు, మూల్యాంకనలో ప్రభుత్వ ఉద్యోగులకు ప్రధాన పాత్ర వహిస్తున్నారు.

4) భారతదేశంలో ప్రణాళికీకరణ ప్రభుత్వ రంగంపైన ప్రధానంగా తన దృష్టి కేంద్రీకరిస్తుంది.

5) ఈ దేశంలో ప్రణాళికీకరణ దీర్ఘకాలికమైనది (5 సంవత్సరాలు), స్వల్పకాలికమైనది (1 సంవత్సరం).

6) భారతదేశంలో ప్రణాళికీకరణ దేశ వార్షిక బడ్జెట్‌తో సమీకృతం చేయబడింది. బడ్జెట్‌లో ప్రణాళికాంశం, ప్రణాళికేతర అంశం, (Non Plan) అను రెండు విభాగాలు ఉన్నవి. ఎస్.ఆర్. మహేశ్వరి భారతదేశంలో ప్రణాళికీకరణ, ప్రధాన లక్ష్యాలను ఈ విధంగా వర్ణించారు. మితిమీరిన కేంద్రీకరణ భారతదేశ ప్రణాళికీకరణ ప్రధాన లక్షణం. ఈ లక్షణం భారతదేశం అనుసరిస్తున్న సమాఖ్యవిధాన స్ఫూర్తికి పూర్తిగా విరుద్ధం. ఉద్యోగిస్వామీకరణ (Bureaucratization) ఈ ప్రణాళికా విధానం మరో ప్రధాన లక్షణం. ప్రణాళికీకరణ ప్రక్రియలో ప్రజల భాగస్వామ్యానికి తగిన అవకాశం లేకపోవడం ఈ దేశంలోని ప్రణాళికీకరణ మరో ప్రధాన లక్షణం. ఈ లక్షణాలతోపాటు భారతదేశ ప్రణాళికీకరణ మరో లక్షణం ఏమిటంటే ఈ దేశంలో ప్రతి ప్రణాళికకు దాని ముందు పంచవర్ష ప్రణాళిక ప్రధాన ఆధారం. ప్రతి ప్రణాళిక రూపకల్పనలో అంతకుముందు ప్రణాళిక సాధించిన విజయాలను, వైఫల్యాలను పరిగణలోనికి తీసుకొనటం జరుగుతుంది.

1990 దశాబ్దంలో ప్రవేశపెట్టబడిన ఆర్థిక సరళీకరణ విధానం ఫలితంగా దేశంలోని ప్రణాళికీకరణ విధానంలో ప్రధాన మార్పులేవీ సంభవించలేదు. అయినప్పటికీ తన తాజా నివేదికలో ప్రణాళిక సంఘం పర్‌స్పెక్టివ్ (Perspective) ప్రణాళికీకరణ (Planning) స్థానంలో సూచనాత్మక ప్రణాళికీకరణ (Indicative Planning) అనే పదాన్ని వాడటం ప్రణాళికీకరణ విధానంలో భవిష్యత్తులో సంభవించబోయే మౌలిక మార్పును సూచిస్తున్నదని నిపుణులు అభిప్రాయం.

## 13.5 ప్రణాళికీరణ యంత్రాంగం - ప్రణాళికా సంఘం :

దేశంలో సత్వర ఆర్థిక వృద్ధిని సాధించేందుకు, ప్రజలందరికీ ఉపాధి అవకాశాలను కల్పించేందుకు, సంపద, ఆదాయాలలో సమానత్వాన్ని పెంపొందింపచేసేందుకు ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపర్చేందుకు అవసరమైన పునాదిని ఏర్పరిచే సమతుల్య ఆర్థికాభివృద్ధిని సాధించటం స్వాతంత్ర్యానంతర భారతదేశం ఏర్పరచుకొన్న ప్రణాళికాబద్ధమైన ఆర్థికాభివృద్ధి వ్యూహంలో కీలకఅంశం. ఈ లక్ష్యాన్నే భారతరాజ్యాంగం తన ఆదేశిక సూత్రాలలో ఉద్ఘాటించింది. భారత రాజ్యాంగం ప్రభుత్వం అనుసరించవలసిన ఆర్థిక విధానం మౌలిక సూత్రాలను ఈ క్రింది విధంగా పేర్కొంది.

1) సమాజం భౌతిక వనరుల యాజమాన్యాన్ని, నియంత్రణను ప్రజల ఉమ్మడి ప్రయోజనాన్ని సాధించే విధంగా పంపిణీ చేయాలి.

2) దేశ ఆర్థికవ్యవస్థను ప్రజల ఉమ్మడి ప్రయోజనాలకు వ్యతిరేకంగా దేశ సంపద, ఉత్పత్తి సాధనాలు కొందరు వ్యక్తుల్లో కేంద్రీకృతం కాని విధంగా నిర్వహించటం.

భారత రాజ్యాంగం సామాజిక, ఆర్థిక ప్రణాళీకీకరణకు సంబంధించిన అంశాన్ని ఉమ్మడి జాబితాలో చేర్చింది. అందుచేత జాతీయ ప్రణాళికీకరణకు చట్టబద్ధమైన ఆధారం పార్లమెంట్ చట్టం ద్వారా కల్పించబడింది. 1949లో దేశంలో ప్రణాళికా యంత్రాంగాన్ని ఏర్పాటు చేయటంపై జరిగిన చర్చ ప్రణాళికా సంఘాన్ని, సామాజిక, ఆర్థిక రంగాలలో వివిధ రాష్ట్రాల మధ్య సహకారాన్ని పెంపొందించుకొనేందుకు ఒక జాతీయ ఆర్థిక మండలిని స్థాపించాలని సూచించబడింది. 1946లో ప్రణాళికా సలహా సంఘం చేసిన సూచనకు అనుగుణంగా మార్చి 15, 1950న ఒక క్యాబినేట్ తీర్మానం ద్వారా ప్రణాళికా సంఘం ఏర్పాటైంది. 1952లో జాతీయ అభివృద్ధి మండలిని స్థాపించారు.

ప్రణాళికా సంఘం నిర్వర్తించవలసిన విధులను ఈ క్రింది విధంగా వివరించవచ్చును.

1) దేశంలో లభ్యమయ్యే మానవ, భౌతిక, పెట్టుబడి వనరులను మదింపుచేసి దేశ అవసరాలకు సరిపోయే విధంగా వాటిని అభివృద్ధిపరచే అవకాశాలను అన్వేషించడం.

2) దేశంలోని వనరులను అతి సమర్థవంతంగా, సమతుల్యతతో వినియోగించే విధంగా ప్రణాళికలను రూపొందించటం.

3) ప్రణాళికల ప్రాధమ్యాలను నిర్ధారించడం, వాటిని అమలుపరచవలసిన దశలను గుర్తించి, ఆ దశలను పూర్తి చేసేందుకు అవసరమైన నిధులను కేటాయించటం.

4) దేశ ఆర్థికాభివృద్ధిని నిరోధించే కారకాలను గుర్తించటం, దేశంలో నెలకొన్న సామాజిక, రాజకీయ పరిస్థితులను దృష్టిలో వుంచుకొని ప్రణాళికల విజయవంతమైన అమలుకు అవసరమైన పరిస్థితులను సృష్టించడం.

5) ప్రణాళికల ప్రతిదశ సమర్థవంతమైన అమలుకు అవసరమైన పాలనా యంత్రాంగం స్వభావాన్ని నిర్ధారించటం.

6) ప్రణాళికల ప్రతిదశ అమలువల్ల సాధించబడిన విజయాలను ఎప్పటికప్పుడు మదింపుచేసి, ఈ మదింపు ఆధారంగా ప్రణాళికల విధానంలో అవసరమైన మార్పులను సూచించడం;

ఈ విధంగా దేశ ఆర్థికాభివృద్ధిని, సంక్షేమ రాజ్యాన్ని సాధించేందుకు ఒక స్టాఫ్ ఏజన్సీగా ప్రణాళికా సంఘాన్ని ఏర్పాటు చేసారు. ప్రణాళికా సంఘాన్ని సమాఖ్య ప్రభుత్వం, సంక్షేమ రాజ్యం, పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థ కార్యచట్రంలో పనిచేసే విధంగా రూపొందించారు. ప్రణాళికా సంఘం దేశ సామాజిక, ఆర్థికాభివృద్ధికి అవసరమైన ప్రణాళికలను, పథకాలను విధానాలను సూచించడం, సమన్వయ పరచటం, వాటిని అమలుపరచవలసిన రంగాలను సూచించటంతోపాటు, వాటి ఫలితాలను మదింపు చేస్తుంది. అయితే ఈ అంశాలలో అంతిమ బాధ్యత ప్రజాప్రతినిధులు, రాజకీయ సంస్థలకే ఉంటుంది.

## 13.6 ప్రణాళికాసంఘ వ్యవస్థీకరణ :

ప్రణాళికా సంఘం బహుళ సంఖ్యలో సభ్యులు కల సంస్థ. ఈ సభ్యుల సంఖ్య మారుతూ వస్తున్నది. మొదట్లో ప్రణాళికా సంఘం కేవలం పంచవర్ష ప్రణాళికల రూపకల్పనకే పరిమితమైంది. అందుచేత కొందరు పూర్ణకాలిక సభ్యులను మాత్రమే కలిగివుంది. ప్రణాళికా సంఘం అధ్యక్షుడిగా ప్రధానమంత్రి ఈ సంఘానికి, కేంద్ర ప్రభుత్వానికి మధ్య అవసరమైన సన్నిహిత సంబంధాన్ని ఏర్పరచినాడు. కాని కాలక్రమంలో ప్రణాళికా సంఘం అనేక పరిపాలన సంబంధమైన వ్యవహారాలను, కార్యనిర్వాహక స్వభావం కలిగిన విధులను నిర్వహించటం ప్రారంభమైంది. దీని ఫలితంగా ప్రణాళికా సంఘం నిర్మాణంలో అనేక మౌలికమైన మార్పులు చోటు చేసుకున్నాయి. కొందరు కేంద్ర మంత్రులు ప్రణాళికా సంఘంలో స్వల్పకాలిక సభ్యులుగా నియమింపబడ్డారు. 1967లో పరిపాలన సంస్కరణల సంఘం (ARC) సూచనలకు అనుగుణంగా ప్రణాళికా సంఘం పునర్ వ్యవస్థీకరించబడింది. పునర్ వ్యవస్థీకరణ తరువాత ప్రణాళికా సంఘంలో 7గురు సభ్యులు నియమింపబడ్డారు. వీరిలో కేంద్ర ఆర్థిక శాఖా మంత్రి, ప్రణాళికా మంత్రి స్వల్పకాలిక సభ్యులు. మిగిలిన ఐదుగురు సభ్యులు పూర్ణకాలిక సభ్యులు. దేశంలో ప్రసిద్ధి చెందిన ప్రజానాయకులు, పాలనాధికారులు, సాంకేతిక నిపుణులు, ప్రణాళికా సంఘంలో సభ్యులుగా నియమింపబడ్డారు. ప్రధానమంత్రి అధ్యక్షుడిగా కొనసాగారు. ప్రణాళికశాఖ మంత్రి, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడిగా వ్యవహరించారు. 1977లో జనతా ప్రభుత్వకాలంలో హోంశాఖ, రక్షణశాఖ మంత్రులు ప్రణాళికా సంఘంలో పార్ట్-టైం సభ్యులుగా నియమింపబడ్డారు. 1977లో జనతా ప్రభుత్వం ప్రణాళికా సంఘం వ్యవస్థీకరణను మౌలికంగా మార్పుచేసింది.. కేంద్ర హోంశాఖ, ఆర్థికశాఖ, రక్షణశాఖల కాబినేట్ మంత్రులకు ప్రణాళికా సంఘంలో సభ్యత్వం కల్పించబడింది. 1985లో ప్రణాళికా సంఘం వ్యవస్థీకరణలో మరికొన్ని మార్పులను ప్రవేశపెట్టారు. ప్రణాళికా సంఘంలో కేవలం ఇద్దరు కాబినేట్ మంత్రులకు మాత్రమే సభ్యత్వాన్ని

కల్పించారు. 1994లో ప్రణాళికా సంఘంలో కొందరు కేంద్ర కాబినేట్ మంత్రులకు స్థానం కల్పించారు. దీనితో ప్రణాళికా సంఘం మొత్తం సభ్యుల సంఖ్య పదమూడుకు పెరిగింది. అప్పటినుండి ప్రణాళికా సంఘం వ్యవస్థీకరణ స్వల్పమార్పులతో యధాతథంగా కొనసాగుతుంది.

## 13.7 ప్రణాళికా సంఘం - విభాగాలు :

ప్రణాళికా సంఘం ప్రధానంగా మూడు విభాగాలుగా విభజింపబడింది. అవి :

1) ప్రోగ్రాం సలహాదారులు

2) సాధారణ సచివాలయం

3) సాంకేతిక విభాగాలు

ప్రోగ్రాం సలహాదారులు ప్రభుత్వంలో కల అదనపు సెక్రటరీ హోదాను కలిగి ఉంటారు. ఈ సలహాదారులు ప్రణాళికల అమలుకు సంబంధించి విత్తం, ప్రజల సహకారం, పరిపాలన వ్యవహారాలపై ప్రణాళికా సంఘానికి సలహాలను ఇస్తారు. వివిధ పథకాల, ప్రాజెక్టుల అమలులో ప్రణాళికా సంఘానికి సహాయపడతారు.

సాధారణ సచివాలయంలో ఈ క్రింది విభాగాలు ఉన్నాయి.

1) సాధారణ విభాగం

2) ప్రణాళికా సమన్వయ విభాగం

3) పాలనా విభాగం

4) సాధారణ సమన్వయ విభాగం

5) సమాచారం, ప్రచార విభాగం.

ఈ విభాగాల గృహ నిర్వహణ (House - Keeping) విధులను నిర్వర్తిస్తాయి. ఈ విభాగాలు ఉద్యోగ బృందం, అకౌంట్స్, సాధారణ పరిపాలన నియమాలకు సంబంధించిన విధులను నిర్వర్తిస్తాయి.

సాంకేతిక విభాగాలు పంచవర్ష ప్రణాళికలను సంబంధించిన మొత్తం అంశాలను అధ్యయం చేసి ప్రణాళికల్లో ఏ పథకాలను, ప్రాజెక్టులను చేర్చాలో నిర్ధారిస్తాయి. ఈ విభాగాలు ప్రణాళికకు సంబంధించిన సాంకేతిక అంశాలపై పరిశోధనలను నిర్వహించడంతోపాటు, ప్రణాళికల్లో చేపట్టిన పథకాలు, ప్రాజెక్టుల అమలుకు బాధ్యత వహిస్తాయి. ప్రణాళికల ప్రగతిపై నివేదికలను రూపొందించి, ప్రణాళికా సంఘానికి సమర్పిస్తాయి. ప్రస్తుతం ప్రణాళికా సంఘంలో 19 సాంకేతిక విభాగాలు ఉన్నాయి. వాటిలో కొన్ని 1) అర్థిక, విత్తవనరుల విభాగం 2) విద్యా విభాగం 3) ఆహారం, వ్యవసాయ విభాగం, 4) ఆరోగ్య విభాగం 5) పరిశ్రమల విభాగం 6) సామాజిక సంక్షేమం విభాగం 7) సాగునీరు, విద్యుచ్ఛక్తి విద్యుచ్ఛక్తి విభాగం మొ॥నవి 8) గ్రామీణాభివృద్ధి విభాగం 9) కుటీర పరిశ్రమ విభాగం మొదలైనవి.

పై విభాగాలతోపాటు ప్రణాళికా సంఘంలో కొన్ని అనుబంధ సంస్థలు ఉన్నాయి. అవి :

1) ప్రణాళికా మూల్యాంకన సంస్థ

2) ప్రణాళికా ప్రాజెక్టుల సంఘం

3) జాతీయ ఇన్ఫార్మటిక్స్ కేంద్రం

ప్రణాళికా మూల్యాంకన సంస్థ పంచవర్ష ప్రణాళికల్లో చేపట్టిన వివిధ అభివృద్ధి పథకాల, ప్రాజెక్టుల అమలుకు సంబంధించిన స్పందిత సమాచారాన్ని (Feed back) ప్రణాళికా సంఘానికి అందజేస్తుంది. వివిధ పథకాలు సాధించిన ఫలితాలను అంచనా వేస్తుంది. లబ్దిదారులపై ఈ పథకాల ప్రభావాన్ని మదింపు చేస్తుంది.

ప్రణాళికా ప్రాజెక్టుల సంఘం పంచవర్ష ప్రణాళికల పరిధిలో చేపట్టిన అభివృద్ధి పథకాలు, ప్రాజెక్టుల అమలుపై ప్రత్యేక బృందాల ద్వారా పరిశోధనలను, అధ్యయనాలను చేపట్టుతుంది. పంచవర్ష ప్రణాళికల అమలులో మిత వ్యయాన్ని సాధించేందుకు ప్రణాళికా ప్రాజెక్టులను సమర్థవంతంగా అమలుపరిచేందుకు అవసరమైన పద్ధతులను, వ్యవస్థలను, ప్రమాణాలను రూపొందించేందుకు అధ్యయనాలను నిర్వహిస్తుంది. పంచవర్ష ప్రణాళికల అమలులో మిత వ్యయాన్ని, సామర్థ్యాన్ని సాధించేందుకు జాతీయ అభివృద్ధి మండలి సూచించిన విధులను నిర్వహిస్తుంది. ప్రణాళికా ప్రాజెక్టుల సంఘానికి కేంద్ర హోంశాఖ మంత్రి అధ్యక్షుడిగా వ్యవహరిస్తాడు. కేంద్ర ఆర్థిక, ప్రణాళికా శాఖల మంత్రులు, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు ఈ సంఘంలో సభ్యులు.

చివరిగా జాతీయ ఇన్‌ఫార్మాటిక్స్ కేంద్రం ప్రణాళికా సంఘం అధిపత్యంలో పనిచేసే నోడల్ విజ్ఞాన, సాంకేతిక సంస్థ (Nodal Science and Technolgy Organization) ఈ సంస్థ వివిధ కార్యకలాపాలను చేపట్టేందుకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానం (Information Technology) సాధనాలను రూపొందిస్తుంది.

## 13.8 జాతీయాభివృద్ధి మండలి :

భారత దేశంలో ప్రణాళికీకరణ వ్యవస్థలో జాతీయ ప్రణాళికా సంఘం తరువాత జాతీయాభివృద్ధి మండలి (National Development Council) కి కీలక పాత్ర ఉంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలుపరచే అభివృద్ధి ప్రణాళికలు, విధానాలను సమన్వయపరచే సంస్థగా జాతీయాభివృద్ధి మండలికి దేశ ప్రణాళికా ప్రక్రియలో ప్రధానపాత్ర ఉంది. జాతీయాభివృద్ధి మండలి దేశంలో అత్యున్నత రాజకీయాధికారాలను కలిగి ఉంది. ప్రధానమంత్రి అధ్యక్షత వహించే ఈ మండలిలో దేశంలోని మొత్తం రాష్ట్రాల, కేంద్రపాలిత ప్రాంతాల ముఖ్యమంత్రులు, కొందరు కేంద్రమంత్రులు (ఉదా ॥ ఆర్థికశాఖ, వ్యవసాయం, హోం, వాణిజ్య, ప్రణాళికా శాఖల మంత్రులు), ప్రణాళికా సంఘ సభ్యులు, సభ్యులుగా ఉంటారు. ప్రణాళికా సంఘ సెక్రటరీ జాతీయాభివృద్ధి మండలి సెక్రటరీగా వ్యవహరిస్తాడు. మొదటి పంచవర్ష ప్రణాళికా నివేదికలో చేసిన సూచనకు అనుగుణంగా 1952 ఆగస్ట్‌లో జాతీయాభివృద్ధి మండలిని స్థాపించారు. జాతీయాభివృద్ధి మండలి సంవత్సరానికి రెండుసార్లు సమావేశం అవుతుంది. 1992లో ఈ మండలి తన విధి నిర్వహణలో తోడ్పడేందుకు ఆరు ప్రత్యేక సంఘాలను నియమించింది. ప్రణాళిక ప్రక్రియలో కేంద్ర, రాష్ట్రాల మధ్య సమన్వయాన్ని సాధించేందుకు, ప్రణాళిక అమలులో ఏకరూపతను సాధించేందుకు జాతీయ అభివృద్ధి మండలి ఒక పాలనా యంత్రాంగాన్ని ఏర్పరచింది.

జాతీయాభివృద్ధి మండలి ఈ క్రింది ప్రధాన విధులను నిర్వహిస్తుంది.

1) జాతీయ ప్రణాళికల రూపకల్పనకు, వనరుల సేకరణకు అవసరమైన మార్గదర్శక సూత్రాలను రూపొందించటం;

2) ప్రణాళికా సంఘం రూపొందించిన పంచవర్ష ప్రణాళికలను పరిశీలించటం ;

3) జాతీయాభివృద్ధికి సంబంధించిన సామాజిక, ఆర్థిక విధానాలను చర్చించటం ;

4) పంచవర్ష ప్రణాళికల అమలును, వాటి ఫలితాలను సమీక్షించటం; ఈ ప్రణాళికలు తమ లక్ష్యాలను సమర్థవంతంగా సాధించేందుకు తగిన సూచనలను చేయడం.

ప్రణాళికా సంఘంలాగే జాతీయ అభివృద్ధి మండలి కూడా రాజ్యాంగేతర, సలహారూపక సంస్థ. ఈ మండలి పంచవర్ష ప్రణాళిక రూపకల్పనలో వివిధ దశలలో సలహాలను అందచేస్తుంది. ఈ మండలి ఆమోదించిన తరువాత పంచవర్ష ప్రణాళికలు పార్లమెంట్ ఆమోదానికి సమర్పించబడతాయి. జాతీయ ప్రణాళికలకు వాస్తవమైన, పరిపూర్ణమైన జాతీయ స్వభావాన్ని కల్పించటం, వాటి అమలులో జాతీయ స్థాయిలో ఏకరూపతను, ఐక్యతను సాధించటం జాతీయాభివృద్ధి మండలి ప్రధానకర్తవ్యం.

ఇప్పటి వరకు జాతీయాభివృద్ధి మండలి తన కర్తవ్యాన్ని విజయవంతంగా నిర్వర్తించిందని నిపుణుల అభిప్రాయం. ఈ మండలి నిర్వహిస్తున్న పాత్రవల్ల ప్రధానంగా మూడు ప్రయోజనాలు నెరవేరినట్లు గుర్తించారు. ఒకటి, ప్రణాళికా ప్రక్రియలో జాతీయ అభివృద్ధిమండలి జాతీయ ప్రణాళికా సంఘం, కేంద్ర ప్రభుత్వం, రాష్ట్రప్రభుత్వాల మధ్య సన్నిహిత సంబంధాలను ఏర్పరచగలిగింది. వాటి మధ్య వారధిలా పనిచేస్తున్నది. రెండు, దేశ సామాజిక, ఆర్థికాభివృద్ధికి, పంచవర్ష ప్రణాళికల రూపకల్పన, అమలుకు సంబంధించి అ మండలి కేంద్రప్రభుత్వం, రాష్ట్రప్రభుత్వాల మధ్య చర్చలకు, పరస్పర అభిప్రాయాల మార్పిడికి చక్కని వేదికగా ఉపయోగపడుతున్నది. మూడు, దేశ అభివృద్ధికి సంబంధించిన కేంద్రం, రాష్ట్రాల మధ్య బాధ్యత పంపిణీకి సమర్థవంతమైన సాధనంగా ఉపకరిస్తున్నది. కొందరు విమర్శకుల అభిప్రాయం ప్రకారం ప్రణాళికా సంఘం లాగే జాతీయ అభివృద్ధిమండలి కూడా కేంద్ర, రాష్ట్రాల అధికారాలను హరిస్తున్న రాజ్యాంగేతర శక్తిగా రూపొందింది. ఒక సూపర్ క్యాబినేట్‌గా వ్యవహరిస్తున్నది. ఏమైనప్పటికీ, జాతీయాభివృద్ధి మండలి మౌలికంగా సలహా రూపకమైన సంస్థ మాత్రమే. అంతేకాక ఈ మండలి ఇచ్చే సలహాలను, చేసే సూచనలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తప్పనిసరిగా పాటించి తీరవలసిన అవసరంలేదు. ఈ మండలికి ఎటువంటి పాత్రను కల్పించాలి అన్న విషయం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మీదే పూర్తిగా ఆధారపడిఉంది. రమేశ్ కె. అరోరా అభిప్రాయం ప్రకారం, జాతీయ అభివృద్ధి మండలి దేశంలోని ప్రణాళికీకరణ ప్రక్రియను ఆశించిన స్థాయిలో ప్రభావితం చేయటంలో విఫలమయింది. అయినప్పటికీ జాతీయ ప్రణాళికల పట్ల ఒక సమైక్య దృక్పథాన్ని, సారూప్యతను కలిగిన అభిప్రాయాన్ని సృష్టించగలిగింది. ఈ సంస్థకు రాజ్యాంగబద్ధమైన హోదా లేనప్పటికీ కేంద్ర, రాష్ట్రాలు ఈ మండలి చేసే సూచనలను గౌరవిస్తున్నాయి.

## 13.9 రాష్ట్రస్థాయిలో ప్రణాళికీకరణ :

ప్రణాళికా సంఘం రూపొందించిన జాతీయ ప్రణాళికలతోపాటు దేశంలోని వివిధ రాష్ట్రాలకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించబడతాయి. రాష్ట్ర ప్రణాళికలు జాతీయ ప్రణాళికల పద్ధతిలో రూపొందించబడతాయి. రాష్ట్రాల ప్రణాళికలన్నీ పరస్పరం సంగతత్వాన్ని కలిగి ఉండటంతోపాటు నిర్ధారించిన జాతీయ ప్రణాళికా పెట్టుబడికి, కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన ప్రాధ్యమాలకు అనుగుణంగా ఉండేలా చూడటం ప్రణాళికా సంఘం ప్రధాన కర్తవ్యం. అందుచేత రాష్ట్రాలు జాతీయ ప్రణాళికా సంఘానికి ఆధీన ప్రణాళికా అధికారులుగా పనిచేస్తాయి.

ప్రతిరాష్ట్రం తన ప్రణాళికలను తానే రూపొందించుకొంటుంది. ప్రతిరాష్ట్రం రూపొందించిన చిత్తు (Draft) ప్రణాళికను ప్రణాళికా సంఘం, సంబంధిత శాసనసభ ఆమోదానికి సమర్పించవలసి ఉంటుంది. కేంద్ర ప్రభుత్వం ఆమోదంతోనే రాష్ట్రాల ప్రణాళికలు ఖరారు అవుతాయి. రాష్ట్రస్థాయిలో ప్రణాళికల రూపకల్పనకు ప్రతి రాష్ట్రంలో రాష్ట్ర ప్రణాళికాశాఖ లేదా రాష్ట్ర ప్రణాళికా బోర్డు ఏర్పాటైంది. ఈ ప్రణాళికా శాఖ లేదా ప్రణాళికా బోర్డు ప్రతి రాష్ట్ర మంత్రిత్వశాఖ నుంచి ప్రతిపాదనలను సేకరించి వాటిని సమన్వయ పరుస్తుంది. ఈ ప్రతిపాదనలు రాష్ట్రానికి అందుబాటులో ఉన్న వనరులకు అనుగుణంగా ఉండేలా రాష్ట్ర ప్రణాళికా శాఖ లేదా బోర్డు చూస్తుంది. అయితే దేశంలోని అన్ని రాష్ట్రాలల్లోను ప్రత్యేకమైన ప్రణాళికా యంత్రాంగం

లేదు. 1967లో పరిపాలన సంస్కరణల సంఘం దేశంలోని ప్రతిరాష్ట్రం ఒక ప్రణాళికా బోర్డును ఏర్పాటు చేసుకోవాలని సూచించినప్పటికీ దేశంలోని కొన్ని రాష్ట్రాలు ఇప్పటివరకు ప్రణాళికా బోర్డులను ఏర్పాటు చేసుకోలేదు. దేశంలో కేరళ ప్రణాళికాబోర్డును ఏర్పాటు చేసుకున్న ప్రథమ రాష్ట్రం. తరువాత కాలంలో కొన్ని ఇతర రాష్ట్రాలు కూడా ప్రణాళికా బోర్డులను ఏర్పాటు చేసుకున్నాయి. 1974లో ఆంధ్రప్రదేశ్‌లో ఒక ప్రణాళికా బోర్డును స్థాపించారు. అయితే తర్వాత కాలంలో ఈ బోర్డు రద్దుచేయబడింది. 1983లో దీని స్థానంలో రాష్ట్ర అభివృద్ధిబోర్డును ఏర్పాటుచేశారు. తరువాత కాలంలో గుజరాత్, మహారాష్ట్ర, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, బీహార్, మధ్యప్రదేశ్ మొదలైన రాష్ట్రాలలో కూడా ప్రణాళికా బోర్డులు ఏర్పాటు అయ్యాయి. వివిధ రాష్ట్రాల ప్రణాళికా బోర్డుల నిర్మాణం, కార్యకలాపాలు, పనిశైలి మొదలైన విషయాలలో తీవ్రమైన భిన్నత్వం ఉంది.

రాష్ట్రస్థాయి ప్రణాళికల రూపకల్పనలో వివిధ రాష్ట్రాల మధ్య ఎంతో భిన్నత్వం ఉన్నప్పటికీ స్థూలంగా ప్రణాళికల రూపకల్పనా విధానాన్ని ఈ క్రింది విధంగా వివరించవచ్చును.

1) ప్రణాళికా సంఘం నుంచి పంచవర్ష ప్రణాళిక రూపకల్పనకు సంబంధించిన మార్గదర్శక సూత్రాలు అందకముందే రాష్ట్రప్రభుత్వాలు క్రమప్రణాళికల రూపకల్పనకు ముందస్తు చర్యలను చేపట్టాయి. రాష్ట్ర ప్రణాళికలకు సంబంధించిన స్థూల పరిమితులను నిర్ధారించటంలో ప్రభుత్వ శాఖలన్నీ పాల్గొంటాయి.

2) ప్రణాళికా సంఘం అభ్యర్థన మేరకు రాష్ట్ర ప్రభుత్వాలు తమ సూచనలను అందచేస్తాయి. ఈ సూచనలు జాతీయ ప్రణాళికకు సంబంధించిన అప్రోచ్ పేపరు (Approach Paper) కు ఆధారం.

3) ప్రణాళికా సంఘం రూపొందించిన అప్రోచ్ పేపరుని జాతీయ అభివృద్ధి మండలి (NDC) ఆమోదించిన తరువాత దాని ప్రాతిపదిక మీద తమ రాష్ట్రాలకు సంబంధించిన చిత్తు (Draft) పంచవర్ష ప్రణాళికలను రూపొందించమని రాష్ట్ర ప్రభుత్వాలను ప్రణాళికా సంఘం కోరటం జరుగుతుంది.

4) ప్రణాళికా సంఘం పంపిన అప్రోచ్ పేపర్ ఆధారంగా వివిధ రాష్ట్రాలు తమ ప్రత్యేక అవసరాలు, ప్రాధాన్యతలు అందుబాటులో ఉన్న వనరులకు అనుగుణంగా తమ స్వంత అప్రోచ్ పేపర్లను రూపొందించటం జరుగుతుంది. ఈ దశలో రాష్ట్ర ప్రణాళికాశాఖలు లేదా బోర్డులు ఇతర రాష్ట్ర ప్రభుత్వ శాఖలతో ఇతర స్థాయిల ప్రణాళికా సంస్థలతో, జాతీయ ప్రణాళికా సంఘం, కేంద్ర మంత్రిత్వ శాఖలతో సంప్రదింపులు జరుపుతాయి.

5) రాష్ట్రాలు రూపొందించిన చిత్తు ప్రణాళికలను కేంద్ర కార్యాచరణ బృందాలు, జాతీయ ప్రణాళికా సంఘం చర్చిస్తాయి. జాతీయస్థాయి, రాష్ట్రస్థాయి ప్రాధాన్యతలను దృష్టిలో ఉంచుకొని ప్రణాళికా సంఘం రాష్ట్రాల చిత్తు ప్రణాళికలను ఆమోదిస్తుంది. లేదా వాటిలో తగు సవరణలను చేస్తుంది.

6) జాతీయ ప్రణాళికా సంఘం రూపొందించిన చిత్తు పంచవర్ష ప్రణాళికను జాతీయ అభివృద్ధి మండలి చర్చిస్తుంది.

7) జాతీయ అభివృద్ధి మండలి ఆమోదించిన పంచవర్ష ప్రణాళికను కేంద్ర కాబినెట్, పార్లమెంట్ ఆమోదానికి సమర్పించటం జరుగుతుంది.

రమేశ్ కె.అరోరా పేర్కొన్నట్లు వివిధ రాష్ట్రాలలో ఏర్పాటైన ప్రణాళికా శాఖలు లేదా ప్రణాళికా బోర్డులు స్థూలంగా ఈ క్రింది లక్షణాలను కలిగివున్నాయి.

1) అనేక రాష్ట్రాలలో పరిపాలన సంస్కరణల సంఘం (ARC) సూచనల మేరకు, ప్రణాళికా సంఘం ఆదేశాలకు అనుగుణంగా 1970 దశాబ్దంలో రాష్ట్రప్రణాళికా బోర్డులు ఏర్పాటు చేయబడ్డాయి.

2) ప్రతి రాష్ట్ర ప్రణాళికా బోర్డుకు ముఖ్యమంత్రి అధ్యక్షత వహిస్తారు. కొందరు సీనియర్ మంత్రులు (ఆర్థికమంత్రి,

ప్రణాళికా మంత్రి మొ॥) ఈ బోర్డులో సభ్యులుగా ఉంటారు.

3) మంత్రులతోపాటు రాష్ట్ర ప్రధానకార్యదర్శి, కొందరు సీనియర్ సెక్రటరీలు కూడా ప్రణాళికా బోర్డులో సభ్యులు.

4) రాష్ట్ర ప్రణాళికా బోర్డులలో కొందరు విషయ నిపుణులు కూడా సభ్యులుగా ఉంటారు.

5) ఈ ప్రణాళికా బోర్డులు అరుదుగా సమావేశం అవుతాయి.

6) అనేక రాష్ట్రాలలో ప్రణాళికా బోర్డులు చురుకుగా పనిచేయడంలేదు. రాష్ట్రస్థాయి ప్రణాళికా ప్రక్రియపై వాటి ప్రభావం అతి పరిమితం.

కేంద్ర, రాష్ట్రాల సంబంధాల అధ్యయనానికి ఏర్పాటైన సర్కారియా సంఘం అనేక రాష్ట్రాలలో ఏర్పాటైన ప్రణాళికా బోర్డులు వాస్తవంగా ఎటువంటి ప్రణాళికా ప్రక్రియను చేపట్టడం లేదు, అవి అభివృద్ధిపై కొన్ని అధ్యయనాలను మాత్రమే నిర్వహించాయని పేర్కొంది. ఈ విధంగా వాటిని ఏర్పాటు చేయడం వెనుక ఉన్న ఉద్దేశ్యం ఏ మాత్రం నెరవేరలేదు. ఈ బోర్డులు నిర్వహిస్తున్న పాత్ర అస్పష్టంగా ఉండటంతోపాటు అవి ప్రణాళిక రూపకల్పన ప్రక్రయలో పాల్గొనటం లేదని కూడా సర్కారియా సంఘం వివరించింది. అందుచేత సర్కారియా సంఘం జాతీయ ప్రణాళికా సంఘం కేంద్ర ప్రభుత్వానికి చేసే సేవలను రాష్ట్ర ప్రణాళికా బోర్డులు రాష్ట్ర ప్రభుత్వాలకు చేసేవిధంగా వాటిని పటిష్టపరచాలని సూచించింది. ఇది రాష్ట్రాలకు ప్రణాళికీకరణలో తగిన స్వేచ్ఛ, స్వయంప్రతిపత్తిని సమకూర్చినప్పుడే సాధ్యం అవుతుందని సర్కారియా సంఘం అభిప్రాయపడింది.

## 13.10 జిల్లాస్థాయి ప్రణాళికీకరణ :

భారతదేశంలో ప్రణాళికీకరణ ప్రధానంగా కేంద్ర, రాష్ట్ర స్థాయిలకే పరిమితం. ఈ విధానంలో అభివృద్ధి ప్రణాళికల రూపకల్పన, అమలులో దేశమంతటికి సమానమైన దృక్పధానికి దారితీసినప్పటికీ, ఈ ప్రక్రియలో అంతర్‌రాష్ట్ర, అంతర్ ప్రాంత, విభిన్న జిల్లాల మధ్య అభివృద్ధి స్థాయిలు, అవసరాలు, ప్రాధాన్యతలలో కల భిన్నత్వాలకు చోటు లభించలేదు. ఈ విధానం వల్ల కొన్ని ప్రయోజనాలు ఉన్నప్పటికీ వనరుల వృధా, అసమతుల్య అభివృద్ధి వంటి నష్టాలు లేకపోలేదని నిపుణుల అభిప్రాయం. అందుచేత అనేకమంది నిపుణులు, పాలనా సంస్కరణల సంఘాలు దిగువస్థాయి ప్రణాళికీకరణ ప్రధానంగా జిల్లాస్థాయి ప్రణాళికీకరణ ప్రాధాన్యతను, ఆవశ్యకతను నొక్కి చెప్పాయి. అయినప్పటికీ దిగువస్థాయి (జిల్లా స్థాయి) వరకు ప్రణాళికీకరణను వికేంద్రీకరించేందుకు రాష్ట్రప్రభుత్వాలు చొరవ చూపలేదు. అయితే **1992**లో అమలులోకి వచ్చిన **73**వ, **74**వ రాజ్యాంగ సవరణలు ఈ పరిస్థితిలో మౌలిక మార్పును ప్రవేశపెట్టాయి. ఈ రాజ్యాంగ సవరణలు స్థానిక సంస్థల విధులలో ప్రణాళికీకరణను ప్రధాన విధిగా చేర్చాయి. స్థానిక స్థాయిలో అభివృద్ధికి సంబంధించిన ప్రణాళికీకరణలో స్థానిక సంస్థలైన పంచాయితీరాజ్, నగరపాలక సంస్థలకు కీలకపాత్రను కల్పించాయి. ఈ రాజ్యాంగ సవరణ చట్టాల వలన అనేక రాష్ట్ర ప్రభుత్వాలు అట్టడుగు స్థాయిలో ప్రణాళికీకరణలో స్థానిక సంస్థలకు కీలకపాత్రను కల్పిస్తూ చర్యలు తీసుకున్నాయి. **73, 74**వ రాజ్యాంగ సవరణ ఫలితంగా రాజ్యాంగంలో చేర్చబడిన **243** అధికరణ జిల్లా స్థాయిలో ప్రణాళికా సంఘాలను స్థాపించాలని సూచిస్తున్నది.

ఆర్.బి. జైన్ అభిప్రాయం ప్రకారం భారతదేశంలో జిల్లాస్థాయి ప్రణాళికీకరణ, దిగువ స్థాయిలో సమాచార, సేరకణ ప్రక్రియకు పరిమితమైంది.. ఈ సమాచారాన్ని వివిధ పథకాల రూపకల్పనకు వినియోగిస్తున్నారు. అయినప్పటికీ ప్రణాళికీకరణకు సంబంధించిన దిగువ స్థాయి సంస్థలకు ఎటువంటి అధికారాలు దత్తత చేయబడలేదు. అంటే నిర్ణయాకరణకు సంబంధించి దిగువ స్థాయి సంస్థలకు ఎటువంటి అధికారాలు దత్తత చేయబడలేదు. అంటే నిర్ణయాకరణ ప్రక్రియలో వికేంద్రీకరణ జరుగలేదు. జిల్లాస్థాయి ఉద్యోగులు, దిగువస్థాయి ఉద్యోగులతో సంప్రదించి రూపొందించే ప్రతిపాదనలకు రాష్ట్రస్థాయి

ప్రణాళికల రూపకల్పనలో తగిన ప్రాధాన్యత లేదు. జిల్లాస్థాయిలో రూపొందించే ప్రణాళికలన్నీ రాష్ట్రస్థాయి ప్రణాళిక అవసరాలకు అనుగుణంగా పూర్తిగా మార్పు చేయబడతాయి. ప్రణాళికా సంఘం ప్రణాళికా రూపకల్పనకు సంబంధించి రూపొందించిన మార్గదర్శక సూత్రాలు ఈ ప్రక్రియలో జిల్లా బ్లాక్‌స్థాయి ఉద్యోగుల చొరవకు అవకాశం కల్పించే విధంగా లేవు. అందుచేత ఈ స్థాయిలోని ఉద్యోగులు ప్రణాళికీకరణ పట్ల ఎటువంటి ఆసక్తి, శ్రద్ధ కనపరచరు.

## 13.10 జిల్లాస్థాయి ప్రణాళికీకరణ :

పాల్ బ్రాస్ అభిప్రాయం ప్రకారం భారతదేశంలో ప్రణాళికీకరణ మొదటి దశలో సాధించిన విజయాలలో భిన్నత్వంతో కూడిన క్యాపిటల్ వస్తువుల రంగం అభివృద్ధి ప్రధానమైంది. అయితే వివిధ ప్రణాళికలలో అనుసరించిన పారిశ్రామిక విధానాల ఫలితంగా పారిశ్రామిక ఉత్పత్తుల లక్ష్యాలను సాధించటం జరగలేదు. అంతేకాక ఆర్థిక సంపద పారిశ్రామిక రంగంలో కేంద్రీకృతం కాకుండా అప్పటికే పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన రాష్ట్రాలలో, ప్రాంతాలలోనే మొత్తం పరిశ్రమల స్థాపనను నివారించటంలో కూడా ప్రణాళికలు విఫలం అయినవి. పాల్ బ్రాస్ అభిప్రాయం ప్రకారం రాజీవ్‌గాంధీ ప్రభుత్వ కాలంలో ప్రణాళికీకరణ వ్యూహంలో కీలకమార్పు సంభవించినది. రాజీవ్‌గాంధీ ప్రభుత్వం ప్రణాళికీకరణలో భారత ఆర్థిక వ్యవస్థ సాంకేతిక, ఆధునికీకరణకు, క్యాపిటల్ వస్తువుల రంగం అభివృద్ధికి ప్రాధాన్యత కల్పించింది. అంతేకాక దేశ పారిశ్రామిక రంగాన్ని ఆధునికీకరించేందుకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందింపచేసే వస్తువులపై దిగుమతుల నిబంధనను గణనీయంగా తగ్గించారు. ఈ మార్పులు అన్ని రాజీవ్‌గాంధీ అనుసరించిన ఆర్థిక సరళీకరణ విధానానికి అనుగుణంగా చేపట్టబడ్డాయి.

మొత్తం మీద భారతదేశంలో పంచవర్ష ప్రణాళికలు మిశ్రమ విజయాన్ని సాధించాయి. గత **50** సంవత్సరాలలో వివిధ పంచవర్ష ప్రణాళికల అమలు ఫలితంగా వివిధ రంగాలలో సాధించిన విజయాలు ఈ విధంగా ఉన్నాయి. మొట్టమొదటి పంచవర్ష ప్రణాళిక **2.1** శాతం వార్షిక జాతీయ ఆదాయాన్ని, **0.9** శాతం వార్షిక తలసరి ఆదాయాన్ని సాధించాలని లక్ష్యం పెట్టుకుంది. కానీ, వాస్తవంగా ఈ పంచవర్ష ప్రణాళికలో **3.1** శాతం వార్షిక జాతీయ ఆదాయం, **1.7** శాతం వార్షిక తలసరి ఆదాయం సాధించబడ్డాయి. క్రమంగా వివిధ పంచవర్ష ప్రణాళికల్లో జాతీయ, తలసరి ఆదాయాలు పెరుగుతూ వచ్చాయి. ఏడవ పంచవర్ష ప్రణాళిక నాటికి వార్షిక జాతీయ ఆదాయం **5** నుంచి **8** శాతానికి, **8**వ పంచవర్ష ప్రణాళికలో **6** శాతానికి చేరుకుంది. అయితే వార్షిక తలసరిఆదాయం మాత్రం **8**వ పంచవర్ష ప్రణాళిక కాలంనాటికి **1.97** శాతం మాత్రమే పెరిగినట్లు అంచనా.

మొట్టమొదటి మూడు పంచవర్ష ప్రణాళికలలో పారిశ్రామిక ఉత్పత్తులు వృద్ధిరేటు గణనీయంగా పెరిగింది. మొదట పంచవర్ష ప్రణాళిక కాలంలో **5.7** శాతం ఉన్న పారిశ్రామికోత్పత్తుల వృద్ధిరేటు మూడవ పంచవర్ష ప్రణాళికలనాటికి **9** శాతానికి పెరిగింది. అయితే, మూడవ పంచవర్ష ప్రణాళిక తరువాత కాలంలో పారిశ్రామిక ఉత్పత్తికి వృద్ధిరేటు గణనీయంగా క్షీణించిందని గణాంకాలు వివరిస్తున్నాయి. ఆరవ పంచవర్ష ప్రణాళికా కాలంలో **7.6** శాతం పారిశ్రామిక ఉత్పత్తుల వార్షిక వృద్ధిరేటు లక్ష్యంగా నిర్ధారించగా **6.4** శాతం వృద్ధిరేటు సాధించబడింది. అయితే **7**వ పంచవర్ష ప్రణాళికా కాలంలో అంటే **1985** నుంచి **1990** వరకు పారిశ్రామిక వృద్ధిరేటు గణనీయంగా అంటే **9** శాతానికి పెరిగింది. అయితే **1990** దశాబ్దంలో పారిశ్రామిక వృద్ధిరేటు **8.6** శాతానికి క్షీణించింది.

వివిధ పంచవర్ష ప్రణాళికల్లో వ్యవసాయ రంగంలో సాధించిన ఫలితాలు అద్భుతమని గణాంకాలు తెలుపుతున్నాయి. మొదటి పంచవర్ష ప్రణాళిక **61.6** మిలియన్ల టన్నుల వ్యవసాయ ఉత్పత్తులను సాధించాలని లక్ష్యాన్ని నిర్ధారించగా ఈ ప్రణాళికా కాలంలో **64. 6** మిలియన్ల టన్నుల ఆహార ధాన్యాల ఉత్పత్తి సాధించబడింది. అయితే మూడవ పంచవర్ష ప్రణాళిక

100 మిలియన్ల టన్నుల ఆహారధాన్యాల ఉత్పత్తిని సాధించాలనే లక్ష్యాన్ని నిర్ధారించగా 72 మిలియన్ టన్నుల ఆహారధాన్యాల ఉత్పత్తి మాత్రమే జరిగింది. కానీ నాలుగవ పంచవర్ష ప్రణాళికా కాలంలో ఆహారధాన్యాల ఉత్పత్తి 104.46 మిలియన్ల టన్నులకు చేరుకుంది. ఆరవ పంచవర్ష ప్రణాళికా కాలంలో ఆహార ధాన్యాల ఉత్పత్తి రికార్డు స్థాయిలో అభివృద్ధి చెందింది. ఈ కాలంలో ఆహారధాన్యాల ఉత్పత్తి 152.4 మిలియన్ల టన్నులు. ఏడవ పంచవర్ష ప్రణాళికా కాలంలోకూడా ఆహారధాన్యాల ఉత్పత్తి ప్రశంసనీయమైన స్థాయిని అంటే 171.0 మిలియన్ల టన్నులకు చేరుకొంది. 8వ పంచవర్ష ప్రణాళికా కాలంలో ఆహారధాన్యాల ఉత్పత్తి 199.0 మిలియన్ల టన్నులు.

వివిధ పంచవర్ష ప్రణాళికల కాలంలో మిగతా రంగాలు కూడా గణనీయంగా పురోభివృద్ధిని సాధించాయి. ఉదాహరణకు, కనీస సౌకర్యాల రంగం, ప్రభుత్వ రంగం ఆకర్షణీయమైన ప్రగతిని సాధించాయి. 1951 - 1996 మధ్య కాలంలో దేశంలో 9,300 కిలోమీటర్ల రైల్వే లైన్ల నిర్మాణం జరిగింది. 1956 - 57లో 2.26 కోట్ల హెక్టార్ల భూమికి మాత్రమే సాగునీరు సౌకర్యం ఉండగా, 1996 - 97 నాటికి ఈ భూమి విస్తీర్ణం 8.94 కోట్ల హెక్టార్లకు చేరుకుంది. ఇదేవిధంగా 1956 - 57లో విద్యుచ్ఛక్తి ఉత్పత్తి 3,400 మెగావాట్లు ఉండగా, 1997లో 96,100 మెగావాట్లకు చేరుకుంది. వివిధ పంచవర్ష ప్రణాళికల్లో కనపరచిన ప్రాధాన్యత కారణంగా ప్రస్తుతం ప్రభుత్వ రంగం దేశ ఆర్థికవ్యవస్థను శాసించగల స్థాయిలో ఉంది.

ఈ విధంగా భారతదేశంలో స్వాతంత్ర్యానంతర కాలంలో చేపట్టిన ప్రణాళికా విధానం అనేక సత్ఫలితాలను సమకూర్చింది. దేశం వివిధ రంగాలలో గణనీయస్థాయిలో పురోగమించ గలిగింది. దీనిఫలితంగా దేశ ఆర్థిక వ్యవస్థ పురోగమన మార్గంలో ముందంజ వేస్తున్నది. ఈ విధంగా ఇప్పటివరకు ప్రణాళికా వ్యూహం సాధించిన విజయం గణనీయమైంది. అయినప్పటికీ దీని వలన దేశ ఆర్థిక వ్యవస్థ పరిపూర్ణ వికాసాన్ని సంతరించుకొని పటిష్టవంతంగా ఉందని భావించటం సమంజసం కాదు.

భారతదేశం ప్రణాళికా విధానంలో అనేక లోపాలు ఉండటం వలన గత ఐదు దశాబ్దాల ప్రణాళికావ్యూహం ఫలవంతంకాలేదని విమర్శింపబడింది. అశోక్‌రుద్ర అనే ఆర్థిక శాస్త్రవేత్త భారతదేశంలో ప్రణాళికా విధానం విఫలమైందనీ, దీనికి అనేక కారణాలు దోహదం చేసాయని వాదించాడు. భారతదేశం అనుసరిస్తున్న బహుళ రంగాలపై ప్రాధాన్యతను కనపర్చే వ్యూహం లోభూయిష్టమైంది. ఈ వ్యూహం దేశ ఆర్థిక వ్యవస్థకు సంబంధించిన కొన్ని కీలక అంశాలను నిర్లక్ష్యపరచింది. అంతేకాక ప్రణాళికా నమూనా మానవ వనరుల రంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. ప్రధానంగా విద్య, ఆరోగ్య రంగాలను నిర్లక్ష్యం చేయటం దేశ ఆర్థికాభివృద్ధిపై వ్యతిరేక ప్రభావాన్ని కనపరిచింది. దీనితోపాటు ధరలు, సాంకేతిక మార్పుల రంగాలపై తగిన ప్రాధాన్యతను కనపరచకపోవటం కూడా దేశ ఆర్థికాభివృద్ధిని కుంటుపరిచిందని అశోక్‌రుద్ర వివరించాడు. అశోక్ రుద్ర అభిప్రాయం ప్రకారం ప్రణాళికీకరణ రాజకీయ వ్యూహం దోషపూరితమైంది. క్రమంగా ప్రభుత్వరంగం ఆశించిన విధంగా అభివృద్ధిచెంది ప్రణాళికా బద్ధమైన ఆర్థిక వ్యవస్థ, కీలకాంశంగా రూపొందుతుందనే భారతప్రణాళికా కర్తల ఊహకు తగిన ఆధారం లేదని అశోక్‌రుద్ర వివరించాడు. అంతిమంగా ప్రభుత్వరంగం రాజకీయఅధికారాన్ని నియంత్రించే అన్ని వర్గాలపై ఆధారపడుతుందని అశోక్‌రుద్ర బలంగా వాదించాడు. భారతదేశ ప్రణాళికలపై మరో ప్రధాన విమర్శ ఏమిటంటే - వివిధ పంచవర్ష ప్రణాళికలు సామాజిక రంగంపై ఆశించినంతగా దృష్టిని కేంద్రీకరించలేదు. దాని ఫలితంగా దేశంలో పేదరికం, ఆర్థిక, సామాజిక వ్యత్యాసాలు క్షీణించలేదు. బలహీనవర్గాల పరిస్థితులు సంతృప్తికరంగా మెరుగుపడలేదు. సుఖమోయి చక్రవర్తి అనే ప్రసిద్ధ ఆర్థిక శాస్త్రవేత్త భారతదేశంలో ప్రణాళికీకరణ విఫలమవటానికి ప్రణాళిలకల అమలులో కల లోపమే ప్రధాన కారణమని పేర్కొన్నాడు. సుఖమోయి చక్రవర్తి ప్రణాళికీకరణ అమలులోగల మూడు ప్రధాన లోపాలను గుర్తించాడు.

అవి : 1) ప్రణాళికా అధికారులు ప్రణాళికల రూపకల్పనకు, అమలుకు అవసరమయిన ఖచ్చితమైన సమాచారాన్ని సేకరించటంలో విఫలమయ్యారు. 2) ప్రణాళికా కర్తలు దేశంలో సంభవిస్తున్న వివిధ మార్పులకు సమర్ధవంతంగా స్పందిచటంలో విఫలమయ్యారు. 3) ప్రణాళికలను అమలు పరిచేందుకు ఏర్పరచిన సంస్థలకు ప్రణాళికలను సమర్ధవంతంగా అమలుపరచే సామర్థ్యం, ప్రతిభ లోపించాయి. ఈ మూడు ప్రధాన లోపాలు పంచవర్ష ప్రణాళిక సమర్థవంతంగా అమలుపరచటంలో అవరోధాలుగా రూపొందాయనీ, ఫలితంగా అవి ఆశించిన ఫలితాలను సమకూర్చటంలో విఫలమయ్యాయని అశోక్‌రుద్ర సూచించారు.

## 13.11 ప్రణాళికీకరణ - రాజకీయాలు :

1950 దశాబ్దంలో దేశంలో ప్రణాళికీకరణ ప్రక్రియ ప్రారంభమయ్యాక ప్రాధాన్యత వస్తువుల చుట్టూ కేంద్రీకృతం ' (Commodtty Centered) అనే దృక్పధం పట్ల ఏకాభిప్రాయం వ్యక్తమైంది. దీనికి అనుగుణంగా తక్కువ ఉపయోగాల కంటె ఎక్కువ ఉపయోగాలు మెరుగనే, దేశంలో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరచటానికి ఎక్కువ పరిమాణంలో పెట్టుబడి అవసరం అనే అభిప్రాయం వ్యక్తమైంది. దీని ఫలితంగా అభివృద్ధి ప్రక్రియలో వనరుల సమీకరణ (accumulation) కు అత్యధిక ప్రాధాన్యత ఏర్పడింది. అయితే చట్టబద్దత (Legitimation) అవసరం అని కూడ గుర్తించారు. స్వాతంత్ర్యానంతరం దేశం వయోజన ఓటింగ్ ప్రాతిపదిక కల ప్రాతినిధ్య వ్యవస్థ ఏర్పడటం దేశ రాజకీయ ఆశయాలను, ఆర్థిక ఆశయాలను కూడా ఘాఢంగా ప్రభావితం చేసింది.

సమీకరణ, చట్టబద్ధత అనే ఈ రెండు లక్ష్యాలు ప్రణాళికీకరణ సామాన్య ప్రజలను పారిశ్రామికీకరణ విధానం విధించే అనవసరమైన నిర్బంధంన్నుంచి తప్పించే సాధనం కావాలి. రెండు ప్రణాళికీకరణ అనేక భిన్నత్వాలు కలిగిన భారతదేశంలో సంఘర్షణను తొలగించే సకారాత్మక సాధనం కావాలి. ఈ రెండు, పరిణామాలు భారతదేశంలో రాజ్యవ్యవస్థ ప్రణాళికీకరణల మధ్య సంబంధాన్ని నిర్ధారించాయని పార్ధ ఛటర్జీ వంటి రాజనీతి శాస్త్రవేత్తలు పేర్కొనటం జరిగింది.

ప్రణాళికీకరణ, చట్టబద్ధతల మధ్య సంబంధాలను రెండవ, మూడవ పంచవర్ష ప్రణాళికలు ఉద్ఘాటించాయి. ఈ రెండు పంచవర్ష ప్రణాళికలు ప్రభుత్వ రంగంలో అధిక పెట్టుబడితో, నూతన పారిశ్రామిక రంగం, ప్రైవేటు రంగంలో సాధారణమైన వినిమయదారీ వస్తువులను ఉత్పత్తిచేసే పరిశ్రమలకు, ప్రైవేటు వ్యవసాయరంగం అభివృద్ధిపై దృష్టిని కేంద్రీకరించాయి. మొదటి, రెండు ఆధునిక రంగాలకు విదేశీ పెట్టుబడులు, తక్కువ వడ్డీలుకల ఋణాలు, ప్రైవేటు వ్యక్తులపై పన్నులను విధించటం ద్వారా ఆర్థిక సహాయం అందచేయబడింది. మూడవ రంగమైన వ్యవసాయ రంగాన్ని ప్రాధాన్యత లేని రంగంగా పరిగణించారు. ఈ రెండు ప్రణాళికలు అనుసరించిన అభివృద్ధి వ్యూహం ప్రధాన లోపమైంది. కొందరు నిపుణుల అభిప్రాయం ప్రకారం రెండవ, మూడవ పంచవర్ష ప్రణాళికలు వ్యవసాయ రంగంపై ఎటువంటి వ్యూహాన్ని రూపొందించలేదు. అంతేకాక సాంప్రదాయ రంగమైన వ్యవసాయ రంగం అతి చౌకగా కార్మికులను, ఆహార పదార్ధాలను సరఫరా చేయటం ద్వారా పారిశ్రామికీకరణ తోడ్పడుతుందని ఆశించటం జరిగింది. ఈ విధమైన హేతుబద్ధం కాని వ్యూహాన్ని అనుసరించటం వల్ల 1960 దశాబ్దం మధ్యకాలంలో ప్రణాళికీకరణ సంక్షోభాన్ని ఎదుర్కొనటానికి కారణమైందని వీరి అభిప్రాయం.

కొందరు రాజనీతి శాస్త్రవేత్తలు స్వాతంత్ర్యానంతరం భారతదేశం ఇతర అభివృద్ధి చెందుతున్న దేశాల పంథాలో స్తబ్ద విప్లవం (Passive Revolution) మార్గాన్ని అనుసరించిందనే అభిప్రాయాన్ని వ్యక్తపరిచారు. దేశంలో నూతనంగా అవతరించిన రాజకీయ నాయకత్వం నూతన సమాజం డిమాండ్లను సంస్కరణ దృక్పధం ద్వారా అంచెలంచెలుగా తృప్తిపరచటం ఈ స్తబ్ద విప్లవం కీలకాంశం. ప్రణాళికీకరణ ఈ ప్రక్రియలో మార్పులను హేతుబద్దీకరించే మార్గంగా అవతరించింది. భారతదేశం

అనుసరించిన అభివృద్ధి వ్యూహంలో ఆధునికరంగం కీలకమైన అంశం. ఆధునిక రంగం నుంచే పారిశ్రామికీకరణ ఉత్పన్నమైంది. ఈ విధమైన పరిమాణం దేశ సాధారణ లక్ష్యంగా వ్యక్తమైంది. 1950 దశాబ్దంలో భూసంస్కరణలను ప్రవేశపెట్టకపోవటం ప్రణాళికీకరణ లేదా రాజకీయ వ్యవస్థ దోషం కాదు. అప్పుడు దేశం ఉన్న పరిస్థితులలో స్తబ్ద విప్లవం సైద్ధాంతిక భావజాలం సమాజంలో వ్యక్తుల ద్వారా నిర్వహింపబడుతున్న ప్రాతినిధ్య రాజకీయ వ్యవస్థనేకాక పెట్టుబడిదారీ పూర్వ సమాజం మొత్తం నిర్మాణాలను పురాతన చట్రంలో చేర్చుకోవాలని ప్రయత్నించటం దానికి కారణం. ఈ నేపథ్యంలోనే 1950, 60 దశాబ్దాలలో దేశంలోని గ్రామీణ ప్రాంతాల ప్రజలందరూ ఉమ్మడిగా అనుభవించే ఫలితాలను సమకూర్చగలిగిన సముదాయక అభివృద్ధి ప్రాజెక్టును ప్రవేశపెట్టారు.

ఈ దశలో దేశంలో సంభవించిన హేతుబద్ధమైన ప్రణాళికీకరణ, హేతుబద్ధంకాని (Irrational) రాజకీయాలు అనే రెండు ప్రక్రియలు స్తబ్ద విప్లవ నిర్వహణ తార్కికతతో విడదీయలేని అంశాలుగా రూపొందాయి. ఈ వాదనలోని విరోధాభాసమైంది ఏమిటంటే రాజకీయ ప్రక్రియ హేతుబద్ధరాహిత్యం. ప్రణాళికల హేతుబద్ధ అమలుకు తార్కికతను సమకూర్చటం. ప్రణాళిక కర్తలు, ప్రణాళికీకరణను; సంఘర్షణను; నిర్ధారించే సాధనంగా పరిగణిస్తే; రాజకీయ వ్యవస్థ ప్రణాళికా విధానాన్ని స్తబ్ద విప్లవానికి అవసరం అయిన అంగీకారాన్ని సమకూర్చు సాధనంగా పరిగణించింది. ఈ పరిస్థితులలో హేతుబద్ధమైన ప్రణాళికీకరణ సామాజిక న్యాయంతో కూడిన అభివృద్ధి అనే తన నినాదాన్ని కొనసాగించేందుకు రాజకీయ నాయకత్వానికి తోడ్పడటం ఆశ్చర్యం కాదు. ఏమైనప్పటికీ భారతదేశంలో హేతుబద్ధమైన ప్రణాళికీకరణ రాజకీయ ప్రక్రియలతో సంబంధం లేకుండా కొనసాగుతూ, మొత్తం సమాజం సార్వత్రిక స్ఫూర్తిని ఇముడ్చుకొన్న భారతదేశం అభివృద్ధి రాజ్యతత్వాన్ని నిర్వహించటంలో ప్రధాన పాత్రను నిర్వహిస్తున్నది. రాజకీయ నాయకులు తమ పాలనకు ప్రజల మద్దతును పొందేందుకు తగిన విధంగా ప్రణాళికీకరణను తీర్చిదిద్దేందుకు ప్రయత్నిస్తున్నారు అనటం వాస్తవం.

## 13.12 సారాంశం :

ఈ పాఠంలో వివరించినట్లు భారతదేశంలో సామాజిక, ఆర్థిక ప్రగతి సాధించే ప్రధాన వ్యూహంగా ప్రణాళికీకరణ విధానం సుస్థిరపడింది. ఇప్పటివరకు అమలుపరచిన తొమ్మిది పంచవర్ష ప్రణాళికలు అనేక విజయాలను సాధించినప్పటికీ, ఆశించిన లక్ష్యాలకు సుదూరంలో ఉంది. దేశంలోని ప్రణాళికా విధానం ప్రజాస్వామ్య రాజకీయాల స్వభావం, పార్టీ వ్యవస్థ, రాజకీయ సంస్కృతి, సమాఖ్య విధానం అనే రాజకీయ చట్రంలో పనిచేయవలసి రావటం ప్రణాళికీకరణ వైఫల్యాలకు ప్రధాన కారణమని నిపుణుల అభిప్రాయం. రాజకీయ పరిసరాలే ప్రణాళికల విజయానికి అవరోధంగా పరిణమించాయని వీరి వాదన. నెహ్రూ అనంతర కాలంలో కాంగ్రెస్ పార్టీ,అధికారంలోకి వచ్చిన ఇతర రాజకీయపార్టీల దృక్పథం ప్రణాళికీకరణ ప్రగాఢంగా ప్రభావితం చేసింది. ఏడవ పంచవర్ష ప్రణాళిక వరకు వివిధ ప్రణాళికలు దాదాపు సమానమైన లక్ష్యాలను, ప్రాధాన్యతలను ఏర్పరచుకొన్నప్పటికీ, ఏడో పంచవర్ష ప్రణాళికా అనంతరం ప్రణాళికల్లో ఈ లక్ష్యాలు ప్రాధాన్యతలు మౌలిక మార్పులకు గురిఅయ్యాయి. 1990 దశాబ్దంలో ప్రభుత్వం చేపట్టిన సరళీకృత ఆర్థిక విధానాలు ప్రణాళికీకరణపై తీవ్రమైన ప్రభావాన్ని కనపరచాయి. దీని ఫలితంగా ఏడో పంచవర్ష ప్రణాళిక నుంచి పంచవర్ష ప్రణాళికల లక్ష్యాలు, ప్రాధాన్యతలో మార్పు సంభవించింది. ఏమైనప్పటికీ సరళీకృత ఆర్థిక విధానాల నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పాత్రను పునర్ నిర్వచించాల్సి ఉంది. ఈ ప్రక్రియలో ప్రణాళికీకరణ లక్ష్యాలు, ప్రాధాన్యతలు, యంత్రాంగం, ప్రణాళికల రూపకల్పన అమలులో తగిన మార్పులను ప్రవేశపెట్టడం కీలక అంశం. ప్రణాళిక అవసరాలను సమాఖ్య ప్రజాస్వామ్యం అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దాలి. మారుతున్న రాజకీయ పరిస్థితి అనుగుణంగా ప్రణాళికీకరణను వికేంద్రీకరించి, ఈ ప్రక్రియలో రాష్ట్రాలకు సముచితమైన పాత్రను కల్పించాలి.

ఇవి జరగనపుడు భవిష్యత్తులో ప్రణాళికీకరణ తీవ్రమైన అవరోధాలను ఎదుర్కొనటంతోపాటు కేంద్ర రాష్ట్రాల మధ్య సంఘర్షణ తలెత్తే అవకాశం ఉంది. ఏమైనా ప్రస్తుత సంకీర్ణ ప్రభుత్వాల యుగంలో ప్రణాళికీకరణ సంభవించి, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఏకాభిప్రాయ సాధన సాధ్యమే.

## 13.13 మాదిరి ప్రశ్నలు :

1. భారతదేశంలో ప్రణాళికీకరణ తీరుతెన్నులను పరిశీలించండి.
2. భారతదేశంలో ప్రణాళికీకరణ యంత్రాంగం నిర్వర్తనను వివరించండి.
3. భారతదేశంలో పంచవర్ష ప్రణాళికల విజయాలను, వైఫల్యాలను విశ్లేషించండి.
4. భారతదేశంలో ప్రణాళికీకరణ రాజకీయ అంశాలను చర్చించండి.

## 13.14 చదువదగిన గ్రంథాలు :


1. Paul R. Brass, The Politics of India, since Independence, Cambridge : Cambridge University Press, 1990 (2nd Edition).
2. Bipin Chandra and others, India After Independence - 1947 - 2000, New Delhi, Penguin Books, 2000.
3. Atul Kohli (ed.), The Success of India's Democracy, Cambridge : Cambridge University Press, 2001.
4. Rajani Kothari, Politics in India, Bostan : Little Brown and Company, 1970.
5. Rajani Kothari, Caste in Indian Politics, New Delhi : Orient Logman, 1970.
6. Sudipta Kavi Raj (ed.) New Delhi : Oxford University Press, 1997.
7. A.P. Avasthi, Indian Political System, Agra : Lakshminarain Agarwal, 2002.


**రచయిత : ప్రొఫెసర్. ఎమ్. బాపూజీ**

పాఠం - 14

# ఎన్నికల రాజకీయాలు - ఎన్నికల ప్రవర్తన

(Electoral Politcs - Electoral Behaviour)

**విషయసూచిక**


**14.0** లక్ష్యం

**14.1** ఉపోద్ఘాతం

**14.2.** భారతదేశంలో ఎన్నికలు కొన్ని ప్రధాన అంశాలు

**14.3** ఎన్నికలు - రాజకీయ పార్టీలు

**14.4** ఎన్నికలు - ఎన్నికల ప్రవర్తన : సైద్ధాంతిక అంశాలు

**14.5** భారతదేశంలో ఎన్నికల ప్రవర్తన

**14.6** ఎన్నికల రాజకీయాలు - మతం ప్రభావం

**14.7** ఇతర కారకాల ప్రభావం

**14.8** సారాంశము

**14.9** మాదిరి ప్రశ్నలు

**14.10** చదువదగిన గ్రంథాలు


## 14.0 లక్ష్యం :

భారతదేశంలో ఎన్నికల ప్రక్రియ, రాజకీయాలు, ఎన్నికలలో వివిధ సామాజిక రాజకీయ అంశాలు, నిర్వహిస్తున్న పాత్ర మొదలైన అంశాలపై విద్యార్థులకు సమగ్రమైన అవగాహనను ఏర్పరచటం ఈ పాఠం ప్రధాన లక్ష్యం. ఈ పాఠం ఈ క్రింది అంశాలపై తన చర్చను కేంద్రీకరిస్తుంది.

1) ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎన్నికల ప్రాధాన్యత
2) భారతదేశంలో ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన విభిన్న అంశాలు
3) భారతదేశంలో ఎన్నికలలో రాజకీయ, సామాజిక అంశాలు నిర్వహిస్తున్న పాత్ర
4) భారతదేశ ఎన్నికలపై వివిధ సామాజిక శాస్త్రవేత్తల పరిశోధనా ఫలితాలు

## 14.1 ఉపోద్ఘాతం :

ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎన్నికలకు కీలకమైన స్థానం ఉంది. ఒకవిధంగా ఎన్నికలు ప్రజాస్వామ్య వ్యవస్థతో విడదీయలేని అంతరభాగంగా పెనవేసుకుపోయాయి. ఈ వాస్తవం ప్రజాస్వామ్య దేశమైన భారతదేశానికి వర్తిస్తుంది. స్వాతంత్ర్యానంతరం భారతదేశంలో పార్లమెంట్‌కు, వివిధ రాష్ట్రాల శాసనసభలకు నిర్ణీత కాలవ్యవధిలో ఎన్నికలు జరుగుతున్నాయి. ఈ ఎన్నికలలో అనేక రాజకీయ పార్టీలు పాల్గొంటున్నాయి. ఎన్నికలే భారతీయ రాజకీయ వ్యవస్థ స్వరూపాన్ని తీర్చిదిద్దాయి. అనేక కారణాల వల్ల

భారతదేశంలో ఎన్నికల ప్రక్రియ సంక్లిష్టంగా రూపొందింది. దీనికి ఎన్నికలను రాజకీయ అంశాలతోపాటు అనేక రాజకీయేతర అంశాలు ప్రగాఢంగా ప్రభావితం చేయడమే కారణం. ఈ విధంగా భారతదేశంలో ఎన్నికలు సంక్లిష్టతను సంతరించుకోవటం వల్ల ఈ ఎన్నికలు పాశ్చాత్య, దేశీయ సామాజిక శాస్త్రవేత్తల దృష్టినాకర్షించాయి. అనేకమంది పాశ్చాత్య, భారతదేశ రాజనీతి శాస్త్రవేత్తలు, ఇతర సామాజిక శాస్త్రవేత్తలు ఎన్నికలపై తమ దృష్టినిసారించి, వాటిని నిశితంగా, నిగూడంగా పరిశీలించి, ఈ ప్రక్రియపై అనేక భావనలను, సిద్ధాంతాలను, ఊహనలను ప్రతిపాదించారు. ప్రధానంగా సామాజిక శాస్త్రవేత్తలు ఎన్నికలలో వివిధ రాజకీయ సామాజిక అంశాలు నిర్వహిస్తున్న పాత్ర, ఓటర్ల ప్రవర్తనపై ఈ అంశాల ప్రభావంపై తమ దృష్టిని కేంద్రీకరించారు. ఈ విధంగా భారతదేశంలో ఎన్నికల రాజకీయాలపై గణనీయమైన స్థాయిలో సాహిత్యం అభివృద్ధి చెందింది. భారతదేశ రాజకీయ ప్రక్రియను, అభివృద్ధిని అవగాహన చేసుకునేందుకు ఎన్నికలను అధ్యయనం ఆవశ్యకం. ఈ అధ్యయనానికి ఎన్నికలపై కల సాహిత్యం ఎంతగానో తోడ్పడుతున్నది.

## 14.2. భారతదేశంలో ఎన్నికలు కొన్ని ప్రధాన అంశాలు :

బ్రిటీషు పార్లమెంటరీ వ్యవస్థలోలాగే భారతదేశ పార్లమెంటులోని దిగువ సభ అయిన లోక్‌సభకు ప్రతి **5** సంవత్సరాలకు ఒకసారి ఎన్నికలు జరగాలి. అయితే ఐదు సంవత్సరాల గడువు ముగియక ముందే ప్రధానమంత్రి సలహాలపై రాష్ట్రపతి లోక్‌సభను రద్దుపరచి, ఎన్నికలను ఆదేశించవచ్చును. ఎన్నికల నిర్వహణకు సంబంధించిన అన్ని వ్యవహారాలను నిర్వహించేందుకు భారత రాజ్యాంగం సృష్టించిన ఎన్నికల సంఘం అనే స్వయం ప్రతిపత్తికలిగిన సంస్థ ఉంది. **1971**లో లోక్‌సభకు మధ్యంతర ఎన్నికలను నిర్వహించేటంత వరకు లోక్‌సభకు, దేశంలోని వివిధ రాష్ట్రాల శాసనసభలకు ఒకేసారి సాధారణ ఎన్నికలను నిర్వహించే పద్దతి అమలులో ఉండేది. అయితే **1971** లోక్‌సభ ఎన్నికల అనంతరం లోక్‌సభకు, శాసనసభలకు విడివిడిగా ఎన్నికలను నిర్వహించడం ప్రారంభమైంది. అయితే కొన్ని సందర్భాలలో లోక్‌సభకు కొన్ని రాష్ట్రాల శాసనసభలకు ఒకేసారి ఎన్నికలను నిర్వహించడం జరుగుతున్నది.

ప్రస్తుతం భారతదేశంలో ఏకసభ్య నియోజకవర్గాలు ఎన్నికల మౌలికకేంద్రం. దేశంలోని కొన్ని శాసనసభల నియోజకవర్గాలను లోక్‌సభ నియోజక వర్గాలలోని కొంత శాతాన్ని షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగలకు కేటాయించారు. ఈ నియోజకవర్గాలలో కేవలం సంబంధిత వర్గానికి చెందిన అభ్యర్థులు మాత్రమే పోటీ చేయాల్సి ఉంటుంది. అయితే ఈ నియోజకవర్గాలలోని వయోజనులందరూ ఓటు చేయడానికి అర్హులు. ప్రస్తుత జనాభా ప్రాతిపదిక మీద దేశంలో మొత్తం లోక్‌సభ, శాసనసభ నియోజకవర్గాలలో **15** శాతం షెడ్యూల్డు కులాలకు, **7** శాతం షెడ్యూల్డ్ తరగతులకు, అంటే మొత్తం **22** శాతం నియోజకవర్గాలను ఈ రెండు వర్గాల ప్రజలకు కేటాయించారు. ప్రస్తుత దేశంలో **542** లోక్‌సభ నియోజక వర్గాలు, **4061** శాసనసభ స్థానాలు ఉన్నాయి. ప్రతి ఏడు శాసనసభ నియోజకవర్గాలను కలిపి ఒక లోక్‌సభ నియోజకవర్గంగా ఏర్పాటుచేశారు. ఒక రాష్ట్రంలో లోక్‌సభ స్థానాలసంఖ్య ఆ రాష్ట్ర జనాభాపై ఆధారపడి ఉంటుంది. అందుచేత లోక్‌సభాస్థానాల సంఖ్యలో వివిధ రాష్ట్రాల మధ్య వ్యత్యాసం ఉంది. భారతదేశంలోని నియోజక వర్గాలలో అధిక శాతం గ్రామీణ ప్రాంతాలలో ఉన్నాయి. భారతీయులలో అధిక శాతం ప్రజలు ఇప్పటికీ చదవటం తెలియని నిరక్షరాస్యులు కావటం వల్ల ఎన్నికలలో పోటీచేసే ప్రతి అభ్యర్థికి ఒక ప్రత్యేకమైన గుర్తును కేటాయిస్తున్నారు.

భారతదేశంలో స్వాతంత్ర్యానంతరం **1952**లో మొట్టమొదటి సాధారణ ఎన్నికలను నిర్వహించారు. అప్పటినుంచి ప్రస్తుతం అంటే **2004** వరకు **13** సార్లు లోక్‌సభకు, ఇంచుమించుగా అదే సంఖ్యలో వివిధ రాష్ట్రాల శాసనసభలకు ఎన్నికలు నిర్వహించబడ్డాయి. కొన్ని సందర్భాలలో లోక్‌సభకు, అనేక రాష్ట్రాల శాసనసభలకు నిర్ణయించిన గడువు ముగియక ముందే ఎన్నికలను నిర్వహించడం జరిగింది.

భారత రాజ్యాంగం దేశంలోని 18 సంవత్సరాలు నిండిన ప్రతి వ్యక్తికి ఓటు హక్కు కల్పించింది. 1952లో నిర్వహింపబడిన మొదటి సాధారణ ఎన్నికల సమయంలో దేశంలోని మొత్తం ఓటర్ల సంఖ్య 17.2 కోట్లు కాగా, 1998లో లోక్‌సభ ఎన్నికలనాటికి వారిసంఖ్య 60.58 కోట్లకు చేరుకుంది. ఇప్పటివరకు జరిగిన ఎన్నికలలో మొత్తం ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించటం జరుగలేదు. అనేక కారణాల వల్ల అనేక మంది ఓటర్లు ఎన్నికలలో ఓటు వేయకపోవటం జరుగుతున్నది. ప్రభుత్వ నివేదికల ప్రకారం ఇప్పటి వరకు జరిగిన లోక్‌సభ ఎన్నికలలో సగటున 56.6 శాతం ఓటర్లు ఓటు చేసినట్లు అంచనా. వివిధ ఎన్నికలలో ఓటు హక్కును వినియోగించుకున్న ఓటర్ల శాతం మొట్టమొదటి ఎన్నికలలో 47.5 శాతం ఉండగా, అది 1991 లోక్‌సభ ఎన్నికలలో 56.7 శాతానికి పెరిగింది. 1984లో జరిగిన లోక్‌సభల ఎన్నికలలో అత్యధిక శాతం అంటే 64.1 శాతం ఓటర్లు తాము ఓటు హక్కును వినియోగించుకున్నారు. మొట్టమొదటి ఎన్నికలలో అతి తక్కువశాతం ఓటర్లు ఓటు వేయగా, క్రమంగా ఈ ఓటర్ల శాతం వృద్ధిచెందటం గమనించవచ్చును. ఈ విధంగా ఎన్నికలలో ఓటు చేసే ఓటర్ల సంఖ్య క్రమంగా పెరగటం ఎన్నికల వ్యవస్థ పట్ల, తమ ఓటు శక్తిపట్ల ఓటర్లలో పెరుగుతున్న చైతన్యాన్ని సూచిస్తుందని రాజనీతి శాస్త్రవేత్తలు పేర్కొన్నారు.

స్వాతంత్ర్యానంతరం ఎన్నికలలో పాల్గొంటున్న ఓటర్ల సంఖ్య పెరగటంపై మైనర్ వీనర్ ఈ విధంగా వ్యాఖ్యానించాడు. ఎన్నికలలో పాల్గొనే ఓటర్ల సంఖ్య దేశంలోని అన్ని ప్రాంతాలలో పెరుగుతూ వస్తున్నది. అంతేకాక ఈ ధోరణి గ్రామీణ, పట్టణ ప్రాంతాల ఓటర్లలో, షెడ్యూల్డు కులాలు, తెగల ఓటర్లలో సమానంగా గోచరిస్తున్నది. అయినప్పటికీ వివిధ రాష్ట్రాల మధ్య వ్యత్యాసం యధాతధంగా కొనసాగుతున్నది. ఏమైనప్పటికీ ఎన్నికలలో పాల్గొనే ఓటర్ల సంఖ్య పెరగటానికి ఎక్కువ సంఖ్యలో పోలింగ్ కేంద్రాలను ఏర్పరచటం, వివిధ రాజకీయ పార్టీలు ఓటర్లను సమీకరించటంలో ఎక్కువ సామర్థ్యాన్ని ప్రదర్శించటం, ప్రజలలో రాజకీయ చైతన్యం పెరగటంవంటి అనేక కారణాలు ఉన్నాయి. ఈ కారణాలు అన్ని రాష్ట్రాలకు దాదాపు సమానంగా వర్తిస్తాయి. అయినప్పటికీ ఎన్నికలలో పాల్గొంటున్న ఓటర్ల సంఖ్య విషయంలో వివిధ రాష్ట్రాల మధ్య ఉన్న భిన్నత్వం ఎలాంటి మార్పులేదు.

1952 నుండి 1999 వరకు నిర్వహించబడిన లోక్‌సభ, వివిధ శాసనసభల ఎన్నికలలో మహిళా ఓటర్ల కంటే పురుషుల ఓటర్లే ఎక్కువ సంఖ్యలో పాల్గొంటున్నట్లు అంచనాలు తెలుపుతున్నాయి. కానీ ఓటు వేసేవారి శాతం పురుషులలో కంటే మహిళలలో వేగంగా పెరుగుతున్నది. 1957లో మొత్తం మహిళా ఓటర్లలో 38.8 శాతం ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకోగా, 1989లో నిర్వహించబడిన లోక్‌సభ ఎన్నికలలో వారి శాతం దాదాపు 20 శాతం అంటే 57.3 శాతానికి పెరిగింది. అయితే 1991 లోక్‌సభ ఎన్నికలలో పాల్గొన్న మహిళా ఓటర్ల శాతం 51.4 శాతానికి క్షీణించింది. 1957 ఎన్నికలలో మొత్తం పురుషుల ఓటర్లలో 55.8 శాతం ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోగా, 1991 లోక్‌సభ ఎన్నికలలో ఓటువేసిన పురుష ఓటర్లశాతం 61.6 శాతం అంటే 1957 నుండి 1991 ఎన్నికల మధ్యకాలంలో ఓటుహక్కు వినియోగించుకొన్న పురుష ఓటర్లు కేవలం 5 శాతం పెరిగారు

వివిధ ఎన్నికలలో గ్రామీణ ఓ టర్ల కంటే పట్టణ ప్రాంతాలలోని ఓటర్లే ఎక్కువ సంఖ్యలో ఓట్లు వేస్తున్నారని నివేదికలు తెలుపుతున్నాయి. ఈ రెండు ప్రాంతాల ఓటర్ల మధ్య 6 శాతం నుంచి 8 శాతం వ్యత్యాసం ఉంది. రాష్ట్రాల వారీగా ఎన్నికలలో పాల్గొనే ఓటర్ల సంఖ్యను విశ్లేషిస్తే, ఉత్తరాది రాష్ట్రాల కన్నా, దక్షిణాది రాష్ట్రాలలోనే ఎక్కువ సంఖ్యలో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకుంటున్నట్లు తెలుస్తున్నది. ఉత్తరాది రాష్ట్రాలలో పశ్చిమ బెంగాల్‌లో ఎక్కువ సంఖ్యలో ఓటర్లు ఎన్నికలలో ఓటు చేస్తున్నారు. దేశం మొత్తం మీద అత్యధిక అక్షరాస్యతా శాతం ఉన్న కేరళలో అత్యధిక శాతం ఓటర్లు ఎన్నికలలో ఓటుచేస్తున్నారు. కేరళలో నిర్వహించిన వివిధ ఎన్నికలలో సగటున 70 శాతం ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నట్లు గణాంకాలు తెలుపుతున్నాయి.

## 14.3 ఎన్నికలు - రాజకీయ పార్టీలు :

భారతదేశంలోని ఎన్నికల రాజకీయాలకు ఒక ప్రధాన లక్షణం ఈ ఎన్నికలలో పాల్గొనే పార్టీల సంఖ్య క్రమంగా క్షీణించటం. మొట్టమొదటి సాధారణ ఎన్నికలలో (1957) మొత్తం 72 గుర్తింపు పొందిన రాజకీయపార్టీలు పాల్గొనగా, 1991 లోక్‌సభ ఎన్నికలలో వీటి సంఖ్య 36 శాతానికి క్షీణించింది. 1957 నుంచి 1991 వరకు జరిగిన ఎన్నికలలో పాల్గొన్న మొత్తం రాజకీయ పార్టీల సంఖ్య 28 కి మించలేదు. వివిధ ఎన్నికలలో పాల్గొన్న రాజకీయపార్టీలలో జాతీయ పార్టీల కంటే రాష్ట్రస్థాయి పార్టీల సంఖ్యే అధికం. 1952 సాధారణ ఎన్నికలలో పాల్గొన్న 74 రాజకీయ పార్టీలలో జాతీయపార్టీల సంఖ్య 14 మాత్రమే. మిగిలిన 60 పార్టీలు రాష్ట్రస్థాయి పార్టీలు. దీని తరువాత నిర్వహింపబడిన ఎన్నికలలో పాల్గొన్న జాతీయపార్టీల సంఖ్య 4 నుంచి 9 వరకు ఉంది. అంటే ఏ ఎన్నికలలో ఈ పార్టీల సంఖ్య 9 కి మించలేదు. మొత్తం మీద మొట్టమొదటి సాధారణ ఎన్నికలలో అత్యధిక సంఖ్యలో జాతీయస్థాయి, రాష్ట్రస్థాయి రాజకీయ పార్టీలు పాల్గొన్నాయి.

భారతదేశంలో వివిధ ఎన్నికలలో పాల్గొనే రాజకీయ పార్టీల సంఖ్య తక్కువగా ఉన్నప్పటికీ, ఎన్నికలలో పోటీ చేసే అభ్యర్థుల సంఖ్య మాత్రం అధికంగానే ఉంటున్నది. అంతేకాక వీరి సంఖ్య క్రమంగా పెరుగుతూ వస్తున్నది. మొట్టమొదటి లోక్‌సభ ఎన్నికలలో మొత్తం 1864 మంది అభ్యర్థులు పోటీచేయగా, 1980 ఎన్నికలలో వారి సంఖ్య 4,620కు, 1991 ఎన్నికలలో 8,699, 1996లో 13,593, 1998 ఎన్నికలలో 4,750 కు పెరిగింది. ఇదే విధంగా వివిధ రాష్ట్రాల శాసనసభలకు పోటీచేసే సభ్యుల సంఖ్యలో గణనీయమైన వృద్ధి సంభవించింది. ఈ విధంగా పార్లమెంటు, శాసనసభల ఎన్నికలలో పోటీ చేసే అభ్యర్థుల సంఖ్య క్రమంగా పెరుగుతూ వచ్చినప్పటికీ, వీరిలో మహిళా అభ్యర్థుల సంఖ్య అత్యల్పంగా ఉంటున్నది. 1957లో నిర్వహించిన 2వ లోక్‌సభ ఎన్నికలలో కేవలం 45 మంది స్త్రీలు మాత్రమే పోటీచేశారు. 1999లో కూడా వీరి సంఖ్య అతితక్కువ, అంటే 277 మాత్రమే. అంటే గత 50 సంవత్సరాలలో వివిధ లోక్‌సభ ఎన్నికలలో పోటీచేసిన మొత్తం అభ్యర్థుల సంఖ్య 1864 (1952) నుంచి 13,952 (1996), 14,750 (1998) కి పెరిగితే మహిళా అభ్యర్థుల సంఖ్య 45 నుంచి 277కు పెరిగింది. అంతేకాక వివిధ ఎన్నికలలో పోటీచేసిన మొత్తం అభ్యర్థులలో మహిళా అభ్యర్థుల శాతం 1 శాతానికి ఎన్నడూ మించలేదు.

## 14.4 ఎన్నికలు - ఎన్నికల ప్రవర్తన : సైద్ధాంతిక అంశాలు :

ఎన్నికలు వర్తమాన రాజకీయ వ్యవస్థల విస్పష్టమైన, కీలకమైన లక్షణం. ఎన్నికలు రాజకీయ వ్యవస్థ ఔన్నత్యాన్ని వివరించటంతోపాటు, ఆ వ్యవస్థకు నాటకీయతను సంతరింపచేసాయి. ఎన్నికలు రాజకీయ వ్యవస్థకు ఆచరణాత్మక రూపాన్ని కల్పించటంతోపాటు, ఆ వ్యవస్థ మౌలిక స్వభావం, పనితీరుపై నిగూఢమైన అవగాహనను ఏర్పరుస్తాయి. ఎన్నికలు రాజకీయ వ్యవస్థ, సమాజం మధ్య, రాజకీయ శ్రేష్ఠులు, ప్రజానీకం మధ్య, ప్రభుత్వం ప్రజల మధ్య సంబంధాలను ఏర్పరుస్తాయి. ఎన్నికలు ప్రజాస్వామ్యం ఆవశ్యక లక్షణాలైన రాజకీయ సామాజికీకరణ, రాజకీయ సమీకరణ, రాజకీయ భాగస్వామ్యాలను సాధించే ప్రధాన సాధనాలు. ఒక రచయిత అభిప్రాయం ప్రకారం ఎన్నికలు వర్తమాన రాజకీయ సంస్థలలో అత్యంత ప్రధానమైనవి. ఓటింగ్ దేశంలోని మెజారిటీ వయోజనులను చేపట్టే ఏకైక రాజకీయ భాగస్వామీకరణ చర్య. వాస్తవానికి దాదాపు మొత్తం ప్రజాస్వామ్య దేశాలలో, కొన్ని ప్రజాస్వామ్యేతర దేశాలలో ఎన్నికలు శాశ్వతమైన సాధారణ లక్షణంగా రూపొందాయి. ఈ విధంగా ఎన్నికలు రాజకీయాభివృద్ధికి అత్యంత ఆవశ్యకమైన పరిస్థితి అయింది. ఎన్నికలు రాజకీయ వ్యవస్థ సామర్థ్యం, తన నిర్వర్తనలపైన కీలకమైన ప్రభావాన్ని కనపరచటమేకాక విస్తృత రాజకీయ ప్రక్రియలో కీలకపాత్రను నిర్వర్తిస్తున్నాయి. ఎన్నికలు రాజకీయ వ్యవస్థ పట్ల నిబద్ధత, చట్టబద్దతల పట్ల రాజకీయ సంస్కృతిని, భావోద్వేగాలను బహిర్గతం చేస్తాయి.

భారతదేశం లాంటి అభివృద్ధి చెందుతున్న రాజకీయ వ్యవస్థ సందర్భంలో నిర్ణీతకాల వ్యవధిలో నిర్వహించే ఎన్నికలు ప్రభుత్వ నిర్వర్తనపై తమ నిర్ణయాన్ని వ్యక్తీకరించే అవకాశాన్ని ప్రజలకు కల్పిస్తాయి. అంతేకాక ఎన్నికలు నూతన రాజకీయ పొత్తులు కుదుర్చుకునే, నూతన రాజకీయ దృక్పథాలను ఏర్పరచుకొనే అవకాశాన్ని ఏర్పరుస్తాయి. దేశంలో ఎన్నికలు రాజకీయ, సామాజికీకరణ ప్రధాన సాధనాలు. రాజకీయ వ్యవస్థ వేగంగా అభివృద్ధి చెందుతున్న భారతదేశంలో ఎన్నికలు రాజకీయ వ్యవస్థకు స్థిరత్వాన్ని కల్పించే సాధనంగా గుర్తింపబడ్డాయి. కానీ, సామ్యూల్ హట్టింగ్‌టన్ ఆధునికీకరణ చెందుతున్న సమాజాలలో ఎన్నికల వల్ల అనేక దుష్పరిణామాలు సంభవిస్తున్నాయని వాదించాడు.

భారతదేశంలోని ఎన్నికలు దేశ రాజకీయాలలో విడదీయలేని అంతర్భాగంగా రూపొందాయనీ, అవి ప్రజలచేత ఆమోదించబడ్డాయని శిర్షికర్ పేర్కొన్నాడు. ఈ దేశంలో ఎన్నికలు రాజకీయ ప్రక్రియలో విస్తృతంగా పాల్గొనేందుకు ప్రజలకు విస్తృతమైన అవకాశాన్ని కల్పిస్తున్నాయి. ఎన్నికలు వివిధ రాజకీయ గణాల మధ్య ఆరోగ్యకరమైన పోటీని కల్పించిన ఏకైక రంగం. అంతేకాక ఎన్నికలు రాజకీయ నాయకులను నియమించే ప్రధాన భర్తీ సాధనం అని మారిస్ - జోన్స్ పేర్కొన్నాడు. డి.ఎల్.సెథ్ భారతదేశంలో రాజకీయ వ్యవస్థపై ప్రతిపాదించే ఏ దృక్పథం దేశ సుదీర్ఘ ఎన్నికల అనుభవాన్ని నిర్లక్ష్యం చేయలేదని సూచించాడు.

నార్మన్ డి.పామర్ భారత రాజకీయ వ్యవస్థ ప్రస్తుత రూపంలో కొనసాగుతున్నంతకాలం ఎన్నికలు దేశ రాజకీయ వ్యవస్థ ప్రధాన లక్షణంగా ఉంటాయని పేర్కొన్నాడు. ఎన్నికల ప్రాధాన్యత క్షీణించినపుడు అది దేశ రాజకీయ వ్యవస్థ మనుగడకే ప్రమాదమేర్పడుతుందని పామర్ వాదించాడు. పామర్ భారతదేశంలో నెలకొన్న విశిష్ట రాజకీయ, సామాజిక, ఆర్థిక నేపథ్యం కారణంగా దేశంలో ఎన్నికలు అనేక విశిష్ఠ లక్షణాలను సంతరించుకున్నాయని వివరించాడు. భారతదేశంలో ఎన్నికల రాజకీయాలను దేశ విస్తృత పరిసరాల నేపధ్యంలో మాత్రమే అవగాహన చేసుకునేందుకు వీలవుతుంది. ఈ దేశంలో ఎన్నికలు అనేక కోట్లమంది పాల్గొనే గొప్ప సంబరం. ఎన్నికలు కేవలం రాజకీయ విధులనేకాక, సామాజిక, సాంస్కృతిక విధులను కూడా నిర్వర్తిస్తాయి. ఈ దేశంలో ఎన్నికలు మొత్తం ప్రజలు పాలుపంచుకునే జాతీయ సాంస్కృతిక కార్యక్రమం. ఎన్నికలు రాజకీయప్రక్రియను సాధారణ ప్రజల పరిధిలోకి తేవటమేకాక, ప్రజలను చైతన్యవంతులను చేసి, దేశాన్ని సమైక్యపరిచే సాధనంగా పనిచేస్తాయి. మొత్తంమీద భారతదేశ రాజకీయ వ్యవస్థ అనేక ఒత్తిళ్ళను, సమస్యలను ఎదుర్కొంటున్నప్పటికి సమర్థవంతంగా పనిచేయడానికి దృఢత్వాన్ని సంతరించుకోవడానికి ఎన్నికల ప్రక్రియ ప్రధాన కారణమని పామర్ నొక్కిచెప్పాడు. కాలక్రమంలో భారతీయ ఓటర్లు ఆధునిక దృక్పథాన్ని, పరిపక్వతను పెంపొందించుకున్నారని పామర్ అభిప్రాయపడ్డాడు. మారిస్‌జోన్స్ అభిప్రాయం ప్రకారం భారతదేశ ప్రజలు సమర్థవంతంగా నిర్వహిస్తున్న రాజకీయ విధులలో ఎన్నికలు ఒకటి. లిప్‌సెట్, హారిస్ మొదలైన రాజనీతి శాస్త్రవేత్తలు ఎన్నికల ప్రయోజనాలను వివరించారు. వారి అభిప్రాయం ప్రకారం ఎన్నికలు ప్రజాస్వామ్య అభివృద్ధికి, మనుగడకు దోహదం చేస్తాయి. అవి ప్రజలు శాంతియుతంగా దేశ రాజకీయ, పాలనా ప్రక్రియలలో పాల్గొనేందుకు అవకాశం కల్పించే సాధనం. ఎన్నికలు ప్రజాస్వామ్య వ్యవస్థలో అంతిమ సార్వభౌమాధికారం కల ప్రజలకు ప్రభుత్వాన్ని ఏర్పరిచేందుకు లేదా అధికారంలో ఉన్న ప్రభుత్వాన్ని తొలగించేందుకు అవకాశాన్ని కల్పిస్తాయి. అంతేకాక ఎన్నికలు ప్రజలలో దేశభక్తిని పెంపొందించటంతోపాటు, వారిలో రాజకీయ చైతన్యాన్ని ప్రేరేపించి, జాతి ఉమ్మడి ప్రయోజనాలను సాధించేలా, తమ శక్తిసామర్థ్యాలను సమైక్యపరచుకొనేలా ప్రేరేపిస్తాయి.

ఎన్నికల కీలకాంశాలలో ఎన్నికల ప్రవర్తన లేదా ఓటర్ల ప్రవర్తన (Voting Behaviour) ఒకటి. రాజనీతి శాస్త్రంలో ఓటర్ల ప్రవర్తన నూతనంగా అవతరించిన దృక్పధం కాదు. రాజనీతి శాస్త్రంలో ఓటర్ల ప్రవర్తనకు విస్తృతమైన అర్థం ఉంది. ఓటర్ల ప్రవర్తన అంటే కేవలం ఎన్నికల రికార్డులను పరిశీలించడం, ఎన్నికల గణాంకాలను కూర్చటం, ఎన్నికల సంస్కరణలను ప్రవేశపెట్టడం మాత్రమే కాదు. ఈ భావనకు స్థూలమైన విస్తృతమైన అర్థం ఉంది. ప్రస్తుతం ఓటర్ల ప్రవర్తనను రాజకీయ ప్రవర్తనలో ఒక ఉప అధ్యయన అంశంగా పరిగణిస్తున్నారు. అంటే ఓటర్ల ప్రవర్తన రాజకీయ ప్రవర్తన పరిధిలోగల ప్రధాన అంశం. అయితే రాజకీయ ప్రవర్తన, ఓటర్ల ప్రవర్తన మధ్య భిన్నత్వం ఉంది. వ్యక్తుల రాజకీయ ప్రవర్తన లేదా ఓటింగ్ ప్రవర్తనను వారి ప్రవర్తనా మూలాంశం ఆధారంగాకాక, వాటి సందర్భం ఆధారంగా విభజింపవచ్చు.

ఓటర్ల ప్రవర్తనపై అధ్యయనం మొదటి ప్రపంచయుద్ధానంతర కాలంలో ప్రారంభమైంది. 1924లో అమెరికాలో ఛార్లెస్ మెర్రియమ్, కొందరు ఇతర రాజనీతి శాస్త్రవేత్తలు ఆదేశంలో కొందరు ప్రజలు ఎన్నికలలో ఓటు చేయకపోవటానికి కల కారణాలపై జరిపిన అధ్యయనం ఓటింగ్ ప్రవర్తనపై అధ్యయనాలకు నాంది. ఈ అధ్యయనం తరువాత ఓటింగ్ ప్రవర్తనపై అధ్యయనాలు లేదా పరిశోధనల సంఖ్య గణనీయంగా పెరిగింది. క్రమంగా ఓటింగ్ ప్రవర్తన రాజనీతి శాస్త్రంలో ఒక పరిపూర్ణమైన, ప్రధానమైన అధ్యయనరంగంగా రూపొందింది. అమెరికా, జర్మనీ, ఫ్రాన్స్, ఇంగ్లాండ్ మొదలైన పాశ్చాత్య దేశాలలో ఓటింగ్ ప్రవర్తనపై గణనీయమైన సంఖ్యలో అద్భుతమైన పరిశోధన సాగుతున్నది. ఈ విధంగా రాజనీతి శాస్త్రంలో ఓటింగ్ ప్రవర్తనపై ఆసక్తి పెరగటానికి 1940 దశాబ్దంలో తలెత్తిన ప్రవర్తనావాద ఉద్యమం ప్రభావం ప్రధాన కారణమని రాజనీతి శాస్త్రవేత్తల ధృఢ అభిప్రాయం. మొదట్లో ఓటింగ్ ప్రవర్తనా అధ్యయనాలు అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్, స్వీడన్, ఇటలీ, జర్మనీ వంటి పాశ్చాత్య దేశాలకు మాత్రమే పరిమితం. కాని 1970 దశాబ్దం తరువాత ఈ అధ్యయనాలు అభివృద్ధి చెందుతున్న దేశాలలో విస్తృతంగా ప్రచారంలోకి వచ్చి అధికసంఖ్యలో నిర్వహించబడుతున్నాయి. భారతదేశంలో ఎన్నికల రాజకీయాలు ఓటింగ్ ప్రవర్తనపై అధ్యయనాన్ని మొదటిసారిగా 1960 దశాబ్దంలో భారత సామాజిక శాస్త్రాల పరిశోధన మండలి (ICSSR) చేపట్టింది. దీని తరువాత ఈ అధ్యయనాల సంఖ్య పెరుగుతూ వచ్చింది. పాశ్చాత్య దేశాలకు ప్రధానంగా అమెరికాకు చెందిన రాజనీతి శాస్త్రవేత్తలతోపాటు, భారతదేశానికి చెందిన రాజనీతి శాస్త్రవేత్తలు భారతదేశంలో ఎన్నికల రాజకీయాలు, ఓటింగ్ ప్రవర్తన వివిధ అంశాలపై పరిశోధనలను చేపట్టారు. దీని ఫలితంగా ఓటింగ్ ప్రవర్తనా, ఎన్నికల రాజకీయాలపై గణనీయమైన పరిమాణంలో సాహిత్యం అభివృద్ధి చెందింది. ఈ సాహిత్యం ఆధారంగా దేశంలో ఎన్నికల రాజకీయాలపై, ఓటర్ల ప్రవర్తనపై అనేక భావనలు, సిద్ధాంతాలు, నమూనాలు, సాధారణీకరణలు ప్రతిపాదింపబడ్డాయి.

రాజనీతిశాస్త్ర విశ్లేషకులు ఓటింగ్ ప్రవర్తనను రెండు తరగతులుగా విభజించారు. అవి : 1) ఓటర్ల ఎంపిక (preferencers) అంటే ఒక పార్టీ పట్ల అభ్యర్థులపట్ల వారి విధానాల పట్ల ఓటర్ల ఆమోద భావం లేదా తిరస్కారభావం 2) ఓటర్ల నిర్ణయం అంటే తన ఎంపికకు అనుగుణంగా ఓటర్లు చేపట్టే క్రియ. ఆస్టిన్ రానే (Austan Ranne) ఓటర్ల ప్రవర్తన స్వతంత్రకారకాలు, జోక్యం కల్పించుకునే కారకాల వల్ల ప్రభావితం అవుతుందని వివరించారు. ఓటర్ల ఓటింగ్ ప్రవర్తనను ప్రభావితం చేసే స్వతంత్ర కారకాలు భౌతిక, మానసిక అవసరాలు. దీనికి భిన్నంగా జోక్యం కల్పించుకునే కారకాలు రాజకీయపరమైనవి. పార్టీల పట్ల కల అనుబంధం, రాజకీయఅంశాలు, రాజకీయ దృక్పధాలు, అభ్యర్థుల రాజకీయ నేపధ్యం, వారి వ్యక్తిగత గుణాలపై అభిప్రాయం, ప్రభుత్వ విధానాలు, కార్యక్రమాలపట్ల అభిప్రాయం మొదలైనవి జోక్యం కల్పించుకునే కారకాలలో ప్రధానమైనవి ఈ విధంగా ఓటింగ్ ప్రవర్తనా అధ్యయనంలో వ్యక్తిగత ఓటర్లు , ఎన్నికలలో ప్రతినిధుల అభిప్రాయాలు, దృక్పధాలను ప్రభావితం చేసే వివిధ అంశాలు, ఎన్నికల ప్రక్రియ, పాత్ర, రాజకీయ వ్యవస్థ పనితీరు మొదలైన అంశాలు ఇమిడి ఉన్నాయి.

భారతదేశం సందర్భంలో వ్యక్తుల ఓటింగ్ ప్రవర్తనను ప్రభావితం చేసే అంశాలను ఈ క్రింది విధంగా పేర్కొనవచ్చును.

1) వ్యక్తులకు గల రాజకీయ చైతన్యంస్థాయి;

2) రాజకీయ సమాచారాన్ని అందించే మార్గాలు;

3) రాజకీయ పార్టీలతో అనుబంధం ;

కొందరు రాజనీతి శాస్త్రవేత్తలు వాదించినట్లు వ్యక్తుల ప్రవర్తన హేతుబద్ధమైందీ, సాత్త్వికమైంది. కాని రాజకీయ ఆర్థిక వ్యవహారాలలో వ్యక్తుల ప్రవర్తన హేతుబద్ధరహితంగా ఉంటుంది. అందుచేత వ్యక్తుల ఓటింగ్ ప్రవర్తనను వివిధ సమయాలలో వివిధ కోణాలలో, వివిధ అంశాలు నిర్ధారిస్తాయి. ఈ అంశాలను రెండు తరగతులుగా విభజింపవచ్చును. అవి

1) రాజకీయ అంశాలు;

2) రాజకీయేతర అంశాలు.

పైన పేర్కొన్న రాజకీయ అంశాలలో పార్టీ అనుబంధం, రాజకీయ దృక్పధాలు, రాజకీయ సైద్ధాంతిక భావజాలం, వివిధ రాజకీయ అంశాలు ప్రధానమైనవి. రాజకీయేతర అంశాలు అనేక సామాజిక, సాంస్కృతిక, ఆర్థిక విషయాల చుట్టూ పరిభ్రమిస్తాయి. ఈ అంశాలలో కుటుంబం, కులం, మతం, భాష, ప్రాంతం, సమ్మోహనశక్తి, ధనం మొదలైనవి ప్రధానమైనవి. వీటితోపాటు విద్య, గ్రామీణ, పట్టణ ప్రాంతాలు, నివాసస్థలం, భూ సంపద మొదలైన అంశాలు కూడా వ్యక్తుల ఓటింగ్ ప్రవర్తనను ప్రభావితం చేస్తాయి. నార్మన్ డి. పామర్ అభిప్రాయం ప్రకారం మూడు విభిన్న తరగతులకు చెందిన కారకాలు ఓటింగ్ ప్రవర్తనను నిర్ధారిస్తాయి. అవి పరిసరాల కారకాలు, రాజకీయ కారకాలు, సామాజిక, ఆర్థిక కారకాలు. ఈ మూడు కారకాలు స్వతంత్రమైనవి కావు. వాటి మధ్య పరస్పర సంబంధం ఉంది. అయినప్పటికీ వాటి ప్రాధాన్యతలో వ్యత్యాసం ఉంది. కొందరు రచయితలు వాదించినట్లు అభివృద్ధి చెందిన దేశాలలో వ్యక్తుల ఓటింగ్ ప్రవర్తనను రాజకీయ కారకాలు అధికంగా ప్రభావితంచేస్తే, అభివృద్ధి చెందుతున్న దేశాలలో ఈ అంశాన్ని సామాజిక, ఆర్థిక అంశాలు ప్రగాఢంగా ప్రభావితం చేస్తాయి.

## 14.5 భారతదేశంలో ఎన్నికల ప్రవర్తన :

ఇటీవల కాలంలో భారతదేశంలో రాజనీతి శాస్త్రవేత్తలలో రాజకీయ ప్రక్రియ, ప్రధానంగా ఎన్నికల రాజకీయాలు, ఓటింగ్ ప్రవర్తనను క్రమబద్ధంగా అధ్యయనం చేయటంపై గణనీయమైన ఆసక్తి పెంపొందింది. రాజనీతి శాస్త్రజ్ఞులు కనపరచిన ఆసక్తి ఈక్రింది అంశాలలో ప్రతిబింబిస్తున్నది ;

1) యధార్థ అంశాలతో కూడిన వారి రచనలు;

2) విశ్లేషణ స్థాయిలు;

3) విభిన్న పరిశోధనా పద్ధతులు.

ఈ యధార్థ అంశాలలో ఓటర్ల లక్షణాలు, రాజకీయ వ్యవస్థకు, ఈ లక్షణాల మధ్యకల సంబంధం ప్రధానమైనవి. ఈ రచయితలు గ్రామాలు, నియోజకవర్గం, జిల్లా, రాష్ట్ర, దేశం స్థాయిల్లో ఎన్నికల ప్రక్రియను, ప్రవర్తనను విశ్లేషిస్తున్నారు. వారి పరిశోధనల్లో గణాంక వివరాలు, భాగస్వామ్య వీక్షణ (participartory observation) పై ఆధారపడిన నిగూఢ విశ్లేషణ ప్రముఖ స్థానాన్ని ఆక్రమించాయి. భారతదేశం ఓటర్ల ప్రవర్తనపై నిర్వహించిన అధ్యయనాలన్నీ ఓటర్ల ప్రవర్తనను నిర్ధారించే

సామాజిక, రాజకీయ, ఆర్థిక కారకాలపై తమ దృష్టిని కేంద్రీకరించాయి. భారతదేశంలో ఓటర్ల ప్రవర్తనను అనేక కారకాలు ప్రభావితంచేస్తున్నాయి. మతం, కులం, వర్గం, సమ్మోహనశక్తి కల నాయకుల పట్ల వ్యక్తిగత ఆకర్షణ ఒక పార్టీ పట్లగల విధేయత మొదలైనవి. ఓటర్ల ప్రవర్తనను లేదా ఎంపికను ప్రభావితం చేస్తున్న కారకాలలో ప్రధానమైనవి. నార్మన్ డి. పామర్ భారతదేశంలో ఓటింగ్ ప్రవర్తనను ప్రభావతం చేసే కారకాలను ప్రధానంగా నాలుగు తరగతులుగా వర్గీకరించాడు. అవి 1) పరిసరాల కారకాలు, 2) రాజకీయ కారకాలు, 3) సామాజిక కారకాలు, 4) ఇతర కారకాలు.

పామర్ భారతదేశంలో ఓటర్ల ప్రవర్తనను మరో మూడు భిన్న రాజకీయకారకాలు కూడా ప్రభావితం చేస్తాయని సూచించాడు. అవి : అభ్యర్థి పట్ల దృక్పథం (Candidate Orientation), అంశాలపట్ల దృక్పథం (Issue-Orientation), పార్టీల పట్ల దృక్పథం (party - orientation). భారతదేశంలో ఈ మూడు రాజకీయ కారకాలలో అభ్యర్థి పట్ల దృక్పథం, పార్టీ పట్ల దృక్పథం, ఓటర్ల ప్రవర్తనను గాఢంగా ప్రభావితం చేస్తాయని పామర్ అభిప్రాయపడ్డాడు. భారతదేశంలో ప్రజలపై సాంప్రదాయాల ప్రభావం ఫలితంగా ఎన్నికలలో అభ్యర్థుల వ్యక్తిగత లక్షణాలు కీలకపాత్ర వహిస్తాయి. ఈ దేశంలో ఓటర్ల ప్రవర్తనపై నిర్వహించిన కొన్ని అధ్యయనాలు గ్రామీణ ప్రాంతాల ఓటర్లు ఎన్నికలలో పోటీచేసే అభ్యర్థులు నిజాయితీ, ప్రజల సంక్షేమం పట్ల ఆసక్తి కలిగిఉండాలని కోరుకుంటారని వెల్లడించాయి. అయితే ఇతర అధ్యయనాలు ఎన్నికలలో పోటీ చేస్తున్న అభ్యర్థులపై రెండు గుణాల కంటే వారి ఇతర లక్షణాల వల్ల ఓటర్లు అధికంగా ప్రభావితం అవుతారని వివరించాయి.

పాశ్చాత్య దేశాలకు భిన్నంగా భారతదేశంలో ఓటర్ల ప్రవర్తనపై వివిధ అంశాల ప్రభావం అతిపరిమితం అని పరిశోధనలు వెల్లడించాయి. చివరగా దేశంలోని వివిధ రాజకీయ పార్టీల పట్ల అభిప్రాయం ఎన్నికలలో ఎక్కువ ప్రభావాన్ని కనపరచటం లేదని పరిశోధనల ఫలితాలు వెల్లడిస్తున్నాయి. ఈ పరిశోధనల ప్రకారం భారతదేశంలో ఓటర్లు పార్టీలకు తమ మద్దతు తరచుగా మార్చడం జరుగుతుంది. ఈ ఓటర్ల ప్రవర్తన ఊహాతీతం. ఓటర్లు ఎన్నికలలో ఓటు వేయటంలో స్వతంత్రంగా వ్యవహరిస్తున్నారని వివిధ ఎన్నికలు రుజువు చేస్తున్నాయి.

భారతదేశంలో ఓటర్ల ప్రవర్తనను ప్రభావితం చేసే సామాజిక అంశాలలో కుటుంబం, బంధుత్వం, కులం, వర్గం, మతం ప్రధానమైనవి. గ్రామీణ ప్రాంతాలలో ఎన్నికలలో కుటుంబం, బంధుత్వం ప్రభావాన్ని అంచనా వేసిన కొందరు భారతీయ పరిశోధకులు ఎన్నికలలో కుటుంబం, బంధుత్వం కనపరుస్తున్న ప్రగాఢ ప్రభావం వల్ల భారతదేశంలో ప్రజాస్వామ్య మనుగడ సందేహాస్పదం అని పేర్కొన్నారు. ఆస్కార్ లూయిస్ అనే అమెరికా మాననీయ శాస్త్రపరిశోధకుడు ఉత్తర భారతదేశంలో నిర్వహించిన తన పరిశోధన ఆధారంగా బంధుత్వం ఆధారంగా వ్యవస్థీకృతం చెందిన భారతీయ సమాజంలో ఉమ్మడి కుటుంబం నిర్ణయాకరణకు మూలాధారం అని పేర్కొన్నాడు. ఈ దేశంలో ఎన్నికలలో ఓటింగ్ ఒక కుటుంబ ప్రక్రియగా మారింది. ఇది పాశ్చాత్య దేశాలలో కల ఓటింగ్ విధానంలో అంతర్లీనంగా ఉన్న వ్యక్తిత్వం స్ఫూర్తికి పూర్తిగా భిన్నం అని లూయిస్ నొక్కిచెప్పాడు.

ప్రాల్‌బ్రాస్, పామర్, మెరన్‌వీనర్, మారిస్‌జోన్స్ మొదలైన అమెరికా రాజనీతి శాస్త్రవేత్తలతోపాటు శిర్షికర్, రమేష్ రేరాయ్, డి.యల్. సేథ్ మొదలైన భారతీయ రాజనీతి శాస్త్రవేత్తలు ఎన్నికలలో ఓటరు ప్రవర్తనను అత్యంత ప్రగాడమైన ప్రభావాన్ని కనపరుస్తున్న కొన్ని సామాజిక అంశాలని నొక్కి చెప్పారు. వీటిలో కులం ప్రభావం మరింత ప్రగాఢమైందనే అభిప్రాయాన్ని వ్యక్తపరచారు. ఇప్పటివరకు భారతదేశంలో ఎన్నికల రాజకీయాలు, ఓటర్ల ప్రవర్తనపై నిర్వహించిన పరిశోధనలన్నీ ఈ వాస్తవాన్ని ధృవీకరించాయి. పాల్‌బ్రాస్ భారతదేశంలో కుల సంఘటితతత్వం ఓటింగ్ ప్రవర్తనను ప్రభావితంచేసే అత్యంత ప్రధాన కారకమని పేర్కొన్నాడు. ఒక నియోజకవర్గంలోని సంఖ్యాపరంగా ప్రధానమైన, శక్తివంతమైన కులానికి చెందిన వ్యక్తులు ఎన్నికలలో తమ కులానికి చెందిన అభ్యర్థులను లేదా తమ కులంతో సన్నిహిత సంబంధంవున్న రాజకీయపార్టీని బలపరచటం సర్వసాధారణంగా జరుగుతున్నదని పాల్‌బ్రాస్ పేర్కొన్నాడు. భారత రాజకీయ ప్రవర్తన గురించి సాగుతున్న వర్తమాన చర్చలో ఎన్నికల్లో కులం

పాత్ర అత్యంత ప్రధానమైన అంశం అని పాల్‌బ్రాస్ పేర్కొన్నాడు. భారతదేశంలో ఎన్నికలలో కులం పాత్ర ప్రజల ఓటింగ్ ప్రవర్తననే గాక ఎన్నికల ప్రక్రియలోని కీలక అంశమైన అభ్యర్థుల ఎంపిక ప్రక్రియను కూడా తీవ్రంగా ప్రభావితం చేస్తున్నది.

భారతదేశంలో ఎన్నికలలో కులం ఎంతటి కీలకాంశం అయినప్పటికీ, కులం ప్రభావంపై భిన్న అభిప్రాయాలు ఉన్నాయి. కొందరు రచయితల అభిప్రాయం ప్రకారం భారతీయుల జీవితంలో కులం పాత్ర అతి విస్తృతమైంది. అయినప్పటికీ ఎన్నికలలో ఓటర్ల ప్రవర్తనను ప్రభావితం చేసే అంశంగా కులం పాత్రను మితిమీరిన స్థాయిలో వక్కాణించటం అతిశయోక్తి అవుతుంది. స్థానిక సంస్థల ఎన్నికలలో తప్ప ఇతర ఎన్నికలలో కులం ప్రధాన అంశమైనప్పటికీ ఓటర్ల ప్రవర్తనను నిర్ధారించే ప్రభావం కులానికి లేదు. కొందరు రాజనీతి శాస్త్రవేత్తలు ఎన్నికలలో ప్రధానంగా పార్లమెంటు, రాష్ట్ర శాసనసభల ఎన్నికలలో ఓటింగ్ ప్రవర్తనను నిర్ధారించే అంశంగా కులం పాత్ర క్షీణిస్తుందని అభిప్రాయపడ్డారు. పామర్ అభిప్రాయం ప్రకారం ఎన్నికలలో కులం కన్నా ఇతర అంశాలే ఓటర్ల ప్రవర్తనను బలంగా ప్రభావితం చేస్తున్నాయి. ఉదాహరణకు **1971** లోక్‌సభ ఎన్నికలలో కులం కన్నా శ్రీమతి ఇందిరాగాంధీ విధానాలే ఓటర్లను ప్రభావితం చేసాయని పామర్ వాదించాడు.

మొత్తం మీద ఇప్పటివరకు భారతదేశంలో ఎన్నికల రాజకీయాలు ఓటర్ల ప్రవర్తనపై వివిధ రాజనీతి శాస్త్రవేత్తలు నిర్వహించిన పరిశోధనలను పరిశీలిస్తే, ఈ దేశంలో ఎన్నికల సమయంలో ఓటర్లను ప్రభావితంచేసే అంశాలలో కులం ఒక ప్రధాన అంశమే తప్ప నిర్ణయాత్మక అంశం కాదు అని గుర్తించవచ్చును. ఈ పరిశోధనల ప్రకారం ఎన్నికలలో కులం పాత్ర, ప్రభావం క్రమంగా క్షీణిస్తున్నాయి. హెరాల్డ్ గౌల్డ్ కులాన్ని రాజకీయాలను నిర్ధారించే అంశంగాకాక, ఒక జాతికి సంబంధించిన చలాంశంగా పరిగణించాలి అని పేర్కొన్నాడు. రజనీకొఠారీ ప్రస్తుతం భారతదేశ రాజకీయాలలో పాత్ర వహిస్తున్న అనేక కారకాలలో కులం ఒక కారకం మాత్రమే అని పేర్కొన్నాడు. అయితే ఇటీవల కాలంలో చేయబడుతున్న ఒక వాదన ప్రకారం ఎన్నికలలో కులం కోల్పోయిన తన ప్రాధాన్యతను తిరిగి సంతరించుకుంటున్నది. దీనికి రాజకీయాలలో పాల్గొనే వర్గాల సంఖ్య పెరగటం, ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల్లో సాంప్రదాయక శక్తివంతమైన వర్గాలు అధిక సంఖ్యలో ఎన్నికలలో చురుకుగా పాల్గొనటం ప్రధాన కారణం. ఈ నూతన దృగ్గోచరం **1971**లో నిర్వహింపబడిన లోక్‌సభ ఎన్నికల అనంతర కాలంలో ఎక్కువ ప్రాచుర్యాన్ని సంతరించుకుందని వీరి అభిప్రాయం.

మొత్తంమీద భారతదేశంలో ఎన్నికల రాజకీయాలు, ఓటింగ్ ప్రవర్తనపై కల సాహిత్యాన్ని విశ్లేషిస్తే ఓటింగ్ ప్రవర్తనపై కులం ప్రభావం పట్ల పరస్పర వైరుధ్యం కలిగిన అస్పష్టమైన చిత్రం ఏర్పడుతుంది. అంతేకాక ఎన్నికలలో కులం నిర్వహించేపాత్ర కనపరిచే ప్రభావం విషయంలో వివిధ రాష్ట్రాల మధ్య, వివిధ ప్రాంతాల మధ్య, వివిధ వర్గాల ప్రజల మధ్య, వివిధ ఎన్నికల మధ్య తీవ్రమైన వ్యత్యాసాన్ని గుర్తించవచ్చును. కొన్ని రాష్ట్రాలలో, ప్రాంతాలలో, వర్గాలలో ఎన్నికలలో కులం కీలకపాత్ర వహిస్తే, ఇతర రాష్ట్రాలు, ప్రాంతాలు, వర్గాలలో ఎన్నికలలో కులం పాత్ర కేవలం నామమాత్రంగానే ఉంది. ఈ విధంగా భారతదేశం ఎన్నికల రాజకీయాలలో ప్రధానంగా ఓటింగ్ ప్రవర్తన విషయంలో కులం పాత్ర అనేక మార్పులకు లోనుకావడంతోపాటు సంక్లిష్టంగా అస్పష్టంగా, అసందిగ్దంగా రూపొందుతున్నది.

**1990**లో అప్పటి ప్రధాన మంత్రి వి.పి. సింగ్ మండల కమీషన్ చేసిన సిఫారసులను అమలుపరచటం భారతదేశంలో రాజకీయాలలో కులం పాత్రను ఒక గొప్ప మలుపు తిప్పిందని విశ్లేషకుల అభిప్రాయం. ఈ చర్య **1991**లో నిర్వహింపబడిన లోక్‌సభ ఎన్నికలు, ఉత్తరప్రదేశ్ మొదలైన కొన్ని రాష్ట్రాల శాసనసభల ఎన్నికలపై ప్రసరించిందని వీరి వాదన. మండల కమీషన్ సిఫారుస్సుల అమలు ఫలితంగా కొన్ని వెనుకబడిన కులాలు, అగ్రకులాలకు చెందిన మధ్య తరగతి వర్గం భారతీయ జనతాపార్టీని సమర్థించటం ప్రారంభమైందని వారు వాదించారు.

## 14.6 ఎన్నికల రాజకీయాలు - మతం ప్రభావం :

భారతదేశంలో ఎన్నికల రాజకీయాలు, ఓటర్ల ప్రవర్తనను ప్రభావితం చేసే మరో శక్తివంతమైన కారకం మతం, మతతత్వం. మతం, భాష, ప్రాంతం, చారిత్రక నేపథ్యం, వృత్తి మొదలైన అంశాల ప్రాతిపదికమీద విభజింపబడిన వర్గాలపై మతం ప్రభావం వివిధ ప్రాంతాలలో భిన్నంగా ఉందని నార్మన్ బ్రౌన్ అనే రాజనీతి శాస్త్రవేత్త పేర్కొన్నాడు. ఓటింగ్ ప్రవర్తనపైనమతం కనపరిచే ప్రభావంలో జాతిపరమైన నిర్మాణం, మైనార్టీలు, మతం, ప్రాంతం , భాష మొదలైన అంశాలు ఇమిడి ఉన్నాయి. వీటన్నిటికంటే హిందువులు, ముస్లిముల మధ్య కల సంబంధం ప్రభావం ఎన్నికల రాజకీయాలు, ఓటింగ్ ప్రవర్తనపై ప్రగాఢంగా ఉంది. భారతదేశంలో ముస్లిం పార్టీలు ఏవీ జాతీయ స్థాయిలో ఎన్నికలను ప్రభావితం చేయలేకపోయాయి. ముస్లింలీగ్ జాతీయపార్టీ అయినప్పటికీ, ఈ పార్టీ ప్రభావం కేరళకు మాత్రమే పరిమితం. అయినప్పటికీ ఈ పార్టీ ముస్లింను గణనీయంగా ప్రభావితం చేస్తున్నదని రాజనీతి శాస్త్రవేత్తల అభిప్రాయం. భారతదేశంలో ఎన్నికల రాజకీయాలు, ఓటర్ల ప్రవర్తనపై మతం ప్రభావం క్రమంగా పెరుగుతూ వచ్చిందని రాజనీతిశాస్త్రవేత్తల అభిప్రాయం. 1970 దశాబ్దం వరకు మతం ప్రభావం పరిమితంగా ఉండగా, 1980 దశాబ్దం నుంచి క్రమంగా పెరుగుతున్నదని, వీరి అభిప్రాయం. 1980 దశాబ్దం నుంచి నిర్వహింపబడిన వివిధ ఎన్నికలలో మతం పాత్ర ప్రగాఢంగా ఉంది. దీనికి ఈ శతాబ్దం తరువాత హిందువులు, ముస్లిముల మధ్య సంబంధాలలో సంఘర్షణ చోటుచేసుకోవటం ప్రధాన కారణమని పాల్‌బ్రాస్ మొదలైన రచయితల అభిప్రాయం.

1980 దశాబ్దం నుంచి భారతరాజకీయాలను, ప్రధానంగా ఎన్నికలను, ఓటర్ల ప్రవర్తనను ప్రభావితం చేసిన మతపరంగా అనేక సంఘటనలు చోటుచేసుకున్నాయి. ఈ దశాబ్దంలో తలెత్తిన రామజన్మభూమి, బాబ్రీ మసీదు వివాదం 1989 లోక్‌సభ ఎన్నికలను, ఆ తరువాత నుంచి నిర్వహింపబడిన వివిధ లోక్‌సభ ఎన్నికలను అమితంగా ప్రభావితం చేసిందని రాజకీయ విశ్లేషకులు వాదించారు. 1990 దశాబ్దంలో బి.జె.పి. ప్రచారంలోకి తెచ్చిన హిందుత్వ నినాదం వివిధ లోక్‌సభ ఎన్నికలలో, కొన్ని హిందీ రాష్ట్రాల శాసనసభలకు జరిగిన ఎన్నికలలో ఓటర్లను ప్రగాఢంగా ప్రభావితం చేయగలిగిందనే వాస్తవాన్ని ప్రత్యేకంగా వివరించవలసిన అవసరం లేదని వివిధ రాజకీయ విశ్లేషకుల వాదన. ఈ సంఘటనలు ఎన్నికలలో హిందువులు, ముస్లిం ఓటర్ల మధ్య స్పష్టమైన విభజనకు దారితీసాయని పాల్‌బ్రాస్ మొదలైన రాజనీతి శాస్త్రవేత్తలు ప్రతిపాదించారు. 1990 దశాబ్దంలో నిర్వహింపబడిన మూడు లోక్‌సభ ఎన్నికలలో (1996, 1998, 1999) భారతీయ జనతాపార్టీ లోక్‌సభలోని అత్యధిక సీట్లను గెలుచుకొని సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటుచేయటానికి ఈ ఎన్నికల్లో మతం ప్రభావం పెరగటమే ప్రధాన కారణం అనే విషయంపై రాజనీతి శాస్త్రవేత్తలు, రాజకీయ విశ్లేషకులు దాదాపు ఏకాభిప్రాయాన్ని కలిగిఉన్నారు. ఈ విధంగా 1990 దశాబ్దంలో ఎన్నికల రాజకీయాలలో మతం పాత్ర పెరగటం ఫలితంగా భారతీయ జనతాపార్టీ అధికంగా లబ్దిపొందగలిగిందని వీరి అభిప్రాయం.

## 14.7 ఇతర కారకాల ప్రభావం :

భారతదేశంలో ఎన్నికల రాజకీయాలు, ఓటింగ్ ప్రవర్తనను కులం, మతం వంటి సామాజిక అంశాల తర్వాత ప్రగాఢంగా ప్రభావితం చేసిన సామాజికేతర అంశాలలో విద్య, లింగం, వయస్సు, ధనం మొదలైనవి ప్రధానమైనవని డి.యల్.సేథ్ మొదలైన రాజనీతి శాస్త్రవేత్తలు గుర్తించారు. ఎన్నికలలో ఈ అంశాల ప్రభావాన్ని పామర్ ఈ విధంగా వివరించాడు. భారతదేశంలో ఎన్నికలలో వయస్సు ప్రభావం గాఢంగా ఉంది. వృద్దులు ఎన్నికలలో పాల్గొనటంలో సాంప్రదాయ దృక్పధాన్ని ప్రదర్శిస్తుంటే యువకులు అతివాద దృక్పధంతో తమ ఓటు హక్కు వినియోగిస్తున్నారు. వృద్ధ ఓటర్లు కాంగ్రెస్ పట్ల మొగ్గు చూపుతుంటే, యువకులైన ఓటర్లు కాంగ్రేసేతర పార్టీలను ఆదరిస్తున్నారు. ఇతర సాంప్రదాయ సమాజాలలో లాగే భారతదేశంలో ఎన్నికలలో మహిళలు తక్కువ స్థాయిలో పాల్గొంటున్నారు. ఈ దేశంలో మహిళా ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించటంలో తమ

కుటుంబంలోని మగవారి ఆదేశాలను అనుసరించటం జరుగుతున్నది. ఈ దేశంలో ఓటర్లపై విద్య ప్రభావంకూడా గణనీయమైన పరిమాణంలో ఉంది. భారతదేశంలో నిరక్షరాస్యుల సంఖ్య అధికంగా ఉండటంవల్ల ప్రజల ఓటింగ్ ప్రవర్తనను నిర్ధారించటంలో సాంప్రదాయక అంశాలు కీలకపాత్ర వహిస్తున్నాయి. ఓటింగ్ ప్రవర్తనపై ఆర్థికస్థాయి ప్రభావం కూడా చెప్పుకోదగినంత పరిమాణంలో ఉంది. గతంలో అల్ప ఆదాయ వర్గాలు ఎక్కువగా కాంగ్రెస్ పార్టీని సమర్థించారు. ప్రధానంగా గ్రామీణ ప్రాంతాలలోని అల్ప ఆదాయ వర్గాలకు చెందిన వ్యవసాయ కూలీలు, వెనుకబడిన వర్గాల మద్దతు కాంగ్రెస్‌కే లభించింది. పట్టణ ప్రాంతాలలోని మేధావి, మధ్యతరగతి, ఉద్యోగి వర్గాలు కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా ఓటు వేసాయి.

భారతదేశంలో ఓటరు ప్రవర్తనపై ధన ప్రభావాన్ని తక్కువగా అంచనావేయలేము. మొదట్లో ఎన్నికలలో ఓటర్లను ప్రభావితం చేయడంపై ధనం పాత్ర పరిమితంగా ఉన్నప్పటికీ, దీని ప్రభావం క్రమంగా పెరుగుతూ వచ్చింది. ప్రధానంగా పేదవర్గాల ఓటర్లపై ధనం శక్తివంతమైన ప్రభావాన్నే కనపరుస్తున్నది.

మొత్తంమీద భారతదేశంలో ఓటర్ల ప్రవర్తన, ఎన్నికల రాజకీయాలలో వివిధ సామాజిక రాజకీయ, తదితర కారకాల ప్రభావాన్ని పరిశీలిస్తే ఈ కారకాల సాపేక్షిక ప్రాధాన్యత వెల్లడిఅవుతుంది. సాంద్రాయబద్ధమైన భారతదేశ సమాజంలో ఎన్నికల ప్రవర్తనపై ఇతర అంశాలకంటే సామాజిక అంశాల ప్రభావం అత్యంత కీలకమైంది. సామాజిక అంశాలలో ప్రధానంగా కులం, మతం ఓటర్ల ప్రవర్తనను బలంగా ప్రభావితం చేస్తున్నాయి. పాశ్చాత్య దేశాలకు, భారతదేశానికి చెందిన ఎందరో రాజనీతి శాస్త్రవేత్తలు, పరిశోధకులు ఈ దేశంలో ఎన్నికలపై ప్రజల ఓటింగ్ ప్రవర్తనపై నిర్వహించిన అనేక అధ్యయనాలు భారతదేశ ఓటర్లపై మతం, కులం వంటి సామాజిక అంశాల ప్రభావం, ఎంత బలంగా ఉందో వివరించాయి. అయితే ఇటీవల కాలంలో నిర్వహించిన కొన్ని అధ్యయనాలు ఓటింగ్ ప్రవర్తనపై సామాజిక అంశాల ప్రభావం క్షీణించటం ప్రారంభమైనదని వివరిస్తున్నాయి. ఈ అధ్యయనాల ప్రకారం భారతదేశ ఓటర్లలో క్రమంగా స్వతంత్రంగా నిర్ణయాలు చేసే స్థాయికి ఎదుగుతున్నారు.

అయితే పాల్‌బ్రాస్ అభిప్రాయం ప్రకారం భారతదేశంలోని వివిధ ఎన్నికలలో పలు అంశాలు కీలకపాత్రను వహిస్తున్నాయి. ఈ దేశంలో ఇప్పటివరకు నిర్వహించిన వివిధ ఎన్నికలలో వివిధ అంశాలు ఓటర్లను తీవ్రంగా ప్రభావితం చేసాయి. కొన్ని ఎన్నికలలో కొన్ని ప్రత్యేక అంశాలు ఎన్నికల ఫలితాలను మలుపుతిప్పే కెరటాలను (Waves) సృష్టించాయని బ్రాస్ పేర్కొన్నాడు. పాల్‌బ్రాస్ కొన్ని ఉదాహరణలను కూడా పేర్కొన్నాడు. ఈ సందర్భంలో పాల్‌బ్రాస్ అభిప్రాయం ప్రకారం 1967లో నిర్ణయింపబడిన నాలుగవ సాధారణ ఎన్నికలలో ధరల పెరుగుదల, నిత్యావసర వస్తువుల కొరత, ఉద్యోగులు, విద్యార్థులలో ప్రభుత్వం పట్ల అసమ్మతి మొదలైన అంశాలు ఉత్తరభారతదేశంలో కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా ప్రబలమైన వేవ్ సృష్టించాయి. 1971, 1972 సంవత్సరాలలో నిర్వహియచిన లోక్‌సభ, కొన్ని రాష్ట్రాలకు జరిగిన ఎన్నికలలో బంగ్లాదేశ్ విముక్తి, ప్రధాన మంత్రి శ్రీమతి ఇందిరాగాంధీ పోషించిన పాత్ర, ఇందిరా కాంగ్రెస్‌కు అనుకూలంగా శక్తివంతమైన వేవ్‌ను సృష్టించాయి. 1977లో నిర్వహించిన పార్లమెంట్ ఎన్నికలలో 1975లో కేంద్రప్రభుత్వం విధించిన అత్యవసర పరిస్థితిపట్ల ప్రజలలో పెల్లుబికిన అసమ్మతి ఇందిరాకాంగ్రెస్‌కు వ్యతిరేకంగా పనిచేసి జనతాపార్టీ ఘనవిజయాన్ని సాధించేందుకు దోహదం చేసింది. 1984లో పార్లమెంట్ ఎన్నికలలో శ్రీమతి ఇందిరాగాంధీ హత్య రాజీవ్‌గాంధీ పట్ల ప్రజలలో పెల్లుబికిన సానుభూతి పవనాలు కాంగ్రెస్ పార్టీకి ఘనవిజయాన్ని సాధించి పెట్టాయి. అయితే 1990 దశాబ్దంలో నిర్వహించిన వివిధ లోక్‌సభ ఎన్నికల ఫలితాలను మలుపుతిప్పే పవనాలు ఏవీ సంభవించలేదు. అందుచేత ఈ ఎన్నికలలో ఏ రాజకీయపార్టీ స్పష్టమైన మెజారిటీని పొందలేకపోయిందని రాజనీతి విశ్లేషకులు అభిప్రాయపడ్డారు.

## 14.8 సారాంశము :

ఈ పాఠంలో భారతదేశంలో నిర్వహిస్తున్న ఎన్నికలకు సంబంధించిన అనేక అంశాలను కూలంకషంగా చర్చించటం జరిగింది. ఈ ఎన్నికలను నిర్వహిస్తున్న తీరును, వివిధ అంశాల పాత్రను, ఓటర్ల ప్రవర్తనా విధానాన్ని సమగ్రంగా విశ్లేషించటం జరిగింది. భారతదేశంలో ఎన్నికలు రాజకీయ వ్యవస్థనుంచి విడదీయలేని అంశంగా రూపొందాయి. భారతదేశ రాజకీయ స్వరూపాన్ని, అభివృద్ధిని ఎన్నికలే తీర్చిదిద్దుతున్నాయని చెప్పడం సమంజసం. భారతదేశం ఆధునికీకరణ చెందుతున్నప్పటికీ ఎన్నికలపై సాంప్రదాయ శక్తుల ప్రభావం గణనీయంగా ఉంది. అందుచేత ఎన్నికల ఫలితాలను, ఓటర్ల ప్రవర్తనను ప్రగాఢంగా ప్రభావితం చేస్తున్న మతం, కులం, ధనం మొదలైన అంశాలపై విపరీతమైన స్థాయిలో చర్చ జరుగుతున్నది. ఈ చర్చ వల్ల భారతదేశంలో ఎన్నికలకు సంబంధించిన అనేక ఆసక్తికరమైన వాస్తవాలు వెల్లడవుతున్నాయి. ఈ పరిజ్ఞానం దేశరాజకీయ వ్యవస్థ అవగాహనకేకాక, రాజనీతి శాస్త్రం అభివృద్ధికి కూడా తోడ్పడుతున్నది.

## 14.9 మాదిరి ప్రశ్నలు :

1. భారతదేశంలో ఎన్నికల ప్రాధాన్యతను, ప్రక్రియను వివరించండి.
2. భారతదేశంలో ఇప్పటివరకు జరిగిన ఎన్నికల ఫలితాలను విశ్లేషించండి.
3. భారతదేశంలో ఎన్నికలలో కులం, మతం మొదలైన సామాజిక అంశాల పాత్రను వివరించండి.
4. భారతదేశంలో ఎన్నికలపై ఇప్పటివరకు నిర్వహించిన పరిశోధనల ఫలితాలను విశ్లేషించండి.
5. భారతదేశంలో ఎన్నికలలో ఓటర్ల ప్రవర్తనపై మీ అభిప్రాయాన్ని వివరించండి.

## 14.10 చదువదగిన గ్రంథాలు :


1. Paul R. Brass, The Politics of India, since Independence, Cambridge : Cambridge Univer sity Press, 1990 (2nd Edition).
2. Bipin Chandra and others, India After Independence - 1947 - 2000, New Delhi, Penguin Books, 2000.
3. Atul Kohli (ed.), The Success of India's Democracy, Cambridge : Cambridge University Press, 2001.
4. Rajani Kothari, Politics in India, Bostan : Little Brown and Company, 1970.
5. Rajani Kothari, Caste in Indian Politics, New Delhi : Orient Logman, 1970.
6. Sudipta Kavi Raj (ed.) New Delhi : Oxford University Press, 1997.
7. A.P. Avasthi, Indian Political System, Agra : Lakshminarain Agarwal, 2002.



**రచయిత : ఎమ్. రవిశేఖర్**

**అసిస్టెంట్ ప్రొఫెసర్,**

పాఠం - 15

# పార్టీల మార్పిడి రాజకీయాలు

## (POLITICS OF DEFECTIONS)

**విషయసూచిక**


15.0 లక్ష్యం

15.1 ఉపోద్ఘాతం

15.2 పార్టీల మార్పిడి - అర్థం - స్వభావం

15.3 భారతదేశంలో పార్టీల మార్పిడి చరిత్ర - పరిమాణం

15.4 పార్టీల మార్పిడికి కారణాలు

15.5 పార్టీల మార్పిడిల నిరోధక చర్యలు

15.6 పార్టీ మార్పిడి నిరోధక చట్టం, 1985

15.7 1985 పార్టీల మార్పిడి చట్టంలో సవరణలు

15.8 సారాంశము

15.9 మాదిరి ప్రశ్నలు

15.10 చదువదగిన గ్రంథాలు


### 15.0 లక్ష్యం :

భారతీయ రాజకీయ వ్యవస్థ కీలక లక్షణంగా రూపొందిన పార్టీల మార్పిడి ప్రక్రియపై సమగ్రమైన అవగాహనను విద్యార్థులలో ఏర్పరచటం ఈ పాఠం ప్రధాన లక్ష్యం. ఈ పాఠం రాజకీయపార్టీల మార్పిడికి సంబంధించిన ఈ క్రింది అంశాలను వివరిస్తుంది.

1. పార్టీల మార్పిడి అర్థం, స్వభావం
2. భారతదేశంలో పార్టీల మార్పిడి చరిత్ర, విస్తృతి, కారణాలు
3. భారతదేశంలో రాజకీయ వ్యవస్థపై పార్టీల మార్పిడి ప్రభావం
4. భారతదేశంలో పార్టీల మార్పిడి నిరోధానికి ప్రవేశపెట్టిన సంస్కరణలు

### 15.1 ఉపోద్ఘాతం :

రాజనీతిజ్ఞుల విశ్లేషణ ప్రకారం 1967 తరువాత పార్టీల మార్పిడి భారతదేశంలో రాజకీయపార్టీ వ్యవస్థ కీలక లక్షణంగా రూపొందింది. అనేక రాష్ట్రాలలో పార్టీల మార్పిడి ఒక సాధారణ విషయమైంది. 1967 - 70 మధ్యకాలంలో వివిధ రాష్ట్రాలలో 1827 మంది శాసనసభ్యులు పార్టీలు మారినట్లు అంచనా. పార్టీల మార్పిడిలు అనేక రాష్ట్రాలలో ప్రభుత్వాలు ఏర్పడటానికి, రద్దుకావడానికి దారితీసింది. 1967 - 70 మధ్య కాలంలో బీహార్, హర్యానా, కేరళ, మధ్యప్రదేశ్, పంజాబ్,ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్‌లలో 23 సార్లు ప్రభుత్వాలు మారాయి. ఈ ప్రభుత్వాల మార్పిడిలకు శాసనసభ్యుల పార్టీ మార్పిడికి ఒక ప్రధాన కారణం.

భారతదేశంలో రాజకీయ మార్పిడి 1960 దశాబ్దంలో అవతరించిన ప్రధాన రాజకీయ దృగ్గోచరం. 1967లో జరిగిన నాలుగవ సాధారణ ఎన్నికలు భారత రాజకీయాలలో ఒక నూతన అధ్యాయాన్ని ప్రారంభించాయి. ఈ ఎన్నికల అనంతరం ఈ దేశంలో ఏర్పడిన రాజకీయాలను అస్థిర రాజకీయాలు, అస్పష్ట రాజకీయాలు, మనుగడ రాజకీయాలు, పరిణామ రాజకీయాలు అని పలు ఆకర్షణీయ పదాలను ఉపయోగించి వర్ణించటం జరిగింది. ఇక్బాల్ నారాయణ నాలుగవ సాధారణ ఎన్నికల అనంతరం ఈ భారత రాజకీయాలలో అధికారం కోసం నీతి బాహ్యంగా అన్వేషణ ప్రారంభమైందని పేర్కొన్నాడు. చివరగా భారతదేశ రాజకీయాలలో పార్టీ మార్పిడిల యుగం (Age of Political Defections) ప్రారంభమైందని అనేక మంది రాజనీతి శాస్త్రవేత్తలు ఏకాభిప్రాయంతో పేర్కొన్నారు. ఈ రాజకీయ మార్పిడిల దృగ్గోచరానికి ప్రత్యామ్నాయంగా రాజనీతి శాస్త్రవేత్తలు అనేక పదబంధాలను ఉపయోగించారు. ఈ దృగ్గోచరానికి పార్టీల మార్పిడి, రాజకీయ టర్న్‌కోటిజం (Political Turn - Coatism), తివాచీ మార్పిడి రాజకీయాలు (Politics of Corpet - Crossing) మ్యూజికల్ ఛైర్స్ రాజకీయాలు అని అనేక పేర్లు పెట్టినప్పటికీ చివరకు దీనికి పార్టీల మార్పిడి (Political Defecation) అనే పేరు స్థిరపడి బహుళ ప్రచారంలోకి వచ్చింది. కాశ్యప్ అభిప్రాయం ప్రకారం ఈ దృగ్గోచరం ఫలితంగా భారతదేశ రాజకీయాలను నీతిరహితంగా అధికారం కోసం వెంపర్లాడటం అని అనే ఒక కొత్త ప్రక్రియ రూపుదిద్దుకొని, దేశ రాజకీయాలలో అనేక రూపాలలో ప్రభావితం చేసింది. దీని ఫలితంగా కాంగ్రేసేతర రాజకీయ పార్టీలు తమ సైద్ధాంతిక భావజాలాలను పార్టీ కార్యక్రమాలను విస్మరించి కనీస ఉమ్మడి ప్రణాళిక అనే ప్రాతిపదిక మీద పొత్తులు ఏర్పరచుకోవటం ప్రారంభమైంది.

## 15.2 పార్టీల మార్పిడి - అర్థం - స్వభావం :

మార్పిడి (Defection) అనే పదానికి తన విధి నుండి వైదొలగటం, లేదా విధిని పూర్తిగా విస్మరించటం, లేదా పూర్తిగా నిర్లక్ష్యం చేయటం అని అర్థం ఉంది. అయితే రాజకీయాలలో మార్పిడి అనే పదాన్ని అనేక అర్థాలలో వాడటం జరిగింది. పార్టీ మార్పిడి, పార్టీలను మార్చటం, పార్టీ విధేయతను లేదా పార్టీతో కల సంబంధాన్ని మార్చుకోవటం, తాను ఎన్నికయిన పార్టీ నుంచి వైదొలగి కొత్త పార్టీలో చేరటం, శాసనసభలో ఫ్లోర్‌ను మార్చటం, నూతన పార్టీలో చేరేందుకు తన పార్టీతో సంబంధాలను త్రెంచుకోవటం, పార్టీలను పదే పదే మార్చటం, తన పార్టీని విడచి తిరిగి తన పార్టీలో చేరటం వంటి అనేక పదాలను పార్టీ మార్పిడి అనే పదానికి సమాన అర్థంతో వాడటం జరుగుతున్నది.

ఏమైనప్పటికీ ఇప్పటివరకు రాజకీయాలలో పార్టీ మార్పిడి అనే పదానికి ఖచ్చితమైన, స్పష్టమైన, అందరికి ఆమోదయోగ్యం అయిన నిర్వచనం అంటూ ఏదీలేదు. అయితే ప్రఖ్యాత రాజ్యాంగ నిపుణుడు అయిన సుభాష్ కాశ్యప్ రాజకీయ పార్టీ మార్పిడి అనే పదాన్ని శాస్త్రీయంగా సమగ్రంగా నిర్వచించేందుకు ప్రయత్నించాడు. కాస్యప్ రూపొందించిన నిర్వచనం ప్రకారం ఇతరత్రా పేర్కొనకుండా రాజకీయ మార్పిడిని రాజకీయ పార్టీలో ఏ మార్పునైనా పార్టీ మార్పిడిగా పరిగణించవచ్చును. పార్టీ మార్పిడి వర్తించే సందర్భాలు :

1) ఒక శాసనసభ్యుడు సభ్యునిగా ఎన్నికైన పార్టీని వదలి వేరొక పార్టీలో చేరటం,
2) తన పార్టీకి రాజీనామా చేసి తరువాత స్వతంత్ర అభ్యర్థిగా కొనసాగటం, లేదా
3) ఎన్నికలలో స్వతంత్ర అభ్యర్థిగా విజయం సాధించి ఏదో ఒక రాజకీయ పార్టీలో చేరటం,

వీటితోపాటు తమ పార్టీకి రాజీనామా చేయకుండానే శాసనసభలో కొన్ని అంశాల మీద పార్టీకి వ్యతిరేకంగా ఓటు వేసిన శాసనసభ్యులను కూడా పార్టీ మార్పిడి చేసినవారిగా పరిగణించవచ్చును. ఈ విధంగా నిఘంటువుల్లోని అర్థంతో సంబంధం

లేకుండా మార్పిడి అనే పదానికి ఒక పార్టీతో సంబంధాన్ని విరమించుకొనటం, లేదా వేరే పార్టీలో చేరటం లేదా తన పార్టీకి వ్యతిరేకంగా ఆ పార్టీ అనుకూలంగా ఓటు వేయటం, వేరొక పార్టీతో సంబంధం ఏర్పరచుకోవటం అనే చర్యలు మొత్తం లేదా వాటిలో ఏదో ఒక చర్యను పార్టీ మార్పిడిగా పరిగణించవచ్చును.

1966లో పార్టీ మార్పిడిలో పై నియమింపబడిన వై.బి. చవాన్ సంఘం పార్టీ మార్పిడిని ఈ విధంగా నిర్వచించింది. ఒక పార్టీ గుర్తుపై ఎన్నికయిన శాసనసభ్యుడు పార్లమెంటులోని ఉభయ సభలూ లేదా ఒక రాష్ట్ర లేదా కేంద్రపాలిత ప్రాంతం శాసన సభకు లేదా శాసనమండలికి ఎన్నికయిన తరువాత తన పార్టీతో తన సంబంధాన్ని, లేదా విధేయతను స్వచ్ఛందంగా విరమించుకుంటే ఆ శాసనసభ సభ్యుడ్ని పార్టీ మార్పిడిదారునిగా పరిగణించవచ్చును.

పైన పేర్కొన్న నిర్వచనాల ప్రకారం ఈ క్రింది చర్యలను పార్టీ మార్పిడిగా పేర్కొనవచ్చును.

1) ఒక రాజకీయపార్టీని వదలి, మరో రాజకీయ పార్టీలో చేరటం,
2) ఒక పార్టీ నుంచి మరొక పార్టీకి మారి, తిరిగి తన సొంత పార్టీలో చేరటం,
3) ఒక రాజకీయపార్టీని వదలి, ఏ రాజకీయ పార్టీలో చేరక స్వతంత్ర అభ్యర్థిగా కొనసాగటం,
4) ఒక రాజకీయ పార్టీకి రాజీనామా చేసినప్పటికీ, ఆ పార్టీకే మద్దతును కనపరచటం,
5) ఒక రాజకీయ పార్టీకి రాజీనామా చేసి వేరొక నూతన పార్టీని స్థాపించటం,
6) ఒక రాజకీయ పార్టీ నుంచి రాజీనామా చేసి మరో నూతన పార్టీని స్థాపించి, ఈ పార్టీని తన స్వంత పార్టీలో లేదా వేరొక పార్టీలో విలీనం చేయటం.

పార్టీ మార్పిడికి రాజకీయాధికారం ప్రధాన ప్రేరణ. అయితే కొన్ని ఇతర రాజకీయపరమైన ప్రయోజనాలు కూడా పార్టీ మార్పిడికి ప్రేరణ కల్పించవచ్చును. కొన్ని సందర్భాలలో సైద్ధాంతికపరమైన లేదా విధాన పరమైన విభేదాలు కూడా పార్టీ మార్పిడికి కారణం కావచ్చును. అయితే అత్యధిక సందర్భాలలో అధికార వ్యామోహం లేదా పదవీ వ్యామోహం, రాజకీయ అవకాశవాదం పార్టీల మార్పిడిని ప్రోత్సహిస్తుందని రాజనీతిశాస్త్రవేత్తల అభిప్రాయం. అంటే పదవి లేదా అధికార వ్యామోహం లేదా రాజకీయ అవకాశవాదం పార్టీమార్పిడికి శక్తివంతమైన ప్రేరణ అని వీరి వాదన. కాశ్యప్ సూచించినట్లు ఒకవ్యక్తి భ్రమలు తొలగిపోవటం వల్ల వైరాగ్యం వల్ల, అసంతృప్తి వల్ల లేదా తన ఆత్మ ప్రబోధం ప్రేరణతో పార్టీ మార్పిడికి పాల్పడవచ్చును. ఒక రచయిత అభిప్రాయపడినట్లు వాస్తవానికి అనేక సందర్భాలలో పార్టీ మార్పిడి రాజకీయ లబ్ధివల్ల ప్రభావితం అవుతుంది. ఈ కారణం వల్ల పార్టీ నాయకుల దృష్టిలో పార్టీని మార్చే వ్యక్తులు రాజకీయ నేరస్తులుగా గోచరిస్తారు.

## 15.3 భారతదేశంలో పార్టీల మార్పిడి చరిత్ర - పరిమాణం :

ప్రతి ప్రజాస్వామ్య వ్యవస్థలో ఏదో ఒక పరిమాణంలో రాజకీయపార్టీ మార్పిడి ప్రక్రియ సంభవిస్తుందని రాజకీయ శాస్త్రవేత్తల అభిప్రాయం. బ్రిటన్‌లో విలియం గ్లాడ్‌స్టన్, విన్‌స్టంట్ చర్చిల్ వంటి ప్రపంచ ప్రఖ్యాత రాజకీయ నాయకులు పార్టీ మారినట్లు చెప్పబడింది. భారతదేశంలో కూడా స్వాతంత్ర్యానికి పూర్వం, అనంతరం కొందరు ప్రముఖ రాజకీయవేత్తలు తమ పార్టీలను మార్చినట్లు తెలుస్తుంది. అయితే ఈ దేశంలో 1967 తరువాతే రాజకీయపార్టీ మార్పిడి దేశ రాజకీయాలలో ఒక ప్రధాన ప్రక్రియగా, తీవ్ర సమస్యగా రూపొందింది. 1967కు పూర్వం దేశంలో పార్టీమార్పిడిలు జరిగిన సంఘటనలు ఉన్నప్పటికీ వాటి సంఖ్య పరిమితమేకాక అవి అంతగా ప్రాధాన్యతను సంతరించుకోలేదు.

అయితే 1967లో జరిగిన నాలుగవ సాధారణ ఎన్నికల అనంతరం పార్టీమార్పిడి విస్తృత స్థాయిలో సంభవించటం ఫలితంగా ఎంతో ప్రాచుర్యాన్ని సంతరించుకుంది. 1967 తరువాత కాలంలో దేశంలోని వివిధ రాష్ట్రాలలో పార్టీలు మారిన శాసనసభ్యులు లేదా ఇతర రాజకీయ నాయకుల సంఖ్య విస్తృతమైన స్థాయిలో ఉండటం వలన ఈ పరిస్థితిని అభివర్ణించేందుకు “ఆయారామ్” - “గయారామ్” వంటి అనేక ఆకర్షణీయ పదజాలం వాడుకలోకి వచ్చింది.

ఈ కాలంలో పార్టీల మార్పిడిని ప్రోత్సహించటం ద్వారా రాజకీయ పార్టీలు వివిధ రాష్ట్రాలలో అధికారంలోకి రావటానికి ప్రయత్నించటంతో పార్టీ మార్పిడిని ఒక దుష్ట సాంప్రదాయంగా, అనైతికచర్యగా పరిగణించటం ప్రారంభమైంది. ఆచార్య కృపలాని పేర్కొన్నట్లు శాసనసభలో మెజారిటీని సాధించేందుకు ప్రభుత్వం ప్రయత్నించటం రాజకీయంగా లేదా నైతికంగా సమర్ధనీయం కాదు. అది ఒక అనైతిక చర్య. ఈ చర్య వ్యక్తి, రాజకీయపార్టీ ప్రతిష్టను దిగజారుస్తుంది.

1967 సాధారణ ఎన్నికల అనంతరం దేశంలోని అనేక రాష్ట్రాలలో పార్టీ మార్పిడులు విస్తృత స్థాయిలో చోటుచేసుకున్నాయి. ప్రధానంగా ఉత్తరప్రదేశ్, బీహార్, మధ్యప్రదేశ్, ఒరిస్సా, హర్యానా, పంజాబ్, కేరళలలో విస్తృత సంఖ్యలో పార్టీ మార్పిడులు సంభవించాయి. ఈ రాష్ట్రాల శాసనసభలకు జరిగిన ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీకి అవసరమైన మెజారిటీ రాకపోవటంతో కొన్ని ప్రతిపక్ష పార్టీలు కాంగ్రెస్ పార్టీ నుంచి పార్టీ మార్పిడిలను ప్రోత్సహించి, ప్రభుత్వాలను ఏర్పాటుచేయటం జరిగింది. ఈ సంఘటన భారతదేశంలో పార్టీల మార్పిడి రాజకీయాలకు నాంది. 1967 అనంతరం కాలంలో క్రమంగా పార్టీ మార్పిడి ప్రక్రియ దేశ రాజకీయాలలో విడదీయలేని అంతర్భాగంగా రూపొంది, రాజకీయ వ్యవస్థను అత్యంత గాఢంగా ప్రభావితం చేసింది. 1957 - 67 మధ్య కాలంలో 542 మంది శాసనసభ్యులు, పార్టీ మారినట్లు కాశ్యప్ అంచనా. 1967 మార్చి నుంచి డిసెంబరు వరకు అంటే కేవలం 7 నెలల కాలంలో 438 మంది శాసనసభ్యులు పార్టీలు మారారని కూడా కాశ్యప్ అంచనా. కేరళ, తమిళనాడు, మహారాష్ట్ర, నాగాలాండ్ రాష్ట్రాలు మినహా దేశంలోని అన్ని రాష్ట్రాలలో వివిధ సంఖ్యలో పార్టీ మార్పిడిలు సంభవించాయని కూడా ఈ అంచనాలు తెలిపాయి. కాశ్యప్ 1967 - 70 మధ్యకాలంలో మధ్యప్రదేశ్‌లో 237, ఉత్తరప్రదేశ్‌లో 294, పశ్చిమ బెంగాల్ లో 269, మధ్యప్రదేశ్‌లో 237, బీహార్‌లో 161, గుజరాత్‌లో 142 శాసనసభ్యులు పార్టీలు మారినట్లు పేర్కొన్నాడు. అంతేకాక అనేక ఇతర రాష్ట్రాలకు కూడా స్వల్ప సంఖ్యలో పార్టీ మార్పిడులు సంభవించాయని కాశ్యప్ వివరించాడు.

ఈ విధంగా 1967 తరువాత వివిధ రాష్ట్రాలలో పార్టీ మార్పిడులు విస్తృతంగా చోటుచేసుకోవటానికి కాంగ్రెస్ పార్టీ తన ఆధిక్యతను కోల్పోవటం, ఒకే ప్రధాన కారణంగా అని రాజనీతి శాస్త్రవేత్తలు అభిప్రాయపడ్డారు. 1971లో పార్లమెంటు ఎన్నికలలో , 1972లో వివిధ రాష్ట్రాలకు జరిగిన శాసనసభల ఎన్నికలలో కాంగ్రెస్ తిరుగులేని విజయాన్ని సాధించటంతో అనేక ప్రతిపక్ష పార్టీల నుంచి అధిక సంఖ్యలో శాసనసభ్యులు కాంగ్రెస్ పార్టీలోకి మారారు. ఈ కాలంలో పార్టీ మార్పిడుల పరిస్థితిని అనేకమంది రాజనీతి శాస్త్రవేత్తలు ఈ విధంగా వర్ణించారు. పార్టీల మార్పిడి దేశరాజకీయ వ్యవస్థకు ఒక అంటూ జాడ్యంగా పరిణమించింది. ధనం, అధికార వ్యామోహం ఈ మార్పిడి క్రియలో కీలకపాత్రను పోషించాయి. ఈ కాలంలో దేశ రాజకీయాలలో పార్టీల మార్పిడి అతిసాధారణ లక్షణమైంది. ఈ పరిమాణాలు దేశ రాజకీయాలు, ప్రధానంగా పార్టీ వ్యవస్థకు విపరీతమైన వ్యతిరేక స్థాయిలో ప్రభావితం చేసింది. పార్టీ మార్పిడిల వల్ల కాంగ్రెస్ పార్టీతో పాటు, అన్ని జాతీయ రాజకీయ పార్టీలు బలహీనపడ్డాయి. అనేక రాష్ట్రాలలో ప్రభుత్వాలు వివరీతమైన రాజకీయ అస్థిరతకు గురైయ్యాయి.

1967లో నిర్వహించిన సాధారణ ఎన్నికల తరువాత భారతదేశ రాజకీయాలలో “పార్టీల మార్పిడిల మార్కెట్” (Defections market) అనే నూతన దృగ్గోచరం అవతరించిందని జేమ్స్ మనోర్ పేర్కొన్నాడు. 1967 అనంతరం కాలంలో భారతరాజకీయాలలో పార్టీల మార్పిడి ఒక కీలక అంశంగా రూపొందింది. మనోర్ ఈ ప్రక్రియ రెండు లక్షణాలను వివరించాడు. ఒకటి, పార్టీ మార్పిడిలు కాంగ్రెస్ పార్టీ నుంచి, ఇతర పార్టీలోకి సంభవించాయి. అయితే పార్టీ మార్పిడిలు కాంగ్రెస్ పార్టీ నుంచే

ఎక్కువ సంఖ్యలో సంభవించాయి. అంటే కాంగ్రెస్ పార్టీలోకి మారిన శాసనసభ్యుల సంఖ్య కంటే ఆ పార్టీని వదలి ఇతర పార్టీలలో చేరిన సభ్యుల సంఖ్యే అధికం. దీని ఫలితంగా కనీసం మూడు రాష్ట్రాలలో కాంగ్రెస్ ప్రభుత్వాలు అధికార పీఠాన్ని కోల్పోయాయి. రెండు, అత్యంత క్రమశిక్షణ కలిగిన మార్క్సిస్ట్ సిద్ధాంతానికి కట్టుబడిన వామపక్ష పార్టీలు, హిందూమత తత్వానికి కట్టుబడిన మితవాద పార్టీలు పార్టీ మార్పిడికి అతీతంగా మిగిలిపోయాయి. ఇంకో విధంగా చెప్పాలంటే మితవాద, అతివాద పార్టీలు పార్టీ మార్పిడిలకు లొంగని దృఢమైన పార్టీలుగా తమ ప్రత్యేకతను నిలబెట్టుకున్నాయి. ఈ పార్టీలు అపరిమితమైన కేంద్రీకరణ, క్రమశిక్షణ, సైద్ధాంతిక పరమైన సంగతత్వంత వంటి లక్షణాల ద్వారా తమ వ్యవస్థాపరమైన సమగ్రతను పరిరక్షించుకోగలిగాయి.

1975 అనంతరం కూడా పార్టీ మార్పిడి సమస్య తీవ్రస్థాయిలో కొనసాగింది. ఈ కాలంలో అనేకమంది ప్రతిపక్షాలకు చెందిన పార్లమెంటు సభ్యులు, శాసనసభ్యులు కాంగ్రెస్‌లోకి మారారు. అయితే ఈ పార్టీ మార్పిడి ప్రభావానికి కాంగ్రెస్ కూడా గురికాక తప్పలేదు. 1977లో లోక్‌సభ ఎన్నికలను ప్రకటించాక, జగ్జీవన్‌రామ్ మొదలైన కొందరు ప్రముఖ నాయకులు కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి, కాంగ్రెస్ ఫర్ డెమోక్రసీ అనే నూతన పార్టీని స్థాపించారు. తరువాత ఈ పార్టీని రద్దుచేసి, నూతనంగా అవతరించిన జనతాపార్టీలో చేరారు.

1977 లోక్‌సభ ఎన్నికల తరువాత కేంద్రంలో అధికారంలోకి వచ్చిన జనతాపార్టీ తన పరిస్థితిని మెరుగుపరిచేందుకు పార్టీ మార్పిడిని ప్రోత్సహించింది. అయితే 1979లో జనతాపార్టీ తానే పార్టీల మార్పిడికి గురియై, విచ్ఛిన్నమైంది. 1980లో జరిగిన లోక్‌సభ మధ్యంతర ఎన్నికల తరువాత కేంద్రంలో తిరిగి అధికారాన్ని చేపట్టిన కాంగ్రెస్ (ఐ) ప్రభుత్వం జనతాపార్టీ మాదిరే పార్టీ మార్పిడిని ప్రోత్సహించింది. ఈ పార్టీల మార్పిడి ఫలితంగా హిమాచల్‌ప్రదేశ్, హర్యానా రాష్ట్రాలలో జనతాపార్టీ ప్రభుత్వాలు పతనమై, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగలిగింది.

1990 దశాబ్దంలో దేశంలో సంభవించిన వివిధ రాజకీయ పరిణామాలు పార్టీ మార్పిడి నిరోధక చట్టం మొదలైన కారణాలవల్ల పార్టీ మార్పిడిల సంఖ్య క్షీణించింది.

## 15.4 పార్టీల మార్పిడికి కారణాలు :

రాజనీతి శాస్త్రవేత్తలు భారతదేశ రాజకీయాలలో అత్యంత తీవ్రమైన సమస్యగా రూపొందిన పార్టీ మార్పిడికి కారణాలను అన్వేషించారు. కాశ్యప్ పార్టీ మార్పిడికి కారణభూతమైన అనేక కారణాలను గుర్తించాడు. అవి :

1) భారతదేశంలో రాజకీయ పార్టీల చరిత్ర - స్వభావం
2) రాజకీయ పార్టీలలో సైద్ధాంతిక నిబద్ధత, నైతిక విలువల లోపం
3) రాజకీయ పార్టీల నాయకులలో పెరిగిన ఆధిక్యతా భావం
4) 1967 సాధారణ ఎన్నికల తరువాత పార్లమెంటు, శాసనసభలలో అస్థిరమైన స్వల్పమెజారిటీలు.
5) రాజకీయ నాయకులలో, శాసనసభల సభ్యులలో పెరిగిన ధన, అధికార కాంక్ష
6) రాజకీయ పార్టీలలో పెరిగిన వర్గ సంస్కృతి
7) రాజకీయ పార్టీలపై ఒత్తిడి గణాలు, ఇతర వర్గాల పెరిగిన ప్రభావం
8) రాజకీయ పార్టీల నాయకులు, శాసనసభల సభ్యుల మధ్య పెరిగిన అభిప్రాయ భేదాలు, సంఘర్షణ
9) రాజకీయ ప్రక్రియలో, రాజకీయ పార్టీల కార్యకలాపాలలో, ప్రజలకు తగిన భాగస్వామ్యం లేకపోవటం.

ఈ విధంగా భారతదేశంలో పార్టీల మార్పిడి విస్తృత పరిమాణాన్ని సంతరించుకొనటానికి, అది ఒక తీవ్రమైన సమస్యగా పరిణమించటానికి అనేక కారణాలను గుర్తించారు. అయితే ఈ కారణాలలో రాజకీయ నాయకులలో పెరిగిన స్వార్థపరత్వం, విలువల రాహిత్యం ప్రధానకారణమైందని అనేక మంది రాజనీతి శాస్త్రవేత్తలు ఏకాభిప్రాయంతో ఉద్ఘాటించారు. ఒక రచయిత కేవలం స్వార్థపరత్వం ఒకటే పార్టీల మార్పిడి ఆధారం అని పేర్కొన్నారు. 1971లో జరిగిన గవర్నర్ల సమావేశం కూడా పదవీకాంక్ష, ఇతర స్వప్రయోజనాలు పార్టీలు మారటానికి కారణం అని పేర్కొంది. పార్టీల మార్పిడి వల్ల దేశ రాజకీయాలలో క్రమశిక్షణ రాహిత్యం, అవినీతి బాగా అభివృద్ధి చెందుతాయని కూడా గవర్నర్ల సమావేశం అభిప్రాయపడింది.

## 15.5 పార్టీల మార్పిడిల నిరోధక చర్యలు :

1967 సాధారణ ఎన్నికల తరువాత దేశ రాజకీయాలలో పార్టీ మార్పిడి ఒకే అంటువ్యాధిలా ప్రబలి అనేక తీవ్ర పరిణామాలకు దారి తీసింది. పార్టీ మార్పిడుల ఫలితంగా అనేక రాష్ట్రాలలో రాజకీయ అస్థిరత, రాజకీయ సంక్షోభం తలెత్తాయి. దీని ఫలితంగా ప్రభుత్వం, రాజ్యాంగ నిపుణులు, రాజకీయవేత్తలు, రాజనీతి శాస్త్రవేత్తలు మొదలైనవర్గాలు పార్టీల మార్పిడి సమస్యపై దృష్టిని సారించకతప్పలేదు. 1968లో అప్పటి కేంద్ర ప్రభుత్వం ఈ పార్టీ మార్పిడిల నిరోధానికి తగిన సూచనలను చేసేందుకు వై.బి. చవాన్ అధ్యక్షతన ఒక సంఘాన్ని నియమించింది. వై.బి. చవాన్ అధ్యక్షుడుగా ఉండటంవల్ల ఈ సంఘాన్ని 'చవాన్ సంఘంగా' వ్యవహరించారు. ఈ సంఘం పార్టీల మార్పిడిని నిరోధించేందుకు అనేక సూచనలను చేసింది. ఈ సూచనలలో ప్రధానమైనవి ఈ క్రిందివి :

1) పార్టీల మార్పిడికి పాల్పడిన వ్యక్తులను మంత్రులు, స్పీకర్, డిప్యూటీ స్పీకర్, ప్రభుత్వరంగ సంస్థల ఛైర్మన్లు మొదలైన పదవులలో నియమించరాదు.

2) రాష్ట్రాల మంత్రిమండలి సంఖ్య శాసనసభ్యులు మొత్తం సంఖ్యలో 10 శాతం లేదా 11 శాతానికి మించరాదు.

3) శాసనసభలో తన శాసనసభ్యుల పార్టీ మార్పిడి ఫలితంగా అధికారపార్టీ తన మెజారిటఅని కోల్పోయిన పరిస్థితులలో సంబంధిత ముఖ్యమంత్రికి శాసనసభను రద్దుచేయమని కోరే అధికారం ఉండాలి.

4) ఎన్నికైన ప్రతి శాసనసభ్యుడు తన పార్టీ క్రమశిక్షణకు కట్టుబడి ఉండాలి. ఏ పరిస్థితిలోనూ, పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘించరాదు.

5) రాజకీయ పార్టీలు ఇతర పార్టీలకు చెందిన సభ్యులను చేర్చుకోరాదనే ప్రవర్తనా నియమావళిని ఏర్పరచుకోవాలి.

చవాన్ సంఘం చేసిన సూచనల ఆధారంగా 1973 మే లో కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగం (32వ సవరణ) బిల్లు లేదా పార్టీ మార్పిడి వ్యతిరేక బిల్లు (Anti - Defection) అనే బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టింది. ఈ బిల్లును సెలక్ట్ కమిటీకి నివేదించారు. 1977లో లోక్‌సభ రద్దుకావటంతో ఈ బిల్లు రద్దయినది. కానీ 1977లో కేంద్ర అధికారంలోకి వచ్చిన జనతాపార్టీ ప్రభుత్వం పార్టీ మార్పిడి సమస్యను తీవ్రంగా పరిగణించి మార్పిడిలను నిరోధించేందుకు తగిన సూచనలను చేసేందుకు అప్పటి ప్రధానమంత్రి మొరార్జీ దేశాయ్ అధ్యక్షతన ఒక క్యాబినెట్ సంఘాన్ని నియమించింది. చరణ్‌సింగ్, అద్వాని, జగ్జీవన్‌రాం ఈ సంఘంలోని సభ్యులు. అయితే ఈ సంఘం తన నివేదికను సమర్పించక ముందే కేంద్రంలో జనతాప్రభుత్వం మారిపోయి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా పార్టీ మార్పిడిని నిరోధకానికి ఒక బిల్లును రూపొందించి పార్లమెంటులో ప్రవేశపెట్టింది. అయితే పార్లమెంటులో వివిధ పార్టీల మధ్య ఏకాభిప్రాయం కుదరకపోవటంతో ఈ బిల్లు పార్లమెంటు ఆమోదానికి నోచుకోలేదు.

## 15.6 పార్టీ మార్పిడి నిరోధక చట్టం, 1985 :

1967 నుంచి 1984 వరకు జాతీయ, రాష్ట్రస్థాయిల్లో పార్టీ మార్పిడిని నిరోధించేందుకు ప్రభుత్వం చేసిన ప్రయత్నాలేవీ ఫలించలేదు. 1984లో కేంద్రంలో రాజీవ్‌గాంధీ నాయకత్వములో ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం తన తొలి చర్యగా పార్టీ మార్పిడిని చట్టబద్ధంగా నిరోధించటం ద్వారా ఆ సమస్యను పరిష్కరించే ఉద్దేశ్యంతో 1985లో పార్టీ మార్పిడి నిరోధక బిల్లును రూపొందించి పార్లమెంటులో ప్రవేశపెట్టింది. పార్లమెంటు ఈ బిల్లును ఆమోదించటంతో అది చట్టం అయింది. ఈ చట్టం అధికారిక పేరు రాజ్యాంగం (52వ సవరణ) చట్టం, 1985. ఒక పార్టీ ప్రతినిధిగా ఎన్నికయిన శాసనసభ లేదా పార్లమెంటు సభ్యులు ఎన్నికల తర్వాత ఇతర పార్టీలో చేరకుండా నిరోధించటం పార్టీ మార్పిడి నిరోధక చట్టం ప్రధాన లక్ష్యం. పార్టీ మార్పిడిని నిరోధక చట్టం ప్రకారం ఒక పార్టీ ప్రతినిధిగా పార్లమెంటు లేదా ఒక రాష్ట్ర శాసనసభ సభ్యునిగా ఎన్నికైన అభ్యర్థి ఈ క్రింది పరిస్థితులలో తాను ఎన్నికైన సభ సభ్యత్వాన్ని కోల్పోతాడు.

1) తన సభ్యత్వాన్ని స్వచ్ఛందంగా త్యజించినప్పుడు

2) తన పార్టీ ఇచ్చిన ఆదేశానికి విరుద్ధంగా సభలో తన పార్టీకి వ్యతిరేకంగా ఓటు వేసినప్పుడు, లేదా ఓటింగ్‌లో పాల్గొనకుండా గైర్హాజరైనపుడు

పార్టీ మార్పిడి నిరోధక చట్టం ఇతర అంశాలు

1) పార్లమెంటు లేదా ఒక రాష్ట్ర శాసనసభకు ఒక పార్టీ అభ్యర్థిగా ఎన్నికైన సభ్యుడు ఎన్నికల తరువాత ఇతర పార్టీలో చేరినపుడు ఆ సభ సభ్యత్వాన్ని కోల్పోతాడు.

2) శాసనసభ లేదా పార్లమెంటరీ పార్టీలో చీలిక సంభవించినపుడు, ఆ పార్టీకి చెందిన మొత్తం సభ్యులలో 1/3 వంతుకు తక్కువ కాకుండా సభ్యులు ఆ పార్టీ నుంచి వైదొలగినపుడు ఆ చీలిక వర్గానికి చెందిన సభ్యులు పార్టీ మార్పిడి కారణంచేత తమ శాసనసభ లేదా పార్లమెంటు సభ్యత్వాన్ని కోల్పోరు. అంతేకాక ఆ వర్గం ఒక స్వతంత్ర పార్టీగా పరిగణింపబడుతుంది.

3) ఒక రాజకీయ పార్టీ మరొక రాజకీయ పార్టీలో విలీనమైనపుడు, ఆ విలీనం చెందిన పార్టీ సభ్యులు తమ శాసనసభ సభ్యత్వాన్ని కోల్పోరు. అయితే ఆ విలీనాన్ని శాసనసభ పక్షంలోని 1/3 వ వంతు సభ్యులు ఆమోదించాలి.

4) లోక్‌సభ లేదా రాష్ట్రశాసనసభ స్పీకర్‌గా లేదా ఉపసభాపతిగా లేదా రాజ్యసభ ఉపాధ్యక్షునిగా లేదా ఒక రాష్ట్ర శాసనమండలి అధ్యక్షునిగా లేదా ఉపాధ్యక్షునిగా ఎన్నికైన సభ్యుడు తన సభ్యత్వాన్ని కోల్పోడు.

5) పార్టీ నిరోధక చట్టానికి అనుగుణంగా ఒక సభ సభ్యుడు అనర్హతకు గురవుతాడా ? లేదా ? అనే ప్రశ్న తలెత్తినపుడు ఆ ప్రశ్న సంబంధిత సభ స్పీకర్‌కు లేదా అధ్యక్షుని నిర్ణయానికి నివేదించబడుతుంది. ఈ విషయంలో స్పీకర్ లేదా అధ్యక్షుని నిర్ణయమే అంతిమమైంది.

## 15.7 1985 పార్టీల మార్పిడి చట్టంలో సవరణలు :

1985లో ప్రవేశపెట్టిన పార్టీ మార్పిడిల నిరోధక చట్టంలో అనేక లోపాలు వెల్లడవటంతో కేంద్ర ప్రభుత్వం ఈ చట్టా న్ని సవరిస్తూ రాజ్యాంగం 91వ సవరణ చట్టం 2003 ను ప్రవేశపెట్టింది. 1985 పార్టీమార్పిడిల నిరోదక చట్టంలోని లోపాలను తొలగించాలని అనేక రాజకీయ పార్టీల నుంచి ఒత్తిడి రావటంతో కేంద్ర ప్రభుత్వం ఈ సవరణ చట్టాన్ని చేయక తప్పలేదు. ఈ నూతన చట్టంలో చేర్చిన అనేక అంశాలకు రాజ్యాంగం సవరణ కమీషన్ తన మధ్యంతర నివేదికలో చేసిన సూచనలు ఆధారం. ఈ కమీషన్ చేసిన చేసిన సూచనలు

1) ఒక పార్లమెంట్ సభ్యుడు లేదా రాష్ట్ర శాసనసభ్యుడు వ్యక్తిగతంగా లేదా కొందరు సభ్యులతో కలసి తాను పార్లమెంటుకు లేదా శాసనసభకు ఎన్నికైన పార్టీని మార్చినపుడు ఆ పార్లమెంటు సభ్యుడు లేదా శాసనసభ్యుడు తన సభ్యత్వానికి రాజీనామా చేసేలా లేదా అతని సభ్యత్వం రద్దుఅయ్యేలా రాజ్యాంగ 10వ షెడ్యూల్‌ని సవరించాలి.

2) పార్టీలను మార్చిన వ్యక్తులు మంత్రి పదవులు లేదా లాభదాయకమైన ఏ రాజకీయ పదవినీ చేపట్టకుండా నిషేధించాలి.

3) ప్రభుత్వాన్ని అధికారం నుంచి తొలగించేందుకు పార్టీ మారిన సభ్యుడు వేసే ఓటును రద్దుచేయాలి.

4) పార్టీ మారిన సభ్యుడి సభ్యత్వాన్ని రద్దుచేయటంలో తుది నిర్ణయం సంబంధిత సభ స్పీకర్ లేదా అధ్యక్షునికికాక ఎలక్షన్ కమీషన్‌కు ఉండాలి.

5) మంత్రి మండలిలోని మంత్రుల సంఖ్య సంబంధిత దిగువ సభ మొత్తం సభ్యుల సంఖ్యలో పది శాతానికి మించకుండా ఉండేలా చూసే చట్టాన్ని రూపొందించాలి.

జాతీయ రాజ్యాంగ సవరణ కమీషన్ ప్రతిపాదించిన పై సూచనలను ఆమోదించి, అనుసరించినప్పటికీ వాస్తవంలో 91వ రాజ్యాంగ సవరణ చట్టం ఆసూచనలను యధాతథంగా స్వీకరించలేదు. ఈ చట్టం మంత్రి మండలిలో మంత్రుల సంఖ్య సభ మొత్తం సభ్యులలో 15 శాతం వరకు ఉండవచ్చునని నిర్దేశించినది. ఈ చట్టం కేంద్ర ప్రభుత్వం లేదా రాష్ట్రాల స్థాయిలో మంత్రుల సంఖ్యను పరిమితం చేయటానికి బదులు వారి సంఖ్య ఎక్కువగా ఉండేందుకు అవకాశాన్ని కల్పించింది. అంతేకాక ఈ చట్టం ప్రభుత్వాలు క్యాబినేట్ మంత్రుల హోదాతో సమానమైన పదవులను సృష్టించటంపై ఎటువంటి నిబంధనను విధించలేదు. అయితే ఈ చట్టం సభలోని మొత్తం సభ్యులలో 1/3 వ వంతు సంఖ్యకు తక్కువ కాకుండా పార్టీని మార్చే సభ్యులకు గత చట్టం కల్పించిన రక్షణను తొలగించింది. అయితే ఈ సవరణ చట్టం సభలోని 1/3 వంతు సభ్యులు పార్టీని మారితే అది పార్టీ మార్పిడిగా పరిగణించబడదని గత చట్టంలో పొందుపరచిన నిబంధనను కొనసాగించింది. ఈ విధంగా ఈ సవరణ చట్టం సామూహిక పార్టీ మార్పిడిలను నిరోధించటానికి ఎటువంటి చర్యను ప్రతిపాదించలేదు. దీని ఫలితంగా పార్లమెంటు సభ్యులు లేదా శాసనసభల సభ్యులు సామూహికంగా పార్టీ మార్చే అవకాశం ఉంది. సామూహికపార్టీ మార్పిడి వ్యక్తిగత పార్టీ మార్పిడి కన్నా ప్రమాదకరమైనది. అందుచేత 2003లో ప్రవేశపెట్టిన సవరణ చట్టం కూడా గత చట్టంలాగే పార్టీ మార్పిడిలను సమర్థవంతంగా నిరోధించలేదని సుబాష్ కాశ్యప్ వంటి రాజ్యాంగ నిపుణుల అభిప్రాయం. ఈ సవరణలోని కొన్ని ఇతర లోపాలను కూడా రాజ్యాంగ నిపుణులు వెల్లడించారు. మొత్తంమీద భారతదేశ రాజకీయ స్థిరత్వానికి, ప్రజాస్వామ్య మనుగడకు సవాలుగా రూపొందిన పార్టీ మార్పిడిల ప్రక్రియను నిరోధించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో ప్రయత్నించటం లేదనీ, ఈ సమస్యను పరిష్కరించటంలో ప్రభుత్వం తాత్కాలికమైన చర్యలనే చేస్తున్నదే తప్ప ఆ సమస్యకు శాశ్వతమైన పరిష్కారానికి కల్పించే పరిపూర్ణమైన చర్యలేవీ చేపట్టటం జరగలేదని రాజ్యాంగ నిపుణుల స్పష్టమైన అభిప్రాయం.

## 15.8 సారాంశము :

ఈ పాఠంలో 1967 తర్వాత కాలంలో భారతదేశ రాజకీయ వ్యవస్థను అమితంగా ప్రభావితం చేసిన పార్టీల మార్పిడి ప్రక్రియ వివిధ అంశాలను సమగ్రంగా విశ్లేషించటం జరిగింది. 1967లో ప్రారంభమైన పార్టీల మార్పిడి ప్రక్రియ క్రమంగా ఉధృతమవుతూ, దేశ రాజకీయ వ్యవస్థపై అనేక పరిణామాలను కలుగజేసింది. 1960, 70 దశాబ్దాలలో అనేక రాష్ట్రాలలో ప్రభుత్వాలు తరచూ మారటానికి, దాని ఫలితంగా రాజకీయ అస్థిరత ఏర్పడటానికి పార్టీల మార్పిడి కారణభూతమైంది. 1980 దశాబ్దంలో ఈ సమస్య తీవ్రతపై దేశరాజకీయ నాయకత్వం తన దృష్టిని కేంద్రీకరించింది. దేశరాజకీయ వ్యవస్థకు పెద్ద సవాలుగా మారిన పార్టీల మార్పిడిని నిరోధించటానికి ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. 1985లో పార్టీల మార్పిడిని నిరోధిస్తూ,

పార్లమెంటు ఒక చట్టాన్ని రూపొందించింది. ఈ చట్టం వల్ల అనేక సత్ఫలితాలు కలిగాయి. 1980 దశాబ్దం నుంచి ఈ చట్టం ఫలితంగా పార్టీల మార్పిడి సమస్య క్షీణించటం మొదలుపెట్టింది. అయినప్పటికీ ఈ సమస్య పూర్తిగా సమసిపోలేదు. 1990 దశాబ్దంలో కూడా ఏదో ఒక రూపంలో పార్టీల మార్పిడి రాజకీయ వ్యవస్థను ప్రభావితం చేస్తూనే ఉంది. అందుచేతే ఇటీవల కాలంలో నియమించబడిన రాజ్యాంగం సమీక్షా సంఘం పార్టీల మార్పిడి సమస్యపై ప్రత్యేక శ్రద్ధను కనపరచి, ఈ సమస్య పరిష్కారానికి కొన్ని సంస్కరణలను సూచించింది.

## 15.9 మాదిరి ప్రశ్నలు :

1. భారతదేశంలో పార్టీల మార్పిడి ప్రక్రియను విశ్లేషణాత్మకంగా పరిశీలించండి.
2. భారతదేశంలో రాజకీయ వ్యవస్థపై పార్టీల మార్పిడి ప్రభావాన్ని వివరించండి.
3. భారతదేశంలో పార్టీల మార్పిడికి కల కారణాలను చర్చించండి.
4. భారతదేశంలో పార్టీల మార్పిడి నిరోధానికి ప్రభుత్వం చేపట్టిన చర్యలను, వాటి ఫలితాలను విశ్లేషించండి.
5. భారతదేశంలో పార్టీల మార్పిడి నిరోధానికి ప్రవేశపెట్టిన పార్టీల మార్పిడి నిరోధకచట్టం ప్రధాన అంశాలను, ఆ చట్టం ప్రభావాన్ని విశ్లేషించండి.

## 15.10 చదువదగిన గ్రంథాలు :


1. Paul R. Brass, The Politics of India, since Independence, Cambridge : Cambridge University Press, 1990 (2nd Edition).
2. Bipin Chandra and others, India After Independence - 1947 - 2000, New Delhi, Penguin Books, 2000.
3. Atul Kohli (ed.), The Success of India's Democracy, Cambridge : Cambridge University Press, 2001.
4. Rajani Kothari, Politics in India, Bostan : Little Brown and Company, 1970.
5. Rajani Kothari, Caste in Indian Politics, New Delhi : Orient Logman, 1970.
6. Sudipta Kavi Raj (ed.) New Delhi : Oxford University Press, 1997.
7. A.P. Avasthi, Indian Political System, Agra : Lakshminarain Agarwal, 2002.


**రచయిత : ప్రొఫెసర్. ఎమ్. బాపూజీ**

**పాఠం - 16**

# రాజకీయ అవినీతి

**విషయసూచిక**


**16.0** లక్ష్యం

**16.1** ఉపోద్ఘాతం

**16.2** రాజకీయ అవినీతి - భావన

**16.3** రాజకీయ అవినీతి అర్థం

**16.4** రాజకీయ అవినీతి - ఒక దృక్పథం

**16.5** అభివృద్ధి చెందుతున్న దేశాలలో రాజకీయ అవినీతి విశ్లేషణ

**16.6** భారతదేశంలో రాజకీయ అవినీతి

**16.7** భారతదేశంలో రాజకీయ అవినీతి ప్రబలటానికి కారణాలు

**16.7.1** వ్యక్తిగత కారకం

**16.7.2** సంస్థాపరమైన కారకం

**16.7.3** రాజకీయ ఇచ్ఛలోపం

**16.7.4** సంక్లిష్టమైన న్యాయవ్యవస్థ

**16.8** రాజకీయ అవినీతిని తొలగించేందుకు మార్గాలు

**16.8.1** లోక్‌పాల్

**16.8.2** లోకాయుక్త

**16.9** సారాంశము

**16.10** మాదిరి ప్రశ్నలు

**16.11** చదువదగిన గ్రంథాలు


## 16.0 లక్ష్యం :

వర్తమాన కాలంలో భారతదేశంలో చర్చనీయాంశంగా మారిన రాజకీయ అవినీతిని వివరించడం ఈ పాఠం లక్ష్యం. ఈ పాఠంలో రాజకీయ అవినీతికి సంబంధించిన ఈ క్రింది అంశాలను వివరించడం జరిగింది.

1) రాజకీయ అవినీతికి సంబంధించిన సైద్ధాంతిక అంశాలు
2) వివిధ దేశాలలో రాజకీయ అవినీతి పరిస్థితి
3) భారతదేశంలో రాజకీయ అవినీతి అభివృద్ధి చెందటానికి దోహదం చేసిన కారణాలు.
4) భారతదేశంలో రాజకీయ అవినీతి వల్ల కలిగిన పరిణామాలు
5) భారతదేశంలో రాజకీయ అవినీతిని నిర్మూలించేందుకు చేపట్టిన చర్యలు

## 16.1 ఉపోద్ఘాతం :

అవినీతి పురాతనమైందీ, ఆధునికమైంది. మానవ చరిత్ర అవినీతికి సంబంధించిన సంఘటనలతో, వివరణలతో నిండివున్నప్పటికీ, అవినీతిపై శాస్త్రీయమైన అధ్యయనం 20వ శతాబ్దపు దృగ్గోచరం. చరిత్రకారులు వ్యక్తుల అవినీతి చర్యలను గురించిన వివరాలను చరిత్రలో పొందుపరచివున్నప్పటికీ, ఒక దశలో అవినీతిని తాత్కాలిక చర్యగా, నేరంగా పరిగణించటం ప్రధాన దృక్పథంగా రూపొందింది. కొందరు రాజనీతి శాస్త్రవేత్తల అభిప్రాయం ప్రకారం అవినీతి వ్యక్తి జీవితంలో యవ్వన దశలాగే పరిణిత దశను చేరుకునేందుకు ముందు అన్ని దేశాలు తప్పనిసరిగా దాటవలసిన దశ. ఈ విధంగా అవినీతి ఒకదేశం ఆధునీకీకరణ చెందే ప్రక్రియలో ఒక ప్రత్యేక దశగా గుర్తింపబడింది.

రాబర్ట్ విలియమ్స్ అనే రాజనీతి శాస్త్రవేత్త 1950, 60వ దశతాబ్దాలలో అనేక దేశాలు రాజకీయ స్వాతంత్ర్యాన్ని పొందటం అవినీతిపైగల అధ్యయనాల స్వభావాన్ని సమూలంగా మార్చివేసిందని పేర్కొన్నాడు. ఈ దశాబ్దాలలో అనేక ఆసియా, ఆఫ్రికా దేశాలు స్వాతంత్ర్యాన్ని సముపార్జించుకొని నూతన దేశాలుగా అవతరించాయి. అభివృద్ధి చెందుతున్న, తక్కువ అభివృద్ధి చెందిన, వెనుకబడిన దేశాలుగా పరిగణింపబడుతున్న ఈ నూతన దేశాల రాజకీయాల అధ్యయనం వివిధ సామాజిక శాస్త్రాలలో ఒక పరిశ్రమగా రూపొందింది. ఈ అధ్యయనాలు ఈ నూతన దేశాలు ఎదుర్కొంటున్న సమస్యలలో అవినీతి కీలకమైన సమస్యగా పరిణమించిందని వెల్లడించాయి. అభివృద్ధి చెందిన దేశాలలోని పరిస్థితికి భిన్నంగా అభివృద్ధి చెందుతున్న దేశాలలో అవినీతి రాజకీయ, ఆర్థిక అపరిపక్వ స్థితికి (Immaturity) ప్రతిబింబమనీ, సామాజిక, విద్యా రంగాలలో ప్రగతిని సాధించడటం ద్వారా అవినీతిని అంతమొందించవచ్చునని వాదించబడింది. ఏమైనప్పటికీ, అనేక అభివృద్ధిచెందుతున్న దేశాలలో అవినీతి సర్వవాప్తమైన, సమాజం మూలల్లోకి చొచ్చుకొని వెళ్ళిన దృగ్గోచరం అనేది అందరూ అమోదించిన వాస్తవం. అభివృద్ధి అనేక సామాజిక, ఆర్థిక రుగ్మతలను తొలగించే పరమ ఔషధం అభివృద్ధి చెందని ఏ దేశమైనా ప్లవన (Take Off) దశను అధిగమించలేదు. అభివృద్ధిని సాధించలేని దేశాలు అవినీతి వంటి తీవ్ర సమస్యలను ప్రత్యక్షంగా ఎదుర్కోవలసి ఉంటుంది.

1980, 90వ దశాబ్దాలలో కొన్ని అభివృద్ధి చెందిన దేశాలలో వెలుగు చూసిన అవినీతి కేవలం ప్రాంతీయ దృగ్గోచరంకాక సార్వజనీన (Universal) దృగ్గోచరంగా గుర్తించబడింది. ఈ సంఘటనల ఫలితంగా అవినీతిపట్ల కల దృక్పథం మౌలికమైన మార్పుకు గురైంది. ఒక సమయంలో నేరంగా స్వల్పమైన, తాత్కాలికమైన అవినీతి ప్రస్తుతం ఒక సర్వసాధారణమైన, లోతుగా వేళ్ళూనుకున్న, శాశ్వతమైన సమస్యగా పరిగణింపబడుతున్నది. నేడు ప్రపంచంలోని వివిధ దేశాలు, ఐక్యరాజ్య సమితి, ప్రపంచ బ్యాంక్, ఇతర అంతర్జాతీయ సంస్థలు పేదరికానికి అవినీతి మూలకారణం అనీ అభివృద్ధికి ప్రధానమైన అవరోధం అనీ ఏకకంఠంతో వాదిస్తున్నాయి. అవినీతిని సమూలంగా నిర్మూలించేందుకు నూతన విధానాల్లో, వ్యూహాల్లో కార్యక్రమాలను రూపొందించి అమలుపరచాలని ఉద్ఘాటించటం జరుగుతున్నది. ఫలితంగా అవినీతి నిర్మూలనకు చేపట్టిన విధానాలలో ప్రాధాన్యతలో మౌలికమైన మార్పు చోటుచేసుకుంది. మొత్తం మీద వర్తమాన కాలంలో ప్రపంచ దేశాలు దృష్టిని కేంద్రీకరిస్తున్న అంశాలలో అవినీతి అతి కీలకమైందనేది అందరూ అంగీకరిస్తున్న వాస్తవం అనటంలో సందేహం లేదు.

## 16.2 రాజకీయ అవినీతి - భావన :

ఇటీవలి కాలంలో అనేక దేశాలలో అవినీతి రాజకీయ పద్ధతిలో అభివృద్ధిచెందింది. అభివృద్ధి చెందుతున్న దేశాలలో ప్రభుత్వాలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య అవినీతి. ఈ ప్రభుత్వాలు అవినీతిని అంతమొందించటం అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశంగా పరిగణించి అనేక చర్యలు చేపడుతున్నాయి. కొందరి అంచనాలకు భిన్నంగా అభివృద్ధి చెందిన దేశాలలో కూడా అవినీతి అభివృద్ధి చెందుతున్నది. ఈ దేశాలలో ప్రజలు, ప్రభుత్వాలు అవినీతిని ఎదుర్కొనటంపై అమితమైన ఆసక్తిని

ప్రదర్శిస్తున్నారు. వ్యక్తులలో కల బలహీనతలే వివిధ దేశాలలో అవినీతికి మూలకారణం అనే వాస్తవాన్ని గుర్తించటం జరిగింది. అయితే దీని వల్ల అవినీతి స్థాయిలో వివిధ దేశాలమధ్య భిన్నత్వం ఉందనే వాస్తవం మరుగున పడింది. వ్యక్తుల బలహీనతలు ప్రధానమైన కారణం అయినప్పటికీ రాజకీయ, ఆర్థిక నిర్మాణాలు, ప్రక్రియలు కూడా అవినీతి వృద్ధిచెందటంలో కీలకపాత్రను పోషిస్తాయి. ఈ కోణం నుంచి చూస్తే వివిధ ఖండాల మధ్య, వివిధ దేశాల మధ్య, ఒకేదేశంలోని వివిధ ప్రాంతాల మధ్య అవినీతి స్థాయిలో విపరీతమైన వ్యత్యాసం గోచరిస్తుంది. ఉదాహరణకు, అమెరికాలో కొన్ని రాష్ట్రాలలో అవినీతి సాధారణమైన విషయం. అయితే కొన్ని ఇతర రాష్ట్రాలలో అవినీతి ఛాయలు కూడా గోచరించవు. ఈ వాస్తవం ఇంగ్లాండ్‌లోని స్థానిక సంస్థలకు కూడా వర్తిస్తుంది.

అవినీతికి అనేక కారణాలు ఉన్నట్లు సామాజిక శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. అవినీతికి మానవ స్వభావం ఒక కారణం. ప్రవర్తనా ప్రమాణాల పట్ల మనస్తత్వ, సాంస్కృతిక సందిగ్ధత మరో కారణం. వలస రాజ్యం నుంచి స్వయంపాలనకు పరిణామం అవినీతికి దోహదం చేస్తుంది. సామాజిక, ఆర్థిక అసమానతలు, వ్యవస్థాపరమైన ఏర్పాట్లు, పద్ధతులలో తరచూ మార్పులను ప్రవేశపెట్టటం అవినీతికి దారితీస్తుంది. ఈ విధంగా అవినీతికి అనేక కారణాలు చెప్పబడ్డాయి. కొందరు సామాజిక శాస్త్రవేత్తలు అవినీతికి, ఆధునికీకరణ ప్రక్రియకు మధ్య సంబంధాన్ని నొక్కి చెప్పారు. వీరి అభిప్రాయం ప్రకారం ఒకే దేశంలో నెలకొన్న అవినీతి స్థాయి ఆ దేశంలోని ఆధునికీకరణ, అభివృద్ధి ప్రక్రియల్లో కల భిన్నత్వాన్ని ప్రతిబింబిస్తుంది. సాధారణంగా ఒక దేశం ఆధునీకీకరణ విస్తృతంగా సంభవిస్తున్న దశలో సమాజంలో అవినీతి వేగంగా ప్రబలుతుందని వీరు వాదిస్తున్నారు. ఈ సమాజంలో సాంప్రదాయ, ఆధునిక ప్రవర్తనా నియమావళుల మధ్య తలెత్తే సంఘర్షణ ఫలితంగా ఆ సమాజంలో ప్రమాణాలు పూర్తిగా క్షీణిస్తాయి. ఈ విధంగా ప్రమాణరాహిత్యం ఏర్పడిన సమాజంలో చట్టబద్ధత కూడా లోపిస్తుంది. దీని ఫలితంగా భిన్నంగా ప్రవర్తించే అవకాశం వ్యక్తులకు లభిస్తుంది. దీంతోపాటు ఆధునికీకరణ సమాజంలో వనరులను కలిగిన నూతన వర్గాలను సృష్టిస్తుంది. ఈ వర్గాలు తమ వనరులను వినియోగించి రాజకీయ అధికారాన్ని పొందటానికి ప్రయత్నిస్తాయి.

రాజకీయ అవినీతి సర్వవ్యాప్తమైన, చరిత్ర అన్ని దశలలో గోచరించే దృగ్గోచరం. వర్తమాన కాలంలో అవినీతి అన్నిరకాల రాజకీయ వ్యవస్థల్లో విభిన్న రూపాలలో గోచరిస్తుంది. 1960 దశాబ్దం నుంచి రాజనీతి శాస్త్రంలో రాజకీయ అవినీతి ఒక ప్రధాన అధ్యయన అంశమైంది. రాజనీతిశాస్త్రంలో ఆధునికీకరణ, రాజకీయ అభివృద్ధితోపాటు రాజకీయ అవినీతిపై కూడా విస్తృతమైన చర్చ కొనసాగుతున్నది. దీనికి అనుగుణంగా రాజకీయ అవినీతిని సిద్ధాంతీకరించే ప్రయత్నాలు మొదలయ్యాయి. వివిధ దేశాలలో రాజకీయ అవినీతి అర్థం, స్వభావం, రూపాలు, కారణాలు, రాజకీయవ్యవస్థపై మొత్తం సమాజంపై రాజకీయ అవినీతి మొదలైన అంశాలపై సిద్ధాంతాలు, భావనలను రూపొందించడం ప్రారంభమైంది. ప్రధానంగా అభివృద్ధి చెందుతున్న దేశాలలో రాజకీయ అవినీతిపై రాజనీతి శాస్త్రవేత్తల దృష్టి కేంద్రీకృతమైంది.

రాజనీతి శాస్త్రంలో అవినీతి, వ్యక్తిగత ప్రయోజనాలకు అధికారాన్ని దుర్వినియోగపరచడం అని అందరూ ఆమోదించిన అతి సాధారణ అర్థం ఉన్నది. కొందరు రాజనీతి శాస్త్రవేత్తలు ప్రభుత్వం లేదా రాజకీయ అధికారాలను నియంత్రించేందుకు రూపొందించిన శాసనపరమైన నియమావళిని ఉల్లంఘించటాన్ని అవినీతిగా పేర్కొన్నారు. ఇతర రాజనీతి శాస్త్రవేత్తలు అవినీతిని ప్రజాభిప్రాయం లేదా ప్రజా ప్రయోజనాలకు కలిగిన విఘాతం నిర్ధారిస్తుందని అభిప్రాయపడ్డారు. రాజకీయ అవినీతిపై కల కొన్ని ఇతర నిర్వచనాలు రాజకీయ కొరతగా ఉన్న సమాజ వనరుల కేటాయింపు పై ఆధారపడిన భావన అని పేర్కొన్నాయి. అయితే ఈ నిర్వచనాలన్నింటిలో కొన్ని లోపాలు ఉన్నాయి. ఉదాహరణకు శాసనాత్మక నియమావళి సామాజిక ప్రమాణాలకు ఉండక పోవచ్చును. ప్రజాభిప్రాయం తఱచు మారుతుండటమేకాక, అది సమర్థవంతంగా వ్యక్తం చేయబడక పోవచ్చును. ప్రజల ప్రయోజనాలపై స్పష్టమైన అభిప్రాయం లేదు. ఈ అంశంపై విభిన్న అభిప్రాయాలు ఉన్నాయి.

## 16.4 రాజకీయ అవినీతి అర్థం :

ప్రభుత్వ ఉద్యోగులు వ్యక్తిగత ప్రయోజనాలకు లేదా తమ వర్గ ప్రయోజనాలకు తనకు అప్పగించిన అధికారాన్ని దుర్వినియోగపరచటమే అవినీతికి అర్థం. తమ వ్యక్తిగత ప్రయోజనాల కొరకు లేదా తమకు సంబంధిత వ్యక్తుల ప్రయోజనాల కొరకు తమకు అప్పగించిన అధికారాన్ని దుర్వినియోగపరచే రాజకీయ నాయకులు, ప్రభుత్వ ఉద్యోగుల ప్రవర్తనలో అవినీతి ఇమిడి ఉన్నది.

చార్లెస్ లెబర్, ఆల్బర్ట్ ఫ్రైస్ మొదలైన రచయితలు అవినీతి ప్రవర్తనపై మూడు రకాలు నిర్వచనాలను గుర్తించారు. అవి

1) ప్రభుత్వ కార్యాలయం చుట్టూ కేంద్రీకృతమైన నిర్వచనాలు;

2) మార్కెట్ చుట్టూ కేంద్రీకృతమైన నిర్వచనాలు;

3) ప్రజల ప్రయోజనాల చుట్టూ కేంద్రీకృతమైన నిర్వచనాలు;

ప్రభుత్వ కార్యాలయం చుట్టూ కేంద్రీకృతమైన నిర్వచనాలు ఒక అధికారిపై ప్రజలు ఉంచిన విశ్వాసాన్ని ఉల్లంఘించటంపై ప్రాధాన్యతను నొక్కిచెప్పాయి. ఈ దృక్పధం ప్రకారం తమ విధుల నిర్వహణలో ఉద్యోగి బృంద ప్రమాణాలైన హేతుబద్ధత, సార్వజనీనత, సాధన దృక్పధాలను ఉల్లంఘించటం అవినీతి. ఈ దృక్పధంతో జేమ్స్‌నై అవినీతిని వ్యక్తిగత ప్రయోజనాలకొరకు నియమాలను, సాధారణ విధులను ఉల్లంఘించే ప్రవర్తన అని నిర్వచించాడు. ఈ నిర్వచనం ప్రకారం లంచాలను స్వీకరించటం, బంధుప్రీతిని కనపరచడం, స్వప్రయోజనాలకు ప్రభుత్వ వనరులను దుర్వినియోగ పరచటం వంటి చర్యలే అవినీతికి అర్థం.

మార్కెట్ చుట్టూ కేంద్రీకృతమైన అవినీతి నిర్వచనాల ప్రకారం ప్రజలకు సేవలను అందించటంలో ప్రభుత్వ ఉద్యోగులు తమ పదవిని తమ స్వప్రయోజనాలను సాధించేందుకు అధికారంగా పరిగణించటమే అవినీతికి అర్థం. ప్రజల ప్రయోజనాల చుట్టూ కేంద్రీకృతమైన నిర్వచనాలు ప్రభుత్వ ఉద్యోగులు తమకు ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా లభించే ప్రయోజనాల కొరకు ప్రజల ఉమ్మడి ప్రయోజనాన్ని నిర్లక్ష్యపరచటమే అవినీతి అని నొక్కి చెప్పాయి.

అవినీతి పరిణామాలపై చర్చ సమాజంపై అవినీతి ప్రభావం సకారాత్మకమైందా ? లేక నకారాత్మకమైందా ? అనే అంశం చుట్టూ కేంద్రీకృతమైంది. అవినీతి నకారాత్మక, దృష్ట పరిణామాలను తీవ్రంగా ఖండించాలని చాలా కాలంపాటు వాదించబడింది. ఈ సాంప్రదాయవాదం 1960 దశాబ్దంలో తీవ్రంగా ఖండించబడింది. ఈ వాదాన్ని ప్రతిపాదించిన రచయితలు అవినీతి వల్ల నిర్లక్ష్యానికి గురయిన అనేక సమాజ అవసరాలు సంతృప్తిపరచబడతాయని పేర్కొన్నారు. కొందరు ఇతర రచయితలు అవినీతి, కొరతగా ఉన్న వనరులను పంపిణీని చేసే సాధనంగా ఉపయోగపడటం, పెట్టుబడులకు అవకాశాన్ని ఏర్పరచటం ప్రైవేటు రంగాన్ని ప్రభుత్వరంగాన్ని, వృద్ధిపరచడం ద్వారా ఆర్థికాభివృద్ధి సాధనకు తోడ్పడుతుందని వాదించారు. మరికొందరు రచయితలు సమాజంపై ఒత్తిడి తెచ్చే డిమాండ్లను సంతృప్తిపరచగలిగిన నూతన, శక్తివంతమైన రాజకీయ సంస్థలను అభివృద్ధి పరచటంలో అవినీతిపాత్రపై తమ దృష్టిని కేంద్రీకరించారు. అవినీతి, ప్రవేశం నిరాకరించబడిన వ్యక్తులకు ప్రభుత్వ ఉద్యోగాలలో ప్రవేశాన్ని కల్పించటం ద్వారా సామాజిక సమైక్యతను సాధిస్తుందని ఇతరుల వాదన.

అవినీతిపై గల ఈ రివిజనిస్టుల వాదనను తీవ్రంగా ఖండించిన రచయితలు అవినీతి దుష్టపరిణామాలను నొక్కిచెప్పారు. ఈ రచయితలు అవినీతి సక్రమంగా వినియోగించవలసిన వనరులను, ఆదాయాలను వృధాచేస్తుందని వాదించారు. అవినీతి రాజకీయ నాయకులపై ఉంచిన విశ్వాసాన్ని, విధేయతలను ఒమ్ముచేయటమే కాక, సమాజంలో వస్తువుల పంపిణీలో అసమానతలను పెంపొందింపచేస్తుందని కూడా వీరి వాదన. కొందరు రాజనీతి శాస్త్రవేత్తలు అధికారంలో ఉన్న రాజకీయనాయకులు తమ

అందుబాటులో ఉన్న వనరులను, పదవులను, సంపదను దుర్వినియోగపరచి రాజకీయ వ్యవస్థపై తమ నియంత్రణను కొనసాగించేందుకు అవినీతిని ఒక సాధనంగా వినియోగిస్తారని పేర్కొన్నారు. ఈ విధంగా అవినీతి రాజకీయ విధేయతను సముపార్జించుకునేందుకు సాధనంగా ఉపయోగిస్తుందని వీరి అభిప్రాయం.

## 16.5 రాజకీయ అవినీతి - ఒక దృక్పధం :

సాధారణ అర్థంలో రాజకీయ అవినీతి అంటే చట్టబద్ధమైన రాజకీయ వ్యవస్థ రూపొందించిన నియమాలను, ప్రమాణాలను ఉల్లంఘించటం. రాజకీయనిర్ణయాల ద్వారా ఏర్పరచిన నియమాలలో కొన్నింటివల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదు. రాజకీయ నాయకులు తమ వ్యక్తిగత లేదా వర్గ ప్రయోజనాలను సాధించుకునేందుకు ఈ నియమాలకు విరుద్ధంగా చేసే ప్రయత్నాలనే రాజకీయ అవినీతిగా పరిగణించవచ్చును. అయితే రాజకీయ అవినీతి సక్రమంగా రూపొందించిన నియమాల ఉల్లంఘనకే పరిమితం కాదు. సక్రమం కాని నియమాలను రూపొందించటం కూడా రాజకీయ అవినీతే. నియమాలు రాజకీయాలకు అవసరం. అయితే రాజకీయాలు కేవలం సూత్రాల ఆధారంగా మాత్రమే పనిచేయవు లేదా పనిచేయలేవు. పూర్తిగా అభివృద్ధి చెందిన రాజకీయ వ్యవస్థ రూపొందించే అతి ప్రధాన నియమాలు సమగ్రంగా ఉండవు. అవి వాస్తవాన్ని లేదా మంచిని స్పష్టంగా ప్రతిబింబించవు. అవి రాజ్యం లక్ష్యాలను సమగ్రంగా వివరించవు. అంతేకాక అవి ఈ లక్ష్యాలను సాధించే సాధనాలను కూడా స్పష్టంగా వివరించవు. ఈ విధంగా తమకు కల పరిమితుల కారణంగా రాజకీయ వ్యవస్థలు కొన్ని సందర్భాలలో ప్రజలు అవినీతికరమైనవిగా భావించే నిర్ణయాలను రూపొందిస్తుంది. ఈ విధంగా రాజకీయ వ్యవస్థలు చేసే నిర్ణయాలు ప్రజలు కోరుకొనే ప్రమాణాలకు, నైతికతకు, సమగ్రతకు భిన్నంగా ఉంటాయి. అందుచేత రాజకీయాలు కొంతమేరకు అవినీతికరమైనవనే భావం ప్రజలలో నిరంతరం ఉంటుంది.

ఈ విధమైన కొన్ని నిర్దిష్టమైన లక్షణాలను కలిగిన రాజకీయ వ్యవస్థలు కొందరికి లాభం చేకూర్చే, మరికొందరికి నష్టం కలిగించే నిర్ణయాలు చేయటం సాధారణమైన విషయం. ఈ రెండు అంశాల కోణం నుంచి చూస్తే రాజకీయ అవినీతి వైవిధ్యం కాదు. రాజకీయ అవినీతి లేకపోవటమే వైవిధ్యం. ఈ వైవిధ్యం చిరకాలం కొనసాగుతుంది.

విభిన్న రచయితల అభిప్రాయం ప్రకారం ఈ క్రింది పరిస్థితులలో రాజకీయ అవినీతికి అవకాశం ఉండదు.

1) ప్రభుత్వంలోని కార్యనిర్వాహకశాఖపై బాధ్యతాయుతమైన శాసనసభ, న్యాయశాఖల నిరంతరమైన, సునిశ్చితమైన నిఘా ఉన్నప్పుడు
2) ఎన్నికల నిర్వహణకు అవసరమైన నిధులను అభ్యర్థులకు ప్రభుత్వమే సమకూర్చినపుడు
3) ఎన్నికలలో పోటీ చేసే అభ్యర్థుల ఎంపిక అత్యంత జాగ్రత్తగా జరిగినప్పుడు, ఈ అభ్యర్థులు తమ వ్యక్తిగత ఆస్తులను, ఆదాయాలను బహిరంగపరచినపుడు;
4) ప్రభుత్వం తన కార్యకలాపాలను, నిర్ణయాలను బహిరంగపరచినపుడు; ఈ విషయాలపై కోరిన సమాచారాన్ని ప్రజలకు సమకూర్చినపుడు
5) ప్రభుత్వం కుదుర్చుకొనే కాంట్రాక్టులు, పోటీ టెండర్ల ప్రాతిపదికమీద ఆధారపడినపుడు; వాటిని ఒక స్వయంప్రతిపత్తి గల సంస్థల చేత సమీక్షింపచేసినపుడు;
6) అవినీతికి పాల్పడిన రాజకీయ నాయకులు తక్షణం తమ పదవిని కోల్పోయే ఏర్పాటు ఉన్నప్పుడు

## 16.6 అభివృద్ధి చెందుతున్న దేశాలలో రాజకీయ అవినీతి విశ్లేషణ :

అభివృద్ధి చెందుతున్న దేశాలలో అవినీతిపై విశ్లేషణ ప్రధానంగా అవినీతిని ప్రేరేపించే సామాజిక సందర్భంపై కేంద్రీకృతమై ఉంది. అభివృద్ధి చెందుతున్న దేశాలలో అవినీతిని ప్రేరేపించే అనేక సామాజిక, ఆర్థిక సందర్భాలు రూపుదిద్దుకున్నాయి. ప్రభుత్వం పేదవర్గాల ప్రజలకు, ప్రధానంగా ఓటర్లకు కల్పించే ఆకర్షణీయమైన ఉద్యోగాలు, ఇతర సౌకర్యాలు అవినీతికి అవకాశం కల్పిస్తున్నాయని అభివృద్ధి చెందుతున్న దేశాలలో అవినీతిని విశ్లేషించిన జెమ్స్ సి. స్కాట్ వివరించాడు. స్కాట్ అవినీతిని ప్రేరేపించే ప్రోత్సాహకాలను (Inducements) సకారాత్మక ప్రోత్సాహకాలు, నకారాత్మక ప్రోత్సాహకాలనే రెండు తరగతులుగా విభజించాడు. సకారాత్మక ప్రేరణలు, ధనరూపంలో లేదా స్నేహం లేదా బంధుత్వం రూపంలో ఉండవచ్చును. దీనికి భిన్నంగా నకారాత్మక ప్రోత్సాహకాలు కల్పించిన సౌకర్యాన్ని లేదా ప్రయోజనాన్ని రద్దుచేస్తామని బెదిరించటం లేదా శిక్షిస్తామనే బెదిరింపు కావచ్చును.

స్కాట్ అభిప్రాయం ప్రకారం అభివృద్ధి చెందుతున్న దేశాలలో అవినీతి రాజకీయ వ్యవస్థ నిర్మాణపరమైన చట్టసంబంధమైన లక్షణాలపై ఆధారపడి ఉంటుంది. నిర్బంధ పూరకమైన పాలన నిబంధనలు, ప్రభత్వరంగం అభివృద్ధి, నిర్ణయాకరణ ప్రక్రియలో కీలకపాత్ర వహించే ఉద్యోగిబృందం మొదలైన కారణాలు ప్రభుత్వ విధానాన్ని చట్టబద్ధంగా ప్రభావితంచేసే అవకాశాన్ని తగ్గించటం వల్ల అవినీతికి అవకాశం ఏర్పడుతున్నది. ప్రభుత్వ విధానాలను ప్రభావితం చేసే ప్రధాన సాధనంగా అవినీతి రాజకీయ వ్యవస్థలో కీలక మార్పులను ప్రవేశపెట్టగలదు. అభివృద్ధి చెందుతున్న దేశాలలో చట్టబద్ధమైన పద్ధతులలో ప్రభావితం చేసే సామర్థ్యం, అవకాశం లేని గణాలు అవినీతి ద్వారా ప్రభుత్వ విధానాలను ప్రభావితం చేయగలుగుతున్నాయని స్కాట్ పేర్కొన్నాడు. స్కాట్ అభిప్రాయం ప్రకారం అభివృద్ధి చెందుతున్న దేశాలలో ఏ వర్గం అవినీతి నుంచి ఏ ప్రయోజనం పొందుతుందీ అనే అంశం, ఆ దేశ రాజకీయ వ్యవస్థ, నాయకత్వం స్వభావంపై ఆధారపడి ఉంటుంది. ఈ అంశాన్ని నిర్ధారించటంలో ప్రధానంగా మార్కెట్ అవినీతి, సాంప్రదాయ అవినీతి స్థాయిలు, రాజకీయ నాయకత్వం స్థిరత్వం, భద్రత, ఎన్నికల సంబంధమైన రాజకీయ పోటీ ఉండటం లేదా లేకపోవటం అనే చలాంశాలు కీలకపాత్ర వహిస్తాయి. స్కాట్ ప్రతిపాదించిన మరో ప్రధాన ఊహన ప్రకారం అవినీతి సైనికపాలన లేదా ఉద్యోగి బృంద నాయకుల పాలనలోగల రాజ్యాలలో, ఎన్నికలు కీలక లక్షణంగా కలిగిన ప్రజాస్వామ్య దేశాలలో కంటే దిగువ స్థాయిలో ఉంటుంది. దీనికి ఈ దేశాలలో రాజకీయ పదవులను సృష్టించి, పంపిణీ చేయవలసిన అవసరంలేకపోవటం ప్రధాన కారణం. అయితే ఎన్నికల నుంచి ఒత్తిడిలేని సైనికపాలన లేదా ఉద్యోగిబృంద పాలన కల దేశాలలో అవినీతి సైనికపాలకుల చుట్టూ ఏర్పడే గణాలలో కేంద్రీకృతమై ఉంటుంది.

## 16.7 భారతదేశంలో రాజకీయ అవినీతి :

భారతదేశంలో అవినీతి అన్ని రంగాలతో పాటు రాజకీయ రంగంలో కూడా జీవన విధానమైందనే అందరూ వ్యక్తపరుస్తున్న అభిప్రాయం. ఈ దేశంలో అవినీతి విస్తృతమైన చట్టబద్ధతను సంతరించుకొనటంతోపాటు, అందరూ సమర్థించే అంశంగా మారిందని రాజనీతి శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. రాజకీయ రంగాలలో పెరిగిన అవినీతి ఆర్థిక వ్యవస్థలో నల్లధనం, సమాజంలో ఒక ప్రధాన అంశంగా ధనపూరితమైన రాజకీయాల అవతరణకు దారితీసాయి. 1960 దశాబ్దం నుంచి అవినీతి రాజకీయ, పాలనా వ్యవస్థల ప్రధాన లక్షణంగా మారిందనే అభిప్రాయం ఏర్పడింది. క్రమంగా అవినీతి రాజకీయ వ్యవస్థ అన్నిస్థాయిలలోకి చొచ్చుకొని వెళ్లింది. దీని ఫలితంగా రాజకీయ రంగంలోని ఉన్నత పదవుల్లోని వ్యక్తులు కూడా అవినీతికి పాల్పడటం జరిగింది. దీంతోపాటు రాజకీయ నాయకులలో పెరిగిన అవినీతిని సమర్థించటం, వారి అవినీతి చర్యలను కప్పిపుచ్చటానికి ప్రయత్నించడం ప్రారంభమైందనే వాదన ప్రారంభమైంది.

ఈ విధంగా భారతదేశంలో రాజకీయరంగంలో అవినీతి ఆందోళనను కలిగించే స్థాయికి చేరుకుంది. రాజకీయ రంగంలో అవినీతి పట్ల ప్రజలు ప్రతిస్పందించటంలేదని రాజకీయ విశ్లేషకులు తమ అభిప్రాయాన్ని వ్యక్తపరిచారు. రాజకీయ రంగంలో అవినీతి అధికారం పక్షంలోనేకాక ప్రతి పక్షాలలో కూడా వ్యాప్తిచెందిందనే అభిప్రాయం వ్యక్తమైంది.

భారతదేశంలో రాజకీయ పార్టీలు ప్రైవేటు వ్యక్తులు, సంస్థల నుంచి రాజకీయ విరాళాలను సేకరించడం రాజకీయ అవినీతికి ఒక ప్రధానరూపంగా రూపొందింది. అరుణ్‌శౌరి ఈ రకమైన రాజకీయ అవినీతిని వివరిస్తూ వివిధ రాజకీయ నాయకులు భారీఎత్తున విరాళాలను సేకరించినట్లు పేర్కొన్నారు. ఈ రాజకీయ నాయకులలో కొందరికి ఉన్నత రాజకీయ పదవులు లభించాయని అరుణ్‌శౌరి పేర్కొన్నారు. ఇటీవల కాలంలో పార్టీ ప్రయోజనాల కొరకు విరాళాలను సేకరించే ప్రక్రియ మార్పుకు లోనైందని ఆర్.బి..జైన్ పేర్కొన్నారు. వివిధ రాజకీయవేత్తలు రాజకీయ విరాళాలను సేకరించటానికి బదులు ప్రభుత్వం వివిధ కార్యక్రమాలకు చేసే కొనుగోళ్ళలో కమీషన్లు, మూడుపులు (Kickkbacks) స్వీకరించే పద్దతిని అనుసరిస్తున్నారని జైన్ వివరించాడు.

భారతదేశంలో రాజకీయ అవినీతి చర్యలకు స్పష్టమైన ప్రమాణాలు, లక్ష్యాలు ఉన్నాయి. సామాజిక, ఆర్థిక, పాలనారంగాలలోని అవినీతికి భిన్నంగా రాజకీయ రంగంలో అవినీతికి ప్రత్యేకమైన ప్రక్రియలు, నిర్మాణాలు, వ్యక్తీకరణ విధానాలు ఉన్నాయి. ఇతర రంగాలలో అవినీతికి రాజకీయ అవినీతి మూలం కనుక రాజకీయ అవినీతి అధ్యయనానికి ఎంతో విలువ ఉంది. ఇతర అభివృద్ది చెందుతున్న దేశాలలాగే భారతదేశంలో రాజకీయ రంగంలో అవినీతిలో వృద్ధి చెందటానికి విస్తృతస్థాయిలో కల నిరక్షరాస్యత, పేదరికం ప్రధాన కారణాలు. రాజకీయ రంగంలో అవినీతి రాజకీయ వ్యవస్థ మూలాన్నే నిర్మూలించగలదు. ప్రజాస్వామ్య వ్యవస్థలుగా పరిమాణం చెందిన భూస్వామ్య నియంతృత్వ వ్యవస్థలు కల దేశాలలో రాజకీయ అవినీతి వేగంగా అభివృద్ధి చెందుతుంది.

భారతదేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థ మనుగడకు ఊపిరి వంటి ఎన్నికలు రాజకీయ అవినీతికి ప్రధాన ఆధారంగా రూపొందాయి. ఎన్నికల కొరకు నిధులను సేకరించవలసిన రాజకీయ పార్టీల అవసరమే రాజకీయ అవినీతిని సృష్టిస్తుంది. దేశంలో జరిగే వివిధ ఎన్నికలలో చెలరేగే హింస లేదా నేరాలను కాఠిన్యంగా అణచివేస్తూన్నప్పటికీ అవినీతిని నిర్మూలించే చర్యలేవీ చేపట్టబడటం లేదు. భారతదేశంలో అనుభవం వల్ల వెల్లడి అవుతున్నది ఏమిటంటే రాజకీయ నాయకుల ప్రమేయం ఉన్న అవినీతి చర్యలపై విచారణ సుదీర్ఘకాలం కొనసాగటం వల్ల రాజకీయ రంగంలో అవినీతి నిరాకంటంగా కొనసాగుతున్నది.

ఆర్.బి. జైన్ అభిప్రాయపడినట్లు భారతదేశంలో ఇటీవల కాలంలో సంభవించిన అవినీతి కార్యకలాపాలు రాజకీయ రంగంలో అధునాతన పద్దతుల ద్వారా అవినీతి కార్యకలాపాలు నిర్వర్తించబడుతున్నయనే వాస్తవాన్ని వెల్లడిస్తున్నాయి. దేశ రాజకీయ రంగంలో అవినీతిని అంతమొందించేందుకు నైతిక విలువలు, సమగ్రత ఉన్న వ్యక్తులు ఉండటం అవసరం. దేశంలో అవినీతిని రూపుమాపేందుకు సంస్థాగతమైన ఏర్పాట్లతోపాటు శక్తివంతమైన ప్రజాభిప్రాయం, పరిశుద్ధమైన సామాజిక వాతారవణం, స్వేచ్ఛా పూరితమైన, సమర్థవంతమైన ప్రచార సాధనాలు అవసరం. రాజకీయ అవినీతిని బహిర్గతం చేయటంలో, నిరోధించటంలో చట్టాలు, సంస్థలకన్నా ప్రజాభిప్రాయం, ప్రచార సాధనాలే కీలకపాత్ర వహించగలవు. ఇటీవల కాలంలో భారతదేశంలో రాజకీయ అవినీతిపై రాజ్యాంగ నిపుణుడు సుభాష్ సి. కాశ్యప్ ఈ విధంగా వ్యాఖ్యానించాడు. మన సమాజం అవినీతిమయం కావటమేకాక, సమాజానికి అవినీతి ఒక అవసరంగా మారటం తిరుగులేని వాస్తవం. ప్రజల దృష్టిలో అవినీతి ఒక చట్టబద్ధమైన జీవన విధానం. అభివృద్ధికి దోహదం చేసే కందెన వంటిది. అవినీతిలో లౌకికమైన, ఐకమత్యాన్ని, జాతీయ సమైక్యతను పెంపొందింపచేసే శక్తిగా అభివర్ణించబడింది. పేదరికం, కొరతలమయమైన ప్రస్తుత సంస్కృతిలో నిజాయితీ గల రాజకీయ నాయకునికి ఎటువంటి విలువ లేదు. ఆ రాజకీయ నాయకుడు తన మద్దతుదారులకు అవసరమైన సమయాలలో ఏవిధంగా సహాయపడలేడు.

## 16.8 భారతదేశంలో రాజకీయ అవినీతి ప్రబలటానికి కారణాలు :

భారతదేంలో రాజకీయ అవినీతి ప్రబలటానికి ఈ క్రింది కారకాలు దోహదం చేసాయని సామాజిక శాస్త్రవేత్తలు వివరించారు.

### 16.8.1 వ్యక్తిగత కారకం :

అవినీతి భారతదేశ సమాజ, రాజకీయ వ్యవస్థలోని అన్నిస్థాయిల్లో వ్యాప్తి చెందటానికి ప్రభుత్వ కార్యకలాపాలలో నైతికపరమైన ప్రమాణాలు లోపించడం ఒక ప్రధాన కారణం. ప్రస్తుతం ప్రజాజీవనంలో నైతిక విలువలు క్షీణించాయి. స్వాతంత్ర్యానికి పూర్వం రాజకీయ నాయకులు దేశం కోసం తమ జీవితాలకు త్యాగం చేసారు. ఈ త్యాగబుద్ధి ప్రస్తుత నాయకులలో గోచరించదు.

### 16.8.2 సంస్థాపరమైన కారకం :

ప్రస్తుత ధనం ఆధారంగా నిర్వహింపబడుతున్న ఎన్నికలు రాజకీయ వ్యవస్థలో అవినీతి వృద్ధి చెందటానికి ప్రధాన కారణమాయ్యయి. సమర్థవంతమైన వ్యవస్థీకరణ ఏర్పాట్లు, కార్యకర్తలు లేని రాజకీయపార్టీలు ఎన్నికలలో పాల్గొనేందుకు సామాజిక, ఆర్థిక వనరులపై ఆధారపడుతున్నాయి. ఈ వాస్తవాన్ని అనేక పరిశోధనలు ధృవపరుస్తున్నాయి. ప్రస్తుత కాలంలో రాజ్యం, విస్తరిస్తున్న పాత్ర, అధికారాలు రాజకీయ అవినీతిని ప్రోత్సహిస్తున్నాయి. భారతదేశం వంటి అభివృద్ధి చెందుతున్న దేశాల్లో రాజ్యం సామాజిక, ఆర్థికాభివృద్ధి కార్యకలాపాల పెరుగుదల రాజకీయ అవినీతికి దోహదం చేస్తుందని అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. రాజకీయ, పాలనా వ్యవస్థల్లో విస్తృత సంఖ్యలో కల నిబంధనలు, వాటిని అమలుపరచేందుకు ప్రభుత్వానికి విస్తృతస్థాయిలో కల విచక్షణాధికారాలు అవినీతికి ఆస్కారం కల్పిస్తున్నాయి. రాజకీయ, పాలనా వ్యవస్థలో అవినీతి వేగంగా వృద్ధిచెందటానికి సమర్థవంతమైన ప్రజల నియంత్రణ / నిఘాలేకపోవడం కూడా ఒక కీలక కారణమైంది.

### 16.8.3 రాజకీయ ఇచ్ఛలోపం :

భారతదేశంలో రాజకీయ నాయకులకు అవినీతిని అరికట్టడంపై ఆసక్తి, శ్రద్ధ ఉన్నప్పటికీ అవి వారి వాస్తవ ప్రవర్తనలో ప్రతిబింబించటంలేదు. అందుచేత దేశంలో అవినీతిని నివారించే సంస్థల ఏర్పాటు జరగటం లేదు. దీనికి లోక్‌పాల్ సంస్థ ఒక చక్కటి ఉదాహరణ. అనేక రాష్ట్రాలలో అవినీతిని నిరోధించేందుకు లోకాయుక్త అనే సంస్థలు ఉన్నప్పటికీ, అవి సమర్థవంతంగా పనిచేయటం లేదు. రాష్ట్ర రాజకీయ నాయకత్వం ఈ సంస్థలకు తగిన సహకారం అందించటం లేదు.

### 16.8.4 సంక్లిష్టమైన న్యాయవ్యవస్థ :

దేశంలో నెలకొన్న సంక్లిష్టమైన న్యాయవ్యవస్థ వల్ల అవినీతి స్వేచ్ఛగా అభివృద్ధిచెందుతున్నది. అవినీతిపరులైన రాజకీయ నాయకులు, ప్రభుత్వ ఉద్యోగులపై న్యాయస్థానాలలో కల కేసుల పరిష్కారంలో విపరీతమైన జాప్యం జరుగుతున్నది. అనేక సంవత్సరాలు గడిచినప్పటికీ అనేక అవినీతి కేసులు పరిష్కారానికి నోచుకోలేదని నివేదికలు తెలుపుతున్నాయి.

సుభాష్ కాశ్యప్ భారతదేశంలో రాజకీయ అవినీతి పెరగటానికి పలు కారణాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఆయన అభిప్రాయం ప్రకారం ప్రభుత్వం అమలుపరిచే పేదరిక నిర్మూలన పథకాలు, ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు చేపట్టే ఉపశమన కార్యక్రమాలకు అవినీతిని ప్రోత్సహించే శక్తి ఉంది. దేశంలో అధికసంఖ్యలో చట్టాలు, నిబంధనలు అమలులో ఉండటం, నియంత్రణ, లైసెన్సింగ్, పర్మిట్‌ల విధానాల వ్యవస్థ, రాజకీయ ఇచ్ఛ, సంస్థాగత యంత్రాంగం లోపించటం,

అవినీతి కేసులను పరిష్కరించటంలో న్యాయస్థానాలలో జరుగుతున్న జాప్యం అవినీతికి పాల్పడే వ్యక్తులపై తీసుకొనే చర్యలు లేదా విధించే శిక్షలలో స్పష్టత లోపించటం మొదలైనవి రాజకీయ అవినీతి పెరగటానికి దోహదం చేసిన కారణాలు అని కాశ్యప్ పేర్కొన్నారు. ఇటీవల కాలంలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన సరళీకృత ఆర్థిక విధానాలు లైసెన్స్, పర్మిట్ల విధానాన్ని పూర్తిగా తొలగించినప్పటికీ ప్రజాజీవితంలో, ప్రభుత్వ పాలనలో అవినీతి తగ్గుముఖం పట్టలేదు అని కాశ్యప్ వివరించాడు.

## 16.9 రాజకీయ అవినీతిని తొలగించేందుకు మార్గాలు :

భారతదేశంలో రాజకీయ రంగంలో అవినీతిని పూర్తిగా తొలగించేందుకు ఏర్పాటు చేసిన విచారణ సంఘాలు, పరిపాలన సంస్కరణల సంఘాలు, రాజ్యాంగ నిపుణులు, రాజనీతిశాస్త్రవేత్తలు, మేధావివర్గం అనేక సూచనలను చేశారు. వాటిలో ప్రధానమైనవి ఈ క్రిందివి.

1) అవినీతి ఆరోపణలను ఎదుర్కొంటున్న వ్యక్తులు ఆ ఆరోపణలు నిజంకావని నిజ నిర్ధారణ అయ్యేటంతవరకు ఎన్నికలలో పోటీ చేయకుండా ఏ పదవిని అలంకరించకుండా నిరోధించాలి. అవినీతి ఆరోపణలు వాస్తవమని తేలిన వ్యక్తులు పది సంవత్సరాలపాటు రాజకీయ రంగంలో ప్రవేశించకుండా నిషేధించాలి.
2) ఎన్నికలలో పోటీచేసే ప్రతివ్యక్తి తన వృత్తి, ఆదాయం, ఆస్తులు, అప్పులను వివరించే పత్రాలను దాఖలు చేయాలి.
3) ప్రభుత్వ అధికారులకు వర్తించే అవినీతి నిరోధక చట్టాలను కఠినంగా అమలుపరచాలి.
4) అక్రమంగా సంపాదించిన ఆస్తులు, సంపదను ఆ వ్యక్తుల నుంచి ప్రభుత్వం స్వాధీనపరచుకోవాలి.
5) అవినీతికి గురైన వ్యక్తులకు తగిన పరిహారాన్ని ఇచ్చేలా అవినీతికి పాల్పడిన అధికారులను వ్యక్తిగతంగా బాధ్యులను చేసేలా చట్టాలను చేసి అమలు పరచాలి.
6) నిర్ణయీకరణ అధికారాన్ని వికేంద్రీకరించాలి. ఈ ప్రక్రియలో పారదర్శనికతను ప్రవేశపెట్టాలి.
7) ప్రభుత్వం చేసే కొనుగోళ్ళను, కుదుర్చుకొనే కాంట్రాక్టులను, వివిధ కార్యకలాపాలకు మంజూరు చేసే లైసెన్సులను, ఏజన్సీలను రాజకీయాలకు దూరంగా ఉంచాలి.
8) న్యాయవ్యవస్థను మౌలికంగా సంస్కరించాలి.

పై చర్యలతో పాటు అవినీతి నిర్మూలనకు కొన్ని ఇతర చర్యలు సూచించబడ్డాయి. అవినీతిని ఎదిరించేలా ప్రజలను జాగృతం చేయాలి. అవినీతికి వ్యతిరేకంగా సామాజిక కట్టుబాట్లను ఏర్పరచాలి. ప్రజలు అవినీతిని ప్రతిఘటించేలా ప్రజా ఉద్యమాలను నిర్మించాలి. ప్రభుత్వ పాలన ప్రతి స్థాయిలో పౌర చార్టర్లను రూపొందించి వాటిని ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో ప్రదర్శించాలి. పత్రికా స్వేచ్ఛ, లోక్‌పాల్ బిల్లులను వెంటనే ఆమోదించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలి.

ఇటీవల కాలంలో నియమింపబడిన రాజ్యాంగ సమీక్ష సంఘం తన మధ్యంతర నివేదికలో అవినీతిని నిర్మూలించడంపై తన అభిప్రాయాన్ని ఈ విధంగా వివరించింది : ప్రతి ప్రజాసేవకుడు తనకు అప్పగించిన పదవిని ప్రజల మేలుకోసం తనపై ఉంచిన విశ్వాసంగా పరిగణించితే తప్ప సమాజం కోసం అమలుపరిచే ప్రభుత్వం విధానాలు ఎంత ప్రతిభా పూరితమైనప్పటికీ విజయవంతం కాలేవు. భారతదేశంలో ప్రజాజీవితంలో ఈ విధమైన నైతిక పరమైన నీతివంతమైన దృక్కోణాన్ని పెంపొందింపచేయటమే ప్రస్తుత ప్రభుత్వం అత్యంత కీలక సమస్య.

భారతదేశంలో స్వాతంత్ర్యానంతరం రాజకీయ, ప్రభుత్వ రంగాలలో అవినీతిని పూర్తిగా నిర్మూలించి ప్రజలకు పరిశుద్ధమైన, సమర్థవంతమైన పరిపాలనను అందించటం ప్రభుత్వం ప్రధానలక్ష్యాలలో ఒకటి. ఈ లక్ష్య సాధనకు చట్టపరంగా, పాలనా

పరంగా అనేక చర్యలు చేపట్టారు. స్వాతంత్ర్యం సిద్ధించిన వెంటనే 1947లో కేంద్ర ప్రభుత్వం అవినీతి నిరోధకచట్టాన్ని ప్రవేశపెట్టింది. కేవలం ప్రభుత్వ ఉద్యోగులకు మాత్రమే వర్తించిన ఈ చట్టాన్ని 1988లో సవరించటం ద్వారా మంత్రులు, పార్లమెంటు సభ్యులు మొదలైన ప్రజాప్రతినిధులను కూడా ఈ చట్టం పరిధిలోనికి చేర్చారు. ఈ చట్టంతోపాటు కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ ఉద్యోగులలో అవినీతిని అరికట్టేందుకు పలు సందర్భాలలో ప్రవర్తనా నియమావళిని రూపొందించి అమలుపరిచింది. ఇదే విధంగా వివిధ రాష్ట్రప్రభుత్వాలు తమ రాష్ట్రాలలో రాజకీయ, పాలన రంగాలలో అవినీతి నిరోధానికి చట్టాలను, ప్రవర్తనా నియమావళులను ప్రవేశపెట్టాయి. ఈ విధమైన చట్టపరమైన చర్యలతోపాటు అవినీతి నిర్మూలనకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పాలనపరమైన చర్యలను చేపట్టాయి. ఈ చర్యలలో అవినీతి నిరోధక సంస్థల ఏర్పాటు ప్రధానమైంది. వివిధ రంగాలలో అవినీతి చర్యలకు పాల్పడిన ప్రభుత్వ ఉద్యోగులను, ప్రజారంగంలోని వ్యక్తులను విచారించి, శిక్షించటం ద్వారా అవినీతి వ్యాప్తిని నిరోధించేందుకు కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు కొన్ని నేరనిరోధక సంస్థలను నెలకొల్పాయి. వీటిలో కేంద్ర, రాష్ట్ర స్థాయిల్లో ఏర్పాటు చేసిన విజిలెన్స్ కమీషన్లు, అవినీతి నిరోధక బ్యూరో (Anti Corruption Bureau) లు ప్రధానమైనవి.

దేశస్వాతంత్ర్యానంతరం ప్రభుత్వ యంత్రాంగంలో గల లోపాలను తొలగించి, పాలనా సామర్థ్యాన్ని మెరుగుపరచేందుకు తగిన సూచనలను చేసేందుకు వివిధకాలాల్లో ఏర్పాటు చేసిన పరిపాలనా సంస్కరణల సంఘాలు రాజకీయ పాలనా రంగాలలో నెలకొన్న అవినీతిని ఒక ప్రధాన సమస్యగా గుర్తించి, అవినీతి నిర్మూలనకు పెక్కు సూచనలు చేసాయి. 1966లో నియమింపబడిన పరిపాలనా సంస్కరణల సంఘం (ARC) దేశ రాజకీయ, పాలనారంగాలలో అవినీతిని రూపుమాపేందుకు స్కాండినేవియా దేశాలలో ప్రాచుర్యం పొందిన అంబుడ్స్‌మన్ వ్యవస్థ తరహాలో భారతదేశంలో కూడా కేంద్ర, రాష్ట్ర స్థాయిలలో అవినీతి నిర్మూలనకు, ప్రజల క్లేశనివారణకు ఒక ప్రత్యేక యంత్రాంగాన్ని ఏర్పరచాలని ఉద్ఘాటించింది. ఈ పరిపాలనా సంఘం కేంద్రస్థాయిలో లోక్‌పాల్‌ను, రాష్ట్రస్థాయిలో లోకాయుక్త అనే రెండు భిన్న అవినీతి నిర్మూలన వ్యవస్థలను నెలకొల్పాలని సూచించింది. పరిపాలనా సంస్కరణ సంఘం చేసిన ఈ సూచనను కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు ఆమోదించి, ఈ దిశలో చర్యలను చేపట్టాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు లోక్‌పాల్, లోకాయుక్త వ్యవస్థలను ఏర్పాటు చేయటంలో చేపట్టిన చర్యలను, వాటి ఫలితాలను ఈ క్రింది విధంగా వివరించవచ్చును.

## 16.9.1 లోక్‌పాల్ :

1977లో కేంద్రంలో అధికారంలోకి వచ్చిన జనతాపార్టీ ప్రభుత్వం దేశంలో ఉన్నతస్థాయిలో అవినీతి నిర్మూలనకు లోక్‌పాల్ అనే సంస్థను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించింది. అయితే లోక్‌పాల్ సంస్థను ఏర్పాటు చేయాలనే 1967లో పరిపాలనా సంఘం సూచనలకు అనుగుణంగా, 1971లో అప్పటి కేంద్రప్రభుత్వం లోక్‌సభలో లోక్‌పాల్ బిల్లును ప్రవేశపెట్టింది. అయితే 1971లో లోక్‌సభ రద్దుకావటంతో ఈ బిల్లుకు కాలదోషం పట్టింది. ఈ బిల్లులో లోక్‌పాల్ పరిధిలోకి ప్రధానమంత్రిని చేర్చటం జరగలేదు. 1977 జులైలో జనతాప్రభుత్వం లోక్‌సభలో మరోసారి లోక్‌పాల్ బిల్లును ప్రవేశపెట్టింది. ఈ బిల్లులో రెండు విశిష్టమైన అంశాలు ఉన్నాయి. అవి :

1) ఈ బిల్లు ప్రధానమంత్రిపై వచ్చిన అవినీతి ఆరోపణలను కూడా వివరించే అధికారాన్ని కల్పించటం ద్వారా ప్రధానమంత్రిని కూడా లోక్‌పాల్ పరిధిలోకి తెచ్చింది.

2) తనకు అందిన అభియోగాల విచారణను కొనసాగించేందుకు అవసరమైన పరిపాలనా యంత్రాంగాన్ని నియమించుకొనే అధికారాన్ని ఈ బిల్లు లోక్‌పాల్‌కు కల్పించింది. దీని ఫలితంగా తన కార్యకలాపాల నిర్వహణకు లోక్‌పాల్ ప్రభుత్వ యంత్రాంగంపై ఆధారపడవలసిన అవసరం లేదు. ఈ బిల్లు ప్రకారం లోక్‌పాల్ పరిధిలో ప్రధానమంత్రి, ఇతర కేంద్ర

మంత్రులు, పార్లమెంట్ సభ్యులు, రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఇతర మంత్రులు, రాష్ట్రాల శాసనసభ్యులు తీసుకురాబడ్డారు. ఈ ఉన్నత రాజకీయాధికారులపై వచ్చిన అవినీతి ఆరోపణలను లోక్‌పాల్ విచారించవచ్చును. లోక్‌పాల్‌ను రాష్ట్రపతి నియమిస్తాడని లోక్‌పాల్ బిల్లు ప్రతిపాదించింది. లోక్‌పాల్‌ను నియమించేందుకు రాష్ట్రపతి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిని, లోక్‌సభ స్పీకర్, రాజ్యసభ అధ్యక్షుణ్ణి సంప్రదించాలని కూడా ఈ బిల్లు ప్రతిపాదించింది. లోక్‌పాల్ తన విధులను నిష్పాక్షికంగా, స్వతంత్రంగా, నిజాయితీతో తన విధులను నిర్వర్తించేందుకు అనేక రక్షణలను లోక్‌పాల్ బిల్లు కల్పించింది. ఈ బిల్లు ప్రకారం ఏ ప్రభుత్వ ఉద్యోగి, ఏ వ్యక్తి అయినా లోక్‌పాల్‌కు ఫిర్యాదు అందచేయవచ్చును. అయితే ఈ బిల్లును ఆమోదించక ముందే లోక్‌సభ రద్దయింది.

1985లో రాజీవ్‌గాంధీ ప్రభుత్వం మరోసారి లోక్‌పాల్ బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టినప్పటికీ అప్పుడు కూడా ఈ బిల్లు పార్లమెంటు ఆమోదాన్ని పొందలేదు. 1989లో, 1995లో మరో రెండుసార్లు లోక్‌సభలో ప్రవేశపెట్టిన లోక్‌పాల్ బిల్లు బిల్లుస్థాయిలోనే ఉండిపోయింది. ఈ విధంగా 1971లో మొట్టమొదటిసారిగా లోక్‌సభలో ప్రవేశపెట్టిన లోక్‌పాల్‌బిల్లు నేటివరకు చట్టంగా రూపొందలేదు. లోక్‌పాల్‌ను ఏర్పాటు చేయటం ద్వారా ఉన్నత స్థాయీ రాజకీయ పదవులలో ఉన్న వ్యక్తులు అవినీతికి పాల్పడకుండా నిరో ధించాలనే ఆశయం ప్రభుత్వానికి ఉన్నప్పటికీ, తన ఆశయాన్ని సాకారం చేయాలనే చిత్తశుద్ధి ప్రభుత్వానికి లేకపోవటంవల్లే లోక్‌పాల్ బిల్లు నేటివరకు వెలుగుచూడకపోవటం, దీని ఫలితంగా లోక్‌పాల్ వ్యవస్థ అవతరించక పోవటం జరిగిందని రాజనీతి శాస్త్రవేత్తల, నిపుణుల అభిప్రాయం.

### 16.9.2 లోకాయుక్త :

కేంద్ర ప్రభుత్వ స్థాయిలో ఉన్నతస్థాయిలో అవినీతిని అరికట్టేందుకు లోక్‌పాల్ వ్యవస్థను ఏర్పాటు చేయటంలో విపరీతమైన జాప్యం జరుగుతున్నప్పటికీ, అనేక రాష్ట్రాలలో రాజకీయ, పాలనా రంగాలలో అవినీతి నిరోధానికి పరిపాలనా సంస్కరణల సంఘం సూచనల మేరకు ఆంబుడ్స్‌మన్ తరహాలో లోకాయుక్త వ్యవస్థ ఏర్పాటుచేయబడింది. ప్రస్తుతం దేశంలో 15 రాష్ట్రాలలో లోకాయుక్త వ్యవస్థ ఉంది. లోకాయుక్త నియామకం, విధులలో వివిధ రాష్ట్రాల మధ్య సారూప్యత ఉన్నప్పటికీ, పరిధిలో కొంత భిన్నత్వం ఉంది. కొన్ని రాష్ట్రాలు లోకాయుక్త పరిధిలో ముఖ్యమంత్రిని చేర్చినప్పటికీ, అనేక రాష్ట్రాలలో ముఖ్యమంత్రిని లోకాయుక్త పరిధిలో చేర్చటం జరగలేదు. మొత్తం మీద అన్ని రాష్ట్రాలలో రాష్ట్రమంత్రులు, శాసన సభ్యులు, స్థానిక సంస్థలలో కల ఎన్నికైన ప్రజాప్రతినిధులతోపాటు, అన్నిస్థాయిల ప్రభుత్వ ఉద్యోగులను లోకాయుక్త పరిధిలోనికి తెచ్చారు.

రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, శాసనసభలోని ప్రధాన ప్రతిపక్ష నాయకుడు సలహాను అనుసరించి గవర్నరు లోకాయుక్తను నియమించటం సాధారణంగా అన్ని రాష్ట్రాలు అనుసరిస్తున్న పద్ధతి. లోకాయుక్త పదవీకాలం 5 సం॥లు. లోక్‌యుక్త స్వేచ్ఛను, స్వయం ప్రతిపత్తిని రక్షించేందుకు అనేక రక్షణలు ఉన్నాయి. తన పరిధిలో చేర్చబడిన ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ ఉద్యోగులపై వచ్చిన అవినీతి ఆరోపణలను విచారించటంతోపాటు, ప్రజల క్లేశాలను నివారించటం లోకాయుక్త నిర్వర్తించే విధులు.

వివిధ రాష్ట్రాలలో లోకాయుక్త పనితీరును గురించిన నివేదికలను పరిశీలిస్తే, దాదాపు అన్ని రాష్ట్రాలలో లోకాయుక్త నిర్వర్తన ఒకే తీరుగా ఉందని తెలుస్తున్నది. ఈ రాష్ట్రాలలో లోకాయుక్త తన విధుల నిర్వహణలో చురుకుగా పనిచేస్తూ, రాజకీయ, పాలనా రంగాలలో అవినీతిని అరికట్టడంలో ప్రజల క్లేశాలను తీర్చటంలో ప్రగతిని సాధించినప్పటికీ, అవినీతిపై ఈ వ్యవస్థ ప్రభావం చెప్పుకోదగినంత స్థాయిలో లేదని చెప్పటం సమంజసమే. ఈ వ్యవస్థ క్రింది స్థాయీ ప్రభుత్వ ఉద్యోగుల అవినీతి ఆరోపణలను విచారించటంలో సమర్థవంతంగా వ్యవహరించగల్గుతున్నప్పటికీ రాజకీయ నాయకులు, ప్రజా ప్రతినిధులు, ఉన్నత స్థాయీ ప్రభుత్వ అధికారులపై అవినీతి ఆరోపణల విచారణలో అదే స్థాయీ సమర్థతను కనపరచలేకపోతున్నది. లోకాయుక్త తన విచారణ ఆధారంగా అవినీతికి పాల్పడినట్లు నిర్ధారించి, సంబంధిత వ్యక్తులపై తీసుకోవలసిన చర్యలను

సూచించినప్పటికీ, రాష్ట్రప్రభుత్వాలు తగు విధంగా స్పందించటం లేదనే విమర్శ ఉంది. అంతేకాక లోకాయుక్త వివిధ అవినీతి ఆరోపణల విచారణలో రాష్ట్ర ప్రభుత్వాలు సహకరించటం లేదనే మరో విమర్శ ఉంది. ఈ విమర్శలతోపాటు అనేక రాష్ట్రాలలో తన విధుల నిర్వహణ లోకాయుక్తకు తోడ్పడేందుకు అవసరమైన సంఖ్యలో సిబ్బందిని, పాలనా యంత్రాంగాన్ని ఏర్పాటు చేయలేదు. ఈ విధంగా వివిధ రాష్ట్రాలలో లోకాయుక్త వ్యవస్థలు అనేక పరిమితులకు లోబడి పనిచేస్తున్నాయనీ, అందుచేత అవినీతిపై ఈ వ్యవస్థ ప్రభావం పరిమితంగా మాత్రమే ప్రసరించిందని వివిధ పరిశోధనలు వెల్లడిస్తున్నాయి.

## 16.10 సారాంశము :

ప్రస్తుతం భారతదేశ రాజకీయ వ్యవస్థ ఎదుర్కొంటున్న అనేక సమస్యలలో రాజకీయ అవినీతి ప్రధానమైనది. అనేక కారణాల వల్ల ఈ దేశంలో రాజకీయ పాలనా రంగాలలో అవినీతి సర్వసాధారణమైన అంశంగా మారింది. ఈ పాఠంలో రాజకీయ వ్యవస్థలో చోటుచేసుకున్న అవినీతిని అనేక కోణాల నుంచి పరిశీలించటం జరిగింది. ప్రధానంగా భారతదేశంలో రాజకీయ వ్యవస్థలో అవినీతి అభివృద్ధి చెందటానికి దోహదం చేసిన కారణాలు, అవినీతి వల్ల రాజకీయ వ్యవస్థ ఎదుర్కొంటున్న సమస్యలు, రాజకీయ అవినీతికి నిర్మూలించేందుకు ప్రభుత్వ పరంగా చేపట్టిన చర్యలు ఈ పాఠంలో విశ్లేషించబడ్డాయి. ప్రస్తుతం దేశంలో రాజకీయ పాలనా రంగాలలో అవినీతిపై విస్తృతమైన స్థాయిలో చర్చ జరుగుతున్నది. ఈ చర్చ ఫలితంగా దేశ రాజకీయ నాయకులలో, ప్రజలలో రాజకీయ అవినీతిపై కల దృక్పధాలలో మార్పు స్పష్టంగా గోచరిస్తున్నది. రాజకీయ పాలనా రంగాలలో అవినీతికి వ్యతిరేకంగా ప్రజలలో చైతన్యం క్రమంగా పెరుగుతున్నది. అవినీతి పట్ల ప్రజలలో పెరుగుతున్న వ్యతిరేకత ఉద్యమాల రూపాన్ని దాలుస్తున్నది. ఇటీవల కాలంలో దేశంలో వివిధ రంగాలలో అవినీతిని బహిర్గతం చేయటంలో ప్రసార మాధ్యమాలు చురుకైన పాత్రను నిర్వహిస్తున్నాయి. ఈ పరిణామాల ఫలితంగా దేశంలో అవినీతి సమస్యకు సమీప భవిష్యత్తులోనే శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఆశించవచ్చు.

## 16.11 మాదిరి ప్రశ్నలు :

1. రాజకీయ అవినీతి అర్థాన్ని వివరించండి, రాజకీయ అవినీతిపై కల వివిధ దృక్పధాలను పరిశీలించండి.
2. అభివృద్ధి చెందుతున్న దేశాలలో రాజకీయ అవినీతి పరిస్థితిని విశ్లేషించండి.
3. భారతదేశంలో రాజకీయ అవినీతికి కల కారణాలను వివరించండి.
4. భారతదేశంలో రాజకీయ అవినీతి నిర్మూలనకు చేపట్టిన వివిధ చర్యలను, వాటి ఫలితాలను వివరించండి.

## 16.12 చదువదగిన గ్రంథాలు :


1. Paul R. Brass, The Politics of India, since Independence, Cambridge : Cambridge Univer sity Press, 1990 (2nd Edition).
2. Bipin Chandra and others, India After Independence - 1947 - 2000, New Delhi, Penguin Books, 2000.
3. Atul Kohli (ed.), The Success of India's Democracy, Cambridge : Cambridge University Press, 2001.
4. Rajani Kothari, Politics in India, Bostan : Little Brown and Company, 1970.
5. Rajani Kothari, Caste in Indian Politics, New Delhi : Orient Logman, 1970.
6. Sudipta Kavi Raj (ed.) New Delhi : Oxford University Press, 1997.
7. A.P. Avasthi, Indian Political System, Agra : Lakshminarain Agarwal, 2002.


**రచయిత : ప్రొఫెసర్. ఎమ్. బాపూజీ**